# శ్రీ విష్ణు సహస్రనామము

( నవమ భాగము 803-900 నామ వివరణ )



మాస్టర్ కె. పార్వతీకుమార్

# శ్రీ విష్ణు సహస్రనామము

( నవమ భాగము  803-900 నామ వివరణ )



మాస్టర్ కె. పార్వతీకుమార్

ధనిష్ఠ

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

# ముందుగా ఒక మాట

శ్రీ గురుదేవులు, మాస్టర్ కంభంపాటి పార్వతీ కుమారు గారు, శ్రీ విష్ణుసహస్రనామ వివరణ అనే జ్ఞానయజ్ఞాన్ని ప్రవచన రూపములో, 1993 లో విశాఖపట్టణములో, రాధామాధవ ప్రాంగణమున ప్రారంభించి, కొన్ని సంవత్సరములు కొనసాగించిరి. వారు శ్రీ విష్ణుసహస్రనామము లో గల అన్ని నామములకు వివరణ ఇచ్చినప్పటికి, కొన్ని నామముల వివరణ అందుబాటులో లేవు. అందుబాటులో ఉన్న నామములను ముద్రణ రూపము లో అందజేయవలెనన్న సదుద్దేశము శ్రీ గురుదేవులకు విన్నవించుట జరిగినది. వారు ముందుగా మన మాసపత్రిక 'నా వాణి' లో నామముల వివరణ ప్రచురించమనగా, శుభకృత్ ఉగాది సంచికతో ధారావాహికగా అవి ముద్రణ రూపము దాల్చుట మొదలైనది. వారి అనుమతి, ఆశీర్వచనములతో శ్రీ విష్ణుసహస్రనామముల వివరణ e-Books రూపముగా పాఠకుల ప్రయోజనము కొరకు తీసుకుని రావడము జరుగుచున్నది.

ఈ పుస్తకములలో శ్రీ గురుదేవుల ప్రవచనములు వినబడినంత, అతికొద్ది సవరణలతో అందజేయడమైనదని గమనించగలరు. ప్రతి శ్లోకములో నామముల విభజనకు మాస్టర్ E.K. గారు ఆంగ్లములో వ్రాసిన విష్ణుసహస్రనామములో నామ విభజనను ప్రాతిపదికగా తీసుకొనుట జరిగినది.

ఈ ప్రయత్నములో పాల్గొనుచున్నవారందరికీ ఈ వివరణలు అత్యంత మరపురాని, ఆనందకరమైన అనుభూతులు కలిగించుచున్నవి. ఈ యజ్ఞములో పాలుపంచుకుంటున్న వారందరికి మాస్టరుగారి ఆశీస్సులు అందాలని మాస్టరు గారికి మా ప్రార్థన. ఈ పుస్తకము చదివిన వారందరికి గురుదేవులు అందించిన అమూల్యమైన విషయములు అత్యంత సులభముగా హృదయస్థమై, స్ఫూర్తినిచ్చి, సాధనకు మరింత ఉన్ముఖులను జేయగలవని మా నమ్మకము.

శ్రీ పరాభవ నామసంవత్సర గురుపూర్ణిమ సందర్భముగా శ్రీ విష్ణు సహస్రనామ వివరణ నవమ భాగము - 803 నుండి 900 నామములకు- శ్రీ గురుదేవులు ఇచ్చిన వివరణయే, మనందరి అక్షరాంజలిగా వారి పాదపద్మములకు సమర్పితము.

ధనిష్ఠ

# ఉపోద్ఘాతము

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు విష్ణుమూర్తి యొక్క అవతరణము మన దృష్టి యందు నిలబడాలి. నారాయణ మంత్రం చేసుకునేటప్పుడు ఆదిశేషుడు, దాని పడగ క్రింద వున్న నారాయణమూర్తి, నారాయణమూర్తి యొక్క వర్ణనము, ఆయన యొక్క రూపము, రంగు, శబ్దముల మీద దృష్టి ఉంచాలి. చూపుడు వేలంత రూపాన్ని మనసుకు తెచ్చుకోవాలి. అలా తెచ్చుకుంటే నీలమేఘశ్యామలమైన ఆయన శరీరము కనిపిస్తుంది. ఆయన ధరించిన ఆభరణములన్నీ బంగారు రంగులో వున్నట్లుగా కనిపిస్తాయి. క్రమముగా ఆయన ముఖము, బాహువులు, వక్షస్సు, పాదములు మనకి కనిపిస్తాయి. ఉత్తరీయంతో కప్పి ఉన్న భాగాలన్నీ మిసమిసలాడే మేలిమి బంగారంతో వున్న ఆభరణాలుగాను, వస్త్రములుగానూ దర్శించాలి. కప్పివుండని భాగము తేజోవంతమైన నీలమైన రంగుతో భావన చేసుకోవాలి. నారాయణమంత్రం చేసుకొనేటప్పుడు, మస్తకం నుండి పాదం వరకు, భగవంతుని దర్శనం చేయాలి. ఆ తరువాత విష్ణుసహస్రనామం చదువుకునేటప్పుడు విష్ణువు యొక్క రూపం మన హృదయం నందు నిలబడడానికి అవకాశం వుంటుంది. ఆ అవకాశం ఏర్పడిన తర్వాత, విష్ణువు తన విశాలమైన నేత్రాల నుండి మనను చూస్తున్నట్లుగా భావన చేస్తూ, ఎంత సేపు వుండగలిగితే అంతసేపు ఉండాలి. ఎక్కువ సేపు ఉండలేము. మహా అయితే 2-3 నామాల వరకు వుండవచ్చును. ఆ తరవాత ఉండలేము. మళ్ళీ తెచ్చుకొంటూ వుండాలి. ఇది ఒక సాధన! అప్పుడు లోపల నుండి వికాసం రావడానికి అవకాశం వుంటుంది. ఎందుకంటే మనలో వున్న నిజస్వరూపం అంటే మన అసలు స్వరూపం విష్ణు స్వరూపమే కనుక! మనల్ని అంగుష్ట మాత్రంగా (చూపుడు వేలంత) విష్ణుమూర్తి రూపాన్ని హృదయమునందు ధ్యానము చేయమని భాగవతం షష్టమస్కంధంలో చెప్తారు. మనకి హృదయమునందు సింహాము అనే భాగము వున్నది. ఉదరవితానాన్ని సింహాసనమని కూడా చెప్తారు. ఆ సింహాసనం మీద విష్ణుమూర్తి ఉన్నట్లు ధ్యానం చేసుకుంటున్న కొద్దీ, పెరుగుతున్నట్లుగా భావన చేయాలి. ఆయన నుండి వచ్చే నీలము, హిరణ్మయము అయిన కాంతులు మన హృదయాన్ని అంతా నింపుతున్నట్లుగా ధ్యానం చేసుకోవాలి. మన దేహమంతా పూర్తిగా నిండిన తరువాత, అవే కిరణములు బహిః ప్రపంచంలో వ్యాపనం చెందుతున్నట్లుగా

ధ్యానం చేసుకోవాలి. ఇలా చేసుకోవాలంటే ముందు నారాయణ మంత్రం వుంటుంది.

నారాయణ మంత్రంలో మన శిరస్సు, నేత్రములు, శ్రవణేంద్రియములు, ఘ్రాణేంద్రియములు, గొంతు, భుజస్కంధములు, బాహువులు. హృదయము, ఊపిరితిత్తులు, రక్తనాళములు, గుండె, అలా దిగి వెడుతూ మొత్తం దేహమంతా నారాయణ మంత్రంతో ప్రతిష్ఠాపన చేసికోవాలి. దేహమంతా నారాయణ భావనలో నింపాలి. అలా నింపిన తరువాత విష్ణుసహస్రనామం చేసుకునేటప్పుడు, నారాయణతత్త్వంతో నిండిన ఈ దేహంలో కేంద్రము నందు ఆదిశేషువు వెనకాల పడగ పట్టి ఉన్నచూపుడు వేలంత భగవంతుని ప్రతిమను, చతుర్భుజుడై ఒక చేతిలో శంఖము, ఒక చేతిలో చక్రము, ఇంకొక చేతిలో కమలము, మరియొక చేతిలో గద ధరించి నిలబడిన భగవంతుని, వక్షస్థలము నందు కౌస్తుభమును ధరించిన వాడిని, చిరునవ్వు గలిగిన వాడిని ఆవాహన చేసుకోవాలి. ఈ విధంగా చదువుకున్నట్లయితే జరగవలసిన మార్పులు మనలో సవ్యంగా జరుగుతాయి. ఈ భావనలో విష్ణుసహస్రనామం చేసుకోవాలి. లేకపోతే tape వేస్తే వెళ్ళిపోయినట్లు 1008 నామాలు అయిపోతాయి. ఈలోగా మనసు ఎక్కడో తిరిగి వస్తుంది. తిరిగి రావడం మనకి అభ్యాసమైన విషయం కాబట్టి, విష్ణుసహస్రనామం చేసేటప్పుడు మళ్ళీ మనసును అక్కడికి తెచ్చుకోవడమనేది అభ్యాసంగా మొదలు పెట్టి మనం ఆ రూపాన్ని మళ్ళీ దర్శనం చేయడం మొదలు పెడితే, అప్పుడు మనలో భక్తి ఉద్భవించడానికి అవకాశం ఏర్పడుతుంది. అప్రమత్తత వస్తుంది. శ్రద్ధ కలుగుతుంది. విన్న విషయాలు మర్చిపోవడం వుండదు. చెప్పిన విషయాలు గ్రహించడంలో లోటు ఉండదు. సహస్రనామం అనే సంప్రదాయము మనకి ఋషులు ఏర్పరిచారు. ఈ సహస్రనామములలో ముఖ్యమైన విషయము, ఏ నామము అయినా భగవంతుడిదే అని తెలుసుకోవడము. నామము ఏదైనా భగవంతుడిదే!. 'సహస్ర' అనే సంఖ్య ఒకటి తరువాత మూడు సున్నాలుగా, 1000, మనకి కనిపిస్తుంది. భూః, భువః, సువః లోకాలుగా ఉన్న సృష్టి మూడు సున్నాలైతే, ఆ మూడింటిని వ్యాపించినది ఒకే ఒక తత్త్వం - 'ఒకటి'. ఒకటి లేకపోతే ఆ మూడు సున్నాలకి విలువ లేదు. ఒకటి ఉంటే ఆ సున్నాలకి విలువ ఉన్నది. అందుచేత ఎవరి వలన పదార్థమయము, శక్తిమయము, ప్రజ్ఞామయము అయిన లోకములు ఏర్పడ్డాయో, (Matter, Force, Consciousness అంటారు ఆంగ్లంలో) ఆ తత్త్వం ఆ మూడు లోకాలు వ్యాపించి ఉన్నది. మూడు లోకములలో వ్యాపించిన రకరకములైన రూపములకు నామములున్నాయి. ముందు రూపం ఏర్పరచి, తరువాత నామాన్ని అందించారు. రూపం లేకుండా నామం లేదు. ఒక నామం

ఉందంటే ఆ రూపం ఉందిట అని అర్థం. అందుచేత మూడు లోకములలో ఉన్న నామాలన్నీ భగవంతుని కీర్తించడమే! భగవంతుని సంబోధించడమే! ఎందుకంటే రూపాలన్నీ భగవంతుడివే! భగవంతుడు కాని రూపం ఏదీ లేదు. అదీ భారతీయ జ్ఞానమునకు సంబంధించిన సమన్వయము. ఋషులు సమగ్రమైన అవగాహన పొంది, భగవంతుడు కానిది ఏమీ లేదు అని మనకు తెలియజేసారు. దేనిని చూసినా భగవంతుడుగానే చూడడం. మూడు లోకాలలో ఉండే సమస్త రూపములు, వానికి ఏర్పరిచిన నామములుగా కనబడుతున్నదీ దైవమే! సృష్టి అంతా కూడా నామరూపాత్మకము అంటారు. అంటే రూపు ఏర్పడి, వాటిని గుర్తించడం కోసం ఒక నామం. పురుషసూక్తంలో ఏ విధంగా సృష్టి ఏర్పడింది, ఆ ఏర్పడిన సృష్టిలోని ప్రతి విషయానికి తరువాత ఎలా నామకరణం చేసారు, అనే విషయం తెలియపరుస్తారు. ఆరాధకులకు తెలియవలసిన ఒక ముఖ్య విషయము 'సమస్తమూ దైవమే! సమస్త రూపములు దైవమే! ఆ రూపమునకు ఉన్న నామం కూడా దైవమే!'. ఇది దీక్ష. ఈ దీక్ష పట్టి సహస్రనామాలు పారాయణ చేసుకోవాలి. ఏది చూసినా అందులో ఆ మొత్తం ఉంది అని తెలియాలి. నువ్వు కోరుకొని చూసిన దాంట్లోనే కాదు. కొన్ని రూపాల్లో దైవాన్ని చూస్తాం, కొన్ని రూపాల్లో దైవాన్ని చూడం. కొన్ని నామాల్లోనే దైవాన్ని చూస్తాం, కొన్ని నామాల్లో దైవాన్ని చూడం అనేది భారతీయ సమగ్ర జ్ఞానం కాదు. అటువంటి జ్ఞానాన్ని అందించిన ఏకైక భూమి భారత భూమి. అది మనం గుర్తించాలి.

జీవునకు రుచి ఉన్నది, జీవుని రుచి వెలుగు. కిరణం! అందుచేత భగవత్ ఆరాధన చేస్తున్నప్పుడు మనలో స్ఫూర్తి పెరిగి దైవం మీద రుచులు పెరుగుతూ ఉంటాయి. ఆ రుచులు పెరిగిన కొద్దీ వైవిధ్యంగా, వైభవోపేతంగా దైవాన్ని వర్ణన చేసాం, కీర్తనలు చేసాం, స్తోత్రం చేసాం. దైవము యందు ఆసక్తి వలన దైవం మీద రుచులు పెరిగి రకరకములుగా ఎన్నెన్నో ఆరాధనలు చేసాము. అవన్నీ మన పురాణాల్లో ఉన్నాయి. ఈ విధంగా ఇచ్చిన సహస్రాలు మనం రోజూ పారాయణము చేయాలనుకుంటే మనకు ఒక దీక్ష ఉన్నది. ఏంటంటే, కనపడుతున్నదంతా దైవముగా భావన చేయడము. అలా భావన చేస్తే సహస్రనామం సఫలీకృతం అవుతుంది. సిద్ధిని ఇస్తుంది. దైవానుభూతిని ఇస్తుంది. అలా కాక మన వంటింట్లో గూడులో పెట్టుకున్న చిన్న ప్రతిమ దేవుడనుకొని, అది కాక మిగతాదంతా వేరు అనుకునే వాళ్ళకి సహస్రనామం ఫలించదు. ఇది ముఖ్యమైన విషయం.

సహస్రం అనే పదం, అదొక మంత్రం. దీన్ని (శిరస్సుపైన) 'సహస్రారము' అంటారు. 'సహస్రదళ పద్మము' అంటారు. 'పరిపూర్ణ స్థితిని' సహస్రము అంటారు. అది ఒక మంత్ర శాస్త్రం. 'స' అనే అక్షరానికి; 'హ'అనే

అక్షరానికి; మళ్ళా 'స్ర' అనే అక్షరానికి చాల వివరణ ఉన్నది. అది అలా ఉండగా సహస్రము అంటే 1000 అనే పద్ధతి తీసుకుంటే, మూడు లోకములూ వ్యాపించిన ఒకే ఒక తత్త్వానికి సంబంధించినది అనేది ఒక భావన. కాబట్టి ఈ మూడు లోకములకు సంబంధించిన ఏ రూపము అయినా సరే అది దైవముదే ! దెయ్యము అయినా దైవము యొక్క రూపమే! అని తెలిస్తే దెయ్యం ఏమి చేయదు. పులైన, పామైన, తేలైన, నీ శత్రువైనాను. నువ్వు అనుకోవడం బట్టి శత్రువు! శత్రువులో కూడా దైవము ఉన్నాడు అనుకుంటే అంత బాధించదు. మహాత్ములు అట్లాగే జీవించారు. పులిలో కూడా దైవముందని తెలిసిన వారే పులిని పిల్లి వలే చక్కగా సాకారు. పాములో దైవము ఉందని తెలిసిన వారే పామును సాకారు. పిచ్చి ఏనుగులో దైవమును దర్శించిన బుద్ధునికి ఏనుగు చిన్న కుక్కపిల్లలాగ పక్కన వచ్చి కూర్చుంది. ఇలా సమస్తమును దైవాన్ని దర్శించే పద్ధతి కోసం సహస్రనామాలు ఇచ్చారు. ఆరాధన అలా చేసుకోవాలి.

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు ఇలాగ కూడా భావన చేసుకోవచ్చు. నక్షత్రములు 27. ఒక్కొక్క నక్షత్రానికి 4 పాదములు. ఒక్కొక్క పాదం ఒక్కొక్క శ్లోకం చొప్పున మొత్తం 108 శ్లోకాలు. మనం 4వ శ్లోకం చదువుతున్నామంటే మొదటి నక్షత్రంలోని నాల్గవ పాదంలోనే ఇంకా వున్నామని అర్థం. ఉదాహరణకు అశ్విని నక్షత్రం వాళ్ళు, వాళ్ళ యొక్క పాదాన్ని బట్టి దాని అర్థం ఎక్కువగా ఆకళింపు చేసుకొనవచ్చును. కాలం సద్వినియోగం అవడములో భాగంగా విష్ణుసహస్రనామం చదవడం 20 నిముషాలు పడుతుంది. 20 నిముషాలు సద్వినియోగం అవకుండా, విష్ణుసహస్రనామం కొన్ని వందల సార్లు చదివి ఉండవచ్చును. ఎందుకంటే tape చదువుతుంది. మనమూ చదువుతాము, మనం చదువుతున్నాము అనుకున్నప్పుడు మనం వినాలి. మనం వినాలి అంటే ఒక పద్ధతి వుంది. ఆ పద్ధతి ప్రకారం వినకపోతే ఏమీ కాదు. విష్ణుసహస్రనామం మంత్రం అనుకుంటే, మంత్రం శబ్దానికి సంబంధించినది. దాని యొక్క యంత్రం విష్ణువు యొక్క రూపం! మనం చదివే ప్రక్రియ అంతా కూడా తంత్రం. కాబట్టి ఈ తంత్రమంతా ఆ యంత్రాన్ని లోపల ఆవాహన చేసుకొని, శబ్దాన్ని వింటూ చదవకపోతే, దాని యొక్క వినియోగమేమీ మనయందు జరగదు. అంటే విష్ణువు యొక్క సాన్నిధ్యము, దానికి సంబంధించిన వికాసము, మన యందు కలగడానికి అవకాశం వుండదు. అందుకనే భగవంతుడు లేడేమో అనే భావన కలుగుతుంది. అందుకే ఏళ్ళ తరబడి విష్ణుసహస్రనామం చదివిన వాళ్ళలోనూ మార్పు రాదు. వాళ్ళ ఆలోచనలలోనూ మార్పు రాదు. ఈ మొత్తం కార్యక్రమం మన మనస్సు, ఇంద్రియములు, శరీరములలో వుండే రుగ్మతలు, మాలిన్యములు అన్నీ క్షాళనమై, భగవంతుని అనుభూతి చెందే

అర్హత సంపాదించుకోడానికి చేస్తున్నాం. ఆటువంటి ధృఢనిశ్చయం, resolution ఉండాలి. లేకపోతే ౨౦ నిముషాలు దండగ. విష్ణువు యొక్క రూపము యంత్రము, విష్ణువు యొక్క నామము మంత్రము, మనం ఉచ్చారణ చేసి వినడం తంత్రము. ఈ మంత్రము, యంత్రము, తంత్రము కలిసినప్పడే అది ఒక త్రిభుజాకారమైన వలయంగా ఏర్పడి, ఒకదాని నుండి మరొక దానికి శక్తి ప్రసారం (energy supply) వుంటుంది. లేకపోతే దైవశక్తి యొక్క ప్రసారానికి ఒక circuit complete కాదు. ఆ circuit complete కావాలంటే, ఏది చదువుకున్నా అలాగే చదువుకోవాలి.

విష్ణు సాన్నిధ్యము కొరకు, విష్ణు సాయుజ్యము కొరకు, విష్ణు సామీప్యము కొరకు, విష్ణు సారూప్యము కొరకు విష్ణువును మనం లోకంలో దర్శనం చేస్తూ ఉండాలి. దర్శనం చేస్తూ ఈ సహస్రనామాలను అవగాన చేసుకుంటూ ఉండడం వల్ల మనకి ఆశయ సిద్ధి కలుగుతుంది. విష్ణు సహస్రనామము అధ్యయనం చేసే వారందరూ కూడా లోకాన్ని విష్ణువుగా చూడటం అనే సాధన మరవకుండా చేస్తూ ఉండాలి. ఎందుకంటే లోకం రూపంలోనే విష్ణువు ఉన్నాడని 'విశ్వం విష్ణుర్వషట్కారో' అని విష్ణు సహస్రనామ ప్రారంభము లోనూ, 'విష్ణుండు విశ్వంబు విష్ణుని కంటెను వేరేమియును లేదు' అని భాగవతంలోనూ చెప్పబడినది కదా! లోకాన్ని చూస్తున్నప్పుడు విష్ణువుని చూస్తూ ఉండడం వలన మాత్రమే మనం విష్ణు దర్శనానికి క్రమశః అర్హత సంపాదించుకుంటాం. అలా చూడకుండా విష్ణుసహస్రనామం యొక్క అవగాహన చేసుకుంటే అది విజ్ఞానంగా మిగిలిపోతుంది తప్ప మన యందు సత్యమై నిలవదు. మనయందు దాని యొక్క అనుభూతి పరిపూర్ణం కాదు. దివ్యమైన విషయములను తెలుసుకోవడం ద్వారా మనకు వికాసం వస్తుంది. అందులో ఏమీ సందేహము లేదు. వచ్చిన వికాసం నిలబడాలంటే దివ్య కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు, కార్యక్రమానికి కార్యక్రమానికి మధ్య ఉండే interval లో, ఎంత వరకు విష్ణువుని చూస్తే అంత continuity ఉంటుంది. ఆ interval లో మనం విష్ణువుని చూడకపోతే continuity ఉండదు. మళ్లీ విష్ణుసహస్రనామం class లో మాత్రమూ మనకు మళ్లీ విష్ణు అందరి రూపాల్లో ఉంటాడు, అన్ని రూపాల్లో ఉంటాడు అన్నది నామాల అర్థాలలో కనిపిస్తూ ఉంటాడు. మనం లోకంలో చూడడం మొదలు పెడితే నెమ్మదిగా అక్కడో point, ఇక్కడో point ఉన్న వాటి మధ్య continuity ఏర్పడి, ఎప్పుడూ విష్ణువు యొక్క సాన్నిధ్యాన్ని అనుభూతి చెందడానికి అవకాశం ఉంటుంది. అది సాధన! ఇది ఆ సాధనకు ఏర్పరచుకునే సాధన సంపత్తి. ఇక్కడ మనం implements పోగేసుకుంటున్నాం. అవి మన life లో workout చేసుకోవాలి. లేకపోతే ఇది కేవలం ఒక విజ్ఞానంగా

కొంతకాలమే ఉంటుంది. ఎందుకంటే ఇప్పుడు ఉండే వికాసం బయటకు వెళ్ళి పనులు చేసుకుంటూ ఉంటే, పనుల రూపంలో ఉన్న భగవంతుణ్ణి, ఎవరితో పనులు చేస్తున్నామో వారి రూపంలోని భగవంతుణ్ణి, ప్రదేశంలోని భగవంతుణ్ణి చూడకపోవడం వల్ల వికాసము తగ్గుతుంది. వికాసం తగ్గిన కొద్దీ ఇంకొంచెం తక్కువగా చూస్తాం. ఇంకొంచెం తక్కువ చూసిన కొలది ఇంకా వికాసం తగ్గుతుంది. మర్చిపోతాం. విష్ణువుని చూడడం మరిచిపోవడం తో విజ్ఞానం కూడా మాయమైపోతుంది. హరించుకుపోతుంది.

విష్ణుసాన్నిధ్య రూపంలో మనల్ని ప్రతి సన్నివేశంలోనూ ఉత్తీర్ణులను చేయాలంటే మనం లోకాన్ని విష్ణువుగా చూడాలి. విష్ణువుని కొంచెం చూడడం మొదలు పెట్టి, అక్కడి నుండి కొంచెం ఎక్కువగా చూడటం అయ్యి, ఇంకా కొంచెం ఎక్కువ చూడ్డం, ఇంకొంచెం ఎక్కువ చూడ్డం మొదలు పెట్టాలి. ఇంక వేరే పద్ధతి లేదు. విష్ణు రూపంగా సృష్టి అంతా చూడ్డం అనేది ఒక essential prerequisite for experiencing Vishnu. ఇది ఒక practical instruction క్రింద తీసుకుని మనం వీలున్నంతవరకు ఆచరణలో పెట్టడానికి ప్రయత్నం చేయాలి. ఆచరణలో పెడితే తప్ప మనలో మార్పు రాదు. లేకపోతే వినడం- మర్చిపోవడం, వినడం- మర్చిపోవడం అయ్యి, మనం అట్లాగే ఉంటాం. ఎన్నిసార్లు భగవత్ తత్వ విషయాలు విన్నా మనం మారక పోవడానికి కారణం ఏమిటి? చెప్పినవి వినడము, శ్రద్ధతో ఆచరించక పోవడమే! లోకంలా కనిపిస్తూ ఉండేదంతా విష్ణువే! లోకాన్ని చూస్తున్నప్పుడు దేవుడు గుర్తుకు రావాలి. మనం దేవుడిని చూడటం అంటే. లోకం కాక చూడడం అనే అభ్యాసం, పొరపాటు వల్ల ఏర్పరచుకున్నాం. దానివలన కనబడ్డ వాటిల్లోనే చూడడు, కనబడని వాటిల్లో వీడేం చూస్తాడని భగవంతుడు నవ్వుకుంటాడు. ఎదురుగా ఉన్నదే కనపడదుట. ఎవ్వరికీ కనబడని వస్తువు వెతకడానికి బయలుదేరాడట అంటే అర్థం ఏమన్నా ఉందా? ఆయన ఇన్ని రూపాల్లో కనిపిస్తుంటే, ఇన్ని రూపాల్లోనూ ఉన్న ఆయన్ను చూడకుండా, వీళ్లందరినీ నిర్లక్ష్యం చేస్తూ ఆకాశంలో చూస్తే శూన్యం కనిపిస్తుంది. పూర్ణం కనిపించదు. ఇక్కడ నుండి చూస్తే అక్కడి వరకు మొత్తం అంతా పూర్ణంగా కనిపిస్తుంది అని భగవంతుడు చెబుతున్నాడు. కనుక సాధనలో మనం రోజూ ఎన్ని సంఘటనల్లో, ఎన్ని ప్రదేశాల్లో, ఎందరు వ్యక్తుల్లో, ఎన్ని ఆకారాల్లో విష్ణువును చూడగలిగాము? ఎన్ని ఆకారాల్లో చూడలేకపోయాం? చూడడం అనేది ఒక అభ్యాసంగా చేసుకొనడం వలన మాత్రమే మనలో మార్పు వస్తుంది తప్ప, లేకపోతే ఎంత పెద్ద విషయాలు తెలుసుకున్నా రెండు మూడు రోజులు అయ్యాక అవి ఆవిరైపోతాయి. అవి మిగలవు. మళ్లీ freshగా మొదలు పెట్టడమే! ఎప్పుడు

ఇమిడి ఉంటాయి అంటే ఈ చింతనలు ఉన్నప్పుడు ఇమిడి ఉంటాయి. అవసరమైనప్పుడు వాటంతటవే మనలోంచి వ్యక్తమవుతుంటాయి. అప్పుడు ఏదో చెప్పారండీ మీకు చెబుదామనుకున్నాను, అనే పరిస్థితి ఉండదు. ఎవరికన్నా చెప్పవలసి వచ్చిందనుకోండి 'పుష్కరాక్షః' గురించి, మనలో అంతా వికాసం చెంది మొత్తం బయటవాళ్ళకు అందుతుంది. ఎప్పుడూ? విష్ణు లోకంలో ఉండటానికి మనం ప్రయత్నం చేస్తే! లోకం విష్ణువే కనుక మనం విష్ణు లోకంలో ఉన్నాము అనుకోండి, అదే వైకుంఠంలో ఉండడం అంటే. వైకుంఠం అంటే ఎక్కడో అవతల ఉందనుకోవడం ఒక పద్ధతి. మనం ఎక్కడ భావన చేస్తే అక్కడ వైకుంఠం ఉంటుంది. మన భావన యందు భగవంతుడు స్థిరపడితే వైకుంఠం మనయందు, మన చుట్టూ ఏర్పడుతుంది. అది భగవంతుడు ఇచ్చిన పెద్ద రహస్యం. ఎప్పుడైతే భగవత్ చింతన మనలో ఉంటుందో మనకు రాగద్వేషాలురావు. ఇలా కూర్చొని మంచి విషయాలు చెప్పకుంటుంటే ఆ కాసేపు రాగద్వేషాలు ఎందుకు రావు అంటే భగవత్ చింతన చేసుకుంటున్నాం కాబట్టి. మామూలు సన్నివేశాలలో కూడా ఎదురుగుండా ఉండే వ్యక్తులు, సమయాలు, ప్రదేశాలు ఇవన్నీ కూడా భగవంతుడే అని గుర్తు పెట్టుకోవడం అనేది అత్యుత్తమ సాధన. అది చేసుకున్నంత సేపు భగవత్ సంబంధమైన భావన తెరవెనుక ఉంటే, అంటే మన మనసు వెనక ఉంటే, ఆ భావన ఉండటం వలన రాగద్వేషాలు, కామక్రోధాలు, ఈర్ష అసూయలు ఉత్పన్నం కాకుండా ఉంటాయి. ఆ భావన తప్పకుంటే ఇవన్నీ కప్పేస్తూ ఉంటాయి. అందుకే లోకాన్ని విష్ణుపరంగా చూడాలి. అప్పుడు మనం ఉంటున్నది విష్ణులోకం. అలాగే శివుడుపరంగా చెప్పకుంటే అది శివలోకం. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు. అలాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు, ప్రద్యుమ్నుడు అని ఒక వ్యూహం చెప్పకున్నాం కదా. అట్లాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు, ఈశ్వరుడు ఇట్లా చెప్పకుంటాం. అట్లాగే ఆదిశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి. ఎట్లా చెప్పకున్నా పేర్లే. అసలు విషయం ఏంటంటే ఉన్నది ఒక్కటే అని గుర్తు ఉండాలి. ఇన్ని రూపాలలో ఉన్నది ఒక్కటే అని గుర్తుండాలి. మనం అందరితో ప్రవర్తించినప్పుడు అది గుర్తు ఉండాలి. అలా ఉంటే మనలో మార్పు వస్తుంది. మనల్ని మనం బాగు చేసుకోవడానికి చేసుకునే కార్యక్రమమే కదా ఇది. అంతేగాని this is not a favour to God. ఇది దేవుడికి ఉపకారం కాదు. ఇలా చేయకపోతే పాపం భగవంతుడు ఏమైపోతాడో అని కాదు కదా, మనం చేస్తున్నది. చేస్తున్న కార్యక్రమములలో నుండి మనలో ఉద్ధారణ కలగాలి. మనలో ఉద్ధరింపు రావాలి. దేనికి? మన మనస్సు, ఇంద్రియములు, శరీరమునకు చక్కని అనుసంధానం ఏర్పడాలి. శమము

ఏర్పడాలి. దేహంలో ఉన్నంత కాలం మనకు పరిపూర్ణమైన ఆనందం కలగాలి. దేహంలో ఉండడమే ఒక బందిఖానాలో ఉన్నట్లు అన్న పరిస్థితి భగవంతుడు సృష్టించింది కాదు. మనం చేతకాక చేసుకున్నాం. కాబట్టి దాన్ని మనం తెలుసుకోవాలంటే మనలో మార్పు రావాలి. మనలో మార్పు రాకుండా మేము ఇలాగే ఉంటాము మీరు అలా చెప్పకు పోతూ ఉండండి అంటే అలా చెప్పకు పోయే వాళ్ళు చాలామంది ఉన్నారు. మార్చుకోని వారు అలాగే బందిఖానాలో ఉన్నట్లుగానే బాధలు పడుతూ ఉన్నారు. ఈ మార్పు తెచ్చుకోవడాన్నే 'వ్యవసాయం' అంటారు. విశిష్టమైన పర్యవసానం చెందే దాన్ని వ్యవసాయం అంటారు. విశిష్టమైన పర్యవసానం మన దేహాదుల యందు ఏర్పడాలి. ఏర్పడితే then we can see better, we can listen better, we can speak better, we can understand better. Everything is better in ourselves when we are in this practice. Suppose there is no betterment it means there is no practice. Betterment, time తీసుకొస్తుందని wait చేస్తే అవ్వదు. Time వచ్చి వెళ్లి పోతుంది. మంచిరోజు వచ్చినప్పుడే తెల్లవారుజామున లేస్తానండీ అనుకుంటే ఎప్పటికీ లేవలేం. మంచిరోజుగా మనం తయారు చేసుకోవాలి. దానికి మనకు భగవంతుడు బుద్ధిని ఇచ్చాడు. దాన్ని వినియోగం చేసుకోవాలి. ఈ విధంగా చేసుకుంటే వ్యవసాయం అంటే విశిష్టమైన పర్యవసానం అంటే, మార్పు తీసుకొస్తుంది. ఎటువంటి మార్పు తీసుకు వస్తుంది? చిన్న గింజ కొన్ని వేల విత్తనాలుగా తయారుచేసే ప్రపంచంలో కొన్ని వేల మందికి ఆహారంగా చేసే పద్ధతి ఉన్నది. దీనికి ఏం చేస్తారు? భూమిని దున్నుతారు. విత్తనం వేస్తారు. నీరు పోస్తారు. దాన్ని పెంచుకుంటారు. దాన్ని పెంచేటప్పుడు రక్షణ చేసుకుంటారు. తర్వాత ఇంటికి పట్టుకొచ్చుకుంటారు. తినేట్టు గా తయారు చేసుకుంటారు. తింటారు. ఇంత జరుగుతుంది. వేసిన గింజ ఆర్నెల్లు అయినా వేసినట్లే ఉంటే? ఏం చేస్తున్నావ్ అంటే పాతిన గింజ తీసి తింటున్నా అన్నట్లుగా ఉంటే ఎలా? అంటే గింజ గింజ గానే ఉండి పోయి, మొక్క అవకుండా దాంట్లోంచి ధాన్యం అవ్వకుండా ఎంతకాలం? ఎక్కువ మందికి భగవంతుని సాధన ద్వారా ఈ వ్యవసాయం ఎందుకు జరగదు? లోకమునందు ఈ విధమైన దృష్టి ఉండదు కాబట్టి! లోకమును కొంచెం తక్కువ చూస్తూ ఉంటారు. నిజానికి లోకమే భగవంతుడు. కాబట్టి లోకాన్నే భగవంతుడు గా చూడాలి. లోకాన్ని భగవంతుడుగా చూసుకుంటూ, విష్ణు సహస్రనామం అభ్యాసం చేసుకుంటే ఫలశృతి బాగా ఉంటుంది. 'ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః' విష్ణు సహస్రనామం తర్వాత ఫలశృతి ఉన్నది. అందులో భయం వచ్చే వారికి భయం తప్పిస్తాడు. ఆపద వచ్చే వారికి ఆపద నుండి తప్పిస్తాడు. మృత్యువులో వెళ్లే వాడికి మృత్యువు నుండి

తప్పిస్తాడు-- ఇవన్నీ ఉన్నాయి. ఇవన్నీ ఎప్పుడు వస్తాయి? ఈ నామాల్లోని సత్యాలు మన జీవితాల్లో అనుభూతి చెందినప్పుడు కదా! ఈ సాధన, వేయి నామాలు జపించే లోపల పరిపూర్ణం కాకపోయినా కనీసం మొదలవ్వాలి.

విష్ణు సహస్రనామం గూర్చిన ప్రసంగములు వార, వారము ఏర్పాటు ఎందుకు చేసుకుంటున్నాము? ఈ వారం రోజులలో మనము అంతర్యామి యందు ఏ మాత్రం నిలబడి ఉన్నాము, అంతర్యామి పైన ఏర్పడుతున్న త్రిగుణముల యొక్క క్రీడ యందు ఎంత లోబడి జీవిస్తూ ఉన్నాము, అందరి జీవుల రూపంలోనూ ఉండే ఒకే ఒక అంతర్యామిని గుర్తు చేసుకొని సజీవమైన మూర్తులు అన్నీ కూడా మనము భగవంతుడుగా ధ్యానము చేసుకోగలుగుతున్నామా లేదా అని assess చేసుకోవడానికి, ఏర్పాటు చేసుకున్నాము. ఆ సాధన జరిగినప్పుడు మనకి భగవంతుని యొక్క సాన్నిధ్యము మనకు లభించినట్లు! అలా కాక జ్ఞానము, విజ్ఞానము దాని యొక్క సేకరణ యందు నిమగ్నమైనట్లయితే, ఎన్ని జన్మలు గడిచినప్పటికీ కూడా మనలో భగవంతుని యొక్క అనుభూతికి అవకాశము ఉండదు. నేర్చుకోవటం ముఖ్యం కాదు, గుర్తు తెచ్చుకొని గమనిస్తూ ఉండటం అనేది సాధన! నేర్చుకున్నవి మర్చిపోతాం. ఈ విధంగా చూడటం మొదలు పెట్టినప్పుడు మనము కూడా అంతర్యామిలో భాగంగా మనల్ని మనము అవగాహన చేసుకుని, శాశ్వతములమై, అక్షరములమై భగవంతుని అనుభూతిని ఎక్కువ పొందుతూ, సృష్టిని అంతా కూడా భగవంతుని క్రీడగా, వైభవంగా కొనియాడుతూ, దానియందు మనము అంటక జీవించడానికి అవకాశం ఉంది. భగవత్ భక్తులు అలా జీవిస్తూ ఉంటారు. అది వాళ్లకు ఎలా సాధ్యమైందంటే ఆ సాధనే! ఇది చేయక ఎంత ఆరాధన చేసినప్పటికీ ఆయన సాన్నిధ్యాన్ని పొందటానికి అవకాశం లేదు. ఈ సాధననే 'అనుష్ఠానం' అని కూడా అంటారు. శ్రీకృష్ణుడు 'నా మతము అంటే, అందరిలో ఉన్న నన్నే దర్శిస్తే నీకు గుణముల యొక్క ఆట అంటదు. నన్ను దర్శించకపోతే నీవు గుణములలో ఇరుక్కుపోతావు. నువ్వు బంధింప పడతావు, సుఖము కోరి దుఃఖ పడతావు, సౌకర్యములు కోరి అసౌకర్యములు అనుభవిస్తావు. లాభం కోరి నష్టం పొందుతావు. జయం కోరి అపజయం పొందుతావు' అని చెప్తాడు. అందుకని ఈ త్రిగుణములలో తేలేటటువంటి సృష్టికి ఏదైతే ఆధారమో దానిని దర్శనము చేయుట సాధన. అదీ అనుష్ఠానము! పుస్తకాలతో ఏమాత్రం సంబంధం లేదు. అది జీవితము అనే ఒకే ఒక పుస్తకముతో సంబంధం ఉన్న విషయము. ఆ జీవితము అనే పుస్తకములో మనకు ఒకొక్క రోజు ఒక్కొక్క పుట. సంవత్సరము ఒక chapter. ఒక chapter లో 365 pages ఉంటాయి. అటువంటి chapters ఒక్కొక్క సంవత్సరము ఒక్కొక్క chapter గా మనం చూసినట్లయితే మనమే ఒక పెద్ద

గ్రంథం.ఈ గ్రంథములో రాసింది అంతా భగవత్ తత్త్వం గూర్చి రాసామా, భగవత్ తత్వమే అనుభూతిగా ఉన్నామా? చూసుకోవాలి. మాస్టర్ గారు 'అయస్కాంతం గురించి ఎంత తెలిస్తే ఏమి లాభము అయస్కాంతీకరణము చెందాలి కదా! వెలుగు గురించి ఎంత తెలిస్తే ఏమి లాభం వెలుగై ఉండాలి కదా' అంటూ ఉండేవారు. ఆహారం గురించి ఎంత తెలిస్తే ఏమి లాభము? తింటేనే కదా దాని యొక్క అనుభూతి. అందుకని అనుభవైకమైన జ్ఞానము, అనుభూతిపరమైన జ్ఞానము ఎక్కడి నుంచి వస్తుంది అంటే కనబడుతున్న దానికి ఆధారముగా ఉన్న దానిని గమనిస్తూ ఉండటం అనేది చేయగలిగిన నాడు. అది మాటిమాటికి గుర్తు తెచ్చుకోవడానికి ఇటువంటి క్లాసులు పెట్టుకుంటాము తప్ప విష్ణు సహస్రనామంలో ఎంత చెప్పారు, ఒక్కొక్క నామానికి ఎంతెంత వివరణ వచ్చింది, ఆ వివరణలో జ్యోతిష్యం ఎంత వచ్చింది, శబ్దాల గురించి ఎంత వచ్చింది, తంత్రం గురించి ఎంత వచ్చింది, మంత్రం గురించి ఎంత వచ్చింది అని కాదు. అంతర్యామిని దర్శనం చేయడం అంటే ఉదాహరణకి ఒక ఆయన మాట్లాడుతున్నాడు అనుకోండి ఆయనలోంచి మాట్లాడే వానిగా ఉన్న భగవంతుని దర్శనము చేయాలి. మాట యొక్క అర్థము అనేది పైన తేలేది. లోపల ప్రవాహముగా సరస్వతి ఉన్నది కదా! ఎవరైనా మాట్లాడుతూ ఉంటే ఆ సరస్వతీ ప్రవాహము ఎలా ఉందో గమనించామా? అంతర్యామిగా ఉన్నది అక్కడ సరస్వతి ప్రవాహం under-current అంటాం. బహిర్గతంగా నదీ ప్రవాహం పై బోలెడన్ని పడవలు, బోల్డు దూలాలు, కర్రలు ఉంటాయి అలా అన్నీ తేలుతూ ఉంటాయి. తేలుతూ ఉన్న వాటిని చూస్తున్నామా, ప్రవాహమును చూస్తున్నామా? ప్రవాహం ఉండకపోతే ఈ తేలేవన్నీ ఏమీ లేవు కదా! అట్లాగే జీవితంలో మనము వస్తువు, పశువు, వృక్షాలు మొదలైన కనబడే అన్నిటి యందు అంతర్యామిగా ఉండే వాడిని గుర్తు తెచ్చుకొని ఆ మూర్తులతో ప్రవర్తించడము అనేది సాధన. అలా కానప్పుడు మనము ఎన్ని విషయాలు తెలుసుకున్నా మళ్లీ మర్చిపోతూ ఉంటాము. తెలియటం ముఖ్యం కాదు ఇక్కడ నేర్చుకోవడం ముఖ్యం కాదు. ఈ విధమైన అనుష్టానము ముఖ్యము. అన్నింట్లోనూ నన్ను ఈ విధముగా దర్శనము చేయటం అనేది నా మతము అని చెప్పాడు శ్రీకృష్ణుడు. ఆ సాధన మాత్రమే మనల్ని లోతుల్లోకి తీసుకు వెళుతుంది. లేకపోతే జీవితము కాసేపు మునుగుతూ ఉంటుంది, కాసేపు తేలుతూ ఉంటుంది, కాసేపు ఢీ కొట్టుకుంటూ ఉంటుంది, కాసేపు కిందకు పడుతూ ఉంటుంది, కాసేపు పైకి ఎగురుతూ ఉంటుంది, ఏవేవో అట్లా తమాషాలు జరుగుతూ ఉంటాయి. సాక్షీభూతుడిగా ఉండవలసిన జీవుడు, తన యొక్క చిత్త ప్రవృత్తులలో ఇరుక్కుని తనే బోల్తాలు కొట్టేస్తూ ఉంటాడు. ఈ చిత్త ప్రవర్తనాన్ని త్రిగుణాత్మకమైన వంటి రజస్సు, తమస్సు కారణముగా, వాటి

యొక్క సమతూకము లేకపోవటము కారణముగా రకరకాల బాధలు అనుభవిస్తూ ఉంటాడు. అలా కాకుండా సమస్తము లో నిండి ఉన్న అంతర్యామిని దర్శించడానికి చేసే సాధనలే ఈ సహస్రనామ వివరణ కార్యక్రమము.

కంభంపాటి పార్వతీ కుమార్

# విషయ సూచిక


803 సమావర్తః ........................................ 1

804 నివృత్తాత్మా........................................ 6

805 దుర్జయః ........................................ 15

806 దురతిక్రమః........................................ 19

807, 808, 809, 810 దుర్లభః, దుర్గమః, దుర్గః, దురావాసః ........ 21

811 దురారిహా........................................ 27

812 శుభాంగః........................................ 35

813 లోకసారంగః ........................................ 44

814, 815 సుతన్తుః, తన్తువర్ధనః........................................ 52

816 ఇంద్రకర్మా ........................................ 56

817 మహాకర్మా ........................................ 59

818 కృతకర్మా........................................ 63

819 కృతాగమః ........................................ 66

820 ఉద్భవః........................................ 71

821 సుందరః ........................................ 75

822 సుందః........................................ 76

823 రత్ననాభః ........................................ 78

824 సులోచనః ........................................ 80

825 అర్కః ........................................ 83

826 వాజసనః........................................ 87

827 శృంగీః ........................................ 92
828 జయంతః ........................................ 97
829 సర్వవిత్ ........................................ 99
830 జయీ ........................................ 102
831 సువర్ణబిందుః ........................................ 104
832 అక్షోభ్యః ........................................ 109
833 సర్వవాగీశ్వరేశ్వరః ........................................ 117
834 మహాహ్రదో ........................................ 119
835 మహాగర్తః ........................................ 120
836 మహాభూతః ........................................ 122
837 మహానిధిః ........................................ 123
838 కుముదః ........................................ 126
839, 840 కున్దరః, కున్దః ........................................ 128
841 పర్జన్యః ........................................ 136
842 పావనః ........................................ 138
843 అనిలః ........................................ 143
844 అమృతాంశుః ........................................ 145
845 అమృతవపుః సర్వజ్ఞః ........................................ 148
846 సర్వతోముఖః ........................................ 157
847 సులభః ........................................ 159
848 సువ్రతః ........................................ 164

849 సిద్ధః ........................................................165
850, 851 శత్రుజిత్, శత్రుతాపనః ........................................166
852, 853, 854 న్యగ్రోధః, ఔదుంబరః, అశ్వత్థః ........................176
855 చాణూరాంధ్ర నిషూదనః ..............................................178
856 సహస్రార్చిః ...................................................180
857 సప్తజిహ్వః ................................................... 184
858 సప్తైధాః ..................................................... 193
859 సప్తవాహనః ................................................... 195
860 అమూర్తిః ......................................................200
861 అనఘః .......................................................203
862 అచింత్యః .....................................................207
863, 864 భయకృద్ , భయనాశనః ........................................ 210
865, 866 అణుః, బృహత్.............................................. 215
867, 868 కృశః, స్థూలః ............................................. 216
869, 870 గుణభృత్, నిర్గుణః ..........................................228
871 మహాన్........................................................232
872 అధృతః .......................................................237
873 స్వధృతః ......................................................239
874 స్వాస్థ్యః ..................................................... 241
875 ప్రాగ్వంశః ....................................................244
876 వంశవర్ధనః ...................................................247

877 భారభృత్ .............................................. 251

878 కథితః .............................................. 254

879 యోగీ .............................................. 261

880 యోగీశః .............................................. 264

881 సర్వకామదః .............................................. 266

882 ఆశ్రమః .............................................. 274

883 శ్రమణః .............................................. 276

884 క్షామః .............................................. 278

885 సుపర్ణః .............................................. 279

886 వాయువాహనః .............................................. 282

887 ధనుర్ధరః .............................................. 284

888 ధనుర్వేదః .............................................. 290

889 దణ్డః .............................................. 293

890 దమయితా .............................................. 297

891 దమః .............................................. 298

892 అపరాజితః .............................................. 300

893 సర్వసహః .............................................. 303

894, 895, 896 నియంత, నియమః, యమః .................... 307

897, 898, 899 సత్యవాన్, సాత్వికః, సత్యః .......................315

900 సత్యధర్మ పరాయణః .............................................. 338

## 803 సమావర్తః

సమావర్తః అంటే తన చుట్టూ ఆవర్తనములుగా అంటే వలయాకారాలుగా అట్లా సృష్టి ఏర్పరచే వాడు అని అర్థం. ఎన్నో సృష్టి వలయాలు, గోళాలు. అందులో ఒక్కొక్క గోళానికి ఒక్కొక్క వలయం. ప్రతి జీవికి ఒక వృత్తాకారం. ఎవరి పరిధి వారికి ఉంది. ప్రతివారు వారికి వారి కేంద్రంగా వారి పరిధి వారికి ఉండేట్లుగా ఆవరణలు ఏర్పరచి, ఈ ఆవరణలన్నింటిలో కూడా తానే నిండి ఉండి, సమస్తాన్నీ ఏర్పరుస్తూ ఉంటాడు. తాను పదవ వాడైనప్పటికీ తన నుండి నవావరణలు ఉద్భవిస్తాయి. ఈ నవావరణలలోనూ అన్నీ వృత్తాకారంగా/ వర్తులాకారముగా ఏర్పడి వుంటాయి. వర్తనము అంటే తిరుగుతూ వుంటాయి. వర్తిస్తూ ఉంటాయి. అన్నీ గుండ్రంగుండ్రంగా తిరుగుతూ వుంటాయన్నమాట, భూచక్రంలాగా. వీటన్నిటియందు సమముగా తాను వర్తిస్తూ వుంటాడు. అన్నిటియందు తాను నిండి వుంటాడు. తన చుట్టూ ఇవి ఏర్పడి వుంటాయి. ఈ తొమ్మిది ఆవరణల్లో మొదటి ఆవరణము వెలుగు. ఈ వెలుగు మళ్ళీ ఒక్కొక్క దాంట్లోకి దిగి వస్తుంది. అది రెండవ ఆవరణము. అంటే 9వ ఆవరణము వెలుగైతే లేక అమ్మవారైతే, ఎనిమిదవ ఆవరణము ఆ వెలుగుతో ఏర్పడినది వ్యక్తిగతమైనవి. ప్రత్యేకముగా ఏర్పడినటువంటివి. మొత్తం వెలుగులో నుండి ప్రత్యేకముగా ఏర్పడిన వెలుగులు 'ప్రత్యగాత్మలు' అంటారన్నమాట. వాటినే 'అహంకారము' అంటారు అంటే దేనికది తాను వేరుగా ఉంది అనుకుంటుంది. ఇప్పుడు అక్కడ ఒక light ఉంది, ఇక్కడ ఒక light ఉంది అనుకుంటున్నాము కదా! అన్ని lights ఒక light నుండే వచ్చినప్పటికీ కూడా దేనికది ఉన్నట్లుగా ఉంటుంది. అందుకని (తొమ్మిదవది) అసలు తత్త్వంకి అంటే అవ్యక్తమైన తత్త్వం వెలుగుగా మారడం మొదటి ఆవరణం. అందుకని చాలాసార్లు మనం అమ్మవారు అసలు తత్త్వానికి మొదటి తొడుగు అని చెప్తాం. వ్యక్తం అయితే అమ్మవారు, వ్యక్తం కాకుండా అవ్యక్తంగా ఉంటే అయ్యవారు. వ్యక్తమైతే అయ్యవారే అమ్మవారుగా ఉన్నారు. అంటే అయ్యవారు, అమ్మవారు కలిసి ఉన్నారని. అక్కడ నుండి ఆ మొత్తంలో నుండి ఒక్కొక్కటి ఒక్కొక్కటిగా ఏర్పడుతూ వస్తుంటుంది. ఏర్పడితే అవన్నీ అహంకార ప్రజ్ఞలుగా ఏర్పడతాయి అట్లా బ్రహ్మ దగ్గర నుండి మన వరకు

ఎవరికి వారు నేనున్నాననే భావనలో ఉంటాం. రకరకాలు. వీటన్నిటినీ మనకు... ఈ అవ్యక్తమేమో 10 అంకెగా చెప్తే, వ్యక్తమైనటువంటి మొట్టమొదటి వెలుగునేమో అమ్మవారు లేక వెలుగు లేక భగవంతుడు లేక మహా ప్రకృతి లేక మహాప్రజ్ఞ అంటారు. అదే సృష్టిలో భగవంతుడు అంటే! సృష్టిలో నిర్వర్తింపబడేది, సృష్టిలో పెద్దదైనటువంటిది ఆ వెలుగు. సృష్టికి లోపల, బయట ఉండేది అంతకుముందు ఉండే వెలుగు. అంటే మనం పిలిస్తే పలికేది ఈ వెలుగే. ఆ పైది పలకడానికి ఏమీ ఉండదు. అందుకని ఎవరు దేవుడని పిలిచినా ఈ లోపల ఉండే వాడినే పిలుస్తారు. పురుషుడు! పురుషుడని భగవంతుడికి పేరుంది. పురుషసూక్తం చదువుకుంటూ ఉంటాం. ఏమిటీ పురుషుడు అంటే 'ప్రవేశించిన వాడు' అని అర్థం. పురమునందు ప్రవేశించినవాడు. ఆ విధంగా ప్రవేశించిన వాడు వెయ్యిరకాలుగా ఏర్పడతాడు.

సహస్రశీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్
సభూమిం విశ్వతో వృత్వా

అట్లా చెప్పకుంటూ ఉంటాం కదా. కాబట్టి మొట్టమొదటి తత్త్వం పదవ తత్త్వం. 10 అని ఎందుకన్నారంటే కింద నుండి పైకి లెక్క వేస్తున్నారు. తెలిసినా, దాని నుండి తెలియని దానికి వెళ్లడం అనేది ఋషిమార్గం. ముందు అట్నుంచి ఇటు దిగి వద్దాం, మళ్లీ ఇటు నుంచి అటు ఎక్కి వెళ్లొచ్చు అని. అందుకని 10 తొమ్మిదవుతుంది. 9 వెలుగుగా ఏర్పడుతుంది. ఆ వెలుగునే దేవుడని, ఆ వెలుగునే మహాప్రకృతి అని, ఆ వెలుగునే మహాప్రజ్ఞ అనీ అందులోంచి మళ్లీ ఏర్పడే వాటిని ప్రజ్ఞలనీ అంటారు. ఒక్కొక్కటీ ఒక్కొక్క ప్రజ్ఞ. బ్రహ్మ ఒక ప్రజ్ఞ. సరస్వతి ఒక ప్రజ్ఞ. విష్ణువు, లక్ష్మి, రుద్రుడు, పార్వతి, వినాయకుడు, కుమారస్వామి ఇట్లా అందులోంచి వస్తారు. ఎందులోంచి? మొత్తం వెలుగులోంచి. ఆ మొత్తం వెలుగుని 'అదితి' అని కూడా అన్నారు. అంటే మొట్టమొదటి వెలుగు అని. చీకటి, వెలుగుకి స్వామిగా అవ్యక్తంగా ఒకాయన ఉంటే, అందులోంచి తొమ్మిదవది అయినటువంటిది అమ్మవారు లేక వెలుగు లేక మహాప్రజ్ఞ లేక దేవుడు. అందుకనే ఆ అవ్యక్తమైన తత్త్వానికి మించి ఈ వెలుగు ఏర్పడింది కాబట్టి 'ఆమె' అన్నారు. అది ఆధారంగా ఏర్పడింది కాబట్టి. 'ఆమె' అన్నప్పుడే ఆమెను కూడా 'విష్ణువు' అని కూడా అనడం మొదలుపెట్టారు. అందుకనే విష్ణువుకీ, అమ్మవారికీ ఏమీ తేడా

ఉండదు. మీరు లలిత పూజ చేసినా విష్ణువుకి చేసినట్లే! విష్ణువుకి పూజ చేసినా లలిత పూజ చేసినట్లే. అమ్మవారు, అయ్యవారు విష్ణువుగా, అసలు అంతకన్నా పైన అయ్యవారిని మనకు పరమశివుడుగా అనుకుంటారు. స్మార్తులు ఈ విధంగా భావన చేస్తారు. ఈ వెలుగులో నుంచి దిగివచ్చి వ్యక్తంగా ప్రతివాళ్ళు తను ఒకళ్ళం ఉన్నామనుకోవడం వల్ల, అప్పుడప్పుడు కాస్త పప్పులో కాలు వేయడం ఉంటూ ఉంటుంది. బ్రహ్మగారు కూడా పప్పులో కాలేస్తారు. ఇంద్రుడు కాలేస్తాడు. మరి అష్టదిక్పాలకులు, నవగ్రహాలు వీళ్ళందరూ దేవతలు పొరపాటు పడతారు అని చెప్పడానికి కారణం ఏమిటంటే ఎనిమిదవ ప్రకృతి అన్నమాట. అది అహంకార ప్రకృతి. తానున్నాను, ఈ సమస్తము ఉన్నది, ఈ సమస్తములో నుండి తాను ఏర్పడ్డాడనే భావన ఉన్నప్పటికీ కూడా, తానుగా ఉన్నాననేటటువంటి భావన కూడా ఉండడం చేత, ఇతరములు కనబడుతూ ఉండడం చేత ఏదో అప్పుడప్పుడు ఏదో వెయ్యి సంవత్సరాలకొకసారో, ఒక మహాయుగానికొకసారో పొరపాట్లు అంత పెద్దవాళ్ళు అయినా చెయ్యొచ్చు. అది అహంకార ప్రజ్ఞ కారణంగా. ఎందుకంటే మొత్తం వెలుగు 'నేను' గా ఏర్పడడం చేత ఆ విధంగా దాని యొక్క జ్ఞానం కూడా దానికి ఆవరణ ఏర్పడుతుంది. కాబట్టి అవ్యక్తానికి మొదటి ఆవరణ తొమ్మిదవదిగా వెలుగు ఏర్పడితే, వెలుగులోంచి ప్రత్యేకమైనటువంటి వెలుగులుగా, అహంకారములుగా, ప్రత్యగాత్మగా అవుతుంది. ఇది ప్రత్యేగాత్మ అయితే మొత్తం వెలుగు 'విశ్వాత్మ' అంటాం. మన విష్ణు సహస్రనామం దీనితోనే మొదలవుతుంది. 'విశ్వం విష్ణుః' అని. కాబట్టి వ్యక్తిగతమైన వెలుగులుగా ఏర్పడినప్పుడు అహంకారం అంటాం. అది కూడా వెలుగే, అహంకారమైనప్పటికీ కూడా. ఎందుకని? అందులోంచి వచ్చింది కాబట్టి, దాని వెలుగు దీనియందు భాసిస్తూ ఉంటుంది. అపరిమితంగా ఉండే వెలుగు, జ్ఞానము కొంత పరిమితత్త్వం చెందుతాయి. పన్నాలు ఏర్పడతాయి. బ్రహ్మ పన్నా బ్రహ్మది. ఇంద్రుడి పన్నా ఇంద్రుడిది. ఇక మిగతా దేవతలు ఎవరి పన్నాలు వాళ్ళవి. మనుషులలో కూడా ఎవరి పన్నా వారిది. అంటే ఎంత మొత్తంతో అనుసంధానం చెంది ఉంటే అంత పన్నా పెరుగుతుంది. మరి ఇప్పుడు షిరిడి సాయి, సత్య సాయి ఉన్నారనుకోండి, ఎంతెంత పన్నాలున్నాయి? మన పన్నాలెట్లా ఉన్నాయి? పరమ గురువుల పన్నాలెట్లా

ఉన్నాయి ? పన్నాలంటే పరిధి అన్నమాట. Area of influence. ఏదో మన ఇంట్లో మన వరకు మన influence, మన ఆఫీసులోనూ, చుట్టుపక్కల స్నేహితులు. మహా ఉంటే ఒక్కొక్కళ్ళకి ఒక వెయ్యి మంది ఉంటారేమో. కొంతమందికి లక్ష మంది ఉంటారు. కొంతమందికి కోట్ల మంది ఉంటారు. కొంతమందికి గోళం ప్రాకి ఉంటారు. కొంతమందికి గోళాలు పాకి ఉంటారు. ఇట్లా పన్నాలుంటాయి. దేనివలన ఇది ఏర్పడుతుందంటే ప్రజ్ఞ యొక్క పన్నా వల్ల. వాడి యొక్క స్ఫూర్తిని బట్టి వాడు పెరుగుతూ ఉంటారు. ఈ పెరగడం వాడి బుద్ధిగా ఏర్పడుతూ ఉంటుంది. అంటే ప్రతి అహంకార ప్రజ్ఞకు తనదైన బుద్ధి ఒకటి ఏర్పడుతుంది. అది ఏడవ ఆవరణం. అవ్యక్తానికి 8 వ ఆవరణం మహా వెలుగైతే, అందులోని ఎనిమిదవ ఆవరణం ఏమో వ్యక్తిగతమైన అహంకార ప్రజ్ఞ ఒకటి ఏర్పడితే 'నేనున్నాను' అని ఏర్పడటం. మొత్తం వెలుగుకు అది ఉండదు 'నేనున్నాను' అని. అంటే అసలు విషయమే ఆ విధంగా వెలుగు చెంది ఉంటుంది కాబట్టి. మొత్తం వెలుగే మూడు అవుతుంది. లక్ష్మి, పార్వతి, సరస్వతి అని. మొత్తాన్ని 'దుర్గ' అంటారు, 'ఆదిపరాశక్తి' అంటారు. మూడుగా విడిపోతే లక్ష్మి, పార్వతి, సరస్వతి అంటారు. మళ్ళీ వీళ్ళ ముగ్గురి పన్నాలు దుర్గ కన్నా కొంత తక్కువగా ఉంటాయి. అంటే వీళ్ళందరి రూపాల్లో ఆ మొత్తం వెలుగుని ధ్యానం చేసుకుంటూ ఉండవచ్చు. అట్లా తగ్గుతూ వస్తుందన్నమాట. మరి ఎవరి బుద్ధి వారిది. అంటే బుద్ధి పన్నా. అక్కడ నుంచి ఆరవ ఆవరణంగా మనస్సు, అయిదవ ఆవరణంగా ఆకాశం, నాలుగవ ఆవరణంగా వాయువు, మూడవ ఆవరణంగా అగ్ని, రెండవ ఆవరణంగా జలం, ఒకటవ ఆవరణంగా పృథ్వి. ఇట్లా నవావరణలు. అందుకనే అమ్మవారికి నవావరణ పూజలు చేస్తుంటారు. నవరాత్రులు అందుకు వచ్చినాయి. అది వసంత నవరాత్రులు అవ్వనివ్వండి, శరన్నవరాత్రులు అవ్వనివ్వండి. ఈ తొమ్మిది రాత్రులు తొమ్మిది ఆవరణలు దాటి, పదవ వాడిని చేరుకోవడానికన్నమాట. ఈ ఆవరణలన్నీ ఆయన అలా ఏర్పరచుకుంటూ ఈ మొత్తం అంతా తన దుకాణం తయారుచేసి, ఆయనే వ్యాపించి ఉంటాడు, ఇన్ని ప్రజ్ఞలుగాను. ఎవరికివారుగా ఉన్నాను అనుకుంటే అనుకోనిస్తాడు. ఇది తొమ్మిదవ అధ్యాయం, భగవద్గీతలో. సముద్రం అలలైనట్లు. కాకపోతే సముద్రం అల అయినప్పుడు మనం అల ఒకే తత్త్వం తో కనిపిస్తుంది. ఇక్కడ ఒక్కొక్క అల

తరువాత ఇంకొకటిగా మారి, ఇంకొకటిగా మారి ఇట్లా స్థితి భేదం చెందుతున్న కొద్ది కరుడు కడుతూ ఉంటుంది తత్త్వం. అసలు తత్త్వం నెమ్మదిగా ప్రథ్వికి చేరేసరికీ, బొత్తిగా ప్రజ్ఞ ఎక్కడుందండి అన్నట్లుగా ఉంటుంది. 'సోలా, గీలా ఏడుంది' అన్నాడు ఒకాయన. ఏం ఉండదనిపిస్తుంది కదా. Soul ఏమిటి అనిపిస్తుంది. ఎందుకంటే మరి అంతా కప్పేసి ఉన్నచోట కనపడదు కదా. కనబడకుండా అసలు అంతా పదార్థం తప్ప ఇంకేం లేదు, ఊరికే ఏదో చెప్తున్నారు అన్నట్లుగా అంతవరకు వచ్చేస్తాడు. ఇంత వ్యాపనం చెంది, అన్ని ఆయన చుట్టూ తిరుగుతూ ఉంటాయి. గోళాలన్నీ తిరగడం లేదా. దేని చుట్టూ ఇవన్నీ తిరుగుతున్నాయి? సూర్యుడి చుట్టూ. సూర్యుడు ఎవరు చుట్టూ తిరుగుతున్నాడు? అది మన వాళ్ళ ప్రశ్న. ఇట్లా తన చుట్టూ ఇవన్నీ వృత్తములు వృత్తములుగా ఏర్పడి, ఒకదానితో ఒకటి చక్కటి అనుసంధానం కలిగి నిర్వర్తింపబడుతూ, ఒక్కడే, ఇన్ని జీవులుగా ఏర్పడి, ఇన్ని గోళాలుగా ఏర్పడి ఇంత వైభవాన్ని ప్రదర్శిస్తున్నాడు అని చెప్పడం మనకు 'సమావర్తః' అనే నామంలో వస్తుంది.

# 804 నివృత్తాత్మా

పక్కన పడేస్తారు. ఇన్నిట్లో తిరుగుతున్నాడు గాని ఇన్నిగా ఉండడుట, ఆయన వరకు. మనకు ఉంటుంది. ఆయన నివృత్తాత్మయే. అంటే ఇన్నిట్లోనూ తానుగా ఉంటాడు తప్ప అంతకన్నా అవస్థితి చెందకుండా ఉండేవాడు భగవంతుడు. అంతకన్నా అలా అవస్థితి చెందనటువంటి, వాడు పూర్ణమైనటువంటి వాడు భాగవతుడు. సమస్తమునందు శివ ఆవరణలోనే ఉంటాడు. లేక భగవత్తత్త్వముగా ఉంటాడు. భగవంతుడు భగవత్తత్త్వంలో ఉంటాడని చెప్పడం పెద్ద విశేషం కాదు. భక్తుడు కూడా అలా అవస్థితి చెందక ఉంటాడు. వాళ్ళ గురించి మనకు అక్కడే మనకు వచ్చే ఉదాహరణలు ప్రహ్లాదుడు, అంబరీషుడు, శుకుడు, ఇటువంటివారు. ఎక్కడా ఏమరుపాటు చెందక, సమస్తమునందు, తనయందు అఖిల భూతముల యందు ఒకే రకంగా గుర్తు కలిగి వుంటారన్నమాట. అలా వున్నవాళ్ళకు ఇంకొకళ్ళు కనిపించరు. అంతకన్నా తక్కువగా వున్న వాళ్లకు ఇంకొకళ్ళు కనిపిస్తారు. ఇంకొకళ్ళు కనిపించినా ధర్మంగా ప్రవర్తించడం ఇటువంటివన్నీ ఉంటాయి. అంటే అహంకార ప్రజ్ఞతో కూడి ఉన్నప్పటికీ కూడా సత్త్వమునందు జీవిస్తూ ఉండడం చేత ధర్మపరంగా జీవిస్తూ, జీవితాలలో చిక్కుముడులు లేకుండా బ్రతికే వాళ్ళు వుంటారు. చిక్కులు ముడులు వేసుకునే వాళ్ళుగా రజోగుణం, తమోగుణం ప్రకోపించడం చేత ఏర్పడే వాళ్ళు వుంటారు. ఇట్లా ఎన్ని రకాలుగా మనకు జీవుల పూర్ణమైన భూతత్త్వం వరకు వచ్చేవాళ్ళలో అతను మాత్రం అవస్థితి చెందకుండా వుంటాడు అని చెప్తుంది ఈ నామము. అతడు అతడు గానే ఉంటాడు అంతేగాని తనను తాను మరిచిపోడు. మనకు మరపు వచ్చేస్తుంది. మరపు వచ్చేస్తుంది కాబట్టే రోజు 'నేనెవరు?' అని ప్రశ్నించుకోమన్నారు. ఈ 'who am I' ఒకటి ఉంది కదా, అది రోజూ వేసుకుని ఈ ఆవరణలన్నీ, గడపలన్నీ దాటేసి అక్కడికి వెళ్లి కూర్చోవాలి. అందుకని 'శ్రీచక్రం మేరు' కూడా మనకు అట్లా తొమ్మిది త్రికోణాలు. అప్పచ్చిలా ఉండదు. Three dimensional గా ఉంటుంది. మొత్తం తొమ్మిది త్రిభుజాలుంటాయి. కొన్ని తలక్రిందులుగా వుంటాయి. అంటే కొన్ని తూర్పు చూస్తుంటాయి, కొన్ని పడమర చూస్తుంటాయి వాటి యొక్క గోపురాలు. ఒక దాని మీద ఒకటి పేర్చబడి వుంటాయి. శ్రీవిద్య ఉపాసకులు 'ఎన్నో భుజం లో

ఉన్నారు, ఎన్నో త్రిభుజంలో ఉన్నారు?' అని అడుగుతారు. 'ఎన్ని ఆవరణల వరకు ప్రవేశించారు?' అని అడుగుతారు. ఆవరణలలో ప్రవేశించడమంటే, భూమి నిన్ను బాధిస్తుందా? పదార్థాన్ని అధిగమించావా? జలం బాధపెడుతోందా? పంచభూతాలు బాధ పెడుతున్నాయా? పంచభూతాల తర్వాత మనస్సు... మనస్సు బాధ పెడుతోందా, లేదూ, బుద్ధా? బుద్ధిలో ఉండిపోయే వాళ్ళు చాలామంది ఉంటారు. ఎందుకంటే అక్కడ అపారమైన జ్ఞానం లభ్యమవుతూ వుంటుంది, అమ్మవారి కరుణ వలన. అందులో కసరత్తులు చేసుకుంటూ అదే అంతా అనుకుంటూ తామెవరో తెలియక బ్రతుకుతూ ఉంటారు అవి చెప్పకుని, అవి చెప్పకోవడానికి మనుషుల్ని పోగేసుకుని, తనకు చాలా తెలుసుననేది ప్రపంచానికి తెలియాలని తపన పడుతూ, పుస్తకాలు వ్రాస్తూ ఇట్లా ఉంటుందన్నమాట. ఒక స్థితిలో సాధకుడు విపరీతంగా పుస్తకాలు వ్రాస్తాడు. జ్వాలాకూలుడు 'ఎవరికైనా తప్పదు' అంటాడు. 'నేనేదో రాసేస్తున్నానని మీరు బాధపడవద్దు, మీరు కూడా వ్రాస్తారు' అని చెప్పాడు ప్రతివాడు ఒక స్థితిలో బుద్ధి లోకంలోకి ప్రవేశించగానే, ఆవరణలలో ఏడవ ఆవరణ, వాడికి జ్ఞానం కొత్త అవడం వలన, ప్రపంచానికి ఇది అందకపోతుందేమో చెప్పకపోతే ఎట్లా అని, అదంతా బయటకు పోసేస్తే గాని ఇతను ఎనిమిదిలోకి, తొమ్మిదిలోకి వెళ్లడానికి ఉండదు. తనలో ఉన్నది బయటపడేస్తే తప్ప తను ముందుకు వెళ్లడానికి లేదండీ. అదీ విద్య. ఆ విధంగా వుంటుంది. మనలో ఉండే విద్యలు మన కోసం కాదు ఇతరుల కోసం. మనకు బాగా జ్యోతిష్యం వస్తే, ఎన్నాళ్ళని నీ చక్రం నువ్వే చూసుకుంటావు? ఇక ఊళ్లో వాళ్లే నీకు చక్రాలు చూడడం వచ్చు అని చెప్పి విపరీతంగా పట్టుకుని వచ్చేస్తారు. వారికి చూడడమే సరిపోతుంది. చేతులు చూసే వారికి విపరీతమైన చేతులు వచ్చేస్తుంటాయి. చూడు చూడు అని. మీ దగ్గర ఏ విద్య ఉన్నా అది ఇంకొకళ్ల కోసమే. అది ఇంకొకళ్ల కోసం నిస్వార్థంగా వాడితే తప్పా బుద్ధిలోకాల్లోంచి బయటపడము. అక్కడ డబ్బులు చేసుకుంటే మళ్ళీ కింద లోకాలకు వస్తాము. ఆధ్యాత్మికపరమైన విద్యలన్నీ కూడా డబ్బులతో సంబంధం లేకుండా, స్వార్థంతో సంబంధం లేకుండా ఇందులోంచి మనకు ఏమి వస్తుంది? అని చూడకుండా చేసుకునే వాళ్ళు సత్సాధకులు. మాస్టరు గారు చెప్పారిది. 'మనం ఇందులో ఏ విద్యా కూడా మన కోసం వాడకూడదు. మన చేయి

మనం చూసుకోకూడదు, అంతవరకు వెళ్ళాలన్నారు. సాముద్రికం నేర్చుకున్న రోజులలో సరదాగా నా చేయి నేను చూసుకుంటుంటే ఒక రోజు వచ్చారు. 'ఏం చేస్తున్నావోయ్?' అంటే చెయ్యి చూసుకుంటున్నాను అంటే, 'నీ చెయ్యి నువ్వు చూసుకోవడం కోసం కాదు సాముద్రికశాస్త్రం. వచ్చిన వాడికేమైనా పనికొస్తావేమో చూసుకో' అన్నారు. ఆయన అలా చేసేవారు. అన్నీ ఇతరుల కోసం వాడడమే! అలా అని ఊళ్లో పరిగెత్తి 'నేను చూస్తా అందరికీ' అని చెప్పడం కాదు. మన దగ్గరికి వచ్చిన వాళ్లకు చూస్తూ ఉంటే, జ్ఞానం పంచ పెట్టబడుతూ ఉంటే, అది ఇంకొకళ్లకు కూడా నేర్పేస్తే, అప్పుడు నీకు దాని నుంచి విముక్తి వస్తుంది. బుద్ధి లోకాల్లోంచి విముక్తి రావడం చాలా కష్టం. ఎందుకంటే చాలా ఇరుక్కుపోతారు. అక్కడ విపరీతంగా ఈ పుస్తకం, ఆ పుస్తకం, ఇంకో పుస్తకం... ఎంత చదివినా ఇంకా చదవడానికి వుంటాయి. ఎంత తెలుసుకున్నా ఇంకా తెలుసుకోవడానికి వుంటాయి. ఎన్నో విద్యలు వుంటాయి. అన్ని విద్యలు మనలను చాలా అద్భుతంగా అలరిస్తూ ఉంటాయి. కానీ ఇంకా బంధీకృతుడై ఉంటాడు. కారణమేమిటంటే తనను తాను తెలియక. అక్కడ నుండి అహంకార ప్రజ్ఞ ఏడు, ఎనిమిది 'నేనున్నాను' అనేది. 9వ దానిని మనం దానిని పట్టుకోవడమే యోగం అవుతుంది. అంతా ఒకటే వెలుగు, అదే నీలో కూడా వెలుగుతోంది అనేది శాశ్వతంగా తనయందు తనకు సత్యంగా తెలియాలి. ఊరికే theory గా తెలియడం కాదు. అందరికీ theory గా తెలుసు. ఎందుకని తెలుసంటే పుస్తకాలు చదువుకున్నాం కాబట్టి. Practice లో అదే యిదని తెలిస్తే... ప్రతి వాడిలో వున్నది నేనే అని తెలిసిందనుకోండి. తెలిస్తే ఏమవుతుందంటే ఇన్నింట్లో వున్నది మనమే కదా ఇంకొకటి కనబడదు. కృష్ణుడికి అట్లా తెలుసు. దశమ స్కంధం భాగవతంలో అంతా అదే యిస్తారు. 'స్వేతర' భావం అంటాడు. 'స్వేతర' అంటే స్వ + ఇతర. దాన్నే మనకు ప్రహ్లాదుడు కూడా చెప్తాడు. 'వీరు, నేనను మధ్య భ్రమణమ్మున ప్రవర్తిల్లక' అంటాడు. అది mental case అంటాడు. నేనొకడిని ఉన్నాను, వీళ్ళు ఒకళ్ళు ఉన్నారు అనే భావం నీలో ఉన్నంతసేపు, you are a mental patient అన్నాడు ప్రహ్లాదుడు. మతిభ్రమణం కలిగిన వాళ్లే అలా భావిస్తారుట. కాబట్టి మనం ఏమిటో దాన్నిబట్టి చూసుకోవాలి. చాలా సులభంగా మన గురించి నిర్వచనమిస్తుంటాడు ప్రహ్లాదుడు. 'ఎందుకయ్యా ఊరికే వాడూ నువ్వు, వాడూ నువ్వు అంటూ ఏం లేదు. ఒకటే ఉంది. ఇంతమంది గా ఉంది'

అంటాడు. ఇది చెప్పడానికే 'సోహం'. 'సోహమస్మి' అనుకోవడంలో ఉద్దేశ్యం. అదొక అద్భుతమైన మంత్రం. 'అదే నేను గా ఉన్నాను, అదే నేను గా ఉన్నాను', నేను అంటూ వేరుగా లేను, అనేది బాగా స్థిరపడాలి. అది స్థిరపడేంత వరకు బాగా రాపాడుకోవాలి. 'రతాకర్, రతాకర్' అన్నాడు కదా. అదే మంత్రం సోహం. 'సః, అహం'. అతడే నేను. ఇందులో ఉంటాడండి ఈయన. ఎవరూ? ఇక్కడ కృష్ణుడు గురించి నిర్దేశిస్తున్నారు. దేనిలోనూ దొరకడు. ఏదీ పట్టేయలేదు ఆయనను. ఏదీ పట్టకుండా అన్నిట్లోనూ ఉండే వెలుగుతోనే అనుసంధానం చెందేవాడు యోగి. మిగతా భావాలను తను గమనించవచ్చు కానీ ఆ భావముల యందు తాను పట్టుబడడు. కృష్ణుడు దొరకడంటామే, ఎందుకు దొరకడు అంటే మన concept కు దొరకడు. మనకు ఒక భావన వుంటే ఆ భావనకు ఆయన దొరకడు. మనం అదైపోవాలి తప్ప. మనం అదైపోవడమే అంటుండేవారు మాస్టర్ గారు. 'అదైపోవడమేనోయ్' అనేవారు. అదైపోతే అక్కడ నుండి దాని భావములుగా ఏదైనా కొంత పని జరగాలి తప్పా, అసలు భావస్థితే దిగివచ్చిన స్థితి అవుతుంది. అందుకని ఎందులోనూ, ఎప్పుడూ కూడా కృష్ణుడు తనను తాను మరువని స్థితిలో వున్నాడు కాబట్టి ఏదీ ఆయనను వృత్తాకారంగా బంధించలేదు, చుట్టేయలేదు. చుట్టేస్తే వృత్తాత్మా, చుట్టేయకపోతే నివృత్తాత్మ అనుకోండి. నివృత్తి, ప్రవృత్తి. ప్రవృత్తి అంటే అట్లా పరుచుకుపోతూ వుండడం అన్నమాట. వీళ్ళేం పరచుకోరు. ఉంటారు. పరచుకుంటే మళ్ళీ చుట్టుకోవాలి. ఇక్కడ జంపకానాలు పరిచాం అవన్నీ చుట్టేగా పెట్టాలి. Class అయ్యేసరికి నివృత్తి. Class ఉన్నప్పుడు కూడా నివృత్తిలో ఉన్నాడుట. అంటే సృష్టిలో కూడా నివృత్తిలో ఇవన్నీ ఉన్నాయి గాని నేనే గా ఉన్నాను వీళ్ళందరి రూపంలో, అని నవ్వు ఆయనకి. చిరునవ్వు అందుకని పోలేదు ఆయనకు. మననే మనం రకరకాలుగా అద్దాల్లో చూసుకుంటే ఎంత విప్పారుతుంది మన ముఖం? అద్దాల మేడలోకి వెళ్ళామనుకోండి, ఎటు చూసినా మనది కనిపిస్తుంది కదా ముందు, వెనకా. ఆహా! వెనకాల ఇట్లా ఉంటుందా నా బుర్ర అని అప్పుడు తెలుస్తుంది కదా! మన బుర్రే కాబట్టి నవ్వు వస్తుంది. అట్లా ఆరు పక్కలా కనిపించిందనుకోండి షణ్ముఖుడిలాగా, అంటే పైన, కింద, ఎదురు, వెనక, కుడి, ఎడమ మొత్తం ఆరు. ఆరు పక్కల నుండి మన గురించి మనకు పూర్తిగా కనిపిస్తుందన్నమాట.

అంటే ఎవరిని చూసినా మనమే చూసుకుంటున్నప్పుడు నవ్వుగా ఉంటుంది. అద్దంలో చూసి మనల్ని మనం ఎట్లా సంతోషిస్తామో అట్లా కృష్ణుడు అందరిలోనూ చూసి సంతోషిస్తుంటాడు. ఈ దుర్యోధనుడు, శకుని వీళ్ళని చూసినా కూడా లోపలి వాడితో జోడించుకుంటాడు. అదీ యోగం. కాబట్టి నివృత్తిలోనే ఉన్నాడు. నివృత్తి పేర్న ఏదీ కాదనలేదు. అదీ రాజయోగం! నివృత్తి పేర్న అన్ని వదిలేస్తారు చూశారా? వదిలేస్తే ఎక్కడికి పోతాయి? భావాల్లో ఉంటాయిగా. Special గా ఎక్కడికైనా వెళ్దామని మనం ఏకాకిగా ఒక చోటికి వెళ్లి అక్కడ ఏదో చేసుకుందామనుకుంటే చుట్టూ చెమటలు, fan ఉండదు, ఈగలు వాలుతుంటాయి, అటు ఇటు ఆకులు రాలి అందులోంచి బుసబుసమని చప్పుడు వస్తుంటే ఏమో పాము ఉందేమో అనిపిస్తుంది. ఏం జరుగుతుంది? ఏదో మన ఇంట్లో గదిలో తిరగక అనవసరంగా ఇంత దూరం వచ్చాం, time waste, petrol waste. ఆకలేస్తోంది. మంచినీళ్లు తాగుదాం అనిపిస్తుంది. దూరంగా ఉంటే ఇవన్నీ ఎక్కువ గుర్తొస్తాయి. ఇప్పుడు మంచినీళ్లు కావాలనుకుంటే ఎట్లా అనిపించింది అనుకోండి, కైలాసగిరి కొండ ఎక్కిన తర్వాత. ఇంట్లో అయితే అట్లా పరిస్థితి లేదు కదా. నివృత్తిలో ఉంటే ఎక్కడున్నా బాగానే ఉంటుంది. ప్రవృత్తి నీ చుట్టూ ఉండి నిన్ను ఏం చేసిందీ? జనకుడు అట్లా ఉంటాడు ప్రవృత్తిలో. కానీ నివృత్తాత్మ! యోగం చెంది ఆ మొత్తంతో ఉన్నదాంట్లో ఉన్నాడు తప్పా, మిగతా వాటిల్లో లేడు. ఆయన చుట్టూ ఎప్పుడూ అప్సరసల్లాంటి అందమైన స్త్రీలు ఉండేవారు, కృష్ణుడిలాగే. అందుకే కృష్ణుడు కూడా భగవద్గీతలో జనకుడి లాగా అంటాడు. ఆడవాళ్లన్న భావం ఆయనకు లేకపోతే, చుట్టూ ఆడవాళ్లు ఉంటే ఏమీ అపాయం లేదు. ఆయనకూ లేదు, వాళ్లకూ లేదు. ఇది ఆడది అన్న భావం లేదనుకోండి, చుట్టూ ఆడవాళ్లు ఉంటే ఏమవుతుంది? శుకుడికి అదే కదా అయ్యింది. నడచి వెళ్తుంటే వాళ్ళు స్నానం చేస్తున్నప్పుడు 'ఆడ' అన్న భావం లేదు. అందుకని వాళ్ళకీ ఆ భావం కలుగలేదు. హాయిగా స్నానం చేసుకున్నారు. అలాగే చుట్టూ సంపదలు ఉంటే ఇదంతా మనది కదా మనం enjoy చేయాలి కదా, ఇలా ఏం లేదు జనకుడికి. పడుకున్నప్పుడు ఇది పరుపు కదా ఇట్లా ఏం లేదు. సంపదలలో పూర్తిగా తాను నిమగ్నుడై వున్నట్లుగా ప్రపంచానికి కనిపిస్తున్నప్పటికీ, వాటియందు కాక అందులో వున్న తత్త్వముతో తాను యోగము చెంది ఉన్న వాడు జనకుడు. అందుకని

యోగులు గురించి చెప్పినప్పుడు జనకుడి గురించి చెప్తారు. ఎందుకని? ఈ తొమ్మిది ఆవరణలలో 8 ఆవరణలు ప్రకృతి. 'అష్ట ప్రకృతులు' అంటారు. తొమ్మిది 'మహా వెలుగు' అంటే 'మహా ప్రకృతి'. మహా ప్రకృతి యందు అనుసంధానం చెంది వున్న వాడు యోగము చెందినట్లన్నమాట. అక్కడి నుండి ఇంకా అవతలికి కూడా వెళ్ళిపోతుంటారు. దానిని 'సమాధి' అంటారు. తొమ్మిదిలో 'ధ్యానస్థితి', పది లోకి వెళ్తే 'సమాధి స్థితి'. అందుకని ఎనిమిదిగా ఉండేవాడు 'నేనున్నాను' అనే అహంకారంతో ఇతరములు ఉన్నాయని చూసేవాడు. అంతా నేను అనే మహా వెలుగే నిండి వున్నది, నాయందు కూడా అదే వున్నది అని తెలుసుకున్నవాడు దానితో అనుసంధానం చెంది ఉండడం చేత అదే తానుగా ఉంటాడు. ఇది మనం కొట్టాల్సిన goal, చేరవలసిన లక్ష్యం. సరే ఎప్పుడో చేరుతాం, తొందరేమీ లేదు. మనకు ఇంకా మిగతా వాటియందు రుచి కూడా వున్నది కనుక అవన్నీ పూర్తిచేసుకుని నెమ్మదిగా వెళతాం. అక్కడున్న వాడు వీటన్నిటిని మనం చూసినట్లుగా చూడడు. చూడనప్పుడు వాడు 'నివృత్తాత్మ' అవుతాడు. భగవత్తత్త్వం ఎప్పుడూ అదే. శ్రీకృష్ణుడు ప్రత్యేకించి అదే! రాముడలా కాదు. ఎందుకు కాదంటే రాముడు ఒక మానవుడిగా ఉంటే ఎట్లా ఉంటుందో చూపించడానికి వచ్చినవాడు. మానవ ధర్మాలు నేర్పడానికి వచ్చినవాడు. కృష్ణుడు అతిమానుషీ ధర్మం కాబట్టి అసలెప్పుడూ దిగలేదు. మెట్టు దిగలేదు. తొమ్మిది లోనే వుంటాడు. ఆయనే అమ్మవారు. అమ్మవారే కృష్ణుడు. అందుకనే ఎంత చెప్పినా ఈ కృష్ణుడి గురించి--. అర్జునుడికి తెలియదు. పక్కనే ఉంటాడు, మంచివాడు, అవసరానికి సహాయపడతాడు, మనకన్నా కొంచెం శుభ్రమైన ఆయుధాలు ఉన్నాయి, ఇంతవరకే తప్పా ఈయన మొత్తం విశ్వరూపం తెలియదు కదా! అందుకనే ఆయన అర్జునుడ్ని యుద్ధం ముందు ఒకసారి దుర్గ గురించి ధ్యానం చేయమంటాడు. దుర్గ అంటే ఈ మూడు శక్తులుగా ఏర్పడక ముందు ఉన్న వెలుగే! ధ్యానం చేస్తే ఆమె దర్శనం ఇస్తుంది. ఎందుకంటే అర్జునుడు చాలా సంయమం కలిగిన మనస్సు కలిగినవాడు. 'ఏరా అబ్బాయి' అంటే 'విజయం చేకూర్చు తల్లీ' అంటే 'నీ రథంలో నీ ముందు కూర్చున్నది నేనే! అతనికీ, నాకూ తేడా ఏమీ లేదు' అని చెప్తుంది. ఇట్లా డొంక తిరుగుడుగా చెప్పించుకోవలసి వస్తుంది కృష్ణుడు. 'నేనే' అంటే 'సర్లేవోయ్' అంటాడు కదా. ఒప్పుకోడాయె. ఇట్లా మనకు రోజూ పరిచయంగా ఉంటే ఏం

చేశాం మనం మాత్రం మాస్టర్ గారితో? సరదాగా hotelకి పోయి ఇడ్లీ తిందాం మాస్టారు, అట్లా మాట్లాడుకునే వాళ్ళం కదా! సినిమాకి వెళ్దామా, ఇడ్లీ తిందామా.. ఆ కానీ... ! ఇడ్లీ తిందామా అంటే ఇడ్లీ తిందాము, beach కు వెళ్లి మిరపకాయ బజ్జీలు తిందామా, అంటే వాళ్లతో కూడా వెళ్లి మిరపకాయ బజ్జీలు తిన్న మాస్టర్ గారు ఆయన. ఎవరూ ఉండరలా. రమ్మనండి ఎవరినైనా. ఇప్పుడు మనకు తెలిసిన వాళ్ళలో మాతో వచ్చి beach లో మిరపకాయ బజ్జీలు తింటారా, అంటే వస్తారా? చాలా కావాలి. కృష్ణుడు అట్లా శుభ్రంగా కంచంలో కలిపేసి, ముద్దలు చేసేసి, చుట్టూ అందరినీ కూర్చోబెట్టి, ముద్దలు విసురుకుంటూ ఉండేవాడు అదీ అతి సామాన్యులతో. సౌశీల్యము అంటే అదే! మనం దిగకుండా ఉంటే ప్రజ్ఞలో, పనిలో ఎంతవరకు వెళితే ఏంటి? మనకన్నా ఎటువంటి కొలబద్దతోనైనా బొత్తిగా సమము కాని వాళ్ళందరితో సమంగా ఉన్నవాడు సౌశీల్యుడు. నేను మాస్టర్ గారు, beach కి వెళ్లి మిరపకాయ బజ్జీలు తిన్న రోజులున్నాయి. కారంగా ఉంటుందేమో అనుకుంటే ఉత్త బజ్జీలు తిన్న రోజులున్నాయి. నేనే కాదు అలా చాలామంది తిన్నారు. అంటే ఆయన మిరపకాయ బజ్జీలు తిన్న మాస్టారా? కానీ ఆయన ఏం చేస్తారంటే అప్పుడు కూడా దానితోనే జోడించి ఉండేవారు. సిగరెట్లు కాల్చే వాళ్ళతో సిగరెట్లు కూడా కాల్చారాయన. ముట్టిద్దామా అంటే ఆ-- ముట్టించమన్నారు. ఈయన ముట్టిద్దామా? అనరు. వాళ్లు ముట్టిద్దామా అంటే ఊ-- అంటారు. సినిమాకి వెళ్దామన్న వాళ్ళతో సినిమాకి వెళ్లారు. Beach కి వెళ్దామంటే beach బీచ్ కి వెళ్లారు. కలిసి వంట చేశారు, కలిసి సామాన్లు మోశారు. మన బరువులు మోశారు. ఇవన్నీ చేయాలంటే ప్రావీణ్యత అంటే playful గా ఉండడం అనేది రావాలి. దిగితే అంటుకుంటుందేమో, మైల పడతారేమో అనుకున్న వాళ్ళు ఎవరు అట్లా దిగలేరు. అందుకనే కృష్ణుడు దిగి వస్తే మిగతా వాళ్ళకి అర్థం కాలేదు. అర్జునుడికీ అర్థం కాలేదు. అర్థం అవ్వకపోతే, ఒకసారి దుర్గా ప్రార్థన చెయ్యి, విజయం చేకూర్చాలంటే ఆమె చేకూర్చాలని, దుర్గమమైన విషయాలకు దుర్గను ప్రార్థించాలి. ఈ నామం కూడా ఇందులోనే వస్తుంది. నిజానికి ఈ శ్లోకంలోనే. 'దుర్గః' కదా. భీష్ముడికి తెలుసు, అర్జునుడికి తెలియదు. ధ్యానం చేస్తే ఆవిడ ప్రత్యక్షమై 'ఎవరు కూర్చుంటున్నావనుకుంటున్నావు నీ రథంలో? 'నీ రథాన్ని నడిపేటటువంటి వాడిగా ఉన్నవాడు నేనే. అతనికీ, నాకు ఏం

తేడా లేదు' అని చెప్తుంది. ఎందుకు చెప్పింది? 9వ ఆవరణ అయిన వెలుగు. అదే ఇది. దిగి వచ్చింది. దిగివచ్చినా అక్కడ నుండి స్థితి భేదం మాత్రం చెందలేదు. అవస్థితి చెందలేదు. మనం టప టప టప టపా అవస్థితులు చెందుతూ ఉంటాం. పూజ చేసినప్పుడు మొహం ఒక విధంగా ఉంటుంది, మళ్లీ తర్వాత ఇంకో రకంగా ఉంటుంది. రకరకాలుగా ఆవరణలట్లా గుమ్మాలు దాటేసి వెళ్ళిపోతూ బజార్లో ఉంటాం మనం. ఐదు నిమిషాల్లో విష్ణు సహస్రనామం class నుండి బయటికి వెళ్ళంగానే మనము బజార్లో ఉండగలం. సరాసరి వెళ్ళిపోతుంది ఏమిటి అసలు ద్వారాలన్నీ తెరవకుండానే తెరుచుకుపోతాయి. ఎవరు తెరిచారో తెలియదు, అట్లా టక టక టక టకా వెళ్ళిపోతుంది. ఇట్లా 8 ఆవరణలోకి వెళుతున్నా కూడా 9 గానే ఉంటే అప్పుడు నువ్వు నివృత్తాత్మండి. అదే మాస్టర్ గారు అనేవారు 'చేస్తే అది చెయ్యాలోయ్ లేకపోతే waste' అని. ఇంకేం చేసినా waste అనేవారాయన. మిగతావి ఓపిగ్గా ఉంటే చేసుకోండి తప్ప ఇది ఒక్కటి మాత్రం చేయాలనేవారు. అందుకనే అదే రాస్తారు భాగవతంలో, మొట్టమొదటిలోనే! నారదుడు పొందినటువంటి ఉపదేశం కూడా అదే. ఇది ఉంటే ఏది లేకపోయినా అన్నీ ఇందులోనే ఉండి ఉన్నాయి కాబట్టి మిగతావన్నీ ఇందుకోసం చేసేవే కాబట్టి, ఇది స్థిరపరచుకున్నావనుకో, నువ్వు రాజు లాగా బతకవచ్చు. ప్రపంచం నిన్నేమనుకుంటుందనే భయం నీకు అక్కరలేదు. ఏమైనా అనుకోనీ, నీకేంటి? అభిప్రాయమే కదా! ఒక గురువని, మహాత్ముడని భావిస్తూ ఉంటే GoldFlake cigarette తాగాలంటే చాలా దమ్ముండాలి. మంచి పండితుడు beach లో కనబడి ఈయన మిరపకాయ బజ్జీలు తింటుంటే చూశాడనుకోండి, ఏమనుకుంటాడు ఈయన గురించి? ఏమైనా అనుకోని మనకేమిటి అనుకుంటారు. వాడు అనుకోవడంతో మనకు సంబంధం ఏమిటని జీవించడం చాలా కష్టం. తనకు తానుగా తెలిసి, తాను అందరితో అందరిలాగా కలిసిపోయి ఉండడం అనేది కృష్ణుడు చూపించాడు. అట్లా చాలామంది ఉన్నారేమో మనకు తెలియదు, మన వరకు మాస్టర్ గారట్లా చూపించారు. అంత విపరీతంగా కలిసి పోవడం, అది మనకు ఉదాహరణ. మనం ఊరికే కలిసిపోతాం తప్ప అదుండదు. ఏది? అక్కడ ఉండి ఇక్కడ వరకు వ్యాపనం చెందడం తొమ్మిదిలో ఉండి ఎనిమిదిలోకి, ఏడులోకి, ఆరులోకి, ఐదులోకి, నాలుగులోకి, మూడు లోకి,

రెండులోకి, ఒకటిలోకి వచ్చేయలేం. ఎంత అద్భుతంగా ఉంటాయో తెలుసా మాస్టర్ గారు వ్రాసిన రచనలు. ఒక వాక్యంలో ఒక పదం కూడా మార్చలేము. అంత అద్భుతమైన విషయం ఆయన చెప్తూ ఉంటే ఈ లోపల phone వస్తుంది. Phone లో మళ్ళీ ఏవో అవతల వాడికి సంసారికమైన బాధలు. మాట్లాడి వాళ్లకు solution చెప్పేసి మళ్లీ అక్కడి నుంచి continue చేసేవారు. నేనా...నాకు phone వస్తే ఏదైనా చేస్తుంటే 'నా వాణి' కి చచ్చే చావు. వాడిని విసుక్కుని, వీడిని విసుక్కుని, ఎవరైనా వస్తే వారిని విసుక్కుని, మాఆవిడ అటు దిక్కులు చూస్తుంటే ఆవిడని కోప్పడి, ఇంత ఘర్షణ అయిపోతూ ఉంటుంది ఏదైనా మంచి తత్త్వం చెప్పాలంటే. అలాంటిది ఆయన ఎంతెంత తత్త్వాలు అలా అలవోకగా చెప్పేశారో! ఎందుకు చెప్పారంటే ఎప్పుడూ అందులోనే ఉంటారు గనక. మిగతావన్నీ చేస్తూ ఉంటాం. ఈ లోపల కింద నుండి ఈవిడ tiffin పట్టుకొచ్చినా, ఇంకొకళ్ళేదో ఆయనకిష్టమని తీసుకొచ్చినా, దాని గురించి కాసేపు మాట్లాడి, పెసరట్టు గురించి కూడా మాట్లాడి, తెచ్చిన పూరి, కూర గురించి మాట్లాడి మళ్లీ భాగవతం చెప్పాలంటే అయ్యే పని కాదు. అంత quick shift ఎక్కడి నుండి వస్తుంది? అక్కడే ఉండి ఇది ఊరికే దీనిలో వున్నట్లుగా వుండేవారు తప్పా ఎప్పుడూ అక్కడే వుండేవారు. అలా వుంటారు. ఇది అద్భుతమైనటువంటి నామం 'నివృత్తాత్మా'. చుట్టూ ఇన్ని పెట్టుకుని కలగూరగంపగా, ఈ గంపలో మనం మాత్రం దేనితోనూ, ఏ కప్పతోనూ కలవకుండా ఉండడమన్నమాట. కప్పలతో కలవకుండా, కప్ప రూపంలో ఉన్న ప్రజ్ఞతో కలసి ఉండడం.

## 805 దుర్జయః

అసలు మొత్తం అందులోంచే దిగి వచ్చిన వెలుగుగా తానున్నప్పుడు ఇంక వాడిని జయించేదేముంది? జయించడానికి ఇంకొకడుండాలి. కదా! ఇక తర్వాత అంతా ఎనిమిదేగా. 9 లో ఉన్న వాడికి అన్నీ ఎనిమిదే. పది. పదే తొమ్మిదయింది. పది యుద్ధానికి వచ్చేదేం లేదు. మాట్లాడేదేమీ లేదు. పలకరించడానికి కూడా ఏమీ లేదు. అది ఊరికే అయిపోయామని తర్వాత తెలియడం తప్పా, అయినప్పుడు కూడా అయ్యామని తెలియదు. మరీ మనం అసలు ఊహించలేని తత్త్వమది. కాబట్టి దానితో అసలు ఇబ్బంది లేదు. ఇటు పక్కకు వచ్చిన తర్వాతే కదా. తొమ్మిది నుండి ఎనిమిదిగా కొన్ని కోట్లు వచ్చేసినాయి బయటకు. వీళ్లు కదా జయించాలి, సాధించాలి, యత్నించాలి, పొందాలి ఇటువంటివన్నీ ఎనిమిది నుండి వుంటాయి. తొమ్మిదిలో లేవు. తొమ్మిదిగా వున్నాడనుకోండి, వాడినెవరు జయిస్తారు? అందరూ వాడిలోంచి వచ్చిన వాళ్లేగా. అందుకని ఎవరూ జయించలేరు. ప్రశ్నే లేదు. ఏం చేసినా జయించలేము. వశిష్ఠుడిని జయించడానికి విశ్వామిత్రుడు చేసిన ప్రయత్నం విశ్వప్రయత్నం. ఏమైంది? అర్థం కాలేదు విశ్వామిత్రుడికి. చూడడానికి ఇతడేమో చలిమిడి ముద్దల్లే ఉన్నాడు. మరి ఏ అస్త్రం వేసినా ఆ దండం పెడతాడు, అందులోకన్నీ ఇలా గుటకాయ స్వాహా లాగా వెళ్ళిపోతూ ఉంటాయి. వశిష్ఠుడి దండంలోకి ఈయన వేసిన దివ్యాస్త్రాలన్నీ కూడా, వినాయకుడు ఉండ్రాళ్ళు మింగినట్లుగా వెళ్లిపోతూంటాయి. ఏమవుతుందో తెలియట్లేదు. అంటే తొమ్మిది లో ఉన్నాడు. ప్రహ్లాదుడు మీద హిరణ్యకశిపుడు చూపించాడు కదా చాలా. ఎనిమిదిలో ఉన్న హిరణ్యకశిపుడు తొమ్మిది లో ఉన్న ప్రహ్లాదుడు మీద చూపించాడు మొత్తం అంతా. ఆ, కొట్టు అన్నాడు. ఎన్ని కొట్టాడు? ఎన్ని రకాలుగా చేసినా ఏమీ కాలేదు. అదీ తొమ్మిది! దుర్జయుడు. కృష్ణుడు కూడా మరి దానికి పూర్ణమైన స్వరూపం కాబట్టి ఎవరూ జయించే ప్రశ్నే లేదు. ఇది ఊరికే ఏదో local గా వాళ్ళూ వీళ్ళూ జయించలేకపోవడం కాదు. బ్రహ్మ లోకం నుండి యమలోకం వరకు సమస్త లోకాల్లో కూడా జయము సాధించిన ఏకైక అవతార తత్త్వమిది. ఇటు బ్రహ్మను దిద్దాడు, ఇంద్రుడిని దిద్దాడు, యముణ్ణి దిద్దాడు, వరుణుడ్ని దిద్దాడు. ఎన్ని చోట్లకెళ్ళాడు, ఎన్ని చోట్లకి వచ్చాడు, ఎవరాపగలిగారండీ. పోయిన పిల్లల్ని

ఒక బ్రాహ్మణుడికి పట్టుకొచ్చాడు, గురువు గారికీ పట్టుకొచ్చాడు. ఏవేవో లోకానికి వెళ్లి పట్టుకొచ్చాడు కదా, ఆపగలిగారా ఎవరైనా. దుర్జయత్వం గురించి కృష్ణుడి కథలన్నీ దుర్జయమే అంటే ఆయన చేసినవి ఇంకెవరూ చేయలేరు. దుర్జయుడు అంటే జయింప శక్యము కాని వాడు. ఎందుకు శక్యము కాని వాడంటే, జయించేవారు ఎవరు జయాన్ని కోరుతున్నారో వాళ్లంతా ఎనిమిదిలో ఉంటారు. అహంకారం ఉన్నప్పుడు జయించాలని కోరిక ఉంటుంది. అది రజోగుణం. శ్రీకృష్ణుడు దేనినీ జయించాలనుకోలేదు జీవితంలో. అవతలివాడు ఈయనను జయిద్దామని వచ్చినప్పుడల్లా కూడా జయించలేకపోయారు అదే దుర్జయత్వం. ఈయన జయించడం అనేది వీలు పడేది కాదు ఎందుకంటే తను జయించాలనుకోవట్లేదు కాబట్టి. అందుకని ఏదైనా జయించాలనే తత్త్వం ఉండే వాడు జయించ లేడు. అందుకనే జ్వాలాకూల్ గారు ఏం చెప్తారంటే 'Sense of being is more important than sense of accomplishment or achievement for a truth seeker'. ఉన్నది వెలుగు తత్త్వం. తొమ్మిది. వెలుగుగా ఉన్నది. జయిద్దామనుకునేసరికి నీ యందు అహంకారం ప్రవేశించడం వలన బలం తగ్గుతుంది. జయించాలనుకోక. జీవించాలనుకో. నువ్వు జీవిస్తూ ఉంటే, నీ చుట్టూ వైభవోపేతంగా చాలా ఏర్పడుతూ ఉంటే బయట వాళ్ళు అనుకుంటూ ఉండవచ్చు నువ్వు చాలా పొందావని. పొందలేదు. అందించారు. కృష్ణుడు ఏది తన దగ్గరకు వచ్చినా దానిని అప్పుడు ఆ సమయానికి అందుకోవడం తప్ప తనకై దాన్ని జయించాలి, చెయ్యాలి అనుకున్నదేమీ కనబడదు. అందుకని ఆయన జయించడానికి వచ్చిన వాళ్ళందరూ కూడా ఆయన్ని జయించలేకపోయారు. అది కారణంగానే మనం కూడా ఎవరినీ జయించాలని అనుకోవద్దు, అనుకుంటే, జయం కోరితే అపజయం దాని పక్కనే ఉంటుంది. నిన్ను జయించాలని ఎవరైనా అనుకున్నారనుకోండి, వాళ్లకుంటుంది వాళ్ళ పక్కన అపజయం. నువ్వు జయించనూ వద్దు. కాబట్టి ఆ జయించాలనే కోరికే లేదు కాబట్టి అపజయమనే సన్నివేశానికి అవకాశం కూడా ఇచ్చిన వాడివి కాదు. చేయవలసినది కర్తవ్యంగా చేస్తూ ఉండడమే తప్పా, జయించాలనే భావన రాజసికమైన భావనై మనల్ని ఎనిమిదిలో బాగా బంధిస్తుంది. అందుకనే కాలయవనుడు వచ్చి జయిద్దామనుకున్నా కూడా నవ్వుతూ యుద్ధం చేయకుండా జయించాడు. కృష్ణుడు ఎవరితోను

తనకై తానుగా యుద్ధం చేయలేదు. వాళ్ళు వచ్చి ముచ్చట పడితే చేసి పెట్టాడు. అదీ పద్ధతి. ఇదే principle మీకు Japan, China లలోని marshal arts లో కనిపిస్తుంది. మనకు ఒక సినిమాలో కూడా చూపించారు. ఒకడు చాలా బలవంతుడు. అందరినీ జయిస్తూ ఉంటాడు. కథానాయకుడ్ని కూడా జయించాలనుకుంటే వాడితో ఏమీ కుస్తీపట్టు పట్టడు. పట్టక నవ్వుతూ ఉంటాడు. వాడు పట్లు పడుతూ ఉంటే వీడు నవ్వుతూ ఉండడం వలన, వీడి energy system బాగా supple గా ఉండి జారిపోతుంటాడు వాడు. పట్టుకుంటూ ఉంటే వీడు జారిపోతూ ఉంటాడు. ఏం పట్టుకున్నా జారిపోతుంది. పాదరసాన్ని పట్టుకున్నట్లు అవుతుందన్నమాట. ఎందుకని? తనలో జయించాలనే భావం తీసేయడం చేత, తను ఈ విధంగా జయింపబడక జయించడానికి దుర్లభుడై ఉంటాడు. వాడు తిడతాడు, కోప్పడతాడు, రకరకాలుగా అంటాడు. ఎట్లాగో అట్లా వీడిలో ఉక్రోషం పెంచాలని. పెరగదు వాడికి. ఇందులో ఈ తత్త్వం చాలా ఉన్నది. ఎవరు జీవించడానికి ప్రయత్నిస్తారో ధర్మాన్ననుసరించి, కర్తవ్యాన్ననుసరించి... ధర్మం ఆశ్రమం ప్రకారం మారుతూ ఉంటుంది. రూపాయి బిళ్ళకి బొమ్మలు మారుతూ ఉండవచ్చు కానీ విలువ అదే ఉంటుంది. ముందు King George బొమ్మ ఉండేది. అక్కడ నుండి రకరకాల బొమ్మలు. మనకు మూడు సింహాల బొమ్మలు, గాంధీ గారి బొమ్మలు ఇవన్నీ వచ్చినాయి కదా. కానీ వెనకాల మాత్రం ఒక రూపాయి అనేది అట్లానే ఉంటుంది. అట్లాగే ధర్మం మారుతున్నా సత్యం మారదు. ధర్మం మారడమేమిటి? ధర్మం నువ్వున్న ఆశ్రమం ప్రకారం గృహస్థా? సన్యాసా? యువకుడా? బాలుడా? వృద్ధుడా? దీన్ని బట్టి ఉంటుంది. కాబట్టి నువ్వు ఉన్న స్థితి యందు ధర్మాన్ననుసరిస్తూ జీవిస్తూ వుంటే జయం వస్తూంటుంది. అందుకనే భాగవతుల కథలలో వాళ్లు జయించాలనుకోరు. భగవంతుని యందు ఉందామనుకుంటారు. భగవంతుడ్ని జయిద్దామని అనుకోరు, భగవంతుడ్ని సాధిద్దామనుకోరు. భగవంతుడ్ని పొందాలనే తాపత్రయం పెట్టుకున్న కొద్దీ వాడికి దూరమవుతూ ఉంటావు. భగవంతుడ్ని నువ్వు పొందడం కాదు, భగవంతునిచే పొందబడాలి. అందుకనే దుర్జయత్వం ఏం చెప్తుందంటే అతన్ని జయించే ప్రశ్న లేదు అని. నీవు కూడా తొమ్మిదిగా మారితే నిన్ను జయించే ప్రశ్న లేదు. ఎవరూ జయించలేరు. అదే మనకు భాగవతుల జీవితంలో తార్కాణంగా

కనిపిస్తూ వుంటుంది. నివృత్తాత్మ అవడం వలన నిన్ను జయించడం అనే ప్రశ్న రాదు.  సాధిద్దాం అనుకున్న చోట, సాధించకపోవడం అనే అవకాశం దాని పక్కనే ఉంటుంది, ఒక possibility! జీవిద్దాం అనుకుంటే ఏదీ లేదు, జీవిద్దామనుకుంటే ఎన్నో వైభవాలు నీకు అందుతూ ఉంటాయి. వాటియందు కాకుండా, వాటి యందుండే భగవంతుడి యందు రమిస్తూ ఉండడమే! అదీ పద్ధతి.

## 806 దురతిక్రమః

దాటి పోలేరు. భగవత్తత్త్వాన్ని దాటిపోదాం అని ఎప్పుడు ప్రయత్నం చేసినా దాటిపోలేరు. భగవత్తత్త్వం ధర్మ స్వరూపంగా ఉంటుంది సృష్టిలో. దాన్ని దాటి పోదాం అనుకున్నప్పడల్లా కొన్ని పీట ముడులు పడుతూ ఉంటాయి. ఆ ముళ్ళు విప్పకోవడానికి మళ్ళీ ధర్మాన్ని అనుసరించాలి. ధర్మాన్ని అనుసరించకుండా ముళ్ళు విప్పడానికి డొంక దారి పడితే ఇంకో నాలుగు ముళ్ళు పడతాయి. అట్లా ముడి మీద ముడి, ముడి మీద ముడి పడి చివరికి వివశుడైపోయి ఎవరు ఇప్పడు నాకు దిక్కు? అన్నప్పడు చూస్తే నెమ్మదిగా ధర్మం గోచరిస్తుంది. లేకపోతే ఒక సత్పురుషుడు వచ్చి ఇలా కాదు ఇలా ఉండు, అని దారి చూపిస్తాడు. అక్కడి నుండి నెమ్మదిగా ఇన్ని రోజులు ముళ్ళు వేసుకొచ్చావ్ కాబట్టి కొన్ని రోజుల time లో మళ్ళీ ముళ్ళన్నీ విడిపోతాయని చెప్తాడు. అందుకనే కృష్ణుడు ఎవరి ముళ్ళు వాళ్ళు వేసుకునేట్టుగా అట్లా వేచి ఉంటాడు. తనకై ఎవరికీ ముడి వేయక్కర్లేదు. ఎప్పడైతే ధర్మమునందు ఆసక్తి లేదో అప్పడు వాడు చక్కగా, తన తెలివినే తాను వినియోగించుకుని తనకు తాను బంధాలు వేసుకుంటూ ఉంటాడు. తెలివైన వాడిని, వాడి తెలివి చేతనే వాడిని పల్టీలు కొట్టిస్తాడు. ఈ మధ్య ఎంతోమంది పల్టీలు కొట్టలేదా మనకు share markets లో. కోట్లున్నవాడు ఇంకా కోట్లు సులభంగా వచ్చేస్తాయని పెట్టేస్తే, కోట్లన్నింటికీ తూట్లు పడిపోయి ఎన్నో బాధలు పడుతున్నారు. ఏమిటీ? తెలివి! దుర్బుద్ధి ఉండి తెలివి ఉంటే, తన తెలివి తనను బంధించే పద్ధతులలో నెమ్మదిగా పనిచేస్తుంది. తెలివి ఉన్నచోట సద్బుద్ధి ఉంటే, దాని వలన జ్ఞాన సంపన్నుడవడానికి వీలుంటుంది. Let virtue be the strength of my intelligence. తెలివికిని సద్గుణమ్ముల బలము గూర్చి. అందుకని తెలివి ఉండి దుర్బుద్ధి ఉంటే ఉద్దేశములలో తేడాలు ఉంటే ఆ తెలివి ద్వారానే వాళ్ళకు బంధాలు పడిపోతూ ఉంటాయి. అతిక్రమించి దుర్మార్గుడు ముందుకు పోవడానికి వీలుపడదు. అందుకనే హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు వీళ్ళందరూ దేవుడ్ని చూస్తామని ఇంకో route లో బయలుదేరారు. రావణుడు ధర్మాన్ని ఎంత అతిక్రమించాడూ? ఒక్కొక్క చోట, ఒక్కొక్క చోట ఒక్కొక్క ముడి పడిపోతూ వచ్చింది. శాపాలే ఆ ముడులు. కర్ణుడికట్లాగే

అయిపోయింది. అందుకని ఎవరికి తను దారి ఇస్తాడంటే ధర్మమును అనుసరించే వారికి దారి యిస్తాడు. సృష్టిలో ధర్మ స్వరూపుడుగా ఉంటాడు కాబట్టి. ధర్మాన్ని అనుసరించని వాడికి ముడులు పడుతూ ఉంటాయి. ధర్మాన్ననుసరించకుండా దైవాన్ని చేరుకునే మార్గం లేదు. అందుకని ఆ విధంగా ఎక్కడికక్కడ, ఎక్కడికక్కడ అట్లా హద్దులు పెట్టేస్తాడు. చదరంగం లాగానే ఉంటుంది, మొత్తమంతా కూడా. అందుకని నువ్వు చేసేటటువంటి పనులు ధర్మ సమ్మతంగా ఉన్నట్లయితే నీకు దారి వుంటుంది, లేకపోతే తలుపులు పడిపోతాయి. ఎవరూ వేయరు ప్రత్యేకించి. నీకే పడిపోతాయి. ఆ time కి ఆ బుద్ధి పుట్టి ఆ కాస్త వదిలేంతవరకు తోచనటువంటి వాళ్ళు ఎంతమంది ఉంటారు? అలా ఆరోగ్యం పాడు చేసుకునేవాళ్లు, అట్లా కీర్తి పాడు చేసుకునేవాళ్లు, అట్లా సంపద పాడు చేసుకునేవాళ్ళు. సత్పురుషుడికి సంపద పోయినా, కీర్తి పోయినా ఏమి పోయినా ధర్మాన్ని మాత్రం వదలడు. వాడు నలుడుంటే. నలుడి కథలో మనకు కనిపించేదది. ఏదైనా పోనీ, అది మాత్రం వదలడు. ఏది పోయినా అది మాత్రం వదలనటువంటి వాడే ధర్మరాజు! ఎట్టి పరిస్థితులలోనూ దాన్ని మాత్రం వదలకుండా ఉంటే, నీకు దారి సులభమవుతుంది. ఎప్పటికప్పుడు దాన్ని మనం అవకాశానికి, అప్పటికప్పుడు అది సులువుగా వుంది కాబట్టి దాన్ని అందుకోవడం మొదలుపెడితే, సులువు మార్గంలో ధర్మాన్ని అతిక్రమిస్తే అది దురతిక్రమః.

## 807, 808, 809, 810 దుర్లభః, దుర్గమః, దుర్గః, దురావాసః

ఆయన దొరకడు, దుర్లభుడు. దుర్లభుడెందుకయ్యా అంటే పొందుదాం అనుకునే వాళ్లకు దొరకడు.గోడ పెట్టినట్లు అన్నీ మన సమస్యలే మన చుట్టూ ఏర్పడిపోయి మనల్ని ఆపేస్తాయి. దుర్గముడు, దుర్గము అంటే కోటే. కోట పెట్టినట్లు! దాటలేనిది అని అర్థం దుర్గమంటే. దాటనివ్వనిది. నీ గమనం ఆపేస్తుంది, దుర్గ. ఎక్కడికక్కడ. దురావాసః అంటే ఒక పెద్ద వైకుంఠపాళి అనుకోండి. ఎందుకు పడతామో పాములో తెలియదు కదా! చక చక చకా మెట్లెక్కి వెళుతూ ఉంటే, నిచ్చెనెక్కి వెళుతూ ఉంటే అబ్బో ఉబ్బేస్తూ ఉంటుంది. అప్పుడు పాములో పడే number పడుతుంది కదా. ఎందుకు పడ్డావ్? ఏదో ఉంది. పరమపద సోపాన పటములోకెళ్ళే లోపల ఎన్ని తిప్పలు పడతాం? మొత్తం సృష్టి అంతా కూడా ఒక వైకుంఠపాళిగా పెట్టాడు. నిచ్చెన లెక్కామని సంతోషించక, పాముల్లో కూడా పడతాం. నిచ్చెనలు, పాములు అన్నీ puzzles. దురావాసమంటే ఒక puzzle అని అర్థం. ఆయనే ఒక puzzle. He can not be understood. అవగాహన చేసుకుందామనుకున్నవాళ్ళందరూ కూడా చేసుకోలేకపోయారు. అవగాహన పక్కన పెట్టి, ఆయనతో అనుసంధానం చెందుదాం అనుకున్నవాళ్లంతా చెందగలిగారు. విదురుడు, అక్రూరుడు అవగాహన చేసుకోవటానికి ప్రయత్నం చేసి చేసి చేసి, react అయిపోయి వెళ్ళిపోయారు. ఎందుకంటే అవగాహన చేసుకోవాలంటే మనం ఒక పద్ధతిగా ఆలోచించడం. మన పద్ధతి ప్రకారం ఆయన ఉండాలని ఎక్కడుంది? ఆయన పద్ధతి ప్రకారం మనముండాలి. పెద్దవాళ్ల పద్ధతి ప్రకారం చిన్న వాళ్ళుండాలా, చిన్న వాళ్ళ పద్ధతి ప్రకారం పెద్దవాళ్ళుండాలా? అందుకని మనకెప్పటికీ ఈ సృష్టి అర్థం కాదు, ఆయన అర్థం కాడు, ఆయన దొరకడు, దుర్లభుడు. దుర్లభుడెందుకయ్యా అంటే పొందుదాం అనుకునే వాళ్లకు దొరకడు. గుర్తుపెట్టుకోండి, భగవంతుడిని పొందాలని, ఆత్మసాక్షాత్కారం అని కూర్చుంటే అవ్వదు. దానికి సులువైన పద్ధతుంది. పొందబడాలనుకోవాలట. అతనిచే పొందబడాలనుకోవాలి తప్ప అతనిని పొందుదాం అనుకోకూడదు. తేడా ఉంది రెండింటికీ. అతనిని

పొందుదామనుకుంటే సత్యభామ లాగా అయిపోతాము. అతనిచే పొందబడాలనుకుంటే రుక్మిణి. చాలా తేడా ఉంది రెండింటికీ. కదా! మొత్తం నుండి గొట్టికాయ లాగా పుట్టినవాడు మొత్తాన్ని జేబులో ఎట్లా పెట్టుకోగలడు? పెట్టుకోలేడు కదా! ఎంతసేపూ మనం తొమ్మిది అయిపోవాలి తప్పా తొమ్మిదిని తెచ్చుకుని ఎనిమిది జేబులో పెట్టుకోలేడు. అందుకనే చాలామంది చిక్కులు పడుతూ ఉంటారు. దుర్లభుడు. పొందుదామని పొట్టలో పెట్టుకున్నవాడొకడు. ఏమిటయ్యా అంటే నా పొట్టలో నువ్వు ఉండిపో హాయిగా ఉంటుంది నాకు అంటాడు. నీకు! మిగతా వాళ్లకు? పొట్టలో ఉండడానికి ఆయనకెట్లా ఉంటుంది? దేవుడిని పొందాడు రావణుడు. ఉంచుకోగలిగాడా? పొందడం రాజసికం. పొందబడడం సాత్వికం. వాడిని మన ఇంట్లో కట్టేసుకోవాలి, మనం చెప్పినట్లు వాడు వినాలి. వాడిని మన ఇంట్లో పెట్టుకుని, మనం ఊళ్లో వాళ్ళందరి మీద పెత్తనం చెలాయించాలి అనుకున్నామనుకోండి. అదే కదా సత్యభామ అనుకుంది. ఆ ఇంటికీ ఈ ఇంటికీ పోతూ వుంటే అసలు ఏ ఇంటికీ పోకుండా ఎప్పుడూ మనతో ఉండడానికి ఒక వ్రతం చెప్పమని అడిగింది పాపం. ఎవరిని? అడగకూడని వాడిని అడిగింది ఆవిడ. సరే దీంతో ఈవిడ అస్వస్థత నుంచి బయటపడాలని చెప్పి ఆయన, అంటే రోగం కుదరాలంటామే మన భాషలో, అట్లా ఒక వ్రతం చెప్పాడు. 'ఏం లేదూ, ఆయనను ఆభరణాలతో తూచు' అని. ఆయనను పొందుదామని. ఇదొక రహస్యం సాధనలో. గుర్తుపెట్టుకోండి, భగవంతుడు భక్త సులభుడైనప్పటికీ కూడా దుర్లభుడు. ఎప్పుడు దుర్లభుడంటే ఆయన మన కోసం కావాలనుకుంటే దుర్లభుడు. ఆయన మన యందు ప్రసన్నత కలిగి ఉండాలి. ఆయన మన యందు ప్రసన్నత కలిగి ఉండాలంటే ఏం చేస్తే ఆయనకు ప్రసన్నత కలుగుతుందో అది చేయాలి. మరి లౌకికంగా ఆలోచించినా అదే సత్యం కదా! ఒక మనిషిని మనకు ఉన్ముఖుడిని చేసుకోవాలంటే ఏం చేయాలి? మన ఇష్టం వచ్చినది చేసి, వాడికి పెడితే వాడు ఉన్ముఖుడవుతాడా? వాడికి ఇష్టమైనవి చేసి మనం పెడితే వాడు ఉన్ముఖుడవుతాడు. అంతేనా? అందుకని ఇంత దుర్లభుడు కూడా సులభుడైపోతాడు భక్తులకు. ఎందుకంటే భక్తులు ఆయనకేది ఇష్టమైతే అది చేస్తూ ఉంటారు. చాలా పెద్ద రహస్యమది. పరమగురువులంతా కనబడితే బావుండు, మాట్లాడితే బాగుండు, అని అనుకుంటూ ఉంటాం. వాళ్ళ

'ఎందుకు కనపడాలి?' అని అడిగితే మన దగ్గర సమాధానం లేదు. ఆ-- ఊరికే. ఊరికే ఎందుకు కనపడాలి? కొంతమందికి తగుదునమ్మా అని వాళ్లే వెళ్లి కనపడుతూ ఉంటారు. అదేంటది? ఆయన ఎవరో తెలియక ముందే కనపడ్డారు సి వి వి గారు మాస్టర్ గారికి. ఇక్కడున్న గోడమీద ఉండే వాళ్ళందరూ, వాళ్ళంతటవాళ్ళు వచ్చి ఆయనకు కనబడ్డారండీ. ఎందుకని? వీళ్ళున్నారని కూడా తెలియదే. మనకున్నారని తెలిసి ఇంత మనం ఆరాధన పేర్న చేస్తుంటే, ఒక్కళ్ళు కూడా కనీసం మచ్చుకైనా కనిపించారా? ఏమిటి? చాలా దుర్లభుడు. ఎప్పుడు సులభుడు? ధర్మాన్ని నిర్వర్తించి, తనను తాను మరచి ఇతరుల యొక్క శ్రేయస్సు గురించి పరిపూర్ణంగా భావన చేస్తున్న వాళ్ళ దగ్గరికి రాక తప్పదు వాళ్లకి. అందుకని చెబుతూ వుంటా, మహాత్ములను మన దగ్గర రప్పించుకునే పద్ధతి ఒకటుంది. వాళ్ల చుట్టూ మనం తిరిగితే ఉపయోగం ఏమీ లేదు. మనం పరహితం బాగా పెంచుకుంటూ వెళ్ళామనుకోండి, లోక శ్రేయస్సు కోసం నువ్వు పని చేస్తూ ఉన్నావనుకో దేవుడే నీ దగ్గరకు రావాలి. లేకపోతే నిన్ను పిలిపించుకుంటాడు. ఆయన తపన పడాలి. భగవంతుడ్ని మన చుట్టూ తిప్పించుకుందాం అనే భావన ఒక పద్ధతి ఉంది. వాళ్లప్పుడు తిప్పించుకుందామని కాదు, వాళ్లు చేయడం వలన ఆయన సన్నిహితుడవుతాడు, ధన్యత చెందుతారు. వాళ్లే వెతుక్కుంటూ వస్తారు వీళ్ళ కోసం. అలా కాకుండా వాళ్ళ చుట్టూ మనం తిరుగుతూ వున్నామనుకోండి, అంతమేరకు మనకు కాలము వృథా అవ్వచ్చు. ఏమీ లేనప్పుడు తప్పకుండా వెళ్లి కలవాలి. మనకు సమయం అనుకూలంగా ఉన్నప్పుడు, వేరే కర్తవ్యాలు లేనప్పుడు, మహాత్ములను తప్పక దర్శించాలి. పుణ్యక్షేత్రాలు తప్పక దర్శించాలి. ఇవన్నీ తప్పవు. కానీ కేవలం వాళ్ల చుట్టూనే మనం అట్లా చొంగలు కార్చుకుంటూ తిరిగామనుకోండి, ఏం రాదు. ఎందుకని అంటే వాళ్ల లోంచి అది మన వరకు ప్రసరించాలంటే దానికి సంబంధించినది మనం ఏం చేశాం? అందుకని కృష్ణుడు కొంతమందికి ఎంత దుర్లభుడో, కొంతమందికి అంత సులభుడయ్యాడు. అక్రూరుడికి తెలిసినన్ని విషయాలు, విదురుడికి తెలిసినన్ని విషయాలు గోకులంలో ఎవరికీ తెలియవు. కానీ గోకులంలో వాళ్ళు చేసిన సమర్పణము, సమస్తమునందు భగవద్దర్శనము చేయడం, ఇటువంటి విషయంలో విదురుడు, అక్రూరుడు ఎందుకూ పోలరు. వాళ్లకేమో దుర్లభుడు, వీళ్ళకేమో

సులభుడు. వీళ్ళేమో ఏవేవో చెప్తారు. మనకు కూడా చూడండి. simpleగా ఉన్నవాళ్ళు చాలామంది మనకు కనిపిస్తారు. వాళ్లకి కలలో కనిపించి మాస్టర్ గారు మందులు చెప్పిన ఉదంతాలున్నాయి. మనకెందుకు కాదట్లా? అంటే మనం ఇంకా చేయాలిట. చేసుకుంటూ పోతూ ఉండడం ఒక్కటే పద్ధతి. అప్పుడు సులభుడవుతాడు. అది ఆపి ఇంకొకటి చేస్తూ ఉంటే అవ్వదు. గోడ పెట్టినట్లయిపోతుంది. భీష్మడికి కృష్ణుడు ఒక గోడ. పాపం చివరి వరకు అర్థం కాలేదు. ధృతరాష్ట్రుడికి అర్థం కాలే. ధృతరాష్ట్రుడు సామాన్యుడు కాడు. గాంధారికి అర్థం కాలేదు. మహాశివ భక్తురాలు. ఎందుకు అర్థం కాలేదు. అంటే 'నేనింత కదా, నన్నేమాత్రం గుర్తిస్తాడు' అని అనుకున్నామనుకోండి, నువ్వు ఎంతయితే ఏంటి? మొత్తంలో నువ్వు ఒక భాగం కదా! మొత్తం ముందు భాగం ఎదురు చూస్తూ, 'నన్ను గుర్తించు, నన్ను గుర్తించు' అంటే అవ్వదు. కావాలంటే మొత్తంలోకి ఇమిడిపో. దానికి సమర్పణ మంచి మార్గం. అట్లా ఆచరించుకుంటూ పో. ధర్మరాజును కాపాడ వలసిన అగత్యం కృష్ణుడికెందుకు పట్టింది? అర్జునుడికి మరీ గట్టిగా చెప్తాడు. ధర్మరాజుతో చెప్పి ఉండడా మాట. 'ఈ మూడు లోకాలలో ఎవరితోనూ నాకు ఏ obligations లేవు, గుర్తుపెట్టుకో' అని చెప్పాడు ఆయన రథంలో కూర్చుని. 'అయినప్పటికీ చేస్తున్నానంటే ధర్మం కోసం'అని చెప్తాడు. అట్లా ఆయన కరుణించడానికి కారణం వీళ్లు ధర్మంలో నడవడమే. అందరి శ్రేయస్సు కోసం పనిచేయడమే! అలా అయితే సులభుడవుతాడు, లేకపోతే దురావాసుడు. అసలు మొత్తం జీవితమే పెద్ద puzzle అయిపోతుంది. So it's a game of puzzles అన్నమాట. చెబితే అర్థం కాదుగా ఎవరికీనూ. ఎందుకర్థం కాదంటే ధర్మంలో నడవకపోవడం వలన అర్థం కాదు. కలియుగంలో అసలు బొత్తిగా అర్థం కాదు. 'నీకు ఎట్లాగూ అర్థం కాదు కాబట్టి నాకప్పచెప్పేసెయ్' అని కొంతమంది చెబుతారు. దమ్ముండాలి అట్లా అప్ప చెప్పెయ్యడానికి. కొంత అప్పచెప్తాం, కొంత సొంతంగా ఆలోచిస్తూ ఉంటాం. 'అసలీయనకు ఏమైనా తెలుసా మనల్ని ఇట్లా ముంచేస్తున్నాడా' అనిపిస్తుంది. అందుకని దుర్లభుడు. దురావాసుడు. దుర్గముడు. దురతిక్రముడు. దుర్గమే. మాస్టర్ గారు పురుషమేధము పుస్తకం వెనకాల వ్రాశారు కృష్ణుడి గురించి. ఆనాటికి, ఈనాటికి కూడా అర్థం కాలేదన్నారు. ఎందుకు అర్థం కాలేదంటే మరి గాంధారి లాంటి పాతివ్రత్యం ఉన్నవాళ్లకు అర్థం కావాలి, అవలేదు,

ధృతరాష్ట్రుడిలాంటి జ్ఞానికి అర్థం కావాలి. ధర్మరాజుకు యెంత ధర్మం తెలుసో, ధృతరాష్ట్రుడికంత ధర్మం తెలుసు. తేడా... ధర్మరాజు ఆచరించాడు, ధృతరాష్ట్రుడు తెలిసి ఊరుకున్నాడు. తెలుసు కదా అంటాడు. తెలిస్తే రక్షించడు, ఆచరిస్తేనే రక్షిస్తాడు. భీష్ముడు తెలుసుకున్నాడు, అప్పటికే కొంత paralysis వచ్చేసిందాయనకి. సరే కానీ లే ఇలా అయిపోయాం కదా, అని అంగీకరించి తన కర్తవ్యం తను నిర్వర్తించాడు. ద్రోణుడి స్థితి కూడా అంతే. మహా శివ భక్తుడు. తెలుసు. కర్ణుడికి తెలియదు. ఎన్ని తెలిసినా ఇది తెలియదు. శకునికి తెలియలేదు, అశ్వత్థామకు తెలియలేదు. సరే దుర్యోధనుడికి తెలియలేదనడం... అర్జునుడికే తెలియలేదు. అర్జునుడి కన్నా ద్రౌపదికి తెలుసు. ఎందుకంటే ఆవిడకి తెలుసు సమస్యలంటూ మనకు వస్తే ఈ ఐదుగురు మగవాళ్ళు మనకేమీ ఉపయోగపడరు అని. అందుకని ఆయన ఒకడున్నాడు కాబట్టి పరవాలేదనుకుని జీవించింది. ధర్మరాజుకు తెలుసు. గోకులంలో తెలుసు. హిమాలయాలలో వ్యాసుడు ఇత్యాది ఋషులకు తెలుసు. ఊళ్లో ఉండే జ్ఞానులకు తెలియదు. ఎందుకంటే మనకు తెలిసినట్టుగా కూడా వాళ్లకు తెలియకపోతే వాడేమిటని. అట్లా తెలియకుండా ఉంటాడు. తెలిసినట్లుంటాడు, తెలియనట్లుంటాడు. అందుకని తెలుసుకుందామనే ప్రయత్నం కాకుండా ఏం చేయాలంటే నన్ను-- ఎనిమిదిలోనో, ఏడులోనో, ఆరులోనో ఉంటాం కదా మనం——బాబ్బాబు, తొమ్మిదిలో కలుపుకో. నన్నందులో చేర్చుకో. నన్ను నీలో చేర్చుకో, అనుకోవాలట. నువ్వు నాలో వుండు, అనకూడదు. మనమతనిలో చేరితే అప్పటికప్పుడు automatic అంటామే, instinctly అంటామే, మనలో అతడుంటాడు. మనమతనిలో వున్నంత సేపు అతను మనలో ఉంటాడు. మనం అతనిలో ఉండడం అనేదే మనం చేసే ధ్యానం. అలా ఉన్న వాళ్లందరికీ ఈ ముందు చెప్పిన దుర్లభత్వం ఉండదు, దుర్గమత్వం ఉండదు. 'పంఘుం లంఘయతే గిరిం' అంటాం కదా, కుంటివాడు కొండ దూకేశాడుట. High jump లో. మామూలుగా మూడడుగులు కూడా దూకలేం భారతీయులం. కదా! 'మూకం కరోతి వాచలం' ఏమీ తెలియని వాడి నుండి జ్ఞానం పలికించేస్తాడు. ఎందుకని? వాడిలో ఉండడం చేత! బాగా పలుకుతున్నాడని అందరూ అంటే, మనమే పలుకుతున్నామనుకుంటే ఆ రోజు నుండి పలకదు. అట్లా ఉంటుందది. అర్జునుడికి బాణాలు పలకడం

ఈయనలో ఉన్నంత సేపే! ఆయన వెళ్లిపోయిన తర్వాత ఏ బాణమూ పలకలే. పూచిక పుల్లల కన్నా కనాకష్టమైపోయినాయి ఇన్ని బాణాలూనూ. అందుకని మనం కొంచెం ఆలోచించుకుని, మనం ఆయనలో ఉండడానికి ప్రయత్నం చేయాలి తప్పా, ఆయనని మనలో నింపుకుని, ఏదో మనం కట్టేసుకుని, అది పెట్టుకుని మన ప్రతిభ వెలిగించుకుని ఇట్లా చేద్దామనే ప్రయత్నాలు చేస్తే ఉన్నట్టుగా ఉంటాడు, ఉండడు. అదే కదా అర్జునుడికి జరుగుతుంది. బాణాలు వేసి శిశువుని రక్షిస్తాను, మరణం చెందకుండా, అని కృష్ణుడి పాదాలకు నమస్కారం చేసి వెళతాడు. ఆయన వున్నాడనుకుంటాడు వెంట. కానీ లేడు. ఎందుకని? అది నువ్వు ప్రయత్నం చేద్దాం అనుకున్నావు కదా, చేసి చూడు ఒకసారి అని. నేను పంపిస్తే నీకు అట్లా అయ్యుండేది కాదు, నీ అంతట నువ్వు వెళ్ళావన్నాడు. ఆరంభపరిత్యాగం చెయ్యవయ్యా, నాలో కూర్చోవయ్యా నేను చూసుకుంటాను అనే తత్త్వమది. అలా వున్నప్పుడు ఈ గోడలన్నీ దాటేస్తావు. అది ఎప్పుడైనా మనకు అడ్డుపడ్డదనుకోండి, ఎక్కడైనా, మనం చేయవలసినదొక్కటే. వాడిలోకి ఇంకొంచెం పెరగాలి. అంతే తప్ప, ఎందుకు ఇలా అడ్డుపడ్డది, నా అంతటివాడికి అడ్డుపడుతుందా, ఎన్నాళ్ళు చేశాము ఇట్లా మనకు కోపం వచ్చిందనుకోండి, ఇంకా పడిపోతాయి. మనకు అప్పుడప్పుడు విసుగు వస్తుంది కదా! ఏంటి ఇన్నాళ్లు ప్రార్థన చేశాం, ఏం జరిగిందనిపిస్తుంది. అట్లా అనుకోగానే ఏమైందంటే అంతకుముందే ఏదో అడ్డుంది, దీనివలన ఇంకొంచెం అడ్డొచ్చేస్తుంది. ఇంకో పెద్ద బండరాయి. అందుకని ఏం చేయాలంటే కష్టం సమయంలో ఎక్కువ వాడిలోకి వెళ్ళిపోతూ ఉండాలి. అప్పుడు 'దుర్గమ కార్య జగతకే జేతే'. ఇవన్నీ భక్తులు ఇట్లానే దాటారండీ, ఇంకొక పద్ధతి లేదు. ఎక్కడన్నా అడ్డు వచ్చింది, అక్కడ కూర్చుని మళ్లీ ఇంకొంచెం స్మరణ చేసుకోవడం, ఇంకొంచెం ఆయనలో జీవించడానికి ప్రయత్నం చేయడం. అప్పుడు దాటించేస్తాడు. అప్పుడు దుర్గమాలుండవు. దుర్లభాలుండవు. జీవితంలో ప్రతి చోట ఏదో ఒకటి అడ్డుపడిపోడడం, దానితో బాధపడిపోవడం, ఏలినాటి శని కదా అని ఏడేళ్లు settle అయిపోనక్కరలేదు. అట్లా ఉండకుండా ఇటు తిరగాలన్నమాట. ఇటు తిరిగితే సులభమవుతుంది.

## 811 దురారిహా

ధర్మ వ్యతిరిక్తమైన పనులు ఏమి జరుగుతున్నా, ఎవరి ద్వారా జరుగుతున్నా, వాటినన్నిటినీ హరించేటి వాడు. ఈ సృష్టిలో ఆ యంత్రం చాలా automatic గా పెట్టి ఉంచాడు. ఎక్కడ అధర్మం జరుగుతుందంటే అదంతా వెంటనే record అవుతుంది, నెమ్మదిగా దానిని చేసిన వాళ్ళని మింగేస్తాడు. వీడిక్కడుంటే మొత్తానికి చేటు కాబట్టి లోపలికి పుచ్చుకుపోతాడు. వాడూ వాడేగా! అందుకనే 'ఎవ్వరూ ఎక్కడికి పోరూ, మళ్లీ బయటకి వస్తారు' అంటాడు. అర్జునుడు అదే చూశాడు. ఒకేసారి చూసేశాడుట. కొంతమంది వెళ్ళిపోతున్నారుట, కొంతమంది వస్తున్నారుట. వెళ్ళిపోతున్న వాళ్ళు, వస్తున్న వాళ్ళకి ఈయనే కేంద్రం. కాబట్టి కొంతమంది సృష్టిలో సృష్టి కార్యానికి అడ్డుపడే వాళ్ళుగా ఉన్నారనుకో, వాళ్ళందరినీ అంటే ధర్మవ్యతిరిక్తంగా ఉన్న వాళ్ళందరినీ ఆయనలోకి పుచ్చుకుంటూ ఉంటాడు. ఎంత పెద్ద వారితో పెట్టుకుంటే అంత తొందరగా పుచ్చుకుంటాడు. కొంచెం ధర్మం, కొంచెం అధర్మం ఉన్నవాళ్ల యందు కొంత అధర్మం జరిగిందనుకోండి, వెంటనే 'ఏరీ మా గురువుగారు ఇంతవరకు వచ్చి రక్షించ లేదు, చెప్పారు కదా', అంటాం. వాగ్దానం చేశారు కనపడరు, time కి అనిపిస్తుంది. ఎందుకు కనపడరో తెలుసా... మనలో ఉండే కొన్ని, 'భృక్తం' అంటారాయన. అవి clear అవుతున్న కొద్దీ నువ్వు లేస్తావు. భృక్తం లేని వాళ్లను ముట్టుకోండి, చీరేస్తాడు. అందరం కాస్త మంచి, కాస్త చెడు చేసిన వాళ్ళము కాబట్టి ఏదో ఇంకొకడి నుండి మనకు అన్యాయం జరిగిందనుకోండి, వాడికి మనం అన్యాయం చేయకపోయి ఉండవచ్చు, కానీ ఇంకొక చోట ఎక్కడో చేసి ఉంటాం కాబట్టి ఆ account ఇక్కడి నుండి settle చేస్తాడు. మంచి accountant ఆయన. భలే వేస్తాడు adjustment entries. అక్కడి నుండి ఇక్కడికి, ఇక్కడి నుండి అక్కడికి. నీకది తగ్గిపోతుంది అంతవరకు. కర్మక్షాళణే అనుకోవాలి సాధకుడు తనకు వచ్చే కష్టము, నష్టము, బాధ, అసౌకర్యము, అనారోగ్యము. నాకెందుకు చేశావనే ప్రశ్న వేయడానికేమీ లేదు. అదే ఇటువంటివి లేని వాడికి ఎవరికైనా అధర్మమైన పని చేశారనుకోండి వెంటనే అప్పటికప్పుడు వచ్చేస్తుంది. అదీ ప్రహ్లాదుడి విషయంలోను, అంబరీషుడి విషయంలోను జరిగింది. అంబరీషుడికి,

ప్రహ్లాదుడికి జరిగినట్లు గజేంద్రుడికి ఎందుకు జరగలేదు? ప్రహ్లాద, అంబరీష, శుక, నారద ఇట్లా చెప్తాం కానీ గజేంద్ర అనం కదా. గజేంద్రుడు కుయ్యో, మొర్రో అని 1000 సంవత్సరాలు పోరాడాడు. అంటే అర్థమేమిటంటే మరి వీడు చేసినవి అట్లా ఉన్నాయి. ఒకటి చెప్పనా మాస్టర్ గారు చెప్పిన అద్భుతమైన విషయం. మరి నలుడు, ధర్మరాజు ఇటువంటి వాళ్ళందరూ 12 ఏళ్లు పడ్డారు కదా సార్ అంటే, ఆయన అన్నారు నవ్వుతూ, 'వాళ్లు చేసినవేవో ఉంటాయి అవి మనకు వ్రాయరు కదా!' అన్నారు. వాళ్లంతకు ముందు జన్మలో ఏం చేశారో అదంతా తెలియకపోవడం వల్ల నీ కట్లా అనిపిస్తుంది. జీవుడు పవిత్రాత్ముడు అవుతున్న కొద్దీ వాడిని ముట్టుకుంటే అంత కాలుతుంది. అగరొత్తి పుల్ల వెలుగుతున్నది ముట్టుకున్నామనుకోండి, సుర్రు మంటుంది, అది ఆరిపోతుంది. దీపమో? ఇంకొంచెం అంటుంది, అయినా ఆర్పేయగలం. అట్లాగే కొంతమంది దుష్టాత్ములు చిన్న చిన్న వాళ్ళు ఉంటారే, వాళ్లందరినీ టపక్కును అర్పేస్తూ ఉంటారు. ముట్టుకుంటే ఆరిపోతుంది. అగరొత్తి పుల్ల, అగ్గిపుల్ల ఆర్పేసినట్టు ఆర్పేస్తుంటారు. వాళ్లు నారాయణ అని వాడు అన్నాడు, ప్రహ్లాదుడూ అన్నాడు. ఇద్దరూ నారాయణ అన్నారు. అదేంటది. నాకు చిన్నప్పుడు యిది doubt వచ్చింది. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ని చంపలేకపోయాడు గాని ఎంతమంది చంపేశాడు నారాయణ అన్న వాళ్ళని? సినిమాలో కూడా పాపం వాళ్ళు 'నారాయణ నారాయణ' అంటూ ఉంటే కొట్టే వాళ్ళు కొట్టారు, తలకాయలు తీసేశారు, కాళ్లు తీసేశారు, రకరకాలుగా బాధలు పెట్టాశారు. నూనెలో మనం మామూలుగా బంగాళదుంపలు వేయించినట్లుగా వేయించేశారు కొంతమందిని. వాళ్లకేం కాలేదు. పోయారు. ఎక్కడికి? వాడిలోకి! ప్రహ్లాదుడికి మాత్రం ముట్టుకుంటే ఏం అవదే? మరి వాళ్ళు నారాయణ అన్నారు, ఇతడూ నారాయణ అన్నాడు కదా. ఏమిటి తేడా అంటే, నువ్వు ఈ నూనె దీపము ఆర్పిన దానికినూ, అదేదో ఆర్పడానికి plug లో వేలు పెట్టిన దానికి తేడా. Plug లో వేలు పెట్టి చూడు, నూనె దీపం మీద వేలు పెట్టి చూడు, తేడా చూసుకో. అట్లా ఉంటుంది కొంతమందితో పెట్టుకుంటే. మాతో పెట్టుకోకు అన్నట్లుగా వుంటుంది. కొంతమందితో పెట్టుకుంటూ ఉండవచ్చు. అప్పుడు వాడికి account clearance అవుతుంది, నీ account పెరుగుతూ వుంటుంది. అందుకని నలుడు, ధర్మరాజు వాళ్ళకి 12 ఏళ్లలో తెమిలిపోయింది. మనకు 12 జన్మలకి

తెమిలినా చాలా గొప్ప విషయమే కదా. అందుకని ఎవరైనా అన్యాయం చేస్తే కొంత పని జరిగిపోయిందని అనుకోవడం అనేది తెలివిట. మనం చచ్చినా అనుకోలేం. అనుకోక పోయి ఏం చేస్తాం ఏడవడం తప్ప. ఏదో పోయిందండీ, మొన్నే ఒకాయన వచ్చాడు పుట్టినరోజని, పాతిక లక్షల పోయినాయి సార్, ఈ రెండేళ్లలోనూ అని. 'నీ time బాలేదు అప్పలు గిప్పలు ఇవ్వబోకు, ఉన్నదేదో bank లో వేసుకుని వచ్చిన దాంతో సంతృప్తి పొందు' అంటే ఎవరినో యింకో రాజసికుడిని కలిశాడు. అట్లా పెట్టుకు కూర్చుంటావా పైగా వైశ్య కుటుంబంలో పుట్టావు, తప్పు కదా, అని చెప్పాడట. Bank లో పెట్టుకుంటే అది మగతనం అవుతుందా, వృద్ధులు, చేతకాని వాళ్లు పెట్టుకుంటారు bank లో అంటే తీసి ఇచ్చేశాడు. దబ దబ దబ పంచేశాడు, మూడు రూపాయలకు, నాలుగు రూపాయలకు, ఐదు రూపాయలకు. ఆ మూడు, నాలుగు, ఐదు కూడా రాలేదు, 25 లక్షలూ వెళ్ళిపోయింది. ఎక్కడో విన్నాడట, కర్మక్షాళణం అయిపోయిందని. కనీసం అది నమ్మి హాయిగా వున్నాడు. నమ్మబుద్ధి కాదు కదా! పాతిక లక్షల పోతే కర్మక్షాళణం అయిపోయిందని అనగలడా అండి. కష్టం కదా. అంతవరకు అదృష్టవంతుడే. అంటే పోయేది పోవాల్సిందిగా ఉండగా, పోకుండా దాచిపెట్టడానికి ఏమైనా సలహా ఇచ్చినా కనరు, వినరు, మూర్కొనరు అని మనకు మిత్రలాభంలో ఉంటుంది.

పోగాలము దాపురించిన వారు మిత్ర వాక్యమును వినరు,
అరుంధతీ నక్షత్రాన్ని కనరు, ధూప నిర్వాణ గంధమును మూర్కొనరు.

అంతే, అట్లా వెళ్ళిపోతుంటుంది. అందుకని మనకివన్నీ లేవేమో. ఇవన్నీ మనలో జరిగినవే, ఆత్మకథగా చెప్పకోవాల్సినవే, మనం బాగానే ఉన్నాం కదా ఇప్పుడు, మనకెందుకు బాధలు వస్తున్నాయి అని, ఇప్పుడు బాగున్నావని నువ్వు అనుకుంటున్నావు. పోనీ, నువ్వు అనుకుంటున్నదే సత్యమని అనుకుందాం. ఇదివరకు బాగున్నావో లేదో నీకు తెలియదు కదా. బాగుంటే రావు కదా. అదే కదా మాస్టర్ గారి సందేశం! 'నీకే ఎందుకు వచ్చింది రా' అని అనేవారు కదా. అందరూ చేశారని నేనూ చేపల చెరువు వ్యాపారం చేశాను మాస్టారు, నాకు పోయింది, అంటే మరి నీకే ఎందుకు పోతుందిరా, అని చెప్పేవారు. ఎందుకంటే చేపల చెరువు వద్దు నీకు, అని చెప్పాను, చేశావు, పోయింది. చేయకపోయినా పోయేదేమో, కానీ చేసి

పోవడం వల్ల అదృష్టవంతులు మాస్టర్ గారు అయ్యారు. పోయేవి పోతూ ఉంటాయి. పోతున్నప్పుడల్లా ఏదో చేశాం పోయింది, అనుకోవాలి. అది సత్త్వానికి దారి తీస్తుంది. లోపల నాకెందుకు ఇట్లా వచ్చింది? అని వస్తే అది రజస్సుకి దారి తీస్తుంది. రావణుడు భరించలేక పోయాడు. రావణుడు ఏదీ భరించలేడు. అంతకంతకీ అంతకంతకీ ఓడిపోయిన కొద్దీ పౌరుషం వచ్చేసి చివరికి శివుడిని కోప్పడతాడు. ఆఖర్న శివుడిని ఇంక రేపు వెళ్లి అవతారం చాలించే సందర్భం లో 'అర్థమయిపోయింది నువ్వు కూడా నా మీద పగ పట్టావని' అంటాడు. అదేమిటి ఆయన పగబట్టడమేమిటి? శివుడికి పగబట్టడం ఉంటుందా? ఇంత బుద్ధి ఏమైపోయిందో చూడండి. ఏమని? రాముడిని జయించాలని. ఎట్లా శివుడు సహకరిస్తాడు? ధర్మానికి వ్యతిరేకంగా పనిచేస్తూ ఉంటే సహకారం కావాలంటే ఎందుకు ఇస్తాడు. ఎప్పుడు ప్రత్యక్షమయ్యాడు? అతడికి ఈ రకాల కార్యాలు మొదలుపెట్టక ముందు ప్రత్యక్షమయ్యాడు. తరువాత అంతకంతకి అంతకంతకి అంతకంతకి అకార్యాలు చేశాడు కదా. అందుకని మనకంత సులభుడు అనుకోవద్దు. దుర్లభమే అనుకోవాలి. ఎంతవరకు సులభుడు అంటే ఎంతవరకు ధర్మమునందు నిలబడ్డామో అంతవరకు సులభుడు. ఎంతవరకు అధర్మము నందు ఇంకా ప్రవర్తిస్తామో అంతవరకు దుర్లభుడవుతాడు. పెద్ద puzzle. నువ్వే solve చేసుకోమంటాడు. ఎందుకంటే నీ దగ్గర solve చేసుకోవడానికి కావలసిన జ్ఞానం ఉన్నది. సంసిద్ధతే లేదు. సంసిద్ధత లేకపోవడం వలన ఏమైనా shortcutలు దొరుకుతాయేమోనని అక్కడా, ఇక్కడా మనం వెతుక్కుంటూ ఉంటాం. దానిని అంగీకరించి, అయిందేదో అయ్యింది, ఇది మనకు రాసిపెట్టి ఉంది అని సరిపెట్టుకుని ఇప్పుడు చేయవలసినది చేసుకుంటూ ఉండడమే! కుంతీదేవి అట్లా అంగీకరిస్తుంది. ధర్మరాజు అట్లా అంగీకరించాడు. ఎప్పుడూ question చేయలేదు. They never questioned the Lord. మనకెందుకు పుడుతుంది అంటే మనం మంచి వగరుగా ఉంటాం. ఇంకా పైన భక్తి అని పొర ఒకటి కప్పాం తప్పా, లోపల అంతా కూడా వేరే. అందుకని దుర్లభుడవుతాడు దుర్గముడవుతాడు, దురతిక్రముడు, దురావాసుడు అవుతాడు. అబ్బ ఏం జీవితమండి బాబు ఎందుకు పుట్టించాడో తెలియదు, అనిపించదూ? ఇంత చేయాలా అనిపిస్తుంది. ఇంత చేయాలా అంటే 'ఇంత చేస్తే బాగుంటుందని చేశాను,

నువ్వు పాడు చేసుకుని ఇంత చేయాలా అంటే నేనేం చేయను రా' అంటాడు. ఒక్కడే పిల్లవాడు. పెద్ద ఇల్లు కట్టించామనుకోండి, ఎందుకు కట్టించావు చాకిరీ సరిపోతున్నది నాకు అని అడిగితే? ఎట్లా వాడుకోవాలో తెలియదు. మానవ శరీరం కన్నా పెద్ద ఇల్లు ఏముంది? మామూలుగా ఏం చేస్తాడంటే చిన్న వాటితోనే కొట్టించేస్తాడు. దొంగతనం చేసే వాడింట్లో ఇంకొకడి చేత దొంగతనం చేయిస్తాడు. ఎవరినో నిలువునా కాల్చినంత బాధపెట్టిన వాడి ఇల్లు కాల్చేస్తాడు. ఈయన కాల్చడు. వాడింట్లో stove వెలిగించాడట కాలిపోయింది. ఇట్లా అంటారు గాని దేవుడు కాల్చేశాడని ఉండదు కదా. అందర్నీ కాల్చేసి ఎవరి చేత కాల్పబడని వారు కొంతమంది పుట్టుకొస్తారు, రావణ కుంభకర్ణులు, హిరణ్యాక్ష, హిరణ్యకశిపులు ఇత్యాదులు. మరి వాళ్లకు ఈ లోకంలో ఎవరూ ఏమీ చేయలేరు కాబట్టి అప్పుడు ఆయన వస్తాడు. కాబట్టి మామూలుగా మనకు stove కి చెయ్యి అంటుకుని కాలుతుంది చూశారా అది కూడా  చిన్న sundry account settlements. 'ఏవండీ ఎన్నిసార్లు phone చేసినా phone చేయరేమండీ మీకిష్టం లేదా' అన్నారనుకోండి, అది కూడా చాలు. అది కూడా కొంత. ఎవరో వాళ్ళిద్దరూ కూర్చుని ఆ కుమార్ గారికి పొగరు అనుకున్నారనుకోండి, అనుకుంటే మనకేమీ బాధ లేదు. అది విన్నవాడు ఒకడు వచ్చి నాకు చెప్తాడు, ఇట్లా అనుకుంటున్నారండి అంటాడు. అంటే అప్పుడు కొంత account clearance అవుతుంది. అప్పుడు మనం ఆవేశ పడిపోయి వాళ్ళిద్దరినీ పిలిచి పంచాయతీ పెట్టామనుకోండి, ఇంకొంచెం పెరుగుతుంది. కృష్ణుడి గురించి బోలెడు మంది బోలెడు అనుకుంటూ ఉండేవారు. మొహం మీదే అన్నారు చాలామంది. అన్నిటికీ నవ్వే! ఆ స్థితి మనకు కష్టం అనుకోండి కానీ పెంచుకోకుండా ఉండాలి. దురారిహా నామానికి అర్థమేమిటంటే చిన్నచిన్న accounts local గానే సరి చేస్తాడు. పొద్దున్న నువ్వు ఇంట్లో పెళ్ళాన్ని కోప్పడి వెళ్ళావు, మధ్యాహ్నం ఆవిడ కొంచెం వంట తగ్గించి పెట్టింది అనుకోండి. అడగడానికి లేదు. ఏమి ఇట్లా చేశావు ఉప్పు ఎక్కువ వేశావు ఇందులో అని. మామూలుగా ఉప్పెందుకు ఎక్కువ వేశావు అని అడుగుతాం. అడగడానికి లేదు. పొద్దున్న కోప్పడి పోతివి కదా, ఏమంటుందోనని భయం. అట్లా చిన్న చిన్న చిన్న దగ్గర నుండి పెద్ద పెద్ద వాటి వరకు కూడా నీకన్నా పైవాడి చేత నిన్ను కొట్టిస్తూ వుంటాడు. దేవతలకు తేడా పడితే రాక్షసుల చేత కొట్టిస్తాడు. రాక్షసులకు తేడా పడితే

కొట్టేవాళ్ళు ఎవరూ లేరు కదా, అందుకని ఆయన వచ్చి కొడతాడు. అదీ తమాషా! ఎలుకకు పిల్లి, పిల్లికి కుక్క. కుక్కకి ఇంకొకటి. ఒకదానికి, ఇంకో దానికి పెట్టేశాడు. దురారిహా. ఎక్కడ ఏది అతిక్రమించినా అక్కడ అది మింగేస్తుంది. ఎలుకలు ఎక్కువ తిరుగుతుంటే ఏం చేస్తావు? ఒకటి, రెండు పట్టించుకోవు. పది ఎలుకలు ఇంట్లో తిరుగుతూ ఉంటే, వెంటనే బజారుకు వెళ్లడం, బోను కొనుక్కు రావడం, లేకపోతే రెండు పిల్లుల్ని తెచ్చి ఇంట్లో పెంచడం ఇవన్నీ చేస్తామా? అంటే ఎక్కడ అతిక్రమించినా అక్కడికల్లా దానికొక workings ఉంటాయి. అందుకని నీకైనా, నాకైనా, ఎవరికైనా, బ్రహ్మకైనా తేడా పడితే జరిగేదదే. ఎవరైనా సరే ధర్మం రూపంలో శిక్షణ. భావమయంగా ఉంటే భావమయ లోకంలో కొడతాడు. భావాల్లో బాధపడే వాళ్ళు వుండరూ ఊరికే? ఉన్నది సరిపోతున్నా లేదే అని బాధపడరూ? ఇంకా లేదే అని వాళ్ళు బాధపడుతుండగా... ఉన్నవాడు కూడా ఇంకా లేదే అని బాధపడతూ వుంటాడు. ఏమి చేస్తాం? ఇదేంటయ్యా ఉంది కదయ్యా, లేదని బాధపడతావెందుకు, అంటే ఇంతే కదండీ, అంటాడు. అంటే ఎక్కడికక్కడ ఎక్కడికక్కడ తొమ్మిది ఆవరణలోనూ బాధలున్నాయి. ఎనిమిదవ ఆవరణలోనూ బాధలున్నాయి. ఈ అహంకార ప్రజ్ఞను తీసుకెళ్లి అందులో కలుపుకుంటే సమస్యలు పరిపూర్ణమవుతాయి. పరిపూర్ణమవ్వడం అంటే పరిష్కరింపబడతాయి. లేకపోతే ఇట్లా చేస్తూ ఉంటాడు. కాబట్టి సమావర్తుడు, సంసారం ఉన్నవాడు, మనవాడు. నివృత్తాత్మ. యతీంద్రుడు ఒకాయన మాస్టర్ గారి చిన్నప్పుడు ఆయన, ఈయన కలిసి పెరిగారు. ఆశ్రమం కూడా పెట్టుకున్నాడాయన. ఆశ్రమానికి ముముక్షువు ఇటువంటి పేర్లు కూడా పెట్టుకున్నాడు, బయటకు ప్రపంచానికి మేము చాలా ముక్తజీవులం అని తెలుపుకునేటట్టు. ఈయనేమో శుభ్రంగా పెళ్లి చేసుకున్నారు, పిల్లల్ని కన్నారు. వాళ్ళిద్దరూ అప్పుడప్పుడూ కలుస్తూ ఉండేవారు, ఒకసారి మా బోటి వాళ్ళను కూడా వాళ్ళిద్దరికీ 50 ఏళ్లు దాటిన తర్వాత కలిసినప్పుడు, అతనిని చూపించి మాస్టర్ గారన్నారూ 'వీడూ సన్యాసంలో ఉన్న సంసారి'. 'మరి నువ్వో?' అన్నాడాయన. 'నేనా? సంసారంలో వున్న సన్యాసిని రా' అన్నారు. సంసారంలో వున్న సన్యాసిలాగా అన్నమాట సమావర్తో నివృత్తాత్మా. దుర్జయః, దురతిక్రమః, దుర్లభః, దుర్గమః, దుర్గః, దురావాసః, దురారిహా. మనం ఉదాహరణలుగా ఎన్నైనా

చెప్పుకోవచ్చు. విషయం ఏమిటంటే ఇంత దుర్లభుడని చెప్తాడు, మళ్ళీ సులభుడని చెప్తారు. ఇంత దురతిక్రముడని చెప్తారు, మళ్లీ చేరుకోవచ్చని చెప్తారు. ఇంత దుర్గ అంటే కోటలాంటివాడని చెబుతారు, అట్లా విచ్చుకుని వెన్నపూసయిపోతాడు కొంతమంది ముందు. కొంతమందికి మొండి, జగమొండి, కొంతమందికి వెన్నపూస. అంటే నీ approach లో ఉంది. దానికి సంబంధించిన తాళం చెవి రెండో నామంలో ఉంది. నివృత్తాత్మ. అదే చేస్తాడు కదా బలి చక్రవర్తికి, మొత్తం పీకేసి. అతడు సంతోషించాడుట. అందరూ బాధపడ్డారు. మొత్తం దేవతలు, రాక్షసులు, బ్రాహ్మణులు చూస్తున్న వాళ్ళందరూ బాధపడ్డారు బలి చక్రవర్తిని తొక్కేస్తే. బలి చక్రవర్తి మాత్రం సంతోషించాడు. ఎందుకని? వీటన్నిటి నుండి పరిష్కారం వచ్చేసిందాయనకి. ఈ రాక్షస జాతి, వారి ప్రణాళికలు. ఎప్పుడూ దేవతలను తొక్కాలనే కదా! ఇంక ఆ schemes నుండి ఈయనను బయటికి లాగేశాడు. సుఖపడ్డాననుకున్నాడు. ఎవరూ అడగలేకపోయారు, ఎందుకిలా చేశావని? మూడు అడుగులు అడిగితే నీ మొత్తం తెలివి అంతా ఉపయోగించి లాగేస్తావా? న్యాయమేనా? అని అడుగుదామని ప్రహ్లాదుడికి కూడా అనిపించిందట. అంటే మనుమడు. చూశాడుట ప్రహ్లాదుడ్ని. నవ్వాడుట. ప్రహ్లాదుడు ఒక్క రవ్వ react అయ్యాడు. ఆయన నవ్వితే నవ్వుతాడు కదా మామూలుగా ప్రహ్లాదుడంతటివాడు. నవ్వలేదు ప్రహ్లాదుడు. అడగలేదు. ఎవ్వరూ అడగలేకపోయారట. అందరూ నిశ్చేష్టులైపోయారుట. అప్పుడు బలి భార్య అందట... 'నిష్కారణంగా తొక్కేశావే, ఏం చేశాడని తొక్కావు?' అని. 'ఎంతో పుణ్యం సంపాదించుకున్నాడు, వాడికి ఏది మంచో అది చేశాను, అందుకని తొక్కేశాను' అన్నాడు. శాశ్వత పదవి ఇచ్చాడు. ఇంక అవన్నీ పోయినాయి. పదవెందుకు, ఇంద్రుడికి బాధ తప్పా. ఇంకెక్కడున్నా 'నీ వారై చను వారలోనొకడినై' అని మనకు ఒక పద్యం ఉంది భాగవతంలో. వాళ్ల వాడైపోయాడు. తక్కువేం చేయలేదు. ఏ రాక్షసులకూ, ఎవరికీ దొరకనటువంటి పదవినిచ్చాను అన్నాడు. ఏమిటా పదవి? తన సాన్నిధ్యం! తొక్కిందెక్కడికి? మోకాల్లోకి. సుతలం అంటే... మానవ శరీరంలో 14 లోకాలు చూస్తే మూలాధారం నుండి పైకి సుతలం మోకాలు అవుతుంది. సుతలంలోకి తొక్కాడండి. తొక్కినప్పుడు ఎక్కడికి తొక్కితే ఏంటి? యముడెక్కడున్నాడు? వాళ్ళందరూ ఎంత హాయిగా ఉన్నారు?

ఎందుకున్నారు? విష్ణువు నందు ఉంటూ ఉంటారు. విష్ణువు వారి యందు ఉంటూ ఉంటాడు. ఆ స్థితి కలిగించాడు. ఇంక ఎక్కడుంటే ఏంటి? నాకు పదవి లేదే, నాకు పలుకుబడి లేదే, నన్నెవరూ గుర్తించట్లేదే, ఇవన్నీ దాటిపోయి, 'వాడిలో' ఉన్నటువంటి వాడు. ఆ విధంగా ఉన్నవాడికి ఈ నామాలన్నీ ఇంక ఏమి పని చేయవు. మిగతా వాళ్ళకన్నీ పనిచేస్తూ ఉంటాయి. అది భీష్ముడి యొక్క అవగాహన కృష్ణుడి గురించి. మనకు కొంత memorization, గుర్తు తెచ్చుకోవడం. అది ఆధారంగా జీవించడానికి ఒక రవ్వ స్ఫూర్తి వస్తుంది, పోతే పోతుంది, మళ్ళీ పట్టుకుంటాం. ఏదైనా ఒకటే చేయాలి, వాడిలో ఉండాలంతే! వాడిలో ఉండడం అంటే ఎట్లా ఉంటుందంటే... మనం యెక్కడ తిరుగుతున్న వాడిలోనే తిరుగుతున్నట్లు, మనం వుండడమే వాడిలో వున్నాం, మనం తిరగడమే వాడిలో తిరుగుతున్నాం, వాడెప్పుడూ మనల్ని వదిలి లేడు, మనం ఎప్పుడు వాడిని వదిలి లేము. అంటే మనం ఉండడం అంటే వాడు ఉండడమే. ఇదే ఉత్తమమైన వాక్యము. మొత్తం క్రీస్తు పలికిన బోధలన్నింటిలో కల్లా. We live, we move, we have our being in Him అని. We move in Him, we have our being in Him. అటువంటి వాళ్ళకి అంతా ఆయన యొక్క దివ్య కళ, ఆయన యొక్క దివ్య వైభవం. అలా కాకపోతే ఇంకో రకం గా రాదు. అందుకనే మాస్టర్ గారు కూడా శంఖారావంలో ఒక మాట రాశారు. 'నేనతడే' అని అనుకోవద్దు, 'అతడే నేనుగా కూడా ఉన్నాను' అని అనుకో అని. 'నేనతడే' అనుకుంటే నా పేరే అందరూ చెప్పకోవచ్చు కదా, మిగతా పేర్లెందుకు అంటాడు. అందుకే వాడు ఓం హిరణ్యకశిపాయ నమః అనుకోమంటాడు. ఎందుకని? అహం బ్రహ్మాస్మి. కాబట్టి ఇది కూడా అదే. కాబట్టి ఈ పేరు చెప్పకోండి అని. అది ఎనిమిది లో బాగా చుట్టేస్తుంది. 'అతడే నేను గా ఉన్నాను' అనుకుంటే నేనొక్కడిగానే ఉన్నాను అనిపిస్తుంది. 'అతడే నేను గా కూడా ఉన్నాను' అంటే అందరిలో కూడా అతనే ఉన్నాడు. ఇది భావన యందు బాగా స్థిరపడాలి.

## 812 శుభాంగః

శుభమైన అంగములు కలిగిన వాడు, అందమైన వాడు, ఆకర్షణీయమైన వాడు, ఆనందము కలిగించే వాడు, అనుభూతి కలిగించే వాడు, తన్మయత్వం కలిగించే వాడుగా భగవంతుడ్ని ఆరాధన చేసుకోవడం అనేది తూర్పు దేశాల యొక్క సాంప్రదాయం. ప్రత్యేకించి భారతీయ సాంప్రదాయం. పశ్చిమ దేశాలు వెళితే భగవంతుని యొక్క ఆరాధనకి ఏర్పరచుకున్న సంకేతములన్నీ కూడా ఇంత అందంగానూ, ఇంత ఆనందం ఇచ్చే వాటిగానూ, ఇంత ఆత్మానుభూతి కలిగించేట్టుగానూ ఉండవు. అది మన భారతీయమైన ప్రత్యేకత. ఎంత అందంగా మనం తీర్చిదిద్దుకుంటే అంత మనకి లోపల ఆత్మానందం కలుగుతూ ఉంటుంది. మనకి వరలక్ష్మీవ్రతం చేసుకుంటారు మన సాంప్రదాయంలో. అమ్మవారిని ఎంత అలంకరణ చేస్తారు! ఈ అలంకరణ దేనికి? గొప్పకా? కాదు. చేసే వారికి లోపల ఆనందం పెరగడానికి. పూజలు చేసుకునేప్పుడు మన శక్తి కొలది ఎంత అలంకారం అయినా సరే దేవతకో, దేవునికో చేసుకున్నట్లయితే అంత ఆకర్షణ లోపల, అంత కాంతి లోపల, అంత అందము అది కారణముగా అంత ఆనందము లోపల పెరుగుతుంది. చక్కగా అలంకరించుకుని పూజ చేసుకున్నప్పుడు మనం ఏ దేవతా మూర్తికి అయితే పూజ చేశామో ఆ మూర్తి పూజ చేసిన వాడికి అంత ఆనందాన్నిస్తుంది. కళలు అలా పెరుగుతూ ఉంటాయి. చూచి తను ఆనంద పడుతూ ఉంటాడు. అందుకని ఒకే మూర్తికి అనుస్యూతం, నిరంతరం ఆరాధన చేసుకునే పద్ధతి ఒకటి పెద్దలు మనకు ఇచ్చారు. ఆ మూర్తి ఎంత అందంగా ఉంటే అంత బావుంటుంది. ఎంత శుభమైన అంగములుగా నీవు ఆరాధన చేస్తే అంత బాగుంటుంది. అందుకనే నారదుడు సత్సాధకులకు కనబడి భగవంతుని యొక్క రూపాన్ని వర్ణించి ఇస్తాడు. ఇట్లా ఇట్లా ఉంటాడని భావన చేసుకో అని. ఎందుకని చేసుకోమన్నాడంటే త్వరితగతిని ఆత్మకు ఒక రకమైన తన్మయత్వం కలగడం, అనురక్తి కలగడం, శ్రద్ధాభక్తులు అప్రయత్నంగా ఏర్పడడం, అది కారణంగా భగవంతుని యందు యోగం చెందడము. 'యోగస్థః కురు కర్మాణి' అని మనకి భగవంతుడు చెప్తాడు. యోగం చెంది ఉన్నట్లయితే ఎన్ని పనులు అయినా చేసుకుంటూ ఉండవచ్చు, నశించి పోకుండా ఉంటాం,

కారణం ఏమిటంటే మూలంతో కలిసి ఉన్నాం. గుంజకు కట్టబడిన తాడుతో ఉన్న పశువు ఎక్కడెక్కడ ఏమేమి మేసి తిరిగి వచ్చినా మళ్ళీ గుంజ దగ్గరికి వచ్చి పడుకున్నట్లుగా మనం కూడా భగవంతునితో అటువంటి సూత్రమొకటి మన ఎరుకచేత ఏర్పరచుకోవాలి. ఉన్నది. సూత్రం లేకపోలేదు. ఉన్న సూత్రాన్ని గుర్తుపెట్టుకోవడం వలన దానితో అనుసంధానం చెంది జీవించవచ్చు. ఈ అనుసంధానం చెందడం కోసం భగవంతుడ్ని శుభాంగుడిగా భావన చేసుకోమన్నారు. అందుకనే మనకి అన్ని మూర్తుల్లోకెల్లా అత్యద్భుతము, అత్యాకర్షణీయము, అత్యంత మనోహరము, రమణీయము అయిన మూర్తి శ్రీకృష్ణుని మూర్తి కదా! కృష్ణుడి యొక్క అందం వర్ణనాతీతం. ఎందుకంటే మొత్తం లోకముల్లో ఉండే సమస్త సౌందర్యము రూపు కట్టుకుంటే ఎట్లా ఉంటుందో అది కృష్ణుడు. జగన్మోహనత్వం కలిగించేవాడు. ఆయన భావన, ఆయన దర్శనము ప్రపంచంలో జీవుడికి మిగతా విషయములయందు మైమరపు కలిగించే మూర్తి అది. అందుకని మీ ఓపిక ఎంత అందంగా చిత్రీకరించుకుంటారో. అమ్మవారిని కూడా అట్లాగే చిత్రీకరించుకోవచ్చు. మీరు ఏ దేవతను ప్రార్థిస్తున్నా అంత అందంగానూ సృష్టించుకోవచ్చు. ఇక్కడ శుభాంగుడనే పదం మనకి భీష్ముడు కృష్ణుడ్ని ఉద్దేశించి పలికినది. కృష్ణుడి అవయవముల యొక్క సౌందర్యము, మొత్తం సౌందర్యం అలా ఉంచి, అవయవముల యొక్క సౌందర్యం వివరంగా చూసినా సరే కాలిగోటి నుంచి తల ముంగురుల వరకు సమస్తమూ అద్భుతమైన అందంతో కూడి ఉంటుంది. కనులు- చెప్పనే అక్కర్లేదు. ఆ విధమైన భావన మనలో బాగా పెంచుకుంటున్న కొద్దీ మనకి అనురక్తి పెరుగుతుంది. ఎందుకంటే నిరాకారుడు అయిన భగవంతుని యొక్క ధ్యానం కొంత కష్టమైన విషయం. అనురక్తి కలగడం కష్టం. ఆసక్తి కలగడం కష్టం. రుచి కలగడం కష్టం. బాగా ముందు ముందు దశలలో బాగా సాధన పరిపక్వత చెందిన సందర్భంలో, తాను ఆ మూర్తి యందు లయమైపోయిన సందర్భంలో, నిరాకారుడైన భగవంతుని యొక్క అనుభూతి కూడా మనకి దక్కడానికి అవకాశం ఉంది. అంతవరకు ఏదో ఒక మూర్తిని మన హృదయముల యందు, భ్రూమధ్యమునందు చిత్రీకరించుకుని భావన చెయ్యాలి. ఆ విధంగా చిత్రీకరించుకోవడం కోసం బయట ఒక అత్యద్భుతమైన మూర్తిని ఎన్నుకుని ధ్యానం చెయ్యాలి. 'ప్రసన్న వదనం ధ్యాయేత్' అంటారు.

ఎంచుకున్న దేవత యొక్క ముఖము చాలా ప్రసన్నంగా ఉండాలి. క్రౌర్యము, ఉగ్రము అయిన మూర్తిని ధ్యానం చేస్తే మనకి వాటికి సంబంధించిన భావములు మనలో మేల్కొంటాయి. మనలోలేకపోలేదు ఉన్నాయి. అన్నీ ఉన్నాయి కదా! సృష్టిలో ఏవైతే ఉన్నాయో అవన్నీ మానవ శరీరంలో ఉన్నాయి కాబట్టి సృష్టి మొత్తం, మానవుడు ఈ రెండు ఒకదానికొకటి కలిసొస్తే, అది బ్రహ్మాండం అయితే ఇది పిండాండం కింద గోచరిస్తుంది. ఇందులో లేనిది లేదు. సమస్త గ్రహములూ ఉన్నాయి. సమస్త రాశులూ ఉన్నాయి. ద్వాదశ భావములూ ఉన్నాయి. ద్వాదశ రాశులూ ఉన్నాయి. నవగ్రహములూ ఉన్నాయి. సూర్యుడు ఉన్నాడు. సవితృదేవత ఉన్నది. వీటన్నిటికీ మూలమైన వెలుగు సమస్తము ఇందులో ఉన్నది. కాబట్టి మనలో భగవంతుని యొక్క ఆరాధన ఈ విధంగా చేసుకుంటే త్వరితగతిని భగవంతునితో యోగము చెందడానికి అవకాశము ఉన్నది. అదే ధృవునికి బోధిస్తాడు నారదుడు. నారాయణుని యొక్క తపస్సు చేయడానికి బయలుదేరిన ధృవుడికి ఎట్లా చేసుకోవాలో తెలియదు. వాళ్ళ పినతల్లి సురుచి 'నీవు నీ తండ్రి తొడల మీద కూర్చోవాల్సిన అర్హత నీకు కలగాలంటే నారాయణుని స్మరించు' అంటుంది. చెప్పడం అసూయతో చెప్పినట్టుగా కనిపించినా కథలో, ఇచ్చిన సందేశం పరమ పవిత్రమైన ఉపదేశం. అందుకని తల్లి అయిన సునీతి ఏం చెప్తుంది అంటే 'నీ పినతల్లి చెప్పిన విషయం సత్యమైనది, ఆమె ఏ ఉద్దేశ్యంతో చెప్పిందనే దానితో సంబంధం లేకుండా, ఏమి చెప్పిందనే దాంట్లో మనం గనక సందేశం తీసుకున్నట్లయితే, నారాయణుని యొక్క ధ్యానము నువ్వు చేసుకున్నట్లయితే నీకు చక్కని స్థితిగతులు ఏర్పడతాయి' అని చెప్పి పంపిస్తుంది. పంపిస్తే ఎట్లా చేసుకోవాలి నారాయణుని యొక్క తపస్సు? మంత్రం ఏమిటి? రూపం ఏమిటి? విధానమేమిటి? ఈ మూడు కలపాలి. మంత్రం ఒకటుండాలి. రూపం-అదే యంత్రం. యంత్రం ఒకటుండాలి. మనకి విష్ణుస్వరూపంగా, చతుర్భుజుడుగా, శంఖచక్రాలు ఆయుధములు, కమలము ధరించిన వాడిగా, మెడలో వైజయంతి మాల ధరించిన వాడిగా, ఆభరణములు ధరించిన వాడుగా, శ్రీవత్సం అనే పుట్టుమచ్చ ఉన్న వాడిగా, తామర రేకులు వంటి కన్నులు ఉన్నవాడిగా ఇట్లా వర్ణించి ఇచ్చినది ఒక యంత్రం భక్తి మార్గంలో. మంత్రం- నారదుడు ధృవునకు అందించినది వాసుదేవ మంత్రం.'ఓం నమో భగవతే

వాసుదేవాయ'! మంత్రాన్ని ఇస్తాడు. విధానం ఏం చెప్తాడంటే భగవంతుని యొక్క మూర్తిని ముందు తన యందు దర్శనం చేయమంటాడు. ఏదీ? మణిమయమైన కిరీటం ధరించిన వాడిగా, అష్టమిచంద్రుని వలె ఉన్న ఫాలభాగము కలిగిన వాడిగా, 'అష్టమీ చంద్ర విభ్రాజ' అని చెప్తారు కదా! మనకి కూడా మనుషుల యొక్క నుదుర్లు విశాలమై అర్ధచంద్రాకారంగా ఉంటే చాలా అదృష్టవంతుడని చెప్తారు. రకరకాలుగా ఉంటాయి. కాంతులు వెదజల్లుతున్న కన్నులు, పూర్తిగా విచ్చుకున్న కమలముల వలె ఉన్న కన్నులు, నల్లటి గుడ్లు, కనుల నుండే మందహాసము, కాంతి వెదజల్లుతున్నట్లుగా భావన చెయ్యమన్నాడు. సంపెంగ వంటి ముక్కు ఉన్నట్టుగా, మరీ పొడుగు ముక్కు కాదు, పొట్టి ముక్కు కాదు, వంకర ముక్కు అసలే కాదు, కోమలమైన ముక్కు. దొండపండు వంటి పెదవులు, పెదవులు తెరిస్తే లోపల దానిమ్మ గింజల వంటి పలువరుస, అంటే కాంతివంతంగా ఉంటాయి, కొంచెం ఎరుపుకాంతి ఉంటుంది. చక్కటి తాంబూలం వేసుకున్నట్టుగా. తాంబూలం వేసుకున్న పలువరుస, అందుచేత ఎర్రనైన పెదవులు, కొద్దిగా ఎర్రని కాంతి, సహజముగా తెల్లనివిగా ఉన్న దంతములు ఉన్నట్లు. చక్కటి శంఖము వలె అందముగా ఉన్న చెవులు. కాంతులు వెదజల్లుతున్న బుగ్గలు, అలాగే చుబుకము. విశాలమైన ఫాలభాగము మీద తిరుచూర్ణము. అంటే మాస్టారు పెట్టుకున్న బొట్టు లాంటిది అన్నమాట. మొహం చుట్టూ అట్లా లతల వలె వేలాడుతున్నట్లుగా ముంగురులు. అవి సన్నని గాలికి అల్లల్లాడుతున్నట్టువిగా భావన. అక్కడ నుంచి మెడ. మెడ మీద మూడు రేఖలు చూడమంటారు. మెడ నుండి ధరించిన ఆభరణములు, వైజయంతి అనే మాల. చక్కని గుండ్రని అయినవి, పుష్టితో కూడిన భుజములు. భుజములకు భుజకీర్తులు అంటే వంకీలన్నమాట. అక్కడి నుండి ముందు కుడి చేయి చూడాలి. ఆ కుడిచేయిలో చక్రాన్ని ధరించిన భావన. ఎడమ చేయి శంఖాన్ని ధరించిన భావన. ఈ వంకీ కాకుండా మళ్ళీ మణికట్టు దగ్గర కూడా ఆభరణములు ఉన్న భావన. వేళ్ళకు ఉంగరములు ఉన్న భావన. వేళ్ళు చాలా సౌకుమార్యంగా ఉన్న భావన. వేలి గోళ్ళు గులాబీ రంగులో బాగా మెరుస్తున్న భావన. చేతిలో అటుపక్క చక్రము చాలా వేగముతో తిరుగుతున్నట్లుగా భావన. ఆ వేగము లోంచి వెలుగు పుడుతున్న భావన. అలాగే దక్షిణావర్తము అయిన శంఖమును చూసిన భావన. శంఖము కొంత cream colour/

గోధుమరంగు అంటాం కదా, అదీ, తెలుపు మిళితమైన రంగులో ఉన్న శంఖమును ధరించిన భావన. ఆ శంఖం నుండి నాదము వింటున్న భావన. అలాగే వక్షస్థలము. వక్షస్థలమునందు పుట్టుమచ్చ. వక్షస్థలము నీలపు కాంతులుగా శరీరం వెదజల్లుతున్నట్లు. ఎక్కువ భాగము పూవులతో అలంకరింపబడినట్లు, ఆభరణములతో అలంకరింపబడినట్లు. ఆ తరువాత కటిస్థలము-నడుము. నడుము దగ్గర వడ్డాణం. అక్కడ నుండి కిందకి పచ్చని పీతాంబరము. మళ్ళీ కుడి పక్కన ఉన్న కింద చేతిలో గద, గద యొక్క బంగారపు రంగు కాంతులు, అలాగే ఎడమ చేయి, ఎడమ చేయిలో కోమలమైన పద్మము, విచ్చుకుని విచ్చుకోనట్లుగా ఉన్నట్టు- మనం అన్నమాట. పూర్తిగా విచ్చుకోలేదు, అలా అని ముడుచుకోలేదు. ఎందుకంటే ఆయన భావన చేస్తున్నాం కాబట్టి. మన్ని కూడా పట్టుకుని ఉన్నాడు అని భావన. పాదములు, తొడలు, పిక్కలు, మోకాళ్ళు, చీలమండలు, పాదములు రెండూ కూడా నిట్టనిలువుగా నిలబడి ఉన్నట్లు. మీరు ఎప్పుడైనా తిరుపతి వెళితే ఈసారి నిజపాదదర్శనం అని ఉంటుంది. అది చూడండి. మనం మామూలుగా నిలబడితే పాదాలు కాస్త ఒకదానికొకటి విముఖంగా పెడతాం. మనం భావన చేసే దైవం యొక్క పాదములు రెండూ ఒకదాని పక్కన ఒకటి నిట్టనిలువుగా మనల్ని చూస్తున్నట్టు, వాటియొక్క కాలిగోళ్ళను చూసి వాటిని స్పర్శ చేస్తున్నట్టు భావన. వాటికి పూజ చేస్తున్నట్టు భావన. వాటికి మనం పసుపు రాసుకోవచ్చు, చందనం పెట్టుకోవచ్చు, కుంకం బొట్లు పెట్టుకోవచ్చు, పారాణి పెట్టచ్చు, పూవులు వేయచ్చు, కడగచ్చు అన్నీ అక్కడ చేసుకోవాలి మొహం మీద నీళ్ళు చల్లకుండా. అభిషేకం అని మొహం మీద నీళ్ళు చల్లకుండా, భగవంతుని యొక్క ఆరాధన అంతా కూడా పాదములకే చేయాలి. ఇంకేం ముట్టుకోకూడదు మనం. అంటే భక్తిలో ఇవన్నీ భాగంగా చెప్తారు.  మనం ముందు ఆవాహన చేశాం. భగవంతుడు వచ్చి కూర్చున్నాడు. ఆయన పాదములకే అన్ని సేవలు. ఆయన పాదాలనే కడగాలి. నీరందిస్తున్నప్పుడు ఎక్కడ నుండో చెయ్యి మాత్రం అందుతున్నట్టు భావన. నిజానికి అట్లా కనిపిస్తుందని మరువు మహర్షి చెప్తాడు. 'మహాత్ములు నీకు ఒక్కసారి దర్శనం ఇస్తే గుండె పేలి చచ్చిపోతావు నువ్వు, అందుకని ఏం చేస్తాం అంటే మేము, ఏదో అట్లా చేయి కనిపిస్తుందిట', అప్పటికే మనకి ఒళ్ళంతా జిగేల్ మంటుంది. 'ఇంకోసారి రెండు చేతులు కనిపిస్తాయిట, ఆ

తరువాత ఉత్త కాళ్ళు కనిపిస్తాయిట. ఆ తరువాత నెమ్మదిగా మొండెం కనిపిస్తుందిట. క్రమశః మనలో వెలుగుని absorb చేసుకోవడం అంటామే, అంటే ఆకళింపు చేసుకోగలిగిన శక్తి ఏర్పడినప్పుడు మాత్రమే పూర్ణదర్శనం మహాత్ములు ఇస్తారుట'. మరి భగవంతుని సంగతో? అందుకని ఆయన పాదములకే అన్ని సేవలు, అంటే 16 ఉపచారములూనూ. బట్టలు అందిస్తుంటే చేతికి అందించినట్టు. మనం కట్టక్కర్లా ఆయనకి. యజ్ఞోపవీతం-చేతికి అందిస్తాం. మనం ఇచ్చే పుష్పములు పాదముల మీద వేస్తాం. అగరొత్తులు కూడా పాదములకే చూపిస్తాం. నెమ్మదిగా పాదముల నుండి పైవరకు ఏ స్తోత్రమో చేస్తున్నప్పుడు భావన చేసుకుంటూ వస్తాం. ఇట్లా భగవంతుని యొక్క రూపము మానవాకారముగా ద్వాదశ భావములు, ద్వాదశాంగములుగా భావన చేసేట్టుగా ఒక ఆరాధన. ఇట్లా ఆరాధన చేస్తుంటే నీకు నీలోపల ఉన్న ఆ తత్త్వముతో సరి అయిన అనుసంధానం ఏర్పడుతుంది. ఈ విధంగా ఆరాధన చేసుకునే వాళ్ళకి మళ్ళీ మళ్ళీ చేసుకుందాం అనిపిస్తుంది. ఇది బయట చేసే ఆరాధనకి ప్రతీకగా ఉంటుంది. అంతర్ముఖంగా ఈ విధంగా చేసుకుంటే రుచి పెరుగుతుంది. లోపల కాంతులు పెరగాలి. లోపల ఆ విధంగా కాంతులు పెంచుకుంటూ, ఆనందంగా ఆయనతో అనురక్తి చెందడానికి, ఆ విధంగా భగవంతుని భావన చేసుకోవడం అనేది ఈ నామంలో మనకు గోచరిస్తుంది. శుభాంగుడు. మన లోపల ఆయన యొక్క దర్శనం ఎంత కాంతివంతంగా జరుగుతుందో, మన యందు కూడా అంత మేరకు కాంతి పెరుగుతూ ఉంటుంది. కళ పెరుగుతూ ఉంటుంది. పవిత్రత పెరుగుతూ ఉంటుంది. శుచిత్వం పెరుగుతూ ఉంటుంది. ఈ విధంగా శుభాంగుడు అనే భగవంతుడ్ని ధ్యానం చేయాలి. పాశ్చాత్య దేశాల్లో శిలువ వేసిన దేవుడ్ని ప్రార్థన చేసుకుని, తద్వారా రకరకములయిన విభూతులను కోల్పోయారు. జ్వాలాకూల్ మహర్షి ఓ మాట చెప్తారు. 'చాలా దురదృష్టం, ఏసుక్రీస్తు ఎంత అందమైనవాడంటే--. చెప్పలేనంత అందం ఆయనది. ఆయన నడుస్తూ ఉంటే రోడ్డుమీద, భ్రూమధ్యంలో ఒక తెల్లటి మొగ్గవలె కాంతి ఏర్పడి, అదేదో చుట్టుపక్కల ఉండే చీకట్లను పారద్రోలుతున్నట్లుగా ఉండేదిట. ఆశ్చర్యం గొలుపేట్లుగా ఒక చిన్న మొగ్గవలే కాంతి ప్రసారం జరుగుతూ ఉండేది, కన్నులు చాలా కాంతివంతములుగా ఉండేవి, శరీరం యొక్క ఛాయ బంగారు మేని చాయ, పటిష్టమైన దేహము,

నడుస్తుంటే చూపరులు అందరినీ ఆకర్షించి నిశ్చేష్టులను చేసేవాడుట ఆయన. ఆయన నడిచి వెళుతుంటే చూసే వాళ్ళందరూ అలా కళ్ళు అప్పగించి చూసేవాళ్ళు. నిశ్చేష్టులైపోయేవాళ్ళుట'. మనకి కృష్ణుడు నడుస్తుంటే ఏ విధంగా, ఎందుకంటే దైవీ సంపద ఎక్కడ ఉంటే అక్కడ అట్లా కన్నులు అప్పగించి చూడడం అనేది ఉంటుంది నిస్సందేహంగా. 'అటువంటి మూర్తిని వాళ్ళు ఆరాధన చేయకుండా, ఆయన శిలువ వేసిన మూర్తిని ఆరాధన చేసి ఒక దయనీయము, చాలా దీనము అయిన పద్ధతిలోకి వెళ్ళిపోయి, క్రైస్తు యొక్క అనుభూతి కోల్పోయారు' అని చెప్తారు పరమగురువు జ్వాలాకూలుడు. పశ్చిమ దేశాల్లో భగవంతుని మూర్తిని మనం చూస్తుంటే చాలా భయంకరంగానూ, వికారంగానూ, వికృతంగానూ ఉంటుంది. మనకి ఇక్కడ మలేషియా, జకార్తా, జావా ఉన్నాయి కదా! సుమిత్ర, వా/బాలి. ఇటు పక్క మూర్తులు చాలా అందమైన మూర్తులు. అందరికన్నా అందమును, భగవంతుని యొక్క అందమును ఆరాధించే సాంప్రదాయం భారతదేశంలోనే బాగా మిగిలిపోయింది. అందుకని మనం కూడా భగవంతుని ఆరాధన చేసుకునేప్పుడు అత్యంత రమణీయమైన మూర్తిగా, అన్ని అంగములు శుభమును కలిగిస్తున్నట్టుగా వాటి నుండి, వాటిని తలుచుకోవడం వలన మనకి మనలో ఉండే అశుభములు పారద్రోలబడి శుభములు మొదలవ్వాలి. ఒక మహాత్ముడి దర్శనం చేసినా, ఒక పుణ్యక్షేత్రంలో మనం కొన్ని గంటలసేపు కొన్ని రోజుల సేపు జీవించినా మనకి జరిగేదేమయ్యా అంటే అశుభములు తొలిగి శుభములు మొదలవుతాయి. అది అక్కడున్న energy అంటామే, ప్రజ్ఞ యొక్క ప్రభావం. అక్కడ అట్లా ఉంటుంది. అందుకని మనం క్షేత్రదర్శనం, మహాత్ములదర్శనం చేస్తూ ఉంటాం. వెళ్ళి వస్తే కొంత తప్పక మార్పు కలుగుతుంది. మనకు తెలిసిన మనోమయకోశంలో అదేమిటో తెలియకపోయినప్పటికీ అంతర్గతముగా అంటే subconscious అంటాం, మనకి తెలివికి అతీతంగా ఉన్న స్థితులలో మార్పులు జరిగి మనకి శుభములు జరుగుతాయి. భగవంతుడు శుభాంగుడు కాబట్టి ఆ విధంగా మనం ఆరాధన చేసుకుంటే మనకి అశుభములు తొలగి, శుభములు పెరుగుతాయి. అందుకని అంగములను అంత శ్రద్ధతో దృష్టి కేంద్రీకరించి భావన చేసుకుంటూ ఉండాలి. నిజానికి ధృవునికి నారదుడేం చెప్తాడంటే 'నీ హృదయము నుండి నీ శిరస్సు వరకు

చతుర్భుజుడు అయిన భగవంతుడు, వాసుదేవమూర్తి నిలబడి ఉన్నాడని భావన చేయి. ఆయన పాదములు నీ హృదయపద్మమునందు నిలిపినట్లుగా భావన చేయి. ఆ హృదయపద్మమునందు నిలిపిన ఆ పాదముల యొక్క గోళ్ళ నుండి వచ్చే కాంతి నీ బొడ్డు, అంతకన్నా కింద ఉన్న లోకాల్లో ఆ కాంతులు చీకట్లను పారద్రోలుతున్నట్లుగా భావన చెయ్' అంటాడు. అసలు భావనే బావుంది కదా! మరి అట్లా చేసుకోవచ్చు కదా! యాంత్రికంగా చెయ్యడం కాదు. ఇలా చేశాడు ధృవుడు. అందుకని నాలుగు నెలల్లో దేముడు ప్రత్యక్షమయ్యాడు. సంభవమా? అంటే సంభవము అని చెప్పడానికే ఋషులు సత్యవాక్కు పరిపాలించే వాళ్ళుగానీ, గొప్పల కోసం అబద్ధం ఆడేవాళ్ళు కాదు. అవసరం కూడా లేదు. ఆయనకి ఎంత రుచి కలిగిందంటే దీనిమీద, అన్నపానీయాదులయందు ఆసక్తి తగ్గిపోయింది ధృవుడికి. క్రమశః అలా తిండం తగ్గించుకుంటూ వచ్చాడు. మనకి ఒక దానియందు చాలా రుచి ఏర్పడితే, మిగతా విషయములయందు మనకు విముఖత వస్తుంది కదా! మరి భగవత్ ఆరాధనే అంత రుచికరంగా తయారైన వాడికి ఇహ మిగతావేం గుర్తుండవు. అలా ధృవుడు నాలుగు నెలల్లో సమస్తమును మరచి భగవదారాధన చేస్తే, భగవంతుడు తన నుండి వ్యక్తమై అతనికి దర్శనం ఇచ్చాడు అతడు ఏ విధంగా ఆరాధన చేశాడో ఆ విధంగా దర్శనం ఇచ్చాడు. ఆ విధంగా అతనికి దర్శనం ఇవ్వాలని సంకల్పించినవాడు నారదుడు. ఏదోరకమైన రూపంలోకి వచ్చింతరువాత అక్కడ నుండి అతను మాట్లాడి ఇతడికి ఆశీర్వచనం ఇవ్వడం, అంతర్ముఖుడైన భగవంతుడు బహిర్ముఖుడై గోచరించి ధృవుని ఆశీర్వదిచడం జరుగుతుంది. అలాగే ప్రహ్లాదునికి! అలాగే ఎంతోమంది మహాత్ములకి నారదుడు భగవంతుని ఏ విధంగా ఆరాధన చేసుకోవాలో చెప్తాడు. అలాగే విదురుడికి చెప్తాడు మైత్రేయుడు, ఉద్ధవుడు. వీళ్ళందరూ కూడా. చాలాచోట్ల మనకి, తరువాత తపస్సు చేసిన వాళ్ళకి భగవంతుని యొక్క దర్శనం జరిగినప్పుడు, వాళ్ళు భగవంతుని వర్ణిస్తారు. ఆ వర్ణనలో కూడా మీకు ఈ వివరాలన్నీ చాలా ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. ఎందుకిలా వచ్చిందంటే అంత అద్భుతమైన మూర్తిగా, తేజోవంతమైన మూర్తిగా, కాంతివంతమైన మూర్తిగా, అందమైన మూర్తిగా, అనురక్తి కలిగించే మూర్తిగా దర్శిస్తారు. అనురక్తి అంటే ఏమిటో తెలుసా? రక్తి అంటే అట్లా మనం దాంతో మిళితమైపోవడం. అనురక్తి అంటే ఇహ మరి తెగని రక్తి.

అలా అంటిపెట్టుకునే ఉంటాం అన్నమాట. అట్లా అంటిపెట్టుకుని ఉన్నవాళ్ళే నిజమైన భక్తులుగా, మనకి పూజ్యులుగా ప్రపంచానికి స్ఫూర్తి ఇస్తున్న వాళ్ళు. ఒక తులసీదాస్ అనుకోండి, ఒక తుకారాం అనుకోండి, ఒక మీరాబాయి అనుకోండి, వీళ్ళందరూ మనకి మార్గదర్శకులు భక్తి మార్గంలో. చైతన్య ప్రభువు, ఉద్ధవుడు, ఉద్ధవుడు 'ఇంక నాకేం అక్కర్లేదు నీ రూపం చాలు' అని చెప్తాడు. 'నువ్వు చెప్పే జ్ఞానం ఇంకెవరికన్నా చెప్పుకో నాకిది చాలు. దాన్నే పట్టుకుని అతను ఉండడం చేత అతనికి అంతర్ముఖంగా అదే దర్శనం ఇచ్చి అతనితో అదే మాట్లాడడం మొదలు పెడుతుంది'. నిరాకారుడైన భగవంతుడిని సాకారంగా ఈ విధంగా ఏర్పరచుకోవడం వలన ఆయనతో మాట్లాడుకోవచ్చు, ఆయనతో పోట్లాడుకోవచ్చు, ఆయనతో ఆటలాడుకోవచ్చు లేకపోతే ఏం ఉంటుంది మనకి ? మన చుట్టూ చోటుగా ఆయన ఉంటాడు. మనకి వినపడచ్చు, ఆచరించవచ్చు. కొంతమందికి జీవలక్షణం ప్రకారం అది నచ్చుతుంది. ఎక్కువమందికి ఇది నచ్చుతుంది..

## 813 లోకసారంగః

లోకములన్నిటియందు అద్భుతమైన అనుభూతిగా తన అస్తిత్వమును నిలిపిన వాడు అని అర్థం. సారంగుడు అంటే ఆనందాన్ని కలిగించేవాడు. లోకసారంగః - లోకములన్నిటియందు ఆనందాన్ని కలిగించే వాడు. ఏ లోకంలో అయినా నీకు ఆనందం దక్కుతుంది. నీకు ఆనందాన్నిచ్చే ఏ విషయం అయినా, ఏ లోకానికి సంబంధించినదయినా అది భగవంతుడే అని గుర్తించాలి. మంచి ఆవకాయ ముద్ద తింటున్నాం అనుకోండి. ఆనందం కలుగుతుంది కదా! అక్కడ ఆ ఆవకాయ రూపంలో కూడా మనం వాడ్ని దర్శించవచ్చు. అంటే భౌతికమైన విషయం దగ్గర నుండి, భావమయమైన విషయముల దగ్గర నుండి, విజ్ఞానమయము అయిన విషయముల నుండి మనకు అన్ని కోశాల్లోనూ ఆనందం కలిగిస్తాడు. మొత్తం ఎన్ని లోకాలు? ఏడు లోకాలు చెప్తారు, పధ్నాలుగు లోకాలు చెప్తారు, నలభై తొమ్మిది లోకాలు చెప్తారు, స్థూలంగా మూడు లోకాలని చెప్తారు. పదార్థమయము, శక్తిమయము, ప్రజ్ఞామయమైన లోకాలు. ఇన్ని లోకాల్లోనూ తాను ఆనంద స్వరూపుడుగా, ఆనందాన్ని, అనుభూతిని ఇచ్చే వాడుగా భగవంతుడు ఉన్నాడు. అందుకని ఆనందించాలి అనే వాడికి భగవంతుడు అందముగా, రుచిగా అన్ని లోకముల యందు వ్యాపించి ఉన్నాడు అని తెలిపే నామము లోకసారంగః. శ్రీకృష్ణుడు అట్లా ఆనందాన్ని కలిగించాడు. బ్రహ్మలోకంలో ఆనందం కలిగించాడు. బ్రహ్మకు ఆనందం కలిగించాడు. ఇంద్రుడికి ఆనందం కలిగించాడు. దేవతలకు ఆనందం కలిగించాడు. మనుషులకి ఆనందం కలిగించాడు. జంతువులకి ఆనందం కలిగించాడు. వృక్షములకు ఆనందం కలిగించాడు. అధోలోకములు, పాతాళలోకాల్లో కూడా ఆనందం కలిగించాడు. వరుణలోకం వెళ్ళాడు. ఆయనకి ఆనందం కలిగించాడు. యమలోకం వెళ్ళాడు. ఆయనకి ఆనందం కలిగించాడు. ఇట్లా తన జీవితంలో అన్ని లోకములయందు ఆనందాన్ని పంచి ఇచ్చిన వాడుగా కృష్ణుని జీవితం కనిపిస్తుంది. అది అలా ఉండగా భగవత్తత్త్వము కూడా సమస్త లోకములయందు ఆనందానుభూతిని ఇచ్చేటువంటిది. అందుకని ఎక్కడ, ఎప్పుడు మనకి ఏ విధమైన ఆనందం దొరికినా అది దేహపరమైన ఆనందం అవచ్చు, ఇంద్రియపరమైన ఆనందం అవచ్చు, మనోమయమైన ఆనందం

అవచ్చు, విజ్ఞానమయమైన ఆనందం అవచ్చు, ఆత్మానందం అవచ్చు. ఏదైనా ఆనందమే కదా! ఇట్లా అన్నిటియందు ఆనంద స్వరూపుడుగా ఉంటాడటండీ! అందుకని ఆనంద స్వరూప్ అని పేరు పెట్టుకుంటూ ఉంటాం. ఆనందరావు-ఆనందం రావు అనుకోవాలి. ఇటువంటి పేర్లు ఎక్కడ నుంచి వచ్చినాయి అంటే అటువంటివి అప్రయత్నంగా మనయందు కలిగించే వాడుగా భగవంతుడు అన్ని లోకముల యందు ఉన్నాడు, కొన్ని లోకాల్లోనే ఉన్నాడనుకుంటే నీకు అంతవరకే సత్యం. నువ్వే పరిమితం చేసుకుంటున్నావు నీ ఆనందాన్ని. కొంతమంది సంసారంలో ఆనందం లేదనుకున్న వాళ్ళు ఉన్నారు అంటే అంతవరకు వాళ్ళకు దక్కక. పూర్ణమైన యోగులు సంసారమునందు కూడా దర్శనం చేశారు కదా! దేనియందు లేడు? సమస్తమునందు ఉన్నాడు కాబట్టి దానిని దర్శించేటువంటివాడు ఎక్కడ ఉన్నా ఆనందం పొందుతాడు. పాతాళములలోకి తొక్కబడిన బలి కూడా పూర్ణమైనట్టి ఆనందంతో ఉండగలగడానికి కారణం ఇది. ఎందుకంటే సమస్తమూ వ్యాపించి ఉన్నాడు కాబట్టి దైవము తనని ఇక్కడ ఉంచాడు, అనే భావన ఉన్నది. ఎక్కడ ఉన్నా వాడు ఉన్నాడు కదా! ఎక్కడ ఉంటే ఏమి వాడితో ఉన్నప్పుడు. అదే కారణం మృత్యుదేవత, ఇత్యాదులందరూ కూడా ఆ కార్యాలు నిర్వర్తించడానికి. సృష్టిలో కొంతమంది చాలా ప్రసన్నమయిన కార్యములు నిర్వర్తించే వాళ్ళు ఉన్నారు. కొంతమంది తద్విరుద్ధమైన కార్యములు నిర్వర్తించే వాళ్ళు ఉన్నారు. ఇద్దరూ దైవభక్తులే! శనిగ్రహము మనం చేసిన పనులకు కొన్ని ఫలితాలను అందిస్తూ ఉంటుంది. గురుగ్రహము మనం చేసిన పనులకు మరికొన్ని ఫలితాలు అనుగ్రహిస్తూ ఉంటుంది. మనం గురుగ్రహం వస్తుంటే సంతోషిస్తాం కదా! శనిగ్రహం దాపుల్లోకి వస్తుందంటే భయపడతాం. అంటే మనం మెచ్చుకోం కదా! పుట్టాడట అంటే చాలా ఉత్సవాలు చేసుకుంటాం. చచ్చాడట అంటే చేసుకోం కదా! మరి ఇట్లా అన్నం పెట్టేవాడు ఒకడుంటే, విస్తళ్ళు ఎత్తేసేవాడు ఒకడుంటాడు, ఎంగిళ్ళు తుడిచేవాడు ఒకడుంటాడు కదా! ఎవర్ని మనం ఎక్కువ మన్నిస్తాం? సృష్టిలో English లో చెప్పాలంటే white collared jobs అని కొన్ని ఉన్నాయి. అంటే అందరిచేత గుర్తింపబడి, అందరి చేత మన్ననలను పొందే కార్యాలు చేసే వాళ్ళందరూ దేవతలు. అందరి చేత ఛీ అనిపించుకోవడం, అందరి చేత అసలు ఏమాత్రం ప్రశంసింపబడకుండా

ఉండే కార్యాలు చేసే ప్రజ్ఞలు ఉన్నాయి. వాళ్ళే మృత్యుదేవతలు. మృత్యువు వస్తుందిట అంటే ఎవరండీ తలుపు తెరుస్తారు? ఇవాళ కాదు పో అని చెప్పమూ? కానీ వాళ్ళు మరి శ్రద్ధగా సృష్టికార్యం నిర్వర్తిస్తున్నారు. వెలుగు పనులు కొందరు చేస్తుంటే, చీకటి పనులు కొందరు చేస్తున్నారు. ఊళ్ళో నీళ్ళు ఇచ్చే కార్యక్రమం కొంతమంది చేస్తుంటే, మురికి నీరు బయటికి తీసే కార్యం కొంతమంది చేయాలి కదా! నీరొచ్చి మురికి నీరు అయిపోతూ ఉంటుంది కదా! మనం తాగిన నీళ్ళు బయటికి వెళ్ళలేదు అనుకోండి, drainage system లేదనుకోండి మన ఒంట్లో, ఎంత తొందరగా కుళ్ళిపోతాం! అలా నిర్వర్తించే వాళ్ళు ఎక్కువ స్థితప్రజ్ఞులై ఉంటారుట. ఎందుకంటే వాళ్ళు జీవుల యొక్క ప్రశంసలు, మన్ననలు, ఆదరణలు వాటికి ఎదురు చూడకుండా తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఉంటారు. దేవతలు, అసురులు ఉన్నారు కదా మనకి. మందరపర్వతం చెరోపక్క ఉండడం వల్లనేఅట్లా, నిలబడి ఉన్నది లేకపోతే కింద పడి ఉండేది. వాళ్ళందరూ కూడా దైవం యొక్క అనుభూతి పొందుతూ ఈ కార్యాలు చేస్తున్నారు. లేకపోతే ఎప్పుడో మానేసే వాళ్ళు కదా! మనం కూడా చాలా పనులు అందరూ మెచ్చుకుంటూ ఉంటే చేస్తుంటాం. ఎవ్వరూ మెచ్చుకోవట్లేదు అనుకోండి చేస్తావా? నీకర్తవ్యము కానీ, అందరూ తిట్టిపోస్తున్నారు చేస్తావా? చేస్తే ఓ మెట్టు ఎక్కువలో ఉన్నట్టు. అంటే ఒక మెట్టు దగ్గరగా ఉన్నట్టు దేవునికి. శ్రీకృష్ణుని యొక్క శరీరాన్ని కూడా హరించవలసినటి ఒక కర్తవ్యం మృత్యుదేవతకి ఏర్పడినపుడు, మృత్యుదేవత ఎంత బాధపడి ఉంటాడు? అసలీ భావన ఎలా కలిగింది? చాలా చక్కగా రాశారు మాస్టర్ గారు పురుషమేధంలో. 'నాకు ఈ కర్తవ్యాన్ని ఇచ్చావు, నీ సాన్నిధ్యంలో ఉండి ఇవన్నీ నిర్వర్తిస్తున్నా నేను, కానీ ఇంత అందమైన దానికి కూడా మరి అది చెయ్యాలి కదా' అంటాడు. అది చెప్పడంలో బాధ, ఆ చెప్పడంలో కృష్ణునికి హెచ్చరిక రెండూ ఉంటాయి. కృష్ణునికి హెచ్చరిక ఏమిటయ్యా అంటే 'మరి నా పని నేను చేస్తాను, నువ్వు కాదనకూడదు సుమా! నువ్వు మా అందరికీ స్వామివి. చెయ్యడానికి కొంత బాధగా ఉన్నప్పటికీ తప్పదు, చెయ్యాలి'. ఎట్లా ఉంది? ఊళ్ళో వాళ్ళందరికీ surgeon పొట్ట కోయమంటే టప టప టపా కోసేస్తాడండీ! ఒక్కడే కొడుకు, లేక లేక పుట్టాడు, వాడికి మూడేళ్ళు వచ్చేయంగానే operation చేయాలంటే, ఎట్టా ఉంటుంది వాడికి? 'నే చెయ్యలేను ఇంకెవరి చేత అయినా చేయించుకోండి'

అని చెప్తాడు. కదూ! పక్కనుంచి పెళ్ళాం సతాయిస్తూ ఉంటుంది. జాగ్రత్తగా చెయ్యక పోయావో డొక్క చింపుతా అన్నట్టుగా. 'అన్నీ సరిగ్గా చూసుకున్నారా' అని ఒకటికి పది సార్లు అడుగుతుంది. Special attention pay చెయ్యడంలో తప్పులు చేస్తారు. మామూలుగా అయితే ఏ తప్పులు ఉండవు. ఇక్కడ గానీ డాక్టర్లని అడిగితే KGH లో మామూలు వార్డులలో తగ్గే జబ్బులు special వార్డులో తగ్గవు ఓ పట్టాన అంటారు. వీడు special కదా అని. 'నన్ను ఇటువంటి పనిలో ఎందుకు పెట్టావు' అని మృత్యుదేవత అంటే 'నువ్వు చాలా ఉత్తముడివి, నువ్వు ఇది మంచిపని, ఇది చెడ్డపని అనే స్థితి కూడా దాటి ఉన్న వాడివి కాబట్టి' అంటాడు. వాళ్ళు ఆ పనులన్నీ ఎలా చేయగలుగుతున్నారంటే కేవలము భగవంతుని యొక్క సాన్నిధ్యము వారికి అనుస్యూతము అందుతూ ఉండడంవల్ల. ఇంకో పద్ధతిలో అయితే చేయడానికి అవకాశం లేదు. ఈ నామం ఏం చెప్తోందంటే నువ్వు అన్ని లోకాల్లోనూ ఉన్నావు, చీకటి లోకాల్లో ఉన్నావు, వెలుగులోకాల్లో ఉన్నావు, మంచిలో ఉన్నావు, చెడులో కూడా నిగూఢంగా నీవే ఉన్నావు, సమస్తమునందూ నీవు ఉన్నావు, నిన్ను దర్శనం చేయగలిగితే మిగిలేది ఆనందం. మనకు తోచిన పద్ధతుల్లో ఆయన దర్శనం చేయడం కన్నా, ఆయన ఉన్న పద్ధతుల్లో ఆయన దర్శనం చేయడం. అదీ సాధన. భగవంతుడు ఇట్లా ఉండాలి అనుకోవడం ఒకటి అయితే, ఎట్లా ఉన్నా చూసి ఆనందించగలగడం. మరి భీష్ముడు పరిస్థితి ఏంటి? అసలు అప్పుడు స్తోత్రం చేసే పరిస్థితేనా ఆయనది? అన్నీ బాణాలు గుచ్చుకుని, ఒళ్ళంతా బాణాలే పడకగా ఏర్పడిన వాడు కదా! రక్తం కారుతోంది శరీరం నుంచి. అంటే అందులో కూడా దర్శనం చేశాడన్నమాట. అంటే ఆయన యందు తను ఉండడం చేత తనకి బాధ లేదు. అందుకని చిట్టచివరి నిమిషంలో 'నాకు అనుమతి ఇమ్మని' కోరతాడు. ఎన్ని లోకాల్లో అయినా సరే నీవు ఉన్నావు కాబట్టి, నిన్ను ఆ విధంగా దర్శనం చేసుకుంటూ ఉంటాను కాబట్టి, అప్పుడూ దర్శనం ఇస్తావు కాబట్టి, తత్కారణంగా నేను స్థితప్రజ్ఞుడనై ఉంటాను. ప్రతి వాళ్ళకి వాళ్ళ పన్నాని బట్టి సమస్యలు ఉంటాయి కదా! సమస్య మొత్తాన్ని భగవంతుని యొక్క రూపంగా అవగాహన చేసుకుంటే సమస్య నీ మనస్సుని పీడించదు. ఎవరో మనల్ని ఇబ్బంది పెడుతున్నారు, ఇబ్బంది పెట్టే వాడి రూపంలో దేవుడే ఉన్నాడు అని భావన ఉందనుకో, ఇబ్బంది పెట్టడం దేవుడు

నీ మీద చూపిస్తున్న క్రీడ అనుకో, అంతకుమించి చేయగలిగింది ఏం లేదు కాబట్టి ఏడ్చే బదులు నీ కర్తవ్యాన్ని నువ్వు నిర్వర్తించు. ఇది వాసుదేవ స్వరూపం అంటారు. మనకి ఇష్టం లేని పనులు, మనకి కష్టమైన పనులు, మనకి నష్టం వచ్చే పనులు ఉంటాయి. అవి కొంతమంది నిమిత్త కారణంగా జరుగుతూ ఉంటాయి మనకి కదా! ఆ సమస్యను, ఆ సమస్యకి కారకులైన వాళ్ళని, ఆ సమస్యను నిర్వర్తిస్తు వాళ్ళను మనకి వ్యతిరేకంగా, వాళ్ళందరినీ కలిపి భగవంతునిగా ఆరాధన చేయడం వాసుదేవోపాసన. విషయం సులభమైంది కాదు కానీ అదొక్కటే పరిష్కారం అందుకనే ధృవునికి నారదుడు వాసుదేవోపాసన ఇచ్చాడు. లేకపోతే ముందుకు వెళ్ళగలిగి ఉండేవాడు కాదు. కారణం ఏమిటి? అవమానంతో చాలా అలజడి చెందిన, తీవ్రమైన మనస్సుతో తపస్సుకు బయలుదేరతాడు ధ్రువుడు ఈయన తపస్సుకు కారణం ఏమిటి? నిష్కారణం కాదు కదా! పిన్ని అవమానించింది. క్షాత్రమైన ధర్మము నందు ఉన్నటువంటి జీవి. మాట అంటేనే పడలేడు క్షత్రియుడు. బ్రాహ్మణుడ్ని మాట అంటే పరవాలేదుట. అప్పటికప్పుడేదో బాధపడుతూ వెళ్ళిపోతాడుట. ఎందుకంటే బ్రహ్మయందు జీవిస్తూ ఉంటాడు కాబట్టి. క్షత్రియుడికి గనక అవమానం జరిగితే భరించలేడు. ప్రతీకార వాంఛ చాలా ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే రజోగుణం అంత ఉంటుంది కాబట్టి. భారతంలో మొట్టమొదట్లో మీకు ఈ కథ వస్తుంది. ఉదంక ఉపాఖ్యానంలో. ఉదంకుడ్ని ఒక రాజు భోజనానికి పిలుస్తాడు. ఇద్దరూ భోజనం చేస్తుంటే ఉదంకుడికి అన్నంలో ఒక వెంట్రుక ఉన్నట్టు భావన కలుగుతుంది. వెంటనే కోపం వచ్చి 'వెంట్రుకతో కూడిన భోజనం నాకు పెట్టావు అంటే ఎంతో అశ్రద్ధగా అతిధిని అవమానించావు కాబట్టి నీకు శాపం పెడుతున్నా', అని పెట్టేస్తాడు. ఆ తరువాత రాజు పరిశీలించి చూసి అది వెంట్రుక కాదు అని తెలుసుకుంటాడు. ఆయన కూడా తపోసంపన్నుడు. ఆయనేం చేస్తాడంటే 'వెంట్రుక లేకపోయినా ఉన్నదని భావించి నువ్వు శాపం పెట్టావు కాబట్టి, నేను నీకు శాపం పెడుతున్నా' అని రాజు ఉదంకుడికి శాపం పెడతాడు. అప్పుడు ఉదంకుడు వెంట్రుక లేదనే విషయం తెలుసుకుని, తాను చేసినది పొరపాటు అని తెలుసుకుని తన శాపాన్ని విరమించుకుంటాడు. 'మరి నా శాపాన్ని నేను విరమించుకున్నాను కదా నీ శాపం కూడా విరమించుకో' అని అడిగితే, 'నీ అంత సత్త్వగుణం నాయందు లేదు, నేను

జన్మతః క్షత్రియుడ్ని. కాబట్టి నీలాగా నేను క్షమించలేను. క్షమించినట్టు నటించవచ్చు గానీ క్షమించలేను. కాబట్టి శాపం విరమించుకున్నానని చెప్పినా కూడా పని చేస్తుంది' అని చెప్తాడు. ఇది మొట్టమొదట్లోనే కథ భారతంలో. అందుకని బ్రహ్మధర్మము నందు, బ్రాహ్మణ ధర్మము నందు లేక సత్త్వ గుణమునందు తప్ప ఇతర గుణముల్లో జీవించే వాళ్ళకి ప్రతీకార వాంఛ చాలా తీవ్రంగా ఉంటుంది. అందుకని ఇక్కడ ధ్రువుడికి జరిగిన అవమానం చాలా తీవ్రమైన అవమానం కాబట్టి అట్లా గబాల్న రాజప్రసాదాలన్నీ వదిలేసి అడవిలోకి తపస్సు చేయడానికి వెళుతున్నాడు. వెళ్ళే వాడికి తల్లి అవమానించిందనే ఎక్కువ గుర్తుంటుంది కదా! మనం కూడా ఏదన్నా సమస్య పెట్టుకుని దేవుడ్ని ధ్యానం చేస్తుంటే సమస్యనే ధ్యానం చేస్తూ ఉంటాం కదా! మన ఆరాధన అంతా సమస్యనే! 'విశ్వం విష్ణుర్వషట్కారో'-వాడట్లా అన్నాడు నన్ను, మళ్ళీ ఇంకో నామం-మళ్ళీ వాడు అట్లా అన్నాడు కదా! లేకపోతే వాడు ఇంకా నాకు చేయాల్సిన పని చెయ్యలేదు కదా! నా చేత చేయించుకుని ఇట్లా అన్నాడు కదా! అని అంటూ మధ్యలో నామాలు పలుకుతూ ఉంటాం. కదా! ఇట్లా జరుగుతూ ఉంటుంది అది. మరింకేం జరుగుతుంది అప్పుడు తపస్సు? తపస్సు చేస్తున్నప్పుడు ఎక్కువ మనకి ఇష్టం లేని వాళ్ళు, మనల్ని అన్నవాళ్ళు, మనకి చేయాల్సినవి చేయని వాళ్ళు, చేసి మాటలన్న వాళ్ళు, వీళ్ళ గుర్తొస్తూ వుంటే ఎక్కడి నుంచి వస్తాడు దేవుడు మనకి? ప్రత్యక్షం ఎక్కడ అవుతుంది? మరి ధృవుడికి ఏం జరుగుతుంది? పినతల్లి గుర్తు రావడం, ఒక కుంకుడు కాయలు కొట్టే రాయిలా, వాళ్ళ నాన్న బండరాయిలా ఏం అనకుండా ఉండిపోతాడు పినతల్లి అట్లా అంటుంటే బెల్లం కొట్టిన రాయల్లే ఉంటాడండీ! ఆ తండ్రి కనీసం అదేమిటి పిల్లవాడిని అట్లా అంటావు అని కూడా అనలేదు. మరి ఇవన్నీ లోపల ఎంత ఉడుకుతూ ఉంటాయి? ఆ పినతల్లి మీద ఉడుకుతోంది, ఈ తండ్రి మీద ఉడుకుతోంది. వీళ్ళిద్దరూ కారణంగా తమ్ముడు మీద ఉడుకుతూ ఉంటుంది. So త్రికోణంగా ఉడుకుతూ ఉంటే వీడు ఏం తపస్సు చేస్తాడు? అది నారదుడి యొక్క వాత్సల్యం! అందుకని వచ్చి ఉపాసన ఇచ్చాడు. ఏ ఉపాసన ఇచ్చాడు? ఇందాక ఉపాసన సగమే చెప్పాను. ఎందుకంటే ఇప్పుడు చెప్పాలని. అప్పుడు అనుకోలేదు ఇప్పుడు అట్లా వచ్చింది. పచ్చిక బయలు చూసినప్పుడు-పచ్చిక బయలు రూపంలో ఉండే లేత పచ్చిక వర్ణం కలవాడిగా చూడండి. లేడి

కన్నులు చూసినప్పుడు-కన్నులలో వెలుగు తళుక్కు తళుక్కు మంటున్నట్టుగా చూడమంటాడు. ఆకాశాన్ని చూసినప్పుడు-నీలవర్ణంగా ఉన్నట్టుగా చూడమంటాడు. జలములు ప్రవహిస్తున్నప్పుడు-చైతన్యం కదలికగా చూడమంటాడు. ఇట్లా రకరకాలుగా రకరకాలుగా కనిపించేదాన్ని 'వాడే ఇట్లా ఉన్నాడు' అని చూడమంటాడు. అదే మంత్రం. 'అదే ఇది అని'. అట్లా చూస్తూ ఉండు తపస్సు చేయకుండా ఉన్న సందర్భంలో, తపస్సు చేసేప్పుడు ఇట్లా భావన చెయ్, తపస్సు చేయనప్పుడు కనిపిస్తున్నది ఏది కనిపిస్తే అట్లా. కలువలు కనిపించాయనుకో కలువరేకుల వలే కన్నులు ఉన్నవాడిగా ధ్యానం చేయమంటాడు. సూర్యోదయంలో పచ్చని కాంతిని చూస్తే పచ్చని వస్త్రములు ధరించిన వాడిగా ధ్యానం చేయమంటాడు. బంగారు కాంతులు కనిపిస్తే ఆ బంగారు కాంతులు భగవంతుని యొక్క ఆభరణములుగా ధ్యానం చేయమంటాడు. గబగబా ధ్రువోపాఖ్యానం చదివేశాం అనుకోవద్దు. చదువుతూ ఉండండి. ఎంత అద్భుతంగా ఉంటుందో. ఎందుకంటే నారదుడికి ఇతరులలో జరిగే ఆందోళన తెలుసు. అది కారణం చేత సమస్తమునందు, తన తల్లిదండ్రుల యందు, అందరియందు కూడా భగవంతుని యొక్క అస్తిత్వమును ధ్యానం చేస్తే తప్ప గోచరించదు. లేకపోతే ఇతర భావములు చోటుచేసుకుని, అన్యభావములు చోటు చేసుకోవడం చేత, అనన్య భావన లేకపోవడం చేత, భగవంతుని యొక్క సాన్నిధ్యం లభించదు. అందుకని మనం కూడా సమస్యలకు పరిష్కారం రావాలని దిక్కులేక భగవంతుని ఆశ్రయిస్తాం. కదా! దిక్కుంటే మనం ఊరుకుంటాం ఏంటి? మన చేతిలో ఉన్నదంతా చేసి, ఇంక ఏం చేయలేక ఆశ్రయిస్తాం. గజేంద్రుడు మాత్రం ఏం చేశాడు? వెయ్యేళ్ళు పోట్లాడాడుట. 'దిక్కుమాలిన మొరాలింపన్ ప్రపుణ్యాదులేరే' ఎవరన్నా ఉన్నారా? అసలు లేరా? ఈ దిక్కుమాలిన వాడిని రక్షించడానికి. మన సమస్య కూడా మనల్ని అంత దిక్కుమాలిన వాడ్నిగా చేస్తుంది. ఎటు నుంచి ఏమీ చేయడానికి వీల్లేకుండా బంధిస్తుందండీ అది. అట్లా బంధించే స్థితియందు, ఏది నిన్ను బంధించిందో ఆ బంధనమే వాసుదేవుడు అని భావన చేయడం అదృష్టం. అది చేయగలగడం అదృష్టం. అది చేయలేకపోవడం దురదృష్టం. అది చేస్తే పరిష్కారం అత్యద్భుతంగా వస్తుంది. ఎంత అద్భుతంగా వస్తుందో అసలు మనం ఆలోచించలేము. కానీ పనికి పనికిరాదు. సమయానికి అది ఉండదు. అసలు లోకసారంగుడు-

భగవంతుడు అన్ని లోకములయందు అంటే మనకి దుఃఖం కలిగించే సన్నివేశాలు కూడా. అవి కూడా లోకాలే. చిన్న చిన్న లోకాల నుంచి పెద్ద పెద్ద లోకాల వరకు ఉండే భవసాగరాలు అన్నారే అట్లా ఉంటాయి. వాటి యందు వాడ్ని స్మరిస్తూ ఉండాలి.

## 814, 815 సుతన్తుః, తన్తువర్ధనః

సుతన్తుః అంటే చక్కటి తంతు అని అర్థం. తంతు అంటే తీగ అని అంటాం. ఆయన ఒక తీగగా ఈ సమస్తాన్ని అల్లికచేసిన వాడు. ఒకటే తీగ. ఆ తీగ నుండి అట్లా దాన్ని విపరీతంగా పెంచుకుంటూ వచ్చాడు. ఇన్ని గోళాలు, ఇన్ని మండలాలు, ఇంతమంది జీవులు ఇందరిలోనూ ఆయనే సూత్రధారి. ఆయనే సూత్రంగా ఉన్నాడు. ఆయనే దారంగా ఉన్నాడు. పూసకెక్కించిన మణులంటారు కదా! సూత్రానికి ఎక్కిస్తారు. 'సూత్రే మణిగణా యివ' అంటారు. అట్లా ఉంటుంది అని కృష్ణుడు చెప్పాడు కదా! అలా ఒకటే తంతు. అది ఆయనే! అది నీయందు నీ సుషుమ్నయందు ఉన్నది. నీయందు నీవలే ఉన్నది. చీమయందు చీమవలే ఉన్నది. దోమయందు దోమవలే ఉన్నది. గోళమునందు గోళమువలే ఉన్నది. ఇట్లా సమస్తమునందు అతడే ఒక సూత్రముగా ఉండి దాని చుట్టూ గోళాలుగా ఈ రూపాలన్నీ ఏర్పరిచాడు. ఏర్పరిచిన ఈ సమస్తమైన జీవకోటి. జీవకోటి అని ఎందుకు అన్నాం అంటే, కోటానుకోట్ల జీవులు, గోళాలు కూడా జీవులే, అంటే ఏర్పచిన వాటి అన్నిట్లో కూడా ఇతను ఒకడే సూత్రం. అంటే దేనికైనా ఆధారం అదే. నీకైనా ఆధారం అదే. అతడు సుతంతువై తంతు వర్ధనం చేస్తాడట. 'సుతన్తుస్తన్తువర్ధనః' అంటే అట్లా పెంచుతూ ఉంటాడండీ! ఎట్టా పుట్టుకొస్తున్నారు, ప్రత్యేకించి భారతదేశంలో తంతువర్ధనుడు విపరీతంగా పనిచేస్తున్నాడు. అశోకవర్ధనుడు వెళ్ళిపోయాడు. అంటే అశోకం అంటే శోకం లేని స్థితి. ఆ వర్ధనం పోయింది. ఇప్పుడు తంతువర్ధనం మిగిలింది. విపరీతంగా పుట్టుకురావడం లేదూ రెండు సెకన్లకి ఒకడు పుడుతున్నాడుట దేశంలో. మరి ఎట్లా? ప్రతి రెండు సెకన్లకి ఒకడు పుడుతుంటే. జీవకోటిని అట్లా పెంచుతున్నాడు. మనుష్యుల్ని పెంచుతున్నాడు. జంతువుల్ని పెంచుతున్నాడు. చెట్లని పెంచుతున్నాడు. ఖనిజములను పెంచుతున్నాడు. అన్ని జీవరాశుల్ని అట్లా వర్ధింప చేస్తున్నాడు. వర్ధిల్ల చేస్తున్నాడు. అంటే కేవలం తను తంతువుగా ఉండడం కాకుండా అక్కడ నుండి ఇంక పెంచడం పెట్టాడు. ఒక్కొక్కళ్ళ లోనుండి ఎంతెంత పుడుతుందండీ? మనం ఎంత తంతువర్ధనులం! బోల్డు తంతు మన జీవితంలో. ఇది తిరుగు తంతు అన్నమాట. అంటే సంసారం. తెగ పెంచుతాం కదా! తంతువర్ధనులం. అందుకనే సూర్యుడికే ఒక పేరు పెట్టారు

'వివస్వతుడు' అని. ఏమిటయ్యా అంటే అట్లా అల్లుతూ ఉంటాడుట. 'నేత'! ఎంత నేశాడు సూర్యుడు? తను గోళంగా నేసుకున్నాడు ముందు. అక్కడ నుండి గోళాల్ని నేశాడు. వాటిలోంచి తనే జీవుడుగా వచ్చి, మళ్ళీ జీవుల రూపంలో ఇంత మంది రూపాలుగా ఏర్పడ్డాడు. అందుకనే ఆయన కొడుకు 'వైవస్వతుడు'. ఈయన ఆయనకి సాయం చేస్తూ ఉంటాడు నేతపనికి. అంటే పద్మశాలి పని అంతా కూడా భగవంతుడిదే! విపరీతంగా నేస్తూ ఉంటాడు, పడేస్తూ ఉంటాడు, అట్లా పెంచుతూనే ఉంటాడు. మనం కూడా ఒకళ్ళం వస్తే ఊరుకున్నామా అండీ? ఎన్ని పెంచాం? మిగతా జీవులనే కాదు. రకరకాల విషయాలు పెంచుతున్నాం కదా! Buildings కడతాం. Shops పెడతాం. వ్యాపారాలు చేస్తాం. ఏవేవో చేస్తుంటాం కదా! ఊరికే ఉంటాం ఏంటి? ఇదంతా మనలో ఎక్కడ నుండి వచ్చింది? మనం కూడా తంతువర్ధనులం. వర్ధింప చేస్తూ ఉంటాం. పెంచుతూ ఉంటాం. దూది నుండి దారం అట్లా మనం పురి తీస్తాం కదా! తీస్తున్నకొద్దీ వస్తూనే ఉంటుంది కదా! అట్లా మన మనస్సు లో నుండి ఎన్ని తీసి ఇక్కడ పడేశాం? ఇంకా తెమల్లా. ఇంకా ఏదో తీస్తూనే ఉంటుంది ఆ మనస్సు. మొన్నే చూశా TV లో. 109 ఏళ్ళుట. ఇద్దరు కవల పిల్లలు ఆడవాళ్ళు. వాళ్ళూ ఇంకా నేస్తూనే ఉన్నారు. మనం అనుకుంటాం ఇంక ఈ రెండేళ్ళు అయింతర్వాత ఇహ ఆపేద్దాం, ఈ మూడేళ్ళు అయింతర్వాత ఆపేద్దాం. ఫలానా సంవత్సరానికి మనం retire అయిపోదాం అంటాం కదా! ఏం retire అవుతావ్? కొన్ని పనులు ఆపుతావు కానీ ఇంకొన్ని పనులు పెంచుకుంటావు. ఏదీ ఆగదు కదా! ఎక్కడ నుండి జరుగుతుంది ఇది? లోపల నుండి అట్లా జీనెలు తీసినట్లు వస్తూనే ఉంటుంది. విపరీతంగా వస్తూ ఉంటుంది. అది ఆగితే సుఖపడతావురా అని చెప్పాడు కృష్ణుడు. ఎవరయ్యా నా దాసుడంటే లోపల నుంచి జీనెలు పీకని వాడని. 'సర్వారంభ పరిత్యాగి'! ఎందుకంటే అది ఉన్నంతకాలం నీకు కార్యక్రమాలు ఉంటాయి. అది ఆపేసినా కార్యక్రమాలు ఉంటాయి. కానీ అది నీది కాదు కాబట్టి సుఖంగా ఉంటావు. నీది అవడం వల్ల నీకు యావ. తాపత్రయం. మనం తిరుపతి వెళ్దాం అనుకున్నాం అనుకోండి. చచ్చే చావు. తిరుపతి వెళ్ళేవాళ్ళు వస్తారా? అంటే ఆ.. ఈజీ. ఎందుకంటే వాళ్ళే చూసుకోవాలి మన సంగతి. వస్తావా? అంటే మరి ticket ఉందా? అంటాడు ముందు వీడు. లేకపోతే మనం కొనుక్కోవాలి వెళ్ళి. ఆ.. ఉంది. లేకపోతే ఏముంది నేను

ఏర్పాటు చేస్తా అంటాడు పాపం వాడు. ఊ.. కానీ అంటాం. వెళితే side berth వస్తే, వాడి పక్క చూస్తే, పోనీ, వాడది పడుకుని మనకిది ఇస్తాడు. ప్రతిచోటా మనం భుజాన్నెక్కి తిరగచ్చు. ఏదీ? సంకల్పం మన నుండి రాకపోతే. సంకల్పం మన నుండి వచ్చిందనుకోండి బండచాకిరే! సంకల్పం మన నుండి రాలేదు కాబట్టి, అది అవడం, అవకపోవడంతో కూడా సంబంధం లేదు మనకి. అది నీ సులువు. ఇది తెలివి కాదు ఇది సులువు. కొంతమంది తెలివికి అట్లా చేస్తారు. అది ఇరుక్కుంటారు ఎక్కడోచోట. అంటే తెలివిగా చేసేవాడు సహజంగా చేయట్లేదు కాబట్టి వాడి తెలివే వాడిని ఎక్కడో చోట ఇరికించి వదిలేస్తుంది. రావణుని తెలివి అట్లాగే కదా! వాడ్ని ఇరికించేసింది. ఏరోజు చచ్చిన వాళ్ళని ఆరోజు సముద్రంలో పారేసేవాడు, ఎదుటివాడికి లెక్క తెలియకూడదు ఎంతమంది చచ్చారు అని. ఇంక ఎంతమంది ఉన్నారు అంటే ఎప్పటికీ తెలియదు. ఎందుకంటే ఎంతమంది పోయారో తెలిస్తే కదా ఎంతమంది మిగిలారో తెలియడానికి. ఎంతమంది ఉన్నారో విభీషణుడు చెప్పాడు. ఎవరికి? రాముడికి. ఇంతింత ఉంది వాడి దగ్గర సైన్యం మరి, ఇంతమంది మహావీరులు ఉన్నారు, వీళ్ళ వీళ్ళకి ఈ శక్తులు ఉన్నాయి అని, అన్నీ పాపం ఉప్ప అందించేశాడు. రావణుడు ఏం చేశాడు? తెలుసు తన తమ్ముడు అక్కడ చేరాడు కాబట్టి తన సమస్తమైన రహస్యములు శత్రువుకు తెలుస్తాయని. అందుకని ఒక తెలివి ఉపయోగించాడు. ఏ పూట చచ్చిన వాళ్ళని ఆ పూట రాత్రికి రాత్రి తీసుకెళ్ళి నీళ్ళలో పారేయండి, అని. అప్పుడేం జరిగింది? యుద్ధం జరుగుతుంటే ఇంకా ఎంతమంది మిగిలారో తెలియట్లేదు. అలా జరుగుతుంది యుద్ధం. అయోమయంగా ఉంటుంది అప్పుడు. కానీ సంజీవని వచ్చినప్పుడు ఈ చచ్చిన కోతులన్నీ బతికినాయి, లక్ష్మణునితో పాటు. వాళ్ళు నీళ్ళలో పారేయబడడం వల్ల వాళ్ళు బతకలేదు. అందుకని 'తెలివికిని సద్గుణమ్ముల బలిమి గూర్చి' అన్నారు మాస్టారు గారు. సద్గుణముల యొక్క బలం తెలివికి లేకపోతే, ఆ తెలివి వాడిని నాశనం చేస్తుంది. Intelligent గా ఒకడ్ని బోల్తా కొట్టించాం అనుకోవచ్చండీ మనం. 'వంచతే పరివంచతే అన్నారు'. వంచించిన వాడ్ని అద్భుతంగా వంచిస్తాడట దేవుడు సన్నివేశాల రూపంలో. అంటే వీడి తెలివికి మించి భయంకరంగా వీడ్ని వీడే, వీడి బుట్టలో పడేసుకుంటాడు. ఎవర్నీ అంటానికి వీల్లేదు. ఎందుకంటే తన తెలివే అది. విపరీతంగా తెలివికి పోయి

shares లో పెట్టి ఇవాళ నోరు మూసుకుని కూర్చున్న వాళ్ళు లేరు? లక్షలాది మంది ఉన్నారు భారతదేశంలో. పెట్టినప్పుడు కలిసొస్తుంటే ఏంటయ్యా అట్లా ఉన్నావు? చేసుకోవయ్యా, చూడవయ్యా అంటారు. ఇప్పుడు అడిగితే ఏదో అయిపోయింది లెండి, అంటాడు. అందుకని ధర్మాన్ని అనుసరించి లేని తెలివి వల్ల ఉపయోగం లేదు. మనం విపరీతంగా పెంచుతున్నాం కదా! ఇది కూడా ఆయన గుణమే మనలో కూడా పనిచేస్తోంది అని చెప్పడానికి చెప్తున్నా. కాకపోతే దాన్ని ఆయన ధర్మపరంగా పెంచాడు. మాస్టరు గారు ఉన్నారు. విపరీతమైన కార్యక్రమాలు పెట్టారు. ఇందులోంచి ఆయనకి రావాల్సినది, కావాల్సింది ఏం లేదు. రాబడి ఏం లేదు కదా అందులోంచి, పోబడే. ఆయన బడి పోబడి. మన బడులన్నీ రాబడులు. ఏం చేస్తే ఏం వస్తుంది అని కదా చేస్తాం. రాబడి ఉంటే అది తిరిగొచ్చి, రావడం సంగతి ఎట్టా ఉన్నా ముడి పడుతూ ఉంటుంది. అందుకే ఆయన అట్లా పెంచుకుంటూనే పోతున్నాడు. భగవత్తత్త్వం అట్లా పెంచుకుంటూ పోతోంది. సమస్తమునందు తానుంటున్నాడు. అందరూ అనుభవిస్తుంటే చూసి ఆనందిస్తున్నాడు తప్ప, తనకై ప్రత్యేకంగా కావాల్సిందేం లేదు.

# 816 ఇంద్రకర్మ

ఈ తంతు వర్ధనులన్నీ కూడా ఎందులోంచి వస్తున్నాయి? మన వరకు ఆలోచిస్తే మన మనస్సులోంచి వస్తోంది కదా! అట్లాగే సృష్టికో మనస్సు ఉంది. సృష్టి మనస్సుని ఇంద్రుడు అంటారు. మన మనస్సుని మన మనస్సని అనుకుంటూ ఉంటాం. మనస్సు బాలేదు అంటూ ఉంటాం కదా! బావుందన్నప్పుడు చెప్పం మనస్సు బావుందని. worry గా ఉన్నాడని ఏంటండీ అట్లా ఉన్నారు? అని బాగాలేనివాడ్ని అడుగుతూ ఉంటారు. 'ఏదో మనస్సు బాలేదండీ' అంటాడు. అంటే manager బాగాలేడని అర్థం. ఈ మొత్తం organisation కి, సంస్థకి, ఈ మానవ వ్యవస్థకి మన manager బాలేడని. అట్లాగే సృష్టికి ఒక manager ఉన్నాడు. నిర్వహణాధికారి. Executive officer. మననేర్పరిచిన జీవితం వుందే ప్రవృత్తి అంటాం, బహిరంగంలో ఉండే మన జీవితం, దాన్ని అంతా నిర్వర్తించేదెవరు? మన మనస్సే! అలాగే ఏర్పడిన సృష్టిని అంతా నిర్వహించి పరిరక్షించే వాడ్ని ఇంద్రుడు అన్నారు. ఇంద్రుడు అని ఎందుకన్నారంటే ఇదం-ద్ర=ఇంద్ర అన్నారు. ఇదం అంటే ఇదంతా, ద్ర అంటే రక్షించేవాడు. అక్కడ ఎదురుగుండా ఎవడో cigarette కాల్చి ఆర్పకుండా పడేశాడు. అటు వెళుతుంటే 'దానిమీద కాలు వెయ్యక' అని నీకు చెప్పింది ఏమిటి? నీ మనస్సేగా! అంటే నీ మొత్తం వ్యవస్థను రక్షించడానికే గదా అలా చెప్తోంది. 'బాగా కారంగా ఉంది మంచినీళ్ళు తాగు' అని చెప్తుంది తిన్నప్పుడు. 'దాహంగా ఉంది మంచినీళ్ళు తాగు' అని చెప్తుంది. 'ఈ తిన్నది ఇంక ఆపు, లేకపోతే బావుండదు' అని చెప్తుంది. అట్లా ఆపకుండా తిన్నావు అంటే చస్తావు అని చెప్పదూ? తినకపోతే చస్తావు అని చెప్తుంది, ఎక్కువ తింటే చస్తావు అని చెప్తుంది, అన్నీ లోపల నుండే చెప్తోంది కదండీ! వాడే manager! ఇంద్రియాల ద్వారా మనం పొందే వాటన్నిటికీ కూడా వాడు అధ్యక్షత వహించి, నిర్వర్తించి, కాపాడడానికి ప్రయత్నం చేస్తూ ఉంటాడు. అట్లాగే మొత్తం సృష్టికి. వాడు చేసే కర్మ-ఇంద్రకర్మ. మనస్సు నుండీ కూడా ఆ విధంగానే మనకి సమస్తాన్నీ పరిరక్షించే ఒక భావం ఉంటుంది కదా! మన పిల్లల్ని మనం రక్షించుకోవాలి, పోనీ అంతవరకు అన్నా, ప్రపంచం అంతా ఎలాగూ కుదరదు. మన ఒళ్ళు మనం కాపాడుకోవాలి. శరీరమును పరిరక్షించుకునే ఒక ధర్మం ఉంది. తన

వాళ్ళను పరిరక్షించుకునే ధర్మం ఉంది. తనను పరిరక్షించుకునే ధర్మం ఉంది. దానికి ఎట్లా నిర్వర్తించుకోవాలో చెప్పే పద్ధతి ఉంది. అట్లా సృష్టి మొత్తాన్ని పరిరక్షించే వాడు ఇంద్రుడు. వేదంలో ఆయనే కథానాయకుడు. Company కి managing director అండీ! Owner భగవంతుడు అయితే, managing director ఎవరూ? Owner తాలూకు మనిషి అంటాం. కదా! అట్లా ఇంద్రుడు భగవంతునివాడు. 'వసవుడు'. ఆయన 'వాసుదేవుడు'. ద్వాదశ ఆదిత్యుల్లో ముఖ్యుడు. విష్ణువు కూడా ఇంద్రుడి తరువాతే. అందుకనే వేదంకి కథానాయకుడు ఇంద్రుడని చెప్తారు. అందుకనే సమస్తమైనటి యజ్ఞయాగాదుల యొక్క ఫలం ఇంద్రుడికి అందిస్తూ ఉంటారు. అందుకని అక్కడ నుండి చక్కగా సమస్తాన్ని పరిరక్షిస్తాడని. ఆయనకి బలం చేకూరితే, ఆయన మొత్తాన్ని పరిరక్షిస్తూ ఉంటాడు. ఆయనకు ఏమన్నా బలహీనత వస్తే దైవం దిగి రావాల్సి వస్తూ ఉంటుంది. అంటే board of directors కల్పించుకోరు. Managing director ఈ పనులన్నీ చేస్తూ ఉంటాడు కదా! Once in a way report చేసుకుంటూ ఉంటాడు. అట్లా జీవుడికి మనస్సు అనేది, వీడి వ్యవస్థని manage చేసేటి ఒక General Manager. అలాగే సృష్టికీనూ. మన పనులన్నీ చక్కబెట్టుకోవడానికి మన మనస్సు చక్కగా శిక్షణ పొందినదై ఉండాలి. ఆ శిక్షణ ఇవ్వడానికే ఈ చదువులన్నీనూ. మనస్సుకు శిక్షణే. Education is constructive development of mind అన్నారు. అంటే పంచభూతాలతో ఏర్పడిన ఈ సృష్టితో నీవు ఏ విధంగా ప్రవర్తించాలి, అని తెలిపేది విద్య. అది నేర్చుకునేది మనస్సు. 'మనస్సుపెట్టి చదువుకోవాలి' అంటూ ఉంటాం కదా! కాబట్టి ఆ విధంగా తెలుసుకున్న వాడు చక్కగా పరిరక్షించుకుంటాడు తన జీవితాన్ని. అదేవిధంగా సృష్టిని పరిరక్షించడానికి ఒకడు ఏర్పడ్డాడు. ఏర్పరిచాడు. ఏర్పరచిన వాడు 'వాడే'. ఏర్పడిన వాడు కూడా 'వాడే'. వాడిలోంచి దిగి వచ్చే పని ఎవరు? 'వాడే!' వాడి పనికి వాడిని ఏర్పరచుకున్నాడండీ. కదా! ఇప్పుడు managing director, మనం ఏదో ఒక హోటల్ కి managing director గా పెడితే ఆయన పోయి బట్టల వ్యాపారం చేస్తుంటే కుదరదుగా. దేనికి ఆయన్ని నియమించాడో ఆయన అదేగా చెయ్యాలి. నియమించిన వాడెవరు? భగవంతుడు. నియమింపబడినవాడు భగవంతుని యొక్క ప్రజ్ఞ. నియమింపబడే కార్యం భగవంతుని కార్యమే. అంటే ఏమైంది? ఇంత

manager ఎవరికో పనిచేయడమేగా. అలాగే ఇంద్రుడు కూడా ఆపై తత్త్వానికి లొంగి, సమర్పణ చెంది, కార్యాలు నిర్వర్తిస్తూ ఉంటాడు. జరిగేది అంతా కూడా ఇంద్రకర్మ. మొత్తం సృష్టిలో జరిగే పని అంతా కూడా దైవీకర్మ అయినా ఇంద్రుడి కర్మగా కనిపిస్తుంది. ఎందుకని ? నీ లోంచి జరిగేది కూడా దివ్యప్రణాళిక అయినప్పటికీ కూడా నువ్వు చేస్తున్నట్లుగా కనిపించట్లేదు? అట్లాగే. ప్రతి వాడిలోంచి మంచో, చెడో ఏదో జరుగుతోంది కదా! జరిగేటి విషయాల్లోనూ వీడంత స్వామిత్వం లేనివాడే కాబట్టి ఈ జరుగుతున్న దాని కర్మ అంతా కూడా ఇంద్రుడి ద్వారా జరుగుతున్నట్లుగా గోచరిస్తుంది కాబట్టి, మనస్సు ద్వారా జరుగుతున్నట్టుగా గోచరిస్తుంది కాబట్టి, ఈ సమస్తాన్ని 'ఇంద్రకర్మ' అన్నారు. కాబట్టి ఈ ఇంద్రకర్మ దైవీకర్మయే! భగవంతుడే ఇదంతా ఇట్లా నిర్వర్తిస్తున్నది, నిర్వర్తిస్తున్నవాడు. జరుగుతున్నది అంతా కూడా దైవీకర్మయే! కర్మ అనేది దివ్యమైనదని చెప్పాడు కృష్ణుడు. Karma is divine. నీ ధర్మాన్ని అనుసరించి నిర్వర్తించేదంతా కూడా దైవీకర్మే అవుతుంది. ధర్మకర్తగా ఆయన పని నువ్వు చేస్తున్నట్టుగా నువ్వు జీవిస్తున్నావు అనుకో, ఇంద్రుడు కూడా అట్లానే జీవించాలి. ఎందుకంటే నిర్వహణాధికారిగా ఆయన్ని నియమించే అప్పటికే, ఏమి నిర్వర్తించాలో ముందే నిర్ణయం అయింది. Companyకి Bylaws అన్నీ రాసి, ఆ తరువాత ఒక managing director ని పెడతారు. వాడు చేయాల్సిన పని ఆ Bylaws ఎట్లా ఉన్నాయో అట్లా వాటిని నిర్వర్తించడమే. సొంత కొట్టుడు కుదరదు. సొంత తెలివి అసలు కుదరదు. ఆయన ఇచ్చిన తెలివి దానికి వినియోగించి నిర్వర్తిస్తూ ఉంటే ఇదంతా ఏర్పడుతుంది కాబట్టి, ఈ సమస్తము జరిగే కార్యక్రమం ఏదైతే ఉందో, ఆ కార్యం అంతా కూడా ఇంద్రుడు నుండి దిగి వస్తున్నది. దానిని భగవంతుని యొక్క రూపంగా ధ్యానం చేయడం, ఆ విధంగా యోగం చెందడం కర్మలలో భగవంతుడితో. చేసే పనిలో భగవంతునితో యోగం చెందడం, కార్యం-కర్మ అంటాడు భగవద్గీతలో. అంటే చేయవలసిన పని భగవత్కార్యమే! చేయదలచిన పని భగవత్కార్యం కాదు. చేయవలసినది భగవత్కార్యం. చేయవలసిన పని చేస్తూ అనుభూతి చెందమంటాడు. ఇట్లా చేస్తూ ఉంటే సృష్టికర్మ ఎంతయ్యా ఉంది అంటే మనం ఊహించలేము. అందుకని 'మహాకర్మ' అన్నారు.

# 817 మహాకర్మా

మహాకర్మా మనం చెప్పలేం. మహా అనడం లో ఉద్దేశ్యం ఏంటంటే మనకి అంతుపట్టనిది అని అర్థం. అంతుపట్టనంత ఉంటుంది. మనదే మనకి అంతుపట్టట్లేదు. ఈ సమస్త సృష్టిది ఏమిటి అంతుపట్టింది నీకు? మాస్టరు గారు మంద్రజాలంలో కృష్ణుని యొక్క మనోభావంగా ఈ వాక్యం రాస్తారు. 'నాకు మాత్రం అంతుపట్టిందా ఈ మొత్తం?' అని అనుకుంటాడట. ఈ మొత్తం, ఈ నక్షత్రాలు, ఈ గిక్షత్రాలు ఇవన్నీ చూసి అలా... ఎంత ఉన్నదో అని అనుకున్నాడు కృష్ణుడు అన్నట్లుగా మాస్టరు గారు రాశారు. ప్రస్తుతము మనం చేయవలసిన పరిధిలో ఉండేదే మనకు గోచరిస్తుంది తప్ప, మొత్తం గోచరించడం అనేది అయ్యే పని కాదు కదా! ఎంతటి వాడికైనా వాడి పరిధి ఒకటుంటుంది. ఆ పరిధిలో వాడు చేయవలసింది వాడికి కాలం రూపంలో మడతల్లోంచి బయటికి వస్తూ ఉంటుంది. వాడిదైన పని కూడా మొత్తం అంతా ఒక్కసారి బయటికి రాదు. వస్తే మనం చేయం. ముడుచుకుపోతాం. పుట్టినప్పుడే చచ్చేంత వరకు మనం చేయాల్సిన పనులన్నీ list ఇచ్చేశారనుకోండి! ప్రాణం ఉస్సూరుమని అక్కడే పడిపోతాం, నావల్ల కాదు బాబూ అని. అందుకని ఏం చేస్తారంటే 'ఇంతే ఉంటుంది ఈ కాస్త చెయ్' అంటాడు. ఓహ్ ఇంతే కదా అని ఆ కాస్త చేస్తే, అక్కడికెళ్ళంగానే ఇంకొంచెం అని ఇంకో మడత విచ్చుకుంటుంది ఇంతేకాదు ఇంకోటుంటుందని ఇంకో మడత, అది చేస్తే ఇంతేకాదు ఇంకోటుంటుందని. ఇట్టా చేశారు ఈ సి.వి.వి గారు మనందరినీ. లోపలికెళ్ళేవరకు 'ఏం లేదు ఊరికే ఇది తలుపు, ఇది తాళం అదీ, తెరిచేస్తే లోపలికెళ్ళిపోవచ్చు ఇంకేం పని లేదు' అంటే అంతేకదా అని వెళితే అక్కడ ఇంకోటి చూపిస్తాడు. అక్కడ ఇంకోటి చూపిస్తాడు. అక్కడ ఇంకోటి చూపిస్తాడు. ఓరి బాబోయ్ ఇది ఊరికే బయటికింతే అని చెప్పాడు తప్ప ఇది 'అంత' అని తెలుస్తుంది అందుకని CVV గారి పేరు అంటే ఏం లేదు, అసలేం అర్థం చేసుకోక్కర్లేదు, అట్టా చేస్తుంటే చాలు అని విన్నాం కదా! అంటే తాళమే తియ్యకపోతే అంత. తాళం తీస్తే ఓ ఏడు ద్వారాలు, ఎంత ఈయన కథ? చాలా పెద్ద కథ అండీ. కనిపించడానికి అట్టా ఉంటాడు. మొదట్లో తెలిస్తే నాబోటివాడు ఏమైనా సరే చేరేవాడు కాదు. ఓస్ ఇంతేనా అని చేరాం. అది ఇంతై, అంతై, అంతతై, ఎంతెంతో అయిపోయి అసలు మనకి

అంతు పట్టకుండా ఉంది. మాస్టరు గారిని మొదట్లో చూసినప్పుడు నేను అనుకున్నాను 'ఆయనేమో ఇంత చెప్పాడు ఈయన ఇంత చేస్తున్నాడు ఏమిటని?' CVV గారు చెప్పింది చాలా simple. 'ఏంటి మాస్టారు ఆయనేమో ఇంత చెబితే మీరు?' 'అది అంతే' అన్నారు ఈయన. 'ఆయన ఇంతే చెప్పాడు మీరు అంత చేస్తున్నారు' అంటే 'అది అంతే' అన్నారు. 'అదేమిటి' అంటే 'నీకూ తెలుస్తుంది' అన్నారు. 'చేస్తూ ఉంటే తెలుస్తుంది' అన్నారు. ఈ చేస్తుంటే ఏం జరుగుతుంది అంటే ఈ లోపల నుండే నీకు, ఆయన బోధ చేస్తారండీ! అది మనకి తట్టినట్టే ఉంటుంది. Idea మనది అన్నట్టుగా మరింక విరుచుకు పడిపోతూ ఉంటాం. అట్లా ఇది చదువు, అది చదువు, వాడ్ని కలువు, వీడి దగ్గరికెళ్ళు, ఆ పని చెయ్, ఈ పని చెయ్ ఇలా ఉంటుంది. మాస్టారు అంటూ ఉండేవారు 'నా program నాకు daily వస్తుంది' అని. ఎందుకంటే మొత్తం ఒకసారి వస్తే కష్టం కాబట్టి. ఈ రోజుకి program వస్తే ఆ రోజుకి అది నిర్వర్తిస్తే అయిపోయిందా? మర్నాడు మళ్ళీ program వస్తుంది. ఎంత? ఎంత అంటే, ఆయన గురువు గారిని అడిగారు ఒకసారి. 'నాకు తెలిసినంత నేను నీకు చెప్తున్నాను, నీకు తెలిసినంత నువ్వు చేస్తూ ఉండు. మొత్తం ఎవరికీ తెలియదు' అని అన్నారు. 'అసలు ఇదంతా ఎందుకు' అని అడిగారు మాస్టరు గారు ఆయన గురువు గారిని ఓసారి. 'ఎందుకంటే ఇలా చేస్తున్నావు నువ్వు' అని. పైన చేశారు పగలు రాత్రి, మనలాగా ఏదో నిద్రపోయి, తిండి తిని, మిగతా పనులన్నీ చేసుకుని తీరిక వేళల్లో మనం చేస్తున్నాం. అంటే ఇంక ఏ పనులు లేకపోతే దివ్యప్రణాళిక మనకి. కాసేపు అట్లా బయట దేశాలకు వెళ్ళి మాట్లాడి రావడం, ఊళ్ళో వాళ్ళూ వీళ్ళూ పిలిస్తే మాట్లాడడం, ఏవో పండగలకి వాటికీ వీటికీ, పౌర్ణములు, ధనిష్ఠలు అనుకుని ఏవో ఉసూరుమంటూ చేస్తూ ఉంటాం. ఏమీ ఇంకేం పనులన్నా లేకపోతే. ఉంటే? ఆయన అట్లా కాదు కదా! అంతా easy గానే చేస్తున్నా, 30 ఏళ్ళుగా చేస్తున్నా, పగలు రాత్రి చేస్తున్నా ఓ రోజు చిన్న నిస్పృహ వచ్చినట్టుంది మాస్టరు గారికి. వస్తే ఆరోజు గురువుగారు కనిపించారు. 'ఎందుకు ఇదంతా పెట్టారు నాకు' అన్నారు. 'నే పెట్టలేదు. నువ్వు పెట్టుకున్నావు' అన్నారు. 'అదేమిటండీ?' అంటే 'నువ్వు కావాలంటేనే కదా పెట్టాం, నువ్వు అక్కర్లేదంటే పెట్టే వాళ్ళం కాదు కదా, నువ్వు అట్లా అంటున్నావు, మరి నేనెందుకు చేస్తున్నా అని' అన్నారాయన. 'నీ యందు నీకు

ఇది ఎట్లా ఉద్భవించి, ఇదంతా స్ఫూర్తితో చేస్తున్నావో, నాయందు కూడా అట్లాగే జరిగింది, నా పైవాడ్ని నేనడిగితే నాకేం సమాధానం లేదు కాబట్టి, నీ పైవాడైన నన్ను నువ్వు అడిగినా ఏం సమాధానం లేదు, నీకు ఇష్టం లేకపోతే మానేయ్, ఆ స్వతంత్రం ఉందన్నారు'. మానలేరు. అసలు ఏం చేశారంటే ముందే రుచి కలిగించి, ఆ తరువాత మానేయమన్నట్టు. పైథాగరస్ లాగ. పంచేస్తా అని చెప్పి నెమ్మదిగా డబ్బులు తగ్గించుకుంటూ వచ్చి చివరికి ఇస్తే కానీ చెప్పనన్నారు ఆయన. అంతకు ముందు పెట్టిన పెట్టుబడి అంతా మళ్ళీ ఆయన తిరిగి పొందాడు. ఇట్లా ఉంటుంది. అంత వస్తూ ఉంటుంది. ఎంత వస్తుంది అనేది మనం చెప్పలేం. ఇప్పుడు కలియుగం అయిందండీ! ఇదేదో ఇరవై ఎనిమిదవ కలియుగంట. అంటే అన్ని కృతయుగాలు, ద్వాపరయుగాలు, త్రేతాయుగాలు కూడా అయిపోయినాయి. ఇది మొదటి సృష్టా? ఇంకెన్ని సృష్టిలు ఉన్నాయి సార్ అంటే నవ్వుతాడు. ఎన్ని సృష్టిలు ఉండడం ఏంటి? ఒకటి అయిపోతూ ఉంటే ఒకటి వస్తూ ఉంటుంది పెనం మీద దోసెల్లే. పెనం ఆర్పరా అంటే ఇది ఆర్పే పెనం కాదయ్యా, ఎప్పుడూ కాలుతూనే ఉంటుంది, పిండి ఎప్పుడూ ఉంటుంది, వేస్తూనే ఉంటాం అని చెప్తారన్నమాట అట్లా గోళాలు గోళాలు లయమైపోతుంటే, గోళాలు గోళాలు బయటికొస్తుంటే ఇంక జీవరాశుల లెక్కేముంది? మహాకర్మ! అందులో మనం చేసేదెంత? సముద్రంలో కాకిరెట్ట అన్నట్టు ఉంటుంది. కదా! అదొక్కసారి ఆలోచిస్తే మనస్సుకి దిగ్భ్రాంతి కలుగుతుంది. ఎంత దిగ్భ్రాంతి కలుగుతుందో అంత అనుభూతి కూడా కలుగుతుంది. అబ్బో అనిపిస్తుంది. అటువంటి బొమ్మ, అటువంటి సినిమా చూశారుట మాస్టారు. భగవద్గీత చదువుతుంటే మొత్తం కృష్ణుడు, సృష్టి ప్రణాళిక, ఈ గోళాలు రావడం, ఈ గోళాలు పోవడం అనే ఈ సినిమా చూసిన తర్వాత ఇంక మరి అస్సలు అహంకారం అనేది పోయిందిట ఆయనకి. ఇంత ఉంటే, ఇంతలో నువ్వేదో, ఎన్ని భూములు వచ్చినాయో పోయినాయో అందులో ఒక భూమి మీద, ఒక దేశంలో, ఒక రాష్ట్రంలో, ఒక ఊళ్ళో ఏవో కొన్ని మంచి పనులు చేస్తూ విర్రవీగడానికి ఏముంది? ఏం లేదు. అసలు అలా కూర్చుని ఆలోచిస్తే మహాకర్మ గురించి మన అహంకారం అంతా అట్లా మంచుగడ్డ పెనం మీద పెట్టినట్టుగా కరిగిపోతుందండీ! ఏమో చేస్తున్నావు నీ మొహం మొత్తం చూడు. దీన్నంతా ఇంద్రకర్మ అంటారు. ఈ ఇంద్రుడు ఈ సృష్టికి. సృష్టిలే బోల్డు

ఉన్నాయని చెప్తుంది మనకి దేవీపురాణంలోంచి. బ్రహ్మగారు సరదాగా ఒక weekend కి విష్ణువునీను, శివుడ్ని కలిసి ఎక్కడికన్నా వెళ్దామంటే, అందరినీ గరుత్మంతుడి మీద ఎక్కించుకుని వెళుతుంటే, ఇంకో బ్రహ్మ, ఇంకో విష్ణువు, ఇంకో శివుడు అట్లా ఆరుగురు కనిపించారుట. అసలు ముందు మనమే అనుకున్నారు వాళ్ళు ముగ్గురూ. వెళుతుంటే అలా కనిపిస్తూనే ఉన్నారుట. ఇదేమిటిరా అంటే? ఎందుకు ఇచ్చారో తెలుసా ఈ కథ? 'ఇదొకటే కాదు సృష్టి' అని చెప్పడానికి. నీళ్ళు తెర్లిస్తున్నప్పుడు ఎన్ని బుడగలొస్తాయి? సోడా ఎప్పుడన్నా పట్టుకుని తాగకుండా చూశారా? అట్టా చూస్తే బుడగలు అట్లా వస్తూనే ఉంటాయి. పైబుడగలు మాయమైపోతుంటే మళ్ళీ కింద నుండి బుడగలు వస్తూ ఉంటాయి. ఈ కింద నుండి ఎక్కడి నుండి వస్తోంది? ఇట్లా అనుస్యూతం బుడగలు వస్తూనే ఉంటాయి కదా! అట్లా బుడగలు వచ్చినట్టు వస్తూ ఉంటాయి గోళాలన్నీ. అందులోంచి జీవులున్నూ. అది మహాకర్మ!

## 818 కృతకర్మా

చేసేశాడట. Accomplished. అది చేస్తూ ఉండడం కాదు మనకి చెప్తూ ఉండడం. చేసేశాడట. అదట్లా తిరుగుతూ ఉంటుంది అంతే, గుండ్రం గుండ్రంగా. ఇది మరీ, విన్నప్పుడు కొంచెం 'అమ్మదొంగా' అనిపిస్తుంది. చేసేసి వదిలేశాడండీ! ఇంక అదట్లా తిరుగుతూనే ఉంటుంది. కృతకృత్యులు అంటాం చూశారా? అట్లాగే కృతకృత్యులంటే నిర్వర్తింపబడిన కార్యము సిద్ధి పొందినవాడు. కార్యమును నిర్వర్తించినవాడు. ఇక్కడ కర్మను నిర్వర్తించేశాడుట. కృతకర్మ కృతవర్మ లాగా. ఏం నిర్వర్తించేశాడు? అంతా ready గానే ఉంది ఆయన దగ్గర ఎప్పుడూ సరుకు. అదే అటు నుండి ఇటు, ఇటు నుండి అటు తిరుగుతూ ఉంటుంది. కొత్తగా చేయాల్సిందేం లేదు ఆయన. చేసి వదిలేశాడండీ! అవే బయటకొస్తూ ఉంటాయి, లోపలికి పోతూ ఉంటాయి బయటకొస్తూ ఉంటాయి, లోపలికి వస్తూ ఉంటాయి. బయటికొస్తుంటాయి, లోపలికి వస్తూ ఉంటాయి. ఇది తెలిసినప్పుడే బ్రహ్మకి జ్ఞానం కలిగిందిట. 'సృష్టి చెయ్యవా' అంటే 'బాబోయ్ ఇంతెక్కడ చేస్తాం అండీ' అన్నాడట. 'నువ్వేం చేయక్కర్లేదు. నువ్వు 'ఊ' అను అంతా జరిగిపోతుంది' అన్నాడు. 'ఎట్లా జరుగుతుందంటే' 'అది అంతే' అన్నాడు. 'ఊ' అన్నాడు కనిపించింది. అంతా అక్కడే ఉంది. తూము అన్నమాట. తూముకి అవతల అంతా ఉందండీ! కానీ కనపడదు. తూములోంచి బయటికి రాగానే ఒక్కొక్కటీ వచ్చేస్తుంది. అదీ సృష్టి! బ్రహ్మ సృష్టికర్త అని బిరుదు పొందాడు తప్ప, అదంతా భగవంతుడి లీల. తన యొక్క కీర్తినంతా భక్తులకి కట్టబెడతాడు. చేసుకునేదంతా చేసి, వడ్డించిన విస్తరి అంటాం చూశారా? అంతా చేసి ఉంచితే, ఈయన ఊరికే ఆ తూముకి బిరడా తీసుకుంటే, ఆయన లోంచి బయటికి వచ్చేస్తుందిట. అతడే చేస్తున్నాడు కానీ ఇతడే చేస్తున్నట్టుగా ఉంటుంది. కానీ అంతా వాడే చేస్తున్నాడని తెలుస్తూ ఉంటుంది. అప్పుడు తను తూము అవుతాడు. అది వాహిక అంటే. అది medium అంటే. అది భాగవతంలో 'వేల్పు సోకిన వృత్తి' అంటారు. వీడుండడు వాడుంటాడు. ఇతడు ఊరికే పక్కన ఉంటాడు. ఆయన చేసుకుపోతూ ఉంటాడు. కుర్చీ వాడికిస్తాడు. సమస్తము అతడే చేస్తున్నాడు, ఊరికే కీర్తి నాకు కట్ట పెడుతున్నాడు అని తెలిసిన వాడు భక్తుడు. ఏదో మనం

ఇంత చేయడం బట్టి మనకి అంత వస్తోంది అని అనుకునేటువంటి, మనం ఇట్లా చేస్తే మరి భగవంతుడు చేసి పెట్టద్దా, ఇలాంటివన్నీ కొంచెం పండిన వ్యవహారాలు కాదు. పండిన వ్యవహారం ఒకటే ఉంటుంది. వాడు తూము అల్లే ఉంటాడు. అవి వస్తూ ఉంటాయి. ఇప్పుడు మనం tap తిప్పితే నీళ్ళు వస్తున్నాయి. రాకపోవచ్చు అనుకోండి municipal tap తిప్పితే. ఏదో మనం అంటూ ఓ tank కట్టుకుని తిప్పుతున్నాం కదా! నీళ్ళిచ్చేది tap కాదుగా! ఉండాలిగా నీళ్ళు. నీళ్ళు ఇచ్చేది tap ఎట్లా కాదో, tap లేకపోతే నీళ్ళు ఎట్లా రావో అల్లా అన్నమాట. ఈ example చాలు మనకు. పెద్ద పెద్ద ఉపనిషత్తులు అవన్నీ వెతుక్కోక్కర్లా. Tap లేకపోతే తిప్పకుంటే నీళ్ళు వచ్చేదేం లేదు, తిప్పడానికి ఏం లేదు కాబట్టి. తిప్పినా నీళ్ళు రాకపోవచ్చు. కాబట్టి నువ్వు ఊరికే నీది తిప్పి ఉంచరా, నేను వచ్చేస్తాను అందులోంచి అని చెప్పాడన్నమాట. అంతా తయారు చేసే ఉంచాం, వంటలన్నీ ready గానే ఉన్నాయి, ఊరికే నువ్వు చివరికి తిరగమోత పెట్టు అన్నట్టుగా. చూడండి అంతా అన్ని పనులు చేసిన తర్వాత చివరకు వచ్చి తిరగమాత పెట్టి వంట తనే చేసినట్టుగా అత్తగార్లు behave చేసేవాళ్ళు పూర్వకాలంలో. ఇప్పుడు పాపం మొత్తం వాళ్ళే చేస్తే, వీళ్ళు వచ్చి తిరగమోత పెట్టి, reverse అయిపోయింది. కాలం అట్నుంచి ఇటు, ఇట్నుంచి అటు మారుతూ ఉంటుంది కదా! ఎవరు తిరగమోత పెట్టే వాళ్ళో, ఎవరు వంట చేస్తున్నవాళ్ళో మారిపోతూ ఉంటాయి. భగవంతుడు, 'నువ్వు తిరగమోత కూడా పెట్టక్కర్లేదు, అది కూడా నేనే పెట్టి ఉంచాను, నువ్వు ఊరికే మూత తెరు' అంటున్నాడు. చూడండి అంతా చేసిన తర్వాత మూత తెరిస్తే మనకి కరివేపాకుతో మంచి వాసన వస్తూ ఉంటుంది చారుగానీ, ఉప్మాగాని. అది కూడా వేసేసి ఉంచానయ్యా తెరవమని చెప్తాడు. అది భాగవత సాంప్రదాయం. కృతకర్మ- భగవంతుడు నిర్వర్తించేస్తాడు. నీది కూడా నిర్వర్తించి ఉంచాడు, నువ్వు సరిగా మూత తెరవాలి అంతే. నన్ను కృతకృత్యుడ్ని చేయమని చెప్పాలి భగవంతుడికి. అంటే జరిగిపోయే కర్మగా ఉన్నది తప్ప, చేసే కర్మ గా ఉండకూడదు. కృతకృత్యుడు అయ్యాడు అంటాం చూడండి pass అయితే. కానీ ఇందులో తమాషా ఏంటంటే 50-50 గా కనిపిస్తుందండీ! మనం చేస్తే అది జరిగింది అన్నట్టుగా ఉంటుంది. మనం చేస్తే అన్నీ జరగట్లేదు కదా? అందుకే మనకి ఈ TV లో చూపించే advertisement 50-50 ఉంది చూశారా? రూపాయి బిళ్ళకి

బొమ్మ బొరుసు 50-50. కాకబోతే నీవరకు వాడు చేస్తున్నాడు అనుకుంటే సుఖపడతావు నువ్వే చేస్తూ. నువ్వు పడుకుంటే జరగదు. మూత తియ్యాలి. మూత తీయడం అంటే పని చెయ్యడం.

## 819 కృతాగమః

వాడు రాశాడు వీడు రాశాడు అని అనుకుంటుంటాం కదా! వేదాలు ఎవరు రాశారు? ఉపనిషత్తులు ఎవరు రాశారు? They are already there. అప్పుడప్పుడు అప్పుడప్పుడు, దేశాన్ని బట్టి, కాలాన్ని బట్టి, జీవుల అర్హతను బట్టి దిగొస్తూ ఉంటాయి అవి. అందుకని వాళ్ళు పేర్లు పెట్టుకోలేదు. మనం చాలా పెద్ద పెద్ద పేర్లు పెట్టుకుని, వాటికి royalties పెట్టుకుని, అవి మనవి అనుకుని, విజ్ఞానం మనదా? మనలో జ్ఞానం పెరుగుతుంటే, ఆత్మకి దగ్గరవుతున్న కొద్దీ అది వికసించి బయటికొస్తూ ఉంటే మనదనుకుంటే ఎట్లా? వెలుగు tubelight దా? Tubelightది అయితే మాడిపోవడం అనేది ఎక్కడి నుండి వస్తుంది? రాదు కదా! అందులోంచి వస్తోంది. అట్లా తమలో నుండి భగవంతుడే సమస్తమైన సాంప్రదాయములను, సంస్కారములను, యజ్ఞములను, యాగములను, క్రతువులను, యోగమును, సమస్తమును తానే ఏర్పరచి ఉంచినది భాసిస్తూ ఉంటుంది అంతే. ఉన్నది భాసించడమే! కొత్తగా వచ్చేదేం లేదు. 'నేనేదో కొత్తగా చెప్పాను' అని అనుకుంటే ఎవడన్నా వాడంత మూర్ఖుడు ఇంకోడు లేడు. వాడికి కొత్త తప్ప, అది కొత్త కాదు. ఏదైనా మనకి కొత్తగా తెలిసింది, మనకి కొత్తగా తెలియడం తప్ప అంతకుముందు లేదా? భూమ్యాకర్షణ శక్తి గురించి Madam Blavatsky అట్లా రాస్తుంది Secret Doctrine లో. అట్లా చూస్తున్నాడట Newton. ఏదో ఆలోచిస్తున్నాడు పాపం. చూస్తుంటే Apple చెట్టు మీద నుండి ఒక Apple పండు పడ్డది. అప్పుడు వెలిగిందట. భూమికి ఆకర్షణ శక్తి ఉన్నది అని. అందుచేత Apple కింద పడ్డది లేకపోతే పైకెళ్ళి పోవచ్చు కదా ఆకాశంలోకి. కిందే ఎందుకు పడాలి? మనకైతే ఆలోచన కూడా రాదు. ఆయనకు వచ్చింది వస్తే, భూమ్యాకర్షణ శక్తి ఉన్నదని Newton చెప్పకముందు భూమికి ఆకర్షణ శక్తి లేదా? అని అడుగుతుంది Blavatsky. చెప్పిన తర్వాతే వచ్చిందా భూమికి ఆకర్షణ శక్తి? నువ్వు 1 2 3 4 5 6 7 8 9 10 అంకెలు నేర్చుకోకముందు నీలో సంఖ్యా జ్ఞానం లేదా? ఉంది. నేర్చుకున్న తర్వాత వచ్చిందనుకుంటాం. అంతకుముందు ఉంది. దానికే మాస్టారు గారు ఎప్పుడూ ఒక ఉదాహరణ ఇచ్చేవారు. ఒక చేతిలో ఐదు Chocolates పట్టుకో, ఒక చేతిలో ఒక Chocolate పట్టుకో, పిల్లవాడికి చూపించు ఏ

చేతిని వాడు prefer చేస్తాడో. అంటే ఇందులో ఐదు ఉన్నాయి అందులో ఒకటి ఉంది అని వాడికి పదం తెలియదు కానీ, దాని జ్ఞానం ఉంది. అంకెల జ్ఞానం ఉంది. అంకె పేరు తెలీదు. అంకె రూపం తెలీదు. ఎప్పుడన్నా ఆలోచించారా? ఒకటి అంటే అంకెగా కాకుండా, పేరుగా కాకుండా అది ఉన్నది. ఒకటి సంస్కృతంలో ఎట్లా వేస్తావు? మనం ఎట్లా వేస్తాం ఒకటి? మరి అదా ఒకటి? ఇదా ఒకటి? ఏదండీ ఒకటి? వాడు ఏకం అని రాస్తాడు. నువ్వు 1 అని రాస్తావు, ఇంకోడు One అంటాడు. పేర్లు వేరు, రూపాలు వేరు కానీ జ్ఞానం? ఇట్లా ఒక వేలు చూపించాం అనుకోండి, సంస్కృతంలో నేర్చుకున్న వాడు, తెలుగులో నేర్చుకున్న వాడు, English లో నేర్చుకున్న వాడు కూడా ఒకటనే అంటాడా? ఒకటే అని అర్థం చేసుకుంటాడా? ఒకటి అనడు. One అనుకుంటాడు లోపల. అరవ వాడు అయితే వణ్ అంటాడు కదా! ఏమన్నప్పటికీ దాని జ్ఞానం అందరికీ సమానమేనా? ఎప్పుడన్నా మనం ఆలోచించామా అంకెకి రూపము, నామము లేకుండా అది ఉన్నదని? పిల్లవాడికి అది తెలియదుగా! ఇది అయిదని ఇది ఒకటని తెలుసా? అది ఎందుకు అందుకుంటున్నాడు? పోనీ ఐదు వదిలిపెట్టండి. రెండు ఒక చేతిలో పెట్టుకొని, ఒకటి ఓ చేతిలో పెట్టుకుని ఏది కావాలి నాన్నా అంటే టపక్కన అది పుచ్చుకుంటాడు. అంటే ఏమిటి? సంఖ్యా జ్ఞానము తన యందు ఉన్నది, తరువాత తెలిసినది. తెలియక ముందు లేదా? అంటే ఏమిటండీ? సమస్తమూ ముందే తెలియబడి ఉన్నది. తెలిసిన దానిని తెలియనితనం అనే పొర కప్పి ఉన్నది. ఇది మన వాళ్ళ అవగాహన. ఋషులేం చెప్తారంటే 'జ్ఞానము అజ్ఞానముచే ఆవరింపబడి ఉన్నది' అంటారు. అయితే ఏమిట్ట? అన్నట్టుగా ఉంటుంది మనకి. అంటే నువ్వు నేర్చుకోవాల్సిందేం లేదు. గుర్తుపెట్టుకోండి కొన్ని నేర్చుకున్నవి మర్చిపోవాలంతే. ఇదో పద్ధతి. ఇది అద్భుతమైన పద్ధతి. లోపలికెళ్ళే కొద్దీ ఇది తెలుస్తుంది. పొందాల్సిందేం లేదు. వదలాల్సింది ఉంది అని తెలుస్తుంది. వదలాల్సినవన్నీ వదిలితే నువ్వేది పొందుదామనుకున్నావో అది నువ్వుగానే అప్పటికే ఉన్నావు. ఉన్నవి విప్పెయ్యడమే. అది నగ్నస్వరూపం! చాలాసార్లు నగ్నం గురించి చెప్పా కదా! అన్నీ వదిలేయాలండీ. అదే నేతి సిద్ధాంతం. న-ఇతి న-ఇతి, ఇది కాదు ఇది కాదు ఇది కాదు అనుకుంటూ వెళ్ళాడుట. అయితే ఏమిటంటే ఏదీ కాని, నీకు భావంలోకి రాకుండా ఉన్నది, అంటే నీవుగా ఉన్నది భావంగా ఏర్పడుతూ

ఉన్నది. భావం లేకుండా నీవున్నావనేది ఎట్లా నీకు తెలిస్తే, నీకు నీ గురించి తెలుస్తుందో అది నిజస్వరూపం. అట్లాగే జ్ఞానము సమస్తమూ సృష్టి ముందు నుండీ ఉన్నది. సృష్టిలో ఉన్నది. సృష్టి లయం అయిన తర్వాత కూడా ఉంటుంది. కాబట్టే అట్లాగే వస్తుంది అది. మామిడి టెంకలో మామిడి చెట్టంతా జ్ఞానంగా అమర్చబడి ఉన్నది. మళ్ళీ మామిడి చెట్టు గానే వస్తుంది. ఇంకో రకంగా రాదు. సృష్టి అనే విత్తనంలో జ్ఞానం అంతా కూడా, సృష్టి విజ్ఞానం అంతా కూడా అట్లా ఇమిడి ఉన్నది. అది కొత్తగా కనుక్కోవడానికేం లేదు. కృతాగమః - ఆగమములన్నీ కూడా కృత-కర్మ, కృత-ఆగమ. చాలా అద్భుతమైన విషయాలు. వీటి మీద చాలా ధ్యానం చేయాలి. అందుకనే బయట గ్రంథాలు చదవకుండా లోపల నుండే జ్ఞానం భాసిస్తుంది తపస్సు చేసుకునే వాళ్ళకి. ఋషులకు అట్లా భాసించింది. ఇటు వీళ్ళలాగా అట్లా శుక్రుడులోకి పోదాం, ఇట్లా అంగారకుడిలోకి పోదాం, అట్లా చంద్రుడులోకి పోదాం, చూసొచ్చింది మాత్రం వీడికేం అంత తెలియదు. ఊరికే ఘనమైన/స్థూలమైన విషయాలు తెలిసినాయి తప్ప, సూక్ష్మమైనవి తెలియలా. వీళ్ళు సూక్ష్మ దర్శనం కూడా చేశారు. Scienceకి Quantitative understanding ఉన్నది. కాని ఋషుల దగ్గర qualitative understanding కూడా ఉన్నది. ఎలా వచ్చింది? అక్కడికెళ్ళారా? ఇక్కడ కూర్చునే అక్కడ దర్శనం చేశారు. ఎట్లా దర్శనం చేశారు? ఇక్కడే ఉన్నాయి అన్ని గ్రహాలూనూ. న్యాసవిద్య చేసుకునేవాడు తన శరీరంలో ప్రతి గ్రహాన్నీ గుర్తించవచ్చుట. అదేం చేస్తుందో తన దేహంలో చూడగలడుట. ఎందుకంటే ఇది/దేహం విశ్వరూపం. అలా చూశారు సి.వి.వి గారు. శుక్రగ్రహం లోపల ఏం జరుగుతోంది? ఏం చేయాలి? శనిగ్రహంలో ఏం జరుగుతోంది? ఏం చేయాలి? అని. ఎందుకంటే ద్వాదశ భావములు మానవ శరీరంలో ఉన్నాయి. దీన్నే 'న్యాసవిద్య' అంటారు. పిండాండ బ్రహ్మాండ సమన్వయం. The law of correspondenses is one of the important laws towards knowledge అని చెప్తారు Madam Blavatsky. అంతకుముందు చెప్పలేదా? చెప్పారు! ఏదీ కూడా ఇంతకుముందు చెప్పలేదు ఇప్పుడే చెప్తున్నాం అంటే నమ్మొద్దండీ! అంతకుముందు కూడా చెప్పారు. ఇప్పుడు మనకి తెలుస్తోంది. మనం రెండో class లోకి వచ్చినప్పుడు, మనం మొదటిసారిగా రెండో class పాఠాలు విన్నప్పుడు మనకి

మొట్టమొదటిసారిగా తెలుస్తాయి అవి. కానీ అంతకుముందు రెండో class లో ఉండేవాళ్ళు ఉన్నారు. వాళ్ళు ఇప్పుడు మూడో class కి వెళ్ళారు. మనకి కొత్త. కాబట్టి సమస్తమైన ఆగమములు, శాస్త్రములు, జ్ఞానము, విజ్ఞానము, యోగ మార్గములు అన్నీ కూడా ఉన్నాయి. కాలాన్ని బట్టి, దేశాన్ని బట్టి వ్యక్తమవుతూ ఉంటాయి. నీలో కూడా అజ్ఞానపు పొరలు తొలగిన కొద్దీ ఉన్నవి కనిపిస్తూ ఉంటాయి. కొత్తగా తెలుసుకోవడం ఏం లేదు. దీనికి ఒక్కటే ఒక ఉపమానం ఉన్నది ఏమిటయ్యా అది అంటే బండరాయిలో ఉండే అనవసరమైన ముక్కలు తీసేస్తే విగ్రహం కనిపిస్తుంది. శిల్పకారుడు అందులో ఉండేటి సుందరమైన విగ్రహాన్ని అట్లా దర్శిస్తూ ఉంటాడు. దాన్ని దర్శిస్తూ ఉండడం వల్ల దాని చుట్టూ అనవసరంగా పేరుకున్నవన్నీ ఉలితో తీసేస్తూ ఉంటాడు. అట్లా కాకపోతే వాడు చిత్రకారుడు అవడు. కొట్టేసిన తర్వాత 'ఓహో ఇక్కడ తల ఉండాలి కదా' అని అనుకుంటే ఎట్లా? అయ్యో ముక్కు మర్చిపోయానమ్మా అన్నట్టుగా ఉండదూ? కన్ను మర్చిపోయాను, కనుబొమ్మలు మర్చిపోయాను, ఇట్లా ఉండదు. ఎందుకు మర్చిపోడంటే మొత్తం అందులో సుందరమైన రూపం కనిపిస్తూ ఉంటే దానికి అడ్డుగా ఉన్నదంతా తొలగిస్తూ ఉంటాడు. అది తెర తొలగింపు! Isis Unvealed ఆవిడ రాసిందే. ఉన్నదాన్ని, కప్పి ఉంచిన దాన్ని తీసేస్తూ ఉంటాం అండీ. పొట్టులో ఉందనుకోండి కృష్ణుని విగ్రహం పొట్టు ఎట్లా తీసేస్తాం? అట్లాగే మనలో కూడా పొట్టు జీవితం తీసేస్తే గింజ జీవితం ఉంటుంది. గింజ తీసేయం కదా! అలా సమస్తము అక్కడే ఉన్నది. అది కప్పబడి ఉన్నది. కప్పబడి ఉన్న విషయాలు తీసేస్తే ఆగమములన్నీ నీకే గోచరిస్తాయి. అట్లా గోచరింపకపోతే మొట్టమొదట రాసిన వాడు ఎక్కడి నుండి రాశాడు? అంతా ఆకాశంలోనే ఇమిడ్చి ఉంచారుట. Akashic Records అంటారు. అందులోంచి అప్పుడప్పుడు అప్పుడప్పుడు, కొంత కొంత కొంత కొంత అవసరాన్ని బట్టి వ్యక్తమవుతూ ఉంటుంది. అదంతా కూడా ఎప్పుడు ఎక్కడ ఏ విధంగా వ్యక్తం అవాలనే విషయాన్ని కూడా నిర్ణయం చేసి ఉంచాడు. అది తీస్తే అది కనిపిస్తుంది. ఇది తీస్తే ఇది కనిపిస్తుంది. ఇట్లా ఎక్కడ తీస్తావు? బయట కాదు లోపల! లోపల పొరలో! అజ్ఞానపు పొరలన్నీ కూడా నిర్మూలనం చేసుకుంటూ ఉంటే మిగిలింది జ్ఞానం! అంతేగానీ ఎక్కడ నుంచో తెచ్చి జ్ఞానాన్ని మన మీద రుద్దుకో అక్కర్లేదు. అందుకనే Master CVV గారు

ఒక వాక్యం ఇచ్చారు. మళ్ళీ గుర్తు చేయడానికి ఈ వాక్యం. అంతకు ముందు కూడా ఉంది. ఏదైనా ముందు కూడా ఉందనుకోండి. మనకి చెప్పిన వాళ్ళు, మనకి మొదటిగా తెలిసింది కాబట్టి వాళ్ళు చెప్పినట్టుగా చెప్పకుంటాం. 'నీకేదన్నా కావాలనుకుంటే నా దగ్గరకు రాక. నీ దగ్గర ఉన్నవి పోవాలనుకుంటే నా దగ్గరికి రా' అన్నాడాయన. మరీ శొంఠి కొమ్ము మార్గం-పెట్టుకుంటే మండుతుంది తర్వాత చల్లగా ఉంటుంది. నీకేమన్నా కావాలనుకుంటే ఇక్కడికి రాబోక, ఉన్నవి ఏమన్నా కొన్ని పోవాలి అనుకుంటే రమ్మంటాడు. ఎందుకంటే ఉన్నవి పోతే మిగిలేది సచ్చిదానంద స్వరూపం అన్నమాట. అంతవరకు పట్టుకుపోతాడు. వలిచేస్తాడు. వలిస్తేనే కదా తినగలం. ఆగమములన్నీ గోచరిస్తాయి. అట్లా దర్శనం జరిగినాయి వేదములు గానీ, ఉపనిషత్తులు గానీ, పురాణములు గానీ, దర్శనం చేసి ఇచ్చారు. అందుకని అవన్నీ 'దర్శన గ్రంథములు'. అంటే అర్థమేమిటంటే చూచి రాశారు అని అర్థం. దర్శన గ్రంథములు, ఆగమములు కూడా అట్లా సమస్తమూ ఏర్పరచబడి ఉన్నాయి. ఏర్పరచి ఉంచాడు కాబట్టే కృతాగముడు! ఆగమములు కూడా రచించి ఇచ్చినటువంటి వాడు. దానికి ఎవరైనా పేరు పెట్టుకుంటే 'పెట్టుకో' అంటాడు. నాది అని పేరు పెట్టుకుంటా అంటే ఆ.. పెట్టుకో. ఎవడేమైనా చేసుకోవచ్చు. దాన్ని mixture పొట్లంగా కూడా చింపుకుని వాడుకోవచ్చు. కాదనడు. ఎవడి స్థితిని బట్టి వాడు వాడుకుంటాడు. ఆయనకి దేనియందూ మమకారం లేదు. అట్లా ఉంచాడు కాబట్టి ఈ కృతకర్మడు, కృతాగముడు అనే అద్భుతమైన నామములు, అన్ని నామాలు అట్లాగే ఉంటాయి. మనం లోతులోకి వెళ్తూ ఉంటే విపరీతంగా ఆశ్చర్యం కలిగిస్తాయి. ఆనందాన్ని కలిగిస్తాయి.

## 820 ఉద్భవః

ఉద్భవః అంటే మామూలుగా చెప్పకోవాలంటే మొలకెత్తేవాడని. ఉద్భవించేవాడు. మొలకెత్తడం రెండు విధాలుగా మనకు గోచరిస్తుంది. ఒకటి భూమిలోంచి మొలకెత్తడం. ఒకటి నేననే ప్రజ్ఞ నుండి సంకల్పంగా మొలకెత్తడం. మనలోనూ మొలకలెత్తుతాయి. భూమి లోనూ మొలకెత్తుతాయి. భూమిలో మొలకెత్తినపుడు ఉద్భవించిందని అనుకుంటాం. అలాగే మన మనసులో కూడా తలపులుగా ఉద్భవిస్తూ వుంటాయి. అదే విధంగా అంతర్యామితత్త్వము, లేక పరతత్త్వము నుండి మొదట సృష్టికి సంబంధించిన సంకల్పము ఉద్భవించి, ఆ సంకల్పము ప్రకృతిగా ఒక ప్రతిపాదికగా ఏర్పడితే, అందుండి ఆయనయే ఉద్భవిస్తే మళ్ళీ, అది కారణంగా నిరాకారము, నిర్గుణము అయిన పరబ్రహ్మతత్త్వము త్రిగుణములుగా భాసిల్లి, మూడు పేటల అల్లికగా సమస్తమైన సృష్టి సత్త్వము, రజస్సు, తమస్సు ఆధారంగా ఏర్పడితే అక్కడ నుండి మనకి సమస్తమైన లోకాలు ఏర్పడుతూంటాయి. ప్రతిది ఒక లోకం నుండి ఒక లోకం ఉద్భవిస్తూంటుంది. సత్యలోకంలోంచి తపోలోకము, తపోలోకంలోంచి జనోలోకము. జనోలోకంలోంచి మహర్లోకము, మహర్లోకములో నుండి సువర్లోకము, భువర్లోకము, భూలోకము ఇట్లా ఉద్భవిస్తూంటాయి. సూక్ష్మం నుండి స్థూలానికి సమస్తమైన ఉద్భవం జరుగుతూంటుంది. అందుకనే పురుషోత్తమప్రాప్తి యోగంలో ఈ మొత్తానికీ వ్రేళ్ళు పైన వున్నాయి, కొమ్మలు, రెమ్మలు, ఆకులు క్రిందికి వున్నాయి అని తల్లక్రిందులుగా వుండే చెట్టు ఒకటి చెప్తారు. తల్లక్రిందులని మనం ఎందుకంటామంటే ఇట్లా భూమిలోంచి పెరిగే చెట్టు చూడడం బాగా అలవాటయ్యింది కాబట్టి, అది మనకు తలక్రిందులు. కానీ ఆచెట్టుతో పోల్చి చూస్తే మిగతావన్నీ తల్లక్రిందులన్నమాట. ఎప్పుడు కూడా ఋషిపోక్తమైన మార్గంలో సూక్ష్మం నుండి స్థూలానికే సమస్తమూ దిగి వస్తుందని తెలిసి వుండాలి. మార్పులు ఎప్పుడు చేసుకోవాలన్నా సూక్ష్మంలో మార్పులు చేసుకుంటే, స్థూలంలో మార్పులు యేర్పడతాయి. అందుకనే ఉద్భవము అనే దానికి పుట్టాడు అంటాం. పుట్టడము అనేది అతి సూక్ష్మంగా వుంటుంది. మనం పుట్టాడు అని తెలుసుకునేప్పటికే చాలా స్థూలంగా తయారైపోతుంది. పిల్లవాడు పుట్టాడు

అని telephone చేసుకుంటాం, telegramలు ఇస్తాం. అప్పుడా పుట్టింది? అంతకు ముందే పుట్టాడు. తల్లి కడుపులో ప్రవేశించడమే ఒక పుట్టుక. అంతకు ముందు తండ్రి సంకల్పంలోకి దిగిరావడం ఒక పుట్టుక. ఇట్లా సూక్ష్మాతి సూక్ష్మంగా మనకి పుట్టుకలున్నాయి. అలాగే భగవత్తత్త్వం కూడా తననుండి యేర్పడిన సంకల్పంలోకి తను దిగి వస్తూవుంటాడు. మనం కూడా మన నుండి వచ్చే సంకల్పములలోకి మనం దిగి పని చేస్తూ వుంటాము. అంటే త్రిగుణాలలోకి దిగి పని చేయడమే! ఆ తత్త్వాన్ని ప్రకృతి త్రిగుణములుగా యేర్పరచుకుంటుంది. తాను భగవత్తత్త్వం నుండి వ్యక్తమై, ఎందుండి తాను వ్యక్తమయ్యిందో దానిని తాను తనలోకి ఆవాహన చేసుకుని దానిని మూడురకాలుగా తయారు చేస్తుంది. మాస్టారుగారు దాన్నే ఉప్పు, కారం, పిండి కలిపి జంతికలుగా తయారు చేసినట్టుగా, అని రాశారు మంద్ర గీతలో. మూడు రకాలుగా అంటే ఉత్తపిండి సత్త్వగుణం, కారం రజోగుణం, ఉప్పు తమోగుణం అనుకుంటే, మూడు రకాలుగా తయారు చేస్తే జంతిక వచ్చింది. అంతకుముందు జంతిక ఎక్కడ వుంది? పిండిగానూ, ఉప్పుగానూ, కారంగానూ వుంది. ఆ మూడూ ఎక్కడ నుండి వచ్చినాయి? అట్లా చూసుకుంటే మనకి త్రిగుణముల నుండే సృష్టి అవగాహన అవుతుంది. త్రిగుణములకి అవతల వుండే గుణాతీతమైన తత్త్వంగా మనం వున్నప్పటికీ, సంకల్పం వచ్చిన తరువాత తెలుస్తుంది. మనం ప్రొద్దున్నే లేచినపుడు నేనున్నాను అని సంకల్పం మనకి కలుగుతుంది. రాత్రి వున్నాం కానీ వున్నామన్న సంకల్పం కూడా లేదు. అక్కడ నుండి ఉద్భవిస్తున్నాం. ప్రతి ఉదయం వుద్భవించడమే. ఉద్భవించడంతోబాటూ వెంటనే మనం త్రిగుణములలోకి ప్రవేశిస్తున్నాం. అది రెండో ఉద్భవం. ముందు లేవడం, లేవంగానే నేనున్నాను అని తెలియడం. కేవలం నేనున్నాను అని మాత్రమే తెలిసి ఇతరమైన కోరికలు లేకపోతే సత్త్వమునందు నిలబడినట్లు. అంతటితో ఆగదు. మనం వుంటే సరా! ఏదో ఒకటి చేయాలి. ఏదో ఒకటి చేయాలనుకునేసరికి రజస్సులోకి వస్తాం. అక్కడ నుండి ఎంతసేపని పనిచేస్తాం. విశ్రాంతి కావాలి. అందుకని తమస్సులోకి వస్తాం. ఇట్లా సత్త్వ, రజస్సు, తమో గుణములుగా ఒకే తత్త్వము వ్యక్తమవుతూంటుంది. వాటి ప్రకారం ఉద్భవాలు పొరలు పొరలుగా, పొరలు పొరలుగా, పొరలు పొరలుగా జరుగుతూంటాయి. ఈ జరుగుతున్నదంతా కూడా దేన్నించి

ఉద్భవిస్తోందో దాన్ని ఎవరూ వివరించడానికి అవకాశం లేదు. ఉద్భవించిన దాని గురించి వివరించడానికి అవకాశం వున్నది. అంటే సృష్టిలో దేవుణ్ణి ఆరాధించుకోవచ్చు తప్ప, సృష్టికి అవతల వుండే దేవుడు అర్థం అయ్యే విషయం కాదు. నిరాకారము, నిర్గుణము, తర్కానికి అందనిది, ఏ లక్షణములూ లేనిది, తెలుసుకునేవాడుగా వున్నంతకాలం తెలియబడనిది. తెలుసుకునేవాడు తెలుసుకునే దానియందు ఇమిడిపోవడంవల్ల, వీడు వేరేగా లేకపోవడంవల్ల, తాను అది అయిపోవడంవల్ల దాని గురించి తనకేమీ తెలియదు. నిద్ర గురించి తెలుసుకుందాం అంటే ఎట్లా వుంటుందో అట్లా వుంటుంది దాదాపుగా. ఎరుక వుంది అంటే ఉద్భవించినట్లే! నేనున్నాను అనే ఎరుక ఒకటి. తాను వున్నాను అని తెలియక వుండడం అనేది ఒకటి. ఉన్నాను అని తెలియక వుండడం 'Pure Existence' అని చెప్తారు. తర్వాత అందులోంచి వున్నానని తెలుస్తూంటుంది. ఇవే మామూలుగా రోజూ అక్కడ్నించి వస్తూ వుండాలి, అక్కడికి పోతూండాలి. ఈ మెట్ల దారి గనక బాగా మనలో స్థిర పడితే ఎందులోంచైనా అందులోకి వెళ్ళిపోవచ్చు. భౌతికంలో పనిచేస్తున్నాం. దానికి కారణం ఏదో కోరికలు. అందుకని ఇంద్రియాలు వాడుతాం. ఇంద్రియాలు వాడడానికి మూలం భావం. భావం మనసుకి సంబంధించింది. భావానికి ఎవరు ఆధారం? 'నేను'! నేను ఎక్కడ్నించి వచ్చాను? ఇట్లా వెళ్ళిపోవాలి. నేను ఎక్కడ్నించి వచ్చాననే కదా ఈ మొత్తం ప్రశ్న అంతా కూడా! బ్రహ్మకు పుట్టింది కూడా అక్కడే పుట్టింది. ఉద్భవం చెందగానే వ్యక్తమైనవాడు, బ్రహ్మగా తయారైనవాడు. శ్రీకృష్ణుడు కూడా ఆ విధంగా ఉద్భవించాడు. ఎలా? దాన్నే 'Immaculate Conception' అని వాళ్ళు చెప్పకుంటారు. ఏంటో తెలీదు వాళ్ళకి. శిశువు శరీరంలోంచి బయటికివచ్చిన తరువాత దాని మీద తనని తాను ఆపాదించుకుంటాడు శ్రీకృష్ణ పరమాత్మ. ఎక్కడ్నించి వచ్చి ఆపాదించుకున్నాడు? మొత్తము నందు వ్యాపించి వున్న ప్రజ్ఞ రూపు కట్టుకుని దానిమీద ఆపాదించుకుంటే అప్పుడు పసికూన కెవ్వుమని కేకపెడుతుంది. అలాగే శ్రీకృష్ణుడు ఎప్పుడు ఎక్కడ కావాలంటే, అక్కడ తనని తాను ప్రత్యక్షం చేసుకునేవాడు. రామావతారంలో అట్లా వుండదు. మళ్ళీ హిరణ్యకశిపుడ్ని సంహరించడానికి ఏర్పరచుకున్న అవతారములో అలాగే ప్రత్యక్షమయ్యాడు. అట్లా ఉద్భవిస్తాడు. ఎక్కడైనా ఉద్భవించగలిగిన

తత్త్వమది. 'ఇందుగలడందులేడని సందేహము వలదు' అని చెప్పినట్లుగా. మనలో కూడా ప్రతి ప్రొద్దున ఆయన ఉద్భవించడమే మనం నిద్రలేవడం. ఆయన వుండడం మనం వుండడం. ఆయన ఉద్భవించడం నిద్రలేవడం. ఇహ అక్కడ్నించి ఆయన మనంగా వుంటే, మనం వున్నామనుకుని మనం ఏవో పనులు చేసుకుంటూంటే, సరే కానీ, అంటాడు. సముద్రమే అల అయితే, అల తాను వున్నాను అనుకున్నట్లన్నమాట.

## 821 సుందరః

ఉద్భవించినవాడు ఎప్పుడూ సుందరుడే అని చెప్తుంది ఈ నామం. ఉద్భవించక ముందు చీకటి. ఉద్భవించగానే వెలుగు. అంతకుముందు చీకటిగా వున్నది అప్పుడు వెలుగవుతుంది. ఆ వెలుగే ఆనందం. సుందరమైనది. అందుకనే పూజ చేసుకునేప్పుడు యెక్కువ దీపాలు పెట్టుకుంటే ఆనందంగా వుంటుంది. సుందరంగా వుంటుంది కదా! ఎన్ని దీపాలు పెట్టుకుంటే అంత కళ. ఇంటిలో ఏదన్నా ఉత్సవం చేసుకునేప్పుడు కరెంటు దీపాలు బాగా పెట్టుకుంటే కళ. తాటాకు పందిరేశాం. వెలుగు బల్బుల పందిరి వేస్తున్నాము. అది పూల పందిరి కన్నా యింకా బావుంటుంది. అలాగే ఆకాశం చూస్తే నక్షత్రాలు కనపడగానే ఆనందం వేస్తుంది. ఎక్కడ వెలుగు కనిపిస్తే కన్ను సరాసరి దాని యందు, దానికై ఆకర్షింపబడుతుంది, ఆనందం చెందుతూ వుంటుంది. అందుకని అంతకు ముందు యేమీ లేనట్టుగా వున్నది, పుట్టుక చేత సుందరమైన లక్షణం పొంది వుంటుంది. అందుకనే మొట్టమొదటి లక్షణం భగవతత్త్వం లో చెప్పేది సుందరం. ఆ వెలుగునే మనం సాంప్రదాయం ప్రకారం అమ్మవారు అంటాము. అందుకని అమ్మవారు చాలా అందమైనది. అంతకు ముందు అయ్యవారు వున్నాడు కానీ కనబడడు. ఒకడ్నేమో నల్లగా వున్నాడు అంటారు, శ్రీకృష్ణుడు. ఇంకోడ్నేమో తెల్లగా వున్నాడంటారు. దిగి వచ్చిన వాడ్ని. వాడ్ని విఠల్ అంటారు. విఠల్ అంటే అర్థం తెల్లటి రంగు. పాండురంగా అంటాం కదా! విఠలా అన్నా తెలుపు అనే, పాండురంగా అన్నా తెలుపు రంగు అనే. నలుపే తెలుపవుతుందండీ. అందుకనే Darkness is absolute Light అంటారు. పరతత్త్వం చీకటని ఎందుకన్నారంటే మనకి అవగాహన కాదు కాబట్టి. చీకట్లో అంతా ఉన్నప్పటికీ మనకేం కనిపించదు కదా! వెలుగులో కనుపిస్తుంది. అందుకని జీవులవరకూ భగవంతుని యొక్క దర్శనము వెలుగు రూపంగా గోచరించి, సుందరంగా వుంటుంది. శ్రీకృష్ణుడు సుందరమైనవాడు. అత్యంత సౌందర్యం కలిగినవాడు.

## 822 సుందః

సుందః అంటే చక్కని పలువరస కలిగినవాడట. ఇదొకటి. సాముద్రిక శాస్త్రంలో మనిషికి నుదురెట్లావుంది, కన్నులెట్లా వున్నాయి, ముక్కెట్లావుంది, నోరెట్లావుంది, నోట్లో పలువరస యెట్లా వున్నది, చెవులెట్లా వున్నాయి, గడ్డం యెట్లా వుంది, మెడ యెట్లావుంది, ఛాతీ యెట్లా వున్నది, భుజములెట్లా వున్నాయి, చేతులెట్టా వున్నాయి, నడుము యెట్లా వున్నది, కాళ్ళెట్లావున్నాయి, పాదములెట్లావున్నాయి, వాటి వేళ్ళు యెట్లావున్నాయి? వీటిని బట్టి ఒక శాస్త్రం. దీన్ని బట్టి మనిషియందు ఏరకమైన స్వభావం, దైవీ స్వభావం పనిచేస్తోందా, అసురీ స్వభావం పనిచేస్తోందా, మిళితంగా పని చేస్తోందా? ఇది తెలుసుకుంటూ వుంటారు. అందులో ఒకటి చెప్పేది ఏమిటయ్యా అంటే పలువరస చక్కగా వుండడం అనేది ఒక కళ్యాణగుణంగా చెప్పారు. 'సుందః' అనే నామం అర్థం అది. చక్కని పలువరస కలిగినవాడు నవ్వితే ఎదుటి వ్యక్తులు ఆకర్షింపబడతారు అని అర్థం. ఎవరు నవ్వినా పళ్ళు బయటపడ్డాయి. పలువరస బాగుంటే అదొక కళ్యాణ గుణం అని చెప్తారు. ఈ నామం అందుకొచ్చింది ఇక్కడ. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, అమ్మవారు ఎప్పుడు కూడా మందస్మిత అని చెప్తాం. కొంతమందిలో ఎప్పుడూ అట్లా చిరునవ్వు వుంటుంది. వాళ్ళు నవ్వితే వాళ్ళ పలువరస నుండి వచ్చే కాంతి చేత కూడా ఇతరులు ప్రభావితం అవుతూ వుంటారు. మాస్టర్ గారు ఎప్పుడూ ఉపన్యాసం యిచ్చేప్పుడు బాగా నవ్వుతూ వుండేవారు. కళ్ళతో బాగా యెదుటి వ్యక్తిని చూస్తూ వుండేవారు. ముందు కూచున్న పాశ్చాత్యులు గమనించిందేమిటంటే, ఈయన కళ్ళతోనూ, పళ్ళతోనూ అందరినీ సమ్మోహితులు చేస్తున్నారు అని. అందుకని కావాలని బాగా ముందుగా కూర్చొని ఆయన కళ్ళలోకి, ఆయన నవ్వుతుంటే ఆయన పలువరసని చూస్తూ వుండేవారు. ఏంటది అని అడిగితే నేను చెప్పాను Healing through Teeth అని. Healing through sight మాత్రమే కాకుండా Healing through Teeth అన్నమాట. ఆయన పళ్ళు నవ్వితే అంత అందంగా వుండేవారు. మాస్టర్ గారు నవ్విన బొమ్మలు కాంతి వెదజల్లుతూ వుంటాయి. కేవలం సుందరుడే కాక ఆయన చిరునవ్వు ద్వారా, దంతముల ద్వారా వ్యక్తమైనవి కూడా ఆ విధంగా కాంతి వెదజల్లేతత్త్వం ఎవరియందు వుంటే వారిని సుందః

అని కూడా పిలుస్తారు. ఈ నామం యెక్కడా వినం. మిగతా నామాలు అక్కడక్కడక్కడా మనకు వినిపిస్తాయి. శ్రీకృష్ణుడు సుందుడు అని పేరుపొందినవాడు. ఎందుకంటే ఆ కాలంలో యింత చక్కగా నవ్వి, అందర్నీ సమ్మోహితుల్ని చేయగలిగిన వాళ్ళు యెవ్వరూ లేరు. తల్లికి కోపం వస్తే, ఇతడు నవ్వితే తల్లికి కోపమంతా కూడా మాయమైపోయేది. వాడు శత్రువు భయంకరంగా మీదపడినప్పుడు నవ్వితే, వాడిలో వుండే తమస్సు అనే చైతన్యం తనలోకి వచ్చేసేది. అదే చెప్తారు భాగవతంలో, రథంలో కూర్చొని అర్జునుడికి ముందు, గుఱ్ఱముల యొక్క కళ్ళెములు చేపట్టి, శత్రు రాజుల వైపు రథాన్ని తోలుతున్నప్పుడు ఎవరైతే అర్జునుడితో యుద్ధం చెయ్యడానికి ఎదురుగ్గా వస్తారో వారి అందరి కళ్ళల్లోకి చూచి కృష్ణుడు నవ్వడంచేత వాళ్ళ ప్రాణములన్నీ కుడా అప్పడే హరింపబడి, ఇహ మిగిలిన తోలుతిత్తుల్ని అర్జునుడు కొట్టుకున్నాడు అని. అట్లావుంటుంది శ్రీకృష్ణుడి నవ్వు అని. అలాగే రాయబారానికి వెళ్ళినప్పుడు దుర్యోధనుడు 'కృష్ణుడు సభలోకి ప్రవేశించేప్పుడు ఎవరూ నిలబడకూడదని' ఒక శాసనం వేస్తాడు. కృష్ణుడు వచ్చి దుర్యోధనుని వైపు చూసి నవ్వగానే దుర్యోధనుడే ముందు లేచి నిలబడడం, తర్వాత మిగతావాళ్ళందరూ లేచి నిలబడడం జరిగింది. అలాగే రుక్మిణీ కళ్యాణం అప్పుడు ఈయనతో యుద్ధం చేద్దాం అని వచ్చినవాళ్ళంతా కూడా ఈయన నవ్వడం చేత సమ్మోహితులై అట్లా నిశ్చేష్టులైపోయారు. అట్లా ఈయన 'నవ్వుతూనే సమస్తాన్ని జయించగలిగిన పలువరస కలిగిన వాడు' అని మనం భావన చేసుకోవచ్చు. అంటే భగవంతుడు చిరునవ్వు నవ్వినప్పుడు ముందు నాలుగైదు పళ్ళు కనబడుతున్నట్టుగా కూడా మీరు ధ్యానంలో భావన చేయవచ్చు. తద్వారా కూడా కొంత కాంతిని అనుభూతి చెందటానికి అవకాశం వుంటుంది. విభీషణుడు రాముని శరణాగతి కోసం వచ్చినపుడు, హనుమంతుడు విభీషణుని యొక్క అవయవములన్నింటినీ వర్ణిస్తాడు. 'శుభలక్షణములు కలిగినవాడు కాబట్టి ఇతన్ని అంగీకరించు' అని చెప్తాడు. ఇదొక శాస్త్రం. సాముద్రికశాస్త్రము అని. సాముద్రికము అంటే వూరికే చేతులు చూడడమనుకుంటాం. చేతులు హస్తరేఖలు మాత్రమే. సాముద్రికం అంటే పెద్దలు చెప్పింది తల నుండి కాళ్ళవరకు మనిషి యొక్క అవయవముల యొక్క పొందికను బట్టి వాడి యొక్క గుణగణములను అవగాహన చేసుకునే శాస్త్రం.

## 823 రత్ననాభః

భగవంతుని బొడ్డు నుండే సమస్తమైన సృష్టి పుట్టింది. సృష్టి అంతా కూడా వెలుగు ముద్దలుగా బయటికి రావడమే. మొట్టమొదట బయటికి వచ్చింది ఏమిటి? హిరణ్యగర్భం! బంగారు కాంతులతో, తెల్లనికాంతులతో, రకరకములైనకాంతులు వెదజల్లుతున్న ఒక గోళం పుట్టుకొచ్చింది. 'తస్మాత్ విరాడజాయత విరాజో అధిపూరుషః' విరాట్ స్వరూపం. గోళాలు, గోళాలుగా ఆయనలోంచి అన్ని వెలుగు గోళాలు పుట్టినాయి. ఆయన బొడ్డు కేంద్రంగా ఎన్నో గోళాలు పుట్టుకొచ్చినాయి. ఎన్నో వెలుగు పుంజాలు, కాంతి పుంజాలు పుట్టుకొచ్చాయి. అవన్నీ మనకి ఆకాశంలో రత్నముల వలె మెరుస్తూవుంటాయి. ఇవన్నీ ఎక్కడ నుండి వచ్చినాయి? భగవంతుని బొడ్డులోంచి వచ్చినట్టుగా చెప్తారు. మనక్కూడా బొడ్డులోంచే అన్నీ పుడుతూ వుంటాయి. మనస్సుకి కేంద్రము షట్చక్రములలో మణిపూరకము అని చెప్తారు. అందుకని అక్కడ్నుండి సమస్తమూ మనకు పుట్టుకొస్తుంటాయి. వినాయకుని పొట్టలోంచి ఏ విధంగా ఉండ్రాళ్ళు బయటికి వచ్చినాయని చెప్తామో, అలాగే భగవంతుని బొడ్డు లోంచి సమస్తమైన కాంతిపుంజములు వచ్చినాయి. వాటినే భృగువులు అంటారు. భృగు మహర్షి అని చెప్తుంటాము. సినిమాలో చూస్తే మనిషిగా వుంటాడు. భర్గులు అంటే భార్గవులు అంటే వెలుగు గోళములు అని అర్థం. మన భూచక్రం, విష్ణుచక్రం తిరుగుతూ వుంటే, అందులోంచి పుట్టుకొస్తాయి చూడండి, మతాబా కాలుస్తుంటే వెలుగు రవ్వలు ఒక్కొక్కటి బయటికి వస్తాయి కదా! అవి ఎంత కాంతివంతంగా వుంటాయి. అసలిది ఉపమానమే కాదు, అక్కడి నుండి పుట్టుకొచ్చే కాంతివంతములైన గోళములకు. వాటన్నింటినీ రత్నములు అని చెప్పారు. ఒక్కొక్క రత్నం నుండి ఒక్కొక్క సూర్యమండలం ఏర్పడుతూ వుంటుంది. ఈ సూర్యమండలంలో అన్నిటికన్నా ప్రకాశవంతమైన రత్నమువంటిది సూర్యబింబం. సూర్యగోళం. అందుకనే సూర్యునియొక్క ప్రజ్ఞ మనకి బాగా అనుభూతి అవాలంటే మనలను వేలికి ఒక రత్నం పెట్టుకోమంటారు. వజ్రం పెట్టుకోమంటారు. Diamond అంటాం. ఎందుకొచ్చిందయ్యా అంటే అసలు మొదట పుట్టుకొచ్చింది అది. అందులోంచి మిగతావన్నీ పుట్టుకొచ్చినాయి. సూర్యుడాధారముగా మిగతా గోళాలు. అంటే ఒకే వెలుగు తత్త్వం లోంచి

ఏడు రకాల తత్త్వాలు పుట్టుకొస్తాయి. అట్లాగే ఒకే వెలుగులోంచి ఏడు రకాల లోకాలు పుట్టుకొచ్చినాయి. అలాగే ఏడు రకాల గోళాలు. వాటినే ఏడు గ్రహములు, గ్రహ భావములు చెప్తుంటాం. అలాగే మనలో కూడా ఆయన పుట్టుకొచ్చే స్థలములు షట్చక్రములయందు కూడా వున్నది. ఇవన్నీ కూడా కాంతిపుంజములే. ఇవన్నీ ఎక్కడి నుండి పుట్టుకొచ్చినాయి అంటే 'నాభి నుండి పుట్టుకొచ్చినవి' అని చెప్తారు. అది కారణం చేత భగవంతుని నుండి పుట్టుకొచ్చిన వెలుగు పుంజములు పుంజములుగా, గోళములు గోళములుగా వ్యక్తమవుతూ వచ్చింది కాబట్టి భగవంతుడ్ని రత్ననాభుడు అనే నామంతో కూడా కొలుచుకోవడం ఒక ఆచారమయింది.

## 824 సులోచనః

చక్కని కన్నులు కలిగినవాడు. ఎవరైనా మహాత్ముల్ని మనం దర్శనం చేసినపుడు పాదములు దర్శనం చేసిన తరువాత, కన్నులను దర్శనం చెయ్యాలి. వారి కన్నుల నుండి వచ్చే కాంతి మన మీద ప్రసరించేట్టుగా చూసుకోవాలి. వారి కన్నులలో మనం పడాలన్నమాట. వారి చూపులలో మనం పడాలి. పడితే అక్కడ్నుండీ ప్రసారం వుంటుంది. అదే తరువాతి నామం 'అర్కః'! అర్కః అంటే తాను వెలుగైనప్పటికీ తానే మళ్ళీ కిరణములుగా వ్యాప్తి చెందేవాడు. కిరణములుగా వ్యాప్తి చెందువాడు అని చెప్పడానికి అర్కః అంటారు. కాబట్టి ఆ విధమైన వెలుగు ప్రసారం మనకి ఆయన సులోచనముల ద్వారా జరుగుతాయి. భగవంతుని యొక్క కన్నులను ఆరాధన చేసినవాడు వెలుగుకు బద్ధుడై సమస్తమునందు అటువంటి వెలుగుకు, అటువంటి అందమునకు మాత్రమే ఆకర్షింపబడి, ఇతరములైన విషయములకు ఆకర్షింపబడక జీవించే ఒక స్థితి కలుగుతుంది. అందుకనే భగవదారాధన చేసినపుడు ఆయన కన్నులను చాలా మిరుమిట్లు గొలిపేటట్టి కన్నులుగా భావన చేసుకోవాలి. అక్కడ నుండి కాంతి మన మీద ప్రసరిస్తున్నట్లుగా భావన చేసుకోవాలి. ఇక్కడ సులోచనములు, చక్కని లోచనములు. ఆకర్షణీయమైన లోచనములు, విశాలమైన లోచనములు, మీనముల వంటి లోచనములు, పద్మములవంటి లోచనములు. పద్మనేత్రుడంటారు. అంటే ఎంత పెద్ద కన్నులు. కొంతమంది యందు కన్నులు బాగుంటే భగవంతుడు ఆ విధంగా అక్కడ ఉపస్థితుడై వున్నాడని తెలియాలి. ఆయన కన్నులు చూశారా, ఎంత బాగున్నాయో అంటాం కదా! లేకపోతే ఆవిడ కళ్ళు చూశారా ఎంత బాగున్నాయో అంటాం. కళ్ళు బాగుంటే ముఖం యొక్క అందం ఇనుమడిస్తుంది. పళ్ళు బాగుంటే యెట్లా ఇనుమడిస్తుందో అంతకుమించి కన్నులు. అందుకని చక్కని కనులు ఎక్కడైనా చూచినప్పుడు అందులోంచి వచ్చే కాంతిని దర్శనం చేస్తూ భగవదనుభూతిని పొందవచ్చు. అలా భగవత్సన్నిధానానికి చేరుకున్న భక్తుల కథలు కూడా చాలా వున్నాయి. అందుకని మనం ఆరాధన చేసేప్పుడు భగవంతునియొక్క కన్నులయందు బాగా దృష్టి వుంచాలి. చిరునవ్వు యందు దృష్టి వుంచాలి. చిరునవ్వు యందు దృష్టి వుంచినపుడు పలువరస కూడా గమనించవచ్చు. కన్నులను

చూసినపుడు విశాలమైన నేత్రాలు, పూర్తిగా తెరుచుకున్న కన్నులు, (అరమోడ్పు కన్నులు కాదు) తెరుచుకుని నల్లని కనుగుడ్ల మధ్య నుండి లోతైన కన్నులు, నల్లని కన్నులు, అందులోంచి కాంతి వెదజల్లబడుతున్నట్టుగా భావన చెయ్యాలి. భగవంతుని రెండు కన్నులను మనకి ఒకటి సూర్యుడని, ఒకటి చంద్రుడని కూడా చెప్తారు. అందుకని కన్నులు ఒక ప్రత్యేకమైన అంగములు. మనకేం చెప్తారంటే వేదాంగములలో జ్యోతిష్యము కన్ను అంటారు. జ్యోతిష్యము తెలియకపోతే వేదము లేక దైవము అర్థమవడానికి అవకాశములేదు. ఆధ్యాత్మిక పరమైన జ్యోతిష్యము తెలియాలి. అలాగే ఇంద్రియములలోకెల్లా ప్రధానమైనది కన్ను అని చెప్తారు. మిగతావి లేకపోయినా ఐదింటిలో యిది వుంటే ఫరవాలేదు. ఇది లేక మిగతావి వుంటే చాలా యిబ్బంది పడతారు. అందుకనే 'ఇంద్రియాణాం నయనం ప్రధానం' అనే భావన వున్నది. 'వేదాంగానాం జ్యోతిష్యం ప్రధానం' కాబట్టి కన్నులకట్లాంటి ప్రత్యేకత వున్నది. మన కన్నులను అద్దంలో చూసుకున్నప్పుడు, అద్దంలో మన కన్నుల్లోంచి వచ్చే కాంతిని గనక గమనించినట్లైతే మనలో వుండే వెలుగును బహిర్ముఖంగా మనం దర్శనం చేసినట్లవుతుంది. అంతర్ముఖంగా అదే కాంతిని యింకా ప్రస్ఫుటంగా దర్శనం చేయవచ్చు. అద్దంలో మనల్ని మనం చూసుకున్నప్పుడు కూడా కన్నుల్ని చూసుకోవడం ముఖ్యం. అప్రయత్నంగా కన్నుల్నే చూస్తాం. అలాగే ఎదుటి వ్యక్తిని మనం చూసినప్పుడు కూడా సరాసరి కన్నులలోకి చూసి మాట్లాడతాం. కన్నులలోకి చూడక మాట్లాడుతున్నాడట, అంటే ఏదో దాస్తున్నాడు అని అర్థం. పెద్దల యందు గౌరవం చేత తల వంచుకొని మాట్లాడటం వేరు. కన్నులలోకి చూడక పైకి చూసి, పక్కకు చూసి మాట్లాడితే వెలుగునందు ఆసక్తి తక్కువ అని అర్థం. చక్కని కన్నులెక్కడవుంటాయో అక్కడ వెలుగుకు అర్హత వున్నది. రెండు కన్నులూ ఎంత చక్కగా కనపడుతుంటే అంత వెలుగు అక్కడ నుండి ప్రసారమవుతూ వుంటుంది. ప్రత్యేకించి కుడికన్ను సరిగా కనబడనివారికి ఆత్మజ్ఞానానికి ఆ జన్మకి అవకాశంలేదని జ్యోతిష్యం చెప్తుంది. ఎడమ కన్ను అంతంతమాత్రంగా వున్నా, కుడికన్ను బాగా కనిపించకపోతే ఆత్మదర్శనానికి అవకాశంలేదు. తత్సంబంధమైన విషయముల యందు ఆసక్తి పొంది జీవిస్తూ వుండవచ్చు అని చెప్తుంది. ఎందుకంటే కుడి కన్ను సూర్యుడు, ఎడమకన్ను చంద్రుడు,

మూడవకన్ను అగ్ని. అందుకని కుడికన్ను సరిగా కనిబడట్లేదుట అంటే జ్ఞానమునకు అవకాశం లేదు అని అర్థం. అంతర్దర్శనములకు అవకాశం లేదు. కుడికన్నే మనకి యమున! యమునా తీరముననే కృష్ణుని యొక్క దర్శనం జరుగుతుంది! కాళిందిమడుగు కూడా యమున లోతుల్లో వున్నది. అది పింగళనాడిగా కుడి కన్ను నుండి బయలుదేరి వచ్చి, హృదయమును చేరుకున్నప్పుడు, హృదయమునందు కాళింది మడుగులో కాళీయుడు వుండడం అంటే హృదయమునందు కల్మషములు వుండుట. హృదయమునందు కల్మషములున్న సందర్భంలో కృష్ణుడ్ని అక్కడికి ప్రవేశింపచేస్తే కల్మషాల్ని ఆయన హరిస్తాడు. అది కారణం చేత యమున పవిత్రీకరింపబడుతుంది. ఇది సంకేతపరంగా చాలా అవగాహన చేసుకోవాల్సిన విషయం. కుడికన్ను దెబ్బతిన్నదిట అంటే కాళింది బాగా విషపూరితమై, కలుషితమై వున్నదని అర్థం. అందుకని కన్నుల విషయంలో ఈ అవగాహనలు వున్నాయి. ఎడమకన్ను చంద్రుడికి ప్రతీక. అంటే పదార్థమయమైన సృష్టి యొక్క విజ్ఞానమును పొందడానికి ఎడమకన్ను, ప్రజ్ఞామయమైన తత్త్వాన్ని దర్శించడానికి కుడికన్ను, ప్రజ్ఞా, పదార్థము రెండింటినీ సమమైన అవగాహన చేసుకుని, సమస్తమునందు భగవంతుడు వ్యాప్తి చెంది ఉన్నాడు అని తెలుసుకున్నవాడికి మూడవకన్ను పని చేస్తుంది అని పెద్దలు చెప్తారు. శ్రీకృష్ణుడి యొక్క కనులు సులోచనములు అని చెప్పనే అవసరములేదు. ఎందుకంటే జంతువుల దగ్గర నుండి ఆయన కన్నులలోనికి చూసి ఆకర్షితములయినాయి. మనుషులు ఆకర్షితులైనారు. సమస్తమునూ ఆయన కన్నులచేత ప్రభావితం చేస్తూండేవాడు.

## 825 అర్కః

అర్కః అంటే కిరణములుగా వ్యాప్తి చెందేవాడు. సూర్యుడికి ఈ నామం ఎక్కువగా వర్తించి చెప్తారు. ఎందుకంటే ఆయన కిరణములు అట్లా ప్రసరిస్తూంటే దాని చుట్టూ పదార్థం ఏర్పడుతూంటే మిగితా గోళాలు ఏర్పడినాయి. మనం కూడా అదే సూర్యవంశీయులం లేక సూర్య కిరణములము. ప్రతి జీవుడూ ఒక సూర్య కిరణం. దాని చుట్టూ రకరకములైన పంచభూతాత్మకమైన పదార్థము ఏర్పడుతు ఉండడంచేత ఈ రూపములన్నీ ఏర్పడుతున్నాయి. ఈ రూపములు ఏర్పడాలంటే సూర్యుని యొక్క కిరణము అధారముగా వుండాలి. లేక మధ్య ఇరుసుగా వుండాలి. ఉత్తర దక్షిణ ధ్రువములుగా మన యందు సూర్య కిరణము వుండడం చేత, దానిచుట్టూ మిగతా పదార్థమయము, ద్రవ్యమైనవి కూడా ఏర్పాటు చేయబడ్డాయి. అంటే మామూలుగా పూర్వం రోజుల్లో ఒక ఇల్లు కట్టాలంటే మధ్యలో ఒక గుంజనాటి, ఆ గుంజకు ఆధారంగా అటూ, ఇటూ అంతా పాకను తయారు చేసుకుంటూ వచ్చేవాళ్ళు. ఇప్పుడు ఇంకోరకంగా తయారు చేస్తున్నాం. అప్పుడు చేసేవన్నీ కూడా సృష్టి విధానంతో అనుసంధానం చెంది చేసేవారు. యజ్ఞం చేసేటప్పుడు కూడా యష్టి అనే ఒక ఆ స్తంభాన్ని ముందు నాటి అది ఆధారంగా సమస్తమైన యజ్ఞవాటికను నిర్మాణం చేస్తారు. మన కూడా బిందువువలె ముందు తల్లి గర్భంలో ప్రవేశించి, అక్కడ నించి గోళమువలె తల ఏర్పడి, అక్కడ నుండి ధ్వజస్తంభమువలె వెన్నెముక ఏర్పడి, ఆ వెన్నెముకలో ఈ షట్చక్రములు ఏర్పడి, అది ఆధారంగా మిగితా ఐదు భూతములకు సంబంధించిన శరీరం ఏర్పడుతుంది. ఆజ్ఞ యందు వెలుగు, విశుద్ధి యందు ఆకాశము, హృదయము లేక అనాహతమునందు వాయువు, మణిపూరకమునందు అగ్ని, స్వాధిష్ఠానమునందు జలమూ, మూలాధారమునందు పదార్థము. ఈ ఐదు భూతములు విశుద్ధి నుండి మూలాధారము వరకూ వున్న ఈ కేంద్రములయందు అవి నిర్మాణం చేయబడి, నియమింపబడి వున్నాయి. ఆ కేంద్రములు బాగా పనిచేస్తూంటే ఈ పంచభూతాత్మికమైన శరీరము చక్కగా పని చేస్తూంటుంది. మనలో స్వాధిష్ఠానము సరిగా పని చేయకపోతే జలములయందు తేడా పడుతుంది. మణిపూరకము సరిగా పనిచేయకపోతే అగ్నితత్త్వము నందు

తేడాపడుతుంటుంది. మూలాధార చక్రమునందు కార్యక్రమములు సరిగ్గా జరగకపోతే శరీరము యొక్క ఏర్పాటునందు, అంటే శరీరంలోని పదార్థము ఏర్పాటునందు అవకతవకలుంటాయి. హృదయమునందు అంటే అనాహతము సరిగ్గా పనిచేయకపోతే వాయువు యొక్క వ్యాప్తి శరీరమునందు పంచప్రాణములుగా చక్కగా జరగక ఇబ్బందులు పెడుతూంటుంది. ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము అనే పంచప్రాణములు పంచవాయువులుగా మనలో పనిచేయడానికి హృదయం కేంద్రముగా జరుగుతూంటుంది. అక్కడ నుండి విశుద్ధిలో ఆకాశతత్త్వం. ఇవన్నీ ఏర్పరచటానికి కేంద్రము శిరస్సులో వున్న ఆజ్ఞాచక్రమునందు వున్నది. ఆజ్ఞ నుండి ఏర్పడిన ఎముక లేక ధ్వజస్థంభము వెన్నెముక. దానియందు ఈ కిరణం వున్నది. ఆ కిరణం కారణం చేతే వెన్నెముకలో వుండే సుషుమ్నానాడిలో (బ్రహ్మరంధ్రం అంటారు దాన్ని) చిత్రిణినాడి వలే గొట్టంలో పోసిన వెలుగల్లే వుంటుందక్కడ. అదో వెలుగు గొట్టం! ఆ వెలుగు అందులో వున్నంతసేపూ నాదం వినిపిస్తూవుంటుంది. నాదం వున్నంతసేపు ఆ నాదమే అక్కడ వెలుగుగా వుంటుంది. అందులో యేమీ లేదు అని అనుకోవడానికి వీలులేదు. Atmospheric Pressure మనం Lumbar puncture చేసి తీస్తారు చూశారా, తీసినప్పుడు నీరుగా వస్తుంది. కానీ అంతకు ముందు అందులో చోటుగా వుంటుంది. లోపల చోటుగా తానుండి, ఆ చోటు అంతా కూడా వెలుగుతో నింపబడి వుండి, ఆ వెలుగుగా వున్నచోటు మనం వూహించనంతటి సన్నని దారం వలె, సూత్రమువలె 'సుతంతుస్తంతు వర్ధనః' ఆ తంతువు ఆధారంగా ఈ చక్రములు, ఈ చక్రములు ఆధారముగా ఈ పంచభూతాత్మకమైన ఈ శరీరము, దానియందు ఆజ్ఞాచక్రం ఆధారంగా చైతన్యము పనిచేయుట, ఇటువంటివన్నీ జరుగుతూ వుంటాయి. కాబట్టి ఇవన్నీ ఎక్కడ నుండి ఉద్భవించినాయంటే కిరణము నుండి ఉద్భవించినవి. ఈ కిరణములు ఎక్కడ నుండి వస్తున్నాయి? మన వరకు సూర్యుని దగ్గర నుండి వస్తున్నాయి. సూర్యునికి ఎక్కడ నుండి వచ్చింది ఈ వెలుగు అంటే, అంతకన్నా ఆయన పైన వుండే మరొక కేంద్రము నుండి ఆయనలోకి దిగి వస్తోంది. దాన్ని 'సవితృమండలము' అన్నారు. 'సవితా అనే దేవత' అని చెప్పారు. అక్కడికి ఎట్లా దిగివస్తుందంటే అంతకు పైన వున్న 'అంతర్యామితత్త్వం' నుండి దిగి

వస్తోంది. ఇట్లా కిరణరూపంగా సమస్తమునందూ వ్యాప్తి చెంది సమస్తమైన రూపములకు ఆధారముగా యేర్పడి వున్నది. కొబ్బరి చెట్టు అట్లా నిలువుగా పెరగడానికి, దాని లోపల దానికి సంబంధించిన చైతన్యం వుండబట్టి. ఏ ఆకారము ఏర్పడటానికైనా అది కేంద్రంగా వుంటుంది. పరిధి యందు మనకి శక్తి, పదార్థములు చోటు చేసుకుంటూ వుంటాయి. ఎలా వుంటుందంటే ఒక అయస్కాంతపు ముక్కను ఒక కాగితం క్రింద పెట్టి, కాగితం పైన ఇనుపరజను వేస్తే, క్రింద అయస్కాంతం మనం కదిలిస్తూంటే అయస్కాంతపు తరంగములు ఏవిధంగా కదులుతూంటాయో పైన ఇనుపరజను అట్లా కదులుతూ వుంటుంది. అంతవరకూ మనకు తెలియదు అయస్కాంత తరంగములు ఇట్లా వుంటాయని. ఒక్కొక్క అయస్కాంతానికి ఒక్కొక్క రకమైన రూపుకట్టుకునే తరంగములు వుంటాయి. అది ఇనుపరజను వేసి క్రింద అయస్కాంతం కదలిస్తూంటే చక్కగా మనకు తెలుస్తుంది. ఇనుపరజను దేనివల్ల కదిలిందంటే అయస్కాంతశక్తి వలన కదిలింది. అలాగే ఈ తత్త్వం యొక్క శక్తి వలన రూపములు అదే పద్ధతిగా ఏర్పడుతూంటాయి. మనలోని ఈ కిరణమునకు మానవత్తత్త్వం అదే రకంగా ఏర్పడుతుంది. తద్వారా మానవ శరీరం. ఏ జంతు శరీరం అది అట్లాగే ఏర్పడుతూంటుంది. దాని చుట్టూవుండే తరంగములు ఆ విధంగా నిర్మాణం చేయబడతాయి. మనం విశ్వకర్మ అనే భగవంతుని నామం చెప్పుకున్నప్పుడు 'విశ్వకర్మా మనుస్త్వష్టా' అని చెప్పుకున్నాంకదా! స్థవిష్ఠః అని చెప్పుకున్న సందర్భంలో యీ Engineers, Architects అందరి గురించి చెప్పకోవడం జరిగింది. కానీ వాటన్నిటికీ అసలు ఆధారము యీ వెలుగు కిరణం. అందుకని Masonry లో ప్రతివ్యక్తిని/ Masonని ఏమని పిలుస్తారంటే 'A column of consciousness' అంటారు. అంటే చైతన్యపు స్తంభము అని అర్థం. దేవాలయాల్లో లోపల వుండే స్తంభాల్ని కూడా పవిత్రమైన స్తంభాలుగా భావించడంలో అర్థం అదే. దేవాలయ నిర్మాణము సృష్టి నిర్మాణములాంటిది. అందులో వుండే ప్రతి స్తంభమూ దేవాలయము ఏర్పడడానికి తన వంతు కర్తవ్యాన్ని, ఆసరాను అందిస్తోంది. అలాగే సృష్టిలో జ్ఞానులు, ఎరిగినవారు, సిద్ధులూ, చారుణులు, వీరందరూ కూడా భగవతత్త్వమే తమయందు ఉన్నట్లు దర్శనం చేసుకుని సృష్టికి సహకరిస్తూ జీవిస్తూంటారు. అందుకని దేవాలయం వెలుపల స్తంభం నుండి లోపల స్తంభాల వరకు వెళ్తూంటే

లోలోపల వున్న స్తంభములకు బయట ఉన్న స్తంభములకన్నా ఎక్కువ విలువ ఇస్తారు. ఎందుకంటే లోపలకి వెళ్తున్నాయట అంటే కేంద్రమునకు దగ్గరవుతున్న స్తంభములు. అందుకని దేవాలయము నిలబడడానికి ఏమిటి ఆధారం? స్తంభములే! అలాగే సృష్టిలో కూడా సృష్టి నిర్మాణం చేసే దేవతలు వున్నారు. వారి రూపంలో భగవంతుడు వున్నాడు. వారిని The columns of consciousness అంటారు. చైతన్యపు స్తంభములు! అలాగే ప్రతి జీవి కూడా ఒక చైతన్యపు స్తంభము. ప్రత్యేకించి భూమిమీద నిట్టనిలువుగా వుండే జీవి మానవుడు. చెట్లు కూడా నిట్ట నిలువుగా వుంటాయి కానీ కదలికలు లేవు వాటికి. మనం కదలుతాం. అవి కదలలేవు. అవి స్థావరములు. మనం జంగమములు. కదిలే వాళ్ళలో నిట్టనిలువుగా వుండేవాళ్ళు మానవులొక్కళ్ళే! కోతులు కూడా నిట్టనిలువుగా వుండవు. మిగతా జంతువులు కూడా నిట్టనిలువుగా వుండవు. అంటే ఏమిటి? మనలో చైతన్యము ఊర్ధ్వగతి చెందటానికి కావలసిన సదుపాయము ఈ శరీరమునందు మాత్రమే వున్నది. మిగతా శరీరములయందు కిరణము ఊర్ధ్వగతిగా నిలబడి వుండడం అనేది వుండదు. ఎలా ఊర్ధ్వగతిగా వుందంటే సూర్యుని వైపు మొగ్గి వున్నది మొత్తం. అందుకని మానవ శరీరంలో వున్న జీవి త్వరితగతిని ఊర్ధ్వలోకాలు చెందడానికి అవకాశం వున్నది. మిగతా శరీరాలలో ఆ అవకాశం లేదు.

## 826 వాజసనః

వాజసనః అంటే భోజనం పెట్టే వాడు అని అర్థం. ఎట్లా పెట్టాడు భోజనం? ఒకళ్ళకు ఒకళ్ళను భోజనంగా పెట్టాడు. పైలోకం వాడు కిందలోకంలో వాడికి ఆహారం. అందుకనే వాడ్ని ఆధారం చేసుకుని వీడు బ్రతుకుతూంటాడు. ప్రాణాన్ని ఆధారం చేసుకుని మనం బ్రతికినట్లే! అట్లా ఒకదాన్ని ఒకటి ఆధారంగా, ఒకదానికి ఒకటి ఆహారంగా మొత్తం అంతా నిర్మాణం చేశాడు. ఎవరికీ ఆహారానికి లోటు లేకుండా చేశాడు. అందరికీ అన్నం. The Giver of our Food. అందుకనే భగవత్ లక్షణములలో ముఖ్యమైన లక్షణం ఏమిటి అంటే పూర్ణమైన ఆనందంతో, ప్రేమతో అన్నం పెట్టడం ఎక్కడ జరుగుతుందో అక్కడ భగవంతుడున్నట్లు. అన్ని దానాల్లోకల్లా అన్నదానం ముఖ్యమని చెప్తారు. అన్నం పెట్టేటప్పుడు కూడా చిరాకు పడకుండా, తిట్టుకోకుండా, తినే టైముకొస్తే ఇప్పుడొచ్చాడు, అని అనుకోకుండా పెట్టగలగడం అనేది ఒక దైవీ స్వభావం. అందుకనే కదా అతిథి అన్నారు. తిథి లేకుండా వస్తాడు అంటే not by appointment, but by surprise అన్నమాట. అతిథి అంటే ఎప్పుడొస్తాడో మనకి తెలీదు. Sudden గా వస్తాడు. అయినా పెట్టగలిగి వుండాలి. ఆ సాంప్రదాయాలన్నీ మన కిప్పడు పోతున్నాయి. ఎందుకంటే శరీరానికి ఓపికలు తగ్గి మనమే Hotel కి వెళ్ళిపోతే పోలే అనేట్టుగా వుండే ఈ రోజుల్లో పదిమందికి అన్నం పెట్టే పరిస్థితి ఎక్కడ వుంది? లేదు కదా! సెలవరోజుల్లో 11, 12 అయినా ఇంట్లో పొయ్యి ముట్టించకపోతే ఏంటి విశేషం అంటే Hotel కి పోదాం అంటాం. వండి పెట్టడంలో ఒక ఆనందం వున్నది. అది దైవీ సంపత్తి వున్నవాళ్ళు మాత్రమే చెయ్యగలరు. అందరూ చెయ్యలేరు. కొని పెట్టడం వేరు, వండి పెట్టడం వేరు. అట్లా షిరిడీ సాయి అట్లా వండి పెట్టాడు. ఎంత వండాడంటే గరిట కూడా లేకుండా చెయ్యిపెట్టి తిప్పి అట్లా వండాడు. ఎందుకని? ఆ ప్రజ్ఞ అందింపబడుతుందని. ఎక్కడైతే ఏ మాత్రము reservation అంటే మనస్సులో ఒక సందేహం లేకుండా, హాయిగా, పరిపూర్ణంగా, తినేవాడికి తుష్టిగా, పుష్టిగా భోజనం పెడ్తారో అక్కడ భగవంతుని యొక్క అస్తిత్వం చాలా ఎక్కువగా వుంటుంది. అందుకనే మహాత్ములైనవాళ్ళు వాళ్ళ దగ్గరికి వెళ్ళినపుడు, భోజన సమయంలో భోజనం చెయ్యకుండా పంపించరు.

అంతేకాదు యేదో ఒకటి పెట్టకుండా పంపించరు. షిరిడీ సాయి ఉదాహరణగా మనకి కనుపిస్తారు. జిల్లెళ్ళమూడి అమ్మ అట్లా. ఆమె ఎంతదూరం వెళ్ళిందంటే వండించడమే కాకుండా తనే దగ్గర వుండి తినిపించేది. కొంతమందికి తనే నోట్లో పెట్టేది. అది దైవీ స్వభావం! అన్నం పెట్టాలంటేనే భయంకరంగా మొహం పెట్టి, ఎంతసేపూ ఎవరింటికన్నా భోజనానికి వెళ్ళాలంటే ready అయిపోయి, భోజనం పెట్టాలంటే బాధ పడేచోట భగవంతుడు వుండడు. అతిథికి భోజనం పెట్టడం ఒక కర్తవ్యం. అది మనం నిర్వర్తించుకోలేకపోతున్నాం ఈ రోజున అంటే అర్థం యేమిటయ్యా అంటే కలి బాగా ప్రభావం పరిపూర్ణంగా వున్నదని అర్థం. ఈ రోజుల్లో పెళ్ళిళ్ళకి ఏ Hotel ల్లోనో భోజనాలని చెప్తే, బంధుమిత్ర సపరివారంగా అని వేస్తారే శుభలేఖల్లో అట్లా పొల్లు పోకుండా అందరినీ పట్టుకుని వెళ్ళి పోయే ఒక పరిస్థితి వచ్చింది. సంతర్పణ! ఎందుకట్లా వచ్చిందంటే పెడితే తినడానికి ready, పెట్టడానికి ready కాదు అన్నట్టుగా. కాబట్టి ఈ నామం బాగా మళ్ళీ మన జీవితాల్లోకి తెచ్చుకోవాలి. ఉన్నంతలోనే పెట్టడానికి ప్రయత్నం చేయాలి. తినడానికి కాదు, తినకుండా వుండమని నేను చెప్పట్లేదు. తిను. తిన్నదానికన్నా ఎక్కువ పెట్టు. నువ్వు యెంత తింటున్నావో అక్కడ, ఇక్కడ అంతకుమించి పెట్టడానికి ప్రయత్నం చెయ్. అందుకనే రకరకాల కార్యక్రమాలు ఏర్పరచుకుని ఆ సందర్భంగా అన్నదానం చేస్తూండాలి. వండి పెట్టే ఓపిక లేకపోతే వండించి పెట్టండి. కొని పెట్టద్దు. మీ ఇంట్లో వండించి పెడితే మీ ఇంటికి వృద్ధి, ఎక్కడో వండించి మీయింటికి తెచ్చి పెడితే, వుంటుంది, అంతవుండదు. మీరే వండిపెడితే బాగా వుంటుంది, ఒళ్లు హూనమై పోతుంది. కానీ దానిలో ఆనందం వున్నదనుకున్నవాళ్ళకు ఒళ్ళు హూనమవుతుందని అనిపించదు. అందులో ఆనందం లేని వాళ్ళు, ఒళ్ళు దాచుకొనేవాళ్ళు అలా అనుకుంటారు. అది చేస్తూ వుంటే అందులోంచి శక్తి వస్తుందని కూడా తెలుస్తుంది. నలుగురికి పెడుతూ వుంటే మనకి శక్తి పెరుగుతుంది. ఇది ఒక రహస్యం. దానికి మనం కృషి చేయాలి. భగవంతుడు అందరికీ ఆ విధంగా పెడుతున్నాడు. మనుషులకి, జంతువులకి. ఎక్కడ బాగా భోజనాలు పెడ్తున్నారో అక్కడ వృద్ధి వుంటుంది. తిరుపతిలో అట్లా ఊరికే మనకి ఒక నియమం వుండడం కోసం రూపాయి టికెట్టు పెట్టారు. రూపాయ కూడా కాదు. దర్శనం చేసుకున్నవారికి free ticket. ధర్మ దర్శనానికి కూడా

వున్నాయి. వేలాది మంది భోంచేస్తూవుంటే అక్కడ శక్తి పెరుగుతూ వుంటుంది. ఒక ఆశ్రమం వుందనుకోండి, అక్కడ బాగా భోజనాలు ఎప్పుడూ పెడ్తున్నారనుకోండి, ఆశ్రమానికి పుష్టి పెరుగుతూ వుంటుంది. ఎందుకంటే అక్కడ అవతరిస్తూ వుంటాడు భగవంతుడు పరిపూర్ణంగా. ఇక్కడ తినడానికి ఏమీ లేదండీ, వూరికే meditation మాత్రమే అని చెప్పారనుకోండి. చెప్తే ఏమవుతుందంటే వుంటుంది, అంత బాగా వుండదు. రమణమహర్షి అట్లా భోజనాలు పెట్టారు. తెలిసిన వాళ్ళందరూ భోజనాలు పెట్టారండి బాగా. ఆ విధంగా ఏ మహాత్ముని జీవితం మీరు తరచి చూసుకొన్నా భోజనాలు పెట్టడం అనే కార్యక్రమం వుంటుంది. ఎందుకంటే అది దైవీసంపద, కళ్యాణమైన గుణము. దానికి సంబంధించిన నామం మనకిక్కడ 'వాజసనః' అందరికీ భోజనం పెట్టేవాడు. అంటే దేవుడే! 'అన్నదాతా సుఖీభవ' అంటాం కదా! ఇది చాలా సత్యం. మనిషి సుఖపడాలంటే నలుగురికి పెట్టాలి. ఎందుకంటే ఆయనే తనను తను వండించుకుని అందరికీ పెట్టేశాడు. భగవంతుడు తనే వండింపబడి అందరికీ అందుబాటులోకి వచ్చేశాడు. అట్లా మనని మనం వండుకోవడం అనేది ఏమిటయ్యా అంటే మన శక్తి సామర్థ్యాలని, మనకున్న సంపదను నలుగురికీ వుపయోగపడేటట్టుగా పంచడం. అందులో అన్నిటికన్నా ముఖ్యం భోజనం పెట్టడం. మీరు ఏమి ఇచ్చయినా ఇంక చాలండీ, అని అనిపించుకోలేరు, అన్నం పెట్టితప్ప. మీరు యెవరికన్నా తిండిపదార్థాలు పెట్టి వాళ్ళచేత చాలు అనిపించవచ్చు. వందరూపాయల నోట్లకట్టలు అట్లా తీసి యిచ్చామనుకోండి, తీసి జేబులో పెట్టుకుంటాడు. మళ్ళీ చూస్తాడు. ఇంకోటి యిస్తే మళ్ళీ తీసుకుంటాడు. ఇంకోటిస్తే పుచ్చుకుంటాడు. మరీ ఎక్కువైతే వందరూపాయల కట్టలు వద్దు సార్ 500 రూపాయల కట్టలు పట్రండి ఈసారి నుండి అని చెప్తాడు. అవికూడా కాకపోతే యివన్నీ యెందుకండీ Biscuits వుంటే ఇవ్వకూడదా easy గా దాచుకోవచ్చు అంటాడు. చాలదు. వస్త్ర దానంలో తృప్తిపరచలేరు. ద్రవ్య దానంలో తృప్తి పరచలేరు. ఇంక ఏ దానాలతో తృప్తి పరచలేరు. అన్నదానంలో బాబు యింక వద్దు అని అక్కడ నుండి జీవుడు పలకక తప్పదు. అందుకనే జీవుడ్ని తృప్తి పరచడానికి అత్యద్భుతమైన దానం అన్న దానం. అది కారణంచేత ఏదో అమావాస్యకో, పౌర్ణమికో, ఏకాదశికో, శనివారానికో ఒకరికి అన్నం పెట్టడమో, పోనీ ఒక ఆవుకు అరటిపండు పెట్టడమో చేయండి.

ఏమిటో దేనికీ ఏదో పెడ్తామనే భావనే లేదు. ఎంతసేపు అది మనకు ఏమిస్తుందని చూడటమే తప్ప. అందుకనే నలుగురికీ పంచడంకోసమే మనవాళ్ళు పంచమహాయజ్ఞాలని పెట్టారు. ఆర్యుల సాంప్రదాయాల్లో పంచమహాయజ్ఞాలు చాలా ముఖ్యమైనవి. అందులో మొట్టమొదటిది బియ్యప్పిండితో ముగ్గువేయడం. ఎందుకనంటే తెలిసో తెలియకో మనం కాళ్ళతో నడుస్తున్నప్పుడు భూమిమీద యెన్నో రకాల క్రిమికీటకాల్ని తొక్కేస్తూవుంటాం. అందుకనే వాటిని పోషణచేసే బాధ్యత మనకుంది కాబట్టి ఈ ముగ్గు వేస్తే అవేవో వచ్చి తినిపోతూవుంటాయి. అందుకని ముగ్గు బియ్యప్పిండితో పెట్టడం. ఆహారపదార్థంతో ముగ్గు పెట్టడం. అంతేకానీ ఆరునెలలకొకసారి ఏదో paint పూసేసి, బాగానే వుందిలే అనుకోవడం కాదు. అందుక్కాదు ముగ్గుపెట్టేది. భగవంతుడు ఆ జీవులద్వారా తృప్తి పొందుతాడు. అలాగే మొక్కలకి నీళ్ళుపోయడం. ఎన్నో ఇస్తున్నాయి మొక్కలు మనకి. ఆ మొక్కలకి నీళ్ళు పోయవలసిన బాధ్యత వున్నది. అన్ని మొక్కలకి వీడు ఎట్టాగో పోయలేడని కనీసం తులసిమొక్కలో కాస్త ఓ ఉద్ధరిణెడు నీళ్ళు పోయరా, అని చెప్పారు. అందరూ తులసి మొక్కలోనే పోసేయక్కరలేదు, కుళ్ళిపోయేట్టుగా. ఇంట్లో వుండే ఏదో ఒక చెట్టుకి యిన్ని నీళ్ళు పోస్తే చాలు. మరి దాన్నించి బోలెడు తింటున్నావు. ఆకు కూరలు తింటున్నావు, కాయగూరలు తింటున్నావు, పండ్లు తింటున్నావు, చెట్లుకూడా తింటున్నావు. అరటిచెట్టు వుందనుకోండి. దాని కాండం కూడా తినేస్తాం మనం. కాబట్టి చెట్టుకు నువ్వు ఏం చేస్తున్నావు? ఆహారం యివ్వు. నీరే ఆహారం చెట్టుకి. పంపులో పట్టి యిట్లా పోసేయొచ్చు. వండక్కరలే. అలాగే జంతువులకు ఆహారం పెట్టు. మూడవది. ప్రతి ఆర్యుని యొక్క జీవితంలో క్రిమికీటకాదులకి, జంతువులకి, వృక్షములకు, పక్షులకు, మనుషులకు ఐదుగురికి ఆహారం పెట్టాలి. అందుకనే మనకి యెవరైనా ఒక వ్యక్తికి, మన కుటుంబసభ్యుడు కానివాడికి, పెట్టకుండా భోజనం తినకూడదని ఒక సాంప్రదాయమున్న కుటుంబాలు కూడా చాలా వున్నాయి. ఎవరో ఒకళ్ళకి భోజనం పెట్టాలి. ఊళ్ళో ఎవరికో ఒకళ్ళకి ఒక విస్తరినిండా భోజనం తీసుకువెళ్ళి వారికి యిచ్చి వచ్చి తింటాం. అది చివరి చివరికి యెట్లా తయారైందంటే యింత పిండం పక్కన తీసిపెట్టి మనం తిన్న తరువాత అదెవరినా వస్తే వాళ్ళకు వేయడంగా పెట్టారు. ఏదో విధంగా మానవుడికి,

జంతువుకి, పక్షికి, వృక్షమునకు, క్రిమికీటకాదులకు ఆహారం అందించ కుండా నీవు ఆహారం భుజిస్తే నీవు దొంగవు, అని చెప్తారు. మరి మనకింక దేనికీ time లేదు. ఏంటో అండీ అంతా busyగా వుంటుంది, మాయింటికి కాకే రాదు అన్నట్టుగా వుంటుంది. పెడ్తూ వుంటే వస్తూ వుంటాయి. మీరు రోజూ గింజలు అట్లా బయటపడేయండి, బోలెడు పక్షులు వస్తాయి నెమ్మదిగా. గింజముట్టదుట, రాదు, దొరకదుట అంటే ఏమి వస్తాయి? ఏమీ రావు. ఆ యింటికి మాత్రం వెళ్ళకండి అని చెప్పకుంటారు అందరూ. అందుకే యీ గుణం మనలో పెంచుకుంటే యిది చాలా త్వరితగతిని మనలో సంస్కారాల్ని పెంచుతుంది. వాటికి కూడా మళ్ళీ పుణ్యతిథులిచ్చారు. పర్వదినములలో భోజనం పెట్టడం. అంటే పండుగ దినాలు అన్నీ పర్వదినాలే. ఏకాదశుల్లో భోజనం పెట్టడం, మాస శివరాత్రి సమయంలో భోజనం పెట్టడం, పౌర్ణమి సమయంలో భోజనం పెట్టడం, పుట్టినరోజు సందర్భాలలో పెట్టడం, పుణ్యక్షేత్రాలలో భోజనం పెట్టడం. పుణ్య క్షేత్రాలలో దేవుడ్ని చూసి ఎప్పుడు తిందామా అని మనం అనుకుంటూవుంటాము. అక్కడ పెట్టిన భోజనం మిగతా చోట పెట్టిన భోజనం కన్నా ఎక్కువ ఫలితాన్ని యిస్తుందని చెప్పారు పెద్దలు. యజ్ఞయాగాదుల్లో అన్నదానం చెయ్యడం, గురుపూజలు వస్తున్నాయనుకోండి, లేకపోతే మాస్టరుగారి పుట్టిన రోజు వస్తోందనుకోండి, భోజనానికి ఏం జరుగుతోంది. అందులో మనం ఏం చేస్తున్నాం అని ఆలోచించేవాడు అదృష్టవంతుడు. భోజనంలో ఏం వేస్తారో అని ఆలోచించుకొని వచ్చి తిని పోదాం అని అనుకునేవాడు లౌకికుడు. ఎట్లా వస్తున్నాయి ఇవన్ని? ఎవరో చేస్తున్నారు, కొంతమంది. నీవు కూడా చేయవచ్చు. అసలా బుద్ధి ఎందుకు పుట్టలేదు? ఎక్కడ వీలుంటే అక్కడ భోజనాలు పెట్టాడానికి ముందుకెళ్ళాలి. ఎవరైనా కార్యం చేయటానికి వస్తే 'పెళ్ళండీ డబ్బు సాయం చేయమంటే' 'భోజనం ఖర్చు నేను పెట్టుకుంటాలే' అని చెప్తే better. అలా చూసుకుంటూ వుండండి. అందులోంచి భగవత్తత్త్వంలోకి పెరగడానికి చాలా అవకాశం వుంది. ఎక్కడ ఆ విధంగా చేస్తూ వుంటారో అక్కడ భగవంతుడియొక్క అవతరణం బాగా వుంటుంది. ఆయనే వచ్చేస్తాడు కుడా ఒక్కొక్కసారి. నువ్వు నమ్మిన గురువో, దైవమో నీ యింటికి వచ్చి భోజనం చేసేంత శ్రద్ధాభక్తులతో కూడా భోజనం పెట్టవచ్చు.

## 827 శృంగిః

శృంగము అంటే కొమ్ము అని అర్థము. ఈ మొత్తం అంతా ఏర్పడినదానికి కొమ్ముకాసేవాడు ఆయన. కొమ్ముగా ఏర్పడినవాడు ఆయన. దానినే మందర పర్వతం అని చెప్తారు. అది లేకపోతే యేమీ ఏర్పడవు. అంటే అది కేంద్రంగా సమస్తమూ యేర్పడుతూ వుంటాయి. అనేక శృంగములు కలిగినవాడు. అంటే సమస్తానికీ తాను ఆధారముగా ఏర్పడతాడు. అలాగే నీ చుట్టూ వుండే కార్యక్రమములకి నీవు ఆధారంగా ఏర్పడడం ఒకటి. దాని మీద ఆధారపడడం ఒకటి. రెండున్నాయి. భగవంతుడు సమస్తమునకూ ఆధారముగా వున్నాడు. భగవద్భక్తుడు కూడా భగవంతుని చేరుకోవాలంటే తనచుట్టూ వుండేవారికి ఆధారంగా వుండాలి. తనకన్నా పైవారిమీద ఆధారపడుతూ, తనకంటే తక్కువ వారికి ఆధారంగా వున్నట్లైతే సృష్టిలో నిలబడడానికి అవకాశం వుంటుంది. ఈ నేల మనం కూర్చోడానికి ఆధారంగా వుంది. పై అంతస్తు క్రింద గోడల మీద ఆధారపడి వుంది. ఇట్లా ఒకదాని మీద ఒకటి ఆధారపడుతూ, ఆధారంగా వుండడం. భూమి సూర్యుడు ఆధారంగా చోట్లో అట్లా వున్నది. అంతమాత్రంచేత ఎంతసేపూ ఆధారపడ్డట్లే వున్నదా? ఇంతమంది జీవులకు ఆధారముగా వున్నది. రెండూ వుండాలి. రెండూ వుంటే స్థితియందు వుంటాం వున్నచోట. ఆధారపడడం కన్నా, ఆధారంగా వుండడం పెరుగుతూ వుంటే ఊర్ధ్వలోకానికి వెళుతూ వుంటాం. ఆధారంగా వుండడంకన్నా, ఆధారపడడం ఎక్కువవుతూ వుంటే అధోలోకానికి వెళ్తూ వుంటాం. ఇదో సూత్రం. ఈ నిచ్చెన ఏడులోకాల నిచ్చెన, ఏడుమెట్ల నిచ్చెన అనుకుంటే పైకి వెళ్తావా, కిందకు వెళ్తావా అనేది నీ చేతుల్లో వున్నది ఒక విధంగా. ఎంతమందికి నీవు వినియోగపడుతూ వుంటే అంత పైకి వెళ్తూ వుంటావు. ఎంతమందికి నీవు ఆధారభూతుడిగా వుంటే అంత పైకి వెళ్తూ వుంటావు. ఎన్నాళ్ళు చేస్తాం యీ చాకిరీ అనుకున్నాం అనుకోండి కిందకు వచ్చేస్తాం. చెయ్యడం వల్ల పైకి వెళ్తాం. చేయించుకోవడం వల్ల కిందకి వెళ్తాం. చేయించుకోవడం అంటే పదార్థంలోకి ప్రవేశించడం అవుతుంది. చేయడం అంటే ప్రజ్ఞలోకి వెళ్ళడం అవుతుంది. సూర్యుడాధారంగా ఇవన్నీ యేర్పడినాయి. సూర్యుడుకూడా అంతకు పైన వున్న తత్త్వముయందు

ఆధారపడి వుండి, మనకి ఆధారభూతుడయ్యాడు. అలాగే మనకన్నా పెద్దవారియందు మనం ఆధారపడి, మనకన్నా చిన్నవారికి మనం ఆధారంగా వుండాలి. అప్పుడేమవుతుందంటే ఈ నిచ్చెనలో పైకి క్రిందకీ మొత్తం వ్యాపించి వుండడానికి వీలవుతుంది. ఆ విధంగా ప్రతి ఒకటి ఒక కేంద్రం అవుతుంది. శృంగము అవుతుంది. అంటే ముందు ఆధారపడుతున్నవాడు పరిధిలో వుంటాడు. ఆధారపడుతూ తన శక్తిసామర్థ్యాలను పెంచుకుంటూ, తనయందు ఇతరులకు చేయవలసినస్ఫూర్తిని, లోకహితాన్ని, శ్రేయస్సునూ, పెంచుకుంటూ వుంటే పరిధినుండి తెలీకుండా నెమ్మదిగా కేంద్రం లోకి వచ్చేసి తానే ఒక కేంద్రం అవుతాడు. మళ్ళీ తన చుట్టూ పరిధి ఏర్పడుతుంది. అంటే తన మీద ఆధారపడే వాళ్ళు వస్తారు. వాళ్ళకు తను చేస్తున్నంతసేపు తను కేంద్రంలోకి వెళ్తూ వుంటాడు. దాన్నే Master CVV గారు ఏమని చెప్పారంటే 'centre every where, circumference no where' అని. అంటే నువ్వు ముందు circumference. అంటే ఒక కేంద్రం చుట్టూ తిరుగుతూవున్నావు. కాసేపు చుట్టూ తిరిగామండీ. ఎన్నాళ్ళు తిరుగుతావు? దేనికోసం తిరుగుతావు? మాస్టరుగారి వలే మనంకూడా పని చేయడానికి స్ఫూర్తి పొందడం కోసం ఆయన చుట్టూ తిరుగు. కానీ నువ్వు కూడా ఒక కేంద్రం అవ్వాలి ఆయన లాగా. కొడుకు తండ్రి వేలుపట్టుకుని ఎన్నాళ్ళు తిరుగుతాడు? ఇహ నువ్వు కూర్చో నాన్నా నేను చేస్తాను, అనే పరిస్థితి రావద్దూ? శిష్యుడెన్నాళ్ళు తిరుగుతాడు గురువు చుట్టూ. గురువు చేసిన పనులు శిష్యుడు చేస్తుంటే గురువు అవుతాడు. తండ్రి చేస్తున్న పనులు కొడుకు చేస్తుంటే ఇతడు తండ్రి స్థానంలోకి వస్తాడు. ఇట్లా బాధ్యత పడుతున్నకొద్దీ promotions వస్తాయి. అంటే ఏమయ్యింది? పరిధి నుండి కేంద్రంలోకి వస్తున్నావన్నమాట. నువ్వు ఒక కేంద్రమవుతున్నావు. ప్రతి పరిధి ఒక కేంద్రమే అని చెప్తున్నారు. 'కేంద్రమే తప్ప పరిధులెక్కడవున్నాయి సరిగ్గా చూస్తే' అంటారు Master CVV గారు. Every disciple is the future Master. వేదం ఏమి చెప్తుందంటే 'ప్రతి జీవుడూ కూడా భవిష్యత్తులో ఒక సూర్యుడే!' మనం చూస్తున్న ప్రతి జీవి మనతో కలిపి అందరూ కూడా ఏదో ఒక రోజున సూర్యుడవుతాడట. మన చుటూ సూర్యమండలం, వాటిమీద జీవులు ఇంతవరకు ఎదుగుతామని వేదం చెప్తున్నది. అందుకనే ఆ కనపడుతున్న సూర్యుడు నేను ఒకటే, మాకేం

తేడాలేదు అని చెప్పకుంటాం. అంటే ఇందులో శృంగం అనే నామానికి ఇంకో రకంగా అర్థం చెప్పకుంటున్నాము. ఆధారంగా వుండు, ఆధార పడవద్దు. జ్వాలాకూలుడు చెప్పిన వాక్యం ఒకటి వుంది. 'ఇలా కిందికి నీ దగ్గర సహాయం పొందవలసినవారికి చెయ్యి అందిస్తే, మాచెయ్యి నీ మీద వుంటుంది రక్షగా. ఇలా కిందికి అందించ కుండా, అట్లా పైకి అందుకోండని చెయ్యి అందిస్తే పైన శూన్యమే వుంటుంది నీకు. ఎవ్వరూ ఏమీ అందుకోరు' అని. 'మాపక్క చూడక, నీ పక్క చూసేవాళ్ళ పక్క నువ్వు చూస్తూ వుంటే, నీ పక్క మేం చూస్తాం' అని చెప్పారు. మనం ఎంతసేపూ అటు చూడటానికే ప్రయత్నం చేస్తాం. వాళ్ళు అటుకాదురా ఇటు చూడమంటారు. ఇటు చూస్తే కేవలం చూడడమే కాకుండా చూసి చేస్తే, వాడు అటు నుండి మనని చూస్తాడు. ఇది శృంగి. ఆయన ఎవరి మీద ఆధారపడ్డాడండీ? భగవంతుడికి ఏది ఆధారం? పూర్ణ యోగి కూడా అంతే. దేనిమీదా ఆధారపడడు. దాన్నే 'నిరాలంబ' అనే అమ్మవారి నామంగా చెప్తారు. వేరే ఆలంబనమేమీ లేదు. తానే. తానంటే అదే తానుగా వుంది. కాబట్టి తను కూడా అదియే. దానితో తను యోగము చెందివుండడం చేత తను ఇంక దేనిమీదా ఆధారపడే పరిస్థితి రాదు. శ్రీకృష్ణుడు దేనిమీద ఆధారపడ్డాడు? ఇన్ని పనులు చేశాడు. ఎక్కడా పూజలు చేసినట్టు కూడా వుండదు. ఒక మానవుడిగా మనం దర్శనం చేసినట్లైతే తన మీద ఆధారపడిన వాళ్ళందరికీ చెయ్యడమే తప్ప, నాకెవరు దిక్కు అని చూడలేదు. నేను అందరికీ చేశాను బాగానే వుంది, నాకు చేసేవాడెవడు అని అనలేదు. ఉండక పోగా యెవడైనా ప్రీతితో, ప్రేమతో, భక్తితో చేస్తే దానికి కొండంతలు మళ్ళీ తిరిగి చేసి ఇచ్చేశాడు. సుదర్శన చక్రం సంధించి వదులుతున్న సందర్భంలో వేలికి చిన్న గాయమైతే చుట్టుపక్కన వుండేవాళ్ళు పరుగెత్తారు అక్కడికీ, ఇక్కడికీ ఈయనకి బట్టతెద్దామని. అప్పడే రాజసూయం జరిగిందంటే ఎంతమంచి పట్టుబట్ట కట్టుకుని వుండాలి ద్రౌపదీదేవి? మొత్తం భూమండలంలోని రాజులందరూ వచ్చేశారు. ధర్మరాజు రాజసూయం చేశాడు. ఆమె పట్టమహిషి. ఎటువంటి పట్టు చీర కట్టుకుని వుండాలి? సర్రున చింపేసి అది ఆయన వేలికి కట్టేసింది. ఆడవాళ్ళు ఏదైనా ఫరవాలేదు కానీ చీర విషయంలో వాళ్ళకి చాలా మమకారం చాలా ఎక్కువ. 50% discount అని వాళ్ళు కోట్లు సంపాదిస్తూ వున్నారు వీళ్ళనాధారంగా చేసుకుని. చీరలకి 50% discount అంటే పరుగోపరుగు.

ఒకటే పరుగు. రహస్యం యేమిటంటే అక్కడవున్న ధరని రెండింతలు పెంచి అందులో 50% discount వేస్తారు. మనం పరుగెత్తి అవి కొనుక్కొచ్చుకుంటూవుంటాం. అదొక బలహీనత. అందుకని కృష్ణుడు అమ్మో! ఇంతమందిలోనూ నావేలి గురించి ఇంత శ్రద్ధ వహించింది. (పైగా పట్టుచీర చింపేసింది). ఆ భావన అనుస్యూతం గా చేశాడండీ. ఆమెకు ముందు చీరలిచ్చాడు కదా! ఎన్నిచ్చాడు? ఒక్క చీర చింపినందుకు అన్ని చీరలు వచ్చినాయి. ఆవిడ చేతి అన్నం మెతుకు తిని కుంభాలు కుంభాలుగా తయారుచేసి అక్కడ పడేశాడు. ద్రౌపదిని వదల్లేదు ఆయన. ఎక్కడ ద్రౌపదికి కష్టం వచ్చినా అక్కడ అట్లా రక్షణ ఇచ్చాడు. అట్లా వుంటుంది. ఒక మహాత్మునికి గనక మీరు (ఉడుత సహాయం అంటారు చూశారా! రాముడుకి ఉడుత చేసినట్లుగా) చేస్తే, మనం చేసిన సహాయం వాళ్ళకు బొత్తిగా అవసరం లేకపోయినప్పటికీ వాళ్ళు ఉప్పొంగిపోతారు. ఎంత వుప్పొంగుతారంటే వెయ్యిరెట్లు, లక్షరెట్లు. నువ్వు చేసినదానికి తిరిగి నీకు అందిస్తారు. అది వాళ్ళల్లో వుండే గొప్పదనం. ఎందుకంటే వాళ్ళకు కావలసినదేదీ లేదు. వాళ్ళు పొందవలసినదేదీలేదు. వాళ్ళు అందరికీ అందించడానికి వచ్చినవాళ్ళు. కాబట్టి శృంగముగా భగవంతుడు ఏర్పడి తాను సమస్తమునకు ఆధారమై వున్నాడు. ఏది ఆధారంగా ఇవన్నీ ఏర్పడుతున్నాయి? ఆయనకి ఆధారమేమిటీ? Nil. కాబట్టి నీవు కూడా దైవభక్తుడివి అవుదామనుకుంటే ఈ రకమైన గుణాలు అనుసరించడానికి ప్రయత్నం చెయ్యాలి. వీలున్నంతవరకు (యోగి కాదు ఎందుకంటే అప్పడే సిద్ధి పొందినవాడు) యోగసాధకుడు తన పనులు తను చేసుకోవాలి. మనం యింటికి వచ్చి కాళ్ళు బారజాపి ఇంకా మంచినీళ్ళు తేలేదేం అన్నట్టుగా చూస్తాం. నీ మంచినీళ్ళు నీవు వెళ్ళి తెచ్చుకుని తాగలేవా? ఎందుకలా ఆధారపడుతున్నావు? పెళ్ళికాక ముందు ఎవరిచ్చారు? రేపావిడ పుట్టింటికి వెళ్తే ఎవరిస్తారు? అసలు ఇంటికి వెళ్ళి పోయిందనుకోండి అప్పుడెవరిస్తారు? ఎవరు లేకపోయినా తనకు ఇబ్బంది లేనట్టుగా జీవించేటివాడు సాధకుడు. డబ్బు లేదనుకో, డబ్బుమీద ఆధార పడడు. పలుకుబడి మీద ఆధార పడడు. మనుషుల మీద ఆధార పడడు. అందరికి తను ఆధారంగా వుంటాడు. అట్లా వున్నవాడికి ఈ మొత్తానికీ ఆధారంగా వున్న వానితో ఒకరకమైన మైత్రి ఏర్పడడం చేత అక్కడ

నుండి అన్నీ వస్తూ వుంటే ఇస్తూ వుంటాడు. పుచ్చుకుని ఇవ్వడం కాదు. పుచ్చుకునేదానికి వెయ్యిరెట్లు యిస్తాడు. అదీ యీ శృంగం.

## ౪౨౪ జయంతః

అంతిమ విజయం ఆయనదే అన్నింటిలోనూ! ఒక ధర్మరాజు కథ చూశామనుకోండి మహా భారతంలో, మధ్యలో చాలా కష్టాలు పడ్డాడు, కానీ అంతిమ విజయం? ఏది అంతిమ విజయం అంటే మోక్షమే! ధర్మరాజు ఒక్కడే అది తెలుసుకోగలిగాడు. మొత్తం భారతం కథలో ఆయనొక్కడే కథానాయకుడు. అర్జునుడు కథానాయకుడుగా కనిపించినప్పటికీ నిజమైన అంతిమ విజయం ధర్మరాజుదే! ఎందుకంటే ఆయన యందు వుండటంచేత! చివరికి జయం కలిగించేవాడు. ఇది ఆధారంగా కథ చదువుకోండి. దారిలో ఇబ్బందులు ఎన్నివచ్చినా మంచికెప్పడూ అంతిమ విజయం వుంటుంది. హరిశ్చంద్రుడికి అంతిమ విజయం, నలుడికి అంతిమ విజయం. ధర్మరాజుకి అంతిమ విజయం. భక్తుడికి అంతిమ విజయం. మరి దారిలో చాలా కష్టాలుంటాయి. జయంతః అంటే ధర్మాన్ని నమ్ముకుని అలా వున్నవాళ్ళకి తప్పక అసలు విజయం కలిగిస్తాడు. అందుకనే సినిమాల్లో కూడా చివర ఉన్న కథానాయకుడు చిట్టచివరకు ముందుకు వచ్చేస్తాడు. అంతవరకు మనకు కొంత suspense వుంటుంది. కథానాయకుడు అంటే ధర్మాన్ని పరిపాలించేవాడని, అనుసరించేవాడని. అలాగే భగవంతుని యొక్క కార్యములయందు నిమగ్నమైనవాడు, ధర్మబుద్ధి కలిగినవాడు, దైవమునందు భక్తి వున్నవాడికి దారిలో ఎన్ని వచ్చినాసరే కడతేరుస్తారు. మునగడు. మిగతావాళ్ళంతా దారిలో మునగవచ్చు, వాడు మునగడు. ధర్మరాజు యక్షుడు ప్రశ్నలేసినపుడు మునగలేదు, నహుషుడి విషయంలో మునగలేదు, చిట్టచివరకు రథం వచ్చినపుడు మునగలేదు. మునగడు. ఈ లోపల ఎంతవరకు నిలబడతాడని చూడడం ఉంటుంది. రాముని విజయం అంతిమ విజయమే, మధ్యలో ఏన్నో పడ్డట్టుగా వుంటుంది. He bestows the final victory. Foot-Ball ఆడుతూ వుంటే ముందు మనం goals కొట్టేశామండీ, ఆ తరువాత ప్రత్యర్థులు goals కొట్టేసి గెలిస్తే ఎవరికి మిగిలింది ఆనందం? ఆ ముందు మనం కొట్టాం కదా అని ఆనందంగా వుంటుందా? మొదటి half లో వీళ్ళు రెండు కొట్టారు. చంకలు గుద్దుకుంటున్నారనుకోండి రెండవ half చివరికి వచ్చింది, చటుక్కున చివరి క్షణంలో వాళ్లు మూడు కొడతారు. ఎవరికి మిగిలింది ఆనందం? అందుకనే

భగవద్భక్తుని జీవితం అంతమునందు చూడమంటారు. అంతమునందు ఎంత వైభవోపేతంగా వున్నది? అంతమునందు ఎంత విజయము కలిగి వున్నాడు? అన్నిటికీ మించి ఏ విధంగా శరీరము వదిలేశాడు? మనిషి మంచితనం మరణంలో చూడమన్నారు. ఏమిటో చాలా భయంకరమైన మరణం వచ్చిందని చెప్పుకుంటాం. ఎంత సులువుగా పోయాడండీ అని చెప్పుకుంటాం. అది అంతిమ విజయం. ఇది ఎవరికి కలుగుతాయి? దైవీ స్వభావం వున్నవాళ్ళకే కలుగుతాయి. ధర్మాన్ని అనుష్ఠానం చేసేవాళ్ళకే కలుగుతాయి. అందుకని భగవంతుని నామాల్లో జయంతః. కాబట్టి భగవత్ భక్తుడు తను నశిస్తాడేమోనని భయపడకూడదు. భయం ఉంటే భక్తి లేదని అర్థం. Atlast I shall win and I shall hold on to the last. ఇది వాడి నమ్మకం. ఎట్టి పరిస్థితుల్లోనూ నాకు అపజయము లేదు. కారణం ఏమిటంటే నేను వాడిని నమ్ముకున్నాను. 'నా భక్తుడు నశించడు' అని భగవద్గీతలో ఒక వాగ్దానం చేశాడు శ్రీ కృష్ణుడు. భారతయుద్ధంలో అంతిమ విజయం యెట్లావచ్చింది? మొత్తానికి జయించి పట్టుకు వచ్చాడు గదా వీళ్ళందర్నీ! అందుకే జయంతః

## ౮౨౫ సర్వవిత్

సమస్తమూ తెలిసినవాడు. ఇది తెలీదని ఏంలేదండీ. ఒక్క కృష్ణుడి విషయంలోనే యిది సత్యం. అంత మలీ అవతారం ధరించి మొత్తం అంతా తెలిసి వుండటం అనేది ఒక్క కృష్ణావతారంలోనే సంభవించింది. రామావతారంలో లేదు. పరశురామావతారంలో లేదు. అంతకు ముందు అవతారాలు ఊరికే ఓ సన్నివేశానికి వచ్చి వెళ్ళిపోయినవి. సమస్తమూ భగవంతునికి తెలిసి వుంటుంది అని చెప్పకోవడంలో పెద్ద విశేషం ఏమీలేదు. సమస్తమూ ఎరిగినవాడు కృష్ణుడొక్కడే. సర్వవిత్-- యుద్ధమా తెలుసు, నాట్యమా తెలుసు, సంగీతమా తెలుసు, యోగమా తెలుసు, వేదమా తెలుసు, జ్ఞానమా తెలుసు, శాస్త్రములా తెలుసు, నువ్వు ఏం చెప్ప అది అంతా తెలుసు. అందుకనే అవతారం అనరు కృష్ణుడ్ని. అవతారం బలరాముడు. ఈయన పూర్ణపురుషుడు. తెలియంది లేదు. ఎక్కడో వుంటాడు, ఎక్కడో జరుగుతున్నది చూస్తూ వుంటాడు. అంతే కాదు అవసరమైతే అక్కడ ప్రత్యక్షం అవుతాడు. ఏది తెలియదు? అందుకే భీష్మడికి అత్యాశ్చర్యము, అత్యానందము, అత్యద్భుతంగా వుంటాడు కృష్ణుడు. ఎందుకంటే మామూలు లెక్కల ప్రకారం ఈ పాండవులు ఆ కౌరవులను జయించడం అనే పరిస్థితి లేదు. ఎందుకంటే అటువంటి వరాలు సంపాదించుకుని అధర్మము వైపు నిలబడినవాళ్ళు వాళ్ళు. వీళ్ళని ఎట్లా జయిస్తారనేది ఒక పెద్ద puzzle. పెద్ద ప్రశ్నార్థకం. చాలా తికమకమైన సమస్య. అటువంటిది ఎక్కడికక్కడ అట్లా ముళ్ళు విప్పేసి ఎవడ్ని ఎట్లా జయించాలో తెలిసి అలా నడిపించాడు. నిజానికి మనం అన్నీ అంగీకరించవచ్చు, కానీ ఆ సైంధవుడి తల కొట్టించేటప్పడు, అర్జునుడికి ఆ తల వెళ్ళి వాళ్ళ తండ్రి ఒడిలో పడేట్టుగా కొట్టు అని చెప్తాడు కదా, అది ఊహించగలమా? అది లేకపోతే అర్జునుడు లేడు. అర్జునుడి తలకాయ చిచ్చుబుడ్డి పేలినట్లు పేలి పోయేది. అది ఎవడికి గుర్తువుంటుంది. ఈ విషయం సైంధవుడేమీ ప్రచారం చేసుకోలేదు. మరెక్కడా అంతకుముందు తెలీదు. అదే జరక్కపోతే అర్జునుడు ఏడీ? మనం ఊహించనంత, ఎవరూ ఊహించనంత, భీష్మడు కూడా ఊహించనంత గొప్పవిషయాలు ఇవి. సాయంత్రం వచ్చి ఈ కథలన్నీ భీష్మడికి చెప్పేవాళ్ళు వాళ్ళు. ఈ రోజు కృష్ణుడిట్లా చేశాడు. చాలా అత్యద్భుతం. చిన్నప్పట్నుంచి చివరివరకు కూడా

చేసినవన్నీ అతనికి పరిపూర్ణమైన అవగాహన కలిగినవే. సర్వవిత్ అంటే ఎవడో దాచేశాడు, మొత్తం ఆవుల్నీ, దూడల్నీ, గోపకుల్నీ. అవెత్తుకు పోతే మనమైతే వెతుక్కుంటాం. మనమేమిటి రాముడే వెతుక్కున్నాడు. అటువంటిది ఒక్కసారి కళ్ళు మూశాడు, తెరిచాడు. ఓహో! బ్రహ్మ పట్టుకు పోయాడనుకున్నాడు. తనే వీటన్నిటిగా ఏర్పడిపోయాడు కదా! అంతకన్నా సర్వవిత్ ఏముందండి? బ్రహ్మగారు అన్నీ దాచేస్తే దాన్ని చూడగలిగాడు వెంటనే క్షణంలో. వాళ్ళ నాన్న నందుడు మరీ మూడు గంటలకన్నా ముందే లేచి నదికి స్నానం చేయడానికి వెళ్తే, వరుణుడి భటుడు వచ్చి సముద్ర గర్భంలోకి పట్టుకు పోతే, అందరూ కుయ్యో, మొర్రో అన్నారు. ఒక్కసారి కన్నులు మూసి తెలుసుకున్నాడు. ఒహో అక్కడవున్నాడు నాన్న. అన్నాడు. వెళ్ళాడు తీసుకొచ్చాడు. అట్లా ఎంత అద్భుతమైన విషయం! తెలియనిదంటూ లేదు. ఇది తెలియదు అనడానికి వీలు లేదు. అన్నీ తెలుసు. పోనీ ఏదో కొన్ని తెలుసని కాదు. అందుకనే సర్వవిత్. ఈ సర్వవిత్ నామం పట్టుకుని కృష్ణావతారంలోని అత్యద్భుతమైన ఘట్టాలన్నీ చెప్పకోవచ్చు. వాడెవడో వస్తున్నాడట గాలి రూపంలో, సుడిగాలిలా వచ్చాడు ఎత్తుకు పోదామని. వాడొస్తున్నాడని ముందే చూసి పసి బాలుడిగా వున్న శ్రీకృష్ణమూర్తి తల్లి ఒడిలో అట్లా బరువు పెరిగి, అట్లా పెద్ద కొండరాయంత బరువు అయిపోయాడట. ఏంటి యిట్లా బరువెక్కాడు పిల్లవాడు అని నేలమీద పెట్టేసి ఇవతలకి వచ్చింది. ఎందుకట్లా చేశాడంటే సుడిగాలి వీడ్ని ఎత్తుకుపోలేకుండాను. శకటాసురుని వధ, పూతన వధ. పాలిస్తే అందులో విషం వుందని మనకేం తెలుసు? అంతకుముందు బల్లి పడిందనుకోండి, అట్లాగే తాగేస్తాం. అంతటితో సరి. అటువంటిది అప్పడే యింకా మొదటిరోజు, పాలివ్వడానికి ఒకావిడ వచ్చింది. ఏం చేశాడు? ఎక్కడా మనకేం పోలికలుండవు. గొప్పకు మనం ఎవరినన్నా ఆయనతో పోల్చవచ్చు, తప్ప అది వేరు. సర్వవిత్- ఇక ఎక్కడా ఇటువంటి ఉదాహరణ ఎవ్వరూ చూపించ లేరు. ఏ గ్రంథంలోనూ చూపించలేరు, ప్రపంచ గ్రంథాలలో. ఏసు క్రీస్తు కూడా అలా చెప్పడానికి వీలులేదు. బుద్ధుడ్ని అలా చెప్పడానికి వీలులేదు. రాముడ్నే అలా చెప్పడానికి వీలులేదు అంటున్నాం. ఎవర్ని చెప్పగలరు? అంత పూర్తిగా తెలిసిపోయి ఏమీ తెలియనట్లుగా వుండడం అనేది మరీ మహత్తరమైన విషయం. కొంచెం తెలిసిన దానికే

మనకు చాలా తెలుసని అనుకోవడం కాకుండా, తెలుసునని అవతలి వాళ్ళకి అవగాహన అవ్వాలని రకరకాల ప్రయత్నాలు చేస్తూ వుంటాం. ఇక్కడ అంతా తెలిసి, ఏది అంతా అంటే తన పరిసరాలంతా కాదు, భూగోళమంతా కాదు, ఈ సూర్యమండలమంతా కాదు, ఈ స్సృష్టి అంతా తెలిసి వున్నటువంటివాడు, అని చెప్తున్నాడు భీష్ముడు. సమస్తమునూ ఎరిగినవాడు. అసలు ఊహించడానికి అందనివాడు.

## 830 జయా

ఎవరికి ఎప్పుడు జయం కలిగినా ఆ జయము భగవంతుడే అని గుర్తుండాలి. మనం జయం వచ్చేవరకు దేవుడా,దేవుడా, దేవుడా అంటాము. జయం వచ్చేసిన తరువాత parties, celebrations, సన్మానాలు, సభలు వీటిల్లో మునిగి పోతామే తప్ప, అసలు యీ జయం భగవంతుడే అని గుర్తుండాలి. అర్జునుడికి అట్లా గుర్తులేదు. భారతయుద్ధం అయ్యేసరికి అందరూ అర్జునుడ్ని పొగిడారు. అప్పుడు ఏం చెయ్యాలి అర్జునుడు? అబ్బే నాదేం లేదండీ, అంతా మా గురువుగారు చేసిపెట్టారు, అని చెప్పాలి. మన వాడు అవన్నీ తన account లో వేసుకున్నాడు. తరువాత తెలిసొచ్చింది యిదంతా మనదేం కాదు, అంతా ఆయనదని. ఏది మన account లో వేసుకోవడానికి ఏమీ లేదు. జరిగినదల్లా, కలిగిన మంచి అంతా కూడా ఆయన యొక్క అనుగ్రహం చేతనే కలిగింది అని తెలుసుకున్నవాడు సద్బుద్ధి. అలా కాకపోతే పతనం చెందడానికి అవకాశం వుంది. ఎప్పుడు, ఎక్కడ, ఎవరికి జయం కలిగినా, ఆ కలిగిన జయం భగవంతుని యొక్క అస్తిత్వం. పరీక్షలో pass అయ్యామనుకోండి, pass అయ్యేంతవరకు బిక్కుబిక్కుమంటాడు. Pass అయ్యాక పరీక్ష ఏం పెద్ద కష్టం కాదంటాడు. మేం చదువుకున్న చదువు చాలా కష్టమైన చదువు మన దేశంలో. Chartered Accountant pass అవడానికి ఆరుసార్లు, ఏడుసార్లు డింకీలు కొట్టి ఏదో pass పాసవుతారు. ఈ pass అయిన పిల్లవాడ్ని, pass కాని వాళ్ళని వుద్దేశించి మాట్లాడమంటే 'ఈ పరీక్ష పెద్ద కష్టం కాదు, కష్టపడి చదువుకుంటే అయిపోతుంది'. ఇట్లా చెప్తారు. మరి అట్లా చదువుకుంటే నీకవలేదేం అంతకు ముందు? అప్పుడేమో నాదగ్గరకి వచ్చి, జాతకాలు చూపించుకుని, ఎప్పుడవుతుంది? ఏ మంత్రం చేసుకోవాలి? ఏ ఉంగరం పెట్టుకోవాలి? ఇట్లా అడిగినవాళ్ళే. అదే pass అవగానే ఏమంటారంటే, అబ్బే అంత కష్టమేమీ కాదు, కష్టపడి చదువుకోండి వెధవల్లారా, అన్నట్టుగా పరీక్షలు రాసేవాళ్ళను ఉద్దేశించి మాట్లాడుతూ వుంటారు. చాలా సహజం. మనం కూడా అంతే. అయిపోయిన తరువాత మన face వేరుగా వుంటుంది. అంతకుముందు face వేరు. మనవల్లే అయిపోయిందన్నట్టుగా మాట్లాడుతాం. అలా అనుకోవద్దు. జయా, అసలు జయము నీవే. అందుకనే

భగవంతుడు మనపక్క వున్నాడనుకోండి, ఎప్పుడుంటాడు? ధర్మాన్ని అనుసరిస్తే వుంటాడు. జయం రూపంలో ఎప్పుడూ వుంటాడు. అందుకనే భక్తుడికి మామూలుగా వచ్చే భయంకరమైన సన్నివేశాలు కూడా విపరీతమైన జయాలు కలిగిస్తూ వుంటాయి. ప్రతికూలమైన సన్నివేశాలన్నీ అనుకూలంగా మారిపోతూ వుంటాయి. ఎందుకంటే పక్కన ఈయన వుండడంచేత. మామూలుగా ఇంకోళ్ళకైతే అది వికటిస్తుంది. వీడికది కలిసొస్తుంది. అంటే 'ఇందులో ఏం లాభం వుందండీ, మీరిందులో పెట్టబోకండీ' అని చెప్పారనుకోండి. వాడందులో పెట్టాడనుకోండి, లాభం వస్తాయనుకున్న దాంట్లో రాదు. దీంట్లో వస్తుంది. ఎందుకొచ్చింది లాభం అంటే వీడి ప్రక్కన వాడుండటం చేత. అర్జునుడి ప్రక్కన కృష్ణుడుండటంచేత విజయం అనేది తప్పని సరి అని వ్యాసుడు రాశాడు.

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీర్విజయోభూతిః ర్ధువానీతిర్మతిర్మమ

అక్కడ శ్రీ వుంటుంది. అంటే సంపద వుంటుంది. అక్కడ విజయం వుంటుంది. ఎక్కడ ఏ పార్థుడి ప్రక్కన యోగేశ్వరుడైన కృష్ణుడు నిలబడతాడో, ఇది నేను నమ్ముతున్న విషయం, అంటాడు వ్యాసుడు. పార్థుడంటే ఎవడు? మనమంతా పార్థులమే. అంటే పృథివి నుండి పుట్టుకొచ్చినవాళ్ళం అని అర్థం. లేక పదార్థమైన విషయములయందు ఇమిడి వున్నవాళ్ళం. జయం ఎట్లా కలుగుతుందయ్యా అంటే వాడితో వుండడం చేత కలుగుతుంది. శ్రీ కలుగుతుంది, విజయం కలుగుతుంది. కాబట్టి ఎప్పుడు, ఎక్కడ జయం కలిగినా అక్కడ ప్రక్కన భగవంతుని యొక్క చల్లని హస్తం వుంది. అదృశ్య హస్తం! అది వుంటుంది. భీష్ముడు భగవంతుని యొక్క ఆ విజయ లక్షణం చూశాడు. ఎట్లా ఎట్లా గెలిపించాడు? అవతలి వాళ్లు ఎన్నిరకాల కుతంత్రాలు వేసినా వాటన్నింటినీ చక్కగా విప్పి వీళ్ళకు జయం కలిగేలా చేశాడు. కాబట్టి జయము అనే నామం కూడా భగవంతుడే! ఎవరికి, ఎప్పుడు జయం కలిగినా అది భగవంతుని యొక్క అవతారమే! చిన్న విషయం నుండి పెద్ద విషయం వరకు.

## 831 సువర్ణబిందుః

సువర్ణబిందు అంటే అది ఓంకారానికి మరొక పేరు. నాదం, పరతత్త్వము నుండి ఉద్భవించినప్పుడు, ఆ నాదం కారణంగా వెలుగు వస్తుంది. అది మొట్టమొదట ఒక బిందువు వలె వస్తుంది. ఆ తరువాత నెమ్మదిగా వ్యక్తమై, హిరణ్యగర్భం అవుతుంది. మనకి కూడా మనలోంచి నాదం అలాగే వ్యక్తమవుతూ ఉంటుంది. భగవంతుని యొక్క మొట్టమొదటి వ్యక్తరూపం నాదంగా చెప్తారు. అక్కడ నుండి సమస్తమైన సృష్టి ఏర్పడుతూ ఉంటుంది. అందుకనే మనకి నాదం ఎక్కడ మొదలవుతోందో, ఆ పుట్టుక స్థానానికి మనం వెళ్ళడం కోసం ఓంకారం చేసుకోవడం అనే ఒక సాధన మార్గం మనకి ఇచ్చి ఉంచారు. ఓంకారం చేసేటప్పుడు మనలో ఈ ఓంకారం ఎక్కడ పుడుతోందో అనేది గమనిక చేయాలి. ఓంకారము కొంతమందికి/చూచేవారికి హృదయంలో పుట్టవచ్చు. అది పుట్టడం మూలాధారం నుండి పుడుతుంది. అందుకనే దాన్ని గణపతి ప్రజ్ఞగా కూడా చెప్తారు. ఓంకార స్వరూపుడే గణపతిగా ఆరాధన చేసుకునే మార్గం కూడా ఉన్నది. ఆ నాదం మనలో ఉన్నంత సేపు, ఆస్తిత్వం ఉంటుంది. ఆ నాదం ఉన్నంతసేపు సృష్టి యొక్క అస్తిత్వం ఉంటుంది. ఆ నాదంగా భగవంతుడే ఉండడం చేత సమస్తము 'ఉన్నదిగా' ఉన్నది. అలా కాకపోతే అది, మళ్లీ అందులోకి వెళ్ళిపోతూ ఉంటుంది. నాదం మొదటి తొడుగు వెలుగు రెండవ తొడుగు. అందుకనే మనకి, ఆరాధనలో నాదము, వెలుగు రెండిటిని అనుసంధానం చేసి ఋషులు ఆరాధనగా ఇచ్చారు. అంతర్ముఖంగా మనం వెలుగు దర్శనం చేసుకుంటూ వెళితే ఆ పైన నాద దర్శనం. నాదము తెలిసినవాడు, బ్రహ్మమును తెలిసినవాడిగా పెద్దలు చెప్తారు. ఆ నాదం మనలో ఉండే సుషుమ్నలో ఎప్పటికప్పుడు పని చేస్తూ ఉంటే, అది కారణంగా, ప్రాణము పనిచేస్తూ ఉంటే, ఈ నాదాన్నే ప్రణవము అని అంటారు. ప్రణవము కారణంగా ప్రాణము పనిచేస్తూ ఉంటే, అది కారణంగా తెలివి పని చేస్తూ ఉంటే, ఆ తెలివి కారణంగా సమస్తమైన వ్యాపారములు మనము నిర్వర్తించుకుంటూ ఉన్నాం. కాబట్టి ఈ సమస్తమైన వ్యాపారమునకు, అంటే activity అని అర్థం. వ్యాపారమంటే Business అని కాదు. వ్యాపారము అన్న పదానికి సంస్కృతంలో అర్థమేమిటయ్యా అంటే, activity! ఈ

సమస్తమైన వ్యాపారానికి నాదమే కేంద్రము. అది బిందువుగా సృష్టిలో ఉన్నది, అది బిందువుగా ప్రతి వ్యక్తమైన జీవియందు ఉన్నది. జీవులలో ఉన్నది, గోళములలో ఉన్నది, సూర్య మండలములో ఉన్నది. అన్నిట్లోనూ అదే ఉండడం చేత, అది స్పందనాత్మకంగా మారి, అక్కడ నుండి సమస్తమైన ఆవరణలను ఏర్పరచుకుని, ఈ కనపడుతున్న సూక్ష్మ, స్థూల సృష్టులను తయారు చేస్తూ ఉంటుంది. అదెలా ఉంటుందంటే మన current తీగలో current ఏ విధంగా 'ఝుం' అని ప్రవహిస్తూ ఉంటుందో, అట్లాగే మన శరీరంలో కూడా అది ఝుంకార నాదం చేస్తూ, ప్రవహిస్తూ ఉంటుంది. అందుకనే 'భ్రమరాంబిక' అనే ఒక నామం కూడా మనకి ఇచ్చారు. అంటే ఝుంకార నాదం ఎవరైతే లోపల దర్శనం చేస్తారో, అది భగవంతుడి మొదటి వ్యక్తరూపం కాబట్టి, ఆయన నుండి దిగి వచ్చింది కాబట్టి అమ్మవారిని కూడా ఆరాధన చేసే సాంప్రదాయం ఒకటి ఉన్నది. ఏ విధంగా విద్యుత్తు తీగలో విద్యుత్తు ప్రవహిస్తూ కనబడకుండా ఉన్నదో, అలాగే సమస్తమునందు తాను ప్రవహించి ఉండడం చేత, ఈ కనపడుతున్న సూక్ష్మ స్థూలమైన సృష్టి ఏర్పడి ఉన్నది. దీనిని ధ్యానం చేసేటప్పుడు మొట్టమొదటిగా కనిపించేది బంగారపు రంగు. అందుకని సువర్ణ బిందు అంటే బంగారు రంగులో ఉండే బిందువుగా దర్శనం చేయడం అనేది కూడా ఉన్నది. రెండు రకాలుగా కూడా ఈ నామానికి మనం అర్థం చెప్పకోవచ్చు. ప్రత్యేకించి మనం వర్ణముల గురించి, అంటే రంగుల గురించి ఇదివరకు చాలా సార్లు చెప్పకున్నాం. తరువాత వచ్చే వాగీశ్వరేశ్వరః అనే నామం ఉండడం చేత ఈ నామానికి మనం నాదం గురించి చెప్పకోవడమే ఎక్కువ సమంజసం అని అనిపిస్తుంది. కాబట్టి నాదమును ఉపాసన చేయడానికి, నియమము ఒకటి ఉన్నది. అది ఉచ్ఛరిస్తూ ఉన్న నామాన్ని వింటూ ఉండడం చేయాలి. ఉచ్ఛరించి వినకపోతే, దాని యొక్క పుట్టుక స్థానానికి మనం చేరడానికి అవకాశం లేదు. వినడం అనేది నాదానికి ముఖ్యం, అనడం కన్నా. మాట్లాడడము, వినడము రెండుగా ఒకే ఒక నాదం negative and positive forces గా ఏర్పడుతుంది. Negative అని చెప్పడానికి, ఋణ సంజ్ఞ అంటారు, దానిని మనకి వేదంలో 'సరస్వతి' అన్నారు, positive అని చెప్పటానికి ధన సంజ్ఞ అన్నారు, దానిని వేదంలో 'బృహస్పతి' అని చెప్పారు. సరస్వతి అంటే సూక్ష్మం నుండి స్థూలంలో కి వ్యక్తం అయ్యే నాదం. అదే నాదాన్ని మళ్ళీ మనం

పట్టుకుని సూక్ష్మంలోకి వెళ్లాలంటే, బృహస్పతి. వినడం నేర్చుకోవాలి. అందుకని మాట్లాడడం కన్నా వినడం అనేది, సాధనపరంగా ఎక్కువ ప్రాముఖ్యం కలిగి ఉంటుంది. చాలా శ్రద్ధగా వినాలి. విని, విన్నది విన్నట్లుగా మళ్లీ ఉచ్ఛరించగలగాలి. అందుకనే మనకి వేదాంగాలలో అన్నిటికన్నా ముఖ్యంగా 'శిక్ష' అనేది ఇస్తారు. శిక్ష యొక్క ఉద్దేశం ఏమిటంటే గురువు చెప్పిన వేద సూక్తాన్ని విని, విన్నది విన్నట్లుగా మళ్లీ రెండుసార్లు ఉచ్ఛరించాలి. అది వేదం నేర్చుకునే విధానం. పుస్తకం చూసి చదవడం కాదు. పుస్తకం చూసి చదువుతున్నావుట అంటే కన్నులు వాడుతున్నావని. విని నేర్చుకున్నావుట అంటే, దాన్నే శృతి విద్య అంటారు. బాగా వినడం శిష్యుడికి అలవాటు కావాలని చెప్పి, గురువు పలికి, శిష్యుడ్ని పలకమంటాడు. పలికినది ఉదాత్త అనుదాత్తాలతో ఉండడం చేత, సరిగా వినకపోతే సరిగా పలకలేడు. మొట్టమొదట శిష్యునికి ఇచ్చే శిక్షణ ఇదే. To be able to listen, more than to speak. మనకి మాట్లాడడానికి చాలా ఉత్సాహం ఉంటుంది. మాట్లాడుతుంటే ఏమవుతుందంటే అంతర్ముఖమైన ప్రజ్ఞ బహిర్ముఖంగా ప్రవహించి నిర్వీర్యులము అవుతూ ఉంటాం. వినడం చేస్తూ ఉంటే, మళ్ళీ మనలో మనం, ఆ శక్తిని ఉత్పత్తి చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. అందుకని బాగా వినాలనే ఉద్దేశంతోనే వినాయకుడికి పెద్ద చెవులు చూపించారు మనకి. బృహస్పతికి అంతరిక్షంలో ఇచ్చిన సంకేతము వేదపరంగా ఇచ్చిన దేవత, గణపతి. చెవులు పెద్దవిగా ఉండడంలో ఉద్దేశం బాగా వినాలి అని చెప్పడం. వినదగునెవ్వరు చెప్పిన. కాబట్టి వినటం నేర్చుకున్నవాడు జీవితపు లోతులలోకి ఎక్కువ వెళ్ళగలడు. విని మర్చిపోవడము అంటే సరిగా వినలేదు అని అర్థం. విన్నది సగమే మనలో మిగిలిందిట అంటే శ్రద్ధగా వినలేదు అని అర్థం. విన్నదాన్ని మళ్లీ చెప్పేటప్పుడు ఒకటి విని ఇంకొకటి చెప్పినట్లయితే కూడా శ్రద్ధగా వినలేదు అని అర్థం. అందుకని ఎంత శ్రద్ధగా విన్నాము అని చెప్పడం కోసం మనకి శిక్ష అనే అంగం ఇచ్చారు. బాగా విని, బాగా ఉచ్ఛరించాలి. వేదం ఆ విధంగా విని ఉచ్ఛరించడమే తప్ప, ఆ పుస్తకాలు చూసి చదవటం కాదు. కలియుగంలో అన్నీ కాస్తో కూస్తో పలుచబడతాయి కాబట్టి, ఇది కూడా ఈ విధంగా పలుచబడ్డది. వినాలి, విని ఉచ్ఛరించాలి. ఒక ఉపన్యాసం విన్నామనుకోండి విన్న ఉపన్యాసం విన్నట్టుగా మళ్లీ చెప్పగలవా? అలా చెప్పగలిగావు అంటే

బాగా వినడం నేర్చుకున్నావు అని అర్థం. అట్లాగే విద్యాలయాల్లో మనం విద్య నేర్చుకునేటప్పుడు కూడా, చెప్పింది వినగలమా? నాదాన్ని వినడానికి ముందు ఈ ప్రయత్నం ఉండాలి. ఎందుకంటే బాగా మాట్లాడడానికి అలవాటుపడిన మనస్సు ఎంతసేపటికీ బహిర్గతం అవుతూ ఉంటుంది. అందుకని కళ్ళు మూసుకుని మనం ఏ నామం చేసినా, ఏ జపం చేసినా, అవి ఒకపక్క జరుగుతూ ఉంటే, మనం బయట తిరుగుతూ ఉంటాం. కారణం ఏమిటంటే, మొదటి నుండి వినికిడి అలవాటు చేసుకోకపోవడమే! భగవంతుడు ఎక్కడ ఉన్నా సమస్తమూ వినగలిగిన స్థితిలో ఉంటాడు కదా. పిలిస్తే పలికేట్టుగా ఉండాలంటే, వినగలిగిన శక్తి ఉంటే కదా పిలిస్తే పలికేది! మనం ఇంట్లో ఉండి పిలిచినా మనకు వినపడదు. ఎందుకంటే వినడం అనేది అలవాటు లేదు. అందుకని పెద్ద చెవులు ఎవరికైనా ఉంటే అతడు వినగలిగిన గుణము కలిగిన వాడు, అని కూడా సాముద్రిక శాస్త్రంలో చెప్తారు. మాస్టరుగారి చెవులు చూస్తే చాలా పెద్దవిగా ఉంటాయి. ఎవరైనా వారి సమస్యలు చెప్తున్నప్పుడు మనం సంపూర్ణంగా శ్రద్ధతో వింటే కూడా ఎదుటి వ్యక్తికి స్వస్థత చేకూరుతుంది. అంత ఉన్నది వినడంలో. అంటే you can heal through listening. సిద్ధార్థ అని ఒక పుస్తకం ఉన్నది, Englishలో. ఆ పుస్తకంలో ఒకాయన ఉంటాడు, పడవ నడిపేవాడు. ఆయన అటు నుండి ఇటు, ఇటు నుండి అటు మనుషులని చేరవేస్తూ ఎవరు చెప్పిన సమస్యలైనా కూడా చాలా శ్రద్ధ భక్తులతో వినేవాడు. వినడం చేత, చెప్పిన వాడికి, వాడు చెప్పడం పూర్తయ్యేసరికి, ఒక విధమైన మనస్సు తేలిక పడడం, హృదయంలో ఆనందం పొంగడం, అంతకు ముందు ఉండే సమస్య అప్పుడు మనస్సులో లేకపోవడం, ఈ విధంగా ఉంటూ ఉండేది. కారణమేమిటయ్యా అంటే ఆయన చేసేది ఒక్కటే! బోధ ఎక్కువ లేదు, వినడం ఎక్కువ ఉంటుంది. ఈ విధంగా వినేవాడు లోతుల్లోకి వెళ్ళవచ్చు, ఎందుకంటే, నాదం యొక్క అంతర్ముఖ ప్రవాహం అంటే, స్థూలం నుండి సూక్ష్మానికి వెళ్ళేది, ఆ దారి, వినడం. సూక్ష్మం నుండి స్థూలం లోకి వెళ్ళడం అనేది ఆ దారి మాట్లాడడం. అందుకని ఒక దానికి సరస్వతి అని స్త్రీ ప్రజ్ఞ గాను, మరొకదానికి బృహస్పతి అని పురుష ప్రజ్ఞ గాను మనకి ఇచ్చారు. కాబట్టి మనం నాదఉపాసన చేసే వాళ్ళం, సరాసరి ఓంకారం విందాం అనుకున్నా, అవి విందాం ఇవి విందాం, మనము చదువుతున్నది మనయందే మనకి వినబడేట్లుగా ఉండాలి

అనుకున్నట్లయితే తక్కువ మాట్లాడి, ఎక్కువ వినడం చేయాలి. సరే మాటలకి సంబంధించినది చాలా ఉన్నది, నియమాలు. ఒక వ్యక్తిని గురించి నిర్ధారణ చేసి మాట్లాడకూడదు అని చెప్తారు. నీకే వ్యక్తి గురించి పూర్తిగా తెలియదు. నీకు తెలిసిన దాంతోనే అతనిని నువ్వు, నిర్ధారణ, అంటే judgement చేయడం అంటారు, చేసి మాట్లాడకూడదు, ఒకటి. మాటలు మాట్లాడేటప్పుడు అవసరమైన మాటలే మాట్లాడడం, అనవసరమైనది మాట్లాడకపోవడం. అవసరమైన మాటలు మాట్లాడేటప్పుడు కూడా, పదములు సరైన పదములను ఏరి, ఎంచి, తూచి, దాని ప్రకారం వాటిని వాడడం, ఇటువంటివన్నీ కూడా వాక్ నియమములలో వస్తాయి. ఇవన్నీ లేకుండా మంత్రాలు చేసుకుని ఏమీ ఉపయోగం ఉండదు. మంత్రం మనయందు ఫలించాలంటే, మనలో ఉండే వాగ్దేవతను మనం ఏ విధంగా వాడుతున్నాం అనేది ముఖ్యం. వాగ్దేవతని ఎలా పడితే అలా వాడితే, మంత్రానికి, ఆ దేవత నీకు సహకరించదు. అందుకని, మాట్లాడడానికి నియమాలు ఉన్నాయి. వినడానికి నియమాలు ఉన్నాయి. ఈ మాట్లాడడం నుండి ఆ వినడంలోకి మనని మనం ఉద్ధరించుకుని, ఈ మాట్లాడడం వల్ల ఏ కేంద్రం నుండి మనం బయటికి వ్యక్తమవుతున్నామో, వినడం వల్ల మళ్ళీ ఆ కేంద్రానికి ఎట్లా వెళ్తున్నామో, ఆ కేంద్రం యొక్క స్థానానికి మనం చేరుకోవడానికి వీలు పడుతుంది. దానికి సంబంధించిన నామమే సువర్ణ బిందు. దాన్నే ఓంకారం అంటారు.

## 832 అక్షోభ్యః

ఎవరి చేతా క్షోభ చెందని వాడు భగవంతుడు. భగవంతుడికి క్షోభ లేదుట. అంటే తను చేస్తున్న సృష్టిలో, దేవతలు, అసురులు ఏర్పడి సృష్టి కార్యక్రమం నడుస్తూ ఉంటే, అప్పుడప్పుడు దేవతలు కొంత అహంకరిస్తూ ఉంటారు. అప్పుడప్పుడు రాక్షసులు లేక అసురులు కొంత అతిక్రమిస్తూ ఉంటారు. వీరి అతిక్రమణం, ఒకరికొకరికి క్షోభ కలిగిస్తుంది తప్ప, వీరిద్దరికీ పుట్టుక స్థానం అయిన భగవంతునికి కలిగించదు. మనలో మంచి జరిగితే మనం ఆనందిస్తాం. చెడు జరిగితే, బాధపడుతూ ఉంటాం కదా. అక్షోభ్యః అంటే దేనిచేతనూ క్షోభింపబడనివాడు. బాధపడనివాడు అని ఈ నామానికి అర్థం. ఇక్కడ మనం ఈ నామానికి శ్రీకృష్ణుని యొక్క అవతార విశేషాలు చక్కగా చెప్పకోవచ్చు. చిన్నతనంలోనే తల్లిదండ్రులని కారాగారంలో ఉంచినప్పుడు, మామూలుగా పిల్లవాడిగా ఎంత క్షోభ పడాలి? క్షోభ పడలేదు. అంటే సమస్తమైన జీవరాశులకి, వారి వారి కర్మానుసారం కార్యం జరుగుతుంది కాబట్టి, కాలం రూపంలో అన్నిటికీ పరిష్కారం వస్తుంది కాబట్టి, అన్నీ తనలోనించే బయటకు వచ్చి తనలోపలికే వెళ్ళిపోతున్నాయి కాబట్టి ఈ మొత్తం సృష్టి కార్యక్రమంలో, ఏది ఎప్పుడు ఎక్కడ ఎట్లా నిర్వర్తింపబడాలో అలాగే నిర్వర్తింపబడుతున్నాయి అని తెలిసి ఉండడం చేత, ఇలా జరిగి ఉండాల్సింది అని కానీ, ఇలా జరిగి ఉండకూడదు అని కానీ, ఇప్పుడు జరగాల్సింది అని కానీ, ఇప్పుడు జరగకుండా ఉంటే బాగుండేది అని కానీ, ఇట్లా ఏమీ ఉండవు. జరుగుతున్న దానిని తాను చూచి, అందులో తన కర్తవ్యాన్ని నిర్వర్తించే వాడు సిద్ధుడు. అదే భగవంతుని యొక్క తత్త్వము. అదే శ్రీకృష్ణుని జీవితంలో మనకు గోచరిస్తుంది. తల్లిదండ్రుల విషయంలో అలాగే ఉంటాడు. అన్నిటికీ మించి తన దగ్గర చిన్నప్పటి నుండి పెరిగి, సకల విద్యలు అభ్యసించిన, అభిమన్యుడి విషయంలో అలాగే ఉంటాడు. ఆ తర్వాత తన కళ్ళముందే సమస్తమైన యాదవకులము, ఒకరినొకరు అలా చంపుకుంటూ ఉంటే చూస్తూ ఉండిపోయాడు. అది మరీ విచిత్రం! ముందు తల్లిదండ్రులంటే ఏదో ఇద్దరు, అభిమన్యుడంటే ఇక్కడేమో ఒకడు, కానీ ఆత్మీయులు వీళ్ళందరూను. తన వారు అనుకున్న వాళ్ళందరూ తను చూస్తూ ఉండగానే ఒకరినొకరు ఊచకోత పెట్టుకుని చచ్చిపోయారు. ఎట్లా ఉండాలి? ఎట్లాగూ

లేదు. అది అక్షోభ్యః అంటే. అంటే మనకి ఇవి సిద్ధులకి ఉండే లక్షణాలు. అందరికీ కష్టం. ఎందుకంటే సులభంగా మనం కలత చెందుతాం. మొత్తం మనం మహాభారతం తీసుకుంటే కలత చెందని పాత్ర ఉండదు, కృష్ణుడు తప్ప! భీష్ముడు కలత చెందాడు, ద్రోణుడు కలత చెందాడు, ధర్మరాజు కలత చెందిన సందర్భాలు ఉన్నాయి. ద్రౌపది కలత చెందింది. అర్జునుడు కలత చెందాడు. మీరే పాత్ర అయినా చూపించండి, కలత చెందిన సందర్భం ఉంటుంది. ఎందుకని? సృష్టికి లోబడి జీవించేవాళ్ళు కాబట్టి. కాలానికి అణిగిమణిగి ఉండడం చేత, కాలాతీతమైన వాని యొక్క రూపురేఖలు తెలియక, క్షోభ పడడం అనేది సహజంగా జీవులకి ఉంటుంది. భగవంతుడే ఆ విధంగా ఏ క్షోభా లేనివాడుగా మనకి కృష్ణావతారంలో గోచరిస్తాడు. ప్రహ్లాదాదులు కూడా క్షోభ చెందినట్టుగా ఉండదు. అంబరీషుడు క్షోభ చెందినట్టు ఉండదు. శుకుడు క్షోభ చెందినట్టు ఉండదు. వీళ్ళందరూ కూడా ఉత్తమ భాగవతులుగా అందుకు చెప్పబడ్డారు. కాలంలోనించి జరుగుతున్న సన్నివేశాలని, సాక్షీభూతంగా చూస్తూ, సమస్తమూ భగవంతుడే, అతని యొక్క ఆజ్ఞ చేతనే ఇదంతా ఈ విధంగా నడుస్తోంది, కాబట్టి దాన్ని మనము మార్చనూ లేము, పెంచనూ లేము, తగ్గించనూ లేము, ఆపనూ లేము అని తెలిసినవాడు తన మేర కర్తవ్యాన్ని తను చేసి, మిగతాది అంగీకరించడం అనేది చేస్తూ ఉంటాడు. మనకి చాలా అత్యాశ్చర్యంగా జరుగుతూ ఉంటాయి. ఒక వాక్యం ఉన్నది వేదంలో, మాస్టరుగారు ఎప్పుడూ చెప్తూ ఉండేవారు. 'ఎప్పుడు ఎక్కడ ఎవరికి, ఏదైనా జరగవచ్చు'. మనకి కొన్ని ఉంటాయి, ఇట్లా ఇట్లా ఉండేవాళ్ళకి ఇట్లా ఇట్లా జరగకూడదు అని. కదా. అట్లా ఉండదుట. అది ఊరికే మన అవగాహన తప్ప, ఇలా ఇలా జీవించిన వాళ్ళకి, ఇలా ఇలా ఉంటుంది, మంచి చేస్తే మంచి జరుగుతుంది, అంటే అట్లా ఉండకపోవచ్చు అనేది కూడా ఉన్నది. ధర్మరాజు అంతా మంచే చేశాడు. ఏం జరిగింది? ఎవరికి ఎప్పుడు ఎక్కడ ఎట్లా జరుగుతుంది అనేది ఎవ్వరూ చెప్పలేరు. అది కాలం మడతల్లో ఇమిడి ఉంటుంది. అందుకని దానికి, సమర్పణ చెంది జీవించడం తప్ప, మరొక పద్ధతి ఉండదు. ఎవరికైనా జరగచ్చు, ఎప్పుడైనా జరగచ్చు, ఎక్కడైనా జరగచ్చు. ఏదైనా జరగచ్చు. ఇట్లా నాలుగు రకాలు. సన్నివేశం జరిగినప్పుడు దానిలో మన కర్తవ్యాన్ని చూసుకునేవాడు స్థితప్రజ్ఞుడు! అలజడి చెందేవాళ్ళు సామాన్యమైన జీవులు. సామాన్యమే కాదు,

బాగా సాధన చేసినవాళ్ళకి కూడా, ఆ విధంగా బాధపడే సన్నివేశాలు చాలా ఉంటాయి. ధర్మరాజు, హరిశ్చంద్రుడు, రాముడు, ఇత్యాది వాళ్ళే పడ్డారుట అంటే, ఈ నామానికి మనం ఎవరినీ ఎక్కువ ఉదాహరణగా చెప్పుకోవడానికి వీలు లేదు. ఉత్తమమైన భాగవతులు, శ్రీ కృష్ణుడ్ని మాత్రమే మనం  నిర్వచించుకోవాల్సి ఉంటుంది. మాస్టరుగారు చెప్తూ ఉంటారు. వర్షాకాలం అంటే మామూలుగా సహజంగా వర్షాలు పడే ఋతువు అని అర్థం తప్ప,  ఎండాకాలంలో వర్షం పడకూడదు అని లేదు, మామూలుగా ఎప్పుడు పడతాయో దానికి ఆ ఋతువు పేరు పెట్టుకున్నాము, అంతమాత్రంచేత పడకూడదు అని లేదు కదా. అలాగే మనకి ఒక్కొక్క రోజు, వర్షాకాలంలో కూడా విపరీతమైన ఎండలు కాయవచ్చు కదా. శీతాకాలం చలి లేకుండా ఉండవచ్చు కదా, ఇట్లా కొన్ని కొన్ని మనం ఏర్పరుచుకున్నవి. 'ఆయనలాంటి వాడికి ఇట్లా జరగకూడదండీ', అంటూ ఉంటాం కదా. నీకేం తెలుసు ? జరగకూడదు అంటే, మరి 'ఆ పైన చేస్తున్న వాళ్ళకి, తెలియదు, నీకు తెలుసు' అని చెప్పడమే కదా. ఎవరికి ఎప్పుడు ఏం జరగాలో నీకేం తెలుసు ? ఏం తెలియదు. తెలియకపోగా మనం కొన్ని సిద్ధాంతాలు పెట్టుకుంటాం. మన సిద్ధాంతాల ప్రకారం సృష్టి ఉండదు, సృష్టి సిద్ధాంతాల ప్రకారం మనం అనుసంధానం చెందడం ఒక్కటే. మహాత్ముల ఇళ్లలో కూడా దొంగలు పడుతూ ఉంటారు. అదేంటది. పడకూడదు అంటే? బయటికి అక్రమాలు ఆచరిస్తూ ఉన్నవాడు బాగా ఆనంద పడుతూ ఉన్నట్టుగా కనిపిస్తుంది. అందుకని నువ్వు నమ్మిన సిద్ధాంతాన్ని  నువ్వు ఆచరించుకో. కానీ దానికి భిన్నమైన సంఘటనలు జరిగినప్పుడు దాన్నే దైవము అని అంగీకరించమని చెప్తారు. అదే రాముడు చెప్తాడు, లక్ష్మణుడికి. చాలా మంచి విషయం, ఆ శ్లోకం. అరణ్యవాసానికి వెళ్ళమని, విన్న తరువాత, రాముడు బయలుదేరడానికి సిద్ధపడుతుంటే లక్ష్మణుడు ఒప్పుకోడు. 'పురుష ప్రయత్నం అని ఒకటి ఉంటుంది, వీళ్ళందరినీ మనం శుభ్రంగా సంహరించో, చెఱసాలలో పెట్టో, రాజ్యం ఆక్రమిస్తే అది క్షాత్ర ధర్మమే కదా, తప్పేముంది ? నువ్వు రాజువి కదా, నువ్వు పెద్ద కుమారుడివి కదా, నీదే కదా రాజ్యం, అట్లా చేస్తే ఏమిటి తప్పు ?' అంటాడు. చేయచ్చు కదా, నిజానికి అట్లాగే చేస్తారు. క్షాత్ర ధర్మంలో తప్పు లేదు.  దానికి రాముడు అన్నాడు 'నిన్నటి వరకు నిన్ను తల్లి కన్నా ఎక్కువ ప్రేమించిన కైకేయి, ఈ రోజు నిన్ను ద్వేషించింది అంటే

అందులో నువ్వు ఏం చూస్తున్నావు?' అంటాడు. కౌసల్య కన్నా రాముడిని చూసింది కైకేయే చిన్నపటినుండి. కైకేయికి అంత ముద్దు రాముడంటే! భరతుడికన్నా ఎక్కువ ఇష్టం. 'అటువంటి కైకేయి, ఈ రోజు ఉదయానికి ఈ విధంగా మారిందంటే, నువ్వు దాంట్లో ఏం చూస్తున్నావ్?' అంటాడు రాముడు, లక్ష్మణుడితో. 'దాన్నే దైవం అంటారు' అని చెప్పాడు. నిన్న సాయంత్రం మనతో పాటు చక్కగా శ్రావణ పౌర్ణమి ధ్యానాలు చేసుకుని భార్యాభర్తలు, పదిగంటలకు ఇంటికి వెళ్ళారు, మాస్టారుగారికి దణ్ణం పెట్టుకున్నారు. ఓ రాత్రి వేళ ఆయన వెళ్ళిపోయాడు. పన్నెండింటికల్లా. అందరం అంటాం, పదిగంటల వరకు మనతోనే ఉన్నాడు కదా, అని. పన్నెండు గంటలకి వెళ్లేవాడు పదిగంటలకు మనతో ఉండడా? వెళ్ళాడని మనకేమన్నా ఊహలో అన్నా ఉందా? పూర్ణమైన ఆరోగ్యంలో ఉన్నాడు, ఆయనకి ఏ జబ్బూ లేదు. ఏమీ లేదు. పౌర్ణమి ఘడియలలో అట్లా హఠాత్తుగా, దేహం వదిలేసి వెళ్ళిపోయాడు. మనం ఏం చెప్పగలం దాని గురించి? పొద్దున్నించి నేను దాన్ని చూసి ఆశ్చర్యపడుతున్నాను. మాస్టరుగారు చెప్తూ ఉండేవారు, ఎవరన్నా పోతే, నిన్న సాయంత్రం కూడా కలిసే ఉన్నాం సార్ అని ఎవరన్నా అంటే 'ఇప్పుడు కదా పోయాడు, ఇదేమిటో ఇట్లా మాట్లాడతారు మనుషులు' అంటారాయన. వాడు ఇవ్వాళ పోతే నిన్న సాయంత్రం కలిసి ఉండటానికేం, కలిసే ఉంటాడు, అంతకు ముందు క్షణం వరకు కూడా కలిసే ఉంటాడు. ఈ కప్పులోనే కాఫీ తాగారు గంట ముందు అంటాడు. తాగుతాడు మరి వెళ్ళే లోపల, అన్నీ చేస్తాడు. మరి ఆ క్షణంలో లేడు కదా. కిందటి ఆదివారం ఒకాయన్ని చూసి వచ్చాను నేను. పాతికేళ్ల తరువాత. ఎన్నో కబుర్లు చెప్పుకున్నాం, ఎన్నెన్నో చెప్పాడు, ఏమిటేమిటో జరిగినవి అన్నీ చెప్పాడు, అన్నీ అయినాయి. ఊరి నుంచి తిరిగి రాంగానే వెళ్ళిపోయాడు అని వార్త వచ్చింది. పూర్ణ ఆరోగ్యంలో ఉన్నవాడు. ఇవన్నీ ఈ వారం వార్తలే. అట్లాగే భార్యాభర్తలు. భర్త చచ్చిపోవడానికి చాలా సిద్ధంగా ఉన్నాడు. ఏ క్షణంలో అన్నా చచ్చిపోవచ్చు. అందరూ ఆయన చచ్చిపోతాడేమో అని సకల సపర్యలూ చేస్తున్నారు, మందులు ఇస్తున్నారు, అయినప్పటికీ పోవచ్చు అనే భావన ఎక్కువగా ఉంది. ఆయన అలా ఉండగా ఆవిడ వెళ్ళిపోయింది. ఇవన్నీ ఈ వారం వార్తలు. మూడు! ఏం చెప్పగలవు, నువ్వు ఏం చేయగలవు? అంగీకరించక నువ్వు చేయగలిగింది ఏమన్నా

ఉందా? మనం మామూలుగా పోతారు అనుకున్న వాళ్ళు ఉండిపోతారు, కదా. పోదామనుకున్న వాళ్ళు కూడా ఉండిపోతారు. ఇంకా ఉండిపోదాము అనుకున్న వాళ్ళు వెళ్ళిపోతారు. కావలసిన వాడికి డబ్బు రాదు. అక్కర్లేనివాడికి డబ్బు చేరుతుంది. కనిపించట్లా ఇవన్నీ? ఆరోగ్యం కోసం విపరీతంగా తాపత్రయపడుతూ ఉన్నవాడు అనారోగ్యంలో ఉంటాడు. ఏదిపడితే అది మిరపకాయ బజ్జీల దగ్గర నుండి తినేవాడు ఆరోగ్యంగా ఉంటాడు. ఈ సృష్టి విలాసం చెప్పకోవడం ఎవరి తరం కాదు. ఇలా జరగాలి అని అనుకోవడం నుండి వస్తుంది బాధ. ఎలా జరిగినా వాడే జరుపుతున్నాడు అని తెలుసుకోవడం చాలా పెద్ద విషయం. ఇవాళే ఒక ఉత్తరం వచ్చింది. ఒక ఆవిడ, కిందటి సంవత్సరం ఇదే సమయంలో మనతో ఉంది, ఈ దేశంలో. జర్మనీ నుండి వచ్చింది. తనకన్నా 12 ఏళ్లు చిన్నవాడిని ప్రేమించింది. వాడు నన్ను పెళ్లి చేసుకుంటాడా అని అడుగుతూ వచ్చింది. అంటే, అసలు వాడి గురించి నువ్వు ఆలోచించడం మానేస్తే నువ్వు సుఖపడతావు, కాకపోతే బాధపడతావు, ఏమంటే, వాడికి నీ మీద ఏమీ లేదు, ఎందుకు ఉండాలని కూడా అడిగాను. మనం ఊరికే ప్రేమించేస్తే అయిపోయిందా, మనలో ఏముందో వాడికి కనిపించాలి కదా ఆకర్షణీయంగా. వాడు చాలా తెలివైనవాడు, చాలా స్ఫురద్రూపి, చాలా మంచివాడు, కాబట్టి తనకి కావాలి. మరి నువ్వేమిటి? వాడికి నువ్వేమిటి అనేది ఒకటి ఉంటుంది కదా. అప్పుడు ఆవిడ వెళ్లిపోయే ముందు 'నాకు ఏదైనా ఒక message ఇవ్వు వచ్చే ఒక ఏడాదికి' అన్నది. అప్పుడు రాసిచ్చా 'Expectancy is the cause of misery' అని. ఇది దగ్గర పెట్టుకో అని చెప్పాను. February లో వాడు గట్టిగా చివాట్లు పెట్టి వెళ్లిపోయాడట ఈవిడని. ఇవాళే ఉత్తరం వచ్చింది. 'నువ్వు రాసిన వాక్యం అర్థమవ్వడానికి సంవత్సరం పట్టింది' అని. మనకి కూడా రకరకాల expectations ఉంటాయి కదా. ఉండొచ్చు తప్పలేదు, కానీ మన expectations ప్రకారం అవ్వకపోవచ్చు. అదే అంటారు జరిగేది అనుకోగలిగితే అదృష్టవంతుడివి, అనుకున్నది జరగకపోతే బాధపడాల్సి వస్తుంది. అందుకని అసలు అనుకోవడం ఎందుకు? ఏ రోజుకి ఆ రోజు జీవించడం అనేది యోగుల లక్షణం. యోగులు ఎట్లా జీవిస్తారయ్యా అంటే, రేపటికి ఏమిటి అని కూడా ఆలోచించరు వాళ్ళు. మనకి రేపటికి, జన్మకి సరిపడా ఏర్పరచుకుని అప్పడేవో మిగతా కార్యక్రమాలు పెట్టుకుంటాం.

కుచేలుడు  అట్లా జీవించాడు. రేపటి సంగతి ఏంటి? రేపటికి కాదు, మధ్యాహ్నం భోజనం ఉంటే రాత్రి భోజనానికి ఏమిటో తెలియదు. ఎంత ధైర్యం ఉండాలండి దేవుడి మీద? ఏ పూటకాపూట వాడు తెచ్చిస్తాడు, మనం fresh గా వండుకు తిందాం అనే స్థితిలో ఉండడం చాలా కష్టం. యోగి అనేవాడు ఆ రోజుకు జీవించడమే తప్ప, రేపటి సంగతి ఇవాళ ఆలోచించే పరిస్థితి ఉండదు. దీన్నే శని గ్రహము యొక్క శిక్షణ అంటారు. ముందుకు చూచి, ముందుకు ఊహించి, ఊహల్లో జీవిస్తే బాధపడతావు. ఏదైనా ఇట్లా జరగాలి అనుకుంటే బాధపడతావు. ఇట్లా జరగాలి అని అనుకోవద్దు. నీ కర్తవ్యం నువ్వు నిర్వర్తిస్తూ ఉండు. బాగా మంచి మార్కులు రావాలని చదువుకుంటాం. చదువుకోవటం చెయ్, మంచి మార్కులు వస్తాయి, రావు. మన చేతుల్లో లేని దాని గురించి మనం ఆలోచించరాదు. ప్రయత్నం వరకే నీది. ఫలితం నీ చేతుల్లో లేదు.  ఆ విషయం అందరికీ తెలిసినప్పటికీ, ఫలితం గురించి చాలా బాధపడుతూ ఉంటాం. ఎంతసేపూ పని జరగకపోతే ఒక్కటే ఆలోచించాలి. నేను చేయవలసింది చేస్తున్నానా లేదా? నేను చేయవలసిన దాంట్లో లోటుపాట్లు ఉన్నాయనుకుంటే సర్దుకోవాలి. నేను చేయవలసిన దాంట్లో బద్ధకం ఉంటే ఆపుకోవాలి. దాన్ని తీసేసుకోవాలి. అంతేతప్ప ఇంక దానిమీద ఊరికే గింజుకుంటూ ఉంటే క్షోభ  పెరుగుతూ ఉంటుంది. ఎవరికైనా క్షోభ కి కారణం అదే. విశాఖపట్నం లో ఉన్నాం. చెమటలు ఉండకూడదు అంటే ఎట్లా? విశాఖపట్నం, చమటలు, అవి కవల పిల్లల లాంటివి. సంవత్సరానికి 10 నెలలు ఉంటాయి అవి. క్షోభ అనేది దైవీతత్త్వానికి వ్యతిరేకం. అది ఎక్కడి నుండి వస్తుంది అంటే మన ఆశల్లోంచి పుడుతుంది. మన ఊహల్లోంచి పుడుతుంది. 'ఇట్లా జరగాలి' అనుకున్నప్పుడు పుడుతుంది. మాస్టరుగారు అదే చెప్పేవారు, 'ఇట్లా జరగాలి అని అనుకోవద్దోయ్, మనం చేయాల్సింది చేద్దాం. నువ్వైనా అదే చేయాలి, నేనైనా అదే చేయాలి, నేను నమ్ముకున్న వాళ్లు కూడా అదే చేస్తున్నారు, ఎవరికీ పూర్తిగా ఏమీ తెలియదు. పూర్తిగా తెలుసు అని ఎవరన్నా అనుకుంటే నువ్వు అనుకోనియ్యి, నువ్వు వాళ్లని disturb చెయ్యక' అని. ఆ విధంగా మాస్టరుగారు జీవిస్తూ ఉండేవారు. అంతా తెలుసు అనే పరిస్థితి ఏమీ లేదు, ఎవ్వరికీ అంతా తెలియదు, బ్రహ్మకి కూడా తెలియదు. ఆ క్షణంలో అప్పుడు అక్కడ ఏం జరుపుతాడు అనేది ఎవ్వరూ తెలుసుకోలేరు. అదే పెద్ద సమస్య

శకునికి. శకుని చాలా మేధావి. అతనికల్లా ఒక్కటే సమస్య. శ్రీకృష్ణుడు ఏం చేస్తాడు అనేది అతనికి తెలియదు. ఎందుకంటే మిగతా వాళ్ళందరూ ఇట్లా ఇట్లా చేస్తే, ఇట్లా ఇట్లా చేస్తారని తెలుస్తుంది. ధర్మరాజు కొన్ని కొన్ని తనదైన పట్లు పెట్టుకున్నాడు. దీక్షలు అనుకుని పట్లు పెట్టుకుంటారు కదా అలా. ధర్మరాజు పట్టు శకునికి తెలుసు, కాబట్టి సులభంగా, దేని మీద అతడికి దీక్ష ఉన్నదో, అదే అతడి యొక్క బలహీనతగా గుర్తించి, ఓడిస్తాడు. అలాగే భీముడికి కొన్ని పట్లు ఉన్నాయి. అర్జునుడికి కొన్ని పట్లు ఉన్నాయి అర్జునుడిని మరి అట్లాగే, వాళ్ళ అబ్బాయి పోవడానికి కారణం, అతడిలో ఉండే క్షాత్రాన్ని బాగా కెలుకుతారు. కెలికితే వాడెటో పోతాడు, ఈ లోపల పనైపోతుంది అనుకుంటారు. ప్రతివాళ్ళకి ఏదో ఒక సిద్ధాంతం మీద ఒక మక్కువ. భీష్మడు ఒకటి పెట్టుకున్నాడు. బృహన్నల ఎదురుగా వస్తే యుద్ధం చేయను అని. ద్రోణుడు ఒకటి పెట్టుకున్నాడు. జీవితం అంతా అబ్బాయి కోసమే బతికాడు. కర్ణుడు ఏవో పెట్టుకున్నాడు. అడిగిన వాళ్ళ కల్లా ఇస్తానని. అది ఎట్లా? ఒకటికి దాసుడుగా ఉంటూ అడిగిన వాళ్ళకి అన్నీ ఇస్తాను అంటే, వాడేమైపోతాడు? ఇంద్రుని పంపించి కవచకుండలాలు తీసుకున్నాడు. ఇట్లా ప్రతి వాళ్ళూ, వాళ్లదైన ఒక కళ్యాణగుణం అనుకుని కూడా బంధించుకున్న వాళ్ళు ఉంటారు. అట్లా ఏ బంధం లేనివాడు శకుని. అతడికి ఏమీ లేదు, ఒక్కటే ఉంది ఈ కౌరవ సామ్రాజ్యం అంతా కూడా నాశనమైపోవాలని. కృష్ణుడికి అది కూడా లేదు. ఏదీ నాశనం అవ్వాలని లేదు, ఏదీ బాగుపడాలని లేదు, అట్లా ఉంటాడు. అందుకని ఇప్పుడు భీష్మడ్ని, ద్రోణుడ్ని, అశ్వథ్థామ, కర్ణుడు, వీళ్ళందరినీ సంహరించే పరిస్థితి లేదు. అందుకని వాళ్లు విర్రవిగుతూ ఉంటే శకుని ఒకటి అంటాడు 'వీళ్ళందరూ అలా ఉంచి, కృష్ణుడి ఆలోచన ఏమిటో తెలిస్తే మనం గెలుస్తాము, లేకపోతే గెలవము' అని చెప్తాడు. కృష్ణుడి ఆలోచన తెలియకపోవడానికి కారణం ఏమిటంటే ఒక పంథాలో ఆలోచించడం అనేది ఏమీ లేదు. ఇట్లా ఇట్లా చేస్తే ఇట్లా ఇట్లా చేస్తాడు కృష్ణుడు అని అనడానికి వీల్లేదు. ఆయన తలుచుకుంటే ఎవరికన్నా దర్శనం ఇవ్వాలి తప్ప, ఇట్లా చేస్తే తప్పకుండా దర్శనం ఇస్తాడు అనేది ఏమీ లేదు కృష్ణుడితో. అంత మరీ free. అంటే మైత్రేయుడికి దర్శనం ఇవ్వకుండా, ఎక్కడో వెధవ పనులు చేసేవాడికి దర్శనం ఇవ్వగలడు ఆయన వెళ్లి. అదేంటి సార్ అని అడుగుతాడు మైత్రేయుడు. 'మీ అనుగ్రహానికి తీరుతెన్నులు లేకుండా

ఉన్నాయి' అంటే, 'తీరుతెన్నులు లేకపోవటాన్నే అనుగ్రహం అంటారు' అంటాడు కృష్ణుడు. 'నీకు చెప్పి చేయాలా నేను ఎవరికన్నా కనబడడం' అని. అట్లా చేయాలా? ఎప్పుడూ అట్లా సంవత్సరాల తరబడి తపస్సు చేసే వాళ్ళకి కనబడకుండా, ఎక్కడో ఆకతాయిగా ఉండే వాళ్ళకి వెళ్ళి కనబడి, వాళ్ళకి స్ఫూర్తి ఇస్తూ ఉంటాడు. ఎందుకు చేశాడు? తెలియదు. అందుకని ఇట్లా ఇట్లా ఉంటే ఇట్లా ఇట్లా ఉంటాడని మీరు ఏమీ formulas వేయటానికి వీలు లేదు. సిద్ధాంతాలు నిర్మాణం చేయడానికి వీలు లేదు. శ్రీకృష్ణుడిని సిద్ధాంతీకరించలేరు. రాముడిని సిద్ధాంతీకరించచ్చు. శరణువేడితే అట్లా, అని ఉంటాయి కదా. అందరినీ సిద్ధాంతీకరించవచ్చండి, భగవత్ తత్త్వాన్ని సిద్ధాంతీకరించలేము. అలాగే ఆ తత్త్వం పుణికి పుచ్చుకుని శరీరంగా వచ్చిన శ్రీకృష్ణుడిని సిద్ధాంతీకరించలేము. అందుకని ఏదీ అతడిని క్షోభ పెట్టదు. ఏది క్షోభ పెడుతుంది? నువ్వు దీక్షగా పెట్టుకున్న దానికి ఏదో అంతరాయం వస్తే నీకు క్షోభ. అట్లాంటివి ఆయనకు లేవు. అదీ శ్రీకృష్ణుడు. అందుకని అక్షోభ్యః.

## 833 సర్వవాగీశ్వరేశ్వరః

వాగీశ్వరులు అని సృష్టిలో వాక్కుకు సంబంధించిన దేవతలు చాలామంది ఉన్నారు. బృహస్పతి, సరస్వతి, గణపతి, వాగీశ్వరి, నకులీవాగీశ్వరి అని ఉన్నది. ఇవన్నీ మన గొంతులో పని చేసేవి. గొంతు నుండి మన దంతముల వరకు ఎంతో మంది దేవతలు పనిచేస్తూ ఉంటే మనం ఉచ్చరించగలుగుతున్నాం. లేకపోతే ఈ వైఖరి యొక్క ఉచ్చారణ ఉండదు. మనస్సులో వచ్చిన భావాన్ని భాషగా మార్చేవి, భాషను వాక్యాలుగా నిర్మించేవి, వాటిని ఉచ్చరింపజేసేవి, ఇలా రకరకములైన వాగ్దేవతలు ఉన్నారు. ఆ వాగ్దేవతలందరికీ ఈశ్వరుడైన వాడికి ఈశ్వరుడు. వాగీశ్వరులకి ఈశ్వరుడు అని చెప్పడం. అంటే ఈయన చేతిలోనే వాక్కు ఉన్నది అని చెప్పడం. ఎంతమంది వాగ్దేవతలు ఉన్నా, ఈయన ముందు అవి అన్ని 'ఠం ఇతి దిగ్బంధః' అలా అయిపోతాయి. ఆయన చూస్తే మాట్లాడలేకపోయేవాళ్ళు చాలామంది. ఎందుకంటే అసలు అందరిలో ఉండే వాక్కు తానే కాబట్టి, తను అక్కడి నుండి ఎలా నిర్వర్తింపచేసుకుందాము అనుకుంటే అలా నిర్వర్తింపచేసుకోగలిగినటువంటివాడు. 'వాక్కే ఋగ్వేదము' అన్నారు. ఎందుకంటే వాక్కు అంటే ఉచ్చరింపబడినది అని అర్థం. సృష్టి మొత్తాన్నీ ఉచ్చరించారు. కదా. బ్రహ్మ నుండి దిగి వచ్చిందని మనకి తెలుసు. అంటే ఆయన చేస్తుంటే మనం చూశామని కాదు, చదువుకోవడం వల్ల. బ్రహ్మ ఎవరిచేత ఉచ్చరింపబడ్డాడు? బ్రహ్మ ఉచ్చరింపబడక ముందు చాలా ఉంది కథ. కమలం ఉచ్చరింపబడ్డది. కమలం ఉచ్చరింపబడక ముందు నాభి ఉచ్చరింపబడ్డది. ఇట్లా అన్ని ఉచ్చారణలకు మూలస్థానమైనవాడు కాబట్టి, భగవంతుడు 'వాగీశ్వరేశ్వరుడు' అని చెప్తారు. 'యోగేశ్వరుడు' అని కూడా అలాగే చెప్తారు. యోగీశ్వరులు ఉంటారు, యోగేశ్వరుడు శ్రీకృష్ణుడు ఒక్కడే. యోగీశ్వరులు అంటే యోగము చేత భగవంతుని యొక్క దర్శనము పొంది, అనుభూతి చెందుతున్నవాళ్లు. వాళ్లందరికీ ఎవరయ్యా మూలస్థానం/ఈశ్వరుడు అంటే ఈయన. అట్లాగే వాగీశ్వరులకు అందరికీ కూడా ఈశ్వరుడు అవడం చేత వాగేశ్వరేశ్వరః అని వస్తుంది. వాగేశ్వరుడు, లేక వాగీశ్వర ఈశ్వరుడు. ఏదైనా మీరు చెప్పండి, దానికి మొదలు, భగవత్

తత్త్వం అని చెప్పడానికి ఈ నామాల యొక్క ప్రత్యేకమైన హెచ్చరిక. అన్నీ అందులోంచే వచ్చినాయి, అది దాటి ఏం లేదు, అన్నీ దాని తరువాతవే, కాబట్టి దానిలో అణిగి మణిగి ఉంటాయి అని చెప్పడం.

## 834 మహాహ్రదో

మహాహ్రదుడు అంటే మితము లేనంత పెద్ద సరస్సు అని అర్థం. పాలసముద్రం అంటూ ఉంటాం కదా, అది ఎంత ఉందో తెలియదు. ఆకాశం ఎంత ఉంది? ఆకాశమే పాల సముద్రం. ఎంత ఉంది అని చెప్తారు ఆకాశాన్ని? ఇంత, అంత అనడానికి ఏమీ లేదు, నువ్వు ఎంత అనుకుంటే అంత. నువ్వు నిలబడితే నీ చుట్టూ ఉండే horizon అంటామే, అది నీ పరిధి. మరి మొత్తానికి పరిధి ఏం ఉంది? ప్రతి వాళ్ళకి వాళ్ళ వాళ్ళ పరిధులు వాళ్ళకి ఉన్నాయి. వాళ్ల వాళ్ళ కార్యక్రమములు, వ్యాపారములు వాళ్ళకి ఉన్నాయి. అలాగే, ఒకళ్ళకన్నా ఒకళ్ళకి మించి ఉంటాయి పరిధులు. భూమి మీద ఉండే వాళ్ళందరికన్నా మించి ఉన్న పరిధి భూమిది. భూమి పరిధి కూడా కొంతే. అంతకు మించి మనం పరిధులు చూసుకుంటే అత్యంత పెద్దదైన పరిధి నవగ్రహాల్లో శని గ్రహానిది. అంతకన్నా పెద్ద పరిధి, ఇంద్ర గ్రహానిది. అంత కన్నా పెద్ద పరిధి యమగ్రహానిది. కానీ పరిధులు ఉన్నాయి. అలాగే సూర్యుడు. సూర్యుడు యొక్క పరిధి ఈ సూర్యమండలమంతా వ్యాపించి ఉంటుంది. అంతకుమించి ఉండదు. ఇంకొక సూర్యమండలంతో ఈయనకు ఏమీ సంబంధం లేదు. ఇట్లా మనకి రకరకాల పరిధులు. చీమ పరిధి చీమది, దోమ పరిధి దోమది. అక్కడ నుండి బ్రహ్మ పరిధి వరకు వేసుకోండి. ఇటువంటి బ్రహ్మలు కూడా చాలా మంది ఉన్నారని చెప్పుకుంటూ ఉంటాం కదా. మరి వీళ్ళందరూ ఎంతమంది ఉన్నారు? వీళ్ళందరూ ఉన్నచోటును 'space waters' అంటారు. 'ఆకాశ జలం' అంటారు. అంటే వెలుగుతో కూడిన నీరుగా, తరంగములు తరంగములుగా ఉంటుందిట. దాన్నే 'పాలసముద్రం' అన్నారు. అందులో కాలం (time) కూడా పరిమితత్త్వం కలిగి ఉంటుంది. ప్రకృతికి పరిమితత్త్వం ఉన్నది, కాలమునకు పరిమితత్త్వం ఉన్నది, శక్తికి పరిమితత్త్వం ఉన్నది, ఈ మూడు ఆధారంగానే మిగతా బ్రహ్మాది దేవతలందరూ పుట్టుకొచ్చారు. అందుకని అది ఎంత ఉంటుందో, ఈ మహా సముద్రం నువ్వు అని చెప్పడానికి మహాహ్రదః! హ్రదము అంటే సరస్సు అని అర్థం. అది ఎంత పెద్ద సరస్సు అంటే అందులోంచి ఎన్ని సృష్టులు పుడుతున్నాయో ఏమీ ఊహకు అందే విషయం కాదు, అని చెప్పడానికి.

## 835 మహాగర్తః

లోతు తెలియనటువంటి వాడు. 'గెత్తం' అంటూ ఉంటాము చూశారా, తవ్వి తీసేది అన్నమాట. మహా గర్తుడు అంటే అసలు ఈయన లోతు ఏమిటి అంటే ఏమీ తెలియదు. శ్రీకృష్ణుడి లోతు ఎవరికీ అర్థం కాలేదు. అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ తెలియనంత లోతులవి. అలాగే పరతత్త్వం. 'నాకు అంతా అవగాహన అయింది' అని ఎవరూ చెప్పడానికి వీలు లేదు. ఏదో కొంత అవుతూ ఉంటుంది. అయినంతలో ఆనందంగా ఉంటే అంతే చాలు. ఆ లోతులు తెలియనంత లోతులు. బ్రహ్మగారు పుట్టిన తర్వాత ఎందులో పుట్టాడో చూసుకున్నాడట. కమలం ఉందిట కింద. ఆ కమలం కింద చూస్తే నాళం ఉందిట. అసలు ఈ నాళం ఎక్కడ నుండి వచ్చిందో అని నాళం పట్టుకుని అలా వెళ్ళాడట. వెళ్లి వెళ్లి వెళ్లి ఎంత వెళ్లినా, భయంకరమైన చీకటులే వస్తున్నాయి తప్ప నాళం యొక్క మొదలు తెలియలేదట. ఎందుకు తెలియలేదంటే, ఆ తత్త్వానికి base అంటూ ఏమీ లేదు. అదే base అన్నిటికి. ఆ విధంగా ఉండడం చేత, ఎంత దూరం వెళ్లినా తెలియకపోతే, భయం వేసి ఎందుకైనా మంచిది దీని లోతు మనం తెలుసుకోవడం కన్నా మనని ఎక్కడ కూర్చోబెట్టారో అక్కడ కూర్చుంటే మంచిది, అని వచ్చి మళ్ళీ పద్మంలో వచ్చి కూర్చున్నాడట. అలాగే మనకి శివపురాణంలో శివుడి గురించి చెప్తారు. శివుడు యొక్క ఎత్తు తెలుసుకుందామని ఒకరు, లోతు తెలుసుకుందామని ఒకరు, బయలుదేరారట, బ్రహ్మ, విష్ణువు. అలా వెళ్లి వెళ్లి వెళ్లి వెళ్లి వెళ్లి వెళ్లి, తెలియక, భయమేసి మళ్లీ వచ్చి కూర్చున్నారట. ఇది ఎందుకు చెప్తున్నారంటే, పరతత్త్వం యొక్క, లోతు తెలియటం అంటూ నీ బుద్ధికి తెలిసింది తెలియడం తప్ప, అది ఎంత అనేది ఏమీ తెలియదు. అది ఎంత లోతు అనేది తెలియదు. అది ఎంత పరిమాణం అనేది తెలియదు. మహాహ్రదః, మహాగర్తః కృష్ణుడి లోతులు కూడా అట్లా తెలియలేదు. వరాహావతారం మనకి అట్లా కనిపిస్తుంది. హిరణ్యాక్షుడిని చంపడానికి వచ్చినప్పుడు. ఎక్కడి నుండి వచ్చాడో తెలియదు, ఎలా పుట్టాడో తెలియదు, ఆ విధంగా మనకి, అవగాహన లోతులు, dip-deep అంటాం చూశారా మనం సి.వి.వి గారి మార్గంలో. అలా పోతూ ఉండటమే. కొంత దూరం వెళ్లిన తర్వాత, తాను కూడా అందులో కలిగిపోవడంగా ఉంటుంది కాబట్టి, ఇంక అక్కడ నుండి

తెలియడానికి అంటూ ఏమీ ఉండదు. ఆ విధంగా మహాగర్తః. అలాగే మహాత్ముల లోతులు కూడా తెలియవు అంటారు. కానీ గుర్తు పెట్టుకోండి, పరతత్త్వానికీ, కృష్ణుడికి, వాళ్ళిద్దరికీ ఒక benchmark వేస్తే, మిగతా వాళ్ళందరికీ వేరే benchmark లు వేయాలి. మిగతా వాళ్ళందరికీ, చాలా లోతులు ఉంటాయి. కానీ లోతు తెలియకపోవడం అనేది ఉండదు. కానీ పరతత్త్వపరంగా చూస్తే లోతులు తెలియవు.

## 836 మహాభూతః

మహాభూతః అంటే విపరీతంగా అవతరిస్తాడట. మహాభూతః మొత్తం సృష్టి రూపంగా ఏర్పడినవాడు ఆయన. ఆ తత్త్వమే కదా ఇంతగా ఏర్పడింది. ఎంతగా ఏర్పడింది అంటే ఎంతో మనకి తెలియదు. మనము పైకి చూస్తే ఆ పాల దారి ఒకటి ఉంది కదా, పాల పుంత అంటారు తెలుగులో, Milky-way అంటారు ఆంగ్లంలో. అవి ఏమిటో, ఎక్కడెక్కడ ఏమేమి ఉన్నాయో, అక్కడ ఎటువంటివాళ్ళు ఉన్నారో, ఎవరికి మాత్రం ఏం తెలుసు? అక్కడ ఏ ఏ యుగాలు నడుస్తున్నాయో మనకి తెలియదు. అక్కడ ఉండే పరిస్థితులేవీ మనకి అవగాహన లేదు. మనకు అవగాహన లేనంత పెద్ద అవతారం. మహాభూతం. భూతః అంటే పుట్టింది అని అర్థం. అలాగే విశ్వరూప సందర్శనం వీళ్ళందరికీ చూపించాడు రాయబారానికి వెళ్లినప్పుడు. చూపించాడు కాబట్టి ఈ నామం. కృష్ణుడిలో మళ్ళీ అన్ని లోకాల జీవులు, ఏడులోకాలు మళ్ళీ ఆయనలో కలిసిపోవడం, ఇదంతా చూసినప్పుడు, ఆయన మహాభూతుడు అని తెలుస్తుంది. సరే పరతత్త్వమే ఈ సమస్తంగా ఏర్పడింది కాబట్టి, మహాభూతము. ఈ 'మహా' అనే పదం వాడడంలో అర్థం ఏమిటంటే, beyond limitation, పరిమితులు లేక ఉన్నది అని అర్థం. అపరిమితమైన! ఎంత వ్యాపించి ఉన్నాడో, అవగాహన లేని విషయం.

## 837 మహానిధిః

ఈ సృష్టిలో ఏర్పడిన సంపదలు ఉన్నాయి కదా. ఇవన్నీ ఆయన నుండి ఏర్పడినవే. స్థితి మార్పు చెందడం వల్ల మనకి, మనం అనుకునే సంపదలన్నీ ఏర్పడి ఉన్నాయి. అవి అంతే ఉన్నాయా అంటే అంతే లేవు. మనకి శాస్త్రజ్ఞులు, ఒక లెక్క చెప్తారు.ఈ భూమి మీద ఉండే బంగారం కనుక మనం వాడడం మొదలు పెడితే ఇన్నాళ్టికి అయిపోతుంది, ఈ భూమి లోపల ఉండే petrol వాడడం మొదలుపెడితే ఇన్నాళ్టికి అయిపోతుంది. ఇట్లా లెక్కలు చెప్తూ ఉంటారు. తెలిసినవాళ్ళకి నవ్వులాటగా ఉంటుంది. ఎందుకంటే, అయిపోవటానికి అది fixed stock కాదు. ఒక పక్క నుండి అయిపోతూ ఉంటే రెండవ పక్క నుండి ఏర్పడుతూ ఉంటాయి. సృష్టిలో అది ఒక పెద్ద రహస్యం. ఏదీ అయిపోదు. అయిపోతుంది అనుకునే వాడి మనస్సు యొక్క పరిమితత్వమే తప్ప, అక్కడ అయిపోవడం లేదు. అందుకనే నిధి భగవంతుడు. అయిపోవడం అనేది ఉండదు. వచ్చిందల్లా లోకహితానికి వాడుతూ ఉంటే ఇంకా వస్తూ ఉంటుంది. అట్లాగే శరీరం అయిపోవడం ఉండదు. అయిపోతే మళ్ళీ ఇంకొకటి వస్తుంది. భూగోళం అయిపోవడం ఉండదు. అయిపోతే ఇంకొకటి వస్తుంది. గ్లాసులో మంచినీళ్ళు తాగితే అయిపోవు. మళ్ళీ ఆ గ్లాసు నిండుతుంది. ఏదీ అయిపోదు. జుట్టు కత్తిరించేశామనుకోండీ తిరుపతి వెళ్ళి, అయిపోయిందా? మామూలుగా, మనకుండే ఈ జుట్టుని ఒక తిరుపతి మంగలి ఇంతసేపట్లో ఇది అయిపోయేటట్టు చేస్తాను, అంటాడు. మళ్ళీ మొలవదా? అలా అనుస్యూతం ఏర్పడే నిధులు ఉన్నాయి సృష్టిలో. వాటినే 'అక్షయం' అంటారు. అక్షయ నిధి. నిధులన్నీ అక్షయమైనవి. అయిపోదు. అయిపోతుంది అనుకోవడం మన దరిద్రం. మాస్టరుగారు దీనికి శంఖారావంలో బాగా రాశారు. ఇంటావిడ ఇంట్లో బియ్యపు బస్తా నుండి బియ్యం తీసి వాడుతూ ఉంటే, అయిపోతుందేమో అనుకుంటే వండలేదు కదా. అయిపోదు అని తెలుసు. ఈ బస్తా అయిపోతే ఇంకొక బస్తా వస్తుందని తెలుసు కదా ఆవిడకి! అంటే మనకి మామూలుగా సంసార జీవులకు అర్థమవ్వాలంటే ఇట్లా చెప్పాలి. ఇంట్లో బియ్యం అయిపోతున్నాయా? అయిపోవు. లేకపోతే అప్పు అయినా తెచ్చుకు తింటాం కానీ, లేకుండా ఉండటం అనేది ఉండదు కదా! ఏదీ అయిపోదు

సృష్టిలో. అదీ నిధి అంటే! ఒక్కొక్కటి వచ్చింది వెళ్ళిపోతూ ఉంటే, ఇంకొకటి వస్తూ ఉంటుంది. ప్రస్తుతం భూమి మీద ఇన్ని మామిడి చెట్లు ఉన్నాయి, ఇవి ఇంత కాలం బతుకుతాయి, ఇవి చచ్చిపోయిన తరువాత భూగోళం మీద మామిడి పళ్ళు ఉండవు అంటే ఎట్లా ఉంటుంది? ఇట్లా ఉన్నాయి మన Scientist లెక్కలన్నీ కూడా. వీడు చచ్చిపోయేలోపల మళ్ళీ మామిడి చెట్లు వస్తాయి. వీడు చచ్చిపోతాడు అంతే. అట్లాగే, petrol గా ఏర్పడుతున్న ఇంధనం ఏదైతే ఉందో, అది ఉత్పత్తి అయ్యే విధానం ఒకటి ఉన్నది, తీస్తుంటే వస్తూ ఉంటుంది. బావిలో నీళ్లు ఉన్నాయనుకోండీ, తీస్తే ఏమవుతుంది? మామూలుగా ఏం చేయాలి Scientist ఐతే? బావిలోకి దిగి, దాని పరిధి కొలిచి, దాని లోతు కొలిచి, ఇన్ని gallons water ఉంది ఇక్కడ, మనం రోజుకి, ఒక వంద గాలన్లు వాడుకుంటున్నాం అనుకోండి, ఇన్ని రోజుల్లో ఈ బావి ఎండిపోతుంది, అని చెప్పాలి. అదా, theory? అడిగేవాడు లేక! అట్లా ఎండిపోయెట్టైతే ఎన్ని బావులు ఎండిపోయి ఉండేవి ఇప్పటికీ? ఒక పక్క నీళ్ళు తోడుతున్న కొద్దీ వస్తూ ఉంటాయి కదా! తోడకపోతే అదే మట్టంలో ఉంటాయి. తోడుతుంటే మళ్ళీ అదే మట్టంలో ఉంటాయి. కదా. అది మహానిధి, అంటే అయిపోవడం అనేది లేనిది, ఎంత ఉంది అనేది తెలియనిది. భూమి మీద ఉండే సమస్త నిధులని పోగేసి, యుద్ధానికి ఖర్చు పెట్టేశారట మహాభారతంలో. మనకి కూడా చూడండి defence budget. మహాభారత యుద్ధం global war. మరి అప్పుడు కావలసిన సామాగ్రి తయారు చేసుకోవడానికి భూమి మీద ఉండే సకల సంపదలూ ఖర్చు పెట్టేశారట. అంతా అయిపోయిన తరువాత, ధర్మరాజుని మళ్ళీ అశ్వమేధయాగం చేయమంటారు. చేయమంటే ఏం పెట్టి చేయాలి అని అడుగుతారు వాళ్ళు. ఏమీ లేవు కదా, అన్నీ అయిపోయినాయి కదా, అంటే కృష్ణుడు అంటాడు, 'అయిపోవడం ఏమీ లేదు, నాతో రా', అని అర్జునుడ్ని హిమాలయాల్లోకి తీసుకెళ్ళి ఇక్కడ తవ్వమంటాడు. అక్కడ ఉంటుంది. ఇక్కడ ఉన్నట్టు మాకెవరికీ తెలియదే అంటే 'మీకెవరికీ తెలియకపోవడమే మంచిది' అని చెప్తాడు. అప్పటికే బాగా తవ్వేసి తీసుకున్నారు. అంత మాత్రాన అయిపోయిందా? ఎక్కడ ఏముందో మనకేం తెలుసు? అందుకని, ఈ నిధి మహానిధి అని చెప్పటంలో ఉద్దేశం ఏమిటంటే, ఎప్పటికీ తరగనిది. ఎంతో తెలియనిది. సూక్ష్మంగా ఉంటుంది, స్థూలంగా ఏర్పడుతుంది, స్థూలంగా

ఏర్పడింది అలా వాడేయబడుతూ ఉంటే, మళ్ళీ సూక్ష్మం నుండి స్థూలంకి వస్తూ ఉంటుంది. అందుకని, భగవంతుడు మహానిధి! ఆయన దగ్గర ఏదీ అయిపోదు. ఆయనతో బాగా అనుసంధానం చెందిన వాళ్ళకి కూడా అయిపోవడం అనేది ఉండదు.

## 838 కుముదః

అంటే నల్లని కలువలతో నిండిన సరస్సు అని అర్థం. రాత్రిపూట వికసించేవి నల్ల కలువలు, ఆకాశం నిండా మనకి రాత్రి కనిపించేవి అవే. భూమ్మీద సరస్సులో కనిపిస్తున్నవి కమలాలు సూర్యరశ్మితో వికసించేవి కొన్ని, చంద్రరశ్మితో వికసించేవి కొన్ని. ఇక్కడ కుముదః అనే నామం రెండు రకాలుగా మనం ఉద్దేశించవచ్చు. మామూలుగా మన సాధారణమైన జీవితంలో విచ్చుకున్న కమలాలు మనం చూసినప్పుడు అది భగవంతుని యొక్క వ్యక్తస్వరూపంగా భావన చేసుకోవడం, అందుకనే కొన్ని కొన్ని ప్రత్యేకించి ఆనందాన్ని కలిగిస్తూ ఉంటాయి. కమలము, మల్లెపూవు, తెల్లటి గుర్రం, తెల్లటి కుక్క, తెల్లటి కుందేలు అలా అప్రయత్నంగానే మనలో ఆనందం కలిగించే కొన్ని జీవులు ఉన్నాయి. వాటిని చూచినప్పుడు మనలో ఉండే చైతన్యం వికాసవంతం చెందుతుంది. మనస్సు విప్పారి అందులోంచి వికాసం కలుగుతుంది. అందుకని కుముదః అని చెప్పడంలో ఉద్దేశ్యం పరిమళముతో కూడిన నల్లకలువలు అంటే నీలపుకలువలు రాత్రిపూట చంద్రుని కాంతి చేత వికసింపబడతాయి. ఇటువంటి వాటికి అన్నిటికీ సరస్సుగా ఏర్పడ్డవాడు అని అర్థం. ఈ మొత్తం ఒకే ఒక చైతన్యము ఆకాశముగా వ్యాపించియున్నప్పుడు, అపరిమితంగా ఉన్నప్పుడు, అందులో పుంఖాను పుంఖాలుగా సూర్యమండలాలు వ్యక్తమవుతూ ఉంటే, ఒక్కొక్క సూర్య మండలం ఒక్కొక్కటి దూరం నుండి ఒక్కొక్క కమలంగా కనిపిస్తూ ఉంటుంది. కేంద్రంలో సూర్యుడు, చుట్టుపక్కల గ్రహములు అన్నీ కాంతివంతములై ఉంటాయి. ఇలా ఉన్నవి ఎన్నో ఉన్నాయి. వాటిని మనం అమ్మవారి పేర్లు చెప్పకున్నప్పుడు 'పద్మాలయా' అని చెప్తాం. అయ్యవారి పేర్లు చెప్పకున్నప్పుడు ఈ విష్ణు సహస్రనామంలో 'కుముదః' అని చెప్తారు. అదేవిధంగా మనకి సృష్టి మొత్తం macro and micro పిండాండము, బ్రహ్మాండము. బ్రహ్మాండంగా తీసుకుంటే చీకట్లో కనిపించే తారల గుంపులు. అదే చీకట్లో భూమ్మీద చూసినట్లయితే చంద్రుని కాంతికి వికసించి కనిపిస్తున్న కమలములు. ఈ విధమైన కమలములుగా కనిపిస్తాయి. మనలో కూడా కనిపిస్తాయి. విష్ణు సహస్రనామంలో మనం గమనించే ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే మొత్తం విశ్వం అంతా వ్యాపించిన తత్త్వం ఒకటి

కనిపిస్తుంది. అదే మన భూమ్మీద ఎట్లా ఉందో కనిపిస్తుంది. అదే మనలో కూడా ఎట్లా ఉందో కనిపిస్తుంది. ఈ మూడు రకాలుగా మనం చెప్పుకుంటున్నాం. అది మనం ఏ విధంగా సాధన పరంగా అనుభూతి చెందవచ్చు అనేది నాలుగో విషయం. మన ప్రాతిపదికే అది. విశ్వమంతా వ్యాపించినది, మన గోళం మీద మనకి కనిపించేది, మనలో కనిపించేది, ఈ ఉన్నది మనకి సత్యం అవడానికి మనం చేయవలసిన సాధన. ఇవే కమలములు మనకి మొత్తం షట్చక్రములుగా మనలో దర్శనం ఇస్తాయి. అవీ కుముదములే! కాబట్టి ఈ కలువలన్నీ ఎక్కడైతే ఉన్నాయో అది కూడా ఒక సరస్సే! అందుకని మానవ శరీరం ఒక సరస్సు అయితే ఈ కలువలకి, భూమ్మీద ఎన్నో సరస్సులు అట్లా కనిపిస్తే, భూమ్మీద ఎన్ని సరస్సులున్నాయో అంతకుమించిన సరస్సులు ఆకాశంలో కనిపిస్తూ ఉంటాయి. వీటిని దర్శనం చేసినప్పుడల్లా భగవంతుని యొక్క అస్తిత్వము భక్తునికి గుర్తు రావాలి. అదీ ముఖ్యమైన విషయం ఇందులో. ధ్రువుడు తపస్సు చేసుకున్న సందర్భంలో, పచ్చిక బయలు చూసినప్పుడు ఆకుపచ్చటి వస్త్రములు ధరించిన వాడుగా భావన చేసుకో. సూర్యుడు కనిపించినప్పుడు వెలుగుతో కూడిన కన్నులు కనిపించిన వాడుగా భావన చేసుకో. ఆకాశాన్ని చూసినప్పుడు నీలమైన దేహవర్ణము కలిగిన వాడుగా భావన చేసుకో. కలువలు చూసినప్పుడు అతని ఒంటిమీద వేసుకున్నటి వైజయంతి మాలను గుర్తు తెచ్చుకో. నీ చుట్టూ ఉండే వలయం ఒక చక్రం కింద నీకు కనిపించినప్పుడు అది సుదర్శన చక్రంగా గుర్తుచేసుకో. అంతా భగవత్ పరంగా చూడ్డం అనే పద్ధతి ఒకటి మనకి ఇందులో కనిపిస్తుంది. అందులో భాగంగానే కలువలను చూడంగానే కలువల రూపంలో విచ్చుకు సూర్య మండలాలు అనుకోవచ్చు, సవితృ మండలాలు అనుకోవచ్చు, భర్గోదేవ మండలాలు అనుకోవచ్చు, భూమండలం అనుకోవచ్చు, భూమ్మీద ఉండే కలువల సరస్సు అనుకోవచ్చు. మనలో ఉన్న కళలు కలువలు కూడా అనుకోవచ్చు. కాబట్టి కమలం చూడంగానే అది గుర్తు రావాలి.

## 839, 840 కున్దరః, కున్దః

కున్దరః అంటే గడ్డిపోచ గురించి చెప్తున్నాడు. ఒక రకమైన సువాసన కలిగిన గడ్డిపోచని కున్దరః అంటారు. కున్దః అంటే మల్లెపూవు. ఆరాధన మల్లెపువ్వులతో చేసుకోవడం, సువాసన కలిగిన గరిక, మనకి మరువము, దవనము అని చెప్తారు చూశారా! వీటన్నిటి యందు సువాసనగా ఉన్నవాడు భగవంతుడు అని అర్థం. భూమ్మీద సువాసన కలిగిన సమస్తమైన వస్తువుల యందు భగవంతుని యొక్క అస్తిత్వము ఎక్కువగా ఉన్నదని అర్థం. పదార్థము తక్కువ, పరమాత్మతత్త్వము ఎక్కువగా ఉన్నచోట సువాసన ఉంటుంది. అందుకని మల్లెపూవు ఆ విధంగా ఆకర్షిస్తుంది. మల్లెపూవులతో అమ్మవారికి పూజ చేసుకోవడం అందుకు. దాని యొక్క స్పర్శ చేత, దాని యొక్క సాన్నిధ్యం చేత మన యందు కూడా వికాసం అప్రయత్నంగా లభిస్తుంది. సువాసన మనలో ఉండే చైతన్యపు స్థితిని చక్కగా మలచి, సుందరమైన విగ్రహంగా మన్ని తయారు చేస్తుంది. రకరకాలైన భావములతో ఉన్నవాళ్ళం చాలా వికారమైన సూక్ష్మరూపం కలిగి ఉంటాం. అందుకనే మొహం చూసి వీడి పరిస్థితి ఎట్లా ఉందో చెప్పేస్తూ ఉంటారు తెలిసిన వాళ్ళు. ఎందుకంటే తమ భావముల యొక్క సముదాయమే ముఖమునందు ప్రతిబింబిస్తూ ఉంటుంది. అందుకని మన ముఖం చక్కగా విప్పారి, వికసించి చైతన్యం ప్రసారం చేసేట్టుగా ఉండడానికి, భూమ్మీదే చాలా రకాలైన రూపాల్లో భగవంతుడు ఉన్నాడు. వాటిని ఆశ్రయించి నిత్యజీవితంలో భాగంగా అవి చేసుకోవడం వలన మనలో వికాసం అప్రయత్నంగా కలుగుతుంది. ఎంతో ప్రయత్నించి వికాసం చెందుదాం అనుకునేవాళ్ళు కొన్నికొన్నిటి సాన్నిధ్యంలో వికాసం సులభంగా జరుగుతుంది. అటువంటి వాటిలో మీకు చందనం ఒకటి చెప్పాను. భగవంతుడికి అది పూస్తాం అని ఒక నామం ఉన్నది మనకి. అలాగే ఇప్పుడేం చెప్తున్నారంటే సువాసన కలిగిన మల్లెపువ్వులు, సువాసన కలిగిన గరిక, సువాసన కలిగిన కమలములు. ఈ సువాసన ఏం చేస్తుందంటే మనలో ఉండే Astral body అంటాం సూక్ష్మ శరీరము, ఆకాశ శరీరము, అది మలినంతో కూడి ఉన్న దాన్ని ఇది పవిత్రం చేస్తుంది. అది దాని గొప్పతనం. అలాగే తెల్లని ఆవు చూశాం అనుకోండి, ఆహా ఎంత బావుందని కాసేపు

మనం దాని కన్నులు చూసి ఆనందం పొందితే, ఆ అందం చూసి ఆకర్షింపబడడం చేత మనలో ఉండే Astral currents అన్నీ కూడా ఒక్కసారి మళ్ళీ సహజ స్థితికి వస్తాయి. మనిషిలో రకరకముల కామమైన భావములు కలిగి ఉన్నప్పుడు Astral form చాలా వికారంగా ఉంటుంది. ఇటువంటి సుగంధం, సుపుష్పం, పూజల్లో మనం పెట్టుకునే అగరవత్తులూ వీటి వల్ల ఏం జరుగుతుందంటే మనలో ఉండే సూక్ష్మశరీరం అప్రయత్నంగా సహజమైన ఆకారాన్ని పొందుతుంది. అందుకని మనకి వీటిల్లో ఎందుకు సహజమైన ఆకారాన్ని పొందుతుంది అంటే దీని యందు ఆయన యొక్క అస్తిత్వము ఎక్కువగా ఉన్నది కాబట్టి. విభూతి యోగం అన్నమాట ఇది. భగవద్గీతలో విభూతి యోగంలో వీళ్ళలో నేను వీడిని అని ప్రత్యేకంగా చెప్తాడు. అంటే వాళ్ళ రూపంలో అక్కడ ఎక్కువగా ఉన్నాను రుద్రుడనో శంకరుడనో అట్లా. 11 మంది రుద్రులుంటే అందులో అన్నిటిలో నేను ఉన్నప్పటికీ శంకరుడిలో నేను ఎక్కువగా ఉంటా. కదా! తిథులలో పౌర్ణమి అనలా ఏకాదశి అన్నాడు. ఆ రోజున నేను ఎక్కువ లభిస్తా. ఆ రోజున వచ్చే తరంగములలో నేనెక్కువుగా నీకు లభిస్తాను. మాసములలో మార్గశీర్షమాసము. ఆ మాసము నందు నేను నీకు ఎక్కువ కనిపిస్తాను. మానస పుత్రులలో సనక సనందన సనత్కుమార సనస్సుజాతులను. ఇట్లా చెప్పకొచ్చాడు. ఋషులలో వశిష్ఠుడను అని చెప్తాడు. ఇవన్నీ చెప్పి అన్నీ చెప్పట్లా సుమా! కొన్ని ఊరికే ఉదాహరణకు చెప్తున్నాను అంటాడు. ఇహ మిగతావన్నీ మనకి ఇట్లా ఇట్లా దొరుకుతాయి అక్కడా ఇక్కడా వెతుక్కుంటే. ఇప్పడు విష్ణు సహస్రనామంలో, పూవుల్లో మల్లె పూవును నేను, చెట్లలో చందనం చెట్టు నేను. అంతకన్నా సువాసన ఇచ్చే చెట్టు కనిపించదు. అందుకనే హనుమంతుడు లక్ష్మణుడికి చందనం చెట్టు వేశాడు. కాబట్టి ఇట్లా ఎక్కడ మనకి అప్రయత్నంగా మనలో ఆహ్లాదం కలుగుతుందో, ఆనందం కలుగుతుందో, కొంతమంది మనుషుల్ని చూసినా అట్లా కలుగుతుంది, అంటే అక్కడ ఎక్కువ ఉన్నాడన్న మాట. పనుండే వాడిని చూస్తే అప్పటి వరకే ఉంటుంది తప్ప ఎప్పడూ ఉండదు. పని అయిపోయిన తర్వాత ఉండదు. వాడితో పని లేకపోతే ఉండదు. నిష్కారణంగా మనలో ఒక రకమైన ఆనందం పుడుతుంది అనుకోండి, ఎందుకు పోతున్నారు తిరుపతి ? అందుకే. అంత విగ్రహం, అదే రూపంలో ఇంకోచోట పెట్టినా పోరే ? ఇంత పోరే ? ఇహ

అక్కడ వెళ్ళడానికి వీల్లేకపోతే అదే ఇక్కడ చూడ్డానికి వెళతారు తప్పా! అట్లా కుముదః అంటే కమలముల గుంపుగా నిన్ను నేను దర్శనం చేస్తున్నాను అనే భావన. ఈ కమలములు మనలో ఉన్నాయి. మనలో దర్శనం చేయాలి కదా! రకరకాల కమలాలు ఉన్నాయి లోపల. ఒక కమలంకి లేత ఆకుపచ్చ రంగు ఉంటుంది. ఇంకో కమలానికి గులాబీ రంగు ఉంటుంది. మరొక కమలానికి బంగారపు రంగు ఉంటుంది. మరొక కమలానికి ఇది ఆకుపచ్చా? నీలమా? తెలియని రంగులో ఉంటుంది. మరొక కమలం తెలుపో నీలమో తెలియని రంగులో మనకి ఆజ్ఞాచక్రం నుంచి మూలాధారం వరకు రకరకాల కమలాలు ఉన్నాయి. ఒక్కొక్క కమలానికి ఒక్కొక్క రకమైన రేకులు ఉన్నాయి. ఆ రేకుల నుండి శబ్దాలు వస్తూ ఉంటాయి. శబ్దములు ఎక్కడ నుండి పుడుతున్నాయి మనలో? ఒక్కొక్క రేకులోంచి ఒక్కొక్క శబ్దం పుట్టుకొస్తూ ఉంటుంది. అది మనం ఉచ్చరిస్తూ ఉంటాం. ఓ కఠ ఉపనిషత్తు ఉన్నది. కఠోపనిషత్తు అంటారు. అది హృదయానికి సంబంధించిన ఉపనిషత్తు. ఎందుకు కఠోపనిషత్తు అన్నారు? కఠినంగా ఉంటుందనా? కాదు. క నుంచి ఠ వరకు ఉండే 12 అక్షరాలు హృదయమునందు ఉండే ద్వాదశ పద్మమునందు ఉన్నాయి. క ఖ గ ఘ ఙ్ఞ  చ ఛ జ ఝ (ఇఞి ఇ+) అప్పటికి పది అయినాయి. ట ఠ. క నుంచి ఠ వరకు 12 అక్షరాలు. ఈ 12 అక్షరములకు సంబంధించిన సమస్తమైన శక్తిస్వరూపములన్నీ కూడా హృదయములో దాగి ఉన్నాయి. అట్లా మనం అన్ని కమలాలకు కూడా ఒక్కొక్క రేకుకి ఒక్కొక్క అక్షరం ఉన్నది. దానికి ఒక రంగు ఉన్నది.  శ,స,ష ఈ అక్షరములు మనకి మూలాధారంలో కనిపిస్తాయి. హ అనే అక్షరం ఆజ్ఞాచక్రంలో ఉంది. ఇంకొక అక్షరం కూడా ఉన్నది అక్కడ. ఇట్లా వరుసగా చుట్టూ ఉండే పద్మముల మీద కొన్ని అక్షరముల యొక్క శక్తి ఉన్నది. అందులో మధ్యలో ఉండే కేంద్రం ఉన్నదే దాని యందు బీజాక్షరములు ఉన్నాయి. మనం బీజాక్షరములు పలికినప్పుడల్లా కూడా అక్కడ శక్తి ఉద్భవిస్తూ ఉంటుంది. మిగతా అక్షరములు చక్కగా పలికినప్పుడల్లా వాటికి సంబంధించిన శక్తి ఉద్భవిస్తుంది. మనం మాట్లాడినప్పుడల్లా కూడా ఆ అక్షరములే అక్కడి నుండి ఉచ్చరింపబడుతూ ఉండడం చేత ఈ మాటలు వస్తున్నాయి. అవి మానవుడికొక్కడికే సాధ్యం. కారణం ఏమిటంటే సమస్తమైన అక్షరములు ఈ షట్చక్రముల యందు ఉండే దళములయందు ఏర్పడి ఉన్నాయి కాబట్టి. అందుకని ఈ కలువ అనంగానే

చాలా వస్తుంది. ఇటువంటి కలువలతో గుంపులు గుంపులుగా ఏర్పరిచి ఏడు లోకాలుగా ఏర్పరిచాడు. అందులో శబ్దములు ఉన్నాయి. అందులో వర్ణములు అంటే శబ్దములు అని అర్థం. రంగులు అని అర్థం. అది కారణంగా ఆకారములు ఏర్పడుతున్నాయి. అందుకని ఇటువంటి కమలాలు ఎన్నో గుంపులు గుంపులు గుంపులు గుంపులు గుంపులు గుంపులుగా ఉంటే దాన్ని కుముదః అంటే it's a pool of lotuses. కౌముది, కుముదిని అంటారు. ఈ భూమిని 'కుముదిని' అంటారు. ఎందుకంటే కేవలము కమలములు ఉండడమే కాకుండా అందులోంచి ఒక చక్కని సువాసన. మనకి భూమి యొక్క కళ్యాణగుణం ఏమిటయ్యా అంటే సుగంధం. అందుకని సుగంధం భూమ్మీద ఎక్కడ మీకు వాసన అనిపించినా మీరు వెంటనే అక్కడ భగవంతుని యొక్క అస్తిత్వం ఉందని గమనించాలి. కొన్ని కొన్ని ప్రదేశాల్లో చుట్టుపక్కల ఏమీ అగరొత్తులు లేకుండానే సువాసన వస్తుంది. కొన్ని కొన్ని ప్రదేశాల్లో విపరీతంగా పువ్వులు పూస్తూ ఉంటాయి వద్దన్నా. వద్దన్నా తులసి మొక్కలు పెరిగిపోతూ ఉంటాయి కొన్ని కొన్ని ఇళ్ళల్లో కదా! వేస్తే చచ్చిపోతాయి కొన్ని ఇళ్ళల్లో. మనకి రామాయణం వంటి గ్రంథాలు చదువుకున్నప్పుడు ముని ఆశ్రమములు ఎట్లా ఉంటాయో అక్కడ మనకి వర్ణించి ఇస్తారు. వర్ణనలు ఎత్తేసి మనం కథలోకి వెళ్ళిపోతూ ఉంటాం. ఆ వర్ణనలో ఏం ఉంటుందంటే రాలిన పువ్వుల చేత నేలంతా కూడా గుబాళిస్తూ ఉందని చెప్తారు. అంటే ఏమిటయ్యా అంటే పవిత్రత చాలా ఎక్కువగా ఉన్నదని అర్థం. భూమికి గంధము. అట్లాగే నీటి యందు భగవంతుడిని ఎట్లా చూస్తావు? రుచి చేత చూస్తావు. నీ నాలుక మీద నీరే లేకపోతే నీకు రుచే అందదు. కాబట్టి నాలుకకి నీరు తగిలినప్పుడు రుచి పుడుతుంది. ఆ రుచి రూపంలో భగవంతుడు ఉన్నాడు. అలాగే అగ్ని-వేడిమి, వాయువు-స్పర్శ. చల్లని వాయువు వచ్చిందనుకోండి, మహాత్ముల యొక్క సంచారం జరుగుతూ ఉంటే ఉన్నట్టుండి ఒక్కసారి అట్లా పిల్లవాయువు వచ్చి వెళ్ళిపోతుంది. భగవంతుని యొక్క అస్తిత్వము కూడా అట్లాగే గమనిస్తారు. భయంకరమైన వాతావరణం ఉందనుకోండి, ఏవో ఆపదలు ఉత్పన్నమవుతాయి అని తెలుస్తుంది. ప్రశాంతమైన వాతావరణం ఉందనుకోండి భగవంతుని యొక్క ఆశీర్వచనంతో కూడి ఉన్న సమయము మనం చేసే పని అని తెలుస్తుంది. ఇలా వాయువు నుండి అది. ఆకాశం

యొక్క అస్తిత్వం  ఎట్లా కనిపిస్తుందంటే మనకి సూక్ష్మ శరీర ధారులైన మనుషులు కనిపిస్తారు. ఇట్లా సుగంధము, సురుచి, చక్కని వేడిమి, తరువాత చక్కని స్పర్శ, చక్కని దర్శనము ఈ రకాలుగా భగవంతుని యొక్క అస్తిత్వము మనకి గోచరిస్తూ ఉంటుంది. ఈ కుముదః అనే పదంలో ఎక్కడ సుగంధం ఉన్నదో, ఎక్కడ కలువలు బాగా విచ్చుకుని ఉన్నాయో, ఎక్కడ పువ్వులు సాధారణంగా విపరీతంగా విచ్చుకుని ఉంటున్నాయో, అక్కడల్లా భగవంతుడు ఉన్నాడని. ఎక్కువగా అస్తిత్వము చెంది ఉన్నాడని. అక్కడ గుడి కట్టుకోక్కర్లా. గుడి కట్టుకుని గుడి చుట్టూ పూల మొక్కలు వేసుకోవడం ఒక పద్ధతి. బాగా పూవులతో ఒక వనం పెంచుకున్నామనుకోండి అక్కడ మీకు వాసన రూపంలో భగవంతుని అస్తిత్వము ఎలాగూ ఉన్నది. అలాగే కుందరః అంటే అదొక రకమైన సువాసనతో కూడిన గడ్డిపరక. కుందః అంటే మల్లెపువ్వు. కుందః అంటే ఇంకో అర్థం కూడా ఉంది. తొమ్మిది అని అర్థం. భగవంతుడు 9 అంకెగా సృష్టిలో ఉంటాడు. 10 అంకెగా సృష్టికి అవతల కూడా ఉంటాడు. అక్కడ నుండి మిగతా ఎనిమిది అంకెలూ ఆ తొమ్మిదో అంకెగా ఉండే విశ్వాత్మ చైతన్యానికి ఆవరణలుగా ఉంటాయి. అందుకనే తొమ్మిదో అంకె అందరూ కార్లకి వేసుకుంటూ ఉంటారు, success కావాలని. ఎందుకనీ? సృష్టిలో అంతకు మించింది లేదు. ఎప్పటికప్పుడు కొత్తగా దిగివస్తూ ఉంటుంది. పరమాత్మ తత్త్వము సృష్టిలో నిలిచి ఉన్నప్పుడు సృష్టి మొత్తానికి అధ్యక్షుని వలె ఉన్నది చైతన్యము. సృష్టికి అవ్వల ఉండేదాన్ని నిర్వచించడానికి వీల్లేదు. అది సృష్టి లోపల వెలుగుగా ఉంటుంది. ఆ వెలుగుయే మనలో కూడా వెలుగ్గా, నేనుగా మనం అనుకుంటున్నట్టుగా ఉంటుంది. మనం ఎలా అనుకుంటే అది మనలో అలా ఉంటుంది. మనం మన గురించి అనుకుంటాం కదా నేను నేను అని. ఇవన్నీ ప్రత్యేగాత్మలు అయితే అది విశ్వాత్మ. దాని number 9. అక్కడ నుండి ప్రతి ఒక్కడూ తాను ఒకడున్నాడనుకోవడం వల్ల 8 అయ్యాం. 8 అయిన తర్వాత 7 గా వాడి బుద్ధి ఉంటుంది. 6 గా వాడి మనసు ఉంటుంది. 5, 4, 3, 2, 1 గా వాడి పంచభూతాత్మకమైన శరీరం ఉంటుంది. అందుకని మనం ఎనిమిదో వాళ్ళుగా మనకి తెలుసు. తొమ్మిదో వాడిగా తెలియడం కోసం తొమ్మిదో వాడిగా ఉండే విశ్వాత్మ అయిన భగవంతుడ్ని ప్రార్ధన చేసుకుంటూ ఉంటాం. ఎందుకంటే వాడే మనం అని తెలియాలి. ఎలా తెలుస్తుందంటే అట్లా వాడితో

రాపాడుకుంటూ ఉంటే ఇనుపముక్క కూడా అయస్కాంతం అయిపోయినట్లు అవుతుంది. అది భక్తి మార్గం! ధ్యాన మార్గం లో 'వాడే నేను, వాడే నేను' అనుకుంటూ స్పందనని పట్టుకుని, ఆ స్పందనానికి ఆధారం అయిన దాంట్లోకి వెళుతూ ఉంటాడు. జపమార్గంలో జపం చేసుకుంటూ 'అదే నేనని' తెలుసుకుంటూ ఉంటాడు. ఏదైనా తొమ్మిదే ఎనిమిదిగా దిగి వస్తోందని తెలిసి ఉన్నప్పుడు, సమస్తమునందు నేనే ఉన్నానని తెలిసి ఉంటుంది. అతడు మాత్రం ఎనిమిదిలోకి అవస్థితి చెందడు. మనం ఎనిమిదిలోకి అవస్థితి చెందుతూ ఉంటాం. మనం ఎనిమిదిగా ఉండి మిగతావి నడిపిద్దాం అనుకుంటాం. ఎనిమిదిగా దిగంగానే ఏడు అయిన బుద్ధి మనమేరకి అది తగ్గిపోతుంది. బుద్ధి అనే కాంతి తగ్గిపోతుంది. అందుకని తాను ప్రత్యేకంగా ఉన్నాడు అనే భావన ఎప్పుడైతే కలిగిందో, దాన్నే 'అహంకార ప్రజ్ఞ' అన్నారు. అది ఎప్పుడైతే ఉన్నదో బుద్ధి సన్నగిల్లుతుంది ఎంతటి వాడికి అయినా. తాను సమస్తమునందూ ఉన్నాడు. సమస్తమే తన యందు ఉన్నది. సమస్తమూ తన యందు ఎట్లున్నదో, సమస్తమునందూ ఉన్న రూపములయందు కూడా అట్లే ఉన్నది అని గుర్తున్నవాడు, భగవంతుని బుద్ధియందు ఉంటాడు. అలా కాకుండా తన బుద్ధి, తన ఆలోచన. అంటే తను వేరుగా ఉండి ఆలోచించుకుంటే ఏమవుతుందంటే తన గుడ్డిదీపంలో తన్ని వెతుక్కుంటున్నట్టు ఉంటుంది. వాడిలో వెళ్ళి కూర్చుంటే వాడి దీపం మొత్తం సృష్టినంతా వెలిగిస్తుంది కాబట్టి ఆ బుద్ధి నీకు అందుబాటులో ఉంటుంది. బుద్ధియోగంలో ఉండడానికి శ్రీకృష్ణుడు నాలుగో అధ్యాయంలో ఓ సులువు చెప్పాడు. నువ్వు బుద్ధి యందు ఉందాం అనుకుంటే, ఎప్పుడైనా సరే సమస్య వచ్చినప్పుడు నన్ను స్మరించి, నాయందు ఉండు. అప్పుడు నీకు బుద్ధి అనేది వెలుగుతుంది. ఆ వెలుగులో చూసుకో ఏదైనా నీకు సమస్యకి పరిష్కారం వస్తుంది. కానీ ఉన్నపళంగా నీ ఆలోచనలలో నువ్వు ఉంటావు కదా! మనస్సులోకి దిగి ఉంటావు. అంటే ఆరులో ఉంటావు. తొమ్మిది ఆరు అయిందంటే అర్థం ఏమిటంటే తలకిందులైంది అని అర్థం. అందుకని It is the number of the beast అంటారు Old Testament లో. 6 అంకెని beast అంటారు. 9 అంకెని man అంటారు. ఎందుకని? సహజంగా 9 అయినవాడిలో మనం ప్రత్యేకింపబడి ఉంటాము. ఆరులో మనకిగా మనం మన బుద్ధి కోల్పోయి, మన మనస్సులో బతుకుతూ, మన మనస్సులో మనకి

కలిగే భావముల యొక్క సముదాయంగా మనం ఉంటాం. ఏ మనిషి అయినా సరే వాడి భావముల యొక్క సముదాయమే వాడు తప్ప అంతకుమించి లేదు. 'తన' భావము తీసేసి, 'తను' భావం తీసేసి ఆత్మభావంలోకి పెరిగిన వాడికి దానిలో ఉండే వెలుగు అంతా తనకి అందుబాటులో ఉంటుంది. భగవంతుని బుద్ధి అందుబాటులో ఉండే వాడు భక్తుడండీ! లేనివాడికి తనదైన బుద్ధి తనకు ఉంటుంది. ఆ బుద్ధి అంత వినియోగపడే బుద్ధిగా ఉండదు. ఇక్కడ కుందః అని చెప్పడంలో 9 అంకె చెప్తున్నాడు. అందుకనే అక్షర పరబ్రహ్మయోగం భగవద్గీతలో భగవంతుడు లేక విశ్వాత్మ చైతన్యము తొమ్మిదిగా చెప్తారు. లేక దాన్నే మూల ప్రకృతి, అంటారు. మహా ప్రజ్ఞ అంటారు. మహా ప్రకృతి, అంటారు. అక్కడి నుండి వ్యక్తిగత ప్రకృతి ఒక ఆవరణ. అక్కడి నుండి బుద్ధి అనేది ఇంకొక ఆవరణ. మనస్సు ఒక ఆవరణ. ఆకాశం మరియొక ఆవరణ. వాయువు ఒక ఆవరణ. అగ్ని మరియొక ఆవరణ స్థూలానికి. నీరు ఇంకొక ఆవరణ. పృథ్వి ఇంకొక ఆవరణ. ఇట్లా ఆవరణలు ఏర్పడిపోతాయి. ఇలా ఆవరణలు ఏర్పడిపోతున్న కొద్దీ ఆ ప్రజ్ఞ పరిమితత్త్వం చెందుతూ ఉంటుంది. ఈ తొమ్మిదిలో ఆ మెట్లలో ఎక్కడైనా మనం కూర్చోవచ్చు. కొంతమంది చివరి మెట్టు మీద కూర్చోవచ్చు. వాళ్ళకి భౌతికలోకమే ప్రపంచం. ఇంకొంతమంది రెండో మెట్టులో కూర్చోవచ్చు వాళ్ళకి ఆవేశమైన జీవితమే. ఆవేశాత్మకమైన భావములు, కోరికలు అవి నింపుకోవడంగానే జీవితం నడుస్తుంది. మూడో మెట్టులో కూర్చుంటే ఇంకొంచెం, అట్లా ఆరో మెట్టుకి ఎక్కేసరికి నెమ్మదిగా భావంలో ఉంటాడు. ఏడులో కొంచెం మంచి విషయాలు గురించి ఆలోచించడం, సద్గ్రంథ పఠనం, సత్పురుష దర్శనం ఇటువంటి వాటి మీద ఆసక్తి కలుగుతుంది. అక్కడి నుండి నేనెవరు? అనే గొడవంతా పడతాడు. అసలు ఇదంతా ఎందుకు ఇట్లా ఉంది? ఇట్లా ఎందుకు ఉండాలి? ఇంకో రకంగా ఎందుకు లేదు? అసలు మనం ఎక్కడ నుండి వచ్చాం? ఇటువంటివన్నీ వీడిలో పుడతాయి. ఎప్పుడు? ఏడులోకి వస్తే. ఆరు, ఏడు మధ్యే ఎక్కువ ఉంటారు Thinkers, intellectuals, creative artists/ సృజనాత్మక శక్తి కలిగిన వాళ్ళు. అక్కడి నుండి అన్వేషణ ప్రారంభం అవుతుంది. ప్రారంభం అయితే తొమ్మిదిగా ఒకటే ఉన్నది. అది అమ్మవారు అనండి లేక సృష్టిలో భగవంతుడు అనండి లేక వెలుగు అనండి లేక విశ్వాత్మ చైతన్యం అనండి.

దానికి ఆధారమైనది ఇది. వెలుగుగా ఏర్పడకముందు ఉన్న స్థితి ఒకటి ఉన్నది. దానికి నిర్వచనం లేదు. అది పది. కాబట్టి ఇక్కడ కుందః అని చెప్పడంలో మల్లెపువ్వు అని అర్థం ఉన్నది. ౯ అంకె అని కూడా అర్థం ఉన్నది.

## 841 పర్జన్యః

పర్జన్యం అంటే నీటితో కూడిన మేఘములు. అది లేకపోతే కథే లేదు కదా! ఎప్పుడొస్తుందా వర్షం అని భూమే ఎదురుచూస్తుంది ఎండాకాలం అయిన తర్వాత. అట్లా పర్రలు వచ్చేస్తాయి కదా నేలలో. అట్లా విచ్చుకుపోతుంది నేల. దేనికోసం? వర్షపు చినుకు కోసం విచ్చుకుపోతుంది. విచ్చుకుపోతే అందులో వర్షపు నీరు పడితే, అప్పుడు భూమి నుండి వచ్చే వాసన ఎప్పుడన్నా చూశారా మీరు? అది కూడా కుముదః అన్న పదానికి అర్థమే. చాలా మంచి వాసన వస్తుంది. మంచి ఎండాకాలం తరువాత నాలుగు చినుకులు, తొలకరిచినుకు అంటామే అది భూమ్మీద పడ్డప్పుడు, భూమి పులకించి తన సహజమైన వాసనని బయటికి వెదజల్లుతుంది. పర్జన్యుడి రూపంలో భగవంతుడ్ని చూడ్డం ఇక్కడ ఇచ్చారు. అంటే ఒక చల్లటి మేఘం వచ్చిందనుకోండి ఎంత హాయిగా ఉంటుంది? అంతవరకు రాకముందు ఎట్లా ఉంటుంది? మేఘం వచ్చిన తర్వాత ఎట్లా ఉంటుంది? ప్రతి సంవత్సరం ఈ మేఘాల రూపంలో మనకి వర్ష ఋతువులో భగవంతుడు మన దగ్గరికి germination అనే process conduct చేయడానికి, సృష్టికార్యం conduct చేయడానికి దక్షిణాయనం మొదలవగానే వర్షఋతువు మొదలవుతుంది. అది భగవంతుడు మన్ని చేరుకునే సన్నివేశం. అక్కడి నుండి భూమిలోకి ప్రవేశిస్తాడు. అంటే మనకి అందుకనే గురుపౌర్ణమి ఆషాఢ మాసంలో వస్తుంది. ఆషాఢమాసంలోనే మనకి దక్షిణాయనం మొదలవుతుంది. ఏమిటయ్యా అంటే అంతటా వ్యాపించిన వాడు, ఈ సృష్టి మొత్తానికి పెద్ద అయినవాడు, తొమ్మిదో అంకె, విశ్వాత్మ చైతన్యము 'గురువు'! ఆయన మనకి దగ్గరగా ఆషాఢమేఘాలతో వస్తాడు. ఎందుకంటే అంతకుముందు ఉత్తరాయనంగా పైకి వెళ్ళిపోయిన జీవులు మళ్ళీ దక్షిణాయనంగా దిగివస్తూ ఉంటే ఆయన కూడా దిగివస్తాడు. దిగివచ్చిన సందర్భంలో మనకి ఏర్పడుతున్న ఆ మేఘముల యొక్క చల్లదనము, నల్లటి మబ్బులు మనలో ఉండే తాపాన్ని అంతా కూడా తీసేసి, ఒక రకమైన ఆనందాన్ని మనకి, భూమికి కలిగించేవాడు, చల్లదనాన్ని ఇచ్చేవాడు. కాబట్టి ఆ రూపంలో మేఘములు వచ్చినప్పుడు భగవంతుడ్ని ఈ విధంగా దర్శనం చేసుకోమని చెప్పారు. అలాగే కొంతమంది సత్పురుషులు

కొన్ని కొన్ని గృహాల్ని పావనం చేసినప్పుడు కూడా ఈ విధమైన ఆనందం కలుగుతుంది మనుషుల్లో. అలాగే భగవద్ దర్శనం, భగవదనుభూతి కలిగిన వాళ్ళు కూడా మేఘములు వస్తే మనకి, భౌతికమైన శరీరానికి ఏ విధమైన చల్లదనము, ఆహ్లాదము కలుగుతుందో అదే విధంగా భగవంతుడు దిగివస్తే భక్తునికి, అంటే పర్జన్యపు రూపంలో ఉండే భగవంతుడి స్పర్శ ఆత్మకి ఆ విధమైన ఆహ్లాదం కలుగుతుంది. ఆనందం కలుగుతుంది. ప్రశాంతత కలుగుతుంది. ఊరడిల్లుతాడు. తపనంతా కూడా తగ్గిపోతుంది. అందుకని భగవంతుడ్ని పర్జన్యుడిగా ఇక్కడ భావన చేస్తాము.

## 842 పావనః

పావనుడు అంటే సమస్తాన్ని పవిత్రీకరించేవాడు అని అర్థం. అది వాయువుకి ఉండే ఒక పేరు. అందుకనే పవన్ కుమార్ అన్నారు, వాయువుకి పుట్టినవాడు అని చెప్పడానికి. పవనుడు పావనం చేస్తూ ఉంటాడు. చాలా పేర్లు ఉన్నాయి వాయుదేవుడికి కూడా. ఇక్కడ పావనుడు అంటే అర్థమేమిటంటే ఋతువు ఋతువుకి, ఋతువు మారే లోపల ఒకసారి గాలి వస్తూ ఉంటుంది. ప్రతి ఋతువు మార్పు ముందు గాలి ఉంటుంది. అది చూసే వాళ్ళకి. అసలు ఋతువులే చూడం మనం. కదా! ఆరు ఋతువులు ఉన్నాయని కూడా ఎవరికీ తెలియదు. ఈ ఋతువులు మారుతున్నాయని కూడా తెలియదు. Calender బట్టి తెలుసుకోవడం కాదు. గుర్తుపెట్టుకోండి Calendar లో చెప్పే ఋతువుల కన్నా ఇప్పుడు 23 రోజులు ముందు వస్తాయి ఋతువులు. కావాలంటే చూసుకోండి. మకరసంక్రమణం ఉత్తరాయనం అని January 14 అని అనుకుంటారే December 22కే వచ్చేస్తుంది. మనకి శరదృతువు ఆశ్వీయుజ మాసం శుక్ల పాడ్యమితో చూసుకుంటాం. అలా రాదు September 22కే వచ్చేస్తుంది. ఈ సంవత్సరం మన అదృష్టం కొద్దీ ఆశ్వీయుజ మాసం కూడా September 22కు వచ్చింది. ఓసారి మనకి October లో వస్తుంది కదా. దసరా సెలవులన్నీ October లో కదా. ఋతువుల మార్పిడిలో మార్పు వస్తూ ఉంటే పాత లెక్కలే మనం అట్లా చూసుకుంటున్నాం. మనకి ఎండలు ఎప్పటినుండి మొదలవుతాయండీ? వసంతమాసం. మనకి వసంతఋతువు ఎప్పుడొస్తోంది? General గా March చివర్లోనో April మొదటి వారంలోనో వస్తుంది మనకి ఉగాది. కదా! మరి ఎండలు చూడబోతే March మొదటి నుండే ఉంటాయిగా. మారిపోలా! ప్రతిసారీ ఋతుమార్పిడి జరుగుతున్నప్పుడల్లా కూడా, ఆరు ఋతువులు మార్పులు చెందేముందు, అంటే ఒక ఋతువు వెళ్ళి ఇంకొక ఋతువు వచ్చే లోపల గాలి వస్తుంది గమనించినట్లయితే. ఆ గాలి, అయిపోయిన ఋతువు తాలూకు అపవిత్రపు వాసనలు ఏమన్నా ఉంటే అవి తీసేస్తుందిటండీ! ప్రతి ఋతువులోనూ మంచి ఉంటుంది, కొంత మలినం కూడా ఉంటుంది. మన శరీరం ఏం చేస్తోంది? అన్నీ పుచ్చుకుంటే అందులో మలినాన్ని మళ్ళీ విసర్జించట్లా? ఏదైనా మలిన విసర్జనం అనేది సృష్టిలో

ఉన్నది. ఈ విసర్జించేది అంటే మనకు చక్కగా sanitary Angel అన్నమాట ఆ వాయువు. ఒక్కసారి ఆ ఋతువుకు సంబంధించిన మలినాలు అన్నిటినీ కూడా హరింప చేయడానికా? అన్నట్టుగా వీస్తుందిట, ఋతువు అయిపోయి కొత్త ఋతువు మొదలు అయిన సమయంలో ఒక మూడు నాలుగు రోజులపాటు. దాన్ని 'పావనుడు' అన్నారు. ఆ గాలి భగవంతుడి యొక్క అస్తిత్వం. ఎందుకంటే సృష్టి అంతా కూడా కాపాడవలసిన తత్త్వం కాబట్టి ఆ విష్ణుతత్త్వం. ఇవన్నీ ఆయన అంశలే ఆ విధంగా తిరుగుతూ ఉంటాయి అన్నమాట. ఆ గాలిని బట్టి ఋతువు మార్పు జరుగుతోంది అని కూడా తెలుసుకుంటారు. ఆ గాలి చేసే పనేమిటయ్యా అంటే వాతావరణంలో పవిత్రత తీసుకొస్తూ ఉంటుంది. మనలో కూడా పవిత్రీకరించే గాలిగా ప్రాణము అనే వాయువున్నది. అపానం ఏం చేస్తుంది? మలినాలను బయటికి తోస్తూ ఉంటుంది కదా! ప్రాణము మనకి ప్రాణశక్తిని తీసుకొస్తూ ఉంటే పీల్చేగాలి, వదిలే గాలి ఏం చేస్తోంది? ఉన్న మలినాన్ని అంతా బయటికి పారదోలుతుంటుంది. ఎందుకంటే పావనుడుగా, మనలో మలినాల్ని పారదోలే వాడిగా నిశ్వాస ఉన్నది. నిశ్వాస బాగా చేయలేని వాళ్ళకి దేహంలో మలినాలు బాగా పేరుకుపోయి కుప్పలు కుప్పలుగా ఏర్పడి మరణానికి కారణం అవుతాయి. అందుకనే మనకి బాగా నిశ్వాస చేయమని చెప్తారు. బాగా ఉచ్ఛ్వాస చేస్తే గాని బాగా నిశ్వాస జరగదు. బాగా ఉచ్ఛ్వాస చేస్తే మీకు బొడ్డు దగ్గర ఉండే నరముల యందు పట్టు బాగా ఏర్పడి, అక్కడ పరిశుభ్రత ఏర్పడుతుంది. బాగా నిశ్వాస చేయడం వల్ల గొంతు దగ్గర ఉండే నరములకు పట్టు ఏర్పడి రోగాలని నిర్మూలన చేస్తుంది. ఇక్కడే మనకి గొంతు దగ్గరే అమృతమైనా, విషమైనా పుట్టడానికి కావలసిన గ్రంథులూ ఉన్నాయి. అంటే ఒకటేమో మరణానికి కారణం అయితే, మరి ఒకటి మరణాన్ని దాటడానికి కారణంగా ఉంటాయి. ఇది బాగా మనలో పెంపొందాలంటే నిశ్వాస బాగా చేయాలి. నిశ్వాస బాగా చేస్తే రోగములు రావడానికి అవకాశం లేదు. నిశ్వాస బాగా చేయాలంటే ఉచ్ఛ్వాస బాగా చేయాలి. పెద్దలేం చెప్తారంటే 27 నక్షత్ర మండలములుగా ఈ వలయం మనకి అనిపిస్తోంది కాబట్టి, చంద్రుడు 27 రోజులు ఈ విభాగంలో ఉంటాడు కాబట్టి, ఈ భూమండలం చుట్టూ ఆ విధంగా తిరుగుతూ ఉంటాడు కాబట్టి, అమృత వర్షం చంద్రుడు చేస్తాడు కాబట్టి, 27 ఉచ్ఛ్వాస నిశ్వాసలు మూడు

సంధ్యలలో చేయగలిగితే అదృష్టవంతుడివి. లేక నాలుగు సంధ్యలలో చేయగలిగితే మరీ అదృష్టవంతుడివి. నాలుగు సంధ్యల్లో చేయడం అంటే 27 4లు 108 సార్లు చేయగలిగితే నీకు దేహంలో అనారోగ్యం ఉండడానికి వీల్లేదు అని చెప్తారు. కానీ చేయలేము. ఎందుకు చేయలేమో చెప్పనా? సంకల్పబలం తక్కువ ఉండడం చేత, ఇదివరకటి కర్మ ఒకటుంది చూశారా అది అడ్డుపడుతూ ఉంటుంది. దాన్ని అధిగమించి చేయాలంటే సంకల్పబలం ఒక్కటే మార్గం. లేదా పెద్దల సమక్షంలో చేసుకుంటే సులభంగా అవుతుంది. ఇటువంటివి విన్నప్పుడు మళ్ళీ ఉత్సాహం కలిగి రేపటినుండి చేద్దాం అనిపిస్తుంది. నాలుగైదు రోజులు చేస్తాం మళ్ళీ ఆగిపోతాం. ఆగిపోతే మళ్ళీ ఇది చేస్తున్న వాడి దగ్గర చేరాలి. ఇందులో రహస్యం ఏమిటంటే మనకిగా మనం చేయలేంది అది చేయగలిగిన వాడి దగ్గర చేరడం వల్ల అది మనకి అబ్బుతుంది. అయస్కాంతం పక్కన కూర్చుని ఇనుప ముక్క అయస్కాంతం అయినట్టు. అందుకు చేరడం. సత్సంగత్వం అందుకు ఉండాలి. జోగి జోగి రాసుకుంటే ఏం లాభం లేదు. అయస్కాంతం, ఇనుప ముక్క రాసుకోవాలి. అట్లా రాసుకుంటే అందులోంచి పుడుతుంది. అందుకని గుర్తుపెట్టుకోండి రోగాలు పోవాలనుకుంటే ఒక సంవత్సరం పాటు అంటే ఆరు ఋతువులు పూర్తి అయ్యే లోపల రోజుకి 108 సార్లు గనుక మీరు ప్రయత్నం మీద మీకు చాతనయినంత గాలి పిల్చి, చాతనయినంత గాలి వదలడం నేర్చుకున్నట్లయితే అనారోగ్యం రావడానికి అవకాశం లేదు. వేరే వ్యాయామాలు కసరత్తులు ఏమీ అక్కర్లేదు కానీ చెయ్యలేము. ఎందుకు చెయ్యలేమంటే సంకల్పబలం తక్కువ. ఇది చేసుకుంటే, మలినాలు ఎప్పటికప్పుడు చేరుతూనే ఉంటాయి దేహంలోకి కాబట్టి అవన్నీ నిర్మూలనం అవుతాయి. ఎందుకంటే ఈ మొత్తం సృష్టి కార్యం అంతా కూడా ఓ combustion లాంటిది. అగ్నికార్యం అది. అగ్నికార్యం ఎక్కడ ఉంటుందో అక్కడల్లా మలినాలు పుడుతూ ఉంటాయి. పుడుతున్నప్పుడు వాటిని తీసేసుకుంటూ ఉండాలి. తీసేస్తుండడానికి పెద్దలు చెప్పిన మార్గం ఇది. మనకి ఇవన్నీ చేసుకోవాలంటే రోజూ పొద్దున కనీసం ఓ గంట రెండు గంటలు time ఉండాలండీ! పెద్దవాళ్ళు ఏం చేస్తారంటే మూడు గంటలకి లేచిపోతారు. అన్నీ పూర్తి చేసేసుకుని అందరూ నిద్రలేచే సమయానికి వాళ్ళూ వాళ్ళతో పాటు సమానంగా ఉంటారు. అంతేగానీ తొమ్మిదింటికి phone

చేస్తే పూజలో ఉన్నారండీ చెప్పించుకోవడం అది ఊరికే fashion. ఏడింటికి, ఎనిమిదింటికి ఎప్పుడు చేసినా పూజలో ఉన్నాడట, ఏమిటి వాడి పూజ? పూజ ఎప్పటికయిపోవాలి? సంధ్యావందనం లోపల అయిపోవాలి. ఊళ్ళో వాళ్ళందరికీ వీడు పూజ చేస్తున్నాడని వార్తే తప్ప జరిగేదేం వుండదు. ఇంతమంది లేచిన తర్వాత అవతల పని మనుషులు, పాల మనుషులు, ఇంట్లో వీళ్ళంతా  తిరుగుతున్నప్పుడు. అందుకని గట్టిగా మనం పావనుడ్ని మనలో ఆవాహనం చేయాలి అంటే మీకు ఓపిక ఉంటే 4-27 సార్లు, 3-27 సార్లు గానీ, 3 అయితే 27 అవవు. ఎంత అవుతాయి మూడుతో బాగాహారిస్తే? 36 సార్లు అవుతుంది. 2-54 సార్లు గానీ, ఒక 108 సార్లు గానీ, ఒకే 108 మీ శరీరం ఒప్పుకోదు తెలుసా? నిద్ర వచ్చేస్తుంది. ఆవలింతలు వచ్చేస్తాయి. అది చేసిన తర్వాత నిద్రపోదాం అనిపిస్తుంది. అందులోంచి వచ్చే పవిత్రతని లోపల ఉండే అపవిత్రత భరించలేక నిద్ర వచ్చేస్తుంది. కొంతమంది గట్టిగా class వింటేనే నిద్ర వస్తుంది. అంతేకాదు సూర్యుడిని పొద్దున్నే, సూర్యోదయాన్ని మీరు బాగా చూశారంటే నిద్ర వచ్చేస్తుంది. ఎందుకంటే తట్టుకోలేక, ఈ శరీరంలో ఉండే తమస్సు నిద్రపోతుంది. ఆ తరువాత వచ్చి నిద్రపోతాడు. ఏమిట్రా అంటే సూర్యోదయం చూసి వచ్చాను ఏమిటో చాలా నిద్రొచ్చింది అంటాడు. నేతి ఉప్మా, పెసరట్టుతో సహా తిన్నంత నిద్రొస్తుంది. ఎందుకయ్యా అంటే లోపల అంతా carbons పేరుకుని ఉంటాయి కాబట్టి. ఆ మాలిన్యం పోవాలి అంటే ఈ రకమైన పావనుడ్ని, ఋతువు ఏమిటయ్యా అంటే మనకి నిజానికి రోజులో కూడా 24 గంటలు ఉన్నాయి. రోజుని గనుక మీరు 6 భాగాలు చేసుకుంటే ప్రతి 4 గంటలకీ మారుతూ ఉంటుంది. మారుతున్నప్పుడల్లా కూడా శరీరంలో మలినాలు పోగొట్టుకోవాల్సిన అవసరం ఉంటుంది. అందుకని మనకి త్రికాల సంధ్యావందనం అని ఇచ్చారు. పోనీ ఏకకాలంలో చేసినా ఇది ఒక్కటి ప్రయత్నం చేయండి. ముందు రోగాల నుంచి బయటపడితే తప్ప యోగం లేదు. మనకి విషయాలు తెలిసినా కూడా ఆచరించము. అందుచేతనే ఈ రకమైన బాధలు. కాబట్టి ఈ నామం ద్వారా మళ్ళీ ఒక్కసారి మనకి మనం గుర్తు తెచ్చుకుంటున్నాం, ఏమిటయ్యా అంటే బాగా గాలి పీల్చడం అనేది అవసరం. దాని వలన మనలో ఉండే పంచభూతాలు పవిత్రీకరింపబడతాయి. అంతేకాదు మనస్సు కూడా పవిత్రీకరింపబడుతుంది. తుప్పు పట్టిన ఇనుప ముక్క అయస్కాంతీకరణం

చెందదు. అందుకని ఈ తుప్పు ముక్కలు ఎంత మనం అయస్కాంతం గురించి, భగవంతుడి గురించి ఆలోచిస్తున్నా ఏమీ, ఇట్టాగే ఉంటుంది. ఎప్పుడు దానికి రాణింపు అంటే దానికి ముందు ఉన్న తుప్పు తీసేస్తే ఆ తరువాత అయస్కాంతపు తరంగాలు దీనికి అంటుకుంటాయి. మనకేం చేసినా అంటదు కదా! ఎన్ని చేసినా అంటదు. ఎందుకు అంటలేదో తెలియదు. ఎందుకంటే శాస్త్రప్రకారం చేయట్లేదు కాబట్టి అంటదు. శ్రద్ధాత్రయ విభాగయోగంలో శ్రీకృష్ణుడు చెప్తాడు 'పూజకో విధానం ఉంటుంది. ఆ విధానం ప్రకారం చేస్తేనే నీకు అది ఫలితం ఇస్తుంది. నీ ఇష్టం వచ్చిన పూజ చేస్తే ఏం దొరకదు' అని. నీ ఇష్టం వచ్చినట్టు connections ఇస్తే current రాదు కాబట్టి. అట్లాగే శరీరాన్ని పవిత్రీకరించుకుని అప్పుడు ధ్యానం చేస్తే కాస్త అంటుతుంది మనసుకి. మనసు శరీరానికి సంబంధించింది. అందుకని ఈ పావనుడు మనలో ఉన్నాడు. మనలో ఉన్నాడు కలువల రూపంలో, మల్లె పూవుల రూపంలో, గడ్డిపరకల రూపంలో, ఏమిటి గడ్డిపరక? వెంట్రుకలే కదా! కొంతమంది శరీరంలోంచి చెమట వస్తూ ఉంటే రోమకూపాల్లోంచే కదా వస్తుంది. అది సువాసనగా ఉంటుంది. కొంతమంది చెమట దుర్వాసన. ఎంత దుర్వాసన ఉందో అంత మలినం దేహంలో ఉన్నట్టు. దాన్ని ఈ విధంగా తీసేసుకోవడానికి ప్రయత్నం చేయండి. ఇది కేవలము శరీరం యొక్క ఆరోగ్యం కోసమే కాదు. ఆ తరువాత సరియైన యోగ స్థితిని పొందడానికి, వృద్ధి చెందడానికి యోగమునందు చాలా వినియోగపడుతుంది.

## 843 అనిలః

అనిలః అంటే గాలి. పావనము అయినటువంటి వాయువు. పావనము అయిన అంటే పవిత్రీకరించే వాయువు ఒకటి ఉంటే అవి కాక ఇంకా మనలో నాలుగు వాయువులు పనిచేస్తున్నాయి. ఒకటి-ప్రాణము, రెండు-అపానము, మూడు-వ్యానము, నాలుగు-ఉదానము, ఐదు-సమానము. సమానము అయిన వాయువు మనలో బొడ్డు చుట్టూ పనిచేస్తూ ఉంటుంది. అది కేంద్రం మొత్తం శరీరానికి. వ్యానము అనే వాయువు మనలో సమస్త శరీరం నందు వ్యాపనం చెంది ఉంటుంది. ప్రాణము అనే వాయువు మనకి ముక్కు నుండి ప్రవేశించి హృదయం వరకు వెళ్ళి అక్కడ ప్రాణము అందిస్తుంది. తద్వారా మొత్తం ఈ రక్తప్రసారం, వీటికి కావలసిన శక్తిని అందిస్తూ ఉంటుంది. ఇక మిగిలింది ఉదానం. అది గొంతులో ఉంటుంది. ఉదానవాయువు అందుకున్న వాడు ఆకాశంలోకి వెళతాడు. ఆకాశగమనం చేయాలి అని ఎవరికన్నా సరదా ఉంటే, యోగంలో ఉదానవాయువుని మేల్కొలపాలి. అది ఎలా మేల్కొలుపుతావు అంటే ఉచ్ఛ్వాస నిశ్వాసలను చేస్తూ చేస్తూ చేస్తూ చేస్తూ ఉంటే ఉచ్ఛ్వాస నిశ్వాసలై, నిశ్వాస ఉచ్ఛ్వాసలై అంటే రెండింటినీ ఒకదాన్ని ఒకటి హరించుకుంటూ మనలో ఉండే సమాన వాయువు హృదయంలోకి వచ్చి, వ్యానము కూడా అక్కడికి చేరుకుని, అక్కడ నుండి 4 వాయువులు ఊర్ధ్వగతి చెంది గొంతులోకి వస్తాయి. అక్కడికి వచ్చినవాడు తాను ఆకాశగమనం చేయగలిగిన శక్తిని సంపాదించుకుంటాడు అని యోగం చెప్తుంది. అది ఉన్న వాళ్ళే యోగంలో సమస్తమైన విజ్ఞానాన్ని అనుభూతి పొందుతారు. తరువాత వారు వాక్కు నుండి విజ్ఞానం వ్యక్తం అవుతూ ఉంటుంది. అంతకుముందు పుస్తకాలు చదివి చెప్పేదిగా ఉండదు. అప్పటికప్పుడు మళ్ళీ కొత్తగా బయటికొస్తూ ఉంటుంది. ఇంకా ఆపైన ఆజ్ఞలో దర్శనమే జరుగుతూ ఉంటుంది. అందుకని ఈ వాయువులన్నీ, మనలో ఇట్లా పనిచేస్తున్నవన్నీ కూడా ఆయన యొక్క పంచముఖము అయిన అస్తిత్వం. పంచముఖ ఆంజనేయస్వామి అంటే ఇదే. ఐదు ముఖాలతో నీలో ఉన్నాడు కదా! వాయు పుత్రుడు. వాయు పుత్రుడు ఎందుకయ్యాడు అంటే ఒకే వాయువు నుండి ఏర్పడిన ఐదు వాయువులు. ఈ ఐదు వాయువులు ఏకోన్ముఖం అయినట్లయితే ఆకాశగమనం వస్తుంది.

విశుద్ధి చక్రం ఆకాశానికి ప్రతీక. అనాహత చక్రం వాయువుకి ప్రతీక. పంచభూతాలకి పంచచక్రాలు ప్రతీక అయితే నీవు అతని యొక్క అంశగా ఆజ్ఞలో ఉంటావు అని. అతను ఎక్కడుంటాడయ్యా అంటే హృదయాంతరాళలో ఉంటాడు.

## 844 అమృతాంశుః

కాబట్టి అమృతాంశు అన్న నామం వచ్చినప్పుడు ఏం జరుగుతుందంటే ఈ వాయువులన్నీ మనలో ఏకోన్ముఖం అయినప్పుడు, మనం అమృతత్త్వం చెందడానికి కావలసిన కిరణములు చంద్రుడు నుండి లభ్యం అవుతాయి. చంద్రుడు చైతన్యవంతం అవడానికీ, సూర్యుడేమో ప్రాణశక్తిని ఇస్తాడు. చంద్రుడు నుండి కేవలం మనోతత్త్వమే కాకుండా 'moon is consciousness. sun is life' అంటారు. అందుకని చంద్రుడు సూర్యుడు నుండి వచ్చే కిరణాలు తనలోకి అందుకుంటాడు. శుక్రుడు నుంచి వచ్చే కిరణాలు తనలోకి అందుకుంటాడు. ఇంద్రుడు దగ్గర నుండి లేక Neptune అంటాం అతని దగ్గర నుండి వచ్చే కిరణాలు తనలోకి అందుకుంటాడు. చంద్రుడికి ఇంకో పేరు సోముడని కూడా ఉంది. సోముడు అంటే మొత్తం సృష్టికే అధిష్ఠానమైన ప్రజ్ఞ అది. 'స ఉమ' అని. ఉమతో కూడినవాడు. అంటే పూర్ణచైతన్యము అని. అది అందిస్తూ ఉంటాడు. చంద్రుడి కిరణాల నుండి అవి అందుతూ ఉంటాయి. అవి మనకి పౌర్ణమినాడు బాగా అందుతూ ఉంటాయి. అందుకని పౌర్ణమి నుండి వచ్చే కిరణముల ద్వారా అమృతాంశము అందులో ఇమిడి, అది మన వరకూ వస్తోంది కాబట్టి ఆ చంద్రకిరణములలో ఉండే అమృతత్త్వపు అంశ ఏది ఉన్నదో, అది భగవంతుడే మన దగ్గరికి చేరుతున్నట్టుగా భావన చేసుకోమని ఈ నామము మనకి చెప్తున్నది. అందుకూ full moon meditations. ఏదైనా తెలియకుండా చేసుకోవడం అనేది భారతీయ తత్త్వం. తెలిసి చేసుకోవడం అన్నది ప్రాచీన భారతీయ ఋషులతత్త్వం. వాళ్ళు ఇదంతా గుర్తించి దాన్ని ఎరిగి చేశారు. ఎరిగి చేయడం వలన మనకి విశ్వాసము బలపడుతుంది. ఎరగక చేస్తే అది ఏదో ఒక తప్పనిసరిగా అయిపోయి, ఈ విశ్వాసమే మూఢవిశ్వాసం అయిపోతుంది. విశ్వాసము నందు దాని యొక్క ఎరుక లేనప్పుడు అది మూఢవిశ్వాసం అవుతుంది. చంద్రుడు నుంచి వెన్నెల వస్తుంటే వెన్నెల కిరణాల్లోంచి అమృతత్త్వస్వరూపుడు, అమృత స్వరూపుడు అంశావతారంగా మనలోకి దిగి వస్తున్నాడు అన్న భావన జరిగిందనుకోండి ఎంత ఆనందంగా ఉంటుంది! అందుకని ప్రతి పౌర్ణమికీ ఎక్కడ సూర్యుడున్నాడో, ఎక్కడ చంద్రుడున్నాడో, ఎక్కడ నుండి ఎక్కడికి ఈ వెలుగు గొట్టం మనలో

ఏర్పడుతుందో చెప్పకుంటూ ఉంటాం. శ్రావణపౌర్ణమి అయ్యిందనుకోండి! శ్రావణమాసం అంటే ఏమిటి? సింహరాశిలో సూర్యుడు, కుంభ రాశిలో చంద్రుడు. కుంభరాశి అంటే మనలో మూడో కన్ను పైన శివుడు మూడో కన్ను. అక్కడ ఉంటాడు చంద్రుడు. చంద్రుడు కిరణాలు అక్కడున్నాయి అంటే సోముడు అని అర్థం. హృదయమునందు ఆత్మ చైతన్యము. పౌర్ణమి నాడు ఒక సరళరేఖ ఏర్పడుతుంది. మిగతా తిథులలో అట్లా సరళరేఖ ఏర్పడదు. కొన్ని అనుకూలమైన కోణములు, ప్రతికూలమైన కోణములు మనకి తరువాత వస్తాయి. అందులో ఏకాదశి అనుకూలమైన కోణం. శుక్లపక్షంలో విదియ, తదియ, పంచమి, సప్తమి, దశమి, ఏకాదశి, త్రయోదశి అనుకూలమైన కోణములు. కృష్ణపక్షంలో విదియ ఉండదు. తదియ, పంచమి, సప్తమి, ఏకాదశి ఉంటుంది. త్రయోదశి కూడా ఉండదు. అనుకూలమైన కోణములు. ఎవరెవరికి? సూర్యాత్మకమైన ప్రజ్ఞకి, చంద్రాత్మకమైన ప్రజ్ఞకి. సూర్యాత్మకమైన ప్రజ్ఞ అంటే ఏమిటి? నీలో ఉండే ప్రాణము. చంద్రాత్మకమైన ప్రజ్ఞ అంటే ఏమిటి? నీలో ఉండే చైతన్యము. చైతన్యమునకు ప్రాణమునకు అనుసంధానం బాగా జరిగే రోజులన్నీ శుభతిథులు అని ఇచ్చారు. అటువంటి అనుసంధానం కరువైన రోజులు ఉంటాయి. అవి అంత శుభమైన తిథులు కావు అని చెప్పారు. అష్టమి నాడు square వ్యతిరేకంగా ఉంటుంది. అందుకని ఏం చేసుకోబోక అని చెప్తారు. ధ్యానంలో ఉండు అన్నారు. పౌర్ణమినాడు వీటి మధ్య సరళరేఖ ఏర్పడుతుంది. సూర్యాత్మకము చంద్రాత్మకము అయిన ప్రజ్ఞ నీ సుషుమ్నలో ఒక చక్కని సరళరేఖ పైనుంచి కింద వరకు సూర్యుడు చంద్రుడు పాకిన స్థలం అంతా ఏర్పడుతుంది. ఆ కిరణాలు కనుక అందుకుని నీ సుషుమ్నలో అవి వికసిస్తున్నాయి, వెలుగు కలిగిస్తున్నాయి అని భావన చేస్తే నీలో ఉండే షట్చక్రములు వికాసం చెందడానికి అద్భుతమైన అవకాశమే పౌర్ణమి. అందుకని పౌర్ణమికి ముందు ఒక రోజు నుంచి తరువాత ఒక రోజు వరకు ఆ విధమైన ధ్యానాలు తెలిసిన వాళ్ళు చేసుకుంటారు. తెలియని వాళ్ళకి అన్నీ ఒకటే. అందుకని ఇక్కడ అమృతాంశుః అనే నామంలోంచి మనకొచ్చే భావన ఏంటంటే చంద్రుడు నుంచి దిగివచ్చే కిరణముల్లోంచి వస్తున్న అమృతత్త్వము. అది మనకి పౌర్ణమి ఘడియల యందు, చుట్టుపక్కల 'సినీవాలి రాక' అని చెప్తారు. వీటిని ముందు, వెనుక, మధ్య మూడూ పొందచ్చు. అందుకనే మనకి పరమ

గురువులు కూడా ఈ మూడు రోజులూ యోగనిష్ఠ ఉన్నవాళ్ళు, బయట కార్యక్రమాల్లో నిమగ్నం అయి ఉండక ఇది గమనించి కూర్చుని చేసుకున్నట్లయితే అమృతమయమైన శరీరము, దివ్య శరీరము మనలో ఏర్పడడానికి అవకాశం ఉంటుంది అని చెప్పడం. అది కారణంగా మనకి అమృతవపుః.

## 845 అమృతవపుః సర్వజ్ఞః

ఆయన అమృతవపుః, అంటే ఆయన మృతుడేమిటీ? తనలో ఉండే అమృతత్త్వశక్తి చేత తనే అమృతమైన శరీరాన్ని నిర్మాణం చేసుకున్నాడు భగవంతుడు. అదే విష్ణు రూపంగా చెప్తాం మనం. సమస్తమూ వ్యాపించిన వెలుగు రూపము అని అర్థం. అమృతవపు అంటే దానికి మృతత్త్వము లేదు. అది నీలో కూడా ఇందాక చెప్పినదృతిలో ఈ అమృతాంశము ఏదైతే ఉందో ఆ బిందువులు కనుక నీలో ఆవాహనం చేసుకుని అనుభూతి చెందితే నీ యందు కూడా అమృతత్త్వ శరీరము, అవ్యయ శరీరము 'చేరి కాంక్షించు వారికి అవ్యయ దేహమిచ్చును ఎవ్వాడి కరుణ' అని చెప్పి మనకి భాగవతంలో ఓ పద్యం ఉంది. అమృత శరీరం కావాలనుకుంటే ఈ అమృతాంశము అనే, అమృతమనే కిరణములు నీలోకి ఆవాహన చేసుకునే పద్ధతి ఉన్నది ధ్యానం చేసుకోవడంలో. అలా చేసుకుంటే నీలో ఆ శరీరం ఉద్భవిస్తుంది. ఆ శరీరం నీలో ఉద్భవిస్తే, ఈ శరీరం వదిలేసినా నువ్వు ఉంటావు. అది ఏర్పరచుకోవడం కోసమే యోగం. అది ఈ శరీరంలోనే జరుగుతుంది. కాబట్టి 'మానవ శరీరంలో ఉండగానే దీన్ని సాధించుకో' అని చెప్పారు. ముక్తి అంటే అదే. ముక్తి అంటే ఎక్కడో ఆకాశంలో అట్లా నీలమైపోయి ఉండిపోవడం అని కాదు ఏ పనులు చేయకుండా. సృష్టిలో ఉంటూ, సృష్టి అనుభూతి చెందుతూ, తాను శాశ్వతుడని, తాను అక్షరుడని, తాను భగవంతుని యొక్క ప్రతీకయని కాబట్టి ప్రతినిధిగా పనిచేస్తూ ఉంటాడు సృష్టి ఉన్నంతకాలం. సృష్టి అయిపోయినప్పుడు ప్రళయంలోకి వెళ్ళినప్పుడు వాడితో పాటు తాను ఆయనలోకి వెళ్ళిపోతాడు. మళ్ళీ దిగి వచ్చినప్పుడు తెలిసి దిగి వస్తాడు. చిరంజీవులు అంతా అటువంటి వాళ్ళు. మనమెరిగిన పరమ గురువులందరూ కూడా అటువంటి దివ్య శరీరాలను ధరించి ఉన్నవాళ్ళు. వాళ్ళు భౌతికమైన శరీరంలోకి దిగివచ్చినా అంతకు ముందు జన్మలో తామెవరో తమకు తెలిసి ఉంటుంది. అందుకని ఈ శరీరం ఏర్పరుచుకోవాలి మనం. అది సహజంగా మనలో లేదు. పాంచ భౌతికమైన శరీరంలో ఈ ఆకాశశరీరం ఇమిడి ఉన్నది. ఆ ఇమిడి ఉన్న దాన్ని మనం ఏర్పరచుకోవాలి. అంటే పాలలో వెన్న ఎట్లా ఇమిడి ఉన్నదో, చిలుక్కుంటే మాత్రమే ఎట్లా వెన్న బయటికి వస్తుందో, లేకపోతే బయటికి రాదో అలా. ఉన్నది గానీ ఇమిడి

ఉన్నది కదా! పాలలో వెన్న ఎక్కడుంది? ఇమిడి ఉన్నది. ఈ ఇమిడి ఉన్నది బయటికి తీసుకోవడం వల్ల అదే పాలలో తేలుతుంది. తాను వేరుగా ఏర్పడింది కదా! అలాగే ఇదే శరీరంలోంచి ఏర్పడి వేరుగా ఉంటుంది ఈ శరీరం కన్నా అది. పాలు అయిపోయినా వెన్న ఉన్నట్టుగా, ఈ శరీరం అయిపోయినా అది ఉంటుంది. అదీ వాడికి కావాలి, అందుకు వెన్న తినడం. కృష్ణుడు వెన్న తిన్నాట్ట అంటే అర్థమేమిటయ్యా అంటే ఇట్లా అమృతత్త్వశరీరములుగా తయారైన వాళ్ళు, దివ్య శరీరధారులు సృష్టిలో scouts గా recruit చేసుకోవడానికి పనికి వస్తారని. బండగా ఉండే చెట్టులోంచి వచ్చే కోమలమైన పువ్వుగా, ఇంత బండ శరీరంలోంచి అంత కోమలమైన శరీరం ఉత్పన్నం అవుతుంది. సాధన ద్వారానే ఉత్పన్నం అవుతుంది. ఇంకో రకంగా ఉత్పన్నం అవదు. సాధన చెయ్యకపోతే రాదంటే రాదు! నిస్సందేహంగా రాదు! చిలక్కపోతే వెన్న రాదా? అని అడిగినట్టు ఉంటుంది. పెంచకపోతే పువ్వు రాదా? రాదు. పెంచకపోతే ఫలం రాదా? రాదు. ఫలానికీనూ చెట్టుకీ మనం సున్నితంలో పోల్చి చూస్తే చెట్టు ఎంత మందంగా ఉంటుంది, ఫలం ఎంత సున్నితంగా ఉంటుంది! పువ్వు ఎంత సున్నితంగా ఉంటుంది చెట్టు ఎంత ముదురుగా ఉంటుంది! అట్లాగే నీ దివ్య శరీరం కూడా అంత సున్నితంగా ఉంటుంది. ఎంత సున్నితంగా ఉంటుందంటే నీ కనుగుడ్లు చేసిన fibre ఏది ఉందో, అది ఎంత transparent నీకు? ఇది ఉన్నదే అంత సున్నితంగానూ శరీరం ఉంటుంది. దాని నిర్మాణం చేసుకోవాలి. చేసుకుంటే ఇది ఉన్నప్పుడే అది తయారవుతుంది. పాలు లేకపోతే వెన్న చేయలేం. శరీరం లేకపోతే దివ్యశరీరం నిర్మాణం చేయలేం. దివ్యశరీరం నిర్మాణం చేసుకోవడానికి ఏకైకమైన మార్గము, మన మహర్షులు కనిపెట్టి మనకిచ్చినది యోగ మార్గము. ఇంకెక్కడా లేదు ప్రపంచంలో. దాని పరమావధి కూడా ప్రత్యాహార స్థితిలో దీన్ని పొందుతాడు ప్రతివాడూనూ. పొంది తాను ఈ శరీరం కాదు అని తెలుస్తుంది. ఎప్పుడు తెలుస్తుంది అంటే తాను వెలుగు శరీరము అయినప్పుడు, ఈ మందమైన శరీరము తను కాదు అని. తాను పూవుగా విచ్చుకున్నప్పుడు ఇంత బండ చెట్టులో నేను ఇన్నాళ్ళు ఉన్నానా, అన్నట్టుగానే. ఇంత బండ శరీరంలో మనం ఉన్నాం, సరేలే అది మన ఇల్లు అనుకుంటాడు. ఇల్లు మనం కాదు కదా! అట్లాగే ఈ బొమికలు, రక్తము, మాంసము అనే ఇల్లు

కూడా మనం కాదు. దీంట్లో మనం సూక్ష్మంగా ఉన్నాం. ఈ పెద్ద ఇంటిలో మనం ఎట్లా ఉంటామో ఇప్పుడు, ఈ భౌతికమైన శరీరంలో కూడా అట్లా ఉంటున్నాము అని తెలిసి, దీంట్లో ఎట్లా మనం ఉండి పనులు చేసుకుంటున్నామో మామూలు ఇంట్లో, ఈ ఇంట్లో కూడా అట్లా ఉండి, ఇప్పుడు ఉన్న ఇంట్లో నుండి ఎట్లా బయటికి వెళ్ళి పని చేసుకుంటున్నామో, అట్లాగే ఈ ఒంట్లోంచి కూడా బయటికి వెళ్ళి పనులు చేసుకుని మళ్ళీ ఇందులోకొచ్చి ఉండి పోతుంటాడు. అందుకనే సిద్ధుడైన వాడి శరీరం అక్కడుంటే, అక్కడే ఉన్నాడు  అతడు అనుకోవడానికి వీల్లేదు. శరీరము అక్కడే ఉంటుంది. ఎక్కడెక్కడికో వెళ్ళి వస్తూ ఉంటాడు. ఏవేవో చేస్తూ ఉంటాడు. ఏమిటి చేస్తూ ఉంటాడు? దైవసంకల్పంగా తన కార్యాలు నిర్వర్తిస్తూ ఉంటాడు. పని అయిపోయిన తర్వాత మనం ఇంటికి వచ్చినట్టే, ఆయన శరీరంలోకి వస్తాడు. అందుకనే రాత్రి వాడికి పగలు. యోగికి రాత్రి పగలంటే  ఒక విశేషమైన అర్థం  ఉన్నది. ఒకటి ముందు సాధకుడికి రాత్రిపూట జరిగిన సాధన పగలుపూట జరగదు. అందుకని రాత్రి శరీరానికి విశ్రాంతి ఇచ్చి, జీవుడుగా సాధన చేసుకుంటూ ఉంటారు. అంతర్యాగము అనేది ఈ పగలు జరగదు. ఎందుకంటే బహిర్యాగంలో నిమగ్నుడై ఉంటాడు. కర్తవ్యాలు పీకుతూ ఉంటాయి. ఏమీ లేకపోతే telephones వస్తూ ఉంటాయి. కదా! ఆ రాత్రిపూటో? ఎవ్వరూ నీకు అంతరాయం కలిగించలేరు. Disturbance అంటే అంతరాయం.  అంతరాయం కలిగించని స్థితిలో ఈ అంతర్యాగం చేసుకుంటూ ఉండడానికి రాత్రి చాలా వినియోగపడుతుంది యోగసాధకుడికి. యోగికి అదే రాత్రి దివ్యమైన కార్యక్రమాలు దివ్య శరీరంతో నిర్వర్తించుకుంటూ ఉంటాడు. అందుకని అమృతాంశుః, అమృతవపుః. ఈ అమృతమైన శరీరమే దేవతలందరికీ ఉన్నది. మనకి కనిపించేది ఆ వెలుగు శరీరములే. ఈ వెలుగు శరీరాలన్నీ ఎక్కడి నుండి పుట్టినాయి? 'అసలు' వెలుగు శరీరంలోంచి పుట్టుకొచ్చినాయి. ఆయన విశ్వమంతా వ్యాపించిన వెలుగు శరీరము. అందుకని అక్కడికక్కడ సాన్నిధ్యాన్ని ఇవ్వగలిగిన స్థితి ఉన్నది.

సర్వజ్ఞః అంటే సర్వము, సమస్తమూ తెలిసిఉన్నవాడు అని. సమస్తమూ తెలిసి ఉన్నది మనకి భగవంతుడి విషయంలో సత్యమే అని చెప్పడానికి పెద్ద విశేషమేం లేదు గానీ, కృష్ణుడు కూడా అట్లా ఉన్నాడు అని

చెప్పడం అనేది గొప్ప విషయం. 'సమస్తమూ తెలిసి ఉన్నది' వ్యాపించిన ప్రజ్ఞకి మాత్రమే తెలిసి ఉంటుంది విశ్వాత్మ చైతన్యంగా. ఎక్కడ, ఎవరు, ఏం చేస్తున్నారో, ఎప్పటికప్పుడు తెలిసిపోయేది ఒక్క విశ్వవ్యాప్తమైన అంతర్యామి ప్రజ్ఞకి మాత్రమే ఉంటుంది. అందుకనే గజేంద్రుడు పిలిస్తే పలికాడు అని ఉంటుంది భాగవతంలో. మిగతా దేవతలందరికీ కూడా విశ్వమయత లేదు.

విశ్వమయతలేమి వినియు నూరక యుండి రంబుజాసనాదు లడ్డబడక
విశ్వమయుడు విభుడు విష్ణుండు జిష్ణుండు భక్తి యుతున కడ్డపడ దలంచె

అంటే నువ్వు ఇక్కడ పిలిస్తే వాడికి వినపడకపోవడం అంటూ ఏం లేదు. ఎందుకంటే సమస్తమూ వ్యాపించి యున్నాడు కాబట్టి. మిగతా దేవతలందరూ కొన్ని కొన్ని పనుల్లో నిమగ్నమై ఉన్నారు. వాళ్ళ పనుల వరకూ, వాళ్ళ departmentల వరకూ వాళ్ళకి బాగా తెలుస్తూ ఉంటుంది. ఇప్పుడు ఒక సృష్టిలో ఆ departmentకు సంబంధించింది ఏం జరిగినా వాడికి తెలిసిపోతూ ఉంటుంది. ఇప్పుడు యముడున్నాడనుకోండి ఎవడ్ని తీసేయాలి బయటికి అనేది ఆయన కార్యక్రమం మొత్తం. దానికి సంబంధించినంత వరకూ ఆయనకేం ఏమరుపాటు ఉండదు. మనమేదో ప్రార్థన చేస్తుంటే యముడికేం సంబంధం లేదు. కదా! యముడు గురించి ప్రార్థనలు చేస్తే వినచ్చు. ఇక ఆ గజేంద్రుడు ఏం చేశాడయ్యా అంటే 'నాకు ఎవడో తెలియదు. వీడు వాడు అని తెలియదు. ఈ మొత్తానికి ఎవడున్నాడో వాడు' అని చెప్పాడు. 'ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలో' ఆ పద్యాలు అన్నీ కూడా అంతర్యామిని ఉద్దేశించి, మొత్తం విశ్వాన్నంతా పరిపాలిస్తున్న ఏ తత్త్వమైతే ఉందో దాని గురించి, ఉద్దేశించి గజేంద్రుడు ప్రార్థన చేశాడు. అది కారణం చేత విశ్వమంతా వ్యాపించిన ప్రజ్ఞ మాత్రమే దానికి పలకగలదు. ఎవరి departmentలో వాళ్ళు ఉన్నారు. మన department కాదనుకుకున్నాడు ప్రతివాడూనూ. అందుకని బ్రహ్మ పలకలేదు. త్రిమూర్తులలో బ్రహ్మ అనుకోండి, త్రిమూర్తులలో రుద్రుడనుకోండి, ఈయన వచ్చాడని ఉంటుంది. అలాగే శ్రీకృష్ణుడు కూడా ఎక్కడ ఉన్నా ఎప్పుడు, ఎక్కడ, ఏం జరుగుతుందో చూసేస్తూ ఉండేవాడు. సర్వజ్ఞుడు. తెలియంది లేదు. కొన్ని కొన్ని అవతారాల్లో కొన్ని కొన్నే తెలుస్తాయి. కొన్ని కొన్ని తెలియవు. మహాత్ములు ఉన్నారనుకోండి కొన్ని కొన్ని తెలుస్తాయి, కొన్ని కొన్ని తెలియవు. కామ విద్య తెలియలేదుట శంకరాచార్యుల వారికి. అందుకని

ప్రత్యేకంగా పరకాయ ప్రవేశం చేసి తెలుసుకున్నాడు. యుద్ధవిద్య అడిగారు అనుకోండి తెలియకపోవచ్చు, శంకరాచార్యుల వారికి. ఆయనకి దాంతో సంబంధం లేదు. ఆయన వచ్చిన పని అది కాదు. శ్రీకృష్ణునికి తెలియనిది లేదు. మిగతా అవతారాలన్నీ కూడా కొన్నిటియందు విపరీతమైన ప్రావీణ్యం అప్పుడు ఉండే దాన్ని బట్టి ఉంది. శ్రీకృష్ణుడు విషయంలో తెలియని విద్యలు లేవు. 64 విద్యలు పట్టీ ఇస్తారు భాగవతంలో చూసుకుంటే దశమ స్కంధంలో. ఈ 64 విద్యలు ఊరికే ఏకసంధాగ్రాహిలాగా సాందీపని చెప్తూ ఉంటే మొత్తం అంతా వినేసి నేర్చిందే! వినంగానే అయిపోయింది చదువుకోవడం. ఎందుకనిటా? 'గురుముఖతః గానే విద్య రాణించును' అనే సాంప్రదాయాన్ని గౌరవించడం కోసం మాత్రమే. తనకి తెలిసినప్పటికీ కూడా ఇంకోడు కూడా తనలాగా తయారైతే? ఎప్పుడూ కృష్ణుడు ఒకటే చూసుకున్నాడు. మనం చేసిందే ఇంకోడు చేస్తాడు కాబట్టి మనం చేసే దాంట్లో ఒక direction కూడా ఉండాలి అన్న ఉద్దేశంతో చేశాడు. 'యద్యదాచరతి శ్రేష్ఠః' అని చెప్తాడు. పెద్దలేది ఆచరించారో చిన్నవాళ్ళు అదే ఆచరిస్తారు కాబట్టి, నేను ఆచరించి చూపిస్తున్నానని అందరికీ కాళ్ళకి దండం పెట్టాడు. దేవుడు అయితే కాళ్ళకి మొక్కక్కర్లేదు కదండీ! దేవుడై కాళ్ళకి మొక్కినవాడు. అంటే ఏ విద్య అయినా మీరు తీసుకున్నా ఆ విద్యలో ఆయన దిట్ట. విలువిద్య-విలువిద్య తెలుసు. మల్లవిద్య-మల్లవిద్య తెలుసు. ఒకడికి విలువిద్య వచ్చు. ఒకడికి మల్లవిద్య వచ్చు. వాళ్ళిద్దరికీ చాలా పేరు ప్రతిష్ఠలు వచ్చేసాయి. ఒకడు అర్జునుడు, ఇంకోడు భీముడు. ఈయన ఎంత మల్లవిద్య ఉన్నవాడూ? 11 ఏళ్ళ వయసులో అప్పటి champions ని కొట్టి పారేశాడు కదా! ఎంత విలువిద్య వచ్చినటువంటి వాడూ? ఎటువంటి వాళ్ళతో యుద్ధం చేశాడు! లోకాతీతమైన శక్తులతో కూడా యుద్ధం చేశాడు. వీళ్ళంతా భూమ్మీద యుద్ధం చేసిన వాళ్ళే! ఏ విద్య లేదు? ప్రణయం దగ్గర నుంచీ అన్నీ ఉన్నాయి. ప్రణయ విద్య ఎవ్వరూ అంత చూపించలా. మనకెందుకనో దానిమీద సరియైన అవగాహన లేక కొంచెం కృష్ణుడు గురించి ఏదో చెప్తూ ఉంటే కొద్దిగా మొహం చాటేసుకుంటూ ఉంటాం. అక్కర్లా! దాంట్లోంచి కూడా, మీరు ఏది చూపించండి అందులో 70 mm అండీ! ప్రతి దాంట్లో. కొన్నిట్లో 35 mm, కొన్నిట్లో 70 mm, కొన్నిట్లో 16 mm, ఇదేం లేదు. మీరేం చెప్తే దాంట్లో 70 mm! అది భీష్ముడు చూశాడు. ఎందుకంటే భీష్ముడు

అంతటివాడు. ఆయనలో అన్నీ పండలా. ఆయనా అష్టమగర్భమే అయినప్పటికీ కూడా అన్ని విద్యలు తను నేర్చుకున్నా కూడా! పైగా భీష్ముడు ఏం చేశాడు? దివ్యమైన వారి దగ్గర సమస్తమైన విద్యలూ నేర్చుకున్నాడు, గంగాదేవి తల్లి అవడంవల్ల. నేర్చుకుని అన్ని శిక్షణలయందు నిష్ణాతుడు అనప్పటికీ, అష్టమగర్భంలో పుట్టినప్పటికీ పురాణ పురుషుడు కాదు. సర్వజ్ఞుడు కాదు. అలా అని జ్ఞానం తక్కువ లేదు ఆయనకి. ఆయనకి తెలియని విషయం కూడా లేదు. మొత్తం అక్కడ ఉన్న వాళ్ళలో, సమకాలికుల్లో, శ్రీకృష్ణుడు దైవము అని పూర్ణముగా తెలిసినవాడు భీష్ముడు ఒక్కడే. పాండవులు కూడా అంతంత మాత్రమే. కాస్తో కూస్తో ధర్మరాజు లెక్కేసుకోవాలి తప్ప, ఇంకెవరికీ అంత తెలియదు. ఆపదలు వచ్చినప్పుడు వేడుకోవడమే తప్ప మిగతావాళ్ళు. ఇతడు పురాణ పురుషుడు, సమస్తమూ ఇతని అధీనంలో ఉన్నది, ఇతనికి తెలియందేం లేదు, ఇతడే నడిపిస్తున్నాడు సమస్తమూ అని తెలిసినవాడు కాబట్టే, ఆ రాజసూయము అయిన తరువాత అగ్రతాంబూలం అతనికి ఇప్పిస్తాడు. భీష్ముడు ఇప్పిస్తాడు. అప్పుడు అందరూ ఏం చేశారు actualగా? శ్రేష్ఠమైన పురుషుడు ఎవరు అని నిర్ణయం చేయాలంటే అందరూ కలిసి, రాజులు, బ్రాహ్మణులు, వచ్చిన ఋషులు, సాధువులు సమస్తమూ కలిసి భీష్ముడు అన్నారు కదా! అటువంటి భీష్ముడు ఏం చేశాడు? 'నేను కాదు. కనపడ్డం లేదు కానీ ఆయనా! ఆయన పూర్ణ పురుషుడు. తరువాతే నేను' అని చెప్పాడు. జీవితంలో అటువంటి పూర్ణత్వాన్ని అన్ని రంగాల్లోనూ చూపించాడు ఆయన. సమస్తమూ తెలిసినవాడు కాబట్టే ఎక్కడో యుద్ధం చేస్తే ఇక్కడ చీరలు supply చేశాడు. ఎక్కడో ద్రౌపది పిలిస్తే అట్లా వచ్చి ప్రత్యక్షమై, దుర్వాసుని ఆపద నుండి రక్షించాడు. తెలిసినవాడు కాబట్టే అర్జునుడు అట్లా పక్కకి తీసుకెళ్ళి పోతుంటే, అభిమన్యుడు పోతాడని తెలియకపోవడం ఏం లేదు. తెలుసు. ఇన్ని తెలిసినవాడు అది తెలీదండీ! కానీ మిగతా లోకాల్లో వీటికి సంబంధించిన కథ ఒకటి ఉంది. ఎవరి చేతా అపజయం పొందని ఒక వీరుడ్ని ప్రసాదించమని శివుడ్ని గురించి తపస్సు చేస్తాడు అర్జునుడు. తపస్సు చేస్తే సోమలోకం నుంచి ఓ ప్రజ్ఞ వంక చూస్తాడు. 'ఏరా వెళ్తావా' అని. 'మహానుభావా నన్ను అడగద్దు' అంటాడు. అంతవెలుగు లోకాల్లో ఉండేవాళ్ళు ఈ భూలోకంలోకి రావడానికి సమ్మతించరు. భూలోకంలోకి రావడం అంటే ఎట్లా ఉంటుందంటే మంచి విశాలమైన 5 star

hotel లోంచి మన railway latrine లోకి వచ్చినట్టు ఉంటుంది. అంటే మన ఇంట్లో latrine లే కష్టం. Railway latrine ఎట్లా ఉంటుంది? వెళ్ళగలమా? అక్కడ ఉండమంటే ఉంటారండీ వీళ్ళు? ఉండరు! రకరకాల దుర్గంధములతో కూడిన ఏడు మెట్లు దిగాలి వాడు. దిగి రావాలి. 'మరి వాళ్ళు అడుగుతున్నారురా నేను ఇవ్వాలి కదా' అంటే, ఆ దిగివచ్చే ఆయన ఏమన్నాడంటే 'నన్ను ఎక్కువ రోజులు ఉంచక' అని. 'ఎన్ని రోజులు?' అంటే 'నువ్వే ఆలోచించు నా మీద నీకు ఉండే కరుణబట్టి' అన్నాడట. 16 సంవత్సరాలు 16 రోజుల కింద లెక్క వాళ్ళకి. '16 రోజులేరా వెళ్ళమన్నాడు'. అది భూమ్మీద కొస్తే 16 సంవత్సరాలు అయింది. అంతే. అక్కడ వాడి మాట చెల్లించాలి కాబట్టి వీడిని ఇక్కడ account నుంచి తీసెయ్యాలి కాబట్టి, శుభ్రంగా అర్జునుడ్ని 'వాడటు పిలిస్తే ఆ.. పద పోదాం' అన్నాడు. అర్జునుడే, పిలిస్తే వెళ్ళాడు. 'ఇప్పుడేమైపోతాడురా ఈ ధర్మరాజు' అని చెప్తాడు. అయినా మన వాడికి రోషం. రోషం వల్ల పక్కదారి పడతాడు. పక్కదారి పడితే అభిమన్యుడు వెళ్ళిపోతాడు. వెళ్ళకపోతే ఎట్లా? Past account ఓటుంది. మనం ఏ కథ అయినా పూర్వాపరాలు తెలియకుండా మాట్లాడకూడదు. మనం ఏం చేస్తాం అంటే మన కథ కూడా పుట్టిన దగ్గర నుండీ ఇప్పటివరకు చూసుకుని 'నాకు చాలా అన్యాయం జరిగిపోతున్నది' అంటాం. అంతకు ముందు కథ నీకు చూపిస్తే గుండె పగిలి చస్తావు. అసలు ముందు మనకి జరిగింది వాళ్ళు flashback వేశారనుకోండీ! నువ్వు అవాక్కయిపోతావు. అంతేకాదు ఇంకా రాబోయేవి కూడా తెలుస్తాయి చూస్తే. అందుకని ఇది తెలిస్తే ఏడుస్తావు కాబట్టి తెలియకుండా కొంచెం కొంచెం, కొంచెం కొంచెం చేదు మందు ఇచ్చి రోగం నయం చేస్తారు. అందుకని సమస్తమూ తెలిసిన వాడు కాబట్టే యమలోకం నుండి చచ్చిపోయిన వాళ్ళని తీసుకొచ్చి ఇచ్చాడు. వరుణ లోకం నుంచీ తీసుకొచ్చి ఇచ్చాడు. ఇంద్రుడికి బుద్ధులు నేర్పాడు భూమి మీద ఉండి. బ్రహ్మకు బుద్ధులు నేర్పాడు. యోగము, శాస్త్రము, జ్ఞానము పేరున బాగా జుట్లు పట్టుకుంటున్న వాళ్ళందరికీ కూడా సవరు తీసేసి, శుభ్రంగా జడేసి ఇచ్చేశాడు భగవద్గీత పేరున. భగవద్గీత తామర తంపరగా చింతకాయలు కడతాయంటారే, జుట్టు సంస్కారం చేసుకోకుండా ఉంటే అట్లా జడలు పెరిగి భూమికి కూడా తగులుతాయి. దాన్ని దువ్వాలి అంటే ఎవడి పని అవదు. దువ్వెన్నలు విరిగిపోతాయి. భారతీయ వాఙ్మయం

శ్రీకృష్ణుడు వచ్చే సమయానికి అంత భయంకరంగా ఉంది. వెయ్యి మార్గాలు. వీడు చెప్పింది వాడు కాదంటాడు. వాడు చెప్పింది ఇంకోడు కాదంటాడు. ఇంకోడు చెప్పింది మరోడు కాదంటాడు. రకరకాలు రకరకాలుగా ఉన్నాయి. అవన్నీ తామర తంపరగా పెరిగిపోయినాయి. అవన్నీ, ఎలాగూ వచ్చాను కదా శుభ్రంగా చిక్కుతీసి జడేద్దాం అన్నట్టుగా, అన్నీ తీసి మొత్తం అంతా దేన్నీ కాదనకుండా, ఏ సిద్ధాంతాన్నీ కాదనకుండా అన్ని సిద్ధాంతాలు 'మొత్తం సత్యంలో' భాగం అని చూపించి, దాన్ని ఒక సోపానపటంగా ఏర్పాటు చేశాడు. అదీ భగవద్గీత! సర్వజ్ఞుడు. యుద్ధంలో సర్వజ్ఞుడు. కుటుంబిగా సర్వజ్ఞుడు. మానవుడిగా సర్వజ్ఞుడు. దైవాలని కూడా శాసించినవాడు. ఎన్ని రకాలుగా చూసుకున్నా కూడా నీవే సర్వజ్ఞుడవని చెప్తున్నాడు. మాటిమాటికి ఇది ఎందుకు అంటున్నాడు? అంతకుముందు సర్వవిత్ అని ఇప్పుడు మళ్ళీ సర్వజ్ఞః అంటాడు. అంతకుముందు సర్వజ్ఞ వస్తే మళ్ళీ ముందు కూడా సర్వజ్ఞే వస్తుంది. మధ్య మధ్యలో భీష్ముడికి, 'ఇంకేం చెప్పమంటావు నీ గురించి అని చెప్పడానికి ఈ మాట వేసేస్తూ ఉంటాడు' అన్నమాట. అన్నీ నీకు తెలుసు అని ముందే అంటాడు, ఈ మాట. 'అన్నీ నీకు తెలిసి నా చేత చెప్పిస్తున్నావు' అని గొడవ చేస్తాడు. ఎందుకు చెప్పిస్తాడంటే భీష్ముడు ఎంతటి వాడో వీళ్ళెవరికీ తెలియదు. ఈ మనవలు అందరూ ఉన్నారు తప్ప, ఒక్కరికి భీష్ముడు అంటే అవగాహన లేదు. దుర్యోధనుడన్నాడు. ఎవరు పడితే వాళ్ళు ఏది పడితే వాళ్ళ అభిప్రాయాలు ఉన్నాయి భీష్ముడు గురించి. అన్నిటికీ మించి ఈయన యోగి కాదని, జ్ఞాని కాదని ఇలా అభిప్రాయాలు ఉన్నాయి. అందుకని భారతంలో శాంతి, అనుశాసన పర్వాల్లో భీష్ముడికి వచ్చినదంతా చెప్పించేసి భీష్ముడు ఎంతటి వాడో ప్రపంచానికి శాశ్వతంగా తెలిసేట్టుగా చేశాడు. 'నాకు తెలుసనుకో నువ్వు చెప్పు' అన్నాడు. 'నువ్వు చెప్తే బావుంటుంది' అన్నాడు. ఎందుకు బావుంటుంది? ఆయన చెప్తే బావుండదా? ఎవరికి బావుంటుంది? చెప్తే కృష్ణుడికి బావుంటుంది. చెప్తే భీష్ముడికి బావుటుంది. ఉత్తరోత్తరా యశోశరీరం అట్లా భూమ్మీద ఉంటుంది. భీష్ముడు ఎంత జ్ఞానో తెలియాలి అంటే శాంతి, అనుశాసన పర్వాలు చదువుకోవాలి. అడగంది లేదు ధర్మరాజులే తెలియక అడిగాడా? ఒక్కసారి revision కోసం అడిగాడు. అందుకనే ఎక్కడన్నా దుర్భిక్షం అదీ జరుగుతూ ఉంటే, చాలా కష్టాలుగా ఉంటే శాంతిపర్వం చదువుకోమని చెప్తారు. వర్షాలు పడతాయి. సమృద్ధి

వస్తుంది. తుష్టి వస్తుంది. పుష్టి వస్తుంది. ఎందుకని? భీష్ముడు, ధర్మరాజుకి బోధించిన ధర్మం అంతా కూడా అందులో ఇమిడి ఉన్నది అని. ఇది ఎందుకు ఇట్లా పెట్టించాడు? వ్యాసుడు చేత పెట్టించాడు అట్లా. అంటే భగవంతుడికి భక్తుడి మీద ఎంత ఉంటుందో చూసుకోండి మమకారం.

## 846 సర్వతోముఖః

సర్వతోముఖః అంటే multi faceted అని అర్థం. కొన్ని కొన్ని అవతారాలు అనండి, కొంతమంది మహాత్ములు అనండి, కొంతమంది ఋషులు అనండి కొన్నిటికి వాళ్ళు పరాకాష్ఠ. అన్నిటికీ కాదు. ఇట్లా అన్నిటికీనూ. ఇహ దానికీ దీనికీ అని లేదు. మీరేం చెప్తే దానికి ఇక్కడ ఉంది. అట్లా ఎవరూ లేరు. అప్పటికీ లేరు, ఇప్పటికీ లేరు. శ్రీకృష్ణుడు చూపించిన సర్వతోముఖత్త్వం, అంత ప్రజ్ఞా పాటవములు ఎక్కడా గోచరించవు. చిన్నతనం నుండి చివరి వరకూ మనకి అవే కనిపిస్తూ ఉంటాయి. ఎక్కడ చూసినా విపరీతంగా కనిపిస్తాయి. ఈ dimension ఇందులో ఉందా అనిపిస్తుంది. రాజులకి రాజులకన్నా రాజు. క్షత్రియులకి వాళ్ళకన్నా మించిన క్షత్రియుడు. పామరులకు వాళ్ళతో సమానము, వాళ్ళలో శ్రేష్ఠుడయినవంటి పామరుడు. మళ్ళీ ఇంత క్షాత్రం, ఇంత పాండిత్యము, ఇంత జ్ఞానం, ఇంత యోగం ఉన్నవాడు చెట్టు కింద కూర్చుని చద్ది ముద్దలు విసిరేసుకోమనండి విసిరేసుకుంటారేమో! విసరలేరు కదా! చల్దులతో బంతులాడుకోవడం అనేది చేస్తాడండీ జ్ఞాని? చేయలేడు. ఎవడన్నా ఓ మంచి సుక్షత్రియుడిని పట్టుకొచ్చి, ఒరేయ్ ఆవులు తోలరా, అంటే తోలతాడా? అసలు ఊహించలేము. అంటే from the commonest of the common, to the most brilliant He is match to every facet. నీలో ఏది ఉంటే దానికి నేను అదే విషయంలో నీకు భూతద్దాన్ని, అంటాడు. ఎవడు ఏది అయితే దాంట్లో దానికి మించి అదే ఈయన. ఎప్పుడూ అవతలివాడిని బట్టి చూపించడమే తప్ప, తనది ఇది అంటూ ఏం పెట్టుకోలేదు. కొంతమంది వాడి దాంట్లో వాడు settle అయిపోతూ ఉంటాడు. క్షాత్రధర్మం ఉంటే వాడు క్షాత్రంలో బాగా స్థిరపడిపోతాడు. ఇంక మిగతావేవీ ఉండవు. జ్ఞాని జ్ఞానంలో స్థిరపడిపోతాడు. మిగతావేవీ ఉండవు. సంసారి సంసారంలో స్థిర పడిపోతాడు. మిగతావేవీ ఉండవు. గొడ్ల కాపరి గొడ్లూ, పశువూ, మేతా, పేడా, పిడకలూ వీటిలో ఉంటాడు. అంతకన్నా ఉండడు కదా! మరి పిడకలు వేసుకునే వాళ్ళ దగ్గర నుండీ, సృష్టి నిర్మాణం చేసే బ్రహ్మ వరకూ, ఎవరితో అయినా సరే వాళ్ళ కన్నా ఓ మెట్టు పైన కనిపించాడండీ! అందుకని అతడిని ఎంత శ్లాఘించినా పరిపూర్తి ఉండదు. పరితుష్టి ఉండదు. అందుకనే

సూతుడు గోల పెట్టాడు 'నన్ను చెప్పమంటారు, ఏం చెప్పను నేను? ఎంత అని చెప్పితే అయ్యేను? ఏదో చెప్పకుందాం పదండి, మీ ఓపిక ఉన్నంతవరకు విందురు గాని, నా ఓపిక ఉన్నంతవరకు చెప్తాను' అని ఏదో 12 అధ్యాయాలు చెప్పకున్నాడు. అంతేనా? ముందే చెప్పాడు 'ఇదంతా చెప్పట్లేదు కొంత చెప్పకుంటున్నాం' అని. ఎక్కడెక్కడి విషయాలు మనకు అసలు బొత్తిగా అవగాహనే కాని విషయాలు. అట్లా ఉండచ్చా? ఉండగలమా? అతి సామాన్యుడితో సామాన్యంగా ఉండి, పృథ్వికి చక్రవర్తులు అయిన వాళ్ళతో వాళ్ళను మించి ఉండడం అయ్యే పని కాదు. ఎవరు కనపడితే వాళ్ళతో, నారదుడు కనపడితే మహర్షి అయిపోతాడు. కుచేలుడు కనపడితే స్నేహితుడు అయిపోతాడు. ఎటువంటి స్నేహితుడవుతాడు? ఏదో ఆషామాషీ కాదు. భార్యలు కనపడితే ఇంతకన్నా మగాడు లేడు అన్నట్టుగా కనిపించేవాడు. అందుకనే చచ్చిపోయే వాళ్ళు వాళ్ళందరూ. గోపాలురు కనపడితే అట్లా. తన్నే సర్వాంతర్యామిగా దర్శనం చేసేవాళ్ళు, వాడొస్తే వాడి హృదయంలో దర్శనం. ఇహ వాడెళ్ళిపోవచ్చు వీడి కోసం తిరగక్కర్లా. అక్కడే లోపలే. ఆత్మారాములై క్రీడిస్తూనే ఉంటారుట ఆ గోపికలు, గోపకులును. ఏది? యోగం చూడబోతే విపరీతమైన యోగం ఉంది. జ్ఞానం చూడబోతే విపరీతమైన జ్ఞానం ఉన్నది. శూరత్వం చూడబోతే విపరీతమైన శూరత్వం. ఎంత శూరత్వం అంటే వీళ్ళందరినీ క్షణంలో తీసి పక్కన పారేయచ్చు, పాండవులు ముందే ప్రతిజ్ఞలు చేయకపోయి ఉంటే. ప్రతివాడూ ప్రతిజ్ఞ చేశాడు. అందుకని ఆగాల్సి వచ్చింది. ఇట్లా రకరకాలుగా, రకరకాలుగా ఎన్ని చూశాడో భీష్ముడు. పుట్టిన దగ్గర నుంచీ తను మరణించేంతవరకూ చూశాడు కృష్ణుడ్ని. అంటే ఎంత ఆరాధన చేసి ఉండాలి కృష్ణుడ్ని భీష్ముడు! అందుకని ఇన్ని చెప్పాడు ఆయన గురించి. చెప్పి అదే ఇదిగా వచ్చేస్తుంది, అని చెప్పాడు. నేను 'సర్వతోముఖమైన ప్రజ్ఞ భగవంతుడు' అని అనడంలో పెద్ద రుచేం లేదు కానీ కృష్ణుడ్ని ఉద్దేశించి చెప్పడంలో మనం ఎంత అయినా చెప్పకోవచ్చు.

## 847 సులభః

సులభముగా దక్కేవాడు. లభము అంటే దక్కడం. సులభము అంటే అప్రయత్నముగా, సునాయాసముగా లభించేవాడు అని అర్థం. ఇదివరకు నామాలలో దుర్లభః అని వచ్చింది. ఇక్కడ సులభః వచ్చింది. అంటే కొంతమందికి దుర్లభుడు, కొంతమందికి సులభుడు. ధర్మాన్ని అనుసరించి జ్ఞానవంతుడైనా, వినయవంతుడైన వాడికి సులభుడు. చాలామంది ధర్మాన్ని అనుసరిస్తారు, జ్ఞానాన్ని కలిగి ఉంటారు. కానీ వినయం లేకుండా ఉంటారు. అది కారణంగా వారికి దుర్లభుడు. అక్రూరుడు, విదురుడు ఆ కోవలోకి వస్తారు. నాకు జ్ఞానం ఉన్నదనే భావన కలిగినప్పుడు, అహంకార ప్రవృత్తి ఎక్కువ అవడం చేత దుర్లభం గా వుంటాడు. జ్ఞానం తోపాటు వినయం కూడా వుంటే సులభంగా లభించే తత్త్వము, భగవంతుని తత్త్వములలో ఒకటి. తెలివితేటలతో మనం భగవంతుని పొందలేము. భగవంతుని జ్ఞానంతో అవగాహన చేసుకోవచ్చుగాని అనుభూతి పొందలేము. యోగము చేతకూడా అవగాహన చేసుకోవచ్చు, కానీ చిట్టచివరి మెట్టుగా నిరహంకార స్థితి లభ్యమైనప్పుడు మాత్రమే భగవంతుడు సులభుడవుతాడు. కొంతమంది సహజంగా నిరహంకారులై వుంటారు. కొంత మంది సహజంగా అహంకారులై వుంటారు. అహంకారికి ఎంత తెలిసినా, తనదైన దివ్యఅనుభూతిని అందచేయడు. ఇవి రకరకాల కథలుగా గ్రంథాలలో గోచరిస్తాయి. కొంతమందికి చాలా సులభంగా గోచరిస్తాడు. 'వీడికన్నా మనం ఎక్కువ సాధన చేస్తున్నాం కదా, వీడికన్నా మనకే ఎక్కువ తెలుసు కదా, వాడేం చేశాడు ?' అలాంటివి మనకి వుంటే, అలాంటి చోట కనపడడు. తన మానాన తన కర్తవ్యం నిర్వర్తించుకుంటూ, నిరహంకారుడై అంటే తన గురించిన భావము తగ్గిపోయినవాడికి భగవంతుని అస్తిత్వం గోచరిస్తుంది. తను ఉన్నాననే భావనతోనే అహంకారం వస్తుంది. తన గురించిన భావనలోనే ఉంటాడు కాబట్టి భగవంతుని గురించి ఆలోచించే అవకాశం వుండదు. అందుకని భగవంతుడు తన అస్తిత్వాన్ని గోచరింపచేయడు. భగవంతునితో మనస్సును నింపుకున్నవాడు తన గురించి ఆలోచించడు. తన గురించి భగవంతుని పేరున ఆలోచించేవాడు, తన గురించే ఆలోచించుకుంటున్నాడు కాబట్టి భగవంతుడు అక్కడ ఉండడానికి వీలులేదు.

Police- station లో ఒకే కుర్చీ వుంటుంది. SI వస్తే, Head కుర్చీ ఇస్తాడు. అలా seniors వస్తుంటే juniors కుర్చీ ఇస్తూ పోతూవుంటారు. అంటే అక్కడ కుర్చీలో ఒక్కరే కూర్చోవాలి. ఇద్దరు కూర్చోడానికి వీలులేదు. అలాగే భగవద్భక్తుడు కూడా భగవంతుని ఆరాధన చేసినపుడు భగవంతుని భావనలో ఉన్నప్పుడు తన గురించిన భావన తగ్గి వుంటుంది. ముందునుండే భగవద్విషయములలో కూడి వున్నా కూడా తన గురించి భావన వుందిటా అంటే తాను కరగక, గడ్డవలె వుండడంచేత అనుభూతికి అవకాశంలేదు. అనుభూతి తన్మయుడికి కలుగుతుందే తప్ప, అంటే తత్-మయం, అది తను అవ్వాలి. అహర్నిశలూ మనస్సులో ఆయన భావన చేసుకునేవాడు, సహజంగా తన గురించి మరచిన స్థితిలో వుంటాడు కాబట్టి, ఆస్థితిలో అతనికి భగవంతుని అనుభూతి కలుగుతుంది. భగవత్ కార్యములయందు కాని, భగవత్ సాధనయందు కానీ మన గురించి మనకు బాగా ఎక్కువగా గుర్తువుంటే మనం మోసగింపబడతాం. అప్పుడు బాగా దుర్లభుడు అయిపోతాడు. అందుకని జ్ఞానికి కొంత కష్టం అవుతుంది. భక్తుడికి కొంత సులభం అవుతుందని చెప్తారు. భక్తుడు సహజంగా భగవంతుని యందు అనురక్తి కలిగి, తన గురించిన భావన లేనివాడు. జ్ఞానికి భగవంతునితో బాటు తన గురించిన భావన వుంటుంది. తనింతటి వాడనీ, అంతటివాడనీ, ఇంత చేస్తున్నాననీ ఆలోచించుకుంటూంటాడు. భగవంతునితో తనకు కలిగిన సాధనపరమైన అనుబంధము గురించి ఆలోచించుకుంటూ ఉంటాడు. అలా ఆలోచిచుకుంటున్నంతసేపు భగవంతుడు ఉండడానికి అవకాశం దొరక్క దుర్లభుడు అవుతాడు. గోపికలకు సులభుడయ్యాడు. గోపికలు తామున్న స్థితి మరచి లోపలా, బయటా సమస్తమూ అతడే నిండి ఉన్నాడనే స్థితి వారికి సులభం అయ్యింది. మహర్షులకి తమని తాము మరచిన స్థితిలో సులభమయింది. యోగులకీ ఆ విధంగా సులభమయ్యింది. కానీ ఎప్పుడు తమ గురించి గుర్తు వస్తే అప్పుడాయన ఉండడానికి అవకాశం ఉండదు. అందుకని తనని తాను మరచినవాడు మాత్రమే భగవదనుభూతి పొందగలడు. భగవదనుభూతి పరిపూర్ణంగా పొందినపుడు తన గురించి తనకు జ్ఞప్తి ఉండదు. దీనికి రకరకాల ఉదాహరణలిస్తారు. మంచి రసవత్తరమైన ఘట్టం చూస్తున్నప్పుడు మనమున్నామని మనకు గుర్తు ఉండదు. కేవలం దానిని దర్శిస్తూ ఉండడమే ఉంటుంది. అలానే మంచి

సంగీతం వింటున్నప్పుడు, సంగీతం వింటున్నామనేది గుర్తుండదు. దాన్ని పూర్ణమైన అనుభవం అని అంటాము. సంగీతకచేరీలకు వెళ్ళినపుడు, సంగీతము యందు ఆసక్తి కలిగినవారికి సభ మొదలైనపుడు గాయకుడూ, వినేవాళ్ళూ, సంగీతమూ ఉంటాయి. క్రమశః కనులు మూసుకుని, సంగీతం వినడం జరుగుతుంది. వింటూంటే వినే సంగీతం, పాడే గాయకులు మాత్రం ఉంటారు. తను వింటున్నాడు అనే భావం ఉండదు. ఆ తరువాత గాయకుడు కూడా ఉండడు. గీతం మాత్రం వుంటుంది. పాడుతున్నవాడు, వినేవాడు గీతంలోకి ఆ విధంగా కరగడంచేత పూర్ణమైన సంగీతానుభూతి ఉంటుంది. అలాగే అప్పుడప్పుడు సినిమా చూస్తూంటే కూడా ఆ విధంగా తన్మయత్వం చెందుతాం. పుణ్యమైన స్వభావం కలిగిన వాళ్ళు సద్గ్రంథ పఠనం చేసినపుడు కూడా ఆ విధంగా తమని తాము మరచిన స్థితిలో వుంటారు. కొంతమంది అద్భుతమైన భగవంతుని విషయములు చెప్తుంటే తనువు మరచి, తమను మరచి వినేవారు వుంటారు చెప్పేవాడినిబట్టి, వినేవాడినిబట్టి. ఆ విధంగా సమస్తాన్ని మరచి కేవలం దైవమునకు సంబంధించిన భావంలోనే వుండడం ఎక్కడైతే జరుగుతుందో ఆయన అక్కడ సులభుడు. తన గురించిన భావన ఎంతసేపు వుంటే అంతసేపు మాత్రం భగవంతుని అనుభూతి వుండే అవకాశంలేదు. భాగవతంలో చెప్పిన తపస్సులన్నీ తరచి చూసినట్లైతే, భగవంతుడిలో తపస్సుద్వారా ఐక్యమైనవారిని భగవంతుడే మేలుకొలుపుతాడు. మేలుకొలిపితేనే, అతడికి స్ఫూర్తి వస్తుంది. తానున్నానని, తాను మాట్లాడాలని స్ఫూర్తి వస్తుంది. ఆ తరువాత అది ఆధారంగా భగవంతుడి ఆరాధన చేసుకోవడం జరుగుతుంది. మన గురించి మనం పూర్తిగా మరచిపోయి భగవంతుడు మాత్రమే గుర్తుండే స్థితిలో మనం కొత్తమనిషిగా పుట్టినట్లు లేదా ద్విజత్వం చెందినట్లు, లేదా తలమార్పిడి చెందినట్లు, లేదా ఆశ్రమం మార్చినట్లు. పూర్వాశ్రమం అంటారే పూర్వాశ్రమం వీడికి గుర్తువుండకూడదు. ఎవరైనా చెప్తే కానీ అలా వుండేది కదా అని వీడికి గుర్తురాదు. ప్రహ్లాదుడికి భగవతారాధన చేసుకుంటున్నప్పుడు ఎదురుగా పాయసం వుంటే పాయసం కనిపించేది కాదు. భగవంతుడు కనిపించేవాడు. 'ఎవరన్నా వచ్చి పాయసం తీసుకో' అని గుర్తుచేస్తే అప్పుడు అది పాయసంకదాని గుర్తువచ్చేది. అలా నిరహంకారులకి చుట్టూ వుండే ఆకారములు గోచరించవు. ప్రయత్నించి ఆకారములు

గోచరింపచేసుకోవాలి. అప్రయత్నంగా వారు భగవంతునియందే వుంటారు. కారణం ఏమంటే నేను, తాను అనే ప్రత్యేక ప్రజ్ఞ కలిగివుండకపోవడమే. ‘Serve until you forget that you are serving’ అని మాస్టర్ EK గారు చెప్పారు. నేను సేవచేస్తున్నానన్న భావన వున్నంతవరకు నువ్వూ వున్నావు, సేవా వున్నది. నేనెంతబాగా చేస్తున్నానో, నన్నెంతమంది గుర్తిస్తున్నారు, మెచ్చుకుంటున్నారు ఇలా వుంటుంది. సేవ రెండవ మెట్టుమీద, నీవు మొదటి మెట్టుమీదా వుంటావు. ‘Self-forgetfulness in service’ అన్నారు జ్వాలాకూల్. ‘నిన్ను నీవు మరచి చేసినపుడు సేవ నీకు ఆనందం ఇస్తుంది తప్ప, నీ అలుపు, సొలుపు, శ్రమ నీకు బాగా గుర్తుంటే నీకు మిగిలేది దుఃఖమే’ అని చెప్తారు పరమ గురువులు. భగవదనుభూతి మనకు పూర్తిగా వుండాలంటే చేసే పనిలో పరిపూర్ణంగా జీవించి వుండడానికి మనం ప్రయత్నం చేయాలి. దానినే అశ్వవిద్యగా చెప్పుకుంటాం. అంటే భవిష్యత్తునందుకానీ, భూతమునందుగానీ జీవించక కేవలం వర్తమానం యందు మాత్రము జీవిస్తూ, ఏ పని చేస్తున్నామో ఆ పనిలో పరిపూర్ణంగా మనం నిమగ్నమైవుండీ, తను చేస్తున్నానన్న భావన కూడా కరిగి పోయి వుండాలి. ఒక్కోసారి కొన్ని పనులు మనం చేస్తున్నప్పుడు, మనకి ఆ పనిమీద వుండే శ్రద్ధ కారణంగా, మనం ఆ పని చేస్తున్నాం అని గుర్తులేకనే చేయడం జరుగుతుంది. తర్వాత వెనక్కి తిరిగి చూస్తే ‘మనం ఇంతసేపు ఈపని చేశామా?’ అనిపిస్తుంది. కారణం, చేస్తున్నాం అన్న భావన లేకపోవడం. అలాగే చదువుకునేవాళ్ళు కూడా, చదువుకునే విషయం లో పరిపూర్ణమైన శ్రద్ధ వున్నప్పుడు అందులో వుండే భావం తనయందు పూర్తిగా అవతరణ చెందటంచేత అతడికి పరిపూర్ణ అవగాహన వస్తుంది. పూర్ణుడు అవడానికి అవకాశం ఏర్పడుతుంది. ఈవిధంగా భగవంతుడు సులభసాధ్యుడు. నీవుగా వుండి అతడి గురించి తెలుసుకుందాం అనుకున్నంతసేపు ‘గురించి తెలుసుకోవడం’ వుంటుంది తప్ప, అనుభూతి వుండే అవకాశం లేదు. ఇది ఒక రహస్యం. దానిని పెద్దలు ఆచరిస్తున్నప్పుడు చూసి ఆవిధంగా ఆచరించడానికి ప్రయత్నం చేయాలి. విసుగు, విరామము, మన గురించిన భావము మనస్సులో ఉండి చేస్తున్నంతకాలము ఏ రకమైన అనుభూతి కలగడానికి అవకాశం లేదు. భగవంతుని అనుభూతి మనకు సులభంగా దక్కాలంటే, చేస్తున్న పనిలో పరిపూర్ణంగా భగవంతుడే ఈ పని రూపంలో

వున్నాడని భావన చేసి, ఆ పనికి మనం పరిపూర్ణంగా సమర్పణచెంది చేయడంలో మనల్ని మనం పూర్తిగా మరచిపోతే అది కారణంచేత మనకు మిగిలేది అనుభూతి! అలా కాకపోతే రోజూ చేసే పని చాకిరీగా మాత్రమే మిగిలిపోతుంది. అందుకే ప్రతినిత్యమూ సర్వకాలములయందూ, సర్వదేశములయందూ మనకు అందుబాటులో వుండే భగవంతుడ్ని అందుకోలేకపోవడానికి కారణం ఏమిటయ్యా అంటే మన గురించిన భావన వుండి, మనం పనిచేయడం వలన. అలా కాకుండా శ్రద్ధతో, భక్తితో పని చేసినట్లైతే స్నానం చేయడం దగ్గర నుండి, ఊళ్లో చేయాల్సిన పనులవరకు అన్నిటియందు పరిపూర్ణమైన అనుభూతి చెందే అవకాశం వుంటుంది. ఆవిధంగా భగవంతుడు సులభుడు అవుతాడు.

## 848 సువ్రతః

సువ్రతః అంటే చక్కని వ్రతము కలిగినవాడు. సృష్టిధర్మములన్నీ ఎలా నడవాలో అప్పటికీ, ఇప్పటికీ అలాగే నడుస్తున్నాయి. అలా నడిచేవారియందు కూడా ఆయన గోచరిస్తూంటాడు. క్రమమైన శిక్షణ వున్నచోట భగవంతుడు మీకు అనుభూతినిస్తాడు. వ్రతము అంటే దీక్ష అని కూడా చెప్పవచ్చు. తను చేసే వ్రతములందు తప్ప ఇతర విషయములందు ఆసక్తి లేక చేసుకుంటూ వెళ్ళిపోతూ వుంటారు. వారు, వీరు అనే మాటలు పట్టించుకోకుండా, ఇతరులు చేసే విశ్లేషణం పట్టించుకోకుండా, తను మంచి అని నమ్మిన మార్గంలో, తను పనిచేసుకుంటూ దీక్షగా వెళ్తుంటే, ఆ మార్గంలో భగవద్దర్శనం అయ్యే వీలు వుంటుంది. ఆ దీక్షనే భగవంతుడిగా చెప్తున్నారు, ఎవరు ఏ విధమైన వ్రతం చేసుకుంటున్నా. వ్రతం అంటే తను చేసుకున్న ఒక మంచి సంకల్పం'. రకరకాల అడ్డాలు వస్తూంటాయి. వచ్చినా వాటిని అధిగమించి, తాను నిర్వర్తించుకుంటూండాలి. వారు, వీరు చెప్పినదానివల్ల మానకూడదు. మధ్య మధ్యలో ఎన్నోరకాల ఆటంకాలు వస్తుంటాయి. దానినే తపస్సులో అంతరాయాలుగా చెప్తుంటారు. మనం ఏమన్నా పని మొదలు పెడదామనుకుంటే చాలు, అంతరాయం! అదీ కాదంటే మధ్యలో అంతరాయాలు వస్తాయి. 'అలా కాదు, ఇట్లా చేయకూడదని' ఎవరో వచ్చి చెప్తారు. ఇట్లా కాదా అని, మనం సందేహంలో పడగానే వ్రతంలో/ పనిలో మనకి వుండే శ్రద్ధా, భక్తులు తగ్గుతాయి. అలా కాకుండా పెద్దలచే నీకు అందివ్వబడినది ఏదైనా దాన్ని పరిపూర్ణంగా అదే విధంగా నిర్వర్తించుకుంటూ వున్నట్లైతే దాని నుండి నీకు భగవంతుని అస్తిత్వం గోచరించడానికి అవకాశం వుంటుందని చెప్పడానికి సువ్రతః అన్నారు.

## 849 సిద్ధః

అంటే పరిపూర్ణత చెందిన మానవుడు అని అర్థం. The Perfect One అని చెప్పడానికి. శ్రీకృష్ణుడు పూర్ణ అవతారము. ఎక్కడా ఏ వంకా పెట్టడానికి లేదు కదా! సిద్ధత్వం ఎక్కడ ఉంటే భగవంతుడు అక్కడ ఉన్నట్లు గుర్తు పెట్టుకోవాలి. ఎవరు సిద్ధుడయ్యాడు? శత్రుజిత్, శత్రుతాపనః, సువ్రతుడు, సులభుడూ అయినవాడు, ఈ నాలుగు నామాలూ ఎవరియందు సత్యమో, వాళ్ళు సిద్ధులు. సిద్ధులకు కూడా ఈ నాలుగూ కళ్యాణగుణాలు వర్తిస్తాయని మనం అవగాహన చేసుకోవాలి. సులభముగా దొరికేవాడు ఒకటి. చక్కటి వ్రతం కలిగినవాడు రెండు. ఏదో ఒక వ్రతం అనుస్యూతంగా జరుగుతుంటుంది. అది సేవ కావచ్చూ, పూజ కావచ్చూ, ధ్యానం కావచ్చూ, ఏదైనా కావచ్చు. ఏదో ఒక వ్రతం ఖచ్చితంగా స్థిరపడి ఉంటుంది. ఎట్టి పరిస్థితిలోనూ ఆ వ్రతదీక్షలోంచి బయటకు రాడు. శత్రువులు అంతర్ముఖంగా ఉండరు. బహిర్ముఖంగా ఆయన్ని చూసి బాధపడేవారున్నారు. ఇట్లా నాలుగు రకాల qualities. అవి కృష్ణుడిలో కనిపిస్తాయి. సిద్ధుడని కృష్ణుడ్ని అనడంలో ఆశ్చర్యం లేదు. చాలా మంది సిద్ధులైనవారు ఉన్నారు. భాగవతమార్గంలో వశిష్ఠుడు, శుకుడు, వ్యాసుడు, ప్రహ్లాదుడు, అంబరీషుడు ఇలా చాలామందిని సిద్ధులుగా చెప్పకోవచ్చు. ఎట్టి పరిస్థితిలోనూ అవస్థితిచెందని వారు పూర్ణపురుషులని, సిద్ధులని చెప్పకోవచ్చు.

## 850, 851 శత్రుజిత్, శత్రుతాపనః

శత్రువులని జయించినవాడు. అంతః శత్రువులు, బహిః శత్రువులు అని రెండు రకాల శత్రువులుంటారు. బహిః శత్రువులని జయించడం ఎవరికి సులభం అంటే అంతః శత్రువులని జయించినవారికి మాత్రమే. మిగతావారికి అంత సులభం కాదు. ఏవో కొన్ని జయములు, కొన్ని అపజయములు వుంటాయి. శత్రుజిత్ అంటే అంతర్, బహిర్ లోకములలో ఎటువంటి శత్రువులూ లేక, తన స్వభావమునందు వాటిని జయించిన వాడు. వారికి శత్రువులు లేరు. వారిని శత్రువుగా చాలా మంది చూడవచ్చు. అందుకే ధర్మరాజుని ఎవరూ గెలవలేరని శ్రీకృష్ణుడు చెప్తాడు. కారణం ఏమంటే అతని హృదయమునందు వీడు మనకి శత్రువు అన్న భావన లేకపోవడం చేత. భగవత్తత్త్వంలో కూడా శత్రుత్వం వుండదు. శిక్షణము మాత్రమే వుంటుంది. ధర్మమును అతిక్రమించిన వారిని శిక్షించడం వుంటుంది తప్ప, అంతమాత్రం చేత శత్రుత్వం వహించడం వుండదు. ఎలాగైతే క్రమశిక్షణ లేని పిల్లలని తల్లి తండ్రులు దారిలో పెట్టడానికి చేసే ప్రయత్నంలో, ఆ పిల్లలు తల్లి తండ్రులకు శత్రువులు కారో, అదే విధంగా భగవత్తత్త్వంలో కూడా ఎవరిమీదా శత్రుత్వం వహించడం అనేదేమీ వుండదు. భగవత్తత్త్వంతో శత్రుత్వం వహించిన వారు వుండవచ్చు. వారికి ఆ శత్రుత్వం వలన అపజయం కలుగుతుంది తప్ప, శత్రుత్వం లేనివారికి అపజయం కలిగే అవకాశం లేదు. ఇక్కడ సమస్తమును జయించడం అని చెప్పిన చోట్ల, అన్నిటికన్నా ముఖ్యం అంతః శత్రువులను జయించడం. అంతః శత్రువులని ఎవరైతే జయించి వుంటారో, వారియందు భగవంతుని అస్తిత్వం పరిపూర్ణంగా గోచరిస్తుంది. వారందరూ శత్రుజిత్ అనే భగవన్నామానికి ప్రతీకలుగా భూమిమీద కనిపిస్తూ వుంటారు. వారియందు అన్ని రకములైన జీవులయందు జాతి, మత, దేశ బేధము లేక ఒకే తత్త్వము సమస్తమును ఆవరించి వున్నది కాబట్టి జరిగేదంతా కూడా దివ్యప్రణాళికలో భాగంగా జరుగుతోందనే భావనతో ఎవరియందూ శత్రుత్వము లేక, అది లేక పోవడం చేత సహజమైన మిత్రత్వం కలిగి వుంటారో, వారిని కూడా భగవంతుని యొక్క పూర్ణస్వరూపములుగా భావన చేసుకోవచ్చు. దాన్నే 'Universal Brotherhood' అంటారు. 'విశ్వమానవ సోదరత్వం' మానవులకే పరిమితం కాదు. అన్ని జీవుల యందు ఆ విధంగా దర్శనం

చేయవచ్చు. అలా దర్శించిన వాడికి అపజయం ఎక్కడా వుండదు. ఎప్పుడూ భగవంతుడియందే వుండే అవకాశం వుంటుంది. అది చూపించటానికే ప్రహ్లాదుడ్ని, హిరణ్యకశిపుడ్ని ఇచ్చారు. ఒకడేమో బహిర్ముఖంగా సమస్తాన్నీ జయించినవాడు, అంతర్ముఖంగా జయించనటువంటివాడు. రెండవవాడు- అంతర్ముఖంగా జయించినవాడు, బహిర్ముఖంగా ఏ విధమైన జయమును కోరనివాడు. వీరిద్దరిమధ్యా జరిగే కథే ప్రహ్లాదుడూ, హిరణ్యకశిపుడూ కథలో గోచరిస్తుంది. ఎన్ని రకాలుగా హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడ్ని జయించాలని ప్రయత్నం చేసినా, ప్రహ్లాదునికి అంతర్ముఖంగా శత్రువులు లేకపోవడం చేత, ఎన్ని రకాలుగా తండ్రి బాధలు పెట్టినా, లోపల తండ్రిని గూర్చి ఏ విధమైన దుర్భావన లేకపోవడం చేత ప్రహ్లాదుడ్ని నశింపచేయలేక పోయాడు హిరణ్యకశిపుడు. చిట్టచివరికి 'నీ రహస్యం ఏమిటీ?' అంటే 'ఏం లేదూ, నీలోపల శత్రు వులున్నారు, వాళ్ళని తీసేసుకుంటే నీవు కుడా నాలాగే వుంటావు' అని చెప్తాడు. బయట ప్రపంచాలన్నీ ఏం ఉపయోగం?

లోకము లన్నియున్ గడియలోన జయించినవాఁడ వింద్రియా
నీకముఁ జిత్తమున్ గెలువనేరవు నిన్ను నిబద్ధుఁ జేయు నీ
భీకర శత్రు లార్వురఁ బ్రభిన్నులఁ జేయుము ప్రాణికోటిలో
నీకు విరోధి లేఁ డొకఁడు నేర్పునఁ జూడుము దానవేశ్వరా!

ఇలా అంటాడు. లోపల శత్రువులని జయిస్తే ఇంత ఆందోళన వుండదంటాడు. లోపల రాగ, ద్వేష, కామ, లోభ, మోహ, మద, మాత్సర్యములు వున్నప్పుడు మాత్రమే మనిషికి ఆందోళన వుంటుంది. అంతర్ముఖంగా ఆందోళన ఉంటుంది.. రాగము కొన్ని విషయములందు అనురాగము. దాంతోబాటు కొన్ని విషయములందు, పరిసరములయందు, వ్యక్తులయందు ద్వేషము. ఇలా అన్నీ మనకి ద్వంద్వంగా లోపల వుంటాయి. రాగము-ద్వేషము, కామము- క్రోధము, లోభము - మోహము, మదము - మాత్సర్యము, ఈర్ష్య - అసూయ. ఇవన్నీ అంతర్ముఖంగా వున్నవాళ్ళకి ఎప్పటికీ జయం కలుగదు. భాగవతమార్గంలో అసలు బొత్తిగా జయం కలుగదు. ఎప్పటికప్పుడు అవి నిర్మూలించుకుంటూ వుండాలి. నిర్మూలించుకున్నవారిని దర్శనం చేసుకుంటూ వుండాలి. అలా నిర్మూలనం చేసుకున్నవారి కథలని చదువుకుంటూ వుండాలి. ఎన్నిరకాల ఇబ్బందులు పెట్టినా ఎదుటివాడి మీద వ్యష్టపడకుండా వుంటారు కొందరు.

హరిశ్చంద్రుడు, నలుడు, రాముడు, ధర్మరాజు కథలే అవి. ఎన్ని రకాలుగా బాధపెట్టినా ఎదుటివాళ్ళని తిట్టుకోరు. దైవమే తన మంచి వుద్దేశించి, శిక్షణ ఇస్తున్నాడనే భావన తప్ప, వాళ్ళనీ, వీళ్ళనీ తిట్టడం వుండదు. ఒక వేళ మానవ సహజమైన స్వభావంచేత కాస్తో కూస్తో, ఒకటీ అరా మాటలన్నా వెంటనే సర్దుకుంటారు. సర్దుకొనీ, ఇది తనవంతు గనక తన వద్దకు వచ్చింది తప్ప, దీని గురించి వేరే మనుషులనూ, పరిసరములనూ, సన్నివేశములనూ కారణముగా ఏర్పరచుకొనరాదు అనే భావనలో వుండి, అంత కష్టంలోనూ, తన కర్తవ్యాన్ని మాత్రమే నిర్వర్తిస్తూంటాడు. శత్రువులు చూసేకొద్దీ బయట కనిపిస్తూవుంటారు. మన మాట విననివారు ఎప్పుడూ మనకి శత్రువులుగానే వుంటారు. అంటే మనలో మదం వుండడం వల్లే కదా? అసలు మన మాట ఎందుకు వినాలి? ఇంకొకళ్ళు మన మాట వినాలనే మదం మనలో వుండడం చేత ఎదుటి వ్యక్తిలోని వాసుదేవుడు, వాడు నీ మాట వినకుండా చూస్తాడు. చూస్తే నీవు శత్రుత్వం పెంచుకుంటావు. పెంచుకుంటే ఏమైందీ? వాడి గురించి భావన చేయడం లోపల ఎక్కువగా వుంటుంది. చూశావా, నామాట వినలేదు, చెప్పింది చేయలేదూ, అంటూ లోపల ఎక్కువగా భావన చేసుకుంటూ లోపల అంతమేరకి పవిత్రభావమును కోల్పోతూ వుంటావు. అలాగే ఈర్ష్య. వాడికేదో వచ్చేసిందీ, మనకేదో రాలేదు. వాడేం గొప్ప, వాడికెందుకు వచ్చిందీ? మనకెందుకు రాలేదు? ఇట్లా భావనచేసేవారు కూడా ఇందులో ఇరుక్కు పోతారు. అందుకని భగవంతుడు సహజంగా అంత: శత్రువులూ, బహిః శత్రువులూ గెలిచినటువంటి వాడు. ఎందుకంటే అన్నీ ఆయనలోంచి పుట్టినవే. అంతా ఆయన పిల్లలే గనక వేరే భావం వుండదు. భక్తుడికి సమస్తమూ 'ఆయనే'! అన్న భావన స్థిరపడినప్పుడు తనని సుఖపెట్టేవారిలోనూ, దుఃఖపెట్టేవారిలోనూ భగవంతుడే ఉపస్థితుడై వున్నాడనే భావం స్థిరపడాలి. అది ఎంతో సాధన చేస్తేగానీ వీలుపడే విషయం కాదు. మన బోటివాళ్ళం గుర్తు తెచ్చుకుంటూ వుండాలి. కార్పణ్యదోషాలు పెట్టుకుని, సంవత్సరాలతరబడి మాట్లాడకుండా కారాలు, మిరియాలు నూరుతూంటాం కదా! ఎవరి మీదన్నా ద్వేషభావం కలిగితే జన్మంతా మనం అలా maintain చేస్తాం, పెద్దపులిని maintain చేసినట్లు. దాని వలన భగవంతుడ్ని ఎంతదూరం చేసుకుంటున్నాం, అని తెలీదు. మళ్ళీ అదే బుద్ధితో భగవదారాధన చేస్తాం, కానీ ఉపయోగం వుండదు, వీలుపడదు. మనస్సులో

శాశ్వతమైన శత్రుత్వం ఎవరిమీదైనా ఉన్నట్లైతే వీలుపడదు. బహిర్ముఖంగా బాగా గొప్పగా, ఈ ప్రపంచంలో భగవద్భక్తులుగా చలామణీ అవుతున్నవారు, అంతర్ముఖంగా ఆనందంగా వున్నారా అంటే అది ఓ ప్రశ్నార్థకంగా వుంటుంది. అంతర్ముఖంగా చాలా ఆనందంగా వుండి, బహిర్ముఖంగా ఇంత డంబాచారం లేకుండా వుండే వాళ్లుంటారు. ఈ రెంటిలోనూ ఏది ముఖ్యం అంటే అంతః శత్రువును జయించాలి. అది కారణం చేత భగవత్ సాన్నిధ్యంలో వుండడానికి అవకాశం ఏర్పడుతుంది. అలా వున్నవాడు ధర్మరాజు. కాబట్టే 'మీరంతా అతని ముందు వెంట్రుక ముక్కలు' అని చెప్తాడు శ్రీకృష్ణుడు. అర్జునుడు, కర్ణుడ్ని కూడా తీసి అవతల పెట్టేయమంటాడు. ఎప్పుడో గాని అలా అనడు. ఎందుకంటే అందరికీ తట్టెడు, తట్టెడు అహంకారం. ఎవర్ని ఏమన్నా వాడిలోంచి ఓ బుట్టెడు అహంకారం బయటికి వస్తుంది. చూసి, చూసి రాయబారంలో, ఒక్కొక్కడు తమకు ఎంతెంత శక్తులున్నాయి, బలంవున్నదీ, వీర్యం వున్నదీ, ఇలా అంతా సొల్లు వాగుడు వాగితే, ఈయన ఇహ లాభంలేదు, ఈవెధవలందరికీ ఒక మాట చెప్పాలని 'అసలు ఆయన ఒకడు వున్నాడయ్యా, ఆయనకసలు కోపంరాదు. ఆయనకి కోపం ఎలా రావాలో కూడా తెలీదు. ఆయనకి కోపంవస్తే మీరంతా మిడతల్లాగా మాడిపోతారు. మీలాంటివాళ్ళు వెయ్యి మంది వచ్చినా ఏం వుపయోగం లేదు.' అని చెప్తాడు. ధర్మరాజుకి నిజంగానే ఇంత జరిగినా కోపం రాలేదు. అభిమన్యుడ్ని చంపినపుడైనా కోపం రావద్దాండీ? అంటే ఏ విషయమైనా సాధన చేస్తే సాధించవచ్చు. ఇలాంటి అత్యుత్తమ విషయాలు సాధన చేసీ, అది ఆధారంగా భగవత్సాన్నిధ్యం చేరుకోవాలి తప్ప, వూరికే ఏదో డబ్బా కొట్టుకుంటూ జీవించడం వల్ల వుపయోగం లేదు. గట్టిగా పట్టుకుంటే ఒక్కటి చాలు. బావిలోనుండి బయటికి రావడానికి ఏదో ఒక తాడు పట్టుకుంటే బయటికి లాగేస్తారు. ఇది పట్టుకోనా, అది పట్టుకోనా అంటూ వున్న తాళ్ళన్నీ చూస్తూ కూర్చుంటే --- ఏమీ తెమలదు. ఏదో ఒకటి చేయండీ ఎలా వుంటుందో చూద్దాం. మోతుగూడెంలో దోమకుట్టి, మాస్టరుగారికి జబ్బుచేస్తే 'మాస్టరుగారు అసలు మోతుగూడెం వెళ్ళక పోవలసిందని ఒకరు, దోమకుట్టకుండా వుంటే బావుండేదని ఒకరూ, కుట్టినా అది మెదడువాపు వ్యాధి దోమ కాకుండా వుంటే బావుండేదని కొందరూ, అసలు దీనంతటికీ కారణం ఆ మోతుగూడెం camp arrange

చేసినవాడని కొందరూ' ఇలా మాట్లాడుతుంటే ఎలా వుంటుందీ? ఆ camp arrange చేసినవాడు ఏడవడూ? పెందుర్తిలో మాస్టరుగారు ఒకటి అన్నారు 'ఇవన్నీ నిమిత్త కారణాలు, మనకి వచ్చేది మనకి వస్తుంది'. 'అక్కడ దోమ కుట్టకపోతే, నీ ఇంట్లోనే నీకు దోమ కుట్టవచ్చు. ఆ సమయం రావాలే కానీ, వస్తే ఎక్కడైనా అదే కార్యం జరుగుతుంది. ఏదో ఒక వాహిక ద్వారా నీ దగ్గరకు రావలసిన కర్మము నీ వద్దకు చేరుతున్నప్పుడు, ఈ కష్టం వాడివల్ల వచ్చింది, వీడివల్ల శ్రీ వచ్చింది అని అనుకోవడం చాలా అవివేకం.' అన్నారు మాస్టారు. అదే కారణంగా వెళ్ళిపోయారు. అది నిమిత్తకారణం అనుకోమన్నారు. ఎవరికి ఏం జరిగినా, ఎవరిద్వారా జరిగినా జరిపించేవాడు ఒకడే అనుకోవాలి. నీకు చెడుజరిగినప్పుడు 'నీకు శిక్షణ ఇవ్వడానికి ఇది జరిగింది, నీకు మంచి జరిగినపుడు నీవు చేసిన మంచి నీకు అనుభూతినివ్వడానికి జరిగింది' రెంటినీ పక్కనపెట్టి భగవంతుని సాన్నిధ్యంలో వుండడానికి ప్రయత్నం చేయడం అనేది ఈ రెండింటినీ మించిన విషయం.

శత్రుజిత్ అంటే ఎవరైతే తన అంతః శత్రువులని జయిస్తాడో, అతడు శత్రువులకి తాపం కలిగిస్తాడుట. కృష్ణుడ్ని చూస్తుంటేనే శిశుపాలుడికి తాపం కలిగింది. అలాగే కంసుడికి, దుర్యోధనుడికీ తాపం కలిగింది. అసలు మంచివాడ్ని చూస్తే అహంకారులకి ఈర్ష్య, అసూయ, వాడిమీద క్రోధం, ద్వేషం పుడుతుంది. వాడట్లా నవ్వుతూనే వుంటాడు. వీడు నవ్విన కొద్దీ వాడికి పెరుగుతూనే వుంటుంది. తనయందు అంతఃశత్రువులని నిర్మూలించుకున్నవాడిని చూసి బహిర్ముఖంగా అందరూ తాపం చెందుతూ వుంటారట. వీడేం చెయ్యడు. వీడి దారిన వీడు బతుకుతూవుంటాడు. కానీ వీడ్ని చూస్తుంటే వాడికి మండిపోతూ వుంటుంది. అట్లా రాముడు చాలా మందిని మండించాడు. అలాగే కృష్ణుడ్ని చూసినా, ధర్మరాజుని చూసినా చాలా మందికి మండింది. ఎందుకు మండిందంటే వీడిలోని సత్త్వగుణం ఎదుటి వ్యక్తిలో ఓ రకమైన అసహనం తెస్తుంది. విశ్వామిత్రుడికి అలా మండింది వశిష్ఠుడ్ని చూస్తే. ఎందుకంటే వాళ్ళు బహిర్గతంగా చాలా జయించినవారు, వీళ్ళు అంతర్గతంగా జయించినవారు. బహిర్గతంగా చాలా జయించినవారు 'మనం చాలా గొప్పవాళ్లం' అనే భ్రమలో జీవిస్తూంటారు. మరి వాళ్ళు అలా వుండగా, వీరేమో ఏమీ కానట్లుగా బయటికి

కనిపించకుండా వుంటాడు. వీళ్ళకు పాద నమస్కారాలు చేస్తూ, చుట్టూ చాలా మంది చేరుతూ, వీరి వద్ద సలహాలు తీసుకుంటూ, వారే దేవుడుగా చిత్రపటాలు ఇంట్లో పెట్టుకుంటూ వుంటే, వీళ్ళకి కష్టంగా వుంటుంది. అలాక్కదా మాస్టరుగారు ఈ వూళ్ళో చాలా మందికి తాపం ఎక్కించారు. జ్ఞానులూ, పండితులూ, తెలిసినవారు, తెలివైనవారు అందరికీ మాస్టారుగారి కారణంగా చాలా తాపం ఎక్కింది. ఎందుకంటే ఈయన లోపల ఏమీలేదు. వేరే భావాలు ఏమీలేవు. బయటికి మాత్రం తమాషాగా ఉండి అహంకారంగా పండితుడ్ని అనుకునేవాడు వచ్చినప్పుడు క్రీడాప్రాయంగా ఉండి వాడు జన్మాంతం దాని గురించే చెప్పకునేలా చేశారు. అట్లా కనిపించేట్లు చేశారు. అందుకని మనక్కూడా జయం కావాలంటే లోపల భావములు పవిత్రంగా ఉంచుకోవాలి. లోపల భావములు ప్రశాంతంగా వుంచుకోవాలి. లోపల భావములు ఎంత నిర్మలంగా, పవిత్రంగా వుంటే అంత ఆనందానికి చోటు వుంటుంది. సమస్యలు ఎప్పుడూ వుంటాయి. ఉన్నప్పటికీ లోపల ప్రశాంతత, పవిత్రత వుంటే ముఖం మీద చిరునవ్వు వుంటుంది. లేకపోతే మొహం ఎప్పుడూ చిటపటలాడుతూ వుంటుంది. కొందరి మొహలు చూస్తుంటే కుంపట్లల్లే వుంటాయి. ఎందుకలా వుంటాడో తెలీదు. నిష్కారణంగా అలా వుంటాడు. కొంతమంది ముఖంలో నిష్కారణంగా నవ్వు వుంటుంది. అందుకే ఎవరి ముఖంలో నవ్వు వుంటుందో వాడియందు భగవంతుని అస్తిత్వం కొంచెం ఎక్కువగా దర్శనం చేసుకోవచ్చు. అందుకే శత్రుజిత్ ఎవరౌతారో వాడే శత్రుతాపనుడు కూడా. అంతమాత్రంచేత ఎదుటివ్యక్తిని కవ్వించే వుద్దేశం కాదు. తను తానుగా వుంటే, ఎదుటివాడు ఏవో చూస్తూంటాడు. సహనం లేక, అసూయచేత, ఈర్ష్య చేత, మాత్సర్యం చేత, మదము చేత ఎదుటి వ్యక్తిలో ఏవేవో ఆపాదించి, వాడ్ని తిట్టిపోయకపోతే అస్సలు తోచదు. ఎవరన్నా మహాత్ముడు అని చెప్తే, మహత్యం మాట అటుంచీ, ఏమన్నా రంధ్రాలున్నా ఏమో అని వెతకమా? ఎందుకు వెతుకుతాం? అవి మనలో వున్నాయి కాబట్టి. ఆ మహత్యం ఏదైతే వుందో అదిమాత్రమే దర్శించే బుద్ధి లేదు కదా! లేకపోవడం వలన, వాడి గురించి ఎట్లాగైనా వేరే రకం సమాచారం సేకరించీ, 'నువ్వు ఎవరినైతే చాలా మంచివాడని అనుకుంటున్నావో వాడు అది కాదు, ఇది' అని చెప్పేవరకు నిద్రపోం. ఇవన్నీ మనలోంచి ఎందుకు వస్తాయి? మనలో

ఇవన్నీ వుండడం వల్ల వస్తాయి. అందుకని శత్రుతాపనము కలుగుతుంది. సత్యసాయి వున్నారు. 40 సంవత్సరాల నుండి ఆయన మీద పరీక్షలు చేస్తున్నారు. ఎక్కడ దొరుకుతాడా, ఎప్పుడు దొరుకుతాడా, ఎప్పుడు మనం పట్టుకుని bogus అని చెప్దామా అని ప్రయత్నించేవారు. అదలా వుంచి ఆయన చేసిన మంచి పనులు ఆలోచించవచ్చు కదా! మాస్టరుగారి వద్దకు బాగా లౌకికమైన తెలివితేటల ఆధారంగా జీవిస్తున్న ఒకాయన వచ్చి, ఆయన్ని అడిగారు ' సత్యసాయి గురించి మీ అభిప్రాయము ఏమిటీ' అని. 'సదభిప్రాయమే' అన్నారు మాస్టారు. 'అలాక్కాదూ, అవీ ఇవీ చేస్తున్నారు అంటున్నారు, దాని మీద మీ అభిప్రాయం ఏమిటీ' అంటే అవన్నీ 'మనకెందుకయ్యా, ఆయన చేస్తున్న మంచిపనులు ఈషణ్మాత్రమైనా ఎవరన్నా చేయగలుగుతున్నారా! అది ఎందుకు చూడలేరు. అంత మంచి జరిగిందీ, అది చూడలేక వేరే రంధ్రాలు వెతికి చూడాల్సిన అవసరం ఏముంది? అది మనలో వుండే దుర్బుద్ధే కదా! నువ్వు తెలివైన వాడవనుకుంటున్నావు కదా, తెలివి అంటే ఇది కాదూ' అని చెప్పారు. 'ఎవరు ఎంత చెడ్డపనులు చేస్తున్నా అందులో మంచిని చూడరా' అని సాధకులకు చెప్తుంటే మంచి చేసేవారిలో చెడు వెతుకుతుంటే సాధన ఏవుంటుందండీ? మనం తెలియకుండా ఇవన్నీ ఓ ప్రక్కకి చేరుస్తూ, పరిపూర్ణంగా, రెండోప్రక్క సాధన చేస్తున్నాం అని అనుకుంటుంటాం. అవదు. ఇటువంటి విషయాలలోనే సమస్త రహస్యం అంతా ఇమిడివుంది. Simple గా కనిపించేవాటిలోనే పెద్ద పెద్ద సత్యములు, ధర్మములూ దాగి వున్నాయి. ఇక్కడ బోల్తా కొట్టేసి ఎన్ని పటాలు పెట్టుకున్నా, దీపాలు పెట్టుకున్నా, ఎన్ని విగ్రహారాధనలు చేసినా ఏం లాభం? మన ప్రవర్తనకి వచ్చేసరికి ఏం జరిగిందీ? అందుకని శత్రువు తన యందు లేని వాడు. సత్త్వమును చూస్తే రజస్సుకీ, తమస్సుకి కొంచెం అవహేళన వస్తుంది. భగవంతుడే ప్రేరేపించి వాడు ఏదో ఒక విధంగా బయటపడేట్లు చేస్తాడు. ఆ అవహేళనలోనే ఉక్రోషపడి, ఏదో అవి ఇవీ చేసి వాటితోనే బాగుపడేట్లు కూడా భగవంతుడు చేస్తాడు. ఆవిధంగా మనకి ఈ నామం కనిపిస్తుంది. మనం ఒక్కో గురువుగారి దగ్గరకు వెళ్తే, నిష్కారణంగా కొన్ని reactions వెంట వస్తాయి. ఏదో అనుకొని వెళ్లాం, అక్కడ ఏమీ లేదూ, పైగా అవీ ఇవీ అంటూ అక్కరలేనివన్నీ చూసి వచ్చేస్తాం. ఏం జరిగిందీ? మనలో ఈ వున్నవి కాస్త ప్రకోపం చేసి పంపాడన్నమాట. ఎందుకంటే మన

లోపల ఎక్కడో వున్న మురికిని తీసి బయట పడేసి, మనస్సు అనే కోశంలో పడేసి, కొన్నాళ్ళకి  అది అక్కడ నుండి బహిర్గతం అయ్యేట్లుగా నిష్క్రమింపబడేట్లుగా వెలికి తీస్తారు. అలా తీసేవారు కొంతమంది వున్నారు. వారి పని అది. బండచాకిరీ. నిజంగా పాకీపని. ఎందుకంటే వాళ్ళని పొగడరు. తిడతారు. వెళ్ళినపుడల్లా ఏదో కొంత బయట పడేస్తుంటే, ఉందని తెలియక మనం లోపల కుళ్లబెట్టుకుంటుంటాం. వాళ్ళు బయట పడేస్తూంటారు. అదే CVV గారు! చాలా కష్టంగా వుంటుంది. అందుకని కాస్త భయం వేసి అక్కడా అక్కడా sweets ఇచ్చేవారి వద్దకు పోతూవుంటాము. మరీ ఎంతసేపూ శొంఠి కొమ్ము వ్యవహారంగా వుంటే కష్టంగా వుంటుంది. అందుకని అక్కడ ఇక్కడా కాస్త తేనె నాకినట్లుగా చేస్తుంటే 'సర్లేరా, నాకినా నువ్వు మళ్ళా ఇక్కడకే వస్తావు' అన్నట్లుంటుంది. సద్గురువులు ఎప్పుడూ ముఖం మీద పొగడరు. సద్గురువుల్ని  నువ్వు ఆశ్రయిస్తే, నిన్ను పొగిడే కార్యక్రమం అక్కడేం ఉండదు. పొగడ్త లౌకికం. గురువు మౌనంగా నీలోని మలినాలు బయటికి వచ్చే కార్యక్రమాలు చేస్తుంటాడు. నిన్ను నువ్వు పొగుడుకుంటే, వెంటనే దాన్ని అరికట్టే విధానం ఇస్తాడు. అప్పుడప్పుడు తనే 'నీ అంత శుంఠ, వెధవ ఎవరూ లేరు, నోరు మూసుకుని పడి ఉండు' అని చెప్తుంటారు. ఎందుకంటే శిష్యుడు పైకి రావాలనుకొనే తత్త్వం గురువుకుంటుంది. శిష్యుడ్ని తనంతటి వాడ్ని చేయాలి కదా! చేయాలి అంటే ఈ పెంటకుప్పలు పెట్టుకు కూర్చుంటే ఎలా? ఎంతసేపూ మహాత్ముల వద్ద మన గురించి మాట్లాడుకుంటూంటాం, అవకాశం ఇస్తే. అదృష్టం కొద్దీ వాళ్ళివ్వరు. అందుకా వెళ్ళేది? అక్కడ నుండి ఇటు ప్రవాహం అందుకోడానికా, ఇట్నుండి ఏమన్నా చెప్పడానికా? అందుకని సద్గురువు దాన్ని. కత్తెర వేస్తాడు, కాల్చేస్తాడు. Astral Nature అంటారు దీన్ని. Glamour పెరగకుండా చూసుకుంటాడు. ఓ కొడుకు చిన్నతనంలోనే అన్నీ నేర్చుకుని చాలా పండితుడై, మహాత్ముడిగా తయారౌతుంటే తల్లి పొంగిపోయి సంతోషిస్తూ, తండ్రికి చెప్తుంది మనబ్బాయి అంతటివాడు, ఇంతటివాడని. ఈయనేమో 'ఆ -----వాడి మొహం' అంటూంటాడు. వీడు ప్రక్కగదిలో వింటూంటాడు. 'ఇదేంటి ప్రపంచం అంతా మెచ్చుకుంటుంది, ఇదేంటి నా తండ్రి నా శత్రువా ఏమిటీ? ఏంచేసినా వాడి మొహం, వాడికేం తెలుసు అంటుంటాడు.' అనుకుంటాడు.

ఓసారి రాజ్యంలో ఎవరూ చేయలేని ఓ అద్భుతమైన, విద్యాపరమైన కార్యం ఒకటి నిర్వర్తించి ఇంటికొస్తే, ఆ రోజు కూడా తండ్రి అదే అంటాడు. చివరికి కొడుక్కి తండ్రిని చంపేద్దాం అన్నంత కోపం వస్తుంది. సింహద్వారం పైన మండిగం మీద తండ్రి లోపలికి వస్తే ఆయన మీద పెద్ద రాయి వేద్దామని పట్టుకు కూర్చుంటాడు. కొడుకు బాధ ఎరిగిన తల్లి 'ఎందుకండీ మీరు ఎప్పుడూ అలా అంటూంటారు' అంటే ఆయన మాట్లాడడు. ఆ రోజు తల్లి అంటుంది, 'వాడు ఈ రోజు మొత్తం రాజ్యంలో ఎవరూ చేయని పని చేసుకొచ్చాడు. కనీసం ఈ రోజన్నా వాడ్నొక మంచి మాట అనండి. అంటే వాడు సంతోషిస్తాడు కదా, ఎందుకిలా చేస్తున్నారు?' అంటే 'పిచ్చిదానా! నాకొడుకు అంటే ఎవరూ? నేనే కదా! వాడి మీద నాకన్నా ఇతరులకి ప్రేమ ఎక్కువ వుంటుందీ అంటే అది సహజం కాదు. వాళ్ళకి వాడితో అవసరం వుండి పొగుడుతారు. నేను వాడ్ని పొగిడితే ఆయుః క్షీణం అని పొగడడం లేదు తప్ప, వాడి మీద నాకు ప్రేమ లేదా'. అంటాడు. అట్లా గురువుకి శిష్యుని మీద అమితమైన అనురాగం వుంటుంది. బయటికి ఎప్పుడూ పొగడడు. ఇంకా శిష్యుడిగా అంగీకరించని వారిని పొగుడుతూ వుంటాడు. ఎందుకంటే వాడింకా circus బరిలోకి రాలేదు. వస్తే చర్నాకోల తీసి ఒక్కోటి అంటిస్తాడు. లోపలికి రానంతసేపూ మర్యాదా, మన్ననా, లౌకికంగా ఇవ్వాల్సినదల్లా ఇస్తూంటాడు. లోపలికి వచ్చాక ఇహ అవన్నీ వుండవు. అందుకని అంతేవాసులని వుంటారు. వారు గురువు యొక్క అంతరంగమందు జీవిస్తూంటారు. వారిని ఎప్పుడు పొగడరు. మరువు, దేవాపి వచ్చి జ్వాలకూలుని పొగడరు. జ్వాలాకూలుడు ఆయన అనుయాయులని పొగడరు. ఎదుటి వ్యక్తిని పొగడాల్సిన అవసరం ఎందుకు వస్తుందీ? వాడితో పని వుంటే, అవసరం వుంటే, లౌకికంగా వాడిని ఉపయోగించుకోవాలంటే వస్తుంది. 'నీవే సర్వస్వం' అని నీవద్దకు వచ్చినవాడికి నీవు ఇవ్వవలసినది శిక్షణ. దానిలో భాగంగా చాలా వలిచేయాలి, లోపల వున్నవి తీసేయాలి. శిష్యుడు ఏవి తీసేసుకోవాలో అవి పోగేసుకుంటుంటే, నువ్వు ఉత్సాహపరిస్తే వాడు దెబ్బ తింటాడు. అందుకని సత్పురుషుల వద్దకు ఒకోసారి వెళ్ళొస్తే కష్టం వస్తుంది. వెంకటేశ్వరస్వామి కలలోకి వస్తే కష్టం వస్తుంది. అదేంటండీ అంటే అదంతే! More effective parent, more effective teacher. శని కూడా అంతే! శని వచ్చాడయ్యా అంటే మన వద్ద వుండకూడనివి అన్నీ

తీసుకెళ్ళి పోతాడని అర్థం. ఉండాల్సినవీ, భగవత్పరమైనవీ ముట్టుకోడు. మిగతావన్నీ పట్టుకు పోతాడు. ఇంట్లో జెర్రులూ, పాములూ వున్నాయి. తీస్తుంటే ఏడుస్తాం. అదీ మన తత్త్వం. అందుకని ఈ అవగాహన వున్నవాడు, తన లోపలున్న శత్రువులను నిర్మూలించుకోవడం చేత, అది కారణంగా వీడి భగతుని అస్తిత్వము పెరుగుతుంటే, దాని వల్ల చాలా మంది చేరుతూంటారు. చేరుతుంటే వీడు పతనం చెందితే అది వేరే సంగతి. అలా చేరుతూండడం వలన మిగతావాళ్ళకి తాపం కలుగుతుంది. ఏం చేయలేరు, అలా ఏడుస్తూంటారు.

## 852, 853, 854 న్యగ్రోధః, ఔదుంబరః, అశ్వత్థః

అంటే వంగి భూమిని తగిలే కొమ్మలు కల చెట్టు అని అర్థం. ఏంటదీ? మర్రి చెట్టు! ఈ చెట్టు భూమిని తాకడమేకాదు, భూమిలోకి వెళ్ళి, వేరుగా మారి, మళ్ళీ చెట్టు పుట్టుకు వస్తుంది. భగవత్తత్వాలలో భగవంతుని అస్తిత్వాన్ని అనుభూతి ఇవ్వగలిగిన వృక్షములలో మర్రి చెట్టు ఒకటి. చాలా మంది మర్రి చెట్టు కింద తపస్సు చేసి మహాత్ములయ్యారు. మర్రిచెట్టు మీద అనేక మంది సిద్ధులూ, యోగులూ అదృశ్యరూపులై ధ్యానం చేసుకుంటూ వుంటారని చెప్తారు. అందుకే కాశీ మజిలీ కథలలో ప్రయాణీకులంతా అలసినపుడల్లా వెళ్ళి మర్రి చెట్టుకింద కూర్చుంటారు. ఎందుకంటే ఆ రకమైనతత్త్వము ఆ చెట్టు నుండి ప్రసరిస్తూ వుంటుంది. అది గుర్తించి ఋషులు దాన్ని మనకందించారు. మర్రి శనికి ప్రతీక. రావి గురుడికి/ బృహస్పతికి ప్రతీక. న్యగ్రోధః, ఔదుంబరః, అశ్వత్థః అని మూడు నామములు ఇచ్చారు. అంటే మూడు పుణ్యమైన చెట్లు విష్ణుసహస్రనామంలో ఇవ్వబడ్డాయి. ఒకటి మర్రి చెట్టు, రెండవది మేడిచెట్టు లేక ఔదుంబరము, మూడవది రావిచెట్టు లేక అశ్వత్థము. ఈ మూడు చెట్ల రూపములలో దైవమే నివసించి ఉన్నాడు అంటే అస్తిత్వము చెంది వున్నాడు. అన్నింట్లోనూ వున్నప్పటికీ ఇందులో కొంచెం ఎక్కువగా వుంటాడు. ప్రస్ఫుటంగా వుంటాడు. అందుకని మర్రివేళ్ళు నీళ్ళల్లో వేసుకుని, ఆ నీళ్ళు తాగి, దీక్షవహించి, ఆ నీళ్ళతోనే 40 రోజులపాటు ఆ నీళ్ళతోనే జీవించేవారున్నారు. అలాగే రావి ఆకులు తిని, రావి పళ్ళు తిని, 40 రోజులు ఆ ప్రదక్షిణ చేసుకుంటూ, ఆ చెట్టుకిందే తపస్సు చేసుకుంటూ భగవదనుభూతి పొందినవారున్నారు. అలాగే ఔదుంబరము గురువు లేక దత్తాత్రేయుని అనుగ్రహం కోసం, శివ అనుగ్రహం కోసం మర్రి చెట్టు, అశ్వత్థవృక్షము విష్ణు అనుగ్రహము లేక హయగ్రీవ అనుగ్రహము కోసము. మనకలాగ ఈ మూడు చెట్లను గురించి అలా అందించారు. ఈ గాలి పీల్చండి, ఈ చెట్ల నీడన వుండండీ, వీటి ఆకులూ, పళ్ళూ శరీరం అంగీకరించినంతమేరకు తినండి, నీటిలో వీటి వేళ్ళు వేసుకొని త్రాగండి. పూజా గృహాల్లో రావివేరు వుంచుకుంటారు. మర్రివేరు వుంచుకుంటారు. ఔదుంబరాన్ని ఆశ్రయించి వుంటారు. ఏంటయ్యా అంటే వీటిల్లో భగవత్తత్త్వం బాగా అస్తిత్వం చెంది వుంటుందని. అందుకని గుళ్ళల్లో

అక్కడక్కడ రావి చెట్లు, మర్రి చెట్లు, ఔదుంబర చెట్లు కనిపిస్తాయి. ఔదుంబరము మన వైపు తక్కువ గానీ, మహారాష్ట్ర, కర్ణాటక దేశాలలో బాగా కనిపిస్తాయి. దత్తాత్రేయ సాంప్రదాయం వున్న చోట బాగా కనిపిస్తాయి. అక్కద ఔదుంబర వృక్షానికి చాలా ప్రాముఖ్యత వున్నది. జ్ఞాన విజ్ఞాన కోశములు మనలో విచ్చుకోవాలంటే రావి. శివదర్శనం చేయాలంటే మర్రి. గురు అనుగ్రహం ద్వారా మార్గం దొరకాలంటే ఔదుంబరం. ఇలా సాంప్రదాయం మనకి ఏర్పరచి వుంచారు. విష్ణుసహస్రనామంలో ఈ మూడింటినీ ఒకే చోట చెప్పేసారు. భగవంతుడు ఈ మూడు వృక్షాలలో బాగా ప్రస్ఫుటంగా కనిపిస్తాడు. అందుకే వాటికి ప్రత్యేకించి ఆరాధన చేసుకునే మార్గం ఒకటి ఏర్పడింది. అది మళ్ళీ వెర్రి కాకూడదు. ఎక్కడన్నా రావి చెట్ల గుంపు వున్నా, మర్రి చెట్ల గుంపు వున్నా, ఔదుంబర చెట్ల గుంపు వున్నా అక్కడ బస చేయటానికి ప్రయత్నం చేయండి. ఎందుకంటే అక్కడ భగవదనుభూతికి బాగా అవకాశం వుంటుంది. వీటి తరువాత వేప, మామిడి చెట్ల దగ్గరికి దయ్యాలు, భూతాలు రావు, చేరవు. కానీ దైవం యొక్క అస్తిత్వం పూర్ణంగా దొరికేది ఈ మూడు చెట్లలోనే. అందుకే ఈ మూడూ చాలా మంగళప్రదమైనవి. వీటి వినియోగానికి సంబంధించిన వ్రతాలు కూడా చాలా వున్నాయి. అవి నిర్వర్తించుకునేవారికి వాటి నుండి భగవదనుభూతి కలుగుతుంది. కొన్ని లక్షల రకాలుగా భగవదనుభూతి పొందవచ్చు. మనం అనుకున్నదొక్కటే మార్గం కాదు. ఎన్నో మార్గాలలో, ఎన్నో రకాలుగా భగవద్దర్శనం పొందినవారు ఎంతో మంది వున్నారు. అవి అన్నీ ఈ విష్ణుసహస్ర నామాల్లో చెప్పకుంటూ వస్తున్నారు. అశ్వము అంటే ప్రాణాము అని అర్థము. దాని యొక్క స్థాపనము అశ్వత్థవృక్షంలో ఎక్కువగా వుంటుంది. అంటే అత్యుత్తమమైన ప్రాణశక్తి, జ్ఞానశక్తీ ఆ చెట్టులో ఇమిడివున్నట్లుగా చెప్తారు. అందుకనీ మన వరకూ ఈ మూడు చెట్లు కనిపించినపుడు కనీసం భగవంతుడు గుర్తుకు రావాలి. ఏది చూసినా గుర్తుకు రావాలీ, ఇది చూస్తే ఇంకా ఎక్కువ గుర్తుకు రావాలి. ఎక్కువ అనుభూతి కలగాలి.

## 855 చాణూరాంధ్ర నిషూదనః

చాణూరుడు ఆంధ్రుడు. చాణూర, ముష్టికులు మన contribution. కంసుడు కూడా అసలు ఆంధ్రుడే. ఉగ్రసేనుడు వాడ్ని పెంచుకున్నాడు. ఇక్కడ నుండి దత్తత తీసుకు వెళ్ళాడు. కనకే మన బుద్ధులన్నీ పూర్తిగా వచ్చినాయి. ఆంధ్రుడైన చాణూరుడ్ని సంహరించిన వాడా అని ఒక నామం. అదొక event. అంటే కృష్ణుడి గురించే విష్ణుసహస్రనామం చెప్తున్నాడని ఖాయంగా చెప్పడం కోసం అన్నమాట. రావణాసుర సంహారీ అని ఎక్కడా నామాలలో రాలేదు కదా! మరి విష్ణుసహస్రనామం కేవలం కృష్ణుడి ఉద్దేశించి, ఈయనే పరమ పురుషుడూ, పురాణపురుషుడూ, శరీరాన్ని ధరించాడు అని భీష్ముడు చెప్పాడు. అలా చెప్పడం ఇటువంటి నామాల్లో రూఢిగా తెలుస్తుంది. మిగితా స్తోత్రాలన్నీ పరతత్త్వానికి అనుగుణంగా చెప్పకోవచ్చు, దిగివచ్చిన కృష్ణునికీ అనుగుణంగా చెప్పకోవచ్చు. చాణూరాంధ్రనిషూదన అనే నామానికి పరతత్త్వం గురించి చెప్పడానికి ఏమీ లేదు. కేవలం కృష్ణుడు ఎవర్ని సంహరించాడో అది ఒక్కసారి గుర్తు చేశాడు. నిజానికి మనం వరుసగా చూస్తే, నామానికీ నామానికీ, ఒక శ్లోకంలో గొలుసుకట్టు కనిపిస్తుంది. సువ్రతః అని వచ్చాక శత్రుజిత్ అనేది రావడం ఒక వ్రతం. అది కారణంగా శత్రు తాపనం జరిగితే నువ్వు సంతోషించనక్కర లేదు. వ్రతం. మర్రి చెట్టుకు సంబంధించిన వ్రతం, రావి చెట్టుకూ, ఔదుంబర చెట్టుకూ సంబంధించిన వ్రతం. ఇలాంటి వ్రతాలు చేసుకునేవారికి సులభంగా దొరుకుతాడు అని నామాలన్నీ ఒకదానితో ఒకటి అనుబంధం కలిగి ఉంటాయి. 'చాణూరాంధ్ర నిషూదనః' అనే దానితో వీటికేమీ సంబంధములేదు. ఆ నామం అలా అక్కడ పడ్డదో, వ్యాసుడు అలా ప్రయత్నించి వేశాడో తెలీదు. ప్రతి శ్లోకం లోనూ ఈ నామాలు సోపానం ఎక్కేట్లు ఉపయోగపడుతున్నాయి. ఈ నామం మరి మనం ఏం చేస్తాం? చాణూర, ముష్టికులని సంహరించినపుడు చలా చిన్నపిల్లలు బలరామకృష్ణులు. అలా భగవంతుడు కొనియాడబడ్డాడు. ఇది అద్భుతం కాదా! అందరి కళ్ళముందు, మధురానగరం నడి బొడ్డులో జరిగింది. చాలా చెప్పకున్నారు. అందుచేత ఈయనకది బిరుదుగా ఉండిపోయింది. చాణూర నిషూదనుడు అంటే సరిపోయేది. కానీ ఆంధ్రుడని కూడా కొంత గుర్తుచేశారు ఈ నామంలో. Physical power అని

అన్నమాట. ఇప్పుడదీ లేదు మనకీ. కానీ ఒక మంచి విషయం ఏమంటే, ప్రస్తుతకాలంలో మహాత్ములు ఎక్కువగా ఆంధ్రదేశంలోనే పుడుతున్నారు. ఈ మధ్యకాలంలో ప్రపంచాన్ని బాగా వెలిగించిన వారిలో ఎక్కువమంది ఆంధ్రులే. మనం అనుసరించే గురుపరంపర ముగ్గురూ ఆంధ్రులే. సాయి కూడా ఆంధ్రుడే. సచ్చిదానందగణపతి తండ్రీ ఆంధ్రుడు. ఇలా ఎక్కువగా ఆంధ్రులే కనిపిస్తున్నారు. కాబట్టి కాస్త ఇప్పటికి తెమిలిందనుకోవాలి. ఏదో విధంగా కాస్త విష్ణు సహస్ర నామాల్లో 'ఆంధ్రుల' శబ్దం కూడా వచ్చింది. మంచో చెడో మనల్ని అందరూ తలచుకుంటారు విష్ణుసహస్రనామం ఉన్నంత కాలం. ఈ విష్ణుసహస్రనామం కలియుగాంతం వరకూ కూడా ఉంటుంది. కాబట్టి ఆంధ్రుడు కూడా ఉంటాడు. 'So Andhra is there in Vishnu Sahasranaama'! ఎట్లా చెప్పకుంటే ఏమిటి మనగురించి చెప్పకుంటున్నారు కదా!

## 856 సహస్రార్చిః

సహస్రార్చిః అంటే వెయ్యి కిరణములు కలిగిన వాడు. వెయ్యి కిరణములు అని చెప్పడంలో ఒక రహస్యార్థం వున్నది. వెయ్యి అంటే ఒకటి ప్రక్కన మూడు సున్నాలు. మూడు సున్నాలంటే మూడు లోకాలు. మన పెద్దవాళ్ళు అంకెలు చివరికి కోటితో ఆపారు. ఒకటి ప్రక్కన ఏడు సున్నాలుంటే కోటి అవుతుంది. ఏడు సున్నాలంటే ఏడు లోకాలు. ఒకటి భగవతత్త్వము. ఒకటి ఆధారంగా ఏడు లోకాలు ఏర్పడినాయి. ఏడు లోకాలలాగానే ఐదు లోకాలుగా కూడా చెప్పడం వున్నది. అది పంచీకరణం అని సృష్టి అంతా కూడా ఐదుగా వివరణ ఇచ్చే ఒక పద్ధతి.

పాంగ్తంవా ఇదగం సర్వం పాంగ్తై నైవ పాంతగ్ శృణోతీతి

అని మహాభారతంలో ఒక శ్లోకం - అంటే ఇదంతా ఐదుగా చేయబడ్డదని అర్థం. మనవాళ్ళు దీనిని లక్షకు సంకేతంగా పెట్టారు. మనవాళ్ళు మూడు, నాలుగు రకాలుగా ఇచ్చారు. మొదటి ప్రాముఖ్యత కోటి. కోటి అంటే ఒకటి ప్రక్కన ఏడు సున్నాలు. ఏడు సున్నాలు అంటే ఏడు లోకాలు. ఈ ఒకటి లేకపోతే ఆ ఏడు సున్నాలకీ అర్థం లేదు. ఒకటి ప్రక్కన అవి చేరడం వల్ల ఆ సున్నాలకి ఓ అర్థం ఏర్పడింది. ఆ ఒకటే ఏడు లోకాలుగా ఏర్పడింది అని చెప్పడానికి కోటి. అలాగే ఐదుగా చెప్పడంలో ఒకటి ప్రక్కన ఐదు సున్నాలు చేరిస్తే లక్ష. అలాగే ఒకటి ప్రక్కన మూడుగా చెప్పారు. సృష్టిని మన ఋషులు మూడుగా వివరించారు, ఐదుగా వివరించారు, ఏడుగా వివరించారు, తొమ్మిదిగా వివరించారు. అందుకని కోటి తరువాత వందకోట్లే! అలా అమర్చుకున్నారు. ఎందుకంటే సృష్టి విధానం బట్టి దేనినీ ఏ కళని కానీ, ఏ విద్యను కానీ తప్పిపోకుండా పెట్టుకున్న సాంప్రదాయం భారతీయ సాంప్రదాయం. ఆ విధంగా మనకు అందులో వెయ్యి అని చెప్పినపుడు ఒకటి ప్రక్కన మూడు సున్నాలు అని చెప్పినప్పుడు, మూడు సున్నాలు మూడు లోకాలు. మూడు లోకాలంటే పదార్థమయలోకము, శక్తిమయలోకము, ప్రజ్ఞామయలోకము. ఈ మూడింటియందు వ్యాపించినట్టి ఒకే ఒక ప్రజ్ఞ. తరువాత నామంలో మళ్లీ ఏడు వస్తుంది. అందుకని ఈ మూడూ, ఐదు, ఏడూ, తొమ్మిదీ, పద్దెనిమిది, ఇరవై ఒకటి, ఇరవై నాలుగూ - ఇట్లా మనకు కొన్ని అంకెలకు బాగా ప్రాముఖ్యత వున్నది.

'సహస్ర' అని చెప్పడంలో ఉద్దేశ్యమేమిటంటే మూడు లోకములు అని చెప్పడం. 'సహస్ర' అనే నామమే ఒక మహత్తరమైన మంత్రంగా చెప్తారు. అది సుదర్శన చక్రమునకు సంబంధించిన మంత్రంగానూ, సృష్టినంతా కూడా నడిపే మంత్రంగా కూడా చెప్తారు. అత్యంత రహస్యము, పవిత్రము అయిన గుహలలో ఈ 'సహస్ర' అనే నామాన్ని బాగా ఉచ్చారణ చేస్తారు. అది మామూలుగా వారు బృందములుగా కలసినప్పుడు, అంటే మహర్షులు, సిద్ధులు కలసి ఉచ్చరించే నామమిది. రహస్యమైన గుహలలోంచి బయటకు వచ్చిన తరువాత మళ్ళీ దాన్ని ఇంక ఉచ్చరించరు. 'It shall not be uttered outside the temple' అని వారు వాగ్దానం చేసుకుంటారు. ఎందుకంటే 'స' అనే శబ్దానికి భగవతత్త్వము. ఆ తత్త్వమే దిగి వస్తే 'హ' అవుతుంది. అంటే బంగారపు రంగుగా మారుతుంది. హిరణ్మయమైన - హిరణ్యగర్భం అంటాము, హిరణ్యాండం అంటాము. బంగారపు గుడ్డుగా ఏర్పడుతుంది. ఏది ? అది బయటికి రావాలనుకున్నప్పుడు ముందుగా వచ్చేది. మళ్ళీ స్ర' అని అన్నప్పుడు అది ఈ 'హ' నుండి వచ్చే మరియొక స్థితి. 'స' నుండి 'హ' వచ్చి, 'హ' నుండి మళ్ళీ దిగి వచ్చినపుడు 'స' యే దిగివస్తుంది. అందరిలోకీ, ఏడులోకాలలోకీ దిగి వచ్చేది అదే. తరువాత స్థితిలో అది 'ర' అవుతుంది. అప్పడది అగ్ని బీజమవుతుంది. అంటే మన దేవతల అందరి కన్నా ముందు వుండే వాడు అగ్ని అని చెప్తాము. మళ్ళీ 'అగ్నే నియతి యితి అగ్నిః' దేవతల స్థానం అక్కడ వుంది. మరి అగ్ని స్థానం ఎక్కడుంది అంటే 'స', తరువాత, 'హ ' తరువాత, మళ్ళీ వచ్చే 'స' తో చేరేవాడు అగ్ని. అందుకని అగ్ని స్వరూపము, అంతకుముందు వుండే తేజోమయమైన హిరణ్యమండలము, అంతకు ముందువున్న అసలు తత్త్వము ఏదైతే మనము పరతత్త్వముగా చెప్తామో ఇవన్నీ కలిపితే సహస్ర' అవుతుంది. దీనిని ఉచ్ఛారణ చేయడం చాలా బాధ్యతతో కూడిందిగా భావిస్తారు తెలిసిన వారు. ఎందుకంటే మనం 'రామా' అని అన్నామనుకోండి, హనుమంతుడు 'రామా' అన్నాడనుకోండి చాలా తేడా వుంటుంది. అలాగే అప్పడప్పడూ మన జగద్గురు ఉపన్యాసాలలో 'క్రీం' అనే శబ్దం వింటూ వుంటాం. Ice- Cream అమ్మేవాడు ice-cream, ice-cream అంటాడు. క్రీం అంటాడు కానీ అంతమాత్రంచేత అది మంత్ర ఉచ్ఛారణ అవదు. అలాగే మనం చాలా శక్తివంతమైన ఉచ్ఛారణ చేస్తున్నప్పటికీ కూడా, మనలో పవిత్రతని బట్టి అవి

శక్తివంతమవుతూ వుంటాయి. అత్యంత శక్తిమయమైన మంత్రముగా పరమ గురువులచే ఆరాధింపబడే మంత్రము 'సహస్ర'! ఎందుకని? వేదములన్నింటిలోకీ ఋగ్వేదము తలమానికము. ఋగ్వేదములో వుండే పదకొండువేల ఆరు వందల చిల్లర సూక్తాలకి పురుషసూక్తము తలమానికము. 'చక్రవర్తి' అంటారు. ఋగ్వేదములో వుండే సమస్త సూత్రాలలో చక్రవర్తి ఎవరయ్యా అంటే పురుషసూక్తము. ఆ పురుషసూక్తము మొదలయ్యేది సహస్ర శబ్దముతో. అందుకనే దానికంత పవిత్రత. అందుకని ప్రత్యేకించి ఆ మంత్రాన్ని బాగా ఉచ్చరించుకోవడం కోసం మంత్రంలో పెట్టి మనము కొంచెం వీలు కలిపించారు.

సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్ర పాత్

అనేసరికి మూడు సార్లు సహస్ర, సహస్ర, సహస్ర అంటున్నారు. అందుకని మొత్తం పురుషసూక్తం చదవడానికి మనకి సత్తువ లేకపోతే కనీసం ఇది ఒక్కటైనా చదువుకోవాలి. అట్లాగే రుద్రుని ప్రార్థన చేసేటప్పుడుకూడా, రుద్ర మంత్రాలు చాలా వున్నాయి. అన్నీ చెయ్యలేము కదా మనం. ఏదో ఉత్సాహం వున్న రోజు చాలా చెయ్యగలము. లేనప్పుడు, శరీరం నీలుగుతున్నప్పుడు, దానితో బాటు మనస్సు కూడా శృతి కలిపినప్పుడు ఉచ్ఛరించడానికి ఇంతమంది ఋషులు మన బాగుకోసమే కలిపి ఇచ్చేశారు. మూడు సార్లు రుద్ర శబ్దము వచ్చేట్టుగా.

యో రుద్రో అగ్నౌ యో అప్సు య ఓషధీషు యో రుద్రో
విశ్వాభువనా వివేశ తస్మై రుద్రాయ నమో అస్తు

ఇట్లా మూడు సార్లు రుద్ర, రుద్ర, రుద్ర అని వచ్చేటట్లుగా రుద్ర మంత్రం వుంది. అట్లాగే సహస్ర అనే మంత్రాన్ని అద్భుతంగా ఇచ్చిన పురుష సూక్తంలో వుండే మొట్టమొదటి సూక్తము అది. దానిని ఉచ్చారణ చేసుకో. అంటే ప్రొద్దున లేవగానే 'సహస్ర శీర్షా పురుషః' వేయి తలలతో వుండే భగవంతుని దర్శనం చేయడానికి నిద్ర లేచామనుకోవాలి నువ్వు. లేచిన దగ్గర నుండి ఇంక మనకు అదే కదా! రకరకాలుగా చూస్తూంటాము. సహస్రాక్ష వాడివే కళ్ళన్నీ, సహస్రపాత్ - వాడివే పాదాలన్నీ. సృష్టంతా వాడే నిండి వున్నాడని ఎన్ని రకాలుగా గుర్తు చెయ్యడానికి ప్రయత్నం చేసారంటే మనకి విసుగు తప్ప, వాళ్ళకు విసుగు లేదు. అంత విసుగు, విరామము లేకుండా చెప్పినదే చెప్పినట్టు చెప్పకుండా చెప్పకుంటూ వస్తున్నారు. ఇన్నాళ్ళు మనం చెప్పకున్న

దానిలో ఏమిటి సారాంశం తీస్తే ఒక్కటే మిగులుతుంది. ఎన్ని రకాలుగా దాన్ని చెప్పారు? అందుకని అప్పుడప్పుడు మనకి చెప్పిందే చెప్తున్నారని అనిపిస్తుంది. చెప్పేవాడియొక్క బుద్ధి వైశాల్యం బట్టి దాన్ని రకరకాలుగా, రకరకాలుగా చెప్పడానికి ప్రయత్నం చేస్తుంటారు. ఋషులు అట్లా ప్రయత్నం చేసి ఇన్ని రకాలుగా అందించారు. ఎందుకంటే ఎటుచూసినా వీడికి అదే గుర్తురావాలని వాళ్ళ తాపత్రయం. అందుకని 'సహస్రార్చిర్' అంటే వెయ్యి కిరణములుగా దిగివస్తున్నాడు. అంటే ఏమిటంటే ఒక్కడే మూడు లోకాలకీ కిరణముల మార్గముగా దిగి మన వరకు వచ్చి అందుతున్నాడు. ఆయన ఒక్కడు అట్లా భర్గోదేవమండలము, సవితృమండలము, సూర్యమండలము లేక ఆదిత్యమండలము, సవితృ మండలము, సూర్యమండలము. వీటన్నిటికీ roads వేసుకున్నాడండీ! వెలుగు దారులు! సూర్యుడి కిరణం వెలుగు దారి. ఆ కిరణం అక్కడ మొదలై ఇక్కడి వరకూ వస్తూవుంటుంది. అంటే ఏమిటి? ఇక్కడ నుండి అక్కడికి వెళ్లామనుకున్నవాళ్ళు అది పట్టుకుని వెళ్ళవచ్చు. అందుకని సూర్యకిరణాన్ని ఆరాధన చేసుకునే ఒక సాంప్రదాయం మనకి బాగా ఏర్పడిపోయింది. 'అర్చిర్ మార్గము' అంటే కిరణముల మార్గము. ఆ మార్గము నుండే సమస్తమైన దేవతలూ దిగి వస్తారు. ఆ మార్గము నుండే భగవత్తత్త్వము కూడా దిగి వస్తుంది. ఆ మార్గము నుండే భగవతీ తత్త్వము కూడా దిగి వస్తుంది. సూర్య కిరణంలో లేనిది ఏదీ లేదు. అన్నీ సూర్యకిరణంలో వున్నాయి. ఎందుకంటే అది లేకపోతే ఇదంతా లేదు. ఆయన మూడులోకాలూ వ్యాపించి మనవరకూ (నాలుగవ వాళ్ళము మనము, మునిమనవలము అన్నమాట) వస్తాడు. సృష్టంతాకూడా మూడుగా ఏర్పడి నాలుగులో చివరికి స్థిర పడుతూంటుంది. అందుకని నాలుగు వేదాలు, నాలుగు కాలాలు. అట్లా ఒకడు మూడింటిలోకీ వ్యాపించివున్నాడు, అని చెప్పే చోట ఇక్కడ 'అర్చిర్' అంటే కిరణములుగా వాడే వున్నాడు అని చెప్తున్నది ఈ నామం. ఒకే తత్త్వం మూడు లోకముల వెలుగుగా వ్యాపించి ఉన్నది.

## 857 సప్తజిహ్వాః

సప్తజిహ్వాః అంటే అదే కిరణము ఇలా దిగి వస్తుంటే ఆ కిరణం నెమ్మదిగా పదార్థమయలోకాలని స్పృశించినపుడు పదార్థము యొక్క సాంద్రతను బట్టి ఏడు రకాల వెలుగులుగా తయారవుతుంది. అదే కదా మనకి చిన్నప్పటి నుండి పాఠాలలో చెప్తూ వుంటారు. ఓ తెల్లని కిరణాన్ని ఓ prism ద్వారా పంపిస్తే ఏడురంగులు వచ్చాయని. ఏడు రంగులూ ఒకే కిరణంలోనుండి వచ్చినప్పటికీ ఒక్కొక్క రంగుకీ మిగతా రంగులకన్నా వైవిధ్యం ఎందుకు వచ్చిందంటే అందులో వుండే వెలుగులో తేడాబట్టి. అందుకని అగ్నికి ఏడునాలుకలు అని చెప్పారు.

సప్త జిహ్వా - భగవంతుడు ఏడు జ్వాలలుగా వస్తున్నాడని హోమం చేసేటప్పుడు ఏడుజ్వాలలు చూడవచ్చు. పుస్తకం చూస్తూండటంకన్నా జ్వాలల్ని చూస్తూ, తెలిసినవాళ్ళు చదువుతున్నది వింటూంటే కొన్నాళ్ళకు మనకు వచ్చేస్తుంది. మనమేదో ముందు నేర్చేసుకోవాలనేది వివేకమూ, వినయముతో కూడిన పద్ధతి కాదు. పెద్దవాళ్ళు చేస్తూంటే, అది చూస్తూంటే చిన్నవాళ్ళకి వచ్చేస్తూంటుంది. అది మనకి శృతివిద్య! విని నేర్చుకోవడం! పుస్తకం చూసి ఇక్కడవుందా, అక్కడవుందా అని పేజీలు తిప్పకుంటూ అటుతిప్పి, ఇటుతిప్పీ వెతుక్కోవడంతో సరిపోతుంది. అందుకని మనం జ్వాలలనే చూస్తూ హోమం చేయాలి. చేస్తున్నప్పుడు చూస్తున్నట్లైతే ఈ జ్వాలలలో ఏడురకాల జ్వాలలు కనిపిస్తాయి. వాటినే ఏడురకాల నాలుకలుగా చెప్తారు. అవి ఏడు రంగులుగానూ వుంటాయి. అందులో మూడేమో నీలానికి సంబంధించినవి. అట్లాగే ఎఱుపుకి సంబంధించినవి వున్నాయి. అలాగే పసుపుకి సంబంధించినవి. పసుపు, పసుపు రంగుగాను అంటే బంగారపు రంగనుకోండి. కొంత సింధూరం రంగులోనూ గోచరిస్తుంది. ప్రతిదానికీ మళ్ళీ మూడు మూడుగా విడిపోయే పద్ధతి ఒకటి వుంటుంది. నీలము - ముదురు నీలము, నీలము, Violet గా మారి పోతుంది. Indigo, Blue and Violet. అలాగే ఎరుపు. ఎర్రటి ఎరుపుగానూ గోచరించవచ్చు, సింధూరం రంగులో (కాషాయం రంగు అంటాం) అలాగా గోచరించవచ్చు, లేత గులాబీ రంగులో గోచరించవచ్చు. గులాబీ అంటే ఏమి రంగో తెలీదు. ఎందుకంటే గులాబీలన్నీ ఎర్రగానే

వస్తాయి. మొదటిలో గులాబీ రంగని దేనిని అన్నారంటే, చాలా లేతగా వుండే ఎరుపుని. అలాగే పసుపు కూడా బంగారపు రంగు, అక్కడ నుండి అది లేత ఆకుపచ్చ, అక్కడ నుండి ముదురు ఆకుపచ్చ. ముదురాకుపచ్చ కనుపించదు అగ్నిలో. లేతాకుపచ్చ కనిపిస్తుంది. ఆకుపచ్చా, నీలం, ఎప్పుడు ఆకుపచ్చ నీలం అవుతుందో, ఎప్పుడు నీలం ఆకుపచ్చ అవుతుందో తెలీదు. అలా వుంటాయి. ఇలా ఏడుకిరణములుగా, ఏడుజ్వాలలుగా వుంటుంది. అందుకే ఏడు కిరణముల సిద్ధాంతాన్ని జ్వాలాకూలుడు యిచ్చి వుంచాడు. ఎందుకయ్యా అంటే ఒక్కొక్క కిరణమునకీ ఒక్కొక్క ప్రభ వున్నది, ఒక ప్రతిభ వున్నది, ఒక ప్రభావం వున్నది. దానిని మించి యింకోటి వుంటుంది, దానిని మించి యింకోటి వుంటుంది. మన భూమి నుండి సప్తగ్రహాల్ని చూసినట్లైతే (ఏడు వారాల్లో వచ్చేవి) ఒక దాన్ని మించి ఒకటి వెలుగు కలిగి వుంటుంది. సూర్యుడు వెలుగైతే అక్కడ నుండి మిగతా ఏడు గ్రహాలు. ఏమిటవి? బృహస్పతి, శని, కుజుడు, బుధుడు ,శుక్రుడు, చంద్రుడు, భూమి. ఎన్నయినాయి? వారాలన్నీ లెక్కపెట్టుకుంటే ఏడు వస్తాయి. అందులో ఆదివారం సూర్యుడు కదా! సూర్యుడ్ని తీసేస్తే ఏడు ఎక్కడ నుండి వస్తాయి? భూమిని కలుపుకుంటే వస్తాయి. భూమికూడా వెలుగుతుంది. అది ఈ మధ్య మన వాళ్ళు రాకెట్టులో బయటికి వెళ్ళిన వాళ్ళు చూసి యిది కూడా వెలుగుతోంది అని చెప్పారు. దీనికీ వెలుగుంది. దీనికన్నా వెలుగ్గా శుక్రుడు, దానికన్నా వెలుగ్గా యింకోటి. అట్లా ఏడూనూ. చివరికి అన్నిటికన్నా వెలుగ్గా సూర్యుడు. ఇట్లా ఏడురకాల వెలుగులుగా వెలుగుతున్నది. అలాగే మన శరీరంలో వుండే సప్త చక్రములు. సహస్రారం నుండి మూలాధారం వరకు వుండే ఏడుకేంద్రములలో ఏ కేంద్రము లేక ఏ పద్మము లేక ఏ చక్రము ఎక్కువగా వికసించివుంటుందో దానిని బట్టి వాడి వెలుగుంటుంది. చాలామంది మూలాధారంలో వుంటారు, కొంతమంది స్వాధిష్ఠానం, కొంతమంది మణిపూరకం, మరి కొంతమంది హృదయం, మరికొంతమంది విశుద్ధి, మరి కొంతమంది ఆజ్ఞ, మరి కొంతమంది సహస్రారం. దాన్ని బట్టి వెలుగు వుంటుంది. ఏమిటి తేడా అంటే పదార్థమయ లోకాలలోకి వెలుగు దిగివచ్చినప్పుడు ఈ విధంగా ఏడు రకాలుగా అవస్థితి చెందుతుంది. అది వెలుగు యొక్క అవస్థితి కాదు. పదార్థము యొక్క సాంద్రత, సూక్ష్మత బట్టి వుంటుంది. మనలో వుండే చైతన్యమే ఈ రకంగా

అంటే మనమే ( మనలో వుండే చైతన్యము, మనలో వుండే ఆత్మ అని అంటూంటాము కదా! అంటే ఇంకా మనమే చైతన్యము, మనమే ఆత్మ అని తెలియక మన ఆత్మ, మనలో వుండే వెలుగు ఇట్లా అంటూ వుంటాము. అదే మనము) ఇట్లా ఏడు రకాలుగా వికసిస్తూ వుంటాము, అని తెలిసిన వాళ్ళకి తెలుస్తూ వుంటుంది. ఈ లోపల తెలుసుకునేవాడు పవిత్రతను జీవితంలో పెంచుకుంటూ వెళుతూంటే ఈ వెలుగులన్నీ కూడా నిత్యమై, సత్యమై తోస్తాయి. లేకపోతే తోచవు. ఓ సారి వీరబ్రహ్మంగారు ఇలాగే యోగంలో ఈ షట్చక్రాలని, వాటిగురించి వివరించి చెపుతుంటే ఒకడు విని యింటికి వెళ్ళి నిజంగా గురువుగారు చెప్పినవన్నీ వున్నాయా? ఆయన ఏమి చెప్పాడు? ఈ చక్రాలలో ఇన్ని దళాలుంటాయి, ఈ ఈ రంగులుంటాయి, ఇంత కాంతివంతంగా వుంటుంది, ఒక్కొక్క దళం మీద ఈ, ఈ అక్షరం వుంటుంది- ఇట్లా చెప్పారు. అవన్నీ Etheric plane లేక సూక్ష్మలోకాలలో, మనలో వుండే సూక్ష్మ శరీరంలో వుండేవి. ఇంటికి వెళ్ళి ఏమిచేసాడంటే వాళ్ళ ఆవిడని పడుకోబెట్టి తలనుండి మూలాధారం వరకు కత్తి పెట్టి కోసి, మామూలుగా ఒక పనసకాయ open చేసినట్టు open చేసాడన్నమాట. చూస్తే ఏమీ లేవు. అవి లేకపోగా పెళ్ళాం కూడా లేదిప్పుడు. అప్పుడు ఏడుస్తూ వెళ్ళి మీరు చెప్పారు, అవి చూద్దామనే ఉత్సాహంతో ఇట్లా చేశానూ, అవేవీ కనపడలేదు, మీరు ఎందుకిట్లా చెప్పారంటే, ఓరి పిడుగా, అని వాళ్ళింటికి పరుగెత్తుకెళ్ళి ఆయన ఆవిడకి మళ్ళీ ప్రాణం పోసి, మామూలు మనిషిని చేసి, 'అట్లా కనపడవురా. రోజూ classకి వస్తే తెలుస్తుంది. ఒక రోజువస్తే తెలియదు. అంతకు ముందు classలో వీటి గురించి ఏమి చెయ్యాలో చెప్పాను. దానికి నువ్వు రాలేదు. ఇప్పుడు వచ్చావు కాబట్టి నీకేమో ఇట్లా వుంది పరిస్థితి' అని వాడికి చెప్పారు. 'ఇట్లా చేసుకోరా, అప్పుడు ఇవన్నీ దర్శనమిస్తాయి నీలో పవిత్రత పెరిగిన కొద్దీ, మూడు లోకాలకీ సంబంధించిన పవిత్రత పెరుగుతున్నకొద్దీ' అని చెప్పారు. పదార్థమునకి వేడి పెరగాలి. తపస్సూ అవన్నీ ఎందుకు చేస్తారంటే దీనికి కొంచెం మంట పెట్టడానికి. బాగా గట్టిగా వుండే కందిగింజ తిన్నామనుకోండి, పన్ను ఊడిపోవచ్చు. మన పళ్ళు అంతంతమాత్రమే కదా! ఉడకపెడితే? అట్లా శరీరంలో స్వాధిష్టానచక్రంలో వుండే అగ్నిని ప్రజ్వలితం చేసి శరీరంలో వుండే తమస్సుని బాగా ఉడకపెడితే ధాతువులన్నీ కూడా తేలిక పడతాయి.

అప్పుడు మనిషి తేలిక పడతాడు. అప్పుడు అందులోంచి వాడికి కాస్త వెలుగు దర్శనాలు జరగడానికి అవకాశం ఏర్పడుతూంటుంది. అందుకనే తపస్సు చేసే వాడికి ఒంట్లోంచి వేడి పుట్టాలట. ఎలాంటి వేడి పుడుతుందంటే ఒళ్ళంతా చెమటలు పోస్తాయట, తాపం కలుగుతుందట, చాలా వేడి చేయడం వల్ల చెంబులు చెంబులు మజ్జిగ తాగుతారట. అలా ఉంటుందది. ఈ ఏడు చక్రాలలో కూడా ఏడు రకములైన కాంతులు మీకు గోచరిస్తాయి. అవన్నీ మనకి ఇట్లా వున్నాయని యోగ శాస్త్రంలో ఇస్తారు. అలాగే మనలో ఏడు గ్రహాలలో కూడా అట్లా ఉన్నాయి. అలాగే ఏడు లోకాలలో ఒక లోకాన్ని మించి ఒక లోకం. భూలోకం నుండి సత్యలోకం వరకు వెలుగులు అట్లా ఒకదానికన్నా ఒకటి రెట్టింపుగా వెలుగుతూంటాయి. 1 x 2, ఒకటి రెండవుతుంది, రెండు నాలుగవుతుంది, నాలుగు పదహారవుతుంది అలా పెరుగుతుంది. అంత కాంతివంతంగా ఉంటుంది అసలు విషయం. అక్కడ నుండి దిగి వస్తూంటే మనవరకూ వచ్చేసరికీ--, అప్పటికే మనకు సూర్యుడి వెలుగు చూడలేకపోతున్నాము. మనం చూడలేకపోతున్న వెలుగు ఏదైతే ఉందో అదే అన్నిటికన్నా నాసిట. ఇంక ఆపైన చూసుకోండి. అందుకనే ముచికుందుడు శ్రీకృష్ణుడ్ని చూడలేకపోయాడు అని చెప్తారు. సహస్రార్చి కదా! అందుకనే పరమగురువులు ఏం చెప్తారంటే 'చూడాలి చూడాలి చూడాలని ఊరికే తాపత్రయ పడుతూంటారు, కనపడితే చచ్చిపోతారు', అని చెప్తారు. మరువు మహర్షి రాసిన ఒక సందేశం ' మేము మీకు కనపడాలని మాకూ ఉంటుంది. మీరు మేము కనపడాలని ఎంత తాపత్రయ పడుతూంటారో, ఆశపడుతూంటారో, మోహపడుతూంటారో అంతకు మించి మీ మీద మాకుండే కరుణచేత, ప్రేమచేత, ఒక రకమైన మమకారం చేత, మీక్కూడా మేముకనిపించాలని తపన చెందుతాం. కానీ కనిపిస్తే చచ్చిపోతారే, ఎట్లా కనిపిస్తాం?' అదేదో సినిమాలో కుర్రాడికి చెప్తారు నీవు చూస్తే మీ అమ్మ చచ్చిపోతుందని. చిన్నప్పుడు వచ్చింది. ఇట్లాగే అన్నమాట. వాళ్ళను చూస్తే మనం చచ్చిపోతాం. ఎందుకంటే భరించలేం. మనం గట్టిగా మధ్యాహ్నం 12 గంటలకి ఎండలో ఒక గంట కూడా పని చేయలేం. ఏం భరించగలదు మన శరీరం? ఆ కాంతిని ఎట్లా భరించగలం? భరించలేము. సాధన చేత బాగా కాంతివంతమైన శరీరాలు సంపాదించుకుని, యోగ నిష్ఠ చేత, పవిత్రమైన భావముల చేత, దైనందిన

చర్యలలో ఏ పాపమూ లేక మలినము అంటనట్టుగా దశాబ్దాలు మీరు జీవిస్తూ ఉంటే మాకెంతో సంతోషంగా ఉంటుంది. ఎందుకంటే అప్పుడు ఏదో కొంత చూపించవచ్చుట. అప్పుడు కూడా ఏం చేస్తారో తెలుసా! కొంత భాగం చూపిస్తారు. అంతా చూపించరు. నెమ్మదిగా అలవాటయిన తరువాత మొత్తం అంతా చూపిస్తారు. ఓ చెయ్యి కనిపిస్తుందట. లేకపోతే ఓ పాదం కనిపించి అబ్బా! ఏంటి యింత అద్భుతమైన పాదం కనిపించింది అనిపిస్తుంది. ఇంత అద్భుతమైన చెయ్యి కనిపించింది అనిపిస్తుందట. అట్లా కాస్త చేతులూ, కాళ్ళూ, మొండెం అంతా అలవాటు చేసిన తర్వాత ముఖం చూపిస్తారు. Master EK గారికి ఏమి జరిగింది CVV గార్ని చూసిన సందర్భంలో? ముందు పాదాలు కనిపించినాయి. తర్వాత కాళ్ళు కనిపించినాయి. ఆ తర్వాత పొట్ట కనిపించింది. ఆ తర్వాత మిగతా మొండెం అంతా కనిపించింది. ఆ తర్వాత ముఖము. క్రమశః అట్లా పైవరకూ మొత్తం రూపం కనిపించింది. ఒక్కసారి కనిపిస్తే భయపడిపోయి మనకి ఉన్న మతి పోతుంది. అందుకనే భగవద్భక్తి అడ్డగోలుగా చేసే వాళ్ళకు ఒక్కోసారి మతిపోతుంది. సాధనలో మనకి చాలా ఉన్నాయి. అవి ప్రత్యేకించి CVV గారి మార్గంలో. ఆయన్ని ఎక్కువ ముట్టుకుంటే shock కొట్టేస్తుంది. అతిగా రాబోకు నా దగ్గరకి, నాతో పెట్టుకోకు అనేటట్టుగా ఉంటుంది. ప్రొద్దున్నొక్కసారి, సాయంత్రం ఒక్కసారి, మహాఅయితే పడుకునేటప్పుడొక్కసారి అంత వరకూ చాల్లేరా. ఎక్కువ ముట్టుకోబోకు కాలిపోతుంది అంటారు. ఎందుకిలా చెప్పారు? మనం ఉండే పరిస్థితిని బట్టి. అంతేకానీ ఆయన నేను చాలా గొప్ప అని చెప్పడానికి కాదు. Master EK గారు ఒకసారి నాతో చెప్పారు బీచ్ రోడ్డులో బాగా గుర్తు. 'Master CVV కాలి గోరు చాలు ఈ భూమికి. మనకి అవగాహన లేదు ఆయన గురించి. ఇంకొక 2000 సం తరువాత ఈ రోజున శ్రీ కృష్ణుడి గురించి ఎట్లా భావన చేస్తున్నామో అట్లా భావన చేస్తారోయ్. ఆయన చేస్తున్నపని చాలా ఎక్కువ. ఆయన గురించి తెలుసుకోవడం మన వల్ల అయ్యే పని కాదు. ఆయన చెప్పింది చేస్తే అంతే చాలు' అని. మనకెవ్వరికీ Master CVV గారు కలలోకి రారు. వస్తే Master EK గారు వస్తారు. ఆ దేవతలూ, ఈ దేవతలూ వాళ్ళెవరో వస్తే రావచ్చు. ఏదో గుడికి వెళ్ళి నట్లు, విగ్రహాలు చూచినట్లు ఇవి జరగవచ్చు. CVV గారు కలలోకి రావడమే ఒక పెద్ద లెక్క. ఎందుకివి

చెప్తున్నానంటే పవిత్రత పెంచుకుంటే ఇట్లా ఈ లోకాల్లో మనకు దర్శనాలుంటాయి. మణిపూరకం దాటితే గట్టెక్కినట్లే. కుర్చీ పైన కూర్చోవడం మణిపూరకం దాటడం. మనం వుండేదేమో ఎక్కడో గోతుల్లో వుంటాం, ఆలోచించేదేమో ఎవరెస్ట్ శిఖరం గురించి. ముందు గోతిలోంచి బయటికి రావడానికి ఒక నిష్ఠ మనం అందుకొని దాని ప్రకారం జీవించడానికి ఎక్కువ ప్రయత్నం చేయాలి. అది పదుల జన్మలు పట్టవచ్చని దేవాపి మహర్షి అన్నారు. 'పదుల సంవత్సరములు పట్టవచ్చు లేక పదుల జన్మలు పట్టవచ్చు. నీ దీక్షని బట్టి వుంటుంది. నీకు అంతర్ముఖంగా బోధనలన్నీ అప్పుడు జరుగుతాయి. ముందు పవిత్రత పెంచుకుంటూ పో. భావ పవిత్రత, ఇంద్రియ పవిత్రత, శారీరిక పవిత్రత.' అందుకని మనవాళ్ళు బాగా ఆచారం పేరున పవిత్రత ఇచ్చారు. పవిత్రత పోయింది, ఆచారం మిగిలింది. అందుకని పవిత్రత పెంచుకుంటూ వెళ్తుంటే సహజంగా సదాచారం మళ్ళీ మనలో ఉద్భవిస్తుంది. పవిత్రత అక్కర లేదు, ఆచారం అక్కరలేదు అనే పిడివాదం రాదు. ఎందుకంటే నీలో పవిత్రత పెరుగుతుంటే పెద్దలు ఎందుకు మనకు ఈ ఆచారం ఎందుకిచ్చారో తెలిసి, దాని ప్రకారం జీవించడానికి ఒక ప్రయత్నం అప్పుడు అంతర్ముఖంగా కలుగుతుంది. అప్పుడు పెంచుకుంటూ వెళ్ళచ్చు. పెంచుకుంటూ వెళ్తే ఈ వెలుగుల దారి మనకి కొద్దికొద్దిగా గోచరిస్తుంది. హృదయంలో బంగారపు కాంతి గోచరిస్తుంది. ఇహ అక్కడ్నించి మొదలు పెడితే పైకి వెళ్ళిన కొద్దీ విశుద్ధిలో బంగారంతో కూడిన లేత పసుపు, కొద్దికొద్దిగా నీలం, ఆజ్ఞలోకి వెళ్ళేసరికి తెల్లటి మిరుమిట్లుగొలిపే తెలుపు లేకపోతే ప్రశాంతమైన మిట్టమధ్యహ్నం ఎండలో ఏ విధంగా ఆకాశం వెలిగి వుంటుందో అట్లా గోచరించవచ్చు. లేకపోతే నీలమైన ఆకాశంలో చంద్ర బింబంలాగా వెలుగు గోచరించవచ్చు. ఇవన్నీ జరిగే అవకాశం వుంది. ఊహించుకుంటూవుంటే అప్పుడపూడూ aberrations గా వస్తూవుంటాయి కలల్లో. అది అలా కాకుండా మనం ధ్యానంలో కూచుంటే ఈ స్థితులన్నీ పొందవచ్చు. నిజానికి సరి అయిన ధ్యానం చేసుకునేవాడి భావన ఎట్లా వుండాలంటే తను భూమికి పైన కూచున్నట్లు భావన చెయ్యాలి. అదే ధ్యానయోగంలో శ్రీ కృష్ణుడు చెప్పింది కూడా. భూమికి కొంచెం ఎత్తుగా కూర్చో అని చెప్తే అర్థం ఏమిటంటే నేలమీద ఏదో పీట వేసుకో, ఆసనం వేసుకో అని ఒక అవగాహన. నిజంగా లేచినవాడు అంటే లోపల స్థితియందు

ఊర్ధ్వగతి చెందినవాడు తన క్రింద అంతా భూమివుంది, తనపైన చుట్టూ అంతా గోళములు, నక్షత్రములు, నీలమైన ఆకాశము ఇది మాత్రం వుంటుంది. వాడికి కుండలిని లేచింది అనేది సత్యం. అలా వుంటుంది. ఇవన్నీ జరగాలంటే మనం మామూలుగా ఇవన్నీ చెప్పకుంటే ఎలా వుంటుందంటే ఏమంటే దీనికేమీ  ఋజువులు లేదు కదా భౌతికంగా, అందుకని కోస్తున్నట్టుగా వుంటుంది. కొయ్యాల్సిన అవసరం ఋషులకి లేదు. కాకపోతే ఆ స్థితి మనకి అందలేదంటే మనం ఇంకా దానికి సంబంధించి ప్రాథమికమైన నియమములు పాటించలేదనే అర్థం తప్ప అవి లేవని కాదు. మామూలుగా మనకి దొరకనిది మనకు లేదనుకుంటాం. మనకి లేదు తప్ప ప్రపంచానికి లేదనకూడదు. అందుకని ఈ  వెయ్యి కిరణములుగా అహర్నిశలూ దిగివస్తున్నవాడు సప్త జిహ్వః. ఏడు స్థితులలో వున్నాడు. ఎందుకంటే తర్వాత నిచ్చెనగా వున్నాడు. అవే ఏడుగుర్రాలు. సూర్యుడికి ఏడుగుర్రాలని చెప్తాం కదా! 'సప్తాశ్వరథమారూఢం, ప్రచండం'. ఆ విధంగా కిరణాలుగా దిగి రావడంతో మనకో నిచ్చెన ఏర్పడుతుంది. ఆ నిచ్చెనలో ఏడో మెట్టు దగ్గర మనం వుంటాం. అదే ఏడుకొండలు ఎక్కడం. ఏడుకొండలు యెక్కాలంటే యిట్లా యెక్కాలి  లోపల నుండి. అంతవరకూ బయట ఎక్కుతూంటే కాస్త ఒళ్ళన్నా తేలికపడుతుంది. చెమటలు పడతాయి, పైకెళ్ళి స్నానం చేసేసరికి శరీరం చాలా తేలికవుతుంది. అట్లా రోజూ వుండాలి. అంటే ఎంత తమస్సు ఒంట్లో వున్నదో తెలుస్తుంది. మనం పైకి ఎక్కి స్నానం చేసినతర్వాత ఒళ్ళు తేలిక, బయలుదేరేముందు ఒళ్ళు బరువు, ఈ రెండూ కనక మనసులో ఒకసారి తూకంవేసి చూస్తే రోజూ యింత పేరుకున్నది మనం తీసేయటానికి కావలసినంత ముమ్మరమైన కార్యక్రమం శారీరికంగా ఏమన్నా వుందా? తమస్సు పెరిగిన కొద్దీ బద్ధకం పెరుగుతుంది. బద్ధకం పెరిగినకొద్దీ పనులయందు విముఖత పెరుగుతుంది. విశ్రాంతి సమయం పెరుగుతుంది, పని సమయం తగ్గుతుంది. పని సమయం పెరగాలి. విశ్రాంతి సమయం తగ్గాలి. మరి వేడి పెంచాలండీ. పెంచితేగానీ ధాతువులు తేలిక పడవు. వేడి పెంచాలంటే వేడి ఎక్కడ నుండి పని చేస్తుంది? భావనలోంచి పని చేస్తుంది. మనస్సులో ఉన్నది వేడి. Mind is fire. అక్కడ నుండి ఒక్కొక్క పని ఒక్కొక్క పని. అందుకనే ఒక నిర్దిష్టమైన సాధన ఇద్దామనుకున్న సద్గురువు శిష్యుడ్ని విశ్రాంతిగా  వుంచడు. వెయ్యిరకాలుగా engage చేస్తాడంటం చూశారా,

ఏదో ఒక పనిలో వాడు వుండాలి. పని లేదనే పరిస్థితి వుండకూడదు. అలా వుంటే ఏమవుతుందంటే తమస్సు పోయి రజస్సు వస్తుంది. ఆ రజస్సు కూడా ఆశయముల కొరకు నిర్వర్తింపబడిన రజస్సు అయితే వెలుగులోకి తీసుకువెళ్తుంది. అందుకని స్వాధిష్ఠానం బాగా మనం ప్రాణాయామం బాగా చేస్తే అంటే బాగా ఉఛ్వాసనిశ్వాసాలు బాగా చేస్తే వేడి పుడుతుంది. అది శరీరంలో నిహితమైన వేడే. దాన్ని విసరటంవల్ల బయటికి వస్తూ వుంటుంది. ఎక్కడ వుంది అది? ఇక్కడే వుంది. కట్టెలోనే వుంది కదా! మనం హోమం చేసేటప్పుడు అది బయటికి వస్తుంది. బయటికి వస్తున్న కొద్దీ అది ఏమవుతోంది? కట్టె సూక్ష్మరూపం ధరిస్తోంది. అట్లా శరీరంకూడా. ఆ విధంగా ఏడు నిచ్చెనలూ మనం ఎక్కుకుంటూ వెళ్ళాలి. ఎక్కుకుంటూ వెళ్లాలంటే ప్రాథమికమైన నియమములు మనకింక అక్కరలేదనుకోకూడదు. రెండుపూటలా స్నానం చెయ్యి అని చెప్పారనుకోండి గురువుగారు చెయ్యాల్సిందే. ఒకటికి పదిసార్లు చేతులు, కాళ్ళు కడుక్కో, అంటే కడుక్కోవాలి. ఏరోజా విప్పిన బట్ట మళ్ళీ వేసుకోవద్దు అని చెప్తే అదే చేయాలి. ఆయనట్లాగే చెప్తాడు అని నిర్లక్ష్యం చేయరాదు. ఇవన్నీ ప్రాథమిక సూత్రాలు. రోజా తలనిండా స్నానం చెయ్యి. ఎందుకంటే తలచుట్టూనే కదా చేరుతాయి తలపులన్నీ. అవి ఏపూటకాపూట స్నానం చేసినపుడల్లా అవి వదిలేయాలంటే, మన్ని వెంట్రుకలు వదిలేస్తాయేమోనని చెయ్యరు చాలా మంది తలనిండా రోజా చేస్తే వెంట్రుకలు వూడిపోవూ? అంటారు. ఏవి వూడి పోవు. బలపడతాయి. మరి అది నమ్మకం లేక చెయ్యము. కానీ వాళ్ళు చెయ్యమని చెప్పారు. Practical occultism అని H.P.Blavetsky కి వాళ్ళ గురువిచ్చిన కొన్ని ప్రాథమిక సూత్రాలున్నాయి. ఒక్కసారి తీసి చదువుకోండి. ఇవి జరగకుండా advanced steps కుదరవు. దారిలో ఎక్కడో ఆగిపోవడం, వ్యష్టపడడం, విసుగుచెందడం, నిస్పృహ, నిరాశ ఇవన్నీ చోటు చేసుకుంటాయి. అందుకని ఎప్పుడు కూడా మన structure మన నిర్మాణం పూర్తిగా జరగాలంటే పునాదిరాళ్ళు గట్టిగా వుండాలి. రెండో అంతస్తుకు వెళ్ళగానే యింక పడిపోతుందేమో అనుకుంటే మరి ఆగిపోవాలి. పునాది ఎప్పుడూ గట్టిగా వుండాలి. అందుకనే మాస్టరుగారు ఏంచెప్పారంటే ప్రాథమికమైన సూత్రాలు వదలకుండా ముందుకు సాగాలి తప్ప, యివి వదలి అవి చెయ్యడం కాదు అన్నారు. సాగడం కిరణం లక్షణం. అక్కడ్నుంచి మొదలై

ఇక్కడికొచ్చిన కిరణం దారిలో మధ్యలో ఎక్కడా ఆగదు. మనం చూడండి, అక్కడ నుండి ఇక్కడకొస్తే అక్కడ వుండం, ఇక్కడ నుండి అక్కడికెళ్తే ఇక్కడ వుండం. కిరణం ఎక్కడ నుండి బయలుదేరి ఇక్కడికొచ్చినా మొత్తం అంతా వుంటుంది. అట్లాగే సాధనలో కూడా ఒక మెట్టు నుండి ఇంకొక మెట్టు ఎక్కితే పాత మెట్టు తీసేయకూడదు. Additions తప్ప Deletions వుండవు. అది సాగడం. నువ్వు యెంత సాగితే అంత శరీరం వంగుతుంది. ఎంత శరీరం వంగితే, ఎంత లేతగా తయారైతే అంత వెలుగునందుకోవడానికి అర్హత కలుగుతుంది.

## 858 సప్తైధాః

సప్త యిథములంటే హోమానికి మనం పేరుస్తామే సమిథలు. ఏడు సమిథలు. 'త్రి సప్త సమిథ: కృతాః' అని మనకి పురుషసూక్తంలో వస్తుంది. ఏడులోకాలుగా ఏర్పడింది ఆయనే! అంటే ఇక్కడ ఏడులోకాలకీ ఏడు సమిథలు అని చెప్పడంలో గుమ్మాలు గుమ్మాలుగా వున్నాయన్నమాట ఇవి. ఇదే దుర్గ! ఇంటికి కూడా గుమ్మాలుగా పెట్టుకుంటూవుంటాం. ఏమిటి? లోకానికీ లోకానికీ మధ్య వుండే చైతన్య స్థితిలో తేడా, పదార్థంలో తేడా. పదార్థం సాంద్రత పెరుగుతూవుంటే చైతన్యం యొక్క పరిమితి తగ్గుతూ వుంటుంది. కిందికి వెళ్ళినకొద్దీ పదార్థం పెరుగుతూ వుంటుంది. పైకి వెళ్ళిన కొద్దీ వెలుగు పెరుగుతూవుంటుంది. ఇవి గుమ్మాలు. ఏడు ద్వారాలు. ఈ ఏడుద్వారాలలో ఏడు అంతస్తుల భవనంగా సృష్టి నిర్మాణం చేయడానికి ఈ ఏడు నిచ్చెనలు పెట్టుకున్నారు. ఆవరణలు. ఏడు లోకాలు. ఏడు లోకాలకి ఏడు సమిథలు అని అర్థం. వీటన్నిటిగా తనే ఏర్పడ్డాడు. తనే ఏర్పడడం అంటే ఏమిటి? తన నుండి ఏర్పడిన ప్రకృతికి తను సహకరించడం చేత ఆమె యొక్క పదార్థము సూక్ష్మత నుండి స్థూలం చెందుకుంటూ వస్తూ వుంటే ఇక్కడ కాస్త మారుతుంది అనగానే అక్కడ ఒక గుమ్మం పెట్టారు వాళ్ళు. ఇప్పుడు గుమ్మాలు లేవు ఇళ్ళకి. అప్పుడు గుమ్మాలుండేవి. అది దాటుతున్న చోటల్లా కూడా అమ్మవారు పెరుగుతూ వస్తుంటారు, అమ్మ వారు తరుగుతూ వస్తుంటారు. ఆయనంతే. అమ్మవారి యొక్క పదార్థం సాంద్రతో, సూక్ష్మతో చెందుతూ వుంటుంది. ఆ చెందుతున్నచోటల్లా కూడా కాస్త దాటుతున్నప్పుడు తెలుస్తుంది. మనక్కూడా ఎంత గుమ్మాలు లేని యింట్లో తిరుగుతున్నా పూజగది భావం పూజగదిలో వుంటుంది. వంటగది భావం వంటగదిలో వుంటుంది. స్నానాలగది భావం స్నానాలగదిలో వుంటుంది. పడకగది భావం పడకగదిలో వుంటుంది. ఆ గదిలోకి వెళ్ళగానే ఆ భావం రావడంలేదూ? అట్లాగే ఏడులోకాలు ఏడు రకాల చైతన్య స్థితులు అవి. స్థితులు చాలావున్నాయి. చైతన్యం ఒకటే అయినాకూడా. మళ్ళీ ఏడులో ఏడుగా కూడా వుంటుంది. అది సప్తైధాః. నలభైతొమ్మిది. అందుకనే seven planes, seven sub planes అంటారు. ఇవన్నీ యిట్లా అలమారలాగా వుంటుందండీ. లేపోతే నిచ్చెనలాగా వుంటుంది. అదే మనకి ఏడుకొండలు.

కొండకి కొండకి మధ్య బోలెడు మెట్లు లేవూ? ఏడుమెట్లే కావు కదా ఏడుకొండలు. అట్లామనకి సప్తైధాః సహస్రార్చి సప్తవాహనః సప్తజిహ్వః.

## 859 సప్తవాహనః

ఏడు వాహనాలుట. వైష్ణవ సంప్రదాయంలో ఆశ్వయుజమాసంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి కదా! అప్పుడు ఏడు వాహనాలెక్కించి రోజుకో వాహనం స్వామివారికి. ఏమిటి ఈ వాహనాలు అంటే ఆయన ఎక్కి తిరిగేవి అని. వీటిని యోగ సాంప్రదాయంలో ఒక పద్ధతిగా చెప్తారు. వైష్ణవ సాంప్రదాయంలో ఒక ఆచారంగా కూడా ఉన్నది. రెండూ చెప్పుకుందాం. భగవంతుడి ఏడు వాహనాలూ వైష్ణవ సాంప్రదాయంలో వాళ్ళు భగవంతుడి ఆరాధనాపరంగా ఏర్పరచుకొన్నది ఏమిటయ్యా అంటే ఒక వాహనం గరుత్మంతుడు, ఒక వాహనం ఆది శేషుడు, ఇంకొక వాహనం మర్రి ఆకు. 'తెప్పగా మఱ్ఱాకు మీద తేలాడువాడు' అని పాట ఉందిగా. అంటే అది ఎక్కించినపుడు ఆ పాట వచ్చేసిందన్నమాట అన్నమయ్యకి. అక్కడే ఉన్నాడు కదా! అయ్యవారి బ్రహ్మోత్సవాలన్నీ చూసుకున్నాడు అన్నమాచార్యులవారు. అదొక వాహనం. ఆ తర్వాత మనిషి ఒక వాహనం. ఎన్నో వాడయ్యాడు? నాలుగు. మధ్యలో ఉంటాడు వీడు. పైనుంచైనా నాలుగే, క్రింది నుంచైనా నాలుగే. మొత్తం ఏడులో మనిషి మధ్యస్థం. అందుకనే వీడిలో ఆ మూడూ, ఈ మూడూ కూడా కలుస్తాయట. ఇహ పై మూడూ క్రిందికి రాలేవు క్రింది మూడూ పైకి వెళ్ళలేవు. వీడు మాత్రం పైకి వెళ్ళాగలడు, క్రిందకి రాగలడు. అందుకనే నరుడు పూర్ణమైన నారాయణ తత్త్వానికి అర్హత కలిగిన వాడు. నారాయణుని యొక్క పూర్ణమైన అస్తిత్వం మళ్ళీ నరుడిలో కలుగుతుంది. నరుడు అనుభూతి చెందవచ్చు. అందుకని దేవతలకన్నా కూడా గొప్పవాడు మానవుడు, గుర్తుపెట్టుకోండి. ఎందుకంటే వాళ్ళు కిందకి వచ్చి పని చేయలేరు. ఈ క్రింద ఉండేవి పైకి వెళ్ళి పని చేయలేవు. పైనా క్రిందా పని చేయగలిగినవాడు మానవుడొక్కడే! కనుక నాలుగో వాహనం మానవుడు. ఐదు జంతువు. జంతువాహనం కూడా ఉంటుంది. ఆరు చెట్టు. ఏడు అణువులు. భూమి అంటారన్నమాట. భూమి ఒక వాహనం. చెట్టు ఒక వాహనం. చెట్టు మొన్న చెప్పుకున్నాం కదా! న్యగ్రోధో, ఔదుంబరో, అశ్వత్థః అదొక వాహనం. జంతువొక వాహనం. మనిషి ఒక వాహనం. కిందనించి కూడా నాలుగవ వాడే. ఆకు ఒక వాహనం. పాము ఒక వాహనం. పామంటే కాలం అని అర్థం. గరుత్మంతుడంటే స్పందనం అని అర్థం. అవ్యక్తమైన తత్త్వం

స్పందనాత్మకంగా ముందు వ్యక్తమై అక్కడ నుండి బయటికి వస్తుంది. ఆ స్పందనం జరగంగానే బొడ్డు నెమ్మదిగా విచ్చుకుని అందులోంచి ఒక గోళం ఏర్పడి, ఆ గోళం లోంచి ఇంకో కాడ బయటపడి, ఆ కాడలోంచి కమలం బయటకి వచ్చి అది నాలుగు రేకులుగా విచ్చుకుంటే, అందులోంచి ఇంకో ఆయన బయటకి వస్తే, ఆయన పనులు చేస్తూ ఉంటాడు. వాళ్ళకెంత ఓపికో! ఎంత కవి సమయమో! ఎంత చక్కగా వర్ణించి ఇచ్చారో. మనకర్థమయ్యేట్టుగా ఇచ్చారు . లేకపోతే కమలం, బొడ్డు ఇవన్నీ చెప్పకపోతే మనకి తెలీదుకదా! కాబట్టి మనకు కనబడేవాట్లోంచే ఆ తత్త్వాన్ని చూపించి ఇచ్చారు . ఇట్లా ఏడు వాహనాలు. అట్లాగే ఏడు లోకముల్లో కూడా వుండే జీవులు ఏడురకముల వాహనములు భగవంతునికి. సత్యలోకంలో వుండే జీవులున్నారు. మనలో కూడా ఏడు లోకాలున్నాయి కదా! మనం మొదటి వాహనం దేవుడికి. ఎందుకంటే మనం వాహనంగా ఆయన కూచుంటే మనం తిరుగుతున్నాం. ఆయన కూచోకపోతే ఏమీ లేదు పరిస్థితి. ఆయనే మనంగా వస్తాం కదా. అదేగా సోహమస్మి. దేవుడే జీవుడుగా తయారవుతాడు. అది మొదటి వాహనం. జీవుడు బుద్ధి అనే దాంట్లోకి దిగి పని చేస్తూ వుంటాడు. అది రెండవ వాహనం. బుద్ధి ప్రకారం బహిరంగంలో నిర్వర్తించడానికి మనస్సు కావాలి. అదొక వాహనం. అక్కడ నుండి ఐదు భూతములతో చేయబడిన శరీరము. అదొక వాహనము. అంటే ఐదు భూతాలు ఐదు వాహనాలు. అంటే మనలో ఆకాశతత్త్వం వాహనమెక్కి వుంటాడు విశుద్ధిలో. వాయుతత్త్వం అధిష్ఠించి వుంటాడు హృదయంలో. జలతత్త్వం అధిష్ఠించి వుంటాడు మణిపూరకంలో. అగ్నితత్త్వాన్ని అధిష్ఠించి వుంటాడు స్వాధిష్ఠానంలో. పదార్థమయమైన తత్త్వాన్ని అధిష్ఠించి వుంటాడు మూలాధారంలో, ఇట్లా ఏడు వాహనాలెక్కి తిరుగుతూ వుంటాడు. మనం తిరుగుతున్నాం అని అనుకుంటే అనుకోనిస్తాడు. వాడే తిరుగుతున్నాడు. మనని ఎక్కాడు ముందు. మనకది తెలియదు. మన భుజాలెక్కేసాడు. మనకది తెలియడంలేదు. అది మనం అనుకుంటున్నాం. ఎందుకు? అనుకోవడంకోసం. ఎందుకంటే సహజంగా వాడే మనం కాబట్టి అట్లా అనుకుంటాం. వాడు మనమే అయేసరికి మనకి పరిమితత్త్వం వస్తుంది. వాడుగా వుంటే అపరిమితత్త్వం. మనలోకి దిగిరాగానే మనం మొట్టమొదట ఆయనకి వాహనం అయ్యామండీ. అందుకని సంకర్షణుడు వాహనం అని

చెప్తారు. అహంకార స్వరూపుడు. అంటే లేవంగానే నేనుగా వున్నామని కదా అనుకుంటాం మనం. ఉన్నామని అప్పుడు కదా తెలుస్తుంది. లేచిన తరువాత కదా! కాబట్టి మొట్టమొదట లేవడం అంటే ఆయన మన మీద ఎక్కడమే. పడుకున్నప్పుడు మనకూ్కడా విశ్రాంతి. లేచినప్పుడు మన మీదికి లేచామన్నమాట. అక్కడ నుండి మనం బుద్ధిలోకి లేస్తాం. ఏమిటి యివ్వాళ కృష్ణాష్టమి ఇట్లా మొదలు పెడుతాం. బుద్ధి పని చేస్తే ఈ రోజు కృష్ణాష్టమి పూజ, దేవుడు ఇవన్నీ వస్తాయి. ఉత్తినే సరాసరి జారిపోయామనుకోండి బుద్ధి అనే మెట్టు మీద కాలు వేయంగానే మనం ఏం చేస్తామంటే జారిపోయి మనస్సులోకి వస్తాం. అప్పడేమవుతుందంటే 'ఏమిటి వండుతారో యింట్లో తినడానికి' అనిపిస్తుంది. ఇవ్వాళ ఇంట్లో వంటేమిటనేది ఎక్కువగా గుర్తొస్తూ వుంటుంది. లేకపోతే ఇవాళ మనం ఏం పొందాలి ? అదోటి వుంటుంది. ఏం పొందాలి అనుకుంటే జంతువైపోతామట. పెద్ద పెద్ద philosophers అనుకుని English లో బాగా రాస్తుంటారు. 'What shall this day offer to me' అనుకోవాల్ట పొద్దున్నే. ఈ రోజు నాకు ఏం అందిస్తుంది? ఏం అందివ్వడం? ఏం నువ్వేం అల్లుడివా? ఇట్లా కూచుంటే అన్నీ తెచ్చి అందివ్వటానికి ? 'What shall I offer to this day' అని అనుకుంటాడట సంస్కారవంతుడైన మానవుడు. అలా అనుకున్నవాడు బుద్ధిలో వుంటాడు. ఈ రోజు మనకేమి అందిస్తుంది అని అనుకునేవాడు మనస్సులోకి వస్తాడు. ఇంక అక్కడ్నుండి అట్లా అట్లా దిగి వస్తాం కదా! ఈ దిగుడంతా మనమే చేస్తాం. ఇట్లా దిగి మనం, అట్టడుగు కిరణం అంటే ఏమిటో తెలుసా ? ఏడో కిరణం violet, అందుకనే ఈ కిరణం కాళ్ళు బెణికినా, కీళ్ళనొప్పలొచ్చినా ఏడో మెట్టు, కింద మూలాధారం అంటే పదార్థాన్ని regulate చేస్తుంది కాబట్టి, 'Violet ray' meditate చేయమని చెప్తారు healing system లో. పదార్థమయ లోకాన్ని నియమిస్తున్నది Violet ray. అట్టడుగ్గా Violet ray గా దిగి వస్తాడు. అంతకన్నా పైన కొంచెం గులాబీ రంగులో దిగివస్తాడు. అదీ వాహనమే. అంతకన్నా పైన సింధూరం. Orange కాషాయరంగులో దిగి వస్తాడు. అంతకన్నా పైన వాహనం హిరణ్మయమైన రంగు, అంతకన్నా పైన లేత నీలం, Aquamarine అంటాం, నీలమా, ఆకుపచ్చా తెలియదు. నీలంగానూ కనిపిస్తుంది, ఆకుపచ్చగాను కనిపిస్తుంది. మాస్టరుగారు Spiritual Astrology లో నెమలిమెడ వలే

వుంటుందని వ్రాస్తారు. ఒక్కోసారి ఆకుపచ్చగా మెరుస్తూ వుంటుంది, ఒక్కోసారి నీలంగాను వుంటుంది. భ్రూ మధ్యం లోకి నీలంగా వస్తాడు, సహస్రారము లో ముదురు నీలం (చీకటా, నలుపా, నీలమా) తెలియని నీలం. అన్నిటికీ మించి తెలుపు. ఇట్లా వాహనాలు. కిరణాల వాహనాలు. అలాగే శబ్దముల వాహనాలు. ఏడు శబ్దాలు. ఏడు వాహనాలు వాహనాలే. ఇట్లా ఏడు ఏడు అండీ అందుకనే ఆయనకి ఇవన్నీ వాహనాలు. వాహనాలుగా దిగి వచ్చినప్పుడు వాహనం కూడా అతడే. వాహనం వేరు అతడు వేరు అనుకోవద్దు. అది ఒక స్థితి చైతన్యం. ఇన్ని రూపాలుగా దిగి వస్తున్నాడు కదా! ఇన్ని లోకాలు ఇప్పుడు చెప్పామే ఏడు లోకాలలో ఆదిత్యులు ఉన్నారు, రుద్రులు ఉన్నారు, వసువులు ఉన్నారు. మూడు రకాల దేవతలు పైన. ముందు అదిత్యులు, తరువాత రుద్రులు, తరువాత వసువులు, తరువాత మనం. నాలుగవ వాళ్ళం. మళ్ళీ మన క్రింద మూడు. ఏమిటి? పశువు, వృక్షం & పదార్థం. ఇట్లా ఏడుగా వాడే ఏర్పడ్డాడు కూడా, వాడు ఎక్కి తిరుగుతున్నా కూడా, వాటిని అధిష్టించి ఉన్నాడు, వాటిగా కూడా ఉన్నాడు. అదీ అక్కడ సమన్వయం. భారతీయ ఋషుల సమన్వయం అక్కడ కనిపిస్తుంది. Ice glass తయారుచేసి అందులో నీరు పోసినట్టు. Ice glass కూడా నీళ్ళ చేత చేయబడినది. Ice glass స్థితి, నీటి స్థితి కన్నా కొంత ఘనీభవించిన స్థితి. ఒకసారి అందులో నుండి ఆవిరి వస్తుంది అనుకోండి, వేడైతే ఆవిరులు వస్తాయి, Iceలో నుండి ఆవిరులు వస్తాయి కదా! అమ్మో ఎంత వేడి వుందో Iceలో అనుకుంటాం. అందుకని Ice తింటే వేడి చేస్తుంది అంటారు. ఇట్లా స్థితి బేధాలు చెంది వుంటాడు కాబట్టి 'సప్తైధాః' అన్నారు. అంటే ఏడు స్థితులుగా కనపడుతున్నది కూడా వాడే. ఏ స్థితిలోనూ నిరాకరించక! భూమిని నిరాకరించక, చెట్టుని నిరాకరించక , జంతువుని నిరాకరించక, మనిషిని నిరాకరించక, ఆ పైవాడిని ఎట్లాగూ నిరాకరించము. ఎందుకంటే వాడు అంటే నీకు ఒక రకమైన మోజు. ఎందుకు మోజు అంటే వెలుగుకి సహజంగా జీవుడు ఆకర్షింపబడుతాడు. అందులోంచి వచ్చిన వాడు కాబట్టి, అది ఎక్కడ ఎక్కువ కనిపిస్తుంటే అందులోకి ఎక్కువ ఆకర్షింపబడతాడు. కళ్ళు నొప్పులు పెడుతున్నా రోడ్డు మీద వెళ్తున్నప్పుడు రాత్రిపూట ఎదురుగా వచ్చే Head-light వైపు చూస్తుంటాయి కళ్ళు. వద్దు చూడకు అని చెప్పినా ఆ ప్రయత్నంగా మళ్ళీ

జీవతత్త్వం అటువైపే చూస్తుంటాయి. ప్రయత్నం చేసి చూడండి తిరగవు. కళ్ళు మూసుకోవాలి. మూసుకున్నా పెద్ద light వస్తే వెంటనే ఏమి వస్తున్నది అని తెరుచుకుంటాం. అట్లా ఉంటుంది. వెలుగుకి సహజంగా ఆకర్షించబడి ఉంటాడు జీవుడు, ఎందుకంటే అందులోంచి వచ్చిన వాడు కాబట్టి. ఇట్లా ఇన్ని రకాలుగా, కోటానుకోట్లగా దిగివస్తే ఇన్ని లోకాలలోకి. నిజానికి ఆయనకేమిటి ఇందులో ఏ రూపం ఆయనది ? ఏది కాదు అని మళ్ళీ ఒక్కసారి అట్లా తీసుకుపోయిన తర్వాత మళ్ళీ ఇరుక్కుపోతామని వెనక్కు తెచ్చేస్తారు.

## ౭౬౦ అమూర్తిః

ఇవన్నీ గా ఉన్నాడు కానీ వీటన్నిటికీ కూడా అతీతంగా ఉన్నాడు. నిజానికి వాడికి ఏ రూపము లేదు కదా. ఇంతసేపు భూమి అన్నావు, చెట్టు అన్నావు, జంతువు అన్నావు, మనిషి అన్నావు. చాలా రకాలుగా అన్నావు. గోళాలు అన్నావు, లోకాలు అన్నావు. అన్ని విపరీతంగా కొట్టి పెంచేసి ఒక్కసారి మళ్లీ ఏం చేస్తారు అంటే అటుపక్క తీసుకువెళ్తారు. అందుకని బాగా చలికాలానికి, బాగా ఎండా కాలానికి తట్టుకొనే శరీరం పదునుగా ఉంటుంది. Extremities ని భరించగలిగే వాడుంటే వాడు గొప్పవాడు. ఎంత చలి భరించగలిగిన వాడే, అంత ఎండ కూడా భరించగలడు. ఎండను బాగా భరించగలిగినవాడే, చలిని కూడా బాగా భరించగలడు. ఎండాకాలంలో AC లో ఉండే వాళ్ళు చలికాలం భరించలేరు. చలిలోకి వెళితే ముక్కులు, గొంతులు, గుండె, ఊపిరితిత్తులు అన్ని జలుబుతో నిండిపోతాయి. చీదుకుంటూ తిరుగుతారు. ఎందుకంటే ఇవి భరించలేని వాళ్ళు అవి భరించలేరు. ఒకటి బాగుంటుంది, ఒకటి బాగుండదు కదా. శీతాకాలం కూడా బాగుండదు పాపం. ఎందుకంటే ఎండాకాలం ఎండ భరించలేరు. ఎండాకాలం బాగా శరీరం ఎండితే, వర్షాకాలంలో కొత్త చిగుళ్ళు వేస్తాయి భూమి లాగే! లేకపోతే వర్షాకాలం జబ్బులు వస్తాయి. ఎండాకాలం ఎండని వాడు తడి బట్టల్లే ఉంటాడు. వర్షాకాలం తడి బట్ట మీద ఇంకా నీళ్ళు పడితే కుళ్ళు కంపు కొడుతుంది. అందుకనే వర్షాకాలం ఎప్పుడు వస్తుందని చూస్తూ ఉంటారు doctors. బోలెడు జబ్బులు, బోలెడు డబ్బులు భలే భలే అనుకుంటారు. అందుకని ఎండకు భయపడేవాడు రోగానికి బాగా సంసిద్ధంగా ఉంటాడు. ఇవన్నీ చెప్పుకోవడానికి ఇట్లా ఉంటాయి. ఆచరణలోకి వెళితే మరో రకంగా ఉంటాయి. ఇవి నమ్మితే అట్లా ఉండాలి. మాస్టర్ గారు అట్లా ఉన్నారు. 'ఎండ అనుకుంటే ఎండోయ్' అన్నారు నాతో ఒక రోజు. నిజంగా చాలా ఆశ్చర్యం. అది మంత్రంలాగా పనిచేసి, Hyderabad లో ఎండాకాలంలో శుభ్రంగా Scooter మీద బాగా తిరగ్గలిగాను. అయితే మామూలుగా Hyderabad లో ఎండాకాలంలో Scooter మీద తిరిగితే వడదెబ్బ కొట్టేస్తుందని మనం బాగా రూఢీగా అనుకుని బయటకు వెళ్ళాం అనుకోండి, తప్పకుండా సాయంత్రానికి వడదెబ్బ

కొట్టేస్తుంది. మంచి ఎండలో మాస్టర్ గారితో తిరిగినప్పుడు, చెమటలు పడుతుంటే ఆయనతో busలో తిరిగేవాళ్ళం. బందరులో తిరుగుతుండే వాళ్ళం. బస్సు మధ్యలో ఆపినప్పుడు మనిద్దరికీ cool-drink వద్దు Tea పట్టుకు రా అనేవాళ్ళు. సరే అనే వాడిని. ఆయన పులిలాగా తిరిగే వాళ్ళు. ఆయనకి ఏదీ అంటేది కాదు. ASGS అని చెప్తుంటాం అంటే- అతి సుకుమారం, గేదె శరీరం. ఆయనది మెరుపు శరీరం. నిజానికి ఆయన ఎంత సుకుమారంగా ఉండే వారో. మాస్టర్ గారు అంత అందమైన మనిషిని మామూలుగా మనం చూడలేం. మరీ తలంటు పోసుకుంటే విపరీతమైన మగవాళ్ళకైనా ఆడవాళ్ళకైనా ఒకే భావం కలిగేది, వెళ్ళి కౌగిలించుకోవాలని. అంత అందంగా ఉండేవాళ్ళు. అలానే ఆయన ఎండకి వెరిచారా చలికి వెరిచారా? చలికాలంలో సముద్ర తీరం నుండి ఆ రోడ్డు మీద రాధామాధవం వచ్చి 4 గంటలకి ఇక్కడ పూజ చేశారు. దానికి మీరందరూ వచ్చారు. ఆయన్ని scooter మీద ఎక్కించుకుని తిరిగేవాళ్ళం. ఈయనని చూసి వాళ్ళు కూడా సరే అనేవాళ్ళు. 'ఒరేయ్ వద్దులేరా మీ శరీరం తట్టుకోలేదు, చేతికి gloves , తలకి ఒక Monkey-cap పెట్టుకుంటే మీకు correct గా సరిగా ఉంటుంది' అనేవారు. Monkey-cap ఎందుకు? మన వాళ్ళు మొన్న గురు పూజల్లో Monkey-cap లు పెట్టుకుని తిరుగుతున్నారు. పని చేసే వాడికి వేడి లోపల నుండి వస్తుంది. Monkey-cap ఎప్పుడు కావాలి అంటే చలిని భరించలేనప్పుడు. చలిని ఎందుకు భరించలేమంటే వేడిని భరించలేనప్పుడు. అందుకని ఇటు నుండి అటు, అటు నుండి ఇటు బాగా flexibility రావాలి. అన్నిటికీ తట్టుకోనగలిగే శక్తి రావాలి. ఈరోజు పరుపు మీద పడుకుంటే రేపొద్దున నేల దొరికితే నేల మీద పడుకోగలిగే ఉండాలి. నేలమీద పడుకుంటాం అనుకోక్కర్లేదు. ఆ సంసిద్ధత శరీరానికి ఎప్పుడు ఉంచాలి. అంటే పదునుగా ఉంచాలి. ఆయన చూడు మరి భూమి మీద పడుకున్నాడు, భూమి వాహనం అంటే అంతే కదా. భూమి వాహనం అంటే మనం తప్పకుండా చెప్పకోవలసిన రాముడు సన్నివేశం ఒకటి ఉన్నది. అంతవరకు చక్రవర్తి కుమారుడు, ఆరోజు బయలుదేరి తమ్ముడిని, భార్యని తీసుకుని బయటకు వచ్చేశాడు. వచ్చేస్తే గుహుడు వస్తాడు. మన వైపు కూడా పాడేరు, సీలేరు వైపు వెళ్తే, వాళ్ళు గుంపులు గుంపులుగా వస్తారు. గుహుడు ఆ అడవిలో ఆ గుంపుకి నాయకుడు. చాలా

మామూలుగా ఈకలు ధరించి, ఈకల కిరీటం, వంకీ ఈకలు, బొడ్డు చుట్టూ ఈకల వడ్డాణం, వంటికి నార బట్ట ఇటువంటివన్నీ ఉంటాయి వాళ్ళకి. వచ్చి ఏవో పండ్లు ఇస్తే తిన్నాడు. సాయంత్రం అయిపోయింది. లక్ష్మణుడికి ఒక ప్రశ్న పుట్టింది అన్నయ్య ఎక్కడ పడుకోవాలి. తను పడుకోవడం syllabus లో నుండి తీసేశాడు కదా! 14 ఏళ్ళు తను పడుకునే ప్రశ్న లేదు. ఆ దీక్ష మనం ఊహించలేం. 14 గంటలు పడుకోకుండా ఉంటే చాలు. అందుకనే వాళ్ళని చదువుకుంటే కనీసం స్ఫూర్తి వచ్చి 14 గంటలు పడుకోకుండా ఉందామా అనే ప్రయత్నం చేస్తాం. లక్ష్మణుడ్ని అందుకు చదువుకోవాలి. లక్ష్మణుడికి ఒక భావం వచ్చింది ఇప్పుడు రాముడ్ని ఎక్కడ పడుకోబెట్టాలని. చక్రవర్తి కుమారుడు కదా, మామూలు సాదాసీదా రాజు కాదు దశరథుడు. చక్రవర్తి అంటే భూమినంతా పరిపాలిస్తాడు. ఆయన కుమారుడు. ఎంత అల్లారి ముద్దుగా పెరిగాడో! మా అన్నయ్యకి పక్క ఎట్లా ఏర్పరుద్దాము? అని గుహుడిని అడిగాడు. ఎట్లా పడుకుంటాడు? ఎటువంటి వాడూ? చక్రవర్తి కుమారుడు అని కాకుండా ఇంకో విధంగా చూసుకున్నా ఆయన్ని నేల మీద పడుకోబెట్టలేము కదా. అట్లా భావిస్తుంటే, చెప్పాడుట గుహుడు, 'ఈ అడవిలో కొన్ని కొన్ని ఆకులు చాలా మెత్తగా ఉంటాయి, అవన్నీ కలిపి మనం ఒక మెత్తటి పరుపులాగా తయారు చేద్దాం, దానిమీద సీతారాముల్ని పడుకోబెడదాం' అని. గుహుడు , లక్ష్మణుడు మాట్లాడుకుంటున్నారట. వాళ్లు ఒక scheme వేసుకుని వాళ్ళ అన్నయ్యకి చెప్దామని వచ్చేసరికి, ఆయన అప్పుడే నేల మీద పడుకుని నిద్రపోయాడట. మనమైతే ఏం చేస్తాం, నా పక్క ఎక్కడ, అవలేదా? ఇట్లా మాట్లాడతాం. ఎంత flexibility! From being the son of an emperor to into the Woods. ఎక్కడన్నా భావంలో కొంచెం తేడా పడ్డదా ? పడలే! అంత flexibility. ఎందుకంటే వీటిలోనూ ఉండగలడు, వీటిని మించి ఉండగలడు. అతను ఏదీ కాదు కదా. అందుకని అమూర్తిః. రూపం లేదు, అన్ని రూపాలు ఆయనవే. అది కదా. అందుకని రూపం చూసినప్పుడల్లా వాడు గుర్తు రావాలి. రూపం మాత్రమే గుర్తు ఉండడం కన్నా, ఆ రూపాన్ని అధిష్టించిన వాడు గుర్తు రావాలి. వాడు దానియందు ఉండడం వల్ల అట్లా ఉంది. అది ఉండడం అంటే ఆయన ఉండడమే ఆ రూపంలో.

## 861 అనఘః

అంటే మలినము లేనివాడు అని అర్థము. అనఘము అంటే పాపము. పాపము అంటే మలినము. ఏ మలినమూ లేనివాడు. నిప్పుకి మలినం ఏముంటుంది, కాల్చేస్తుంది. అందుకనే మనం మలినాలు పోగొట్టుకోవడం కోసం దీపం పెట్టుకోవడం, హోమాలు చేసుకోవడం. భావమయమైన మలినములు హోమం చేసుకుంటే పోతాయి. ఇది ఒక సత్యం. ఎందుకంటే పంచభూతాల్లో అగ్నికి, మనలో మనస్సుకి ఒక సంబంధం ఉంది. అందుకని అలా అగ్ని ప్రజ్వలింప చేసి, ఆ కాంతులు చిమ్మే జ్వాలలను అట్లా చూస్తూ ఉంటే నీ మనస్సు విపరీతంగా పవిత్రీకరింపబడుతుంది. మీరందరూ చాణుక్య serial చూసుంటారు. ఆయన ఎప్పుడూ రాత్రిపూట ఒక జ్వాలని వెలిగించి దాని పక్క అట్లా చూస్తూ ఉంటారు. ఎందుకంటే ఏదైనా ఒక బృహత్తరమైన కార్యక్రమం, మహత్తరమైన కార్యం ఒక్కడి వల్ల అయ్యే పని కాదు. అయినా ఒక్కడు చేసి చూపించాడు చాణుక్యుడు. ఎక్కడి నుండి వచ్చింది ఆ బలం ఆయనకి? జ్వాల వంకే చూస్తూ, దానిని ఆరాధిస్తూ, మనస్సుని అప్పటికప్పుడు పదును పెట్టుకుంటూ, రాగద్వేషాలు, ఈర్ష్యాసూయలు, మదమాత్సర్యాలు అంటకుండా పవిత్రీకరించుకుంటూ పొద్దున్నే పనిలోకి వస్తాడు. మనకి ఓపిక లేక వారానికి ఒకసారి చేస్తాం. నిజానికి పాత రోజుల్లో ప్రతిరోజూ అగ్ని కార్యం చేస్తారు. అవన్నీ ideals. మన వరకు జ్వాలని దర్శనం చేస్తూ ఉంటే అంతర్ముఖంగా చూడగలిగినంతవరకు బహిర్ముఖంగా చూడండి. అందుకనే దీపం పెట్టుకున్నది. దీపపు జ్వాలలు కనులు మూసుకుని చూస్తే, భ్రూమధ్యం లో ఆ జ్వాల బాగా పెరుగుతున్నట్టు, చుట్టుపక్కల కాంతి చల్లుతున్నట్టు, ఒంట్లో ఉన్న చీకటి మూలలన్నిటికీ అదే వెళ్ళి అవన్నీ కాంతివంతం చేస్తున్నట్టు, ఇట్లా చేసుకోవాలి. చేసుకుంటూ ఉంటే, మలినాలు తగ్గుతూ ఉంటాయి. భావాలు బాగా వస్తూ ఉంటాయి. వికటించదు. వికారము వికృతి కలిగిన భావాలు మనకు కలగవు. లేకపోతే మనము సులభంగా గోతిలోకి జారిపోతూ ఉంటాం. రోజూ ఆ దీపం పక్క అట్లా చూసి 'బాబు మలినము చాలా వుంది, ఇంకా చేరుతూ ఉన్నది. రోజూ చేరుతున్నది. మరి చేరింది ఎలా తీసేసుకోవాలి? దీపం! దీపం పెట్టుకోవాలి అంటే లోపల మీరు దీపం పెట్టుకోవడమే. కొంతమంది దీపం పెట్టారు అంటే

ఆ prayer అయ్యే లోపల అది ఆరిపోతుంది. లేకపోతే prayer అయ్యేంతవరకే ఉంటుంది. నూనె ఎక్కువ అయిపోతుంది అని అంతే పోస్తారు. లేకపోతే ఆ వత్తే మళ్ళీ వేసి ఏదో రకరకాలుగా బాధలు పడుతుంటారు. నూనె ధర మీకు ఏం తెలుసు అట్లా మాట్లాడుతారు, అంటారు. నువ్వు ఇస్తూ ఉంటే అట్లా వస్తూ ఉంటుంది. ఒక చక్రం, cycle ఉంది. ఇట్లా నీవు దైవపరంగా ఎంత దమ్ము వుండి వదులుతావో, నీకు అటుపక్క నుండి దానికి పది రెట్లు వస్తూ ఉంటుంది. పైనుండి వచ్చేది పది రెట్లు ఉంటుంది. నువ్వు క్రింద నుండి ఇచ్చేది చాలా తక్కువ. ఈవేళ దేవాపి మహర్షి బోధనలలో చెప్పారు. 'మనం పుచ్చుకునేది చాలా ఎక్కువ, ఇచ్చేది చాలా తక్కువ. అప్పటికే ఎంతో ఇచ్చినట్లు మొహం పెడతావు, నేనేం చేయను నీకు' అంటాడు ఆయన. 'నువ్వు ఆదిత్య లోకాల నుండి, రుద్ర లోకాల నుండి, వసులోకాల నుండి, జంతు లోకాల నుండి, వృక్ష లోకాల నుండి, పదార్థమయ లోకాల నుండి, మానవ లోకాల నుండి రోజూ 7 channels ద్వారా లాక్కుంటూ ఉంటావు. ఇవ్వరా అంటే ఇచ్చాను గా' అంటావు. ఏంటి? ఎవరికో ఒక రూపాయి టీ తాగమని ఇచ్చావు, కాదు టీ రెండు రూపాయలు అంటే, రూపాయికి అర కప్పు తాగేయ్ అంటావు. ఇట్లా పేరుకుంటూ ఉంటాయి. ఇట్లా పేరుకుంటూ ఉండేదానికి ఆయన ఇవాళ ఒకటే మాట అన్నారు 'To get అనేది పక్కన పెట్టి to give అనేది పెట్టుకో బాగుంటుంది' అని. అందుకే మనం ఈ మార్గం లో ముందు మలినాలు పోతే కదా అసలు ఆ భావాలు వస్తాయి. లేకపోతే ఇప్పటికే చాలా చేసేశాం, ఎంత చేసి ఏం లాభం, ఇట్లా ఏమిటో రకరకాలుగా-- ఇలా మనందరికీ కలిగేవే కదా. ఇంకా ఎన్నాళ్ళకి? దానికి వాళ్ళు సమాధానం చెప్తే నువ్వు మూర్ఛపడి, చచ్చిపోతావు. అసలు నువ్వేం చేశావ్? అంటారు వాళ్ళు. 'అదేమిటి?' అంటే, 'అంతేరా నువ్వేం చేయలేదు ఇంతదాకా. ఓం ప్రథమం అని నువ్వు ఏం మొదలుపెట్టలేదు, మొదలు పెట్టకుండానే చాలా చేసేశాను అని నువ్వు అనుకుంటున్నావు, ఎట్లారా' అని వాళ్ళు. మాకు 50 ఏళ్ళు వచ్చాయి కదండీ అంటే, వచ్చాయి ఏళ్ళు అంతే తప్ప చేసేదేమీ లేదు.Turn Over ఏమీ లేదు. ఆయనలాగా మనకు ఎలా అనఘత్వం వస్తుంది? On a daily basis we have to set our motive. భగవంతుడికి వ్యక్తిగతమైన ఉద్దేశ్యాలు ఏమీ ఉండవు. అందరి శ్రేయస్సే! మనం కూడా మనం చేసే పనులలో ఎవరి

గురించైనా మలినమైన భావములు వచ్చాయి అనుకోండి, అట్లా కమ్మేస్తూ వస్తుంది. మేఘాలు కమ్మినట్లే, చాలా కమ్ముతుంది. మనకు తెలియకుండానే కమ్ముతూ ఉంటుంది. ఎట్లా కమ్ముతుంది అంటే చివరికి, నేను గమనించింది నాలో, ఆ రోజు చేయాలా? రోజు చేయకపోతే ఏమిటి? ఇటువంటివన్నీ వస్తుంటాయి. అక్కడి నుండి ఒక్కొక్కటి ఒక్కొక్కటి. స్నానం చేయకపోతే ఏమిటి, Prayer చేసుకోవచ్చు. ఆ prayer కూర్చొనే చేయాలా? సోఫాలో కూర్చోవచ్చు కదా. అక్కడి నుండి సోఫాలోనే కూర్చుని చేయాలా మంచం మీద చేసుకోవచ్చు కదా. అసలు పళ్ళు తోముకోకపోతే దేవుడు ఏమన్నా అంటాడా? ఇట్లా వస్తుంటాయి భావాలు. పళ్ళు తోముకోకపోతే దేవుడిని స్మరిస్తే దేవుడు ఏమన్నా అనుకుంటాడా? దేవుడు అనుకోవడానికి ఏమీ లేదు, మీ instrument ఎంత కళతో, కళ వచ్చేటట్టుగా, కాంతి కలిగేటట్టుగా చేసుకుంటావో అంత కాంతిని అందుకునే స్థితిని పొందుతుంది. కాంతిని అందుకోవడానికి నీ యందు ఆ పవిత్రత ఉండాలి. దానికి ఎక్కడ పవిత్రతకి మొదటి రంధ్రం పడుతుంది అంటే మన ఉద్దేశాలలో. ఎక్కడికి అక్కడ మనం Commission వేసేస్తాం. ఏ పనైనా సరే ఇందులో నాకేమిటి అని కదా! అదే Brokerage . Commission అంటే అదే కదా. అంతా arrange చేసి ఇందులో నాకేమిటి 1%, 2% అని అడుగుతాం. ఏం పని చేస్తున్నా ఇందులో నాకేమిటి వస్తుంది అనే భావనతో మొదలవుతుంది పాపం. ఇందులో నీకేమిటో, ఇంకోడికి బాగుంటుంది కదా చెయ్యి. ఇంకోడికి బాగుంటే చేస్తూ ఉండటమే. అప్పుడు పాపములు అంటని స్థితికి నెమ్మదిగా పెరగడానికి వీలవుతుంది. ఇందులో నాకేమిటి అనుకుంటే, చేసే పనులలోను, పూజలలోను, తపస్సులోనూ, నాకోసం అంటే నేను దేవుడిని చూడడం కోసం తపస్సు చేసే వాళ్ళు ఉంటారు కదా. 'నా గురించి తపస్సు చేసే వాళ్ళు అట్లా యుగాలు తరబడి ఉన్నారు. వాళ్ళు ఎవరితో నాకు సంబంధం లేదు' అని చెప్తాడు విష్ణుమూర్తి భాగవతం లో . మనకు ఈ మెలిక అట్లా తెలియకుండా పడిపోతుంది. మన కోసం కాదు ఈ కార్యక్రమం. బుద్ధి ప్రచోదనం చెందితే ఇంకొంచెం ఉపయోగపడతాం. అది మన నుండి అలా బయటకి ప్రవహిస్తున్న కొద్ది, మనం బాగా కాంతివంతం అవ్వడానికి అవకాశం ఏర్పడుతుంది. వాహికగా ఉంటే చాలు అందులోంచి పోతూ ఉంటే, పాలగిన్నె లోకి రోజు పాలు పితికేసరికి ఆ పాల గిన్నెకి ఏ మరకలు

ఉండవు. ఆ గిన్నెలు దానికి కాకుండా మామూలుగా ఉంచితే, సత్తు చెంబు వాడతారు వాళ్ళు. సత్తును ఎంత తోమితే ఏ మరక లేకుండా ఉంటుంది. రోజూ పాల చెంబులోకి పాలు వస్తుంటే చెంబుకా ఆ పాలు? తనలోకి వచ్చే పాలు అందరికీ వెళ్ళిపోతాయి కదా. అట్లా పాల చెంబు పాలు పంచినట్టుగా పంచుతూ ఉంటే పాల చెంబు ఏ విధంగా తెల్లగా తయారైపోయిందో, అట్లాగే నీలో ఉండే శక్తి సామర్థ్యాలు ఇతరులకి సమర్పణ చేసుకుంటూ, జీవిస్తూ ఉంటే పాపములు తగ్గుతాయి. నీ గురించిన ఆలోచన ఎంత పెరిగితే అంత పాపములు పెరుగుతాయి. పాపం అంటే మలినమే. మలినము ఉన్న ఆలోచనని తగ్గిస్తుంది. ఉన్న తెలివి కూడా పోతుంది అంటా చూశారా అలా. భగవంతుడు అనఘుడు. ఆయనకి ఎప్పుడు వ్యక్తిగతమైన ఉద్దేశ్యం లేదు. సర్వలోక శ్రేయస్సే! మనం కూడా సాధన పరంగా వీలున్నంతవరకు చేసే విషయంలో ఇందులో మనకు ఏమిటి అని లేకుండా చేసుకుంటూ వెళుతూ ఉంటే నిజంగా చాలా దివ్యంగా ఉంటుంది. ఈ వేళ మనం ఎంతమందికి చేయవలసినది అని మాత్రమే గుర్తుండాలి. అందులో అలుపు ఉండకూడదు, సొలుపు ఉండకూడదు. మన గురించి ఆలోచన రాంగానే మనకు అలుపు వచ్చేస్తుంది.

## 862 అచింత్యః

మామూలుగా మనం ఇన్ని రకాలుగా ఎందుకు చెప్పకుంటున్నాం? ఎన్ని రకాలుగా చెప్పకున్నా ఆయన గురించి పూర్తిగా చింతన చేయలేము ఆయన అటువంటి వాడు అంటే. Beyond our comprehension. మన భావనకు అందని వాడు. అదృష్టం కొద్దీ భావన వరకు దిగి వస్తున్నాడు, అంతటితో తృప్తి చెందుతున్నాం. భావతీతమైన స్థితిలో ఇక మనం తన్మయత్వం లోకి వెళ్ళాం అనుకోండి, ఇక చెప్పకోవడానికి ఏమి ఉండదు. ఆ తరువాత అమ్మ! చాలా ఆనందపడ్డామే అని వెనక్కి వస్తాం. అందుకని భావన చేయడానికి వీలులేని వాడివి నువ్వు అని చెప్తుంది ఈ నామం. ఇవన్నీ శ్రీకృష్ణుడి పరంగా కూడా చెప్పకోవచ్చు. అనఘుడు మొత్తంలో ఏమి అక్కర్లేదు ఆయనకి. అంత భాగవతకథ లోను ఆయనకి కావలసినది ఏమీ లేదు. అందుకే ఒక రోజు అర్జునుడుకి గట్టిగా చెప్తాడు. ఒక round ఇచ్చుకుంటాడు అని చెప్తారు చూశారా. నాకేమీ అక్కరలేదు గుర్తుపెట్టుకో అని చెప్తాడు. ఇంత అర్జునుడు చాలా మర్చిపోతూ ఉంటాడు. మధ్య మధ్యలో గుర్తు వచ్చినప్పుడు, నా స్నేహితుడు అనుకున్నాను, నా బంధువు అనుకున్నాను, పొరపాటు చేశాను అని ఏడుస్తుంటాడు. ఆ మర్నాడు మళ్ళీ మామూలే. అందుకని ఒకరోజు బాగా కోప్పడ్డాడు. నాకేమీ అక్కరలేదు, ఈ మొత్తంలో నువ్వేం నాకు పెద్దగా అక్కరలేదు. నువ్వు వాడు అందరూ ఒకటే అని చెప్తాడు. దుర్యోధనుడ్ని అర్జునునకు చూపించి నువ్వు వాడు నాకు ఒకటే అని చెప్తాడు. ఏదో ధర్మాన్ని నమ్ముకున్నారు కాబట్టి. Special అని వీడు అనుకున్నప్పుడల్లా ఏదో ఒక చురక వేస్తుండేవాడు కృష్ణుడు. అట్లా ఆయనకి ఏమి అక్కరలేదు, అయినప్పటికీ అంత దూరిపోయాడు. బలరాముడు అక్కర్లేదన్నప్పుడు కలిగించుకుని, అవసరమైనప్పుడు పారిపోయాడు. అసలు ఏమి అంటదు, ఎందుకు అంటదు అంటే తనకంటూ ఏమీ అక్కరలేదు. మయుడు తమకు ఏమైనా సమర్పించుకుంటాం అన్నాడట, ఏడ్చావులే నువ్వేంటి నాకు ఇచ్చేది అనుకుని లోపల, బయటకి వాడికి చేసి పెట్టు అని అంటాడు. ఈ మొత్తంలో మీకు ఏం చేయమంటారు అంటే, అట్లా మొహం పెట్టి ఏదో మీ ఇష్టం అనేటట్టుగా ఉండకూడదు, వీలైతే నీ మొహం, నువ్వు నాకు చేసేది ఏమిటీ అనేటట్టుగా ఉండాలి. తనకోసం అనేది లేనివాడు పులి.

వాడు చక్రవర్తి. వాడు పేదవాడైనా ఈ ప్రపంచానికి వాడే చక్రవర్తి. ఒక ఆవిడ France లో మాస్టర్ గారికి వెళ్ళి నప్పుడల్లా 3 వేల French francs పెట్టేది. 'ఏమిటో ఈవిడ మన గురించి ఏమనుకుంటుంది అనుకుంటున్నావు?' అని ఆయన అంటే 'నేనేమీ అనుకోవడం లేదు మాస్టారు' అన్నాను. 'ఒక మాట చెప్పి చూద్దాం ఎందుకైనా మంచిది' అన్నారు. వెళ్ళి నప్పుడల్లా 3 వేల French francs పెడుతుంది. ఇల్లంతా ఇచ్చేస్తుంది. మేమున్నన్ని రోజులు కావలసిన సామాన్లు అన్నీ పెడుతుంది. కొత్త దుప్పట్లు, కొత్త దిండు గలేబులు వేస్తుంది. రాంగానే ఆయన పెట్టె బాగుండక పోతే కొత్త పెట్టె కూడా కొంటుంది. అన్నీ కొత్త కొత్తగా చేస్తుంది. ఇవన్నీ కాక అక్కడ డబ్బులు కూడా పెడుతుంది. ఒకరోజు ఆవిడని మాస్టర్ గారు 'నా గురించి మీ అభిప్రాయం ఏమిటి ? నేను డబ్బులు ఉన్నవాడినన్నా, లేని వాడిననా' అని అడిగారు. ఆవిడ కాసేపు ఏమీ మాట్లాడలేదు. 'నేనేం అనుకోవడం లేదు, నా హృదయానికి తోచినది నేను చేస్తున్నాను, మీరు డబ్బులు లేని వారని నేను ఎట్లా అనుకుంటాను? అలా అనుకోవడం లేదు' అని అన్నది. మాస్టర్ గారు సంతోషించారు. 'ఎందుకు పెడుతున్నావా డబ్బులు' అంటే, 'మీరు ఇక్కడికి వచ్చినప్పుడు ఏదన్నా కొనుక్కోవాలి అనిపిస్తే పనికి వస్తాయి, లేదంటే ఎవరికన్నా దానం చేస్తారు కదా! సద్వినియోగం చేస్తారు కదా! అన్ని చోట్ల తిరుగుతున్నారు కాబట్టి, అందుకని పెట్టాను' అన్నది. అంటే మాస్టర్ గారు 'నీవు గుర్తుంచుకో ఒక్క మాట చెప్తున్నాను, నాదొక పెద్ద సామ్రాజ్యం ఉన్నది, నా సామ్రాజ్యానికి నేను చక్రవర్తిని, నేను అందరికీ ఇచ్చే వాణ్ణి తప్ప, ఎవ్వరి దగ్గర పుచ్చుకునే వాడిని కాదు' అంటే 'నాకు తెలుసు' అన్నది. తెలిస్తే సంతోషం అనుకుని లోపల, 'ఏం చేద్దాం ఓయ్' అన్నారు. 'ఉంచండి మాస్టారు ఏదో ఒకటి చేద్దాం' అన్నాను. ఆ మర్నాడే ఒక library కి వెళ్తే అక్కడ బోలెడు astrology books అవి ఇవి కనిపించాయి. మొత్తం అంతా ఖర్చు పెట్టేశారు. 'మన ఊళ్లో వాళ్ళకి పనికి వస్తాయి' అన్నారు. అట్లా ఆయన పట్టించుకునే వారు కాదు. పాపములు అంటకూడదు అంటే మన కోసమనేది ఉండకూడదు. వస్తూ ఉంటుంది పోతూ ఉంటుంది. అందరూ ఇల్లు కట్టుకోమని ఆయన్ని బలవంతం చేస్తే, 'ఉండాలంటావా మనకి ఇల్లు' అని అన్నారాయన. నాకు ఇలాటి వారు ఎక్కడా ఈ కాలంలో కనిపించలేదు. 'ఏమోయ్ ఉండాలంటావా, తాతగారు ఇల్లు కట్ట లేదయ్యా' అని చెప్పారు.

ఆయన మలీను. ఆయన అట్లాగే ఉన్నాడు కాబట్టి, ఆయన కొడుకు ఈయన. 'సరే కానీ వాళ్ళకు పనికొస్తుందిలే' అన్నారు. సరిగ్గా అదే అయింది. ఆయన అందులో ఒక సంవత్సరం కూడా లేరు. అంటే ఒక మగాడు అంటే ఎట్లా ఉంటాడో మనకు తెలుసు. అనఘుడు, నిరపేక్షిత్వం, అపరిగ్రహం, తనకేమీ అక్కర లేకపోవడం, ఏమిటో ఊరంతా తన సంసారం అని వాళ్ళందరికీ చేసి పెట్టడం. అక్కరలేని వాళ్లు ఏం చేస్తారంటే వదిలేసి పోతారు. అది మధ్యస్థం. కావలసిన వాడు విపరీతంగా అదే ఆరాటంగా తిరుగుతూ ఉంటాడు. అదీ నేను చూశాను. సనాతన సారథి లో బాబాగారు చెప్తారు. 'ఏది వదలలేరు, లేచి నిల్చుకోలేకపోతే crane లో నుండి plane లోకి ఎక్కుతాడు తప్ప, అన్ని అంటిపెట్టుకొని ఉంటాడు కదరా'. ఆ స్థితి నుండి అంత సంసారి ఏం మాకు అక్కర్లేదు అంటే, ఏం చేయడం మానేస్తారు. అలా కాకుండా తనకేం అక్కర లేకపోయినా, తను అంత తాపత్రయ పడుతున్నట్టుగా అందరికీ పనులు చేసి పెడుతూ, దేనికి అంటకుండా, ఎందులో నుండి ఏమి ముట్టించుకోకుండా, అంటు పడకుండా ఆయనా-- అది అనఘత్వం. ఊహించలేము. ఏం ఊహిస్తాం, ఇక్కడ మన భావాలు బాగా పవిత్రీకరించబడినప్పుడు కూడా ఊహించలేము. ఋషులే ఊహించలేకపోయారు పూర్తిగా. భీష్ముడు 'నీ గురించి ఏమీ చెప్పలేను నేను' అని అంటున్నాడు. 'ఏదో చెప్తున్నాను తప్ప అంతా చెప్తున్నాను అనే భావం నాలో పెరగడం లేదు సుమా' అని చెప్తున్నాడు. చాలా బాగా చెప్తున్నాడు, ఎందుకంటే ఇది ౮౨వ శ్లోకం. చాలా మటుకు చెప్పేశాడు కదా. పర్వాలేదు మనం బాగానే రాస్తున్నాం కదా పరీక్ష అని అనిపిస్తుంది కదా. అదంతా ఏమీ లేదు, అసలు ఏమీ చెప్పలేదు, భావన చేయలేము, అయినప్పటికీ చెప్పమన్నారు కాబట్టి చెప్తున్నాను. అంటే సూతుడిని అడిగారు, చెప్పవయ్యా అంటే 'అందినంత వరకు చెప్తాను అంతా చెప్పగలను అని నేను అనుకోవడం లేదు, అంతా చెప్పలేను నాకు తెలుసు. నాకు అందినంతవరకు, మీకు ప్రాప్తం ఉన్నంతవరకు అది వస్తూ ఉంటుంది, మీరు వినండి' అని చెప్తాడు. ఎందుకని అచింత్యుడు. పూర్తిగా ఎవరూ పొగడ లేరు. భావించలేరు. ఎందుకంటే ఆయనలో నుండి దిగివచ్చిన వాళ్ళు ఆయన గురించి ఏం చెప్తారు. 'A part can never comprehend the whole'. అని ఉన్నది. మొత్తాన్ని ముక్క చూడలేదు.

## 863, 864 భయకృద్ , భయనాశనః

భయపెడుతాడుట భయాన్ని తీసేస్తాడట. రెండు ఒక చోటే. భయకృద్ ఎవరికి? ధర్మాన్ని వదిలి వారికి భయం. మనలో భయం వస్తున్నది అంటే తెలియని ఏదో అధర్మం లోపల ఉండడం చేత భయం వస్తున్నది. నిర్భీతి ఎవరికి ఉంటుందో తెలుసా, ఇద్దరికి ఉంటుంది ఒకటి మూర్ఖుడికి ఉంటుంది, రెండోది ధర్మాన్ని ఆచరించే వాళ్ళకి ఉంటుంది. రావణుడు, హిరణ్యకశ్యపుడు వీళ్ళకు కూడా నిర్భీతే. ఎంతవరకు up-to a point . ఆ తర్వాత భయం. కంసుడు వణికిపోయాడు. రావణుడికి చివరికి నిద్ర పట్టలేదు. హిరణ్యకశ్యపుడికి కూడా భయమేస్తుంది. చాలా భయం వేస్తుంది. అది వాడికి భయం వేసి నిద్ర పట్టక, ఇదేదో తేల్చుకోకపోతే మనం పడుకోలేమని ప్రహ్లాదుడుతో పెట్టుకుంటాడు. అంత భయపెట్టేస్తాడు. భయకృత్ మనం కూడా ఏదన్నా వెధవ పని చేస్తే, ప్రపంచానికి తెలియకపోయినా, మనకు గుర్తు ఉంటుంది కదా! లోపల నుండి అది చేశావు కదా !అది చేశాను కదా! అని బట్ట పిండినట్టు పిండుతూ ఉంటాడు. ఓరి బాబోయ్ ఎట్లాగో బాబు ఇట్లా చేశామే, అదేమో ప్రపంచానికి తెలియకూడదు, లోపల మర్చిపోము. ఎందుకని? అదే సత్యం అంటే! సత్యం చావదు అంటారే, ఎందుకు చావదు అంటే చేసిన వాడి లోపల అది కనిపించి చెప్తూ ఉంటుంది. అవతల వాడిని అట్లా మోసం చేశావే ఆ రోజు. వాడి దగ్గర అంత కొట్టేశావు , వాడికి తెలియకుండా వాడిని ఈ విధంగా ఏడిపించావు కదా! ఇటువంటివన్నీ గుర్తు వస్తుంటాయి కదా. భయం. మనమేం చేయలేదు అయినా కూడా భయం వస్తున్నది, ఉంటాయి అవి కూడా. అంటే ఇప్పుడు ఏమి చేయలేదు, ఇదివరకు చేసినవేమో లోపల గింజల లాగా, విత్తనం లాగా ఉండిపోయి, భయం వస్తుంది. అందుకని ఎప్పుడు భయం వేసినా, విష్ణు సహస్రనామం మనకు చెప్పేది ఏమిటి అంటే ఏదో అధర్మం నీలో ఉంది, సమూలంగా దాన్ని పీకేయడానికి ఎక్కువ ధర్మకార్యాలలో నిమగ్నమవ్వు. నీలో ధర్మం పెరుగుతున్న కొద్దీ ధైర్యం పెరుగుతుంది. అధర్మం పెరుగుతున్న కొద్దీ భయం పెరుగుతుంది. ఎందుకు భయపడడం? వాడితో ఉండే వాడికి భయం ఏమిటి? ధర్మంలో ఉండే వాడికి భయమేమి ఉంటుంది? అందుకని ధర్మాత్ములకి భయం ఉండదు. దుష్టాత్ములకు భయం కొంతవరకు ఉండదు.

కానీ వాళ్ళని కూడా ఈయన భయపెట్టగలడు. మామూలుగా సమకాలిక లోకంలో రావణుడు హిరణ్యకశిపుడు వీళ్ళ కన్నా మగవాళ్ళు ఎవరూ మనకు కనిపించరు. భయపెడతారు. ఇప్పుడు చూడండి Clintonని భయపడుతున్నారు. ఎంత US president అయినా ఆయన మీద అదేదో case పెట్టారు. ఆ case ఎట్లా మలుపు తిరుగుతుందో, తన ప్రతిష్ఠ, తన ప్రతిభ, తన పేరు, తన కీర్తి ఇవన్నీ ఆ ఒక్క దెబ్బతో మటాష్ కదా! మరి అది అలా వదలకుండా వెంటపడుతున్నది. అది ఏం చేస్తుంది? ఏం చేయవు. మనల్ని కూడా ఎన్ని సమస్యలు లోపల భయపడుతూ ఉంటాయి. ధర్మాన్ని ఆలంబనగా చేసుకుంటే భయం ఉండదు. భయం వస్తుంది అనుకోండి దానికి ఒక్కటే ఉపాయం. ఎక్కువ ధర్మాన్ని ఆచరించాలి. ధర్మాన్ని ఆచరించడం వల్ల దైవాన్ని ఆశ్రయించే పట్టు వస్తుంది. ఊరికే దైవాన్ని ఆశ్రయించుదాం అనుకున్నా సమస్యలు గుర్తువస్తుంటాయి ఇది ఒకటి. భయం వల్ల దైవ ప్రార్థన చేస్తుంటే, ఆ భయానికి సంబంధించినవే గుర్తు వస్తుంటాయి. తెగబడి ధర్మాన్ని ఆచరించడమే. ధర్మరాజుకి అదే చెప్తాడు ధౌమ్యుడు. 'ఇట్లా దుఃఖపడి, భయపడి ఏముంటావు హాయిగా పుణ్యక్షేత్రాలు తిరుగుదాము, అసలు అన్నిటికన్నా ముఖ్యంగా ఈ స్తోత్రం ఇస్తున్నాను, ఆయన్ని ప్రార్థన చెయ్యి. మనకి మంచి cooker ఒకటి వస్తుంది' అంటాడు. ధర్మరాజుకి చుట్టూ 300 మంది బ్రాహ్మణులు చేరారు. వాళ్ళకి ఎంతసేపూ 'బ్రాహ్మణః భోజనంప్రియః', కదా! అది పడకపోతే వాళ్ళకి నోట్లోంచి మాటే రాదు. ఇది పరిస్థితి. 'అక్కడ ధర్మం లేదు. ధర్మం లేని చోట మేము ఎట్లా ఉంటాం బ్రాహ్మణులం', అని వాళ్ళతో పాటే వచ్చేశారు. వీళ్ళందరూ ఎట్లా ఉంటారు అరణ్యంలో. ఏమిటి స్వామి? అంటే, ప్రార్థించు, అంటే ప్రార్థిస్తే సూర్యుడు పంపిస్తాడు అక్షయపాత్ర! Stove కూడా అక్కర్లేదు, అన్ని వచ్చేస్తాయి. ఇది పెట్టుకుని తింటూ యాత్ర చేద్దామన్నాడు. బాగుంటుంది. ఎందుకని ఇట్లా చేశాడు అంటే, భయం పోవాలి. భయం పోవడానికి ధర్మరాజు ఏ అధర్మం చేశాడు? ప్రశ్న లేనేలేదు అన్నారు. ఇవాళ నుండి వాడు అది, పాత కథలో ఏదో ఉంటుంది అవన్నీ వ్రాయలేదు. అట్లా మనం ఇవాళ ధర్మం ఆచరిస్తున్నా రావచ్చు. కాకపోతే ఏమిటంటే ఎక్కువ ధర్మం ఆచరించాలి. కష్టంలో ఉన్నప్పుడు ఎక్కువ పట్టుకోవాలి. సుఖంలో ఉన్నప్పుడు ఇంకా పట్టుకోవాలి, ఎందుకంటే సుఖంలో ఉన్నప్పుడు మనకు అంతా light అయిపోతుంది.

Prayers light అయిపోతాయి, కొంచెం relax అయిపోతాం. చదువుకునే రోజుల్లో పరీక్ష ముందు, పరీక్ష తర్వాత మన ప్రార్ధనలు ఎట్లా ఉంటాయి? ఇప్పుడు కూడా జీవితంలో ఒక పరీక్షా సమయం వచ్చినప్పుడు ఎట్లా ఉంటుంది? మామూలుగా ఉన్నప్పుడు ఎలా ఉంటుంది? ఎక్కువసేపు వద్దు మామూలుగా గట్టిగా పట్టుకో. పట్టుకోకపోతే పాతవి ఏమీ లేకపోతే శరీరంలోకి రాము ఇట్లా. మళ్ళీ ఇటువంటి రోగగ్రస్తమైన శరీరాలకి అసలు రాము. చాలా ఉంది కాబట్టి అటు పోతే భయాలు పోతాయి. పాపాలు పోతే భయాలు పోతాయి. అందుకనే 'పాపభీతి' అన్నారు. పైకి ప్రతివాడు ఏం భయం లేదు నాకు అని మొహం పెట్టుకొని తిరగవచ్చు. లోపల బిక్కు బిక్కు బిక్కు మంటూ ఉంటాడు. ఒంటరిగా ఏడుస్తూ ఉంటాడు లోపల. ఇప్పుడు మనకి బయటికి కనిపించే వాళ్ళందరూ, మహా మహా సన్యాసులుగా కనిపిస్తున్న వాళ్ళ దగ్గర నుండి, మహా మహా నాయకులుగా కనిపించే వాళ్ళ వరకు లోపల భయపడిన వాడెవడో మనకేం తెలుసు వాడికే తెలుస్తుంది. ప్రతి వాడికి ఒక రకమైన భయం సలుపుతూనే ఉంటుంది. భయాన్ని తీసేస్తాడట ఎప్పుడు? ధర్మాన్ని అనుసరించి వెళుతూ ఉంటే, అంతః కరణలో ఒక ఆత్మ ధైర్యం వస్తుంది. ఆత్మస్థైర్యం వస్తుంది. ఆత్మవిశ్వాసం వస్తుంది. దేన్నైనా నేను భగవంతుని యొక్క సాన్నిధ్యం చేత ఎదుర్కొంటాను. నాకు నాశనం లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ గడ్డి తినను.

శాంతము లేక చిక్కిన జరాకృతమైన వికీర్ణమైన ఆయాసమునైన

అని భర్తృహరి ఒక పద్యం చెప్తాడు. సింహము ఆరోజు ఏమీ దొరకలేదు అనుకోండి, చాలా ఆకలి వేస్తుంది, ఒళ్లంతా నీరసన పడిపోతుంది, కొన్నాళ్ళు ఆహారం దొరకలేదు, డొక్కలన్నీ ఎండిపోతున్నాయి, నీరసం వచ్చేస్తుంది, అయినప్పటికీ గడ్డి తింటుందా? అంటాడు. అట్లా ఇచ్చి మాకు చిన్నప్పుడు బ్రాకెట్లో 'తినదని భావము' అని వ్రాశారు ఏమో అంటామేమోనని. అట్లా ఎట్టి పరిస్థితులలోనూ గడ్డి తినని తత్త్వము ధర్మాత్ములకు ఉంటుంది. తిన్నామో మళ్ళీ భయం. దుర్యోధనుడు ఎంత భయపడ్డాడు? కర్ణుడు ఎంత భయపడ్డాడు? అందరూ భయపడతారు. ధర్మాన్ని తప్పిన వాళ్ళందరూ భయపడతారు. విదురుడు భయపడ్డాడు. ద్రౌపది వస్త్రాపహరణం తర్వాత విదురుడికి భయమే భయం. 'ఏం చేయలేకపోతినే నా కళ్ళ ముందు జరిగినది. ఇంతకన్నా అధర్మం ఇంక ఏమీ లేదు కదా. కాబట్టి ఏదో వస్తుంది'.

తప్పకుండా ఏదో వస్తుంది అని తెలుసు ఆయనకు. భయపడుతూ ఉంటాడు. ధృతరాష్ట్రుడికి భయం. అందుకని ధర్మాన్ని ఆచరించని వాడికి భయం కలిగించడం మొదలుపెడతారు. అది అలా జరుగుతూ ఉంటుంది. చిన్న పొన్న కేసులని local గానే settle చేసేస్తాడు. ఇంకోడి చేత మనల్ని కొట్టించడం, ఇంకోడి చేత మనల్ని తిట్టించడం. మనం మోసం చేస్తే, మనల్ని ఇంకోడు మోసం చేయడం. ఇట్లా అయిపోతాయి. ఈ local accounts, small accounts, petty accounts అంటామే అవన్నీ local గానే settle చేసేస్తారు. ఒక్కొక్కడి account ఎవరు local గా settle చేయలేని వారు ఉంటారో వాడి account ఈయన పుచ్చుకుంటారు. ఈయన చూసుకుంటారు. అందుకని భయాన్ని కలిగిస్తారు సుమా! ఎందుకూ? మంచి కోరి! భయాన్ని నాశనం చేస్తాడు సుమా! ఎప్పుడూ? ధర్మాన్ని ఆచరించినప్పుడు. అందుకని ధర్మాన్ని ఆచరించేవాడే ధీరుడు. వాడి ధీరత్వం ఎట్లా ఉంటుంది అంటే, నాకేమీ అక్కరలేదు. ఏమీ అక్కరలేని వాడిని మించినవాడు ఎవరున్నారు? ఆ భాగవతం నిండా ఏమీ అక్కరలేని వాళ్ళే. ఏమి అక్కరలేని వాడికి అన్నీ ఇస్తాడు. చూద్దాం ఎట్లా ఉంటుందో అని. అట్లాగే ఉన్నాడో లేదో చూస్తాడు. కొంతమంది పడిపోయి మళ్ళీ లేచి రావడం చూపిస్తాడు. కొంతమంది పడని వాళ్ళని చూపిస్తాడు. కొంతమంది ఏమీ లేకుండా అలాగే ఉండిపోయిన వాళ్ళను కూడా చూపిస్తాడు. ఏమీ అక్కర్లేదు అన్నావు కదా ఏమీ ఇవ్వట్లేదు. ఏమీ అక్కర్లేదు అంటే అంతా ఇస్తాడండి. ఏమి అక్కర్లేదు అన్న వాళ్ళు కూడా ఉండొచ్చు కదా. కొంతమందికి ఏమీ ఇవ్వడట. అయినా వాడు అట్లాగే ఉంటాడట. కుచేలుడు చిన్నప్పటినుండి కలిసి చదువుకున్నవాడు. ఎన్నేళ్ళకి ఇచ్చాడు? వాడేమన్నా అడిగిన తర్వాత ఇచ్చాడా? వాడి సంగతి ఎప్పుడో మర్చిపోయాడు. వాడు ఉన్నాడని భావన కూడా మర్చిపోయాడు కుచేలుడు. కుచేలుడు అని ఎందుకన్నాం కట్టుకోవడానికి బట్ట కూడా పూర్తిగా లేదు, ఏదో మర్యాదకు కట్టుకునేంత ఉంది బట్ట. లోక మర్యాద! దాంతో శుభ్రంగా తిరిగేవాడు. ఆయనకు అది కూడా అక్కర్లేదు. ఊర్లో ఉన్నాడు కాబట్టి, అట్లా ఉన్నవాడిని ఒకరోజు దానికి అలవాటు పడిపోయాడేమో అని చూడడానికని. దేనికి అలవాటు పడనివ్వడు. పేదరికానికి అలవాటు పడకూడదు. సంపదకు అలవాటు పడకూడదు. అట్లా ఉండగలమా? ఆయన ఉంటాడు. అట్లా ఉండేవాడు అంటే

ఆయనకి ఇష్టం. Flexibility! ఏ సన్నివేశానికి అయినా సరే 'I am ready sir' అంటాడట విష్ణుభక్తుడు. కైలాసంలో శివుడు, ఆయన ఒళ్ళో పార్వతీదేవి కూర్చొని మొత్తం అంతా entertainment programme చూస్తున్నారట. కూర్చుంటే విష్ణుభక్తుడైన ఒక గంధర్వుడు వచ్చాడు. అట్లా తిరుగుతుంటారు వాళ్ళు హాయిగా, ఒక విమానం ఎక్కి వస్తాడు. ఆ విమానాలలో తిరుగుతూ ఉంటారు వాళ్ళు. తిరుగుతూ ఉంటే ఈ కైలాసం వచ్చాడట. అక్కడ నాట్యం జరుగుతున్నది, అందరూ చూస్తున్నారు. శివుడు చూస్తున్నాడు. శివుడి ఒడిలో కూర్చున్నది ఆవిడ. 'ఎప్పుడూ ఉంటాడు కదా, ఎక్కడికి పోతాడు ఈ మొగుడు , మరీ అంత ఒడిలో కూర్చోవాలా? ఒకటి. ఈయన, ఏమీ అక్కర్లేదు అన్నవాడు, అంత ఒడిలో కూర్చోబెట్టుకోవాలా ?'. కొంచెం ఆయనకి ఒక క్షణం ఈ భావం వస్తుంది. అలా అనిపించి నవ్వుకున్నాడు. నవ్వుకోగానే ఆయనకు తెలిసిపోయింది. అసలే ఆయన, మరి ఎప్పుడు ఎక్కడ ఏమొస్తుందో అందులో నుండి ఎవరికి తెలియదు కదా. వచ్చేసింది ఆయనకి. వచ్చేసి ఒక శాపం. విష్ణు భక్తుడు కాబట్టి అది కూడా ఒక వైభవంగా తీసుకున్నాడట. మీరు ఎందులో వేసినా వాడు తేలుతూనే ఉంటాడు, వాడు మునగడు. నువ్వు కాలు పెట్టి ముంచినా పక్కకి లేచి వచ్చేస్తాడు. ఆశ్చర్యపోయారట అందరూ. మామూలుగా అయితే ఏడవద్దూ? 'ఆ క్షణంలో అటువంటి భావన నాకు కలిగిన మాట సహజమే. నీవు ఇచ్చిన శాపం కూడా మనస్ఫూర్తిగా, హృదయపూర్వకంగా, ఆనందంగా అందుకుని అనుభవిస్తాను' అని చెప్పాడు. ఇలా ఉంటాడు విష్ణు భక్తుడు. ఎందుకంటే మామూలుగా ధర్మం లో నుండి మీరు పీకినా, Araldite పెట్టి అతికించినట్టే! వాడు రాడు. రమ్మన్నా రాడు, ఏం చేసినా రాడు.

## 865, 866 అణుః, బృహత్

ఒకప్రక్క పరమాణు ఇంకోప్రక్క మొత్తము విశ్వం. రెండూ ఒకచోట చెప్పారు. భగవంతుని అత్యంత చిన్న, సూక్ష్మాతి సూక్ష్మం అయినటువంటి అణువుల నుండి మన కళ్ళకి పూర్తిగా కనబడనటువంటి మొత్తం విశ్వం వరకు నువ్వు అన్నిటిలో వ్యాపించి ఉన్నావు అని చెప్పడానికి 'అణుః, బృహత్'. అది ఒక బృహత్పథకం అంటారు. ఎందుకంటే బృహత్ అంటే బ్రహ్మ చేత ఉచ్ఛరిచబడిన మొత్తం విశ్వం అన్న భావన చేస్తే, బ్రహ్మయే ఆయనచే ఉచ్ఛరింపబడినవాడు కదా! ఆయన బృహ్మణం చేయడము వలన, బ్రహ్మ తో సహా సమస్తమైనట్టి సృష్టి ఏర్పడింది. ఈ ఏర్పడిన మొత్తం సృష్టిలో అణువుగా తానే ఉన్నాడు, బ్రహ్మాండముగ కూడా తానే ఉన్నాడు. కాబట్టి మనం ఎక్కడా చూడకుండా ఉండడానికి అవకాశము లేదు. దేవుడు లేని చోటు లేదు. మొత్తం అంతటా ఉన్నాడు. అలాగే శ్రీకృష్ణుడ్ని కీర్తించాడు. అందుకని మనం సాధనా పరంగా ఈ నామాన్ని తీసుకుంటే ఏది చూసినా సరే, ఏ రూపమైనా సరే ఒక అణు సముదాయమే! కాబట్టి అణువుని తయారు చేసే వాడిని, ఈ సమస్తాన్ని చేసిన వాడిని మనం చూస్తున్నాం. కొంత చూస్తున్నాం కానీ మొత్తము రూపాన్ని చూడలేకపోతున్నాం. సూక్ష్మ రూపాన్ని కూడా చూడలేనిస్థితిలో ఉన్నాం. యోగము బాగా అభ్యాసము చేసి, సూక్ష్మదర్శనము చేసే యోగులు చూసినట్లుగా భౌతికంగా పరమాణువుని మనం చూడలేము. అలాగే ఉచ్ఛ్వాస, నిశ్వాస పరంగా కూడా చూడలేం. భీష్మాచార్యులు వారు ఏమి చెప్పను? అక్కడ నుండి ఇక్కడ వరకు ఉన్నావు కదా నువ్వు, ఎక్కడ మొదలు పెడితే ఎక్కడ అవుతుంది? ఎన్ని ఏమి అవుతుంది? ఎన్ని నామాలు అయినా చెప్పవచ్చు. సహస్రం చెప్పడం ఒక పావు వంతు అన్నమాట అది సహజంగా తన లోంచి వస్తూ ఉన్నది భగవత్ సంకల్పంగ.

## 867, 868 కృశః, స్థూలః

సూక్ష్మము, స్థూలము! అక్కడ భౌతికంగా చెప్పాడు. అణువు, మొత్తం విశ్వము అంత అని! ఇక్కడేమో పదార్థము యొక్క మొదటి సృష్టి నుండి బాగా సృష్టి ఏర్పడి కరుడు కట్టిన పదార్థము యొక్క స్థితులన్నీ చెప్పటానికి 'కృశః'. అంటే, మీకు నేను, నాకు మీరు కనిపిస్తున్నారు కదా. ఈ కనిపిస్తున్న దాని మధ్య సూక్ష్మం అయిన వెలుగు ఉన్నది. అది ఉన్నదని మనకి తెలుస్తోందా? దాన్ని మొదలు మనం తెలుసుకోవాలి. అది సూక్ష్మం. స్థూలం అంటే, మనకి మాములుగా కనబడేది. సూక్ష్మం నుండి స్థూలం వరకు ఉన్నావు, అణువు నుండి బ్రహ్మాండము వరకు ఉన్నావు. ఇంత వ్యాపనం చెందావు అని చెప్తున్నాడు. అందుకనే, కనిపించిందే సత్యము అనుకునే వాళ్ళు ఒక మాదిరి తెలివి గల వాళ్ళు. కనిపించే సత్యము పరాకారము సూక్ష్మము అనుకునే వాళ్ళు ధర్మవరులు. ఎందుకంటే సృష్టి త్రిగుణాత్మక పరంగా చేయబడినది కాబట్టి పదార్థము ఎన్నో అవస్థితులు చెంది ఉంటుంది. పదార్థంకే అవస్థితులు, ఆత్మతత్త్వానికి అవస్థితులు లేవు. కారణం ఏమిటంటే అది స్థితి భేదం చెందదు. అది కారణంగా పదార్థం స్థితి భేదం చెందుతూ ఉంటుంది.అందుకని పదార్థం మారినప్పుడల్లా చైతన్యము మారినట్టుగా మనకి గోచరిస్తూ ఉంటుంది. Electricityకి ఒకటే స్థితి ఒకటే! అవస్థితి ఉండదు. Electricity electricity గానే ఉంటుంది. అది పని చేసే పరికరాలలో మార్పు తప్పా అందులో ఉన్నా, ఇందులో ఉన్నా అది మార్పు చెందదు. కానీ, అక్కడ ఉన్న పరికరముకి ఉన్న గుణ సంబంధముండబట్టి అక్కడ అది అయిపోతూ ఉంటుంది. Mike, fan, light అన్నిటి లోను electricity ఉంది. Electricity మాత్రం అవస్థితి చెందడం లేదు. అది కేవలం తన సాన్నిధ్యాన్ని అందిస్తోంది తప్ప అవస్థితి చెందడం లేదు. కానీ ఈ మార్పులు అన్ని మని కనబడుతున్నాయి. మన ముందుగా ఈ రహస్యము అర్థము చేసుకోవాలి ఏమిటనీ, అవస్థితి చెందేది ప్రకృతి నుండి పుట్టిన గుణములు ద్వారా తప్పా, తత్త్వము వలన కాదు. విద్యుత్ ఇన్ని పరికరాలుగ ఏ విధముగ పని చేస్తున్నదో అని మనకి అనిపించింది. నిజానికి విద్యుత్ తన సాన్నిధ్యము ఇన్ని పరికరాలకి అందించినది అంతే ! విద్యుత్ మనం ఎన్ని రకాలుగా వాడుతున్నాము. ఒకడు light లో భగవద్గీత చదువుకుంటాడు,

మరోకడు పేకాట ఆడుకుంటాడు, ఇంకోరు పోట్లాడుకుంటారు, ఇంకోడు అదే light క్రింద కూర్చొని రాజకీయాలు మాట్లాడుకుంటారు. ఇవన్నీ వెలుగులో జరుగుతున్నాయి తప్పా వెలుగు చేస్తోందా? విద్యుత్ అక్కడ ఉండడం చేత ఓ రెండు పరికరములు పని చేస్తుంటే, విద్యుత్ పని చేస్తోందా, లేక పరికములు  పని చేస్తున్నాయా అనే ప్రశ్న ఏది? వీటన్నిటి లో నుండి ప్రకృతి ఆట, ప్రకృతి లోంచి భగవంతుడి ఆట. నిజానికి ప్రకృతియే ఇవన్నీ చేస్తోంది, నేను కొంచెం పక్కన నిలబడ్డాను అంటాడు. ప్రకృతి ఎలా వచ్చింది? ఆయన లో నుండి  వచ్చింది. ఆయన లేకపోతే త్రిగుణాలు ఏర్పడవు.  ప్రకృతి లోంచి,  త్రిగుణాల లోంచి సమస్తమైన కార్యక్రమాలు ఏర్పడతాయి కదా. ఈయన వత్తాసు లేకపోతె ఇవన్నీ ఎలా ఏర్పడతాయండి? కాబట్టి ఇవన్నీ ఆయన చేస్తున్నట్టే! అయన వత్తాసు  బట్టి అన్ని నిలుస్తున్నాయి అనుకుంటాము కదా. కృష్ణుడుని వత్తాసుగా పెట్టుకుని, అంటే ఆసరాగా పెట్టుకుని యాదవులంతా కూడా మితిమీరి ప్రవర్తించారు. ఒక ధనవంతుడి ధనబలము చేత అతడి కుమారుడు ప్రవర్తించడం ఒక పద్ధతి. మితిమీరి ప్రవర్తించడం ధనమదం. అలాగే ఒక అధికారికి పదవీ బలం. అక్కడ ఆ కుర్చీలో ఉన్న ఆయన కానీ, ఆయన చుట్టూ ఉన్నవాళ్లు గానీ మితిమీరి ప్రవర్తించవచ్చు. అధికారం లోంచి దిగిపోయాడనుకోండి, వాళ్ళ ప్రవర్తన ఎక్కడికి పోతుంది? ఒకడి ధనబలం, మరొకడి అధికారబలం వాళ్ళకి తోడ్పాటు అవవచ్చు. అట్లాగే ప్రకృతికి ఏది బలం? 'నువ్వు  ఉంటావయ్యా, ఉండి చేస్తావయ్యా, కానీ చేసినట్లు కనిపించవు,' అని కూడా కోప్పడే హక్కు భగవంతుడు మనకి ఇచ్చాడు. కానీ 'నేను ఏమి చేయడము లేదు,' అని చెప్పాడు. యుద్ధం కూడా అంతే. 'ఊరికే ఉంటా. నేను ఉండే వాడినే తప్ప, యుద్ధం చేసేవాడిని కాదు. అద్భుతముగా హోరాహోరీ యుద్ధం చేసేవాళ్ళు పది వేలు మంది ఉన్నారు నాతో సమానమైన వాళ్ళు' అంటాడు. అందరిలోకి ఆయనే పెద్ద వాడు, ఎటు వేపు చూసినా. అర్జునుడు యుద్ధములో ఉత్తముడు. అటు దుర్యోధనుడూ వచ్చాడు, ఇటు అర్జునుడూ వచ్చాడు కృష్ణుని వద్దకు సహాయము కోరి. దుర్యోధనుడు 'నేను ముందు వచ్చాను. నేను ఉండగా వాడు వచ్చాడు' అంటే, 'వచ్చిన మాట వాస్తవము అయి ఉండవచ్చు. కానీ నువ్వు పెద్ద వాడివి అయి ఉండి  చిన్న వాడికి అవకాశము ఇవ్వకపోతే రేపు పొద్దున్న ఏమన్నా పొరపాటు జరిగితే వాడిని చిన్నవాడిని చేసి అన్యాయం

చేశావని నిన్ను అంటారు. అందుకని ఎందుకు నీకు నాకు ఈ వితండ వాదన అర్జునుడికే కోరుకోవడానికి అవకాశం ఇద్దామని కృష్ణుడు 'నాతో సమానము అయిన వీరులు ఒకపక్క, యుద్ధం చేయని నేను ఒకపక్క రెండు భాగాలు చేస్తున్నా. ఏ భాగం కోరుకుంటావో నీ ఇష్టం కోరుకో జాగ్రత్తగా', అని చెప్తాడు అర్జునుడుకి. ఆయనకి అర్జునుడి మీద విశ్వాసం ఉన్నది అప్పుడప్పుడు కొంచెం అటు ఇటు అయినా అవసరమైన విషయాలలో సరి అయిన నిర్ణయమే తీసుకుంటాడని. దుర్యోధనుడు బాధ పడిపోతాడు పదివేలమంది వీరులని కోరుకుంటాడు అర్జునుడు, ఈ కృష్ణుడ్ని మనం ఏమి చేసుకుంటాం అని. కృష్ణుడికి అదేమీ లేదు. ఎటు కూర్చున్నా చేయవలసినది అదే! అటు కూర్చుని కూడా ఇటు గెలిపించి గలడు. ఇటు కూర్చుంటే ఎలాగూ ఇటు గెలిపిస్తాడు. ఎటు అయినా ఒకటే. అందుకనే ధైర్యంగా వేశాడు పాచిక. 'నువ్వు యుద్ధము చేయనక్కరలేదు నా రథం లో నువ్వు కూర్చుంటే చాలు' అంటాడు అర్జునుడు. ఇది బాగుంది అనుకున్నాడు దుర్యోధనుడు. ఇంతకీ కృష్ణుడు యుద్ధము చేసినట్టా, చేయనట్టా? సూక్ష్మం! ఎప్పుడైనా కనబడుతున్న దాని యందు కాదు శ్రద్ధ, కనబడుతున్న దాని వెనకాల సూక్ష్మం అయిన దానిని గమనించాలి అని చెప్పడం కోసం ఇంత చెప్పకున్నాం. సూక్ష్మం అయిన విషయాన్ని గ్రహించాలంటే బుద్ధి కుశలత ఉండాలి. బుద్ధికి కౌశలం ఉండాలి. అది ఎప్పుడు వస్తుంది? భగవంతుడిని బాగా ఆశ్రయించడము వలన వస్తుందే తప్ప, లేకపోతే రాదు. సూక్ష్మం అయినటువంటి విషయాలు మనకి ఎలా అవగాహన అవుతాయి? అన్నిటికన్నా సూక్ష్మం అయిన వాడు ఆయన. ఎంత సూక్ష్మం అంటే మనకి కనిపించడు. ఎందుకంటే కనిపించడం అంటే అమ్మవారు కదా! అతి సూక్ష్మాతి సూక్ష్మం, స్థూలాతి స్థూలం వరకు వ్యాపించి ఉన్నప్పుడు మొత్తము అంత నిండి ఉన్నది ఆయనే! కేవలం స్థూలము అయిన విషయాలు గ్రహించిన వాళ్ళు దెబ్బ తింటారు. ధర్మరాజు సూక్ష్మము అయిన ఉత్తముడు. ధర్మ సంపదల మీద ఆసక్తి కల వాడు. దుర్యోధనుడు స్థూలమైన సంపదలపై ఆసక్తి ఉన్నవాడు. సంపద అంటే ఏమిటి? సత్పురుషుల సాంగత్యం/ స్నేహం ఉంటే అంత కన్నా సంపద ఇంకోటి లేదు. డబ్బు ఉన్నవాడు, పదవి ఉన్నవాడు, చదువు ఉన్నా సంస్కారం లేక ఉన్న వాడు 'తన' అనుకుంటే చాల పొరపాటు. ఎక్కడ సంస్కారం ఉంటుందో అక్కడ దైవీబలం ఉంటుంది. ఎక్కడ సంస్కారం అనే ఆసక్తిగల

వాడితో పరిచయం ఉంటుందో అక్కడ నీకు దైవ సహాయ సహకారములు నిత్యమూ అన్ని లోకాల నుండి అందుతూ ఉంటాయి. సూక్ష్మం నుండే అందుతూ ఉంటే, స్థూలం నుండి అందవూ? ఎవరూ నివారణ చేయలేనటువంటి కడుపు నొప్పి ఉందనుకో! చాల సంపద ఉన్న వాళ్ళకి రోగాలు కూడా ఉంటాయి. ఎందుకంటే, సంపదని తినలేవు కదరా, అని చెప్పడం కోసం. సూక్ష్మం అయిన జీవన సత్యాలను మనం తెలుసుకుని, ధర్మములు గురించి తెలుసుకుని, వాటిలో జీవిస్తూ వాడిలో నువ్వు హాయిగా ఉంటావు. సూక్ష్మం ఎరిగిన వాడే హాయిగా ఉంటాడు. కేవలం స్థూలం నమ్మిన వాడు హాయిగా ఉండడు. అందుకని సూక్ష్మం, స్థూలం అని రెండు మనకి చెప్పడంలో సాధన పరముగా సూక్ష్మం కాస్తో కూస్తో తెలిసినవాళ్ళం. సూక్ష్మం తెలిస్తే సులభం అవుతుంది. మీకు నాకు మధ్య ఉన్న చోటులో ఒక వెలుగు. ఆ వెలుగురూపం లో ఉన్నది భగవత్ తత్త్వం అని చెప్తారు. ఋషుల వద్దకు ఒక సత్యాన్వేషకుడు వెళ్ళి భగవంతుడు ఎక్కడ ఉన్నాడో చెప్పమంటే ఆయన అన్నాడూ ' 'వాడు' నీ లోపల ఉన్నాడు కానీ నీకు కనబడడు. నీ లోపల ఉన్నాడు కానీ, నువ్వు బయట ఉన్నాడు అని తెలుసుకునే సత్తా ఉన్నవాడివని అనుకుంటున్నావు. అతడు నీ చర్మాన్ని ఆనుకునే ఉన్నాడు' అన్నారు. అంటే? అన్నాడు. మరి ఆయన చుట్టూ ఉన్నది ఏమిటి? చోటు! నిన్ను ఆనుకుని ఉన్నది 'చోటే'! అది ఆ రూపములో ఉన్నది. ఇంత కన్నా దగ్గరగా సన్నిహితముగా భగవంతుడు ఎక్కడ దొరుకుతాడు? నీ దగ్గరలో ఉన్నాడు, నీ లోపల ఉన్నాడు, నీ లో ఉన్నాడు. నీలో ఉండే ప్రతి అణువు లోను ఉన్నాడు. ఊరికే ఎక్కడ ఉన్నాడు అని అంటే ఏమి చెప్పనూ? కనబడుతున్న వాడిని ఎదురుగుండా చూడాలి. చూడలేనితనానికి ఉన్నది కనబడదు. అది కాక అన్ని కనిపిస్తాయి. ఎంత మంది వచ్చారో తెలియవచ్చు. వారి పేర్లు తెలియవచ్చు. ఆడవారు ఎంత మంది, మగవారు ఎంత మంది వచ్చారో తెలియవచ్చు. ఎలా కూర్చున్నారూ, ఎలాంటి తివాచి వేశారు? అవన్నీ చూస్తాము కానీ వీటన్నిటి లోపల, బయట వ్యాపించిన వాడిని 'అన్తర్ బహిశ్చ తత్సర్వం, వ్యాప్య నారాయణ స్థితః' అది చూడము.

స్థితః అంటే నిలిచి ఉన్నవాడు. స్థితం అంటే ఉండడం. ఉన్నవాడు ఎవడయ్య అంటే లోపల, బయట అంతట వ్యాపించి ఉన్నవాడు 'వాడు'. వాడిని స్థూలంగా చూద్దాము అనుకోవడం వల్లనే స్థూలంగా దేవుడు

కనపడలేదే అని బాధ పడతాము. మనం సూక్ష్మం లోకి వెళ్ళి వెతికితే కనిపిస్తాడు. ఎందుకంటే మానవులుగ వ్యక్తం కాక ముందు మనం వెలుగులం. వెలుగుగ వ్యక్తం కాక ముందు మనం ఆత్మతత్త్వం. ఆత్మతత్త్వంగ ఉన్న అతి సూక్ష్మాతి సూక్ష్మమైన అణువుగ వ్యక్తం అయ్యి, ఆ తరువాత భావములుగా వ్యక్తం అయ్యి, ఆపై ఇంద్రియములు పట్టుకుని అక్కడ నుండి కిందకి వచ్చేశాము. మనలో కూడా సూక్ష్మ రూపము ఉంది కాబట్టి అంతర్ముఖంగ సూక్ష్మం లో ఉండేవాడిని ధ్యానం చేసుకోవచ్చు. ధ్యానము చేసుకోవడం ద్వారా సూక్ష్మతత్త్వం అవగాహన అవుతుంది. సూక్ష్మతత్త్వం బాగా అవగాహన అయితే, స్థూలతత్త్వం బాగా అవగాహన అవుతుంది. సూక్ష్మంగా ఉన్నపుడు చూస్తే, 'ఓహో ఇక్కడ వంకర ఉంది, ఇది తరువాత వచ్చినపుడు వంకరగ వస్తుంది' అని తెలుస్తుంది. జంతిక గొట్టము లోంచి పిండి దిగుతోంది అంటే, అది ఎలా వస్తోంది? అందులో వేసిన బిళ్ళ నమూనా ప్రకారముగా వస్తోంది. అందరు వేస్తూ ఉంటె చూస్తారు. కానీ వేయడం కొందరికే తెలుసు. వేస్తూ ఉంటె జంతిక పడుతుంది. గొట్టములో ఉన్నపుడు అసలు పిండి ఎలా ఉంది? కాస్త పిండి నోటిలో వేసుకు చూస్తే, ఉప్పు, కారం బాగున్నాయా, అన్ని బాగున్నాయా, సమపాళ్లలో ఉన్నాయా అని తెలుస్తుంది. ఉప్పు, కారం ఏది ఎక్కువైనా అది సూక్ష్మ స్థితిలో దిద్దుకోవచ్చు. సరిదిద్దడానికి మార్పులు చేసుకోవడానికి సూక్ష్మస్థితిలో అవకాశం. పిండి నూనెలో పడ్డాక ఏమి చేయలేము. ఏ మార్పులూ చేయలేము. అందుకని పిల్లలు పుట్టాక బంగారు నాయనే, అని అనుకోవడానికి వీల్లేదు. చూడ్డానికి బంగారు నాయనలాగ కనబడవచ్చు. చిన్న పిల్లలను చూస్తే కొంత మందికి తేడా లేకుండా ముద్దు వచ్చేస్తారు. స్థూలం చూస్తారు కాబట్టి చిన్న పిల్లలని చూస్తే ముద్దు వచ్చేస్తుంది. చిన్ని పిల్లలు దేవుడుతో సమానం. స్థూలాన్ని పట్టుకుంటే అంతే కదా! దుర్యోధనుడూ చిన్న పిల్లవాడే. రావణుడూ చిన్న పిల్లవాడే. చిన్న పిల్లలేగా? అందరూ దేవుడితో సమానమే. అందులో సందేహము లేదు. కానీ తర్వాత వీడిలో ఏమి వ్యక్తము అయింది? ధర్మం లేని కొరకరాని కొయ్య అవుతాడు. కొంత మంది పిల్లలని చుస్తే, 'అబ్బా! ఎంత పాపం చేసి పుట్టాడో' అనిపిస్తుంది. కొంతమంది ఇప్పుడు బాగానే ఉన్నా, సంచీలో ఉన్నవో! సంచీలో ఉన్నవి అన్న సంచిత పాపాలే! ఏవి పోవు. సంచీలో చేరి అవి ఒకటి

ఒకటి వస్తూ ఉంటుంది. పుట్టాక చక్కగా పళ్ళు బాగానే ఉన్నాయి కదా! ఆ పాలపళ్ళు పోయి మళ్ళా మామూలు పళ్ళు ఎట్లా వచ్చాయి భగవంతుడికే తెలియాలి! కాబట్టి స్థూలం నుండి సూక్ష్మం లోకి విచ్చుకుంటున్నప్పుడు ఎట్లా ఉంటుందో తెలియాలంటే సూక్ష్మదృష్టి ఉండాలి. అది ఉన్న వారికే తెలుస్తూ ఉంటుంది. అందుకే ఋషులు 'అమ్మో! వీడు లోక కంటకుడు అవుతాడు. ఇప్పడే తీసేయండి' అని అంటారు. కాని తీయరు. లోకకంటకుడు అవుతాడని తెలిసినా, ఎంతో మంది వారి దుష్టత్వం వలన బలిఅయిపోతారని రాజపురోహితులు, మంత్రులు చెప్పినా కూడా ఆ రాజుగాని, రాణిగానీ వదులుతారా? ఆ-- మనం బాగుచేసుకోలేకపోతామా? వాడి mould బాగులేదు. ఎట్లా బాగుచేసుకుంటావు, జంతిక అయిపోయిన తరువాత? జంతిక ముందు బాగు చేసుకోవాలి. అది మనకి కొత్తగ పెళ్ళి అయిన వాళ్ళకి గుర్తు చేయాలి. పిల్లలని కనడానికి తొందర ఏముంది? తొందరపడి పిల్లలని కనవద్దు. ఎప్పుడు కనాలంటే, ముందు భార్యా భర్త మనలో ఎలాంటి భావాలు ఉన్నాయి చూసుకోవాలి. ఎటువంటి ఆరోగ్యము ఉన్నది? ఎటువంటి వాతావరణములో ఉన్నారు? ఎటువంటి ప్రదేశములో ఉన్నారు ? ఇవన్నీ చాల ముఖ్యము. దైవీ సంపదలు బాగా ఉండి, దేముని వైపు వంగి ఉన్నారు. అప్పుడు కనాలి. అప్పటి నుండి ఉంటుంది తప్పా పిల్లవాడు పుట్టిన తరువాత ఏమి చేయలేము. ఎందుకో తెలుసా? అటువంటి భావనలో ఉండకపోతే, తల్లి తండ్రి airport కాబట్టి, అక్కడకి land అయ్యే జీవుడు సంస్కారవంతుడు అవుతాడా? కాడు. అలా కాకపోతే తల్లి, తండ్రి మనస్సులలో వారి భావ సముదాయము ఏ స్థితిలో, ఏ సంస్కారములో ఉందో దానికి LCM కట్టి, అది ఆధారంగా అక్కడ దానికి సంబంధించిన జీవిని దింపుతారు. అందుకని ఆ తరువాత 'నా తండ్రి ఇట్టా అయిపోయాడే' అని ఏడ్చి లాభము లేదు. అందుకని మనం దింపుకున్న ప్రయాణీకుడు ఉన్నాడే, వాడు ఎవడు దిగుతున్నాడో కొంత మందికి permission ఇవ్వకూడదు దిగడానికి. కొంత మందికి permission ఇవ్వాలి. ఎలా? భావమయ ప్రపంచములో బాగా పవిత్రత ఈ విధముగ పెంచుకుంటే అప్పుడు వేరే జీవనిర్మాణానికి అవకాశము ఏరపడుతుంది. అడ్డగోలగ పిల్లలని కనేస్తాం. ప్రతి two seconds కి ఒకడు పుడతాడట మన దేశములో. అంటే ఎవరు పడితే వాడు పుడుతున్నారు. పుట్టాక ఏమి చేస్తున్నాం? పుట్టాక వాడు వికారంగ

తయారైపోతుంటే 'అయ్యో' అంటాము, ఏమి చేయలేక. ఎన్నో ఆశలు పెట్టుకుంటాం. పుట్టినపుడు వాడు పండల్లే ఉంటాడని. అందంగా ఉంటాడని. స్వభావము? సూక్ష్మం కదా! చాల అందంగా ఉండి, స్వభావం భయంకరముగ. స్వభావం చాల బాగుండి, అందవికారంగ. సూక్ష్మబుద్ధి కలిగి ఉన్న వాడు రెండు రకాలు తెలుసుకోవాలి. అందం కొరుక్కుంటామా అంటారు కదా! ఎందుకు? స్వభావము బయట పడిన దగ్గర నుంచి ఇంక ఆ అందము కనబడదు. మనిషి యొక్క స్వభావమే నిజమైన అందము. సూక్ష్మంలో అది కనిపిస్తుంది. అందుకని సూక్ష్మాతి సూక్ష్మం అయినటువంటి విషయం మనకి తెలియాలి కదా అని సూక్ష్మంలో వెళ్లి కూర్చున్నాడు, స్థూలంలో కూడా కూర్చున్నాడు. సూక్ష్మంగా, స్థూలంగా కూడా ఆయనే ఉన్నాడు. 15 వ అధ్యాయం భగవద్గీతలో 'సూక్ష్మంలో ఉన్న నన్ను బాగా దర్శనం చెయ్యి, స్థూలాన్ని పట్టుకు వేలాడకా' అని చెప్తాడు. ప్రతి వాళ్ళకీ ఏవో కష్టాలు వస్తూనే ఉంటాయి. అంటే ఏమిటి? ఇదివరకు చేసినవి స్థూలంగా సన్నివేశాల రూపములో ఇప్పుడు దిగినాయని అర్థం. అంతకు ముందు అవి సూక్ష్మంలో ఉన్నాయి, సమస్య రాక ముందు. సమస్య వచ్చాక వచ్చింది అని అనుకున్నాము తప్ప, అసలు సమస్యని ఇదివరకు ఎప్పుడో సృష్టించేశాము. సమస్య 10 జన్మల క్రిందనో, 15 జన్మల క్రిందనో సృష్టించి ఇవాళ ఎదురు పడేసరికి 'నాకు సమస్య వచ్చేసింది' అంటాడు. ఇప్పుడు రాలేదు సమస్య. అప్పుడే తెచ్చావుగా! ఒక చక్కని గుణవతి అయినటువంటి స్త్రీకి ఒక దుర్మార్గుడైన భర్త దొరుకుతాడు. అలాగే గుణవంతుడైన పురుషుడికి, గయ్యాళి భార్య దొరుతుంది. ఇప్పుడు అయ్యిందా? ఎప్పటి నుండో prepare చేసుకు రావడము వలన అయ్యింది. అందుకనే మన భారతీయ సంస్కృతిలో ఈసారికి వీడితో పడిపోతే సరిపోతుందని, మనకి విడాకులు లేవు. ఎందుకంటే, తీర్చుకోవడమే! కర్మ సిద్ధాంతం! సూక్ష్మ ధర్మములను అవగాహన చేసుకున్నప్పుడు బాగా అర్థము అవుతుంది. స్థూలంగా చూసినప్పుడు మనకి ప్రతి విషయమునందు ఒక ఆరోపణ, ఒక complaint ఉంటుంది. నాకే ఎందుకు ఇలా జరగాలి? ఇహ అప్పుడు మనం వాడిని, వీడిని ఊరికే విసిగించేస్తే లాభం లేదు. ఎవరిని? ఏడు కొండల వాడిని, లేక కనకమహాలక్ష్మినో ఇంకో సింహాచలేశుడినో ! ఇంతకు ముందు కోసం ఇప్పుడు మంచి విత్తనాలు వెయ్యి. అంతకు ముందు ఏవో పిచ్చివి వేశావు, అది

అయిపోయింది. కొత్త పొలం ఎప్పుడూ ఉంటుంది విత్తనాలు వేయడానికి. ఇప్పుడు మంచి విత్తనాలు వెయ్యి, ముందు మంచి తోట వస్తుంది. ఇది ఒక్కటే పద్ధతి. ఇదివరకు మంచి విత్తనాలు వేసినవాడు ఇప్పుడు అనుభవిస్తూ ఉంటాడు. వాళ్ళేమి గుర్తు పెట్టుకోవాలి అంటే (ఇదంతా మన గొప్ప అనుకోకుండా), మంచి విత్తనాలు అప్పుడు వేసుకోవడం అనేది మనకి భగవత్ కృప వల్ల జరిగింది. అలాగే మంచి విత్తనాలే వేసుకుంటూ వెళదాము అనుకుంటూండాలి. అందుకని ఈ విధమైనటువంటి సూక్ష్మం అయిన అవగాహన ఉంటె, ఏవో పాత బాకీలు కూడా తీర్చుకుంటూ ఉంటాము. పాతవి మనకి బాకీ పడ్డ వాళ్ళు మనకి తీరుస్తూ ఉంటారు. ఇలా రెండూ నడుస్తూ ఉంటాయి కథలా. మనకి ఇవాళ చేసి పెట్టే వాళ్ళు అంతా కూడా మనకి ఇదివరకు కాస్తో కూస్తో ఋణం ఉన్నవాళ్ళు. అంతా ఋణ సిద్ధాంతం. మనకి బాకీ ఉన్నవాడు మనకి చేసి పెడుతుంటాడు. మనం బాకీ ఉన్న వాడికి మనం చేసి పెడుతుంటాం. ఇందులోంచి మనకి ఏమి అర్థం అవుతోంది అంటే, నిర్లిప్తంగా ఉండాలని అర్థం అవుతుంది. స్థూల సూక్ష్మ స్థితులు బాగా అర్థం అవుతాయి. ద్రౌపదీదేవి పాండవులని పెళ్లి చేసుకునే సమయములో వ్యాసుడు వచ్చి సూక్ష్మలోకాల్లో కథ ద్రుపదుడికి చెప్పడం వల్ల అయిదుగురు రాజ కుమారులకు ఇచ్చి పెళ్లి చేయడము జరిగింది. లేకపోతె వీలు పడేది కాదు. పూర్వాపరాలు తెలిపాడు కదా, అప్పుడు ద్రుపదుడు అంగీకరించాడు. అసలు ఐదుగురిని చేసుకుందాము అనే భావన ద్రౌపదికి కూడా లేదు. అలా అసలు ఏ సాధారణ స్త్రీకే కలగదే! అగ్ని లోంచి సరాసరి పుట్టుకు వచ్చినది, అతి పవిత్రమూర్తి అయినటువంటి స్త్రీ మూర్తి ఆమె, అలాంటి ఆమెకు జరిగిందంటే సూక్ష్మం ఆలోచించ వద్దూ? ప్రతి విషయములో కూడా సూక్ష్మం ఆలోచించాలి. అందుకని మహాత్ములు వారి దగ్గరకి ఎవరైనా సమస్యలతో వస్తే, వారి సూక్ష్మ లోకాల విషయాలు చూసి, దాని బట్టి ప్రస్తుతానికి ఉపశమనంగా ఒక మార్గాన్ని ఇచ్చి, వాళ్ళని మంచిలో నిలబెట్టడానికి అప్పుడు ప్రయత్నము చేస్తారు. అప్పుడు ఏమి చెప్పినా వింటాడు. ఎందుకంటే కష్టంలో ఉన్నాడు, మన దగ్గరకి వచ్చాడు. మనం చెప్పిన ఉపాయము వల్ల జరుగుతుందని వాడికి తెలుస్తుంది. అపుడు ఎదో ఒక మంత్రమో, ఒక దీక్షో, సంస్కారమో వాడిలో ప్రవేశపెట్టామనుకో, అదేదో అలా జరుగుతూనే ఉంటుంది ఎప్పుడో చేసినది. దానికి ఉపశమనం ఎలా కలుగుతుందంటే

సమస్య అలా ఉండగా అది సమస్య గా రాజిల్లదు. రాజిల్లక సమస్య చిన్నదవుతుంది. సమస్య అలాగే ఉన్నప్పటికీ వీడు సమస్య కన్నా పెద్దవాడు అవుతాడు. ఓ గీతని చిన్న గీత చేయాలంటే ఏమి చెప్పారు? పక్కన పెద్ద గీత గీయమన్నారు. అపుడు ఇది చిన్నది అయిపోతుంది. పెద్ద విషయములో వీడి మనస్సు లగ్నం అవడం వలన సమస్య చిన్నది అవుతుంది, కానీ ఈ లోపల వీడికి ఒక మంచి విత్తనము పడుతుంది, వీడికి ముందుకు పని చేస్తుంది. ఎంత ఉపకారం చేసినట్టూ? ఇంకా పాడైపోకుండా చూస్తాడు. పాత విషయములు వీడిని పూర్తిగా బంధించి పాడు చేయకుండా చూస్తాడు, ఎందుకంటే సూక్ష్మలోకం దర్శనం తెలుసు కాబట్టి. కృష్ణుడు అంతా సూక్ష్మంలో దర్శనం చేసి ఎంతో అద్భుతంగ నిర్వర్తించాడు తన జీవితాన్ని. మహర్షులు అట్లా నిర్వర్తించారు. ఎంత సూక్ష్మదర్శి కాకపోతే, అక్కడ సైంధవుడు వాళ్ళ నాన్న తపస్సు చేసుకుంటున్నాడు, ఆయన ఎక్కడ, ఏ చెట్టు క్రింద కుర్చున్నాడో, వీడి తల తెగి ఆయన ఒళ్ళో పడేటట్టుగా బాణం వేయమని చెప్పడం, నిజముగా ఎంత సూక్ష్మదృష్టి ఉంటె వీలవుతుంది అలా? ఆ రోజు సమస్య స్థూలం గా ఏంటంటే, సూర్యాస్తమయము లోపల సైంధవుడ్ని సంహరించడం. సృష్టి మడతలలో ఏమి జరుగుతుందో ఎవడూ ఊహించ లేడు. అర్జునుడు ఊహించగలడా? ధర్మరాజు ఊహించగలడా? సైంధవుడ్ని చంపితే చాలు అనుకున్నారు. చాల మంది పాండవ సైన్యంలో యుద్ధం చేస్తున్న వాళ్ళు సైంధవుడితో యుద్ధం చేశారు. సైంధవుడు కౌరవుల పక్క యుద్ధం చేశాడు. వాడిని సంహరిస్తే ఏమి జరుగుతుందో తెలుసా? సంహరించిన వాడు కూడా పోతాడు! అది ఎవరికి తెలుసు? అంత ముందు భారతములో కూడా రాయలేదు. అప్పుడు చెప్తాడు. సైంధవుడు ఎదురు పడే వరకు కృష్ణుడు ఏమీ చెప్పలేదు. అర్జునుడు, మన మహావీరుడు నిన్నే ఇదంతా నిర్ణయం చేశాడు కదా! 'రేపు సాయంత్రం లోపల వాడి తల నేల పడక పోతే నేను ప్రాయోప్రవేశం చేస్తాను' అని. 'ఊ-- వీడు నాకు program పెట్టాడు' అనుకున్నాడు కృష్ణుడు. యుద్ధం అవుతున్నది కానీ ఎప్పటికీ తెమలలేదు. అర్జునుడు ఎప్పుడైతే ఈ మాట అన్నాడో వీడ్ని ఈరోజు పడెయ్యాలని, అర్జునుడిని ప్రాయోపవేశం చేయించేస్తే ఇక ధర్మరాజు యుద్ధం చేయడు. ఇక నాకు ఎందుకు, మీరే పట్టుకు పొండి అంటాడు. అందుకని కౌరవులు ఇదో మంచి అవకాశము అని అందుకని మహా వీరులు అందరూ సైంధవుడి చుట్టూ

కవచం వేసేస్తారు. ఎంత సేపు యుద్ధం చేసిన తెమలదు. సాయంత్రము అయిపోతూ ఉంటుంది. మనవాడికి tension వస్తుంది. ధనూర్ రాశి లో పుట్టాడు అర్జునుడు కనుక ధనుర్ విద్యలో కూడా బాగా ప్రావీణ్యుడు అయినప్పటికీ కూడా, ధనూర్ రాశి వాళ్ళకి సహజముగా కూడా tension ఉంటుంది. ఆ బాణం పట్టుకుని విల్లుకి సంధించితే ఎంత tension ఉంటుందో, అంత tension ఉంటుంది ధనూర్ రాశి వాళ్ళకి. ఆ tension release అవ్వాలి. అంటే బాణం ముందుకు వెళ్ళాలి. ఏదో ఒక ఆశయానికి గురిపెట్టి వదిలితే వాడికి tension release అవుతుంది. లేకపోతే జీవితం అంతా tension ధనూర్ రాశి వారికి. ధనూర్ లగ్నమూ అంతే! ధనుస్సులో చంద్రుడు ఉన్నా అంతే! కాబట్టి మన వాడు, మన వాడు అని ఎందుకు అన్నానంటే మన అన్నగారాయన. నరుడు కదా tension పడిపోతున్నాడు. ఈయన చక్రం వేశాడు. అందరూ సూర్యస్తమైపోయింది అనుకున్నారు. చూస్తూ ఉన్నారు. చక్రం వేసి ఏమి చేశాడూ? సూర్యుడు అస్తమయము అయ్యే సమయానికి ఒక మాయ కలిపించాడు యోగశక్తి చేత. కలిపిస్తే కౌరవుల మధ్యలో నుండి హర్షధ్వనాలు చేసుకుంటూ సైంధవుడు బయటకు వచ్చి గెంతులు వేస్తుంటే, అప్పుడు సూర్యుడ్ని చూపించి 'అదిగో సూర్యుడు ఉన్నాడు. కనబడుతున్న సైంధవుడుపై ఇప్పుడు వదులు బాణం,' అని శ్రీకృష్ణుడు చెప్పాడు. 'బాణం వదిలినప్పుడు గుర్తు పెట్టుకో, వాడి తల నేల మీద పద కూడదు. వాళ్ళ నాన్న ఫలానా చోట తపస్సు చేసుకుంటున్నాడు ఆయన ఒళ్ళో వెళ్లి ఈ తలకాయ పడాలి' అని చెప్తాడు. 'ఎవరి కారణముగా ఈ తల నేలని స్పృశిస్తుందో వాడు పోవాలి' అని వాళ్ళ నాన్న తపస్సు చేసి వరం కోరాడు. రజో గుణంతో చేసే తపస్సులు అన్ని ఇట్లానే ఉంటాయి. అందుకని' సైంధవుని తలకాయ తెగి వెళ్ళి ఆయన ఒళ్ళో పడేటట్టు బాణం సంధించి, మంత్రించి మరీ బాణం వెయ్యమని' చెప్తాడు. అది సూక్ష్మదర్శనం లేకపోతె చేయగలడా? ఇంత తపస్సు చేసుకుంటున్న వీళ్ళ నాన్నకి సూక్ష్మదర్శనం అంటె తన కొడుకు అక్కడ ఎలా ఉన్నాడో తెలియదు? అందుకని ఆ తలకాయ అట్లా flight ఎక్కి వచ్చినట్టుగా బాణం పట్టుకువచ్చేసింది. వెళ్లి అతడి ఒళ్ళో పడేసింది. తపస్సు చేస్తున్న వాడి ఒళ్ళో కొబ్బరికాయ పడ్డట్టుగా పడింది. పడితే ఇంత తపస్సు చేస్తున్నవాడు 'అమ్మో ఏదో పడిపోయింది' అనుకుని గభాల్న లేచి నించున్నాడు. తలకాయ క్రింద

పడ్డది. చూసి అయ్యో! తన కొడుకు తలకాయ అని అనుకుంటున్నాడు, ఇంతలో ఆయన తలకాయ ప్రక్కలైంది. ఎన్ని రకాలుగా వీళ్ళని కృష్ణుడు కాపాడుతున్నాడూ? అదీ సూక్ష్మ దర్శనం అంటే! ఎందుకు సూక్ష్మదర్శనం అంటే కాపాడడానికి. దివ్యత్వం ఉన్న చోట సూక్ష్మదర్శనం. మాస్టరుగారు సూక్ష్మదర్శనం తో నన్ను కాపాడారు. ఎక్కడో ఎవరిదో పెళ్లి. పెళ్లి కొడుకు ఎటువంటి వాడో చూసి రమ్మని నన్ను చెన్నపురి వెళ్ళమన్నారు. చెన్నపురి వెళ్లాలనుకుని మాస్టరుగారు దగ్గరకి వచ్చాను. ఊరు వదిలి వెళ్ళేటపుడు మాస్టరుగారికి చెప్పకుండా వెళ్ళడం అనేది నా మనస్సుకి ఇష్టముగా ఉండేది కాదు. అందుకని డాబాగార్డెన్ లో ఒకరి ఇంట్లో ఆయన విశ్రాంతి తీసుకుంటూ ఉంటే వెళ్ళాను, 'మాస్టరుగారు పడుకున్నారు' అన్నారు. నాకు ఒక అదృష్టం ఏమిటి అంటే, నేను వెళ్ళినపుడు 'పడుకున్నారు' అని మాట ఒకటి చెప్తారు, నేను వెళ్ళంగానే ఆయనే లేచి 'లేదు లేదు నేను పడుకోలేదు రావోయ్' అన్నారు. అలా మాస్టరుగారు పిలిచిన సన్నివేశాలు చాలా ఉన్నాయి. లోపలకి వెళ్తే మాస్టరుగారు 'మద్రాస్ వెళ్తున్నావా?' అన్నారు. 'అవును మాస్టారు' అంటే 'వద్దు.' అన్నారు. 'ఎందుకు?' అన్నాను. 'వాడు ఎవడో నువ్వు కనుక్కోలేవు. ఎంత తెలివైన వాడు వెళ్ళినా కనుక్కోలేరు. వాడు ఒక నిత్య పెళ్ళికొడుకు. ఇట్లా పెళ్ళిళ్ళు చేసుకుంటూ డబ్బులు సంపాదించడం ఒక వృత్తిగా పెట్టుకున్నాడు. వాడికి ఇప్పటికే ఇద్దరు భార్యలు. అసలు బ్రాహ్మణుడే అయినా ఇంకొక ముస్లిం యువతిని పెళ్ళి చేసుకున్నాడు. బ్రాహ్మణ స్త్రీ ద్వారా ఇద్దరు పిల్లలు, ఆ యువతి ద్వారా ఇద్దరు పిల్లలు. ఇప్పుడు ఇది మూడో పెళ్ళి. నువ్వు వెళ్తే వాడి కన్నా అంత స్వచ్ఛమైన బ్రాహ్మణుడు ఇంకోడు లేడు అనిపిస్తుంది. బయటకి ఎంతో వినయం, మృదుత్వం, సహన శీలిగాను, అసలు ధర్మాత్ముడు రూపుకట్టుకు వచ్చాడా అన్నట్టుగా ఉంటాడు. వాడు ఒక _ _ _ _ _ _'.అని చెప్పారు. 'నేను వెళ్ళను. కానీ ఏమి చెప్పనూ, నన్ను పంపించిన వాళ్ళకి?' అంటే 'నీ ఇష్టం', అని వదిలేశారు. నేను అన్నాను 'మీరు చెప్పారు కాబట్టి నేను వెళ్ళడము లేదు' అని చెప్తాను. 'సరే! చెప్పకో' అన్నారు. అలాగే వెళ్లి చెప్పాను. అంటే, వాళ్ళు 'వెళ్లి చూడకుండా అలా మాట్లాడడం ఏమి బాగుంటుందని' అన్నారు. ఎందుకంటే, ఆ అమ్మాయికి అప్పటికే 35, 36 సంవత్సరాలు వచ్చేస్తున్నాయి. లేక లేక ఒక సంబంధము వచ్చింది. కాబట్టి బాగులేదు అని చెప్తే ఎలా ఉంటుంది వాళ్లకి? 'నా సలహా

మీ శ్రేయోభిలాషిగా ఈ సంబంధం ఇంతటితో విరమించండి,' అని అంటే వాళ్ళు విరమించలేదు. ఒక Navy Commander ని పంపించారు. ఆయన వెళ్ళి చాల హడావిడిగా అన్ని చూసి వచ్చాడు. 'అదేమి లేదు, అది ఉత్త అబద్ధం. అతను చాల ఉత్తముడు పెళ్లి చేసుకోవచ్చు. ఆలస్యం అయినా ఇటువంటి మొగుడు దొరికినందుకు నేను చాల సంతోషిస్తున్నాను', అని చెప్పాడు. పెళ్ళి అయిపోయింది. నెమ్మదిగా ఆరు నెలలు అయిన దగ్గర నుండి కొద్దికొద్దిగా అనుమానాలు రావడం మొదలయ్యింది. ఒక రెండేళ్ళకి మన మాస్టరుగారు ఏమి చెప్పారో అట్లా తు.చ. తప్పకుండా ఈ అమ్మాయి ఏమి చేయలేక వెనక్కి వచ్చేసింది. అప్పటికే ఆరోజులలో దాదాపు ఒక 35 వేల రూపాయలు పోయాయి. రెండు ఏళ్ళల్లో చాలా తెలివిగా ఒక తిరగలి తిప్పినట్టుగా తిప్పించాడు. అయిపోయింది. సూక్ష్మదృష్టి ! అనుకునే మన బోటి స్థూల దృష్టి ఉన్న వాళ్ళం గురువులని ఆశ్రయించడం, వారికి ఉండే సూక్ష్మ దృష్టి చేత మనలని రక్షించగలరని. ఇదేదో మామూలు విషయమే కదా, మనము చూస్తే తెలిసిపోతాయి కదా అని మనం వెళ్లి వచ్చామనుకోండి, ఆ అపకీర్తి అంతా మన మీదే కదా! ఆవిడకి ఎటూ తప్పదు కష్టం. ఇప్పుడు ఆ Commander గారి మీంచి ఆ అపకీర్తి నడచి వెళ్ళిపోయింది. మహనీయులు అంతా సూక్ష్మదృష్టి కలవారు. మన ఋషులంతా సూక్ష్మదృష్టి గలవారు. శ్రీకృష్ణుడి సూక్ష్మదృష్టి ఎంతో మనం చెప్పలేము. అతి సూక్ష్మం! పక్క వాడికే అర్థము కాదు. అనుక్షణం తనతో ఉన్న వాళ్లకి కూడా ఆయన గురించి అర్థం కాదు. అంత స్థూలం కూడా! అంటే బాగా బరువుగా కూడా ఉంటాడు. తులాభారం లో తెలిసింది ఆయన బరువు ఎంతో.

## 869, 870 గుణభృత్, నిర్గుణః

అంటే గుణములు ధరిస్తాడు! అయన గుణములు ధరించకపోతే కథే లేదు. సృష్టి కథ లేదు అయన గుణాలలోకి దిగకపోతే. తన లోంచి 'అమ్మవారు' వచ్చింది. అమ్మ లోంచి మళ్ళా తాను ముగ్గురు అమ్మవార్లుగా దిగి వచ్చాడు. దిగి రావాలి అంటే పిండి ఉండాలి కదండీ. జంతికలు దిగి రావాలి అంటే పిండి ఉండాలిగా. వట్టిగా వత్తితే జంతికలు రావు కదా. ఆయనే పిండి.

అబధ్నన్ పురుషం పశుమ్, తం యజ్ఞం బర్హిషి ప్రౌక్షన్ - - -.

మనం చదువుకుంటూ ఉంటాము కదా. ఆయన్నే శుభ్రంగా వండితే కదా సృష్టి దిగి వచ్చేది. మరి త్రిగుణాలు ఎక్కడ నుండి వచ్చినాయి? అందులోకి అయన దిగాడు కాబట్టి వచ్చినాయి. త్రిమూర్తులుగా మళ్ళీ 'ఆయనే' వచ్చాడు. వాళ్ళ ముగ్గురుకి ముగ్గురు దేవేరులుగా మళ్ళీ ఆయనే వచ్చాడు అనుకోవాలి. అట్లా ఏది వచ్చినా ఆయనే వస్తాడు మార్పు చెందుతు ఉంటుంది. ఒక గణపతి రాగానే ఇంకొంచం స్థూలంగా ఉండి, అన్నిటిలోను త్రిగుణములు ఉంటాయి. కొన్నిటిలో ఒక గుణం కన్నా ఇంకో గుణం ఎక్కువగా ఉంటుంది. కొన్నిచోట్ల తమస్సు ఎక్కువగా ఉంటుంది. అవి కదలనివిగా ఉంటాయి. రజస్సు ఎక్కువ ఉన్న వాడికి గుణాలు చాల వేగంగా ఉంటాయి. కదులుతూ ఉంటాయి. కదలిక, కదలిక లేకపోవుట ఈరెండింటికి మధ్య సమపాళ్ళుగా ఉండి, అన్ని విషయములందు సమత్వము ఉండే స్థితి 'సత్త్వ గుణం'. సత్త్వ గుణం ఉండడం వల్లనే ఉండడం. గుండ్రాయిూ ఉంది, మహర్షీ ఉన్నాడు. ఉండడం అంటే సత్త్వ గుణమే! మనం కూడా ఉండడము అంటే అలా సత్త్వగుణంలో ఉండడం. ఏమి చేయకుండా అట్లా ప్రశాంతంగ ఉన్నాము అనుకోండి, అంటే రజస్సు లేదు. తమస్సు లేదు. తమస్సు అంటే ఉన్నాము కానీ ఆ ఉన్నాము అని తెలియకుండా ఉంటాము నిద్రలో. ఉన్నాం కదా! అట్లాగే బాగా రజస్సుతో పని చేస్తూ ఉంటాము. ఉన్నాం కదా! పని చేస్తూ ఉన్నాం, నిద్రలోనూ ఉన్నాం. ఈ రెండు లేకుండా కూడా 'ఉంటాం'. శుద్ధతత్త్వం అట్లా తెలుస్తుంది. నిద్ర కాక, భావముల యందు తను ఉద్యుక్తుడు కాక, తాను ఎట్లా ఉన్నాడో తనకు తెలిసినప్పుడు తను శుద్ధతత్త్వం లో ఉన్నట్లు అని చెప్తారు. భావములో ఉన్నప్పుడు రజస్సులో ఉన్నట్టు లెక్క. నిద్రలో

ఉన్నప్పుడు తమస్సులో ఉన్నట్టు లెక్క. కానీ తమస్సు లో ఉన్నా, రజస్సులో ఉన్నా 'ఉండడం' ఉంది కాబట్టి తత్త్వం ఎప్పుడూ ఉంటుంది. ఈ సత్త్వగుణముగా తాను దిగి వచ్చి, రజస్సు తమస్సులను కూడా పెంపొందించి, అవన్ని మూడు పేటల జడగా అల్లి ఈ సృష్టి అంతా నిర్మాణము చేశాడు. ఆయన వెనకాల ముడి సరకుగా లేకపోతే ఈ సృష్టి అనే గోళము తయారు కాదు. సృష్టి లోంచి ఎన్నో గోళాలు వచ్చాయి. అందులో నుండి జీవుడు వచ్చాడు. ఎంత కథ నడిచింది! ఈ కథ అంత జరగాలంటే అయన గుణములను ధరించాలి. గుణములను ఆమె నుండి వ్యక్తం చేయాలి. ఇప్పుడు మన ఇళ్ళల్లో గృహిణే అన్నీ చేస్తుంది కదా! కూరలు తీసుకు వస్తుంది, దుస్తులు కొంటుంది, ఇంటి పనులూ, బయట పనులు ఆమె ఎక్కువ నిర్వహిస్తుంది కదా! అప్పుడు అందరికీ అమ్మగారే తప్ప, ఆ వెనకన నిల్చున్న అయ్యగారు కనిపించరు. మన బోటి వారు వెళ్తే, 'వీడెవడమ్మా! సంచి పట్టుకోవడానికి వచ్చాడా' అని కూడా అంటారు. ఎందుకు వచ్చాడా అన్నటుగా ఉంటుంది. ఎందుకంటే వాడికి customer అంటే value ఎక్కువ కాబట్టి ఆవిడని గౌరవించి, ఆ పక్కనే విలబడిన మన బోటి వారిని చూడరు. ఎందుకంటే ఆవిడే కదా ఇంట్లో పనులు, వాకిట్లో పనులు అన్నీ కూడా నిర్వర్తిస్తున్నది. పూర్వ కాలంలో వాకిట్లో పనులు మొగవాళ్ళు, ఇంటి పనులు ఆడవాళ్లు చేసేవారు. ఇప్పుడు వారికి బాగా తమస్సు పెరిగి బాగా ఆడ వారికి రజస్సు పెరిగేటట్టుగా చేశారు. వీరి రజస్సు transfer చేయడము వల్ల రోజు market కి వాళ్ళే వెళ్ళి తెచ్చి ఇంట్లో పడేస్తూ ఉంటే మనము వచ్చి తింటూ ఉంటాము, అంతే కదా? కానీ ఇదంతా జరగడానికి ఎవరు కారణం? ముడి సరకు ఆయన ఇంట్లో ఏదో ఒక కట్ట రూపం లో ఇవ్వబట్టి కదా! ఆయన ఇవ్వలేదు అనుకోండి ఇహ ఈవిడ బజారుకి వెళ్ళేదేముంది? 'ఏమోయ్ ఇవాళ ఎందుకు వెళ్ళలేదు బజారుకి?' అని అడిగితే 'ఏమి పట్టుకు వెళ్ళమంటారు', అని అడుగుతుంది. ముడి సరకు లేకుండా సంసారంలో స్త్రీ ఎట్లా ఇల్లంతా నడపలేదో ఈ పరతత్త్వం అయిన భగవత్ తత్త్వం అనే ముడిసరకు లేకుండా అమ్మవారు ఈ సృష్టి అనేది చేయలేదు. సంసారం లాగ దాని నిర్మాణం అంత ఆవిడ చేస్తోంది కానీ, దాని వెనకాల ఆయన ఉన్నాడు. మాస్టరుగారు అంటూ ఉండేవారు, 'మనకి ఎందుకయ్యా, అది అట్లా ఇచ్చి వస్తే వాళ్ళు చూసుకుంటారు. మన బాధ్యత కూడా వాళ్ళకి ఇవ్వడమే మంచిది. మనం

వెళ్ళి తీసుకు వస్తే పుచ్చులు, చచ్చులు తీసుకు వచ్చాము అంటారు. పైగా మనం మంచివి తెచ్చినా కూడా ఏమిటి ఇటువంటివి తెచ్చారు అంటారు' అని. అందుకని అతడు/శివుడు దిగడుట. 'అన్నీ నువ్వు చూసుకో నేను నీ వెంట ఉంటాను' అని పనులు జగన్మాతకి అప్ప చెప్పాడట. తాను మాత్రం అలా ఉంటాడట. ఎంత తెలివైన వాడండీ! ఈ బ్రహ్మ, విష్ణులు పాపం కాస్తోకూస్తో పనులు చేస్తూ ఉంటారు. ఆ పరమశివతత్త్వం మహా అద్భుతమైన తత్త్వం! మాస్టరుగారు 'ఈ ఒక్క విషయములో మనం శివుడిని follow అవ్వాలయ్యా', అనేవారు ఎందుకంటే, చేత తప్పదు, తినడం తప్పదు. ఎందుకు ఇవన్నీ? సృష్టి విషయము ఆవిడది. ఆవిడ చూసుకుంటుందని వదిలేసేయాలిట. అట్లా వదిలేసి శివుడు సుఖ పడుతున్నాడుట. ఈయన వదిలేసినట్టుగా కనిపిస్తాడే తప్పా, ఈయన లేకపోతే ఆవిడ లేదుగా! కథ లేదు. కథ లేదు అనేందుకు మాస్టరుగారు మంచి కథ చెప్పేవారు. ఒక తమలపాకు, ఒక వక్క రోజు రెండిటిని కలిపి నమిలేస్తారు కదా ఇంత సున్నం రాసి, కిళ్ళి. ఒక రోజు వాటికి ఎవరూ తినడానికి లేరట. ఇవాళ కాస్త విశ్రాంతి దొరికింది, అని మాట్లాడుకుంటున్నాయట గాలి వస్తే ఏమి చేయాలి, వాన వస్తే ఏమి చేయాలని. అప్పుడు వక్క అందిట, 'గాలి వస్తే నువ్వు ఎగిరిపోతావు. మేము ఎగరము. అందుకని ఒక పని చేద్దాము. గాలి వస్తే నేను నీ మీద కూర్చుంటాను. ఎగరకుండా. 'మరి వాన వస్తేనో? అని అన్నది ఆకు. వాన వస్తే ఈ వక్క నానిపోయి చితికిపోతుంది కదా? మన నోట్లో జరిగేది అదే కదా. వక్కకి తెలుసు. నీరు అంటే వక్కకి చెడ్డ చిరాకు. ఊరికే నానితే నమిలేస్తారు పని అయిపోతుంది. అందుకని, ఓ పని చెయ్యి, వాన వస్తే నాకు గొడుగు లాగ నామీద పడుకో. నేను నీ కింద ఉంటాను. వాన నిన్ను ఏమి చేయదు కదా,' అన్నది. బాగుంది ఒప్పందం. ఈలోపు చెట్టు మీద కూర్చున్న ఒక పిట్ట అందిట, 'మరి గాలి, వాన కలిసి వస్తే ఏమి అవుతుంది', అని. గాలి, వాన వస్తే కథే లేదు అన్నాయిట రెండూనూ. అట్లా ఆయన లేకపోతె కథే లేదు. అట్లా కథే లేని situation భగవంతుడు అక్కడ లేనపుడు ఏర్పడుతుంది. ఆ తత్త్వం చేస్తున్నట్టు కనిపించదు. కానీ అంతా ఆవిడ చేస్తున్నట్లు కనబడుతోంది. అన్నీ చేస్తున్న వాడు 'ఆయనే'! కానీ చేస్తున్నట్టుగా కనిపించడు. అదే భగవద్గీత లో 'చేస్తున్న వాటిలో చేయని వాడిగా నన్ను చూడు. చేయని వాటిలో చేస్తున్న వాడిగా చూడు' అని చెప్తాడు. రెండు

రకాలుగా కనిపిస్తాడు. యుద్ధం చేయనట్టుగా ఉన్నాడు, చేశాడు. చాల గొప్ప విషయం అట్లా ఉండడం. మహాత్ములు ఏమి చేయనట్లుగా కనిపిస్తారు, పరిసరాలు అన్నీ స్వస్థత చేకూరుస్తూ ఉంటారు. ప్రశాంతత పొందుతూ ఉంటారు. ఇక్కడ ఉంటారు, చుట్టూ ప్రాంతం అంతా కూడా బాగు చేస్తూ ఉంటారు. చేయించుకున్న వాడికి కూడా తెలియనంత బాగా చేస్తారు. అంత సూక్ష్మం! అందుకని గుణాలలో భగవంతుడు దిగడం అనేది చాల సహజం అయినప్పటికీ స్వస్థితి మరువడు. అందుకనే స్వాస్థ్యో .

# 871 మహాన్

మహాన్ అంటే The Greatest. The Biggest. The Highest. అన్నీ superlative లో చెప్పాలి. ఇహ ఇంతకన్నా ఎవరూ లేరు అని చెప్పడానికి 'మహాన్'. మహత్ కూడా అయన లోంచే అవతరించింది. 'త' అంటే అవతరించింది. గుణాల్లోకి దిగుతాడు. గుణాలకి అతీతంగా ఉంటాడు. సమస్తాన్ని నిర్మాణము చేస్తాడు. దాంట్లో తాను ఉన్నప్పటికీ తాను వేటికి అంటుకోడు కాబట్టి మహాత్ముడు. మహాత్ములు అన్నా కూడా అదే అర్ధం. తన చుట్టూ ఏర్పడిన శరీరం లో కూడా తాను బంధీకృతుడు కాడు. అతడూ మహాత్ముడు. అందులో బంధీకృతుడు కాడు. ఎప్పడూ కావాలంటే అప్పడు శరీరం లోంచి బయటకి వెళ్ళిపోగలడు, కావాలంటే తిరిగి శరీరం లోకి రాగలడు. అతడే మహాత్ముడు అంటే! అట్లా ఒంట్లోనే కుళ్లిపోయేవాడు కాదు మహాత్ముడు. ఒంట్లోంచి బయటకి వెళ్ళ గలడు, లోపలకి రాగలడు. ఎందుకనీ ? ఒళ్ళు బంధించదు. తన నుండి సమస్తమైన కార్యములు వ్యక్తము అవుతుంటే (ప్రతి మహాత్ముడు దగ్గర నుండి చాల పెద్ద పెద్ద ప్రణాళికలు బయటకి వస్తాయి జీవుల శ్రేయస్సు గురించి) అవుతుంటే తన నుండి బయటకి వచ్చిన సృష్టిలో తాను ఇరుక్కు పోడు. అదీ మహాత్ముడు! ఆయన ఇంత సృష్టి చేసి అందులో ఇరుక్కోకుండా ఉన్నాడు. మనం ఎరిగిన మహాత్ములు తమ చుట్టూ, తమ ద్వారా ఏర్పడిన దానిలో భగవంతుడి యొక్క విభూతి చూడడమే తప్ప, తమదని అనుకోపోవడం చేత అందులో ఇమడక, ఇరుక్కోక ఎప్పడూ ముక్త జీవులుగానే ఉంటారు. మనం డబ్బు సంపాదిస్తాము, డబ్బుకి అమ్ముడుపోతాం. ఇల్లు కట్టుకుంటాం, ఇల్లు వదలలేము. మన లోంచి వచ్చిందేగా మన ఇల్లు ? మనలో నుండి వచ్చిందేగా మన సంసారం ? అట్లా బంధిస్తూనే ఉంటుంది. ఎక్కడికైనా వెళదాము అంటే అంత సులభమా ? అప్పడప్పడు మనకి ఒక aberration వస్తూ ఉంటుంది. ఒక రకమైన ఆవేశము వచ్చి ఇవన్నీ ఎందుకు హాయిగా కాశీ పోతే బాగుంటుంది అనిపిస్తుంది. పోగలరా ? కాశీకి పోదాము, అక్కడ విశ్వేశ్వరుడి సేవలు చేసుకుందాము అని అనుకుంటున్నాను అంటే, వాళ్ళకి ఇష్టము ఉండదు. 'పోనీ వెళ్ళండి,' అంటుంది. వీడు వెళ్ళడని, ఊరికే అంటూ ఉంటాడని తెలుసు, అందుకు వెళ్ళమని అంటుంది. ఏదీ వదలలేము.

సంపాదించింది వదలలేము. మన లోంచి వచ్చిన వాటిలో మనం బంధింపబడి ఉన్నామే తప్ప, వాటిని మించి వాటి యందు బంధింపబడక లేము కదా. ఆయన అలా కాదు. ఎంత చేశాడండీ? ఇంత చేసీ ఇందులో ఎప్పటికప్పుడు వెళ్ళిపోవడానికి వీలుగానే ఉన్నాడు. ఏ రోజు వెళ్లిపోదాము అనుకుంటే ఆరోజు దుకాణం కట్టేస్తాడు. ఎక్కడా మమకారాలు, బంధాలు లేవు. అంతా ఏర్పరచి, వినోదం అనుభవిస్తూ క్షణంలో మాయమవ్వగలడు. మమకారం ఉంటె యాదవులు అందరినీ picnic తీసుకు వెళ్తాడండీ సముద్రము ఒడ్డుకి? Picnic అంటే అందరూ పాపం ఎంత బాగా తయారవుతారూ? అందులో ఒకడికి picnic కి వెళ్లే వాళ్ళందరూ అక్కడ చచ్చిపోతారు అని తెలుసు. బాగా వండుకుని, మంచివన్ని అంటే ఆవకాయ్, గోంగూర పచ్చడి, సాంబారు అవన్ని వండుకుని, మీకు ఏవేవి తినాలి అని అనిపిస్తుందో అవన్నీ వండి, మూట కట్టుకుని, మీ వాళ్ళందరిని పట్టుకు వచ్చేయండని చెప్పాడు. వాళ్లంతా picnic అనుభవం చెందుతూ ఆనందం పొందుతుంటే చూశాడు. అక్కడే అంతా మటాష్ (తెలుగులో కొత్త పదం) అయిపోతారు అని తెలిసి, ఇంత మందినీ అక్కడికి తీసుకు వెళ్లి, వాళ్లంతా అక్కడ అలా అయిపోతున్నా చూస్తున్నాడంటే ఎటువంటి వాడై ఉండాలి? ఎక్కడికీ పోరు అని తెలిసి అలా ఉన్నాడు. తన లోంచి వచ్చిన వాళ్ళే కదా, తన లోకి తిరిగి వస్తారు. అదే గాంధారికి కోపం. అందు వల్లనే జరిగిందని కదా, ఆమె నిమిత్త కారణమే తప్పా ఆవిడ వల్ల కాదు. పోలేదు అందులోకి. 'ఎట్టా పొట్టలో పెట్టుకోగలిగావు నా వంద కొడుకులని'? అని అడుగుతుంది గాంధారి. 'ఇంత తెలిసిన జ్ఞానివి కదా, నువ్వు తలచుకుంటే ఏమైనా మార్చవచ్చు కదా!' వాళ్ళందరికీ ఇది ఒక complaint ఆయన మీద. తలచుకుంటే ఎవరినైనా ఇట్టే మార్చ వచ్చు కదా. అలా మారిస్తే అందరూ ఉంటారు కదా. దానికి సమాధానం తెలుసా? మార్చనివ్వరు కదా! వాడు వండుకున్నది వాడు తినకపోతే వాడికి తోచదు. ఎవరిది వాడు వండుకున్నాడు కదా. చివరికి రుచి ఎలా ఉందో చూడక అవదు కదా! అందుకని వద్దురా అని ఎప్పటి నుండో చెప్తూ వచ్చాడు! యుద్ధము జరిగే సమయానికి అర్జునుడికి 90 ఏళ్ళు. మొత్తము బతికినది 126 ఏళ్ళే శ్రీకృష్ణుడు! యుద్ధం తరువాత బతికినది 36 ఏళ్ళు. బతకడము అంటే శరీరం లో ఉన్నది అని అర్ధం, కృష్ణుడు చావడం లేదు కాబట్టి. కృష్ణుడు పుట్టిన సంవత్సరంలోనే

అర్జునుడు పుట్టాడు. కృష్ణుడు శ్రావణ మాసంలో పుడితే, అదే సంవత్సరంలో అర్జునుడు ధనుర్మాసంలో పుట్టాడు. వాళ్ళిద్దరిది ఒకే వయస్సు కాబట్టి, పాండవులతో వాళ్ళకి కొంచం దోస్తీ/స్నేహం అని అర్జునుడు అనుకున్నాడు. శ్రీకృష్ణుడు అనుకోనిచ్చాడు. అందుకని ఒకరికొకరు ఎంతోమైత్రి కలిగిన వారు, ఎంతో స్నేహ సంబంధం ఉన్న వారని అనుకునేలా చేశాడు. ఎవరు ఏమి అనుకుంటే అది అనుకోనిస్తాడు కృష్ణుడు. అంటే 90 ఏళ్ళప్పుడు యుద్ధము చేశాడు అర్జునుడు, అంతకు ముందు 5 ఏళ్ళప్పుడే తీసుకు వచ్చారు పాండవులని హస్తినకు. అంటే 90 లో 5 తీసేస్తే, 85 ఏళ్ళు, దాదాపు ఒక సహస్ర పూర్ణిమలు అయిపోయాయి. 1000 పూర్ణిమలు అయితే 86 ఏళ్ళు. అందుకనే 86 సంలు ఉంటె, పూర్ణ జీవితము అంటారు. 1000 పౌర్ణిమలు చూశాడు. ఎప్పటికప్పుడు ఋషులు వచ్చి చెప్పారు, బంధువులు, శ్రేయోభిలాషులు, అంతే కాదు రాజసభలో ఉండే భీష్ముడు, ద్రోణుడు, విదురుడు ఎందరు చెప్పినా వినలేదు కదా. అంతే కాదు, నువ్వు వచ్చి చెప్తే వింటారేమో అని అంటావేమో అని తను కూడా, వచ్చి చెప్తాడు. అంతే కాదు మధ్యలో మైత్రేయుడూ వచ్చి చెప్తాడు. 'చేసింది చాలు ఇంకా చేయకుండా ఉంటే బావుంటుంది', అని ధృతరాష్ట్రుడుకి, గాంధారి కి ప్రత్యేకంగా చెప్తాడు. ఎందుకంటే ధృతరాష్ట్రుడికి మేనమామ. అంటే పాండురాజుకీ మేనమామే! అంబ, అంబికా, అంబాలిక లకు సోదరుడు మైత్రేయుడు. విదురుడు, ధృతరాష్ట్రుడు, గాంధారి అందరూ సభలో ఉండగానే 'చేసిన అత్యాచారాలు చాలు, ఇంతకు మించి మరి ఒక్కటి జరిగినా అయిపోయింది' అంటాడు, అదీ ద్రౌపదిని అవమానము చేసిన తరువాత చెప్తాడు. అలవాటు పడ్డవారు ఆగుతారా? ఆగలేనివారి గురించి అదే దేహములో ఉండాలి అని కోరుకోవడం మమకారమే తప్ప, జ్ఞానము కాదు కదా. గాంధారి శివ భక్తురాలు. శివుడు దర్శనము ఇస్తూ ఉంటాడు. కానీ తల్లిగా మమకారం! అది కారణము చేత 'పొట్టని పెట్టుకున్నావు కదా నా కొడుకులని' అంటుంది. అదేమిటీ కావాలంటే నిన్ను కూడా పెట్టుకుంటాడు. ఆమెను కూడా పెట్టుకుంటాడు పొట్టలో. అందరూ ఆయన పొట్ట లోకి వెళ్లేవారే! ఆయన పొట్టలోంచి వచ్చిన వారు తిరిగి అక్కడకే వెళ్ళిపోతారు కాలం రూపంలో. వీళ్ళని ఈ విధంగా తీయడం జరగకపోతే, 'సృష్టిలో మనం ఎట్లా అయినా చేసుకోవచ్చు, ఎలా బతికినా పర్వాలేదు, ఎంత మందిని హింసించినా

పర్వాలేదు, దేవుడు వచ్చి చూసుకుంటాడు, మనల్ని కాపాడుతూ ఉంటాడు, మన అమ్మ నాన్నా తపస్సు చేస్తూ ఉంటె' అనుకోవడం correct కాదుకదా! పోనీ మారారా అంటే మారే లేదు. అదే విషయంతో ఒకసారి నాతో సంభాషిస్తూ సాయి ఇలా అన్నారు, 'సాయి ఈ సమస్తాన్ని క్షణములో మార్చగలడు బంగారూ, కానీ మార్చనివ్వరు కదా! ఎవ్వరూ మారరు బంగారూ, వాడు వాడిగానే ఉంటాడు. వస్తాడు, వింటాడు, మళ్ళా వాడి పనులు వాడికి నచ్చినట్టే చేస్తాడు, మారుదాము అనే భావన పుట్టపర్తి దాటంగానే వదిలేస్తాడు' అట్లాగే మనం కూడా మాస్టరుగారూ మాస్టరుగారూ అని మేక వలె అరుస్తాం, పనులు వచ్చేసరికి అన్ని అవకతవకలే! ఏదో ఒకడు 10 రూ మర్చిపోతే పోనీలే మనకి మిగిలాయిలే అని అనుకునే వాళ్ళం. ఆపద్ధర్మముగా ఎవడినైనా ఒక 10రూ/- అడిగి సోడా త్రాగాము అనుకోండి, ఆ తర్వాత మర్యాదకి వాడు అడగలేదు అనుకో, నువ్వు ఇవ్వలేదు అనుకో, బాగుందా? ఇలా ఉంటాయి మన దోచుకోవడాలు, ఒకరిని ఒకరు మోసం చేసుకోవడాలు. అపహాస్యం చేసుకోవడం, ఏవో ఒకటి చేస్తుంటాం. కానీ మారరు. మారుదాము అన్న సంకల్పము ఎవడికి చాల తీవ్రంగా వస్తే వాడు అదృష్టవంతుడు. అది 'ఆత్మ ప్రబోధముగా ' రావాలి. అందుకే ప్రహ్లాదుడు 'అడవులకు వెళ్తే మాత్రం వస్తుందా' అని అంటాడు. 'ఏమిచ్చిననైన, కానలలోకి యేగిననైన రాదు హరి ప్రబోధం'. రమ్మంటే రావు నాన్నా, వస్తే పోవు అని చెప్పాడు.

ఎంత సంసారం అండీ. భగవంతుడు అట్లా సృష్టి లోకి దిగి వస్తే ఎలా ఉంటుంది? ఊరికే అలా పైన కూర్చుని కబుర్లు చెప్పడం కాదు తానూ దిగి వచ్చి, రండి చూద్దాం అన్నాడు. కానీ ఎవడు పడ్డాడండి ఆ కాలంలో? భీష్ముడు, విదురుడు, ధృతరాష్ట్రుడు, పాండురాజు, పాండవులు ఎవ్వరూ పడలేదు. చిన్న తనము నుండి ఎన్నెన్ని కోణాలలో, ఎంతెంత ధర్మ సంస్థాపము చేశాడో, ఎప్పుడు ఏ పక్క నుండైనా, ఎవరి ద్వారానైనా సరే తన ప్రాణానికి హాని కలగవచ్చు అనే పరిస్థితులలో జీవించాడు. అయినప్పటికీ నవ్వుతూనే ఉన్నాడట. అదీ శ్రీకృష్ణుడి గొప్పతనం. Minute to minute murder attempt ఉందండి ఆయన మీద. ఎప్పుడు Z-list లోనే. అంటే Top Priority! ఎప్పుడు అవకాశము ఉంటె అప్పుడు కొట్టేస్తారన్నమాట. వారి చుట్టూ ఎంత మంది sten-gun పట్టుకుని bodyguards ఉన్నారూ?

ఏ bodyguards లేరు ఆయన చుట్టూ చిన్నప్పటి నుండి. అంతే కాదు, ఊరికే పైపైన కబుర్లు చెప్ప లేదు. పాకం లోకి దిగి, పాకం అంటకుండ ఉన్నాడు. తన తరువాత తనంతటి వాడు బలరాముడు. తన అంశావతారమే కదా! తాను పరతత్త్వం అయితే ఆయన కాలం! దిగి వచ్చేసరికి పోయింది అంతాను. పక్షపాతం వచ్చింది. కౌరవులు పొగుడుతూ మర్యాదలు చేస్తూ ఉంటారు, సంపద గల వారు కాబట్టి వాళ్ళని మన్నిస్తాడు. పాండవులు ధర్మాత్ములుగ ఉంటె ఉండనీ అన్నట్టుగా ఉంటాడు. చివరికి శ్రీకృష్ణుడు 'ఏరా అన్నయ్యా నువ్వు ఏమి చేస్తావ్, నీ సంగతి ఏమిటని', అని అడిగితే 'నా దారిని నేను పుణ్యక్షేత్రాలకు పోతాను', అని చెప్పాడు. అధర్మం జరుగుతూ ఉంటె, ధర్మం పక్క నిలబడి యుద్ధం చేయగలిగినవాడు కృష్ణుడు. యుద్ధం చేసిన జగత్ గురువు! ఏ గురువు యుద్ధం చేశాడండీ? ఏ గురువు యుద్ధం చేయ లేదు, బోధ చేశారు. కానీ కృష్ణుడు యుద్ధం కూడా చేశాడు. ఆయన చేయనిది లేదు. కాని దేనితోనూ ఇరుక్కోలేదు. కానీ ఎటు నుండి చూసినా ఒక మానవ జీవితములో ఇంత ఇరుక్కున్నట్టుగా ఉన్నవాడు ఎవడూ కనబడడు. ఎంత మంది భార్యలూ? మొత్తం 16000 మంది. ముఖ్యముగా 8 మంది, ప్రతి ఒక్కరికి నేను అంటేనే ఆయనకు ఇష్టం అన్నట్టుగా ప్రవర్తించాడు. అంతే కాదు 16000 మందితో కూడా అట్లాగే ఉన్నాడట. ఎంత గొప్ప విషయమండీ! అందరికి తన సాన్నిధ్యాన్ని, అనుభూతిని, స్పర్శని ఇచ్చినా ఇరుక్కోలేదుట. ఇంత మహత్మ్యము ఎక్కడా కనిపించదు. ఎక్కడా నోరు విప్పినట్లుండడు కానీ పట్టుకుంటే జారిపోతాడు. కావాలంటే ఆయన పట్టిన పట్టు కూడా ఎప్పుడు వదిలేస్తాడో తెలియదు. అంత అద్భుతమైన సన్నివేశాలు చూపించాడు. అందుకనే భీష్ముడు 'మహాన్ అంటే నువ్వే' అన్నాడు.

## 872 అధృతః

ఎవ్వరూ ఆయనని మోయలేరు. ఆయనే స్వంతముగ సంకల్పించి సమస్తమునూ మోస్తున్నాడు. మన శరీరాన్ని ఆయన మోస్తూ ఉంటె మనం మోస్తున్నాము అనుకుంటున్నాము. ఇది చాలా అన్యాయం కదూ? ఆయన మోయడం మానేస్తే మన చెయ్యి లేవదు మోయడానికి. ఇది వరకు కూరల సంచి మోయగలిగి, ఇప్పుడు పట్టుకోలేకపోయాము. మనమే మోసే వాళ్ళం అయితే మరి అప్పుడూ, ఇప్పుడూ కూడా మోయగలగాలి కదా! చలాకీగా లేచిన రోజులు ఉన్నాయి, అస్సలు లేవలేని రోజులు ఉన్నాయి. అంటే లేచే వాడివి నువ్వా, వాడా? ఈ శరీరాన్ని ధరించినది నువ్వా, వాడా? నువ్వు ధరించిన వాడివి అయితే శాశ్వతంగా ధరించిన వాడివి నువ్వే అవవచ్చు కదా! మరి ఎవరు ధరించాడు దీన్ని? వాడు! చీమ శరీరం నుండి బ్రహ్మ శరీరం వరకు, సమస్తమైన శరీరాలన్నిటిని, గోళాలని, మండలాలని అతను ధరించి ఉన్నాడట. ధరించడం అంటే కూలీలా నెత్తిని పెట్టుకుని మోయడం అని మన భావన. అది కాదు ధరించడం. దాని లోపల ఉండి, దానికి బలం కలిగించి ఉంచుతాడు. తన యందు అవి ఉంటాయి, వాటి యందు తాను ఉంటాడు. మనం నిలబెట్టేవి అట్లా ఉండవు. మనం వాటి యందు ఎక్కడున్నాం? మన నుండి వచ్చిన వాటి యందు మనం ఉన్నామా? కేవలం భావపరంగా ఉన్నాం. అయన కదిలితే ఈ మొత్తం కదులుతూ ఉంటుంది. మనం కదిలితే మన నుండి వచ్చినవి కదులుతాయా? అందుకని మాస్టరుగారు ఒక ఉదాహరణ చెప్పేవారు. 'పొలం మనది అయినా, గాడిదల్లె మనమే వెళ్ళాలి కదా పొలం కి. ఎక్కడో ఊరు చివర ఒక పొలం కొనుక్కున్నామనుకో మోజు పడి. Farm-House కట్టుకున్నామనుకో. అది నీదే అయినా అది నీ వద్దకి రాదు కదా, నువ్వే అక్కడికి వెళ్తూ ఉండాలి గాడిదల్లే. నీదే అయినప్పటికీ నీ దగ్గరకు అది రానప్పుడు నువ్వు దానికి యజమాని ఏమిటి, నువ్వు దానికి సేవకుడివి', అనే వారు మాస్టరుగారు. నీదైతే నువ్వు ఇలా రా, అంటే రావాలి. పో అంటే పోవాలి. 'వాడు' అట్లా ఉంటాడట. ఏదైనా అందులో కూడా ఉంటాడు కాబట్టి నడిపిస్తే నడుస్తుంది, పిలిస్తే వస్తుంది. ఆయనే పడుకో పెడుతున్నాడు. ఆయనే లేపుతున్నాడు. అన్ని ఆయనే జరుపుతుంటే మనం ఏదో చేస్తున్నామనే పై మెరమెర మనకి

ఉంటుంది. అన్నిటిని ఆయన ధరించి ఉన్నాడు, ఆయనని ఎవరు ధరిస్తారండి ? భగవంతుడిని పొందుదామనే భావన పూర్ణమైన అజ్ఞానము! భగవంతుడ్ని ఎవ్వరూ పొందలేరు. భగవంతునిచే పొందబడాలి. భగవంతుడ్ని ధరించలేరు ఎవరూ. భగవంతునిచే ధరింపబడాలి. అప్పుడు మనకి కీర్తి, ప్రతిష్ఠ, వైభవం, శాశ్వతత్త్వం . అందుకని ఎప్పుడూ ధరింపబడిన వారమే తప్ప, సృష్టిలో సమస్తమును అమ్మవారితో సహా ధరించేవాడు అయన ఒక్కడే, కాబట్టి అధృతః.

## 873 స్వధృతః

కోరి ఇవన్నీ అయన ధరిస్తున్నాడు. మనం చొక్కా విప్పి కొక్కానికి తగిలించినట్టు, ఆయన సృష్టి అంతా మడిచి లోపల పెట్టేసుకుంటాడు. కాబట్టి మనని ధరిస్తున్న వాడు ఆయనే! మనని భరిస్తున్నవాడు ఆయనే. మనం ఆయన ఒళ్ళో కూర్చుంటే చాలు. అసలు కూర్చుంటే ఆయన ఒళ్ళో కూర్చోవాలి. 'నన్ను నువ్వు ధరించు. నీచే పొందబడినవాడిగా నేను ఉండేటట్టు చూడు. నీ వారై తను వారిలో ఒకడనై,' అంటుంది భాగవతం. నీ వాడిగా నేను ఉండాలి తప్ప, నా వాడిగా నువ్వు ఉండాలనుకుంటే సత్యభామ అయిపోతాము. అదంతా సత్యభామ theory! సత్యభామ by-the-by ఆంధ్రా అమ్మాయి అంటారు. ఆంధ్ర! మొన్న రాజుగారు చెప్పారు, 'చాణూరాంధ్ర నిషూదనః' చాణూరుడు ఆంధ్రుడే! అయితే ఏమిటి, శ్రీకృష్ణుడు చేతిలో చచ్చిపోయాడు కదా మనం ఎంత గొప్ప వారం' అన్నారు. అట్లా సత్యభామ తన వాడిగా చేసుకుందామనుకుంది. రుక్మిణి 'అతని' దానిగా తాను ఉండాలనుకుంది. మనకి పొందడం అనే భావం బాగా ఎక్కువగా ఉంటూ ఉంటుంది. డబ్బు, కీర్తి, ఆస్తి, పిల్లలు అన్నీ పొందాలని ఉంటుంది. మనని 'వాడు' పొందాలి తప్ప, మనం వాడిని పొందలేము. అది ఒక జ్ఞానం! అందుకని ప్రార్ధన చేసేప్పుడు 'నన్ను నీలో ఉండని, నన్ను నీ వాడిగా చేసుకో' అని కోరతాడు భక్తుడు. 'నీ వారై తను వారిలో ఒకడనై' అని. నీ వాడిగా నన్ను బతకని ఈ లోకములో. అందరూ ఆయన వాళ్ళే అయినప్పటికి కూడా, అందరికీ స్వాతంత్ర్యం ఇవ్వడం చేత ఎవడికి వాడుగ అహంకరించి ఉంటాడు. అలా ఉన్న వారికి సృష్టిలో చిక్కులు వస్తూ ఉంటాయి. చిక్కు పడని జీవితం ఉండాలంటే ఆయన వాడిగా జీవించాలి. ఆయన వాడిగా జీవిస్తే బుద్ధి ప్రచోదనం ఉంటుంది. అది కారణం చేత చిక్కులు లేని జీవితం జీవించడానికి అవకాశం ఏర్పడుతుంది. ధరించే వాడు 'ఆయనే'! ఆయనని మనం ధరించాలని అనుకోవద్దు. మనని కూడా ఆయనే ధరించి ఉన్నాడు.ఎంతో కరుణతో, ప్రేమతో మనని ఇన్నాళ్ళూ మోస్తూ వచ్చాడు. మోస్తున్నాను అనే భావన మనకి ఇచ్చేశాడు. ఆయనకి ఆ భావన కూడా లేదు. శరీరం అంతకంతకు బరువెక్కి, కుయ్యోమొర్రో అనే స్థితిలో, 'బాగానే మోస్తున్నావు కదా, నా శరీరాన్ని తేలిక పరచు', అని ఆయనతో చెప్పకోవచ్చు. నీకు ఉన్న

బరువులు ఆయన పాదాల దగ్గర పెట్టుకో వచ్చు. 'నీకు నాకు మధ్య ఇవొకటి ఉన్నాయి. నువ్వే పరిష్కరించు, నేను నీతో చేరిపోని, ఇంక మరి పెంచుకోను', అనే మాట చెప్పాలి. ఎందుకంటే, చేసి పెడుతూ ఉంటె, మళ్ళీ మురికి పట్టించుకుంటుంటే రోజు ఎవరు ఉతుకుతారు? ఆ విధంగా మనం భావన చేసుకోవచ్చు. ఆయనని ఎవరూ ధరించలేరు. ఎవరూ భరించలేరు. ఆయనే సమస్తాన్ని ధరించాడు. ఆయనే సమస్తాన్ని భరించాడు. కథ చెప్పకోవాలంటే తులాభారం కథ! సత్యభామకు రుక్మిణికి ఉన్నటువంటి తేడా. సీతాదేవి ఎప్పుడూ రాముడ్ని పొందాలనుకోలేదు. రాముడుచేత పొందబడాలని తాపత్రయపడ్డది. హనుమంతుడు కూడా రాముడి వాడుగ జీవించాలనుకున్నాడు తప్ప, తన వాడుగ రాముడు ఉండాలని అనుకోలేదు. తన వాడుగ ఉండాలని అనుకోవడం అనేది చాల ప్రాథమికమైన దశ. అది కూడ ఏదో రుచి ఉన్నటువంటి విషయమే. 'వాడి' వాడుగ మనం ఉండాలి తప్ప, వాడు మనవాడుగ కాదు. మన మాస్టరుగారు, మన మాస్టరుగారు అని ఊరికే మేకల వలె అంటుంటాము కదా! మాస్టరుగారు అనాలి 'నా వాడు వీడు', అని. అదీ లెక్క. అటు నుంచి ఇటండీ సిద్ధాంతం. మనం ఇటు నుండి అటు చెప్పకుంటూ ఉంటాము. అదీ ఇక్కడ భావన!

## 874 స్వాస్థ్యః

స్వస్థత చేకూర్చేవాడు, స్వస్థత యందె తాను ఎప్పడూ ఉండేవాడు. స్వ, అస్థి అంటే తనకు తానుగా ఉండడం, ఏ మార్పులకు గురి కాకుండా ఉండడం. అందుకని మనం సభ అయినా తరువాత 'స్వస్తి' అంటాము. అంటే, మీరు మీరుగా ఉండండి అని చెప్పడం. ఇంతసేపూ వినే వారుగా ఉన్నారు. నేను చెప్పే వాడిగా ఉన్నాను, మళ్ళీ మనం మనముగా ఉండాలి. అంటే ఆత్మ స్వరూపులుగా ఉండాలి. మారుతూ ఉంటాము. Being and Becoming అనే రెండు అంశాలున్నాయి. 'ఉండుట', సన్నివేశాలు ప్రకారము మారుట. ఆ మారిన తరువాత మళ్ళీ స్వస్థితికి రావడం. స్వస్థానానికి రావాలి. ప్రతివాడికీ వాడి స్వస్థానము వాడి హృదయము నందు గోచరిస్తుంది. వాడు జీవుడిగ దేవుని యొక్క ప్రతీక, sample, ముక్క, అంశ అని గుర్తు ఉండాలి. అది గుర్తుండి పిల్లవాడు కనబడితే కాస్సేపు అనుభూతి చెంది, మళ్ళీ వచ్చి కూర్చోవాలి. భార్య కనబడితే భర్తగా, స్త్రీ అయితే భార్యగా. మనకి అట్లా బోలెడు మంది కనబడుతున్నపుడు, వాళ్ళతో మనం ప్రవర్తిస్తున్నప్పుడు అప్పుడు కేవలం మనం నటన మాత్రమే చేస్తున్నాము తప్పా, మనం అది కాదు అని తెలిసి ఉండాలి. అందుకనే మనకి నాటకాలు ఇచ్చారు. ఆయన అట్లా నర్తిస్తున్నాడు ఇన్ని రూపాలలోను.

నర్తకునిభంగి బెక్కగు, మూర్తుల నెవ్వడాడు మునులు దివిజులుం
గీర్తింప నేర రెవ్వని, వర్తన మొరు లెఱుఁగ రట్టివాని నుతింతున్

అట్లా నర్తిస్తూ ఉన్నాడు కదా, నువ్వు కూడా నా లాగే నర్తించు. నువ్వు ఎవరో నువ్వు యెరిగి నర్తించు. అందుకూ నాటకం! నాటకంలో వేషం వేసిన వాడికి తాను ఎవరో తెలిసి, ఆ నాటకంలో ఆ పాత్ర పోషిస్తాడు రక్తి కట్టేటట్టుగా. ఎదుటి వాడికి వీడు రావణాసురుడు అనిపిస్తాడు కానీ వాడికి తెలిసి ఉండాలి వాడు రావణాసురుడు కాదని. అలా కాకపోతే బయటకి వచ్చిన తరువాత అటువంటి కృత్యములు చేయడము ఉంటుంది. నేను ఎవరో నాకు తెలిసి ఉండి, నేను చేసే కార్యక్రమాలలో ఒక పాత్ర పోషణగా, ఒక నటుడిగా, నర్తకుడిగా ప్రవర్తించి మళ్ళీఅది అయిపోతూ ఉండాలి. అంటే, జీవునిగా దేవుని సుతునిగా గుర్తు వచ్చి అది అయిపోతూ ఉండాలి. అదీ స్వస్థానం లోకి రావడము అంటే. ఇచ్చేవాడు ఆయన. అందులోనే ఎప్పడూ

ఉంటాడు. మనకి దొరికేది కూడా అక్కడే. ఇంకెక్కడా దొరకడు. స్వస్థానంలో దొరుకుతాడు. అందుకని స్వాస్థ్యః.  స్వస్థి ఇచ్చేవాడు. స్వస్థత ఇచ్చేవాడు. స్వస్థత అంటే, ఏదో జ్వరం వచ్చి తగ్గితే, స్వస్థత చేకూరిందా అంటాం. అది కాదు. అది చిల్లర స్వస్థత. అసలు స్వస్థత తాను ఎవరో తనకు తెలిసి, తన ఇల్లు ఏదో తెలిసి, ఈ దేహం లో ఆ ఇంట్లో ఉండీ, కాలం రూపంలో తన దగ్గరకి వచ్చే సన్నివేశానికి ప్రతిస్పందిస్తూ, నర్తకుడి వలె ఆ కార్యం నిర్వర్తిస్తూ, మళ్ళీ వచ్చి అక్కడ కూర్చోవాలి. కనీసం సాయంత్రం నిద్రలోకి వెళ్ళేటప్పుడైనా ఆ ప్రయత్నంచేయాలి. ఈ పూటకి అయిపోయిందిగా. మళ్ళీ రేపు కదా కథ. పడుకున్న తరువాత ఇహ రేపటి వరకు కథ లేదు. కథ లేనప్పుడు అక్కడా ఇక్కడా పడుకోవడము ఎందుకు? ఇంటికి వచ్చి మన పడక గదిలో మన మంచం మీద మనం పడుకోవచ్చు కదా. అలాగే మన ఒంట్లో ఉన్న హృదయమును నువ్వు చేరాలి. అక్కడ నుండి ఆజ్ఞ లోకి చేరగలిగితే మరీ ఉత్తమం. ఆజ్ఞ లోకి చేరి నిద్రపో, అపుడు నీకు దివ్య లోకాల యొక్క స్మృతి కలుగుతుందని చెప్తాడు Djwal-Khul మహర్షి. అక్కడ నుండి ఇంకొక నిద్రపోయే స్థలం ఉంది, అది నారాయణ లోకం. అక్కడికి చేరవచ్చుట. ఏదైనప్పటికీ మనం హృదయస్థులమై, జీవుడిగా దేవుని యొక్క వ్యక్త రూపములుగా భావన చేసుకుంటూ, ఈ identity తప్ప మరో identity లేని స్థితిలో నిద్రలోకి వెళ్ళడమనేది చేస్తే, క్రమశః అది మనకి రోజు చేసే పనులలో కూడా గుర్తుకు వస్తుంది. పనికి పనికి మధ్య మళ్ళీ స్వస్థితికి రావాలి. అలా వస్తూ ఉంటె మనము ఎప్పటికి అప్పుడు 'అమ్మ'ని ముట్టుకు వచ్చినట్టన్నమాట. చూడండి, ఆటలో అమ్మను ముట్టుకుంటే ఇహ దొంగ ముట్టుకోడు కదా! దొంగ ముట్టుకున్నా మనం out కాదు కదా. అంటే మనల్ని ఏమీ ముట్టదు. కాబట్టి అమ్మని ముట్టుకుని ఉన్నామనుకోండి, మనని ఇంకేటీ అంటే 'మాయ' ముట్టదు. పనికి పనికి మధ్యలో గుర్తు చేసుకుంటూ ఉంటె బాగా అలవాటు అయ్యా, పనిలో కూడా గుర్తు ఉండే స్థితి వస్తుంది. అది చాల ఉత్తమము  అయిన స్థితి. అదీ సిద్ధ పురుషులకు ఉండేది. మన బోటి వారికి కనీసం పని చేసేప్పుడు పని, పని అయిన తరువాత స్వస్థత. ఇలా వస్తుండాలి. శ్రీకృష్ణుడు ఎప్పుడూ స్వాస్థ్యుడే! స్వస్థత యందు తాను ఉండి  సమస్తమూ నిర్వర్తించాడు. భీకరమైన కార్యాలని, గంభీరమైన కార్యాలనీ, క్రీడలనీ అన్నీ కూడా అలాగే నిర్వర్తించాడు. వాళ్ళందరితో క్రీడించినప్పుడు కూడా

ఆత్మారాముడై క్రీడించాడు, వాళ్ళ హృదయాలలో ఉండి. ఎక్కడా దిగలేదు. మనం అంతటి వాళ్ళము ఎలాగూ కాదు. కాబట్టి అది ఆశయముగా పెట్టుకుని, మధ్యలో కాస్త తిరిగి వస్తూ ఇంటికి తినడానికి, పడుకోవడానికి ఎలా వస్తామో, అట్లాగే మన హృదయములో ఉన్న స్వగృహానికి రావడము అనేది నేర్చుకుంటూ ఉండాలి. అతడు ఎప్పుడూ అక్కడే తిరుగుతూ ఉంటాడు. ఎప్పుడూ అక్కడే ఉంటూంటాడు. అక్కడ నుండే అన్నిటిని నిర్వర్తించుతూ ఉంటాడు. అక్కడ ఉండే సమస్తమైన సృష్టికి కూడా స్వస్థత ఇస్తూ ఉన్నాడు. అందరి హృదయములు యందు తాను అధ్యక్షత వహించి ఉండి నిర్వర్తిస్తూ ఉన్నాడు .

## 875 ప్రాగ్వంశః

మనకి వంశాలు ఉన్నాయి. సూర్య వంశం, చంద్ర వంశం, యదు వంశం ఇలా బోలెడన్ని వంశాలు. అసలు వంశం మాట ఎందుకు వచ్చింది ఇక్కడ అని ఆలోచిస్తే, శ్రీకృష్ణుడు యదువంశంలో పుట్టాడు. అది అంత మంచి వంశం కాదు అని అప్పటి రాజుల్లో ఒక భావన. పుడితే సూర్య వంశంలో పుట్టాలి. ఎందుకంటే అది హరిశ్చంద్రుడు లాంటి గొప్పవాళ్ళు పుట్టిన వంశం. భగవంతుడు పుడతాడు, ధర్మ సంస్థాపనం చేస్తాడు అంటే ఒక ప్రభువుల వంశం లోంచి దిగి వస్తాడని చాలా అనుకున్నారు. 1st rank సూర్య వంశం. 2nd rank చంద్ర వంశం. ఈ రెండు కాకుండా యదువంశంలో పుట్టాడు ఆయన! మనం అనుకున్నట్లు ఆయన పుట్టాలేమిటి ? అది భగవంతుడి యొక్క వైచిత్రి! మనం అనుకున్నట్టుగా ఆయన ఉండడు. ఆయన అనుకున్నట్టుగా మనం ఉండగలిగితే, ఆయన అనుకున్నట్లు మనం అనుకోగలిగితే అదృష్టం. యదు వంశంలో పుట్టే సరికి మధ్య మధ్యలో  ఎవరన్నా ఆయనే 'పురాణ పురుషుడు' అంటే 'ఛీ, పో' అన్నారు. చేసే పనులు చూస్తే అవునేమో అనిపిస్తుంది. పుట్టిన వంశం చూస్తే అవకాశము లేదు. 'అక్కడ పుట్టాడు కాబట్టి ఒప్పుకోము' అన్నారు అందరు. జరాసంధుడికి అదే పెద్ద సమస్య. కృష్ణుడిని చూస్తే చాలా చులకన భావం. అక్కడ పుట్టాడు కదా. భాగవతములో మొట్టమొదట చెప్పుకున్నాము, 'శీలం గల కులమున ఎలా పుట్టెను ?' అని. శీలం అంటే 'పాపము ' అని కూడా ఒక అర్థం. యదువంశం founder తండ్రిని ధిక్కరించిన వాడు. కాబట్టి  శాపం ఇచ్చాడు తండ్రి. అందుకని 'శాపం' ఉన్న కులంలో పుట్టాడూ, మహాత్ముడూ, సరాసరి భగవంతుడు అక్కడ పుడతాడా అనే అనుమానం అందరికి కలగాలని అందులో పుట్టాడు. మహాత్ములు వచ్చిన దగ్గర నుండి 'నేను మహాత్ముడనని' చెప్పుకుంటుంటే పనులు జరగవు. పనులు అన్ని చేసి వెళ్ళిపోవాలి. వెళ్ళిపోయాక 'అరెరే ! వచ్చి వెళ్లిపోయాడే' అని తెలిసిన వారికి తెలుస్తుంది, తెలియని వారికి తెలియదు, అనుమానముగా ఉన్న వారు అనుమానంగా ఉండిపోతారు. విదురుడు అట్లా ఉండిపోయాడు చివరి వరకు. పెద్ద పెద్ద వాళ్ళే అట్లా ఉండిపోతారు. వంశం గురించి అందరు అనుకున్నారు, సూర్యవంశం అని, తరువాత చంద్రవంశం అని, యదువంశం అని. కానీ

'ప్రాగ్వంశ: 'వంశాలన్నిటికి ముందు ఉన్నటువంటి వాడివి'! ఎవరి నుండయితే ఇవన్నీ పుట్టుకు వచ్చినాయో వాడే నువ్వు అయినప్పుడు, నువ్వు ఎక్కడ పుట్టావన్న point ఏమిటి? ఎందులోంచి అయినా పుట్టవచ్చు. స్తంభం లోంచి పుట్టగా లేనిది, యదు వంశంలో పుడితే ఏమిటి? మామూలుగా మనబోటి వారికి జడంగా కనిపించే స్తంభం లోంచి పుట్టుకు వచ్చాడు. పందిగా పుట్టాడు, తాబేలుగా పుట్టాడు. ఎన్ని రకాలుగా అయినా, ఎక్కడ నుండి అయినా పుట్టవచ్చు కదా. అన్ని యోనులూ ఆయనవే కదా! అటువంటి వాడిని ఎంత పొరపాటుగ భావన చేశారు ఆ రోజులలో ఉన్నటువంటి వాళ్ళు. సాంప్రదాయంలో ఇరుక్కున్నవారు ఇటువంటి పొరపాట్లు చేస్తూ ఉంటారు. వ్యాసుడు గురించి కూడా ఎదో చేపల వారికి పుట్టాడు అనుకున్నారు చాల మంది. అసలు చేపల వారికి పుట్టింది కానేకాదు. ఆవిడ దొరికింది. మహత్తరం అయినటువంటి వ్యక్తి. సత్యవతి 'సత్యమే' రూపు కట్టుకువచ్చినటువంటి ఆవిడ. మనం గుర్తించకుండ ఏవేవో మాట్లాడుతూ ఉంటాము, సామాన్యులకు ఏమీ అర్థం అవదు. మహాత్ములకి మాత్రమే అర్థమవుతుంది. శ్రీకృష్ణుడు పుట్టుకు వస్తున్నపుడు తెలిసింది కొద్ది మందికే! ఎవరు వాళ్ళు? మనకి తెలిసినటువంటి వారిలో, బహిరంగంలో నందుడికి తెలుసు. వసుదేవుడికి, దేవకికీ మాత్రమేతెలుసు. హిమాలయాలలో పరమగురువులకి తెలుసు. ఇంకెవరికి తెలియదు. ఎక్కడ ఎప్పుడు పుడతాడు అని ఊహలు చేస్తూ వచ్చారు. 300 సంllల నుండి ఊహలు చేస్తూ వచ్చారు. భీష్ముడు పుట్టినప్పడే 'ఈయనే' ఏమో అనుకున్నారు. అవతార పురుషుడు అష్టమ గర్భముగా దిగి వస్తాడు అని ఒక వాక్యం! అందుకని ఎక్కడ ఎప్పుడు ఎనిమిదో వాడిగా ఎవరు పుడితే వెళ్లి చూశారు మొహం లో కళ కనిపిస్తుందేమో అని. 'ఈయన' శుభ్రంగా నల్లగా పుట్టాడు. ఎవరు పుట్టకూడని చోట జైల్లో పుట్టాడు. అందుకని జైలు పవిత్రము అయినది. మనం కూడా ఇప్పుడు ఎవరైనా జైలుకి వెళ్తే, శ్రీకృష్ణ జన్మ స్థానానికి వెళ్ళాడు అంటాము కదా. ఏవీ precedence లేవండీ. పూర్వం ఇదివరకు వచ్చిన మహాత్ములు కానీ, అవతార పురుషులు కానీ ఆ పద్ధతులు ఏవి కనిపించవు మనిషిలో. అంత కొత్త! నాతో అన్ని మళ్ళా మొదలు అన్నట్టుగా చేశాడు అన్నమాట. ఏవిటో నీ గురించి బోలెడు అనుక్కున్నారు అందరు, నా చుట్టూ ఉండే రాజులు అంటాడు భీష్ముడు. భీష్ముడి చుట్టూ ఎంతమంది తీరి ఉంటారు

భూగోళంలో ఉండే రాజులుగానీ, జ్ఞానులుగానీ, ఋషులుగానీ, పండితులుగాని. ఎందుకంటే ఆయన రెండు పక్కల పదును ఉన్నటువంటి వాడు. మహాజ్ఞానీ, మహావీరుడు. అందరూ గుర్తించలేక పోయారు. అసలు వీరి వంశాలు ఏమిటి? మూలం ఏమిటి? నువ్వే కదా వీటన్నిటికీ మూలం. నువ్వు కదా 'మూల పురుషుడు' వి అని చెప్తాడు భీష్ముడు ఈ నామం లో.

## 876 వంశవర్ధనః

జీవకోటి అలా తామరతంపలుగా, చిలవలుపలవలుగా పెరుగుతూనే ఉంది కదా. కోటాను కోటి వంశాలు ఉన్నాయిగా. ప్రతివాడు ఒక వంశ వృక్షం వేసేస్తూ ఉంటాడు తనకు తెలిసినంత వరకు. ఆ తర్వాత ఒక చెట్టు తయారు చేసి, ఇది మాది, అంటూంటాడు కదా. అలా ఎంత పెంచుతున్నాడూ. ఎంత తీసేసినా వస్తున్నది. భారత దేశంలోనే కాదు, మిగతా దేశాలలో కూడా ఉన్నారుగా. ఈ మానవ జాతి వంద కోట్లు. మొత్తము భూప్రపంచం లెఖ్ఖ వేస్తే వేల కోట్లు కదా! ఎప్పటి నుండి ఉన్నారు వీళ్ళు? అట్లా ఉంటూనే ఉన్నారు కదా. ఈభూమి 30 కోట్ల సంవత్సరాలు నుండి ఉందిట. శాస్త్రజ్ఞులు చెప్పినటువంటి విషయము. మరి ఎంత మంది వచ్చారూ, ఎంతమంది వెళ్ళారూ అయినా ఏమీ అవదేమి? ఇహ చాలులే అని ఏమి ఉండదు కదా. అట్లా వంశాలు వృద్ధి అవుతూనే ఉన్నాయి. అంతు లేదు. అన్ని వంశాలని వృద్ధి చేసే వాడివి నీవు. వంశాలన్నిటికి మూలం నీవు. అందరు రూపంలో ఉండే వాడివి నీవు. కాబట్టి ఈ సమస్తము నీవు. నీ వంశము ఏమిటీ, కులము ఏమిటీ, గోత్రం ఏమిటీ అని మహాత్ములను అడగకూడదు. అవన్నీ అక్కడ లేవు. ఎందుకంటే మహాత్ములంటే అసలు విషయము బాగా శరీరంలో వ్యాపించి ఉన్నవాడని అర్ధం! వాళ్ళ వంశానికి వాళ్ళు పాటుపడడము ఏమీ ఉండదు. వాళ్ళ మావంశం అని అనుకోరు. ఎందుకంటే అలా అనుకుంటే మహాత్ములు అవరు. 'నేను వీరు' అనే భేదము దాటిన వాడే మహాత్ముడు. స్వేతర బేధము అంటూ ఉంటాము కదా. 'స్వా , ఇతర' లేనివాడు. ఇన్ని వంశాలు పెంచుతున్నాడు. మన వంశం పెరగాలని మనం అనుకుంటాము కదా. 'వంశాభివృద్ధిరస్తు' అని దీవెనలు అందుకుంటూ ఉంటాం. ఆయన అనుగ్రహం ఉంటె వంశాలు అలా పెరుగుతూనే ఉంటాయి. కొన్ని చోట్ల లోక శ్రేయస్సు దృష్ట్యా కొన్ని వంశాలు ఆపేస్తాడు కూడా! ఆపేస్తే, దత్తత తెచ్చుకోకూడదు అనేది నా మతం. వాడు చేయని సంకల్పం నీకు ఏల మళ్ళీ? భగవంతుడి సంకల్పం, ఈసారి ఈ program లేదు అనుకోవడమే! ఎంత syllabus లేదు తెలుసా, పిల్లలు అనే సన్నివేశం లేకపోతె? ఒక పరీక్షకి వెళ్ళే వాడికి ఒక వారము రోజుల ముందు 75 % syllabus లేదు అంటే ఎట్లా ఉంటుంది వాడికి? ఇన్ని పాఠాలు లేవు

అంటే యెగిరి గంతు వేస్తాడే, అలా భావన చేయాలి. కోరి, పిండి పీకితే దుర్యోధనుడులాగ రావచ్చు. ఏమి జరిగిందీ? అక్కడ వాళ్ళకి కలుగుతున్నారు భగవత్ సంకల్పముగ. ఇక్కడ ఈవిడ భయపడిపోయింది. అప్పటికే ధర్మరాజు వచ్చేశాడు. ఎవరు పెద్ద వాడు అయితే, Law of Primogenesis. ముందు పుట్టిన వాడికి రాజ్యము ఇచ్చేస్తే ఏమి అయిపోతారు తనకంటూ సంతతి కలిగితే! అని తొందరపడి అలా పెరుగుతున్న తన గర్భాన్ని గట్టిగ గుద్దుకుంది. కారణం ఈర్ష్యే కదా! దాని ప్రతీకగా వాడు పుట్టాడు. అందుకని భగవత్ సంకల్పముగ జరుగుతున్న దాన్ని అంగీకరించడం బుద్ధిమంతుని లక్షణం. రేపు పొద్దున్న దీని వల్ల నీకు problem ఉందిరా అంటే మనం పూజలు చేసి, గుడికి వెళ్ళి, గోపురంపై దణ్ణం పెట్టి ఇలా చేస్తారు. అంగీరస మునిని పీకుతాడు చిత్రకేతుడు సంతాన ప్రాప్తి కలిగించమని. 'వద్దులే, నీకు గీతలో లేదు' అంటే అంగీరస మునిని చిత్రకేతుడు 'నువ్వు తలచుకుంటే పుట్టరా?' అంటాడు. ఇది వరకు ఒకాయన ఇట్లా పుట్టించాడు. నారదుడుని అడిగితే సంతానము లేరని, ఇంకో ముని, జటాధారి వచ్చి ఆశీర్వదించాడు. అతనికి పిల్లలు పుట్టారు. నువ్వు అంతటి మహాత్ముడవు కాదా? నువ్వు అనుకుంటే పుట్టాడా? నన్ను ఆశీర్వదించు' అని, ఎలా తన నెత్తి మీద చెయ్యి పెట్టాలో పెట్టించుకున్నాడు. అంటే giving better suggestions to the Guru or Teacher or to the Master అన్నమాట. Suggestions ఇచ్చే బదులు నువ్వే చేసుకోవచ్చుగా. 'Suggesting better things to God', అనే వారు మాస్టరుగారు. చిత్రకేతుకి అలా చేయడము వల్ల ఒక కొడుకు పుట్టాడు. అందరికీ మోహము పెంచాడు, చచ్చిపోయాడు. లేకపోతే ఏ బాధ లేదు. ఉండి లేకపోతే అది ఎంత బాధ? ఉండీ బాధ పెడుతూ ఉంటె అది మరీ బాధ. వంశం ఎక్కడ వృద్ధి చెందాలో, ఎక్కడ అక్కరలేదో అది ఆ పైన నిర్ణయము అవుతుంది. దానిని హాయిగ అనుసరించాలి. నేను నా జీవితములో ప్రత్యేకించి ఒక సన్నివేశము చూశాను. మొట్ట మొదటిలో Spain దేశము వెళ్ళినపుడు బాగ పుస్తకాలు విపరీతంగా చదివిన ఒకాయన వచ్చాడు. అతనికి అంతా పుస్తకజ్ఞానమే తప్పా, అనుభవమైన జ్ఞానము లేదు. చాల గర్వంగా ఉండేవాడు తనకి చాలా తెలుసునని. నన్ను అడిగితే నాకు తెలియదు, అని చెప్పాను ఎందుకు వచ్చిన గొడవ అని. క్రమశః ఒక 3, 4 ఏళ్ళు ఒక 15 సహజీవనాలకి వచ్చిన తరువాత

వాడికి కొంచెం అవగాహన అయింది తనకి ఏమి తెలియదని. 'పొరపాటు పడ్డాను మీ విషయములో' అని అంటే. 'ఏమీ పర్వాలేదు. నువ్వు మొదట అనుకున్నదే సత్యం, ఇంకొకటి ఏమి మార్చుకోక' అన్నాను. 'మీకు ఏమీ తెలియదు అనుకున్నాను కానీ మీకు చాల తెలుసు. పొరపాటు పడ్డాను.' అంటే, 'నువ్వు అనుకున్న దానిలో పొరపాటు ఏమీ లేదు. పొరపాటు ఎక్కడ పడ్డావు అంటే, నీకు అంతా తెలుసును అనుకున్నావే, అక్కడ పొరపాటు పడ్డావు' అన్నాను. 'పార్వతి కుమార్ గారికి తెలియదు అనుకున్నావే, అందులో ఏమి తప్పు లేదు. నీకు అన్నీతెలుసు అనుకున్నావే, అందులో ఏవో కొన్ని తప్పులు చూసుకో', అని చెప్పాను. అది అవగాహన అయింది. పెళ్లి చేసుకోకూడదని అనుకుని పెళ్లి చేసుకున్నాడు. పిల్లలు కలగాలి. ఓ రోజు వచ్చి పిల్లలు కలగడానికి ఏదైనా ఒక మంత్రం చెప్పమన్నాడు. 'కనడం కామం అని మమ్మల్ని వద్దు అంటున్నావు నువ్వు' అని గభాల్న ఏడ్చేశాడు. ఒక్కోసారి మనం ఆపలేము. వచ్చేది అట్లా ఉంటుంది కర్మ! అందుకని మంచి చెప్పినా ఎక్కదు. కన్నాడు. కన్నప్పటి నుండి ఇవాళ వరకు ఆ పిల్ల వాడితో వాళ్ళు పడుతున్న బాధలు ఇంతా అంతా కాదు. ఎటువంటి అనారోగ్యాలు ఉన్నాయంటే చెప్పలేము. చెప్తే వినలేదుకదా! ఇప్పుడు వీడికి healing చేయమంటాడు. అందుకని మనం ఒక్కోసారి బాధలు కొని తెచుకున్నట్టు అవుతుంది. ఇచ్చింది పుచ్చుకోవడం ఉత్తమం. కర్తవ్యాన్ని నిర్వర్తించడము ఉత్తమోత్తమం. ఆశించకపోవడం అనేది పరమోత్తమం. అందుకని వంశాలు వృద్ధి కాలేదే అని దత్తత తెచ్చుకోవడం, వాడ్ని అల్లారుముద్దుగా పెంచితే, వాడు తాగి తందానాలాడి ఉన్నదంతా మన కళ్ళ ముందే ఖర్చు పెడుతూ ఉంటె, ఏమి చేయలేక నిస్సహాయ స్థితిలో ఉండడం. వదిలేయ్! ఏది ఎక్కడ భగవంతుడి నిర్ణయమో అక్కడ అది జరుగుతుంది. వంశాన్ని పెంచే వాడు, తుంచే వాడు, మొదలు పెట్టే వాడూ 'ఆయనే!'. అందుకే వంశవర్ధనుడు! ఆయన వృద్ధి చేస్తాను అనుకుంటే జరుగుతుంది. లేదు అనుకుంటే, అక్కడ ఒక పని తగ్గించాడు అనుకునే తెలివి కావాలి. ఏది లేదో అది మనకి ఉంటె అపాయము అని తీసేశాడు అనుకోవాలి. కొంత మందికి ఆరోగ్యము ఉంటె అపాయం. కొంచెం అంతంత మాత్రంగా ఉంటేనే భయభక్తులతో జీవిస్తారు. భక్తి కుదిరే వరకు ఏదో ఒక భయం ఉండాలి. సంపద లేదో అని ఏడ్చేవాడికి,

సంపద ఇస్తే దానితో బాగా నాశనం అయిపోయిన వారిని మనం చాల మందిని చూడవచ్చు.

# 877 భారభృత్

భారభృత్ అంటే సమస్త భారమునూ మోసేవాడు. 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ అహం త్వా సర్వపాపేభ్యో మోక్షఇష్యామి మాశుచః' అనే వాగ్దానం మనకి భగవద్గీతలో కనిపిస్తుంది. సమస్త భారమునూ తాను వహించి, మనని ముక్తసంగులుగా, అతనియందు ఇమడేటట్లుగా నిర్వహించే పరమకారుణ్యమూర్తి అని భావం. భూభారాన్ని, గోళముల భారాన్ని మోస్తున్నది ఆయనే. సమస్త సృష్టిని ధరించి వున్నది ఆయనే. ధరించి వుండడమే కాక భరిస్తాడట కూడానూ. మనకుండే సమస్యలను ఆయనకు సమర్పణ చేసి జీవించేవారి విషయంలో భరించడం జరుగుతుంది. ఎంత భరిస్తాడంటే మనం ఊహించలేనంత. కారణం ఏమిటీ అంటే ఆయన పరమ కారుణ్యమూర్తి గనుక. అలా ఎంతో మంది బాధలను భరించాడు. భూదేవియొక్క బాధలను భరించడానికి భూమి మీద అవతరిస్తుంటాడు, పరతత్త్వమైన భగవత్తత్త్వము. అలాగే గ్రహగోళాదులకి సమస్యలు వచ్చినప్పుడు తాను దిగివచ్చి, సమస్యలను పరిష్కరిస్తుంటాడు. రాముడిగా దిగివచ్చి సమస్యలను పరిష్కరించాడు. సుగ్రీవుడి యొక్క సమస్యలను తాను భరించి, వాలిని సంహరించి, సుగ్రీవునికి రాజ్యం చేకూర్చాడు. అలాగే విభీషణుని ప్రార్థనను అంగీకరించి, రజస్సు, తమస్సు బాగా ప్రకోపించిన రావణ, కుంభకర్ణాదులను సంహరించి, సత్త్వగుణసంపన్నుడైన విభీషణునికి ధర్మపరంగా రాజ్యాన్ని అందింపచేశాడు. అలాగే జటాయువుకు తన స్పర్శచేత, చేసిన అంతిమ సంస్కారము వలన ఉత్తమగతిని కల్పించాడు. ఇలాగ రాముడు తన అవతారంలో ఎంతో మంది సమస్యలను తీర్చినట్లుగానూ, వారిని బాధల నుండి ముక్తులను చేసినట్లు మనకు గోచరిస్తుంది. అహల్య శిథిలమైపడి వున్న ఒక జీవి. రాయి కాదు. రాయి మనకు ఎంత నిశ్చేష్టితంగా కనిపిస్తుందో, అంత అచేతనంగా అయిపోయింది అహల్య. జీవితమందు ఏవిధమైన ఆసక్తి, అనురాగం, అనురక్తి లేక, బతికి ఉన్నా మరణించిన దానివలె వేల సంవత్సరాలు అలాపడి వున్నది. అందుకే రాయి అన్నారు. ఆశ్రమం పాడుపడిపోయి వుంది. కారణం ఏమంటే, ఆమె తన గురించిగాని, తన శరీరం గురించిగాని, ఆశ్రమం గురించిగాని పట్టించుకోలేదు.

గౌతముడు ఆశ్రమం వదిలి వెళ్ళిపోవడం జరిగింది. అలాంటి స్థితిలోవున్న అహల్యను, తన స్పర్శచేత సమస్త దోషములను పరిహరించి, తద్వారా దివ్యస్థితిని కల్పించాడు. విశ్వామిత్రుడంతటివాడు యజ్ఞములు నిర్వహిస్తున్నప్పుడు రాక్షసులు చేసే దుష్కార్యాలను అరికట్టి, తద్వారా ధర్మసంస్థాపనకు శంకుస్థాపన చేస్తాడు త్రేతాయుగంలో. అలాగే ద్వాపరయుగంలో చూస్తే ఎటువంటి భారములు మోశాడండి? రథం ముందు తాను కూర్చొని, వచ్చేబాణముల తాకిడి అంతా తను తింటూ, రథమును నడిపిస్తూ, చాకిరి అంటామే, అలా చేసిపెట్టాడు అర్జునునికి. కారణం? తనకి సమర్పణ చెంది ఉన్నాడు కాబట్టి. ఎవరయితే తనకు సమర్పణ చెంది వుంటారో వారి సమస్త క్షేమమును తాను వహిస్తానని చెప్పాడు. కాని కావలసింది మనసా, వాచా, కర్మణా, భగవత్తత్త్వమునకు ఏదో ఒక రూపంలో, ఏదో ఒక నామంలో సమర్పణ చేసుకోవడం ఎవరు చేయగలరో వారి సమస్యలను ఆయనే పరిష్కరిస్తాడు. ధర్మరాజు సమస్యలను తాను పరిష్కరించాడు. అర్జునుని సమస్యలను తాను యుద్ధంలోనూ, అజ్ఞాతవాసంలోనూ వచ్చిన సమస్యలను పరిష్కరించాడు. మనం ఊహించలేనన్ని సమస్యలను తాను పరిష్కరించాడు. తాను కవచంవలె నిలిచాడు. అంటే ముందు దెబ్బ తనకు తగలాలే తప్ప భక్తుడికి తగలకూడదు. అలా భక్తులను కాపాడుకునే పరమకారుణ్యమూర్తి భగవంతుడు! అది సమర్పణ చేసుకున్నవారికి మాత్రమే తెలుసు. ఇతరులకు తెలియదు. సమర్పణ చెందినవారు కష్టంవచ్చినప్పుడు భగవత్ స్మరణలో ఎక్కువ వుంటారు. మామూలుగా ఎప్పుడూ వుంటారు. కష్టం వచ్చినప్పుడు మరింత ఎక్కువగా వుంటారు. భగవత్ సాన్నిధ్యంలో తానుండడంవల్ల, వచ్చే ఆటుపోటులన్నీ ఆయన అందుకుంటూంటాడు. ఈవిధంగా ఎంతోమంది భక్తులకు సేవకుడై పని చేశాడు. ఇతరులకు సేవకుడిగా పని చేయడు. కాని భక్తులకు మాత్రము చేతి కర్రవలె పనిచేస్తాడు. ఎందుకంటే అతనికి భక్తుడిపై అంత అనురక్తి, వాత్సల్యం ఉండడంచేత, ఎవరు తనయందు పరిపూర్ణమైన విశ్వాసం కలిగి జీవిస్తుంటారో వారి భారములన్ని తను మోస్తాడు. ద్రౌపది భారాన్ని మోశాడు. ఎవరి కష్టాన్ని అసలు ఆయన ఆదుకోలేదండీ? మరీ కృష్ణావతారంలో వేలాదిమందిని అలా ఆదుకున్నట్లు చూస్తాం. వారి భారములు తాను మోసి, వారికి వూరట కలిగించి, వారు తన యందు

శాశ్వతంగా నిలబడి, తద్వారా వారి కథలన్నీ తన వైభవాలుగా ప్రపంచానికి అందించాడు. అదే 'కథితః' అనే నామానికి అర్థం.

## 878 కథితః

కథితః అంటే కథకు మూలాంశం అని అర్థం. ఏ కథకైనా మూలాంశము భగవంతుడే. రామాయణం తీసుకుంటే రాముడి కథగా తనదే ఉంటుంది. భాగవతం తీసుకుంటే శ్రీకృష్ణునిగా ఆయన కథే కాకుండా, ఆయనకు సమర్పణ చెందిన భక్తజనుల కథలుగా కూడా భాగవతంలో దర్శనం ఇస్తాడు. భగవత్ భక్తుని యందు ఉండేవాడు భగవంతుడు. ఆ భగవత్ తత్త్వాన్ని తనకిగా తాను వారి యందుండి నిర్వహిస్తాడు. అందుకే భగవత్ భక్తుని కథ కూడా భగవంతుని కథే. భగవత్ భక్తుని కథ చదువుకుంటే భగవంతుని యందు అనురక్తి కలుగుతుంది. ఆయన సాన్నిధ్యంలో నిలబడడానికి అవకాశం కలుగుతుంది. స్ఫూర్తి, విశ్వాసం, ప్రశాంతత కలిగి స్థిరమైన చైతన్యం మనకు ఏర్పడుతుంది. స్థితప్రజ్ఞత్వం మనకు కలుగుతుంది. అందుకని భక్తుల కథలు బాగా చదువుకోవాలి. భక్తుల రూపంలో భగవంతుడే అక్కడ ప్రవర్తిస్తుంటాడు. ఎందుకని? భక్తుడు భగవంతుడిలా ఉంటాడు గనక భగవంతుని యందు తాను ఉపస్థితుడై, సర్వకాల సర్వావస్థల యందు అనురక్తి చెంది ఉన్నవాడు భక్తుడు. తాను భగవంతుని యందు ఉండడం చేత భగవంతుడు తన నుండి సర్వకార్యములను నిర్వహిస్తాడు. కాబట్టి అతను నిర్వహించే కార్యములన్ని భగవంతుడే నిర్వహిస్తున్నాడు. కీర్తి, ప్రతిష్ఠ, వైభవము, యశస్సు, అనుభూతి అన్ని భక్తుడికే దక్కుతుంటాయి. కాని ఇదంతా తనవల్లే అనుకున్నప్పుడల్లా మళ్ళీ పొరపాటు పడడం జరుగుతుంది భక్తుడికి. అతడే తన నుండి నిర్వహిస్తున్నాడనే భావంలో పూర్ణముగా వర్తిస్తున్నవాడి నుండి చాలా సంపూర్ణముగా నిర్వహించి భువనవిజయము గావిస్తాడు. అందుకని భగవంతుని కథ అవతారములుగా మనము చదువుకోవచ్చు. భగవంతుని కథకు సృష్టినిర్మాణకథగా చదువుకోవచ్చు. భాగవతంలో సృష్టి ఏ విధంగా నిర్మాణం చేయబడింది అనేది మైత్రేయుడు విదురునికి బోధచేస్తాడు. ఈ గోళముల యొక్క నిర్మాణము 7 తిథులలో ఏ విధముగా ఏర్పడినదీ, జీవులయొక్క నిర్మాణము, వృక్షాదుల నిర్మాణము, ఇంద్రియముల నిర్మాణము, ఈ జీవులు ఈ ఇంద్రియముల కారణముగా ఈ ఏర్పరిచిన గోళములందు ఏ విధముగా ప్రవర్తించి అనుభూతి చెందాలో, దానికి

సంబంధించిన కథ, సమస్తమైన సృష్టి నిర్మాణకథ. అంతా భగవంతుని కథే కాక, అవతారములుగా ఆ తత్త్వమే దిగివచ్చినప్పుడు దానిని మనం బాగా శ్రద్ధా భక్తులతో చదువుకుంటున్న సమయంలో మనకు ఆయన సాన్నిధ్యం లభిస్తుంది. అంతేకాక భగవంతునికి, తమకు విడదీయరాని అవినాభావ సంబంధం ఏర్పరుచుకున్న మానవులున్నారు. వారే మహాత్ములు. వారు అహర్నిశలు భగవంతునిలోనే వుంటారు. అనన్యచింతలోనే అంటే వేరే చింత లేకుండా వుంటారు. 'అనన్యాశ్చింతయంతోమాం యేజనాఃపర్యుపాసతే, తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం'. వారియొక్క క్షేమాన్ని ఎలా చూస్తాడుటా? యోగంనందుండి క్షేమాన్ని కలిగిస్తాడుట అదీ గొప్ప విషయం. యోగక్షేమాలని రెండు వుండవు. నన్ను కాక ఇతరములను ఎరుగునటువంటి భక్తుడు ఎవడుంటాడో అంటే యోగమునందుండి వారి క్షేమాన్ని తను చూస్తాడు. మరోచోట 'మయ్యావేశ్య మనోబుద్ధిః' అని చెప్తాడు. మరోచోట 'మయ్యాశక్తః మనోపార్థః' అంటాడు. మరోచోట మాటిమాటికి 'నా యందు ఆసక్తి కలిగి వుండరా, నీ యందు నేనుంటాను. నీవు ఉన్ముఖుడవై ఉంటే నీలో నేనుంటాను'. అయస్కాంతము వైపు ఇనుపముక్క ఉన్ముఖమై వుంటే ఇనుపముక్క యందు కూడా అయస్కాంతము యొక్క శక్తియే పనిచేస్తుంది. కీర్తి అంతా ముక్కకే వస్తుంది. కాని వ్యక్తమయ్యేది తత్/మూలతత్త్వం లోంచి కదా! ఆ విధంగా ఎవరైతే తనయందు అనురక్తి కలిగియుంటారో వారిని యోగమునందు స్థిరపరచి, అది కారణంగా క్షేమం కలిగించగలడట. లేకపోతే క్షేమం వుండదు. Tube light వుంది. బయట Main switch వద్ద current వుంది. Connection సరిగ్గా లేకపోతే Tube light సరిగ్గా వెలగదు. Connection నాతో పెట్టుకో అని చెప్పడం అన్నమాట, Be connected to Me. To get connected with Him through thought, is what is called Yoga. యోగము అంటే కలయిక. కలయిక కోసం భావనల ద్వారా ఒక అనుసంధానం చేసుకోవలసి ఉన్నది. అన్ని కాలముల యందు, అన్ని దేశములందు ఎప్పుడు, ఎక్కడ వున్నా, ఏ అవస్థలో ఉన్నా, వాని గురించిన భావన నీమనసులో చెదరకుండా ఉన్నట్లయితే యోగము నందున్నట్లే. దానినే 'సహజ యోగము' అంటారు. అంటే యోగము చేస్తున్నట్లుగా ప్రత్యేకించి సిద్ధాసనమో, వీరాసనమో వేసికుని, కళ్ళుమూసుకుని ఏదో చేస్తున్నాడని ప్రపంచానికి

తెలిసేటట్లు చేసే యోగం సాధన కాదు. సహజ యోగం ఏమంటే మనుషులతో మాట్లాడుతూనే వుంటాడూ, నవ్వుతూ వుంటాడు, కబుర్లు చెప్తూంటాడు, అన్ని చేస్తూంటాడు కానీ, మూలంలో, అంటే తన భావం యొక్క మూలము నందు భగవత్తత్త్వంతో అనుసంధానం చెంది అవన్ని చేస్తూంటాడు. అదీ సహజయోగం! అలాంటి యోగంలో నిన్ను నిలుపుతాను. ఎప్పుడూ? అనన్యచింతన, పర్యుపాసన నీకున్నట్లయితే. ఆసనము అంటే కూర్చోడం. ఉపాసనం అంటే దగ్గరగా కూర్చోవడం. అనన్యచింతన కారణంగా ఆయనకి దగ్గరగా కూర్చోగలిగితే 'అనన్యాచింతయంతోమాం, యేజనాః పర్యుపాసతే' అనన్య చింతనతో ఏ జనుడైతే నాకు దగ్గరగా కూర్చుంటాడో, ఏ పన్లు చేస్తున్నా వాడికి దగ్గరగా కూర్చుని చేసుకుంటూంటే వాడు నీ ద్వారా పనులన్నీ చేసి పెడ్తూంటాడు. నువ్వుచూసి ఆనందించవచ్చు. అందరూ మెచ్చుకుంటారు. చాలా బ్రహ్మాండంగా చేస్తున్నాడీ మధ్య, అంటారందరూ. నిజానికి బ్రహ్మాండం అంతా వెనకాల వుంది. మనం కేవలం పిండాండం మాత్రమే. అది మన ద్వారా నిర్వర్తిసుంది. అందుకని యోగంలో మనముండడం వల్ల 'నిత్యాభియుక్తానాం'. ఈ శ్లోకంలో వేసిన పదాలన్ని చాలా ముఖ్యమైనవి. 'అనన్యాం' అంటే నేను కాక వేరే ఏదీ లేదూ అనే భావన బాగా స్థిరపడాలి. కనబడేదంతా నేనే! ఇన్ని రకాలుగా కనిపిస్తున్నాను. ఏది చూసినా ఇది నా రూపమే అని చూడు. అదీ ప్రాథమికమైన సాధన. అదే ఉత్తమమైన సాధన! అది జరిగితే సర్వకాల, సర్వావస్థలయందూ భగవంతుని యొక్క సాన్నిధ్యం సులభంగా లభ్యమౌతుంది. అనన్య చింతన అంటె అన్యము లేదు, అదే వున్నదని, 'పర్యుపాసన' అంటె అదే ఉపాసనగా, అట్లా అది ఒకటె ఇది ఇన్ని రూపాలుగా వున్నాయని చెప్పి, దానిక దగ్గరగా చేరడం, ప్రతివ్యక్తి లోనూ ప్రతి సన్నివేశం లోనూ, ప్రతి జీవిలోనూ దానితో ముడి వేసుకోడం. అదీ పర్యుపాసన. అది కారణం చేత నిత్యము అభియుక్తమై వుంటుంది. యుక్తము అంటే కలిసివుండడం. యుక్తి అంటాం కదా. అంటే బుద్ధితో కలిసి ఉండడం యుక్తి. గుత్తిగా సహజంగా నువ్వు కలిసిపోయి ఉంటావు, నిత్యాభియుక్తానాం. ఆవిధంగా ఈమూడు లక్షణాలు ఏ భక్తుని యందు సహజంగా గోచరిస్తాయో అతడు యోగమునందున్నట్లు. తనతో కలిసిపోయి వున్నట్లు. అతని క్షేమమునకు ఇహ ఏ తేడా లేదు. కావున వాని నుండి జరిగే వైభవోపేత కార్యములు,

జగత్కళ్యాణమైన కార్యక్రమాలు భగవంతుడు నిర్వర్తించినట్లే! కాబట్టి ఆ కథలు కూడా నావే. ఒక వేదవ్యాసుని కథ చదువుకుంటే అది భగవంతుని కథ చదువుకున్నట్లే! నారదుని కథ చదివినా, ధ్రువుని కథ చదివినా, ప్రహ్లాదుడు చదివినా, అంబరీషుడు చదివినా ఇలా శుకమహర్షి ఎవరు గురించి చదివినా వీరందరి ద్వారా ఆయన కథయే నిర్వర్తింపబడుతూంటుంది. అందుకే అంత ఆహ్లాదకరంగా వుంటుంది. అప్రయత్నయంగా మనలో ప్రశాంతత నెలకొంటుంది. కల్మషములు దూరమై నిర్మలచిత్తము ఏర్పడుతుంది. ఇలా భగవంతుని కథలు మనకి పరతత్త్వము సృష్టిగా ఏర్పడడం కథ, అవతారములుగా, అంశావతారములుగా తాను దిగివచ్చిన కథలు, భగద్భక్తులు ఆయనతో అనుసంధానం చెందడం వలన జరిగిన కథలు ఇవన్నీ. అంటే పాండురంగ విజయం వుందనుకోండి. పండరీ పురంలో ఎంతో మంది భక్తులు కృష్ణునితో యుక్తము అవడం వలన, యోగం చెందడం వలన వారి నుండి అద్భుతమైన విషయములు జరిగినవి కదా. ఇవి చదివితే ప్రతివారికీ ఎంత ఊపు వస్తుందీ! పండరీపురం వెళ్ళకపోతే జన్మ వృథా అనిపిస్తుంది. అలాగే కాశీవిశ్వేశ్వరుని వద్ద వుండి అద్భుతమైన అనుభూతులు పొందినవారి కథలు వింటే కాశీ వెళ్ళకపోతే జన్మవృథా అనిపిస్తుంది. అలాగే తిరుపతి వెళ్ళకపోతే జన్మవృథా అనిపిస్తుంది. ఎందుకు అనిపిస్తుంది అంటే అక్కడ ఉండి ఆ విధమైన అనుభూతులు పొందిన వారి కథలు చదవడంవల్ల. అంటే భగవంతుడి వద్దకు చేర్చడానికి మార్గంగా ఏర్పడిన వారు భక్తులంతా. అందుకనే The path of truth is pervaded by the Masters of wisdom అంటారు. ఈ సత్యమార్గమున లేక దైవమార్గమున అంతా దారిపొడుగునా మైలురాళ్ళల్లా దారి చూపిస్తుంది. మనం ఏదైనా ఊరు వెళ్తుంటే, ఇంకా ఎంత దూరము వుందనుకుంటూంటే, ఆ పక్క మైలురాళ్ళ ద్వారా మనకి ఎంత దూరం వుందో తెలుస్తుంది. మధ్య మధ్యలో మనం వెళ్ళే ఊరి పేరు కూడా వుంటుంది. ఫర్వాలేదు, ఆ ఊరే వెళ్తున్నాము అనుకుంటాం కదా! అలాగే ఈ భగవద్భక్తులంతా కూడా దారిలో మనకు దారి చూపించే మైలురాళ్ళవంటి వారుగా, వారే వ్యాపించి వుంటారు కాబట్టి వారి కథలను శ్రద్ధతో చదువుకోవాలి. ఒక మహాత్ముడి కథను ఏదో పుస్తకరూపంలో వుంటే అది భగవంతుని కథయే! ఫలానా దేశంలో, ఫలానాకాలంలో నేనిలా నడిచాను, నువ్వు చదువుకో నీకు ఆనందం కలుగుతుందీ అని చెప్పడం.

క్రీస్తుగా నడిచాడు, బుద్ధుడిగా నడిచాడు, Pythagoras గా నడిచాడు. Socrates గా, Einstein గా, Wright Brothers గా ఇలా చాలామందిగా నడిచాడు. ఎందుకంటే శాస్త్రము మనకందించి, మానవజాతి పురోభివృద్ధిని అత్యున్నతరీతిలో సాధించిపెట్టిన శాస్త్రజ్ఞులు కూడా భగవత్ అంశ కలిగినవారే! Einstein చాలా తత్త్వము తెలిసినవాడు. జాతి పురోభివృద్ధికి పాటుపడిన ప్రతి జీవి నుండి వ్యక్తమైనది ఆయన యొక్క విభూతియే. దానిని ఆవిధంగా చదువుకోవాలి. అంతేకాదు మామూలు నవలలో కూడా కథానాయకుడు కళ్యాణగుణములు కలిగి ఉంటాడు. ఆ కళ్యాణగుణములతో ఆ కథానాయకుని రూపములో అక్కడ విరాజిల్లే వాడు భగవత్ తత్త్వమే! He is ultimate. సినిమా చూసినా అదే! చివరకు అంతిమవిజయం కథానాయకునిదే! కథానాయకుడెప్పుడూ ధర్మం ప్రకారమే జీవిస్తూంటాడు. అతనిలో చాలా కళ్యాణగుణాలు కనిపిస్తూంటాయి. మనం ఈ రోజుల్లో బాగా అలవాటు పడిపోయి, ఆ పాత్రను చూడక ఆ పాత్రను పోషించినవాడిని చూడ్డంవల్ల అన్నింట్లో ఈ వెధవే కనిపిస్తున్నాడనిపిస్తుంది. కానీ మామూలు చిల్లర కథల నుండి అవతారమూర్తుల కథల వరకు, సమస్త కథలలో, కథకు మూలమైన అంశముగా కథానాయకుడిగా అదే తత్త్వము వుంటుంది. ప్రహ్లాదుడి కథ చదివితే కథానాయకుడు ప్రహ్లాదుడే. ధృవుడి చదివితే ఆ కథానాయకుడు ధృవుడే. అలాగే జ్ఞానేశ్వర్ కథ చదివితే జ్ఞానేశ్వరుడు కథానాయకుడు. అలాగే ఓ సక్కుబాయి చదివినా, ఓ మీరాబాయి చదివినా, అంటే ఏ కథలోనైనా ఆ కథానాయిక రూపంలో గానీ, నాయక రూపంలో గానీ ఉన్నది భగవంతుడే అని చెప్తుంది ఈనామం. ఆవిధంగా నువ్వు దర్శనం చేసుకుంటే, నువ్వు భగవద్భక్తుల కథలు అలా చదువుకుంటూ, తన్మయత్వం చెందీ, ఈషణత్రయంతో కూడిన జీవితానికి ఒడ్డున కూర్చుని అనందం పొందవచ్చు, ఎప్పుడూ అందులోనే కుళ్ళకుండా. ఈషణత్రయం అంటే 3 భావాలు. అలా పట్టి పీడించేవి కుటుంబం, ఉద్యోగం, సంఘం. ఇవేగా ఈషణత్రయాలు సంఘానికి సంబంధించిన దానిలో పూసుకోవాలీ, పులుముకోవాలీ, మనపేటలోనూ, మనం ఉండే నాలుగిళ్ళ మధ్యనో మనకేదో కీర్తిప్రతిష్ఠ కావాలనే తాపత్రయం. సంపాదన అనేది తెగేది కాదు. అది ఎప్పటికీ సరిపడదు. ఎంతున్నా కావలసినంత ఉన్నట్లనిపించదు. దాని కోసం ఆ భావం. ఇహ పెళ్ళాం, పిల్లలు అది తెమిలే విషయంకానే కాదు.

ఎందుకంటే పిల్లలకి పిల్లలు కలుగుతారు. ఇహ వాళ్ళని కూడా మనమే చూసేయాలనే దుర్బుద్ధి. మన పిల్లలని మనం చూసినట్లు, వాళ్ళ పిల్లలని వాళ్ళు చూసుకుంటారులే అని ఈ రోజుల్లో వదలరు. వాళ్ళనీ, వీలుంటే మునిమనమలని కూడా మనమే చూడాలి. వాళ్ళ పెళ్ళిళ్ళు కూడా మనమే చూడాలి. ఇలా అంతులేని కోరికలు. కనక ఈ మూడు భావములే సగటు మనిషిని ఎప్పుడూ బంధించి ఉంచుతాయి కనక ఈ మూడింటి నుండి దాటి ఒడ్డుకు చేరుకోవాలంటే భగవద్భక్తులయొక్క కథలు చదువుకోవాలి. అపుడు వాళ్ళెట్లా ఒడ్డున ఉండడం చేత ఇవన్నీ ఎలా అప్రయత్నంగ నడిచినాయో తెలుస్తుంది. భగవద్భక్తుడికి మాములు దేహధారణకి, దేహపోషణకు కావలిసిన సౌకర్యాలన్నీ అప్రయత్నంగా నెరవేరుతాయి. ఈరోజు కూరెలా ? రేపు బియ్యం ఎలా ? ఎల్లుండి పిల్ల పెళ్ళెలా ? ఇవన్ని వాడు ఆలోచించే పరిస్థితి వుండదు. కానీ అన్నీ అప్రయత్నంగా జరిగిపోతూంటాయి. సామాన్యుడు ఏది అప్రయత్నంగా జరిగిపోతుందో దానిగురించి ప్రయత్నం చేస్తూ జీవిస్తూంటాడు. అందుకే జీవితంలో రుచి పోతుంది. ప్రయత్నించి పొందవలసింది భగవత్ సాన్నిధ్యము! అప్రయత్నంగా జరిగేవి మిగిలినవి. ఎప్పుడు అప్రయత్నంగా ఇవన్నీ జరుగుతాయంటే నువ్వు ఎప్పుడూ అక్కడ కూర్చుంటేనే! ముండకోపనిషత్తులో చెప్తారు, జుట్టు అప్రయత్నంగా పెరుగుతూంటే నేను జాగ్రత్తగా పెంచుకున్నాను అనుకుంటే అది ఎంత అజ్ఞానం ? నువ్వు పెంచేవాడివైతే వూడిపోతుంటే నువ్వేం చేస్తున్నావు ? జుట్టు అప్రయత్నంగా పెరుగుతుందయ్య, భూమి మీద ఏ విధంగా వృక్షాలు అప్రయత్నంగా పెరుగుతాయో అలాగే నీ శరీరానికి కావలసిన పోషణ కూడా, ఆయనతో యోగం చెంది వుంటే అప్రయత్నంగా నడిచిపోతాయి. వూర్కె మామూలుగా కాదు, చెప్పలేనంత మహావైభవంగా నడుస్తాయి. ఎందుకంటె వాడితో వున్నావు కాబట్టి. దేవతలు వచ్చి వాడికి చేసేవన్ని చేసి పెడతారు. నిన్ను కాలు నేలమీద పెట్టనివ్వరు. ఎందుకంటె నువ్వు వాడితో వున్నావు కాబట్టి. ఉన్నతాధికారితో కలిసి వున్నవాడికి కింది అధికారులు ఆ అధికారితో పాటుగా వీడికీ అన్నీ చేస్తారు. ఎందుకంటె వీడు ఆయన మిత్రుడు. ఈయనకు చేయకపోతే ఆయనకి కోపం వస్తుందని. అందుకని దేవతలంతా నీకు అనుకూలమైవుంటారు. అదే ఒక గురువు యొక్క రహస్యం. సమస్తమైన దేవతా శక్తులు ఒక గురువుకి సహకారం అందించేట్లుగా అప్రమత్తులై

వుంటారు ఎందుకంటె గురువు ఆ పరతత్త్వంతో నిత్యం అనుసంధానం చెంది వుంటాడు కాబట్టి. అదీ గురువు గొప్పతనం! ఏ దేవత కావాలి నీకు, ఈ పట్టుకుపో. కొంతమంది గురువు యొక్క తత్త్వాన్ని అవగాహన చేసుకోలేక ఆ మంత్రం ఇవ్వండి, ఈ మంత్రం ఇవ్వండీ అంటారు. నువ్వు ఏదడిగితే అది ఇస్తాడు. అడిగింది  ఇస్తాడు. కానీ నీవు కోరవలసినది ఆయన సాన్నిధ్యము, ఆయనతో యోగము, ఆయన యందు నీవు జీవించుట ఇవీ కోరాలి. ఈ నడిచే కథంతా ఆ విధంగా భగవత్ తత్త్వంగా చూసి చదువుకో! అందుకే భాగవతం ఇచ్చారు. 'నా భక్తుల కథలు చదువుకోండయ్యా నేను మీకు దర్శనం ఇస్తాను' అంటాడు. ఎందుకంటే భక్తుడి రూపంలో తనే అందుబాటులో ఉన్నాడు. అదీ కథితః అంటే. అంటే 'ఏ కథ అయినా  నేనే. అందులో మూలం, కేంద్రం అయిన అంశమును నేను' అని చెప్తుంది.

## 879 యోగీ

యోగీ అతడు సహజ యోగి. సమస్తముతో కూడిక కలిగి ఉన్నాడు. పరతత్త్వము నిండని వస్తువు సృష్టిలో ఉండడానికి వీలు లేదు. ఆదలా ఉందిటా అంటే ఆయన దానియందు ఉండడం వలన, అది ఉన్నట్లుగా మనకు గోచరిస్తుంది. భగవంతుని వ్యక్తరూపమే సృష్టి. సృష్టిలో ఉండే సమస్త రూపముల యందు అతడే ఉపస్థితుడై ఉన్నాడు. అతడు అక్కడ లేకపోతే ఆ శాల్తీ అక్కడ లేదు. ఇన్నిటియందు తానే నిండి ఉన్నాడంటే అన్నిటితో తానే కలిసి ఉన్నాడు. ఎన్నిటితో? మనకి నచ్చని విషయాలుగా కనిపించేవాటిలో, నచ్చని వారిలో, చివరికి విషజంతువులలో కూడా ఆయనే ఉన్నాడు. తేలులోనూ, పాములోనూ, బొద్దింకలోనూ, దోమలోనూ, చీమలోనూ అన్నింటా ఉన్నాడు. క్రిమి కీటకాదులలోనూ, భూగర్భములలో ఉండే అంతర్లోకములలో ఉన్నాడు. పాతాళములలో అంటే భూమిలోపల ఏడు లోకములు, భూమి పైన ఏడు లోకములు ఉంటాయి. మొత్తం పధ్నాలుగు లోకాలు. (మనకు కూడా మూలాధారం కింద నుండి, పాదాల వరకు ఉన్న లోకాలు పాతాళలోకాలు. అక్కడ నుండి పైకిఉన్నవన్ని ఊర్థ్వలోకాలు, సప్త లోకాలు. సువర్లోకాలు) ఈ పధ్నాలుగు లోకాల జీవులతో తను అనుసంధానం చెంది ఉండడం వలన అవన్ని ఉన్నాయి తప్ప, లేకపోతే అవన్ని ఉండడానికి లేదు. అందుకనే బలిచక్రవర్తిని 'నువ్వు మోకాలులో ఉంటావా అంటే' 'తప్పకుండా ఉంటాను. మోకాలులో నువ్వు ఉన్నావు కదా' అంటాడు. సుతలము అనే లోకంలోకి బలిచక్రవర్తిని దింపుతాడు. ఆయనతో ఉంటే ఎక్కడుంటే ఏంటిట? అది భక్తుడు. భక్తుడికి ఒక్కటే Preference ఆయనతో ఉండడమే! అంతకు తప్ప ఇంక ఎక్కడ ఉన్నాం, ఎక్కడ కూర్చున్నాం, ఏం పెట్టారు, ఏం మర్యాదలు చేశారు ఇలా చూసుకునే వాడికి సమయం లేదు. ఎంతసేపు వాడితో ఉంటే చాలు. సృష్టి మొత్తం ఆయన రూపంగా భావన చేస్తే ఆయన మోకాలులో బలి చక్రవర్తి ఉన్నట్లు. అలాగే మన మోకాలులోనూ, పాదంలోనూ మనము లేమూ? పాదానికి చీమకుట్టినా, దోమకుట్టినా మనకి తెలుస్తుంది కదా. ఏ విధంగా ఈ శరీరమంతా మనం వ్యాపించి ఉన్నామో ఆ విధంగా సృష్టి అంతా తను వ్యాపించి, అన్నింటినీ ధరించి, మహాయోగసిద్ధిగా ఈ సృష్టి నడిపిస్తున్నాడు.

అలాక్కాకపోతే ఈ గోళాలు ఎలా నిలబడ్డాయో అనుకుంటే చాలా ఆశ్చర్యమనిపిస్తుంది. 30 కోట్ల సంవత్సరాల నుండి ఏదీ పట్టుకున్నట్లు కనపడకుండా వేలాడుతున్నాయే! అలా ఎన్ని గోళాలు, ఎన్ని నక్షత్రమండలాలు, ఎన్ని సూర్యగోళాలూ ఎలా వేలాడుతున్నాయీ? ఇవన్నీ ఆయన యొక్క యోగబలం. అన్నింటి యందు తానుండి వాటిని నడిపిస్తున్నాడు. మనల్ని కూడా అలాగే నడిపిస్తున్నాడు. కన్నులు చూసేటట్లుగా, చెవులు వినేటట్లుగా, నాలుక తినేటట్లుగా, వాగేటట్లుగా చూస్తున్నాడు. తిన్నది అరిగేటట్లుగా చూస్తున్నాడు, గాలి పీల్చి, వదిలేట్లుగా చూస్తున్నాడు, కాలేయంగా పని చేస్తున్నాడు. జీర్ణశక్తిగా పని చేస్తున్నాడు. పెద్దప్రేగుల్లో, చిన్నప్రేగుల్లో పని చేస్తున్నాడు. మలినములను వదిలే అంగములుగా కూడా పని చేస్తున్నాడు. పాదములుగా ఏర్పడి నడుస్తున్నాడు. చేతులుగా సేవలు చేస్తున్నాడు. వాడక్కడ లేకపోతే అది కదలదు. 'ఆయన చేయి పడిపోయిందండీ' అంటే అక్కడ నుండి ఆయన తప్పుకున్నాడని అర్థం. కొంత భాగం వదిలేశాడని అర్థం. ఏ భాగం వదిలేస్తే అది లేదని అర్థం. ఇన్ని వదిలేయకుండా పెద్ద సంసారిలాగా పట్టుకు కూర్చున్నాడండీ! కానీ దాన్లో ఇమిడి ఉండడు. పట్టుకున్నా ఆయన బంధింపడి ఉండడు. పట్టుకుంటే మనం బంధింపబడి ఉంటాం. మనం గట్టిగా 4గంటలు కూర్చోలేం. మరి అలాంటిది భూమి తన చుట్టూ తిరుగుతూ సూర్యుడి చుట్టూ 30 కోట్ల సంవత్సరాలనుండి తిరుగుతోంది. ముప్పై రోజులు కనీసం ఒక పని Continuousగా చేయలేం. అబ్బో, అబ్బో అనుకుంటూ రోజులు లెక్కపెడుతూంటాం. అందుకని నలబై రోజులు చేయరా అని దీక్ష ఇస్తే, ఎలాగో అలాగ నిక్కీ నీలిగీ గట్టెక్కిస్తాం. అయ్యిందిరా బాబూ అని. అలాంటిది ఇన్ని గోళాలు, ఇలాగ, ఇన్ని కోట్ల సంవత్సరాలు తిరుగుతున్నాయంటే అదీ ఆయన యోగం! అద్భుతమైన తన యోగశక్తి వలన దేన్నయినా నియమించగలడు. తన యోగబలం వల్లనే సూర్యాస్తమయం అయిపోయిందన్నట్లుగా చేశాడు గదా! రకరకాలుగా తన యోగశక్తి నిర్వర్తించి చూపించాడు. అన్నింటినీ మించి ఈ సృష్టిని ఇలా నిలిపి వుంచడమే మహా యోగం! అంతకన్నా యోగము లేదు. జీవితంలో మనం ఒకటి సర్దుకుంటూ ఉంటే ఇంకోటి పడిపోతూ ఉంటుంది, బీరువాలో సర్దుకున్న బట్టలల్లే. లేకపోతే వంటింట్లో చప్పుడుకి బయటున్న ఇంటాయన ఏమయ్యిందంటే, చెంచా తీస్తే గుండు చెంబు పడిపోయిందని, జవాబు

వస్తుందట. గ్లాసు తీస్తే పడిపోతుంది. అదీ మన యోగం. ఏదీ పడిపోకుండా అలా ధరించి ఉండడం కష్టం. ఇలాంటి గోళాలు లేక్కలేనన్ని ఉన్నాయండీ సృష్టిలో. అవన్నీ వాటి వాటి పరిధిలో తిరుగుతూంటాయి. అతిక్రమించవు. పోనీ అలాగ శుక్ర గ్రహం వద్దకు వెళ్ళివద్దామా అని భూమి అనుకుంటే మనం ఏమైపోతాం? అలాగే శుక్రుడు ఏ గురుడు వద్దకో, గురుడు శని వద్దకు వెళ్దాం అంటే అనుకుంటే? కానీ అవేమి అలా అనుకోవు. నియమించిన ప్రకారం అవి అలాగ తిరుగుతూ ఉంటాయి గుండ్రంగా. అవన్నీ సూర్యుడి చుట్టూ తిరుగుతూంటే, ఆయన ఇంకెవ్వరి చుట్టూనో తిరుగుతూంటే, ఆయన మరింకెవ్వరి చుట్టూనో తిరిగుతూంటే ఓ పద్ధతి ప్రకారం, 'సహస్ర కోటి యుగధారిణే నమః' అంటాం కదా.? అలా కోట్ల యుగాలుగా జరుగుతోందంటే--! మనకి ఊహకి అందని విషయం. మనల్ని ఓ పది, పన్నెండు సంవత్సరాలు చెప్పింది చేయరా అంటేనే నానాబాధ పడ్తున్నాం. ఏ గురువైనా ఏ శిష్యుడికైనా చెప్పేది ఒకటే. 12 సంవత్సరాలు నేను చెప్పేది తు.చ. తప్పకుండా చేయరా అని. దానికే మనం చచ్చి వూరుకుంటాం. తెమలడం లేదు. అటువంటిది సహస్రకోటియుగాలుగా ఈ సృష్టిని ధరించి వున్నాడట. చివరి నమస్కారం అదే కదా మనం చేసేది 'సహస్ర కోటి యుగధారిణే నమః' అని. అంటే ఎంత యోగి? ఎంతటి విషయం?

## ౪౮౦ యోగీశః

యోగీశః అంటే యోగులందరికీ ఈయనే గమ్యము. యోగులకు ఈశ్వరుడు. వశిష్ఠుడు, శక్తి, పరాశరుడు, వ్యాసుడు, శుకుడు, మైత్రేయుడు, మరువు, దేవాపి, జ్వాలాకూలుడు, నారదుడు, సనకసనందనాదులు, బ్రహ్మాదిదేవతలు, భూమిమీద ఉండే మహాత్ములంతా, ఋషులంతా, కూడా యోగులే! ఆయనతో యోగం చెందిన వారే. వారందరికీ ఈశ్వరుడీయనే! ఎవరితో యోగం చెందీ వున్నారూ? ఈయనతో! అది పరతత్త్వం అనుకోండీ, కృష్ణతత్త్వం అనుకోండీ. అందుకనే కృష్ణుడ్ని 'యోగేశ్వరుడు' అంటారు. యోగీశ్వరుడుగ, ప్రస్తుతం మన భూమిమీద యోగులందరికీ మైత్రేయుడు దారి చూపించేవారుగా వున్నారు. అంటే మైత్రేయుడు యోగీశ్వరుడు, జగద్గురువు. ఆయన ఈభూమి మీద వుండే యోగులకు ఈశ్వరుడైతే, ఆయనకు ఈశ్వరుడు శ్రీకృష్ణుడు లేక పరతత్త్వము. అందుకే 'యోగేశ్వరుడు' అంటారు కృష్ణుణ్ణి. ఇలా ప్రతి భూమికీ ఒక గురువుంటాడు. అలాగే ఒక్కో గోళంలో యోగవిద్యకు ఈశ్వరుడిగా ఉండేవారున్నారు. వీళ్ళందరికీ ఆయన ఈశ్వరుడు. అందుకే యోగేశ్వరుడు. యోగి, యోగీశ్వరుడు, యోగేశ్వరుడు మూడు స్థితులు. యోగి అంటే భగవంతునితో యోగము చెందినవాడు. అటువంటివారు, (గురువులు) ఈ భూమి మీద చాలామంది కనిపిస్తారు. ఎంతమంది అద్భుతమైన సంస్కారములు జీవులలో ప్రవేశపెట్టడంలేదూ? వారంతా భగవంతునితో అనుసంధానం చెందినవారే! యోగులే! వీరందరికీ ప్రతి గోళంలోను ఓ Head-office వున్నది. అక్కడ వున్నవాడు, కృష్ణుడిచే నియమింపబడినవాడు మైత్రేయుడు. భాగవతంలో ఇది చాలా స్పష్టంగా గోచరిస్తుంది. కృష్ణుడు శరీరత్యాగం చేసే సమయంలో కృష్ణుడి వద్ద వున్నవాడు ఒక్క మైత్రేయుడొక్కడే! అతనికి సమస్త జ్ఞానాన్ని అందించి, కృష్ణుడు శరీర త్యాగం చేయడంవలన ఆ తర్వాత మహాజ్ఞాని యైన విదురుడు కూడా మైత్రేయుని వద్ద నేర్చుకోవల్సివస్తుంది. మైత్రేయుడికి తెలిపి ఎందుకు వెళ్తాడూ? అప్పటికే ఆయనొక మహాయోగి. కనక యోగీశ్వరుడిగా ఆయనని నియమిస్తే, మిగతావాళ్ళంతా నీ దగ్గర కొచ్చి నేర్చుకొంటారులే, నేను లేనన్న బాధ ఉండదు అని, చెప్పాడు. అందుకే ఉద్ధవుడికి విదురుడు గోచరిస్తే 'అయ్యో కృష్ణుడు వెళ్ళిపోయాడా! తెలుసుకోవలిసిన విషయాలు చాలా ఉండిపోయాయే' అని విదురుడు

బాధపడుతుంటే, 'ఏమీ బాధపడక, నువ్వు ఏ విషయము తెలుసుకోవాలన్నా మైత్రేయుడున్నాడు. కడపటిక్షణాల్లో నేను, మైత్రేయుడు కృష్ణుని వద్ద ఉన్నాం. సమస్త సృష్టికి సంబంధించిన జ్ఞానం, బ్రహ్మజ్ఞానం, ఆయనకు అందించి వెళ్ళాడు. యోగమునకు ఆయనని గురువుగా నియమించి వెళ్ళాడు' అని చెప్తాడు. 'నువ్వు కూడా విన్నావు కదా, నువ్వు చెప్పు' అని విదురుడు అడిగితే 'నేను చెప్పకూడదు. ఆయననే చెప్పమన్నాడు కనక మైత్రేయుడే చెప్తాడు. కనక నువ్వు విను,' అని చెప్తాడు ఉద్ధవుడు. ఇంతటి విదురుడు మైత్రేయునికి మొదటి శిష్యుడవుతాడు. విదురుడు పూర్వజన్మలో యమధర్మరాజు అంశ. యోగము పొంది తద్వారా ముక్తిని పొందడం జరుగుతుంది విదురుడికి. అలాంటి యోగీశ్వరుడు మైత్రేయుడు! ఎన్నో సూర్యమండలాలున్నాయి. ఎన్ని సూర్యమండలాలున్నయో అన్ని భూమండలాలున్నాయి. ఈ భూగోళాలలో జీవులని ఉద్ధరించే యోగులున్నారు. ఈ యోగులందరికీ యోగీశ్వరులున్నారు. వీరందరికీ కూడా ఎవరు గమ్యమో వాడు యోగేశ్వరుడు. 'యత్ర యోగేశ్వర కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః'. ఇక్కడ యోగేశః అనే నామాన్ని ఇక్కడ భీష్ముడు వాడినాడు. 'నువ్వే కదా యోగేశ్వరుడవు' అని కృష్ణుడ్ని సంభోదిస్తున్నాడు. పరతత్త్వమే సమస్తమునకూ ఆధారము. అక్కడ నుండే ప్రకృతి, కాలము, మాయ, శక్తి పుట్టాయి. అది కారణంగా మొత్తము సృష్టి ఏర్పడినది. సృష్టికి ముడిసరుకు అతడే కాబట్టి, పరతత్త్వంగా భావన చేసినా ఈ నామానికి అదే అర్థం.

## 881 సర్వకామదః

ఏదడిగితే అదిస్తాడండి. అడిగిందల్లా ఇస్తాడు భక్తితో ప్రార్ధన చేస్తే. ఎన్ని కోరికలు తీర్చాడూ ? మొదట్నుండీ చూసుకుంటే భూమి కోరిక తీర్చాడు. సృష్టి నిర్మాణం చేయలేక దేవతలు, దానవులు తంటాలు పడుతుంటే తాబేలై మూలాధారమై నిలచి, మందరంగా తను నిలబడి నిర్వర్తించాడు కదా! దేవదానవులుగా తనే ఏర్పడి, వాళ్ళటు, వీళ్ళిటు నిలబడి చిలుక్కుంటే అన్నీ వచ్చినాయి. సృష్టి రావాలన్నా అదే చేయాలి. రాత్రి శక్తులూ, పగలు శక్తులూ రెండూ బాగా ఒకదానితో ఒకటి చిలుక్కుంటూంటే సృష్టి వచ్చింది. అందుకే కశ్యపునికి అదితి, దితి అని ఇద్దరు భార్యలు. వారి నుండి మొత్తం సృష్టి వచ్చింది. ఇలా కథలు చెప్పారు. సృష్టి నిర్మాణం చేసిన దేవతలకు సహకరించి వారి కోరికలు తీర్చాడు. ఎన్ని కోర్కెలు తీర్చాడు. ఓరోజు బ్రహ్మగారి, మనం పుస్తకాలు పారేసుకున్నట్లు, 4 వేదాలు అదృశ్యమైనాయి. అంటే పుస్తకాలు కావవి. లోపల ఉండే జ్ఞానం. పోతే ఏడ్చి, మొత్తుకుని తపస్సు చేస్తే అందించాడు. అలాగే గోళం ఏడ్చింది. బాబోయ్ నన్ను వీడు ముంచేస్తున్నాడుని. వరాహావతారం ఎత్తి గోళాన్ని ఉద్ధరించాడు కదా! ఇంద్రాది దేవతల కోర్కెలు తీర్చడానికి వామనుడిగా వచ్చాడు కదా! నిజం చెప్పాలంటే అడగడానికి వచ్చాడు కదా! అడగడం తప్ప ఇంకొక మార్గం లేకపోయింది బలి వద్ద. మిగతా రాక్షసులు అయితే ఎక్కడో అక్కడ అధర్మ ప్రవర్తన ఉంటుంది. కాబట్టి ఆ అధర్మాన్ని ఆధారంగా వారిని శిక్షించి, వీడ్ని మళ్ళీ కుర్చీలో కూర్చోపెట్టేవాడు. ఇంద్రుడికి కుర్చీ ఎందుకు పోతుందీ? అతడు ధర్మవిరుద్ధమైన కార్యములు చేసినపుడు తానే రాక్షసరూపంలో వచ్చి, ఇంద్రుడ్ని కుర్చీ దింపేస్తాడు. తర్వాత ఇంద్రుడు మళ్ళీ పశ్చాత్తాపపడి, సరైన మార్గంలోకి ప్రవేశించి, భగవద్భక్తిలో నిలచి లెంపలు వేసుకుని, 'మళ్ళీ నేను సవ్యంగా నిర్వర్తించుకుంటాను, తప్పు క్షమించు' అన్నప్పుడల్లా మళ్ళీ వాళ్ళని శిక్షించే వాడు. శిక్షించడం అంటే ఇహ చాల్లేండిరా అని చెప్పడమే. అప్పుడు మళ్ళీ ఇంద్రుడ్ని కూర్చోపెడ్తాడు. బలిచక్రవర్తి విషయంలో ఏమైందీ అంటే ఇతడు ధర్మపరమైన పాలన, అన్నింటికీ మించి 'దానము' అనే ఒక మహత్తరమైన కళ్యాణ గుణాన్ని పెంచుకుని సృష్టి అంతా ఆక్రమించాడు. ఎవడు ఇవ్వగలడో వాడు సమస్తాన్నీ ఆక్రమిస్తాడు. ఎవడు

పొందుతూంటాడో వాడు సమస్తమునకు బానిస అవుతూంటాడు. అదొక రహస్యం. ఇచ్చేవాడు పెరుగుతాడు. స్వామిత్యం చెందుతాడు. పుచ్చుకునే వాడు దాసుడైపోతాడు. అందుకనే యోగం లో 'వీలైనంత వరకు ఇస్తూండు, ఏదీ పుచ్చుకోకు' అని చెప్తారు. పుచ్చుకునే వాడు ఇచ్చిన వాడికి వశుడై పోతాడు. వ్యాపారులు అధికారులని అలా వశం చేసుకుంటూంటారు. 'ఉంచండి సార్ ' అని పెట్టి వెళ్తూ ఉంటారు. బిస్కెట్టు ఉండవచ్చు అక్కడ. మర్నాడు Officeకి నవ్వుతూ వస్తాడు. మరి బిస్కెట్టు తీసుకుని, నువ్వు ఇంకో రకంగా ఉండడానికి వీల్లేదు కదా! ఎవడు ఎవడికి దాసుడు అవుతాడండి? ఇవ్వడం చేత వ్యాపారస్తుడు స్వామి అయ్యి, ఇంత అధికారి దాసుడౌతాడు. ప్రతి మానవుడు ఈ రోజున ధనమునకు దాసుడు. ఎందుకంటే పుచ్చుకోవడం బాగా అలవాటు చేసుకున్నాం. ఇవ్వడం మర్చిపోయాం. ఇచ్చినవాడు గొప్పవాడు, మగవాడు అవుతాడు. ఇవ్వడం చేత తనకి ఇతరులు వశులై ఉంటారు తప్ప తను ఇతరులకు వశుడై ఉండడు. అది యోగ సాధనలో అతి పెద్ద రహస్యం. అందుకే యోగ సాధన చేసే సాధకునికి, ఒక విద్యార్థికి ఏం చెప్పాలంటే వీలున్నంతవరకు జీవితంలో 'పుచ్చుకోవడం తగ్గించి, ఇవ్వడం పెంచు' అని. నువ్వు పెరుగుతావు, బంధనాలు తగ్గుతూంటాయి, ముక్త స్థితి వస్తూంటుంది. నువ్వు పుచ్చుకుంటూ ఉంటే బంధ స్థితి పెరుగుతూంటుంది. పుచ్చుకున్నవాడు ఇచ్చినవాడికి లోకువ. అందుకనే బలిచక్రవర్తి ఇది కదా పద్ధతి, ఇలా మనం ఇచ్చుకుంటూ పోతే మనకి అందరూ లోబడి ఉంటారు, అనుకున్నాడు. సమస్త ప్రకృతి శక్తులను అలా బలి లోబరుచుకొన్నాడు. భగవంతుడు మరి ఏవిధంగా శిక్షిస్తాడూ ధర్మాన్ని నిర్వర్తించేవాడిని? అందుకేం చేయాల్సి వచ్చిందీ? అడగడానికి రావాల్సి వచ్చింది. కానీ ఇవ్వడం వల్ల బలికేం జరిగిందంటే తనలోని సంస్కారాలన్నీ కూడా మార్పు చెంది, ఉత్తమమైన సంస్కారం ఏర్పడి, భగవత్ సాన్నిధ్యం చాలా ముఖ్యం ఈ కుర్చీలో కూర్చోడం కన్నా అన్న స్థితికి వచ్చేస్తాడు. అట్లా ఇచ్చుకుంటూ పోతూంటే మిగిలి ఉన్న రాక్షస జాతి అంతా మనకు బలం చాలా పెరిగిపోయింది అనుకున్నారు. అక్కడ నుండే 'బలి' అని వచ్చింది. అసలు అతని నామం వైరోచనుడు. విరోచనుని కుమారుడు. అప్పటి నుండి 'బలి' అయ్యాడు. చాలా బలం ఎంత బలం అంటే ఎవరూ ఏమీ చేయలేనంత. ఎంత క్లిష్ట సమస్యనైనా ఎదుర్కొని పరిష్కరించగలడు.

కుర్చీలో కూర్చొని, అంతకుముందు ఆ కుర్చీలో కూర్చున్నవారి కన్నా బాగా పరిపాలిస్తున్నాడండీ! మరి అలాంటి వాడ్ని ఎందుకు తీసెయ్యాలండీ? అదీ వారు వేసిన ఒక పాచిక. ఈ పాచికకి బలిని వినియోగించాడు శుక్రాచార్యుడు. అయితే సమస్తమునకూ బలవంతుడయ్యాడు. స్వధర్మ పరిపాలన సృష్టిలో ఒక నియమం. ఏ గ్రహాలుకు అప్పగించిన పని ఆ గ్రహాలు చేయాలి. శనిగ్రహం గురుగ్రహం పని నాకు తెలుసు, కనక గురుగ్రహ ప్రభావాన్ని నేను ఇస్తానంటే కుదరదు. అలాగే గురుగ్రహం తనకిచ్చిన పనికాక ఇంకోటి చేస్తే కుదరదు. ఎవరెవరికి ఏయే కార్యములు దైవము నిర్ణయం చేశాడో వారు ఆయా కార్యములు నిర్వర్తిస్తూ ఉండాలి. ఇంతకన్నా నేను బాగా చేయగలను కాబట్టి ఆ పని చేస్తాను అని అంటే, పరధర్మము ఎంత ఆకర్షణగా ఉన్నా అది నిర్వర్తించడం వలన నశించడమే జరుగుతుంది. ఒక తండ్రి నలుగురు కొడుకులకి పనులు అప్పచెప్పాడు. ఆయన మహాత్ముడు. ఒకడ్ని పూజలు చేయమన్నాడు. పూజలు చేసి తన తరపున తీర్థప్రసాదాలు వచ్చిన వారికి ఇవ్వమన్నాడు. ఇతడే ఇస్తూ ఉంటాడు కనక అందరూ ఇతడినే ఎక్కువ మహాత్ముడిగా గుర్తించే అవకాశం ఉంది. ఇంకొకడికి వంటగదిలో వుండి శ్రద్ధాభక్తులతో వచ్చినవారందరికీ వంట ఏర్పాట్లు చూసి వచ్చిన అందరికీ వడ్డన చేసి, తృప్తి కలిగేట్లు చూసుకో, అని చెప్తారు. మరో కొడుక్కి ఈ ఆశ్రమ వాతావరణం అంతా ఎప్పుడూ పరిశుభ్రంగా వుండేటట్లుగా, సుగంధములు మాత్రమే వ్యాప్తి చెందేటట్లుగానూ, అందంగానూ అలంకరించి వుంచు అనే పని అప్పగించాడు. అంటే కళ్ళాపి చల్లి, ముగ్గులు వేయడమూ, దీపాలు వెలిగించడమూ, పూలు తెచ్చి అలంకరించడమూ, తోరణాలు కట్టడం, వూడవడం అదీ అతని పని. ఇంకొకడికి ఏం చెప్పాడంటే వచ్చేవారందరికీ సరైన సూచనలివ్వు అని. ఇందులో బాగా పేరు వచ్చేది పూజ చేసేవాడికి. ఆ తర్వాత పేరు వచ్చేది భోజనం పెట్టేవాడికి, ఆ తర్వాత Gate వద్ద సూచనలిచ్చి లోపలికి పంపే వాడికి, ఆ తర్వాత ఇల్లు ఊడ్చి ముగ్గు పెట్టే వాడికి వాడ్ని ఎవ్వరూ పట్టించుకోరు. ఇలా పట్టించుకోవడం, మెచ్చుకోవడం ఎవరి వద్ద నుండి వస్తాయి? పామర జనం దగ్గర నుండి, కానీ తండ్రి దృష్టిలో ఏంటీ? ఎవరికి అప్పచెప్పిన పని వారు సక్రమంగా చేశారా లేదా అన్నదే తప్ప, ఇది గొప్ప పని, ఇది తక్కువ పని అని ఏమీ లేదు. అన్నీ భగవంతునిచే అప్పచెప్పబడినవే కదా! తండ్రి చేత నలుగురికీ నాలుగు

పనులు అప్పచెప్పబడ్డాయి. నలుగురూ దానిని నిర్వర్తిస్తున్నారు. తండ్రి సంతోషించడమే, ఈ నలుగురు కొడుకులకీ ముఖ్యం తప్ప, ప్రపంచం మెచ్చుకోవడం కాదు. ప్రపంచం మెచ్చుకోవడం వల్ల ఈపూజలు చేసేవాడు, భోజనాలు చేసేవాడు దెబ్బతినవచ్చు. కీర్తి ప్రతిష్టలకు లొంగిపోయి అవస్థితి పొందవచ్చు. ఈ మిగతా ఇద్దరికీ అవస్థితి పొందని రక్షణ ఉంటుంది. ఎందుకంటే వాళ్ళని ఎవరూ పట్టించుకోరు. కానీ భగవంతుని దృష్టిలో, తండ్రి దృష్టిలో ఈ నాలుగు పనులూ, ఆ నలుగురూ చెప్పిన విధంగా చేస్తూ ఉంటే అతనికి ప్రియులే కదా. ఎవడు చెప్పిన పని చేస్తాడో వాడు ఎప్పడూ ప్రియుడే. చెప్పిన పని చేయని వాడ్ని ఎప్పడూ చేరదీయడు. వారు ఏపని చేసినా, పూజ చేసినా, ముగ్గు పెట్టినా, వంట వండినా, సూచనలిచ్చినా, చేసేవాడికేమిటీ? కేవలం తండ్రి తనకు చెప్పాడు, చేయాలీ అనే తండ్రి గురించిన నిరంతర భావన తప్ప మరేమీ ఉండదు. అలాగే సృష్టిలో కూడాను. రకరకాల దేవతలు, రాక్షసులు,  దానవులు వున్నారు. దానవులు, రాక్షసులు, దైత్యులును అంతా ఒకటే అనుకుంటాం. కానీ వేరువేరు. రాక్షసులు అంటే రక్షించేవారు. దానవులు, దేవతలు, యక్షులు, గంధర్వులు, సిద్దులు, చారణులు, సాధ్యులు, రుద్రులు, వసువులు, ఆదిత్యులు, మానవులు ఇలా ఎవరికి వారుగా ఏర్పరిచి, వారి ధర్మాలు కూడా ఏర్పరిచారు. Football లో Goal-keeper వచ్చి, నేను front ఆడతానని Field లోకి వస్తే ఎలా? అలాగే Cricket లో Wicket-keeper వచ్చి Bowling చేస్తానంటే ఎలా? అది ఆట అవుతుందా? అలాగే ఎవరెవరికి విధించిన విధులు వారు వారు నిర్వర్తించుతూ ఉండడం వల్ల ఈ సృష్టిలో వైభవోపేతమైన క్రీడ జరుగుతోంది తప్ప, అంతకన్నా నేను బాగా చేస్తానని ఇది వదిలేసి అది చేస్తానంటే కుదరదు. అక్కడా ధర్మగ్లాని! బలి ఈ దానాలు చేస్తూండడం వల్ల కుర్చీ మీద వ్యామోహం పోయి, భగవంతుని సాన్నిధ్యము నందు పూర్ణమైన వ్యామోహం ఏర్పడుతుంది. భగవంతుడు తనకి ముఖ్యం తప్ప, కుర్చీ ముఖ్యం కాదని తెలుస్తుంది. అందుకే శుక్రాచార్యుడు 'నీ వద్ద నుండి ఎత్తుకు పోవడానికే వచ్చాడు, జాగ్రత్త' అని చెప్తే 'పోవోయ్' అని అంటాడు. ఎందుకంటే ఆ కుర్చీ ఎప్పడో తను వదిలేశాడు, ఎప్పడొస్తాడా, తనని కుర్చీలోంచి ఉద్ధరిస్తాడా అని. కుర్చీ కోసం తాపత్రయేవాడు ఇంద్రుడైతే, ఆ కుర్చీలోంచి తన్ను ఉద్ధరించమని అడిగే ఉన్నత స్థితికి బలి ఎదిగాడు. ఇటు

ఇంద్రుడికి అతడి కోర్కె నెరవేర్చాడు, అటు బలికీ అతని కోర్కె నెరవేర్చాడు. ఇద్దరికీ 'కామదః'. ఎన్ని రకాలుగా కోర్కెలు నెరవేర్చాడు! ఏది కోరితే అది నెరవేర్చాడు. ఎట్లా నెరవేర్చాడు? అలా అని అడిగాడా? అడగలేదు. బలిచక్రవర్తి అడిగేటట్లుగా చేశాడు. అందరికీ ఇస్తున్నాడు కదా! ఈ కుర్రాడొచ్చాడు. 'ఏమి కావాలీ' అన్నాడు. 'నాకేం అక్కర్లేదు' అంటాడు. సర్వ కామదః అంటే అందరికీ ఇచ్చేవాడే తప్పా ఏదీ పుచ్చుకునే వాడు కాదు కదా. అందుకే అది Highest positive Pole, ఏదీ పుచ్చుకోకపోతే ఎలా? అన్నాడు బలి. 'నేను పుచ్చుకోను' అన్నాడు. 'వల్ల కాదు పుచ్చుకో' అంటూ బలి బతిమాల్తాడు. అలా అనిపించి, చివరకు బలినే అడుక్కునే వాడిగా చేశాడు. 'నువ్వు పుచ్చుకోకపోతే ఎలా, నేను అందరికీ ఇవ్వడం వ్రతంగా పెట్టుకున్నాను. పంటభూములు కావాలా, గుర్రాలా, ఏనుగులా ఏదో ఒకటి కోరుకో' అంటూ Suggest చేస్తునే ఉన్నాడు బలి. నవ్వుతూ ఆ వామనుడు 'నాకెందుకివన్నీ' అంటే, చివరికి 'నువ్వు కోరుకోవా' అని బలి అతన్ని అడిగేట్లుగా చేశాడు. అంతేగానీ ఆయనేమీ అడగలా! సరే ఏదో ఏడుస్తున్నావు కనక అడుగుతున్నాను అన్నట్లుగా అడుగుతాడు. అని అందుకున్నాడు. అందుకుని, ఆ కుర్చీలోంచి ఉద్ధరింపు ఇచ్చాడు. ఆ కుర్చీ బలి యొక్క చైతన్యస్థితికి చాలా చిన్నదైపోయింది. అందుకనే 'నీ వారై తనువారలలో ఒకడనై' అని, నీవారలలో ఒకడిగా ఉంచుకో, ఎక్కడ ఉంచుకుంటే ఏమిటి? ఊడవమంటే ఊడుస్తా, కడగమంటావా కడుగుతా, అట్లా వున్నవారు యమాదులంతా 'ఒరేయ్ నువ్వు ప్రాణాలు తీసే పని పెట్టుకో' అన్నాడు. ఎవరు సంతోషిస్తారండి ప్రాణాలు తీసే పని పెట్టుకుంటే? మృత్యుదేవతను ఎవరైనా హర్షిస్తారా? వాడు వస్తే ప్రతివాడూ 'ఛీ పో' అని తలుపు వేసేస్తారు.అట్లా వున్నవాడొకడున్నాడు. వాళ్ళ Batch లో చేర్చేశాడు ఈయన్ని తీసుకువెళ్ళి. Not all can do the scavenging work in this creation. ఇది గొప్ప, ఇది తక్కువ అనే భావాలు దాటిన వాళ్ళు మాత్రమే చేయగలరు. దేవతలు చేయలేని పనులు రాక్షసులు చేయగలరు. దేవతలు కేవలం White-collared jobs మాత్రమే చేయగలరు. రాక్షసులు అవీ, ఇవీ కూడా చేయగలరు. అటు పాకీదొడ్లు ఊడవగలరు, ఇటు వంటా చేయగలరు. అటువంటి స్థితి బలికి ఇచ్చాడు. కుబ్జకిచ్చాడు. అడిగింది అడిగినట్లే ఇచ్చేస్తాడు. గురువుగారు 'నా పిల్లలు పోయారు తెచ్చిపెడతావా' అంటే 'ఊ కానీండి'.

ఇంకో బ్రాహ్మణుడు 'నా పిల్లలు పోయారు' అంటే తెచ్చిచ్చాడు. ఇంకొక ఆమె 3 వంకరలు తిరిగి ఉందిట (కుబ్జ). చెవులు పట్టుకు పైకి లాగాడు. ఇంత కురూపిగా వున్నానే అని లోపల అనుకుంటూండేది ఆమె. ఆమెలో అపరితమైన అందం వచ్చింది. గోపికలు తనని కోరారు. తననే ఇచ్చేశాడు. ధర్మరాజు రాజ్యాన్ని కోరాడు. అందుకే రాజ్యాన్ని ఇచ్చాడు. అర్జునుడు కీర్తి సంపదలు కోరాడు. అవిచ్చాడు. ద్రౌపది తనని కోరింది తనని ఇచ్చాడు. సమస్తాన్నీ అందించాడు. భీష్ముడు, వ్యాసుడు తనని కోరారు. తనని కోరినవార్ని తననిచ్చాడు. అది 'కామదః'! తనని కాక ఇతరములను కోరినా, అవి కూడా ఇచ్చాడు. 'వాళ్ళొచ్చారు, ఈ గిన్నె ఖాళీగా వుంది, ఏం చేయమంటావ్' అంటుంది ద్రౌపది. అదీ చేశాడు. చాకిరీ చేశాడండీ! జడభరతుడిగా తన శిష్యుని పల్లకీ ఒక కొమ్ము తను మోస్తూంటాడు. రాజు అడవిలో అక్కడెవరో మహాసిద్ధుడున్నాడు, ఆయన వద్ద విద్య నేర్చుకోవాలని బయల్దేరాడు. ఈ పల్లకీ మోస్తూంటారు బోయీలు. ఇంత బలవంతులైన బోయీలు మోసి మోసి పల్లకీ వారి భుజాలు పుళ్ళు అయిపోనాయాయి కానీ ఈ గురువుగారు కనపడలేదు. మేము మోయలేము అన్నారు వారు. అప్పడొక చెట్టు కింద మంచి దున్నపోతులాగున్న ఓ మనిషి కనపడితే వాడ్ని పిలిచి మోయమన్నాడు రాజు. మిగిలిన కొమ్ములు ఆయన మోస్తూంటే, ఇంకో కొమ్ము మిగిలినవారు మోస్తూంటారు. అలా మోస్తూంటే ఈ బలిష్టుడ్ని రాజు అడుగుతాడు 'ఇక్కడ భరతుడనే మహాత్ముడ్ని కలవాలని వచ్చానూ, ఆయనెక్కడ దొరుకుతాడో నీకేమన్నా తెలుసా?' అని. అడిగితే, అతడు 'ఆయనతో నీకేం పని' అని అడుగుతాడు. అంటే 'జ్ఞానం కావాలి' అంటాడు. 'నీకేం జ్ఞానం కావాలీ' అంటాడు ఇతడు. 'నీకెందుకు నీవేం చెప్తావ్' అంటాడు రాజు. 'అతడేమీ అక్కర్లేదు నేనే చెప్పేస్తానని' ఇతడే అలా చెప్పేస్తాడు, చెప్పేస్తాడు. రాజు తల తిరిగిపోయి, పల్లకి ఇతని చేతా మోయించేస్తున్నాం, అనుకుంటాడు. చివరకు ఏం తెలుస్తుందంటే ఆయనే జడభరతుడు అని. అలాంటి గురువులుంటారండీ? పల్లకి ఎక్కి కూర్చొనే వారు గురువులుగానీ, పల్లకీ మోసేవాడు గురువా ఈ రోజుల్లో? కృష్ణుడలా మోశాడు. వారి కోసం దెబ్బలు కూడా తిన్నాడు. అర్జునుడు ఓసారి హూంకరించి, హనుమంతుడితో పెట్టుకుంటాడు. 'నేనూ భక్తుడ్నే అంటాడు. ఆ మాట వినగానే హనమంతుడు 'కాదూ' అని లెక్కవేసుకొంటాడు. భక్తుడని

తనకి తెలిసి ఉంటే తను అహంకార ప్రజ్ఞలో వున్నాడు తప్ప, తను భగవద్ భక్తిలో ఎక్కడున్నాడూ? తన గురించి తను తెలిసి ఉన్నాడంటే భగవంతుని యందు లేడుగా ఆ కాసేపూ? హనుమంతుడి వద్దకు నువ్వెళ్ళి, 'నువ్వు భక్తుడివిటా' అంటే 'ఆహా' అంటాడు. తను భక్తుడ్ని అని ఆలోచించే సమయం ఆయనకు లేదు. అది కూడా రాముడి గురించే ఆలోచిస్తాడు. 'నువ్వు బాగా సంకీర్తన చేస్తావని ప్రపంచం అంతా చెప్పకుంటున్నదీ' అని నారదుడు అంటే, ఆంజనేయుడు 'ఆహా' అంటాడు. 'నా కదంతా తెలియదు. నేను రాముడిలో వుంటాను. నీలోనూ రాముడ్ని చూస్తున్నాను. అంత కంటే నాకు ఏమీ తెలియదు' అంటాడు. 'నువ్వు మహాబలశాలివని', జాంబవంతుడు హనుమంతుడికి గుర్తు చేయాల్సి వచ్చింది. తనింతటివాడని తెలిసినవాడు అహంకారి. తనెంతటివాడో వాడూ అంతటివాడేనూ, అది తెలిసినవాడు హనుమంతుడు. మహాజ్ఞాని. జగద్గురువు. రాబోయే సృష్టికి బ్రహ్మ. ఆయనతో పెట్టుకుంటాడు, అర్జునుడు వెళ్ళి 'కృష్ణుడు నా వాడంటూ'. ఆయన 'ఆహా' అంటాడు. 'నువ్వు గొప్పో, నేను గొప్పో పందెం వేసుకుందాం' అంటాడు అర్జునుడు. ఎంత పిల్లకాయ వ్యవహారం? 'సరే కానీ నువ్వే పందెం పెట్టు' అంటాడు అర్జునుడ్ని. 'ఓ వంతెన నిర్మాణం చేసి, ఇది నేను నా కృష్ణ భక్తితో తయారు చేసిన వంతెన. నువ్వు తొక్కి పడగొట్టగలిగితే, నువ్వు నాకన్నా గొప్ప భక్తుడవని ఒప్పకుంటాను. లేకపోతే నువ్వు ఏదన్నా పెట్టు. నేను చేస్తా' అంటాడు. 'అట్లాగే' అని 'అలా బాణాలతో ఇంకో వంతెన వుందీ, నేను నమ్ముకున్న దైవస్మరణతో దాన్ని నిర్మించాను. దాన్ని తొక్కమన్నాడు'. సిమెంటు రోడ్డు మీద మనం కాలు వేసి తొక్కితే ఎలాగుంటుందండీ, అర్జునిడికీ అదే అవుతుంది. అదేం కాదు. 'సరే నేను నిర్మిస్తాను. నువ్వు దాన్ని తొక్కు' అంటాడు. కాలు పెట్టగానే వంగిపోతుంది. ఇతడు గోల 'కృష్ణా, కృష్ణా' అని, అప్పుడు వంగుతుంది తప్పా విరగదు. చెత్తకింద తొక్కుతాడు ఆంజనేయుడు. వంగుతుందే తప్ప విరగదు. ఇవతలకు వస్తాడు ఆంజనేయుడు. 'నువ్వు కూడా భక్తుడివేలే పో' అంటాడు. వాడి బొంద వాడేం భక్తుడు అని, వంతెన కింద నుండి ఇవతలకు వస్తాడు కృష్ణుడు. 'ఇలాంటి పిచ్చి పిచ్చి పనులు చేయబోక. నీ యొక్క అవమానం చూసి నేను భరించలేక ఆ వంతెన కింద నేను నిలబడ్డానురా, ఇదంతా చూడు ఎలా అయిపోయిందో, ఆయన్తో పెట్టుకోక, ఆయన పాదాలకు నమస్కరించు' అని

చెప్తాడు. ఇట్లా ఆయన భక్తుల కోసం ఆయన తిప్పలు పడ్తాడు. వారెవరో నలకూబర, మణిగ్రీవులు. వాళ్ళు మొండి మొలలతో ఆడవాళ్ళతో పిచ్చిగా తిరుగుతున్నారట, ఒళ్ళుపైన తెలియక నారదుడు వచ్చినా, ఇంతటి మహర్షిని చూసినా వికవికలూ, పకపకలూ. ఆయనకు మండింది. కుబేరుడి సంతానం వీరు. బాగా డబ్బు మదం ఎక్కింది. మన ప్రపంచంలో లాగానే మదించారు. వీరిని దారిలో పెట్టకపోతే లాభంలేదని, 'వెధవల్లారా మద్ది చెట్లయ్యి బతకండి' అని శపించాడు. 'అమ్మమ్మ, మా గతేంటి' అన్నారు. అప్పటికేదో వెర్రి ఆలోచన వచ్చిందాయనకు. 'పురాణ పురుషుడు దిగివస్తాడు. రోలు నడుంకి కట్టుకుని మీఇద్దరి మధ్య నుండి వెళ్ళినప్పుడు ఆ రోలు బలానికి, చెట్లగా వున్నవారు పడిపోతారు. అప్పుడు శాప విముక్తి కలుగుతుంది' అంటాడు. అదేంటండీ? నారదుడు ఆ మాట అన్నందుకు ఇంత పిల్లవాడు నడుం చుట్టూ రోలు కట్టుకోవాల్సి వస్తుంది. భక్తుడి మాట చెల్లించడం కోసం ఇంతటి భగవంతుడూ ఎన్ని తిప్పలు పడతాడో! సర్వకామదః అన్నాడు. నారదుని నోటి నుండి మీకు ఇలా శాపవిమోచనం అని వచ్చింది. అదేమిటండీ? ఆయన అన్నాడని, అల్లరి చేసి, అమ్మకి దొరక్కుండా పరిగెత్తి, విసిగించేసి, ఆమె మనసులో ఇహ వీడ్ని రోలుకి కడితే కానీ లాభం లేదు అనే స్థితికి తెచ్చి, ఆవిడ చేత రోలుకు కట్టిచుకుని, దాన్ని ఈడ్చుకుని వచ్చి ఆ చెట్లు పడగొడితే, అప్పుడు శాపవిమోచనం అయితే అప్పుడక్కడ పోతనామాత్యుడు రాస్తాడు 'ఎంతటి కరుణామయుడో, ఆ నారదుడు ఆ మాటలన్నందుకు, అది చెల్లించడానికి ఎంతటి ఎంతటి తిప్పలు పడ్డాడో పరమాత్మ' అని. ఎంతటి అద్భుతం. నీవొక భగవద్భక్తుడవై, నీ వల్ల ఏదన్నా పొరపాటు జరిగితే, అందువల్ల ఇతరులకు మంచి జరిగేటట్లు చూస్తాడు. ఎందుకంటే లేకపోతే నిన్ను తిట్టిపోస్తాడని. మాములు చిల్లర మల్లర కోరికలు తీర్చడమే కాదు, అట్లా కాస్తాడు. ఏ కోరికైనా తీరుస్తాడు. సైంధవుడ్ని చంపేస్తాను సూర్యాస్తమయంలోగా అని అర్జునుడు అంటే, ఎన్ని తిప్పలు పడతాడు అతడి కోరిక తీర్చడానికి. ఉత్తర గర్భంలో శిశువు చచ్చిపోతే, ఉత్తర ఏడ్చింది 'నీ మేనల్లుడు ఎలాగూ పోయాడూ, వీడ్నన్నా చూస్తావా' అని. చేసిపెట్టాడు. ఏ కోరిక నువ్వు పరిపూర్ణమైన భక్తి శ్రద్ధలతో కోరి చేస్తావో అవి తీరుస్తాడు. అతన్నే కోరావా అతన్నే ఇచ్చుకొంటాడు.

## ౪౪౨ ఆశ్రమః

సమస్తమునకు ఆయనే ఆశ్రయము. అందుకే ఆయనే ఒక ఆశ్రమము. ఏ జీవుడైనా అక్కడకు చేరుకుంటే స్వస్థానానికి చేరుకున్నట్లు. భగవంతుడి పాదముల వద్దకు చేరాలని మహాత్ములంతా తహతహలాడుతూంటారు. విష్ణు పదము అంటారు. ఇది ధృవపదమునకు పైన ఉంటుంది. భాగవతంలో వుంటుంది చూడండి. విష్ణు పదంలో వుంటే సృష్టి అంటకుండా సృష్టిని అనుభూతి చెందవచ్చు. ఇది మనలో కూడా ఉంటుంది. అక్కడ కూర్చొని దీన్నంతా నిర్వర్తించుకోవడం ఎలా ఉంటుందంటే, ఒడ్డున కూర్చొని నదిలో విషయాలు నిర్వర్తిస్తూండడం. అదీ ఆశ్రమం. ఆయన యందు కూర్చుంటే ఒడ్డున కూర్చున్నట్లు. ఆయన యందు కూర్చోకుండా నిర్వర్తించుకున్నట్లుగా వుంటే చిక్కులు వస్తాయి. అసలు ఆశ్రమం అనే పదం లో కొన్ని లక్షణాలున్నాయి. 'ఆ' అనే అక్షరం అంతర్యామి అయిన భగవంతుని సంకేతిస్తుంది. ఎందుకంటే అక్షరాలలో 'అ' నేను అని విభూతియోగం లో చెప్పాడు. ఆశ్రమములో ౨ 'అ' లు వున్నాయి. అంటే పరిపూర్ణమైన రక్షణ ఇచ్చే, సాన్నిధ్యం లభించే స్థితి వున్నది. అది కేవలం నీ భావన చేత భగవంతుని సాన్నిధ్యంలో కూర్చోవచ్చు. అప్పుడు ఆశ్రమంలో ఉన్నట్లు. గురువుగారి ఆశ్రమంలో వున్నాం అంటే గురువు స్మరణ చేత గురువు సాన్నిధ్యంలో వున్నట్లు. గురువుకి ఓ building ఆశ్రమం కాదు. గురువు గారి ఆశ్రమం Etheric Plane లో వుంటుది. అందులో తనకి అత్యంత ప్రియమైన భక్తులకి స్థానం వుంటుంది. వారెప్పుడూ అక్కడే వుంటారు. భావము చేత అక్కడికే చేరుకుంటూంటారు. ప్రతి రాత్రి నిద్రలోకి వెళ్ళేముందు అక్కడికి వెళ్తున్నామనే భావన చేసుకుని అక్కడకు వెళ్ళండి. అదొక పద్ధతి. Now I depart for my Master's Ashram and rest, sleep over there or enjoy His presence and in the presence of His disciples, who are seniors to me. మన కన్నా మొగాళ్ళు బోలెడు మంది ఆయనతో వుంటారు. మనకి తెలీదు. భావమాత్రం చేత సాన్నిధ్యం ఏర్పర్చుకోవచ్చు. Road మీద తిరుగుతున్నా, భావ మాత్రం చేత అక్కడ ఆశ్రమ నిర్మాణం జరుగుతుంది. అది సాన్నిధ్యము ఇచ్చేది. సాన్నిధ్యమునిచ్చే భగవతత్త్వము. 'అ', 'శ్ర' అనే అక్షరాల్లో శమము కలుగుతుంది. అంటే అక్కడికి చేరుకుంటే

ఎంతో హాయిగా ఉంటుంది. ప్రతివారికీ తమ గురుస్థానం చేరుకుంటే ఎంత హాయిగా వుంటుందీ? రాబుద్ధి కాదుగా! గురువు యొక్క భౌతికమైన ఆశ్రమం చేరితేనే అంత బాగుంటే, మరి దివ్యమైన గురు ఆశ్రమం చేరితే ఇంక ఎంత బావుంటుంది? అందుకని శమము నీ సొత్తయ్యి ఉంటుంది. నీ భావన చేత ఆయన సాన్నిధ్యము నువ్వు కల్పించుకుంటే. 'ర' అంటే రక్షణ. పరిపూర్ణమైన రక్షణ కలుగుతుంది. 'మ' అనే అక్షరంలో, శబ్దంలో సమస్తమైన సంపద, ప్రేమ, అనురాగము లభ్యమౌతాయి. 'మ' అక్షరంలో ప్రకృతి, తల్లి, అంటే ప్రేమ, ప్రకృతియే సంపద. సమస్తమైన సంపదలు, ప్రేమ, అనురాగం అన్నీ లభ్యమౌతాయి. అదీ భగవంతుని ఆశ్రమము. నీవే ఆశ్రమము. నీవే నాకు రక్షణ. నిన్ను నేను ఆశ్రయించుచున్నాను. నీవు ఆశ్రితరక్షకుడవు. నీ సాన్నిధ్యము ఆశ్రమము. నేను ఆశ్రయించేవాడిని. ఆ భావన చేసుకోవాలి. భగవంతుని మించిన ఆశ్రమం లేదు. గురువు ఆశ్రమం కూడా భగవంతుని ఆశ్రమమే. భగవద్భక్తుడు ఎక్కడ ఉంటే అక్కడ వుంటుంది. ప్రతి భగవద్భక్తుని చుట్టూ ఆశ్రమం ఉంటుంది. మీకు ఆశ్రమం లేదా అంటూంటాం. అంటే వూర్కే తిని, వూర్కే పడుకోవడం అయితే ఆశ్రమం అని మన అర్ధం. వాళ్ళేదో ప్రేమానురాగాల చేత మనకి వూరికే పడుకోబెట్టడం, వూరికే తిండి పెట్టడం చేస్తారు. మనకి ఎక్కడ free గా bed, food దొరుకుతుందో అదీ ఆశ్రమం అనుకుంటాం. అది కాదు. గురువు చుట్టూ ఉండేది ఆశ్రమమే! భగవంతుని యొక్క సాన్నిధ్యం అక్కడ దొరుకుతుంది. శమము దొరుకుతుంది. రక్షణ దొరుకుతుంది. ప్రేమ దొరుకుతుంది. అభివృద్ధి దొరుకుతుంది. అదీ ఆశ్రమము. ఈ లక్షణాలు ఎక్కడ వుంటే అక్కడల్లా భగవంతుడు ఆశ్రమ రూపంలో వున్నట్లే. అవే ప్రతి గురువు దగ్గరా దొరికేది ఇవే!

## 883 శ్రమణః

అహర్నిశలూ శ్రమించువాడు. Hard worker. అందుకే There is no substitute for hard work అంటారు. ఇహమునకు గానీ పరమునకు గానీ శ్రమణము అంటే అహర్నిశలూ కృషి. ఆ కృషి రూపంలో వుండేది భగవంతుడే. అంటే నీలో వుండే సంకల్ప బలం. మనం ఈరోజు మొదలెడితే రేపు ఆపేస్తూంటాం. అందుకనే ముందు కృషి! 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్నారు. పక్కమీద పడుకుని, ఒళ్ళు అలవకుండా అన్నీ రావాలంటే ఏవీ రావండీ! సృష్టిలో చేసిన అమరిక అది. ఎంత వ్యవసాయం చేస్తే అంత పంట. వ్యవసాయంలో పరిశ్రమ వున్నది. ఈ రోజుల్లో పరిశ్రమ అంటే industry అనే మనకు తెలుసు. అది కాదు. శ్రద్ధాభక్తులతో కూడిన శ్రమమును 'పరిశ్రమ' అన్నారు. Industry లో కూడా వీళ్ళంతా అలా పనిచేస్తారు. కనకే అది పరిశ్రమ. వ్యవసాయం ఒక పరిశ్రమ. 'విపరీతంగా మార్పు చెందేట్లుగా చేసే కృషి' వ్యవసాయం అంటే. మనలో మార్పులు జరగాలంటే మనమెంత కృషి చేయాలీ? కృషి లేకుండా జరగాలంటే అవ్వవు. ఎన్ని లక్షల మార్పులు జరిగితే మొక్కలోంచి పూవు, చెట్టులోంచి పండు బయటికి వచ్చాయీ? ప్రతి యోగికీ దివ్య శరీర నిర్మాణం జరగాలంటే అలాగే మార్పులు జరగాలి. ఎన్ని లక్షల మార్పులు నీ కృషి వల్ల జరిగితే నీకు దివ్య శరీర నిర్మాణం ఏర్పడిందీ! పాలల్లో ఇమిడి ఉన్న వెన్న ఎంత చిలికితే బయటపడ్డదీ. ఏమీ చేయకుండా అలా ఉట్టెక్కినట్లు స్వర్గానికి ఎక్కుదాం, అనుకుంటాం. అయితే అసలు ఉట్టి కూడా ఎక్కలేం. ఏదో కొక్కెం వేసి దాన్ని దింపేస్తాం తప్పా, మనం ఉట్టి ఎక్కే ప్రయత్నం చేయం. శ్రమపడకుండా వెన్న రాదు. గేదెనో, ఆవునో పోషించి, పాలు పితికి కాచాలి. కాచడం అంటే తపస్సే! (వేడి) శరీరంలో అగ్ని పుట్టించాలి. శరీరధాతువులన్నిటినీ తపస్సుకు గురిచేయడంవలన అవి కాంతివంతమౌతాయి. తేజోవంతమౌతాయి. Radiation జరగాలి. ఆ విధంగా జరగగా కాగిన పాలని తోడుపెట్టాలి. తోడుపెట్టడం అంటే భగవద్భావనే తోడు. వాడ్నే అహర్నిశలూ భావించడం వలన భక్తుడు భగవంతుడైనట్లుగా, తోడు పెట్టడం వలన పాలు పెరుగు అవుతాయి. తోడు అంటే పెరుగే కదండి! అంటే గురువు. గురువు అంతకు ముందు పెరుగైనవాడు కదా! అతడి తోడుతో వాడు నువ్వు అవుతావన్నమాట.

అంతటితో అయ్యిందా! అవదు. తర్వాత నిన్ను చిలుకుతారు. అంతవరకు గురువు తోడ్పతాడండి. ఆ తర్వాత 'ఒరేయ్ మళ్ళీ కలుస్తా' అని మరి అప్పట్లో కనిపించడు. గురువు ముందు స్ఫూర్తినిచ్చి, వీడిహ పక్కదారి పోడులే అని నిర్ధారణ చేసుకున్నాక వదిలేస్తాడు. వదిలేశాక ఇహ వాడికి ఉంటుందీ, విపరీతమైన చిలుకుడు/మథనం. ఆ మథనం జరిగితేనే కదా అమృతం పుట్టేది! ఆ చిలుకుడు అయితేనే కదా వెన్న పుట్టేది! ఇన్ని మార్పులు నీలో రావాలంటే ఎంత శ్రమణం వున్నదీ? నీకు అంతర్గత జీవనమైనా, బహిర్గత జీవితమైనా, సృష్టి నిర్మాణమైనా, ఏదైనా పరిశ్రమ లేక లేదు. ఆ పరిశ్రమ రూపంలో నేనున్నాను. దీనినే క్రియాశక్తి అంటాము. అంటే శ్రమణః అంటే క్రియాశక్తి అన్నమాట. అంటే నువ్వు ఏదైతే గమ్యం గా పెట్టుకున్నావో దానికి తగిన కృషి అహర్నిశలూ వుండాలి. భగవంతుడు సృష్టిని అలా అహర్నిశలూ నిర్వర్తిస్తున్నాడు. నిద్ర లేదండీ! రాత్రి ఇంట్లో పెళ్ళంటే అహర్నిశలూ పనిచేస్తూనే వుంటాంగా. రెండు మూడు రోజులపాటునిద్ర పోకుండా పనిచేయాల్సిందే! గురుపూజలంటే చాలామంది అట్లా అహర్నిశలూ పనిచేస్తారు. వాళ్ళకీ గురుపూజలు! అలాంటి శ్రమ చేత శరీరంలోని ధాతువులలో మూడు పగళ్ళు, మూడు రాత్రుళ్ళూ, అద్భుతమైన మార్పులు వస్తాయి. అందుకనే త్రిరాత్రం! అందుకే సప్తాహం పెడతారు. ఏడు రాత్రులు అదే పనిగా ఆ భావనలో వుండడం వలన సప్తధాతువులలో మార్పులు వస్తాయి. అలాగే పక్షం, మండలం (అంటే 40 రోజులు). అలాగే చాతుర్మాస్యం, నాలుగు నెలలు పెట్టుకుంటారు. ఓపిక! ఏం జరుగుతుందంటే మార్పులు, శ్రమ చేయడం వల్ల వచ్చే మార్పులు. అది చేస్తుంటే మనిషి పలుచన, తేలిక అవుతాడు. లేతపడ్తాడు. దున్నపోతు లాంటిది గంగిగోవు అయిపోతుంది.

## 884 క్షామః

శ్రమముచేత శరీరంలో మార్పులు బాగా జరిగి, కణములు సూక్ష్మస్థితి చెంది తేల్తున్నాడా, నడుస్తున్నాడా అన్నట్లుగా వుంటాడు. అదీ 'క్షామః' అనే నామానికి అర్థం. బాగా తిని పడుకుంటూ వుంటే శరీరం మందం అయిపోతుంది. మత్తెక్కి, అలా కూర్చొని లేవాలంటే బద్ధకం, పని చేయాలంటే బద్ధకం, అందరి మీదా విసుగు, కోపం వుంటాయి. ఇలా శ్రమణం అనే నామం పట్టుకెళ్తే, ముందు రమణ అవడానికి శ్రమణతో మొదలెట్టాలి. అప్పుడూ క్షామః. లేతబడ్తావ్, పలుచన అవుతావు. చిగురుటాకు ఎంత లేతగా వుంటుందో చూడండి! మామిడి పండుకీ, మామిడికొమ్మకీ ఏమన్నా పోలిక ఉన్నదీ? పువ్వుకీ, పువ్వున్న కొమ్మకీ ఏమన్నా పోలిక వున్నదీ? అలా అయిపోతారు. ఎంత లేతబడ్తావంటే, లేతాతి లేత. ఎంత మృదువుగా వున్నాడండీ! అంటాం. అదీ రాముడూ, కృష్ణుడు! చూడగానే Ice అయిపోయేవారు. ఆయన మృదుత్వం చేత ఇంత బండవాళ్ళూ మృదువుగా అయిపోయేవారు. వివశులైపోయేవారు! అదిటా ఆయన. లోపల అత్యంత సౌకుమార్యుడిగా వుంటాడు. పూర్ణమైన మృదుత్వం చెంది వుంటాడు. వెన్నవలే వుంటాడు. సత్త్వగుణ సంపన్నుడై ఉంటాడు. గుణాతీతుడై, సత్త్వగుణమునందు ఉపస్థితుడై వుంటాడు. ఇదీ అసలు లేతదనం. అతనిలో ఇహ రజస్తమస్సులు లేవు. ఎవర్నీ పొడవడు. ఎవర్నీ బాధపెట్టడు. ఎవరికీ తనవల్ల ఇబ్బంది కలగదు. తన కారణంగా ఎవరూ బాధపడరు. తన కారణంగా అందరికి ఆనందము, శాంతి, కాంతి దొరుకుతూంటాయి. అంత లేతపడ్తావ్. అతడలా లేతగా వున్నాడు. ఎంత లేతగా వున్నాడంటే లేతాకు మీద పడుకున్నా ఆకు పడిపోదన్నమాట. అదికదా మర్రాకు మీద తెప్పగా తేలాడు. సూక్ష్మాతి సూక్ష్మమైన, అత్యంత మృదువైన శరీరతత్త్వం నీకు లోపల ఏర్పడి వుంటుంది. అదే దివ్యశరీరం. ఎదుటివాడెన్ని అన్నా నువ్వేం అనవు. నీ నుండి పరుష వాక్యంగానీ, చేతగానీ, నడవడిగానీ వుండవు. ఒక స్పందనాత్మకమైన చైతన్యంగా దివ్యశరీరం కలిగి వుంటావు. అదీ తర్వాత నామం 'సుపర్ణః'.

## 885 సుపర్ణః

సుపర్ణుడు గరుత్మంతుడు. గరుత్మంతుడు అంటే నీలో స్పందనాన్ని నిర్వర్తిస్తున్నవాడు. వాడు సూక్ష్మాతి సూక్ష్మం. అది మనలో వుండబట్టే మనం మొత్తం కార్యక్రమాలన్నీ చేస్తున్నాం. స్పందనమే లేకపోతే ఏమీ లేదు. స్పందనాన్ని అధిష్టించి వున్నవాడు పరతత్త్వమే! స్పందనంగా దిగివచ్చినవాడు పరతత్త్వం! సుపర్ణుడు అంటే చక్కని రెక్కలు గలవాడు. మనవరకూ రెండు ఊపిరితిత్తులు. ఆ రెండూ రెక్కలుగా వున్నాయి. అది కారణం చేత మనం ఉచ్ఛ్వాస, నిశ్వాసలు నిర్వర్తించుకుంటున్నాం. ప్రాణాన్ని బాగా పొందుతున్నాం. సృష్టికి కుడి, ఎడమగా అతడే వున్నాడు. రజస్తమస్సులుగా అతడే వున్నాడు. మైత్రావరుణులుగా, ప్రకృతిప్రజ్ఞలగా అతనే వున్నాడు.ఇట్లా రెండు రెండుగా వుండి, రెంటి మధ్యలోంచి తనే దిగి వస్తూంటాడు. ఇడా పింగళా, పదార్ధము ప్రజ్ఞ. అందుకే యోగి రెంటి యందూ వుంటాడు. పదార్ధము నిరాకరించడు. ప్రకృతిని నిరాకరించడు. ప్రవృత్తిని నిరాదరించడు. నిరాదరణ చేయడు. ప్రకృతి, పురుషుడు రెండూ సమానమే. అమ్మకావాలా, నాన్న కావాలా అంటే ఇద్దరూ కావాలీ అన్నవాడు బుద్ధిమంతుడు తప్ప, నాకు అమ్మ అక్కర్లేదు నాన్న కావాలంటాడా ? వెర్రెక్కిన వేదాంతి తప్ప ప్రకృతి తప్ప దేవుడే కావాలన్నవాడు అమ్మ అక్కర్లేదు నాన్న కావాలన్నవాడి లాంటి వాడు. అమ్మ లేకపోతే నీవు లేవు కదా! నాన్న అక్కర్లేకపోతే అమ్మే లేదుగా. ఇద్దరూ కావాలి. పదార్ధమూ, పరమార్ధమూ. ఈ రెంటి యొక్క మేళవింపే సృష్టి అని తెల్సినవాడు, రెంటితో సమానమైన అనుబంధము, గౌరవం, భక్తి, శ్రద్ధ కలిగి ఉంటాడు. యోగము చెంది వుంటాడు. అందుకనీ ఎక్కడికీ పారిపోడు. సంఘంలో నుంచి కానీ, కర్తవ్యాల్లోంచి కానీ, సంసారాల్లోంచి కానీ పారిపోక ఇదీ, అదీ రెండూ అక్కడే వుండి చేస్తూంటాడు. అందుకనే యోగులందరు సంసారం వదిలి జీవించలేదు. ఉద్యోగాలు, వృత్తి వ్యాపారాదులు వదిలి జీవించలేదు. సామాన్య మానవుని వలె సమస్తమునూ నిర్వర్తిస్తూ అటూ, ఇటూ రెండు పక్కలా ఉన్నారు. అదీ యోగం! పెళ్ళాంపిల్లల్ని వదిలేశాట్టా అంటే, వాడు గొప్పవాడు కాదు చేతకానివాడు అని అర్ధం. సంఘంలో చేయవలిసిన కర్తవ్యాలు మానేశాట్ట అంటే, గొప్పవాడు కాదు చేతగానివాడు అని అర్ధం.

అందుకే సన్యాసికి, యోగికి చాలా తేడా వుంది. సంఘము మీద బతికేవాడు కాదు యోగి, సంఘమునకు కూడా సేవ చేసుకుంటూ బతికేవాడు. He is not a vampire. దయ్యం లాగ, భూతం లాగ వాళ్ళమీదా, వీళ్ళ మీదా పడి తినడు. దయ్యం, భూతం ఆవహిస్తే వాడు విపరీతంగా తింటాడు. తినేవాడికేం అది చేరదు. వాడు పీనుగు అయిపోతూంటాడు. తిన్నవాడు పెరగడు. తినేది మాత్రం పదిమంది తిండి. అప్పుడే కదా వీడికి దెయ్యం పట్టిందంటారు. అలా పదిమందివి మేస్తూంటాడు, దైవం పేరు చెప్తూ. అందరి డబ్బులు వాడివే. అన్ని కార్లూ, ఇళ్ళూ వీడివే. వీరందరి మీదా పడి బతుకుతూ ఉంటాడు. తన జీవితం తను బతుకుతూ పదిమందికి పంచిపెట్టేవాడు యోగి. అంతే గానీ అందరి మీదా బతికేవాడు కాదు. సుపర్ణుడని అందుకే చెప్తున్నారు. కుడి, ఎడమ రెంటి యందు అనురాగం కలిగి నిర్వర్తిస్తూంటాడు. రెండు రెక్కలని సమానంగా కదిపితేనే కదా ఆకాశంలోకి వెళ్తాం. ఒకరెక్కే కావాలంటే ఆకాశంలోకి ఎలా వెళ్తావు. రెండు రెక్కలూ చక్కటి బలం కలిగినపుడే కదా పక్షి ఆకాశంలోకి లేస్తుంది. అలాగే రజస్సు, తమస్సు సమన్వయం చేసినపుడే నీవు సత్త్వంలో నిలబడి ఊర్ధ్వముఖంగా వెళ్ళగలుగుతావు. పదార్ధానికీ, పరమార్ధానికీ రెంటికీ సమన్వయించుకోవడం వలనే కదా చైతన్యంలో నిలబడి ఊర్ధ్వగతి చెందుతావు. సుపర్ణుడు ఎంతవరకు వెళ్ళాడూ? అడవిలోంచి బయల్దేరి, దారిలోని సమస్తదేవతలనూ, ఇంద్రుడ్ని కూడా జయించుకుంటూ, అమృతత్త్వం పొందేవరకూ వెళ్ళినవాడు కదా సుపర్ణుడు. అమృతభాండాన్ని మళ్ళీ భూమి మీదకు తెచ్చినవాడు కదా సుపర్ణుడు. మనలో కూడా స్పందనాత్మకమైన చైతన్యంతో అనుసంధానం చెంది 'అదే మనం' అని తెలిసే స్థితిలో మనలో అమృతావతరణం జరుగుతుంది. అంతవరకూ అమృతావతరణమేం లేదు. మనలో స్పందనంగా అలా విచ్చుకోవడం, ముడుచుకోవడంగా జరుగుతోంది హృదయంలో. అందుకే భగవంతుడక్కడున్నాడని చెప్తారు. ఎందుకంటే హృదయము అంటే 'Hrit, I am' 'నేనిక్కడున్నాను' అని చెప్తుంది. హృత్ అయంమే అంటే I am here, I am here, I am here అనే message స్పందనం వద్ద వస్తూంటుంది. ఇహ వాడ్ని ఎక్కడో వెతుక్కోడం ఎందుకూ అక్కడే వున్నాడుగా. సుపర్ణుడిగా తాను దిగి వస్తాడు. అక్కడుంటాడు. నీకు అందుబాటులో వుంటాడు. నువ్వు వాడితో

అనుసంధానం చెందితే, ఏ విధంగా అమృతాన్ని తెచ్చి దాస్యం నుండి విముక్తి చేశాడో, అలాగే స్పందనాత్మక చైతన్యంగా మనల్ని మనం తెలుకున్ననాడు మనకు దాస్య విముక్తి కలుగుతుంది. ఏదో ఒక భావ సముదాయంగా జీవిస్తూంటాం. నేను ఫలానా, ఫలానా ఉద్యోగి, భార్య పిల్లలు ఇలా చాలా పేదరికమైన నిర్వచనం మన గురించి మనం ఇచ్చుకుంటాం మనం చక్రవర్తులం అయ్యుండి. చక్రవర్తులమై ఉండి పేదగా నిర్వర్తించుకోడం వల్ల పేద జీవితం ఉంటుంది. నిన్ను నీవు చక్కగా అవగాహన చేసుకుంటూ యోగములో ముందుకు వెళ్ళు. స్పందనాత్మకమైన చైతన్యమే నీవని తెలిసినపుడు అమృతవర్షమే కురుస్తుంది. అదీ గరుడోపాఖ్యానంగా మనకు మహాభారతంలో ఇచ్చారు. అమృతాన్ని కొని తెచ్చినవాడుఅని. తర్వాతి నామం 'వాయువాహనః' అన్నారందుకే.

## 886 వాయువాహనః

వాయువునెక్కి వస్తాడు. అంటే ప్రాణమే. మనలో పంచప్రాణాలు వాయువు కారణంగానే పనిచేస్తున్నాయి. అందుకనే వాయువాహనుడైన, ప్రాణశక్తిగా ఉన్న భగవంతుడు సుపర్ణుడిగా మనకు అందిస్తూ ఉంటాడు. మనలో వాయువాహనుడిగా ఉచ్ఛ్వాసనిశ్వాసలతో, సంకోచవ్యాకోచాలు నిర్వర్తిస్తూ, మలినములు పారద్రోలుతూ, ప్రాణశక్తిని లోపలికి తీసుకువస్తూ, వ్యానము ద్వారా శరీరమంతా ప్రాణాన్ని వ్యాపింప చేస్తూ, ఉదానము ద్వారా కంఠమునందు ఉపస్థితుడై, అపానము ద్వారా మనలో బొడ్డు కింద ఉండి మలినములు పారద్రోలుతూ, ప్రాణము ద్వారా మనలోకి హృదయములోకి ప్రవేశిస్తూ, ఇలా ఐదు ప్రాణములుగా వాయువు ద్వారా నిర్వర్తింపబడుతున్న ప్రాణ ప్రజ్ఞ ఏదైతే వుందో, అది భగవంతుడిగా చెప్పేది వాయువాహనః అని చెప్పే నామం. వాయువాహనః, సుపర్ణః ఇవన్నీ ఒక గుత్తి. స్పందనం లేకపోతే ప్రాణం దిగిరాదు. ప్రాణం దిగి రాకపోతే వాయువాహనుడే లేడు. వాయువు తోడుగా ప్రాణం దిగి వస్తూంటుంది. ప్రాణం దిగిరావడానికి సుపర్ణుడు పనిచేస్తూంటాడు. అందుకని స్పందనం బాగా ఉన్నంతకాలం మనిషికి ఏ బాధా లేదు. గుండెకేదో జబ్బొచ్చిందనుకున్నా స్పందనం బాగా ఉంటే గుండెజబ్బు నయం చేసుకోగలదు స్పందనం. అది బాగా ఉంటే ఇది బాగు చేసుకోవచ్చు. ఆ స్పందనం కారణంగానే ఈ గుండె కొట్టుకుంటున్నది. గుండె కొట్టుకోడంవల్ల స్పందనం జరగడంలేదు. శ్వాస వల్ల గుండె కొట్టుకోవడం లేదు. శ్వాస ఆపినా గుండె కొట్టుకుంటుంది. శ్వాస ఆపి తాము జీవించి ఉన్నాము అని చూపిన వారే షిర్డిసాయిబాబా, లాహిరిమహాశయులు, మాస్టరు CVV. ఇత్యాదులు. ఎందుకనీ స్పందనాత్మక చైతన్యంగా తాము లోపల ఉన్నప్పుడు బయట నాడి కూడా కొట్టుకోదు. లేడనిపిస్తుంది. కానీ వున్నావు. మళ్ళీ రావచ్చు. స్పందనం ఆధారంగానే శరీరంలోంచి బయటకు వెళ్ళవచ్చు. అదీ పక్షి. నీలో ఉండే జీవాత్మకు రూపం. హంసవలె, పక్షి వలె శ్వేత రూపం కలిగి ఉన్నటువంటి వాడివి. అలా ఆడిస్తూంటాం, ఈ ఊపిరితిత్తులని. అవే రెక్కలు. అందుకే మళ్ళీ ఈ శరీరంలోకి రాగలవు. ఇదీ సుపర్ణుడి కథ. సుపర్ణుడి రూపంలో ఉన్నది ఎవరూ? తనే. ఇది నిర్వర్తించడమే మనలో ఉన్న సామవేదం! క్రియాశక్తి యజుర్వేదం.

స్పందనాత్మక చైతన్యం సామవేదం. మనలో కలిగే సంకల్పములు ఋగ్వేదం. ఆచరణ అధర్వణము. కాబట్టి వాయువాహనుడు. ఆశ్రమంలో చేరుకోడానికి, అది ఆధారంగా ఉన్నప్పుడు మనలో కృషి జరిగి, కృషి కారణంగా పలచబడి, పలచబడ్డ కారణంగా స్పందనాత్మక చైతన్యం అయ్యి, ప్రాణమును మన యందు ఆవాహన చేసుకోగలిగిన స్థితిలోనికి వచ్చి, అమృతత్త్వ స్థితిని పొదుంతాం. ఇలా అవగాహన చేసుకోవచ్చు. ఇన్ని రూపాలుగాను వాడే ఉన్నాడు.

## 887 ధనుర్ధరః

ధనస్సు ధరించినవాడు. భగవంతుని అవతారాలలో ధనుస్సును ధరించి, దండించి, ధర్మాన్ని నెలకొల్పి, అధర్మమును దమించిన అవతారం రామావతారం, కనక ధనుర్ధరుడు అంటే శ్రీరాముడనే ఒక అవగాహన చేసుకోవచ్చు. రాముడు ధనస్సు ధరించకుండా అనే భావనే మనం ఎన్నడూ చేయం. కోదండరాముడుగా, ఎల్లప్పుడూ ధనుర్ధారియై వుండి, రాక్షససంహారం చేయడానికి అప్రమత్తుడైన వాడుగా మనం భావన చేసుకుంటాం.

నమః కోదండహస్తాయ, సంధీకృత శరాయచ,
ఖండితాఖిల దైత్యాయ, రామా ఆపన్నివారిణే

అనే ప్రార్ధనా శ్లోకం ఒకటి వున్నది. రాముడెప్పుడూ సంధించిన బాణంతో సంసిద్ధుడై వుంటాడట. తన రక్షణ కోరిన వారికి, రక్షణ అందించి, అధర్మాన్ని ఆచరించే వాడిని ఖండితము చేసీ, రాముడు ఆపన్నివారణ చేస్తాడని ఈ శ్లోకం చెప్తోంది. ముండకోపనిషత్తులో 'ప్రణవో ధనుః' అని ఓ వాక్యమున్నది. ఎవరు ధనుర్ధారి? ప్రణవము అంటే ఓం కారమును ధరించినవాడు ధనుర్ధారి! ప్రణవము అంటే ఓంకారము కదా! అది మనయందు ప్రాణము వలె పనిచేస్తోంది. స్పందనాత్మక చైతన్యముగా పనిచేస్తోంది, మనముండడానికి ఆధారమైనది. ఆ ప్రణవమే భగవంతుని మొట్టమొదటి వ్యక్త స్వరూపము, నాదము. నాదతనువు కలిగినవాడు భగవంతుడు. 'నాదతనుమనిశం' అని మనకు త్యాగరాజు కృతి కూడా వున్నది. నాదం మనయందు వుండడంచేత, మనం ఉండడం జరుగుతుంది. దానిని ధరించి వున్నవాడు సిద్ధుడు లేక ధర్మస్వరూపుడు లేక ఆత్మతత్త్వమును ఎరిగినవాడు. సమస్తమునూ ఎరిగినవాడు ధనుర్ధరుడిగా చెప్తారు. రాముడు ఆ విధంగా ధనుర్ధరుడు. ఓంకారము ధరించినవాడు. అదే మనకు సీతా కళ్యాణంలో ఇచ్చిన ఒక పెద్ద సమస్యపరిష్కారం. ఇతరులకు సమస్యా, జనకునికి పరిష్కారం. జనకుడు ఓంకారం ధరించినవాడు. అతనియందు ఓంకారము బాగా పరిపూర్ణంగా సిద్ధి పొందడం చేత, తాను ఓంకార స్వరూపుడు అని తనకు తాను తెలిసియుండడంచేత, పరిపూర్ణమైన ధర్మాచరణ సంపన్నుడై వుండడంచేత, పూర్ణయోగి అయ్యి వుండడంచేత,

అతని యందు పరిపూర్ణమైన వాత్సల్యం కలిగి శివధనస్సు అతనికి ప్రసాదంగా ఇవ్వడం జరుగుతుంది. అంటే శివధనస్సు అతను కలిగి ఉండడం అంటే ఓంకారం బాగా పరిపూర్ణంగా తనయందు సిద్దింప చేసుకున్నవాడు కాబట్టి. సంకేతంగా Symbolicగా శివధనస్సు ఇవ్వబడింది. ఇవ్వబడిన ఈ శివధనస్సు ఇతరులకు చాలా బరువైన విషయం. ఎవరూ దాన్ని మోయలేరు. జనకుడు లోపల మోస్తున్నాడు. పుట్టిన అమ్మవారు సీతాదేవి దాన్ని అలవోకగా కదిలించివేసింది. అంటే ఆమె యందు కూడా అదే విధమైన చైతన్యస్థితి వున్నదని అర్థం. కనక చైతన్యవతియైన కన్యకు, అంతకు సమానమైన చైతన్యవంతుడ్ని ఇచ్చి వివాహం చేయడం తండ్రి ధర్మం. లేకపోతే వరహీనం అవుతుంది. మాములుగా ఎక్కువ సంస్కారం గల స్త్రీ, తక్కువ సంస్కారం గల పురుషుడ్ని పొందితే చాలా కష్టాలు పడుతుంది. ఎక్కువ సంస్కారంగల పురుషుడు తక్కువ సంస్కారంగల స్త్రీతో అనుబంధం ఏర్పరుచుకుంటే అంత బాధ వుండదు. అందుకనే సంస్కారం ఎక్కువగా భార్యకన్నా భర్త యందు వుండడం సముచితం. ఈ ఉత్తమ సంస్కారం ని ఆ స్త్రీ అనుసరించి వెళ్తుంది గాబట్టి. భర్తననుసరించి వెళ్ళే సంప్రదాయం మనది కాబట్టి, అట్లాంటి సమయంలో భర్తకు సంస్కారం లేకపోతే భార్యకు చాలా కష్టం. భర్తకు పవిత్రమైన భావాలు లేకపోయినా, పవిత్రమైన ఆచార సంపద లేకపోయినా, పవిత్రమైన భావము, ఆచార సంపద, దైవభక్తి ఉన్న స్త్రీ లోపల జీవపరంగా అక్కడ చాలా కష్టపడుతుంది. అందుకే ఈమెకు భర్తగా తీసుకురావలసిన వరుడెవరో అతడూ ఈమెతో సమానుడో, ఈమెను మించినవాడో అయివుంటే బావుంటుందనే ఉద్దేశ్యంతోనే జనకుడు ఆ శివధనస్సు ఎక్కుపెట్టడం అనే పరీక్షను ఒకటి ఏర్పరిచాడు. అది కారణంగా జీవచైతన్యం బలము తెలిసే పరీక్ష ఇది. అదీ జనకుడు నిర్దేశించినది. అది విశ్వామిత్రునికి తెలుసు. వశిష్ఠాది మహర్షులకూ తెలుసు. అందుచేతనే రాముడు తప్ప ఇంకొకరెవ్వరూ ఆ ధనస్సు ఎక్కుపట్టే పరిస్థితి లేదు. కారణం ఏమిటంటే అతడు సహజంగా ధనుర్ధారి. ఎల్లప్పుడూ ధనుస్సును ధరించినవాడు. అంటే ఓంకారమును ధరించినవాడు. ధర్మస్వరూపుడు. అలాగే శ్రీకృష్ణుడూను, అలాగే అవతారమూర్తులూనూ, అలాగే సిద్దులూను, అలాగే మహాత్ములందరూను. వారంతా ఆత్మవంతులై వుండడంచేత ఓంకారమును ధరించి వుంటారు. ఓంకారమును ధరించినవారంతా

భగవత్ స్వరూపులుగా మనం భావన చేసుకోవాలి. అందుకని అక్కడ సీతాదేవితో సరితూగే చైతన్య ప్రకాశము కలిగిన ఒకే ఒక్క పురుషుడు, ఆ సమయంలో శరీరంతో వున్నవాడు రాముడొక్కడే. అందుకే రాముడు ఆ విల్లును అవలీలగా అందుకుని ఎక్కుపెడితే శివుడికీ, విష్ణువుకి అభేదస్థితి కాబట్టి ఆ విల్లు చాలా సహకరించీ, ఉత్సాహంతో విరిగిపోయింది. శివుడి యొక్క ఆనందం అంతటిదీ! ఎత్తినవాడు రాముడు కాబట్టే సంతోషంతో విరిగిపోయిందీ. 'శివధనస్సు విరిచేంత మొనగాడివా, విష్ణుధనస్సు అందిస్తాను విరిచిచూడు' అంటూ పరశురాముడు వచ్చాడు. ఏదైతేనేం అదీ ఓంకారమే, ఇదీ ఓంకారమే. అది నేను విరవలేదు.? అదే విరిగిపోయిందంటాడు రాముడు. మనలాగ పరశురాముడికీ ఆవేశం. అది ఆవేశావతారం. అందుకే రాముడికీ, కృష్ణుడికి లాగ పరశురాముడికి సహస్రనామాలు లేవు. ఎందుకంటే మనక్కూడా ఆవేశంగా తలలు తెగ్గోసే తత్త్వాలు మనకి వస్తాయనీ, ఆ అవతారాల్ని ఎక్కువ ప్రార్ధన చేయడం వుండదు. అదేదో అదొక ప్రత్యేక కార్యంమీద వచ్చి ధర్మాన్ని నిర్వర్తించిన అవతారాలు. మనకి పూర్ణమైన మానవ అవతారంగా రాముడు, పూర్ణమైన అతి మానుషీతత్త్వమూ, అసలు దైవము దేహంలో వుంటే ఎట్లా వుంటుందని చూపడానికి కృష్ణావతారము. అందుకని రాముడు ధనుర్ధారి. అందుకనే సులభంగా విష్ణుధనస్సును కూడా అందుకోగలిగాడు. అందుకుంటె ఆయనలో వుండే ఓంకారము, ఈయనలో వుండే ఓంకారము రెండూ అనుసంధానం చెందీ, ఇట్నుంచటు సమస్తము ప్రవహించిందట. ఒక చిన్న magnetని ఒకపెద్ద magnetకి తగిలిస్తే, చిన్న magnetలో వుండేదంతా పెద్ద magnetలోకి వెళ్ళిపోతుంది. సముద్రంలోకి నది కలిసేటట్లుగా, పిల్లనదులన్నీ సముద్రంలో కలిసినట్లుగా, పిల్లకాలువ సముద్రంలో కలిశాక దానికి వేరే అస్తిత్వం వుండదు. నది సముద్రంలో కలిస్తే దానికి వేరే అస్తిత్వం వుండదు. అలాగే రామావతారం అప్పుడు concurrent అవతారం. అంటే అది current, అంతకు ముందుది past. అందుకని దానికన్న ఇది ఎక్కువ బలంగా వుంటుంది. ఇందులోకది ఇమిడిపోతూంటే అప్పుడు పరశురాముడు అర్ధం చేసుకుంటాడు. 'ఓహో! ఇక్కడనుండి అది వెళ్ళిపోయిందక్కడికి. ఇంకిక్కడేం లేదు. మనం మామూలుగా జమదగ్ని కొడుకుగా, బ్రహ్మతత్త్వం ఎరిగిన ఒక ఋషిగా మనదారిన మనం బతికితే బావుంటుందని' అప్పుడు

తెలుస్తుంది. అవతారతత్త్వం వెళ్ళిపోయింది. అర్జునుడిలో కూడా మహాభారత యుద్ధం అయినాక ఆ అవతారతత్త్వం వెళ్ళిపోతుంది. అలాగే మహాత్ముల కార్యాలను నిర్వర్తించే వారిని, మహాత్ములు ఆవేశించి వున్నంతవరకూ చాలా విపరీతంగా, వైభవంగా కార్యాలు జరుగుతాయి. అక్కడ నుండి మహాత్ముని ఆశ్వీరచనం నిష్క్రమిస్తే, వాడు మళ్ళీ ఒట్టి భద్రయ్యే అయిపోతాడు. 'వీర భద్రయ్య వట్టి భద్రయ్య' అవుతాడని తెలుగు సినిమాలో బాగా ప్రాచుర్యం కలిగిన ఓ వాక్యం. అయస్కాంతంతో అనుసంధానం చెందివున్న ఇనుపముక్కకి అయస్కాంతీకరణ వుంటే సహజంగా అది దానిది కాదు. కేవలము తన గురువో, దైవమో వారి అనుగ్రహము చేత వీరి నుండి ప్రసరిస్తుంటుంది. మనమే అనుకుంటుంటాడు, చేస్తుంటాడు. వీరిద్వారా అవ్వాలి. వీడికన్నా వాహిక మరొకడు దొరక్క వాడితో చేయించుకుంటూంటారు. మధ్య మధ్యలో వీడు ఎవడూ లేడు నేనే అని అన్నా, అనుకున్నా 'పోన్లేరా అనుకుంటే అనుకున్నావూ! పనిచెయ్యరా' అంటారు. పనంతా అయినాక వస్తానని వెళ్ళిపోతారు. వెళ్ళిపోతే వీడి దగ్గరేం వుండదు. అర్జునుడి ధనుర్ధరత్త్వం అలా వున్నదని మనకి అనిపిస్తుంది. అర్జునుడూ ధనుర్ధారే. రాముడూ ధనుర్ధారే. అర్జునుడి ధనస్సు భారతయుద్ధం తర్వాత పుచ్చుపట్టింది. తెల్లచీమలు తినేశాయన్నమాట. ఎందుకూ? అది వాడిది కాదు. వాడినావరించి వున్నవాడిదంతా. నిజానికి గొప్ప వాడిది కానీ ఇచ్చింది వాడికి. వీడు వూర్కే విర్రవీగుతూంటాడు. అలాగే శిష్యుడ్ని అనుగ్రహించి, శిష్యుడి ద్వారా పనిచేస్తూంటే, శిష్యుడికి పూర్ణమైన అనుభూతి, ఆత్మవికాసం లేక అంతా తనదే అనుకుంటూంటాడు. అనుకుంటే అనుకోనిస్తాడు. ఎందుకంటే పనవ్వాలి. పనయిపోయింతర్వాత గాలి తీసేస్తారు. అంటే వాడు వెళ్ళిపోతాడు. వాడు వెళ్ళిపోతే వీడి అసలు స్వరూపం ఏమిటో వీడికే తెలుస్తుంది. అదేంట్సార్ ఇలాగున్నారంటే, అదే నాకర్థం కావట్లేదు అంటాడు. అట్లా అర్జునుడికి అర్థం కాని పరిస్థితి ఏర్పడుతుంది. మామూలుగా అడవుల్లో కొమ్మలతో తయారు చేసిన బాణాలతో ఈయన్ని కొట్టిపారేస్తారు. ఇంత శస్త్రాస్త్రాలను సంపాదించుకున్న మహాయోధుడినీను. అంటే ఇదంతా సహజమైనది కాదు. దైవము ఆవరించి ఉన్నది. ఆయన అందులో వున్నంతసేపే మన గొప్ప. అందులోచి బైటకు వస్తే ఒట్టి భద్రయ్యలమే. అందులో వుంటే వీరభద్రయ్యలం. రాముడిది అలాగ కాదు.

నిజమైన ధనుర్ధారి. శివధనస్సు అలా తేలిపోయింది, ఆయన చేతిలో. విష్ణుధనస్సూ తేలిపోయింది. 14వేలమంది రాక్షసులు ఒక్కసారి మీద పడితే? ఆ సన్నివేశం చదువుకోవాలి. 'ఖండితాఖిల దైత్యాయా' అనేది మనకు కనిపిస్తుంది అక్కడ. ఏంటా గొప్పతనం ఏమిటసలు? 14 వేలమంది రాక్షసులు సరదాగా గురుపూజల్లో చూడడానికి వచ్చినట్లుగా వచ్చి కలిసి అందరూ గభాల్న వారి వారి ఆయుధాలని మీదకు విసిరారుట. వాళ్ళు విసిరే లోపల ఈయన తన విల్లెకు అల్లెతాడు ఎక్కించి, బాణం సంధించి, రెప్పపాటు కాలంలో వదిలితే 14వేలమందీ ఒక్కసారి చచ్చారుట. ఒక్క బాణంతో 14 వేలమంది చచ్చారుట అంటే మనం వూహించగలమా? ఈ వార్త రావణుడ్ని చాలా కలత పెడుతుంది. అదీ రామబాణం! రావణాసురుడ్ని చెవిలో పెట్టుకుని నాల్గు సముద్రాలలో స్నానం చేసివచ్చాడు వాలి. వాలి చాలా నిష్ఠాగరిష్టుడు. వెధవపనులు చేస్తున్నా, మరొకపక్క దైవబలం కూడా పెంచుకొంటాడు. అందుకే సుర్యుడి పుత్రుడు అయినా సుగ్రీవుడు ఏం చేయలేకపోతాడు. ప్రార్ధన చేస్తూంటే వాడికైనా, వీడికైనా ఇచ్చేస్తూంటుంది దైవం. పరతత్త్వానికి అన్నీ ఒకటే. దొంగ శివాలయంలోకి వెళ్ళి ఈరోజు బాగా దొంగతనం జరిగితే నీకు అభిషేకం చేయిస్తానంటే 'శుభం' అంటాడు శివుడు. ఇంకొకడు నా ఇంట్లో దొంగలు పడకుండా చూడు అంటే 'శుభం' అంటాడు. ఇద్దరికీ ఆశీర్వచనం వుంటుంది. ఎందుకూ? దొంగతనం చేయబడి వుండాల్సిన కర్మ వున్న వాడింటికే  దొంగ వెళ్ళేటట్లుగా చూస్తాడు. కనక అందరికీ ఒకే ఆశీర్వచనం. అదీ గురుతత్త్వం అదే పరతత్త్వం. అడిగినవాడికి అడిగిందల్లా ఇచ్చేస్తూంటాడు. వాలి కోతిగా పుట్టినా, రోజూ భూమికి నాల్గు ప్రక్కలా వున్న ఉత్తర, దక్షిణ, తూర్పు, పడమర సముద్రాలలోకి వెళ్ళి సూర్యుడికి అర్ఘ్యం ఇచ్చి సంధ్యావందనం చేసి వస్తాడుట. ఇదీ ఆయన ప్రొద్దున కార్యక్రమం. మనకు 6 నుండి 6.15 కార్యక్రమమే అవడం లేదు. ఎందుకంటే కలియుగంలో అలసులు, మందబుద్ధులు, అల్పతరాయులు. ఆయన రోజూ ఈపని చేసుకుంటూంటే ఓ రోజు రావణుడు వచ్చాడుట. వాడేదో అల్లరి చేస్తూంటే వాడ్నిట్లా పట్టుకొని చెవిలో పెట్టుకున్నాడట. పూర్వకాలం ఓ అణాబిళ్ళ అవసరానికి పనికొస్తుందని అలా చెవిలో పెట్టుకునేవారు. ఇప్పుడలా పెట్టుకుంటే ఎందుకూ పనికిరారు. అలా వీడ్ని చెవిలో పెట్టుకుని, పనంతా అయ్యాక చెవిలోంచి ప్రక్కన పెట్టి 'ఏంటి పని,

చెప్పు' అన్నాడట. 'నమస్కారం సార్' అని వెళ్ళిపోయాడు. అట్లాంటి వాలిని ఒక్క బాణంతో చంపడం అంటే సాధ్యమా? రావణాసురుడంతటి వాడ్ని చెవిలో పెట్టుకు తిరిగిన వాడ్ని, ఒక్క బాణంతో పనికానివ్వడం అంటే ఏమిటీ? అదే పెద్ద వార్తగా చెప్పుకునేవారుట ఆరోజుల్లో, 'ఒకే ఒక్క బాణంట, దాంతో చంపేశాడుట' అని. ఇదంతా ఓంకారం యొక్క బలం. అసలు తానే ఓం కారానికి బలం. ధనుర్ధరుడంటే పరతత్త్వమే ఓంకారంగా దిగివచ్చింది. ఓంకారాన్ని ధరించి వున్న తత్త్వం. మరి దానికిహ తిరుగేముందీ? రావణుడితో మరి అన్నాళ్ళు యుద్ధం ఎందుకయ్యా అంటే మిగతా వాళ్ళంతా పోయేవరకూ, మిగతా కోతులన్నీ చంపాలి గదా! ఇవన్నీ ఎవరెవరి accounts వారి వద్ద వుంటాయి చిత్రగుప్తుడి వద్ద. వీడ్ని వాడు చంపాలి వాడ్ని వీడు చంపాలి అని. అవన్నీ అయ్యేంతవరకూ వూరుకోవడం. ఆపైన చంపాలనే భావన రాకపోవడం. రాకపోతే ఇహ అగస్త్యుడు వచ్చి 'నాయనా! ఇహ చాలు. మాకు ఓపిక నశించింది. ఇంక కొట్టేస్తే బావుంటుందని' చెప్పడం అప్పుడు సంహరించడం.

## ౪౪౪ ధనుర్వేదః

రాముడి ధనుస్సే ధనుస్సు. అందుకే ధనుర్ధారి అయిన రాముడు ఎక్కడుంటే అక్కడ రక్షణ వున్నది. అక్కడ ధర్మము వుంటుంది. అక్కడ చుట్టుపక్కల ముట్టుకోడానికి లేదు. అగ్ని స్వరూపం. రామభక్తుడ్ని ముట్టుకుంటే పేలిపోతారు. ఎందుకంటే రామభక్తులు సహజంగా ధర్మాత్ములు. ఒకొక్క దేవతని ఆరాధిస్తూంటే ఒకొక్క గుణం వాడిలో విజృంభించి, ఆదేవతకి సంబంధించినది ఇస్తుంది. రాముడి అవతారమే ధర్మం. విగ్రహమే ధర్మం. కనక రాముడ్ని ఆరాధన చేసేవారు పిచ్చిపనులు చేయలేరు. దొంగ పనులు చేయలేరు. అబద్ధం ఆడలేరు. కృష్ణుడ్ని చేస్తూంటే ఇంకా అటువంటి బుద్దులు వస్తే రావచ్చేమో తప్ప రాముడ్ని ఆరాధన చేస్తూంటే అలా వచ్చే అవకాశమే లేదు. అగ్ని బీజం. అందుకే ఆతత్త్వం వీడిలో నిండినపుడు వీడు ధర్మాత్ముడై వుంటాడు. భయపడడు. రామభక్తుడికి భయం వుండదు. 'తక్కువేమి మనకూ, రాముడు పక్కనుండు వరకూ' అని. ఏమీ భయపడడు. ఏద్దైనా ఎదుర్కోగలడు. కారణం రాముడే! అటువంటి ధర్మం మనలో సహజంగా వృద్ధి పొందుతుంది. రాముడి ఆరాధన చేస్తూంటే. కృష్ణుడి ఆరాధన ఇంకొక రకంగా వుంటుంది. దాన్లో ఒక ప్రత్యేకత వున్నది. పురాణాలు చెప్పే పండితులిద్దరూ తమిళదేశంలో వున్నారు. అందులో ఒకాయన జీవితాంతం రాముడి గురించే చెప్పకుంటూ, తమిళ ప్రజల్ని రామస్ఫూర్తి యందే వుంచాడు. అందర్నీ ధర్మాత్ములుగా తయారుచేస్తూ, తన ఉపన్యాసాల ద్వారా ప్రేరణ ఇస్తూ వచ్చాడు. వింటూన్నవాళ్ళు ఎప్పటికప్పుడు ఏవి ఇస్తే అవి తీసుకుని, ధర్మకార్యాలు చేసి, తన కుటుంబ బాధ్యతలు నిర్వర్తించి, ఓ income tax advocate వద్దకు వెళ్ళి, 'అయ్యా నేను చేయవలసిన కార్యాలన్నీ చేశాను. మిగిలిన ధనం ఇది. ఇందులో ప్రభుత్వానికి ఎంత వెళ్ళాలో నాకు సరిగా తెలియదు. కనక ప్రభుత్వానికి ఇవ్వవలిసింది మీరు ఇచ్చేసి, మిగతాది మీరు రాముని పరంగా ధర్మసంస్థ ఏర్పరిచి దానధర్మాలు చేయండి' అని, అప్పచెప్పి వెళ్ళిపోయాడుట. ఎంత గొప్పవాడు. అలాగే కృష్ణతత్త్వము చెప్పే ఓ భాగవతార్ వున్నాడు. ఆయన అద్భుతంగా కృష్ణలీలలు, కృష్ణతత్త్వము భగవద్గీత అన్నీ చెప్తే, చాలా ఇచ్చారు. చాలా సంపాయించాడు. కృష్ణతత్త్వం కదా మరి! ఆయన కుటుంబపరమైన

కర్తవ్యాలను నిర్వర్తించీ, అదే advocate వద్దకు వెళ్ళాడుట, ఆయనకి ఇలాంటి case already వచ్చింది కదా సాధకబాధకాలు already తెల్సినవాడు కదాని! కృష్ణభక్తిలో మరి యుక్తి ఎక్కువ వుంటుంది. వెళ్ళి ఆ advocateకి చెప్పాడటా 'నేను కుటుంబపరమైన కర్తవ్యాలన్నింటినీ నిర్వర్తించాను. పెద్దవాడ్నయిపోయాను. ఇదిగో ఈ మాత్రం ధనం మిగిలింది. ఇది భగవంతుని యొక్క డబ్బు కనక ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా, ఎలా plan చేస్తారో నాకు తెలియదు. అంతా కూడా కృష్ణపరంగా సద్వినియోగం చేయండి' అని చెప్పాడట. ఈ తేడాలు ఎక్కడ నుండి వచ్చాయీ? అది రాముడు, ఇది కృష్ణుడు. ఆ advocate అన్నార్ట 'అదేంటీ ఆయన అలా చెప్పారూ, మీరిలా చెప్తున్నారూ' అంటే 'ఆయన మంచివాడు. రాముడు కదా! ఆయనకి మన ప్రభుత్వం గురించి తెలియదు కదా! ప్రభుత్వం చెడ్డదైతే ప్రభుత్వానికి డబ్బులిస్తే ఏం లాభం. దుర్వినియోగం అవుతుంది. కనక మొత్తం సద్వినియోగం అవ్వాలంటే మీరు ఇందులో ఒక్క రూపాయి కూడా పన్నులకు పోనివ్వకుండా సమస్తాన్ని జీవుల సేవకు వాడండి. ఇదీ నా మనసులోని భావం. ఆ తర్వాత మీరేం చేసుకున్నా సంతోషమే. మీ యందు నాకు పూర్తి విశ్వాసము వుంది' అని చెప్పారు. ఆయన చాలా సంస్కారవంతులైన న్యాయవాది. ఆయన నాతో అన్నాడు. ' చూడు, కుమార్! ఈయన రాముడ్ని, ఆయన కృష్ణుడ్ని ప్రార్ధన చేశారు. ఆయన వచ్చి ఇలా చెప్పారు. ఈయన వచ్చి ఇలా చెప్పారు. ఇద్దరూ దైవ పరంగానే చేశారు. ఏమిటంటావ్' అంటే 'అది వారు ప్రార్ధన చేసిన స్వరూప స్వభావాలండి, అలాగే వుంటాయి' అన్నాను. పరశురాముడ్ని ప్రార్ధన చేసిన వాడెవ్వరూ రాలేదా అని అడిగా నవ్వుతూ. అలాగ ధనుర్ధారి అయిన రాముడి బలం ఏమంటే ఆయన ఓంకారాన్ని ధరించి వుండడం. ఇక్కడ భీష్ముడు శ్రీకృష్ణుడ్ని ప్రశంసిస్తూ 'ఓంకారాన్ని నీవు ధరించి వున్నావు' అన్నాడు. జీవులందర్నీ ఓంకారం ధరించి వున్నది. ఓంకారం గనక వస్తానని చెప్తే మనం పడిపోతాం. ప్రణవం వుండడం వల్ల ప్రాణం వున్నది. ప్రాణం వుండడం వలన శ్వాసాదులున్నాయి. అది కారణంగా మనం వుండడం వున్నది. ప్రణవం ఉండడం, వుండకపోవడం మన చేతిలో లేదు. కాని ఓంకారం సిద్ధించినవారుంటారు. వారు తన్మయులై వుంటారు. తత్ అంటే భగవత్ తత్త్వంతో తాము అనుసంధానం చెంది వుండడం చేత, ఆ పొరలు కూడా

దాటి వుంటారు. వారు చాలా ఉత్తమోత్తమమైన మహాత్ములు. వారు ఓంకారం సిద్ధించిన వారు. వారు సంకల్పమాత్రమున శరీరాన్ని ధరించగలరు. సంకల్పమాత్రం చేత శరీరాన్ని త్యజించగలరు. వారూ ధనుర్ధరులే! ఈ పరతత్త్వం నుండి, అవతారతత్త్వం నుండి మహాత్ముల వరకూ, అన్ని categories లోనూ భగవంతుని దర్శనం ధనుర్ధరుడు అని తెలుసుకోవాలి. చేతిలో ఏ ఆయుధం లేకపోయినా ధర్మరక్షణ అప్పటికప్పుడు చేయగలరు. కృష్ణుని ధనస్సు అంతర్ముఖంగా వున్నది. రాముని ధనస్సు అంతర్ముఖంగాను, బహిర్ముఖంగానూ వున్నది. బహిర్ముఖంగా వున్న ధనస్సు కేవలం ప్రతీకయే. అంతర్ముఖంగా వున్న ధనస్సు దివ్యమైనది. దాని బలమే పనిచేస్తుంది. అందుకే ధర్మం కలిగినవాడు ధనస్సు ధరిస్తే, ఆ ధనస్సు శక్తి వేరు. రాముడు ధనుర్ధారియై వుంటే సేవకునికి ఎప్పుడూ పరిపూర్ణమైన రక్షణమే. అదే ఇక్కడ 'యత్ర యోగేశ్వర కృష్ణో, యత్ర పార్థో ధనుర్ధరః' అని చెప్తారు. ఇక్కడ వాళ్ళిద్దరూ వుండాలి. ఉత్త అర్జునుడు ధనుర్ధారి అయ్యి వుంటే ఉపయోగం లేదు. మనలో కూడా ఆ ధనస్సు వున్నది. ఎక్కడ వున్నది? దండము నందు ఉన్నది. అదే 'rod of power' అంటాం. మనలో వుండే సమస్త శక్తులూ వెన్నెముకలో వుంటే సుషుమ్నలోని ఓం కారంలో వున్నాయి. అక్కడ నుండి ఉద్భవిస్తూ ఉంటాయి. అవి ఎవరైతే పొంది వుంటారో, వారు ఆ దండమును బట్టి ఇతరులను శక్తివంతము చేయుట, శక్తిపాతము చేయుట, ఇతరులకు ఉపదేశము చేయుట, ఇతరులను ఉద్ధరించుట ఇవన్నీ చేస్తారు. మైత్రేయుని వద్ద ఈ భూమి మీద ఎటువంటి జీవులనైనా సరే ఉద్ధరించగలిగే శక్తికి సంబంధించిన దండమున్నదని అంటారు. ఆ దండమిట్లా వుంటుందని చూపిస్తారు. దండానికి ఒక పాము రెండు తలలతో వున్నది మెలికలు తిరుగుతూ కిందకి వెళ్ళి మరల పైకి వచ్చేది చూపిస్తారు. ఆ రెండు తలల పామే మనలో వుండే ఇడా, పింగళ నాడులు. మధ్యలో వుండేది సుషుమ్న. దీనిని 'మంత్రదండం' అంటారు. ఇది వున్నవాడు సమస్తాన్ని దమించి వుండగలడు. ధనుర్వేదము తెల్సినవాడంటే ఓంకారమును తెల్సినవాడు. ధనుర్ధరుడు. ఓంకారాన్ని ధరించి వున్నాడు. ఓంకారము యొక్క సర్వశక్తులనూ తాను పొంది యున్నాడు. దాని యొక్క సమగ్రరూపం తనకై తాను తెలిసి యుంటాడు. అప్పుడు దణ్డః.

## ౭౭౫ దణ్డః

దండము-దండధరుడు. దండించే వాడి చేతిలో వుంటుందని మనం అనుకుంటాం. ఆ దండానికి కొంతే శక్తి. Police చేతిలో లాఠీకర్ర నుండి, మహర్షుల లోపల ఓంకార రూపంలో వుండే ఆయుధం వరకూ రకరకాల దండములున్నాయి. వశిష్ఠుని చేతిలో ఓ చెక్కముక్క వుంటుంది. Power దానిది కాదు. ఆయన్ది. విశ్వామిత్రుడు ఏ బాణాలు వేసినా దానిని అడ్డుపెట్టగా, అది అన్నింటినీ మింగేస్తూంటుంది. పోనీ, అది మనం పట్టుకుపోయి మనింట్లో పెట్టుకున్నాం అనుకోండీ, మనం దాన్ని అడ్డుపెడితే ఏమీ కాదు. మన మొహం పగుల్తుంది తప్ప. ఎందుకూ? అది ఆయన శక్తి. అది ఆయన పట్టుకుంటే, అందులోంచి లోపల వున్న యోగశక్తి వ్యక్తమవుతోంది. తన యందు ఓంకారమును సిద్ధింపచేసుకున్న శక్తి. తానే ఓంకారమని తెలిసిన శక్తి. పరబ్రహ్మతత్త్వమే తానుగా నిలబడి వుండే వాడికి వుంటుందా శక్తి. అతడ్ని ఎవ్వరూ జయించలేరు. అపరాజితః. అందుకే క్షాత్రమైన శక్తి కన్నా, బ్రాహ్మణమైన శక్తి కొన్ని వేల రెట్లు పెద్దదని చెప్తున్నాయి పురాణాలు. బ్రాహ్మణ శక్తి అంటే పరబ్రహ్మ తత్త్వమే తానుగా అక్కడ వున్నాడు. చూడ్డానికి అలా కనిపించడు. విశ్వామిత్రుడు క్షాత్రమైన శక్తి. అంటే తాను పరబ్రహ్మము అని తెలియలేదు. బ్రహ్మర్షి కాలేదు. కాకపోవడం వలన బ్రహ్మర్షితో పెట్టుకుంటే తెమలదు. బ్రహ్మర్షులతో మనం పోట్లాడలేము. మనం బ్రహ్మర్షుల వరకేంటీ మాములు రిక్షావాడితోనే పోట్లాడలేం. మహాత్ములు కూడా బ్రహ్మర్షులతో తలపెట్టి తలవంచుకున్నారు. ఎందుకనీ? ఆయనలోని ఓంకారశక్తి. అసలు మంత్రాలు ఎందులోంచి వచ్చాయి? ఓంకారం నుండి. మరందుకే ఓంకారాన్ని మించిన మంత్రం లేదు. నీవద్ద ఎన్ని చిల్లర మంత్రాలున్నా, వాటన్నింటినీ మింగేసే మంత్రం ఓంకారం. సహజమైన శక్తి అందులో వుంది. అందుకని యోగి ఓంకారమునందు నిలబడి వుంటాడు. హృదయము నందు జరిగే ఓంకారములో తను కూర్చొని ఉంటాడు. ఓంకారమే వ్యక్తమౌతూంటుంది. అది వున్న వాడ్ని 'బ్రహ్మర్షి' అంటారు. అటువంటి వాడ్నీ ఏ శక్తీ ఏమీ చేయలేదూ అదీ దండం. ఇది ఎవరి యందున్నా అది గా వున్నది ఎవరూ? పరతత్త్వమే! భగవతత్త్వమే! అది మనలో వెన్నెముకలో వున్నది. అది వుంటే మనకి వెన్నెముక నెప్పి వుండదు.

నడుములు వంగబడి వుండవు. గోడలెక్కడున్నాయో, కుర్చీలెక్కడున్నాయో అని చూసుకునే పరిస్థితి వుండదు. అదే కూర్చోబెడ్తుంది ఎముకను కూడా. నిట్టనిలువుగా, గడకర్రల్లే వుంటారు. గడకర్రల్లే వుందామంటే అవదు. అది ఏర్పడితే ఇదీ ఏర్పడుతుంది. అందుకే సాధనలో వీడు నిట్టనిలువుగా వచ్చేస్తాడు. ఇప్పడే నిట్టనిలువుగా కూర్చొనే ప్రయత్నం చేయక, చేస్తే నువ్వు చేసే ఆ 10 నిముషాల సాధన కూడా 15 రోజులు postpone అవుతుందీ. అందుకే 'నేను చేసుకుంటాను నాకప్ప చెప్పేయ్. నాకు అప్పచెప్తే, అది నీకు వచ్చేట్లు చేస్తా' అన్నారు కదండీ. 'నీకు అప్పచెప్పే బుద్ధొక్కటే వుంటే చాలు. నేను చేసుకుంటా'. ఎంతసేపూ అప్పలు అప్ప చెప్తాం. 'అప్పలు కాదు ఇది అప్పచెప్పరా' అంటారు. మనది, మన మనస్సుని మాస్టరుగారికి అప్పచెప్పే మార్గం. కానీ అర్పణం కాదు కదా అప్పడం కూడా చేయలేం. అందరూ ధ్యానం ద్వారా దండములోకి పోవాలి. 'నిత్యం ధ్యాయంతి యోగినః'. మనం ఏం ధ్యానం చేస్తాము? సమస్యలే. ఏ సమస్యకు ఏదేవత అయితే better అని చూస్తూంటాం. ఇన్నాళ్ళు విష్ణు సహస్రనామం చేస్తున్నాం, పోనీ నమకం చేద్దామా, ఏమిటీ ఈ రుద్రుడి బాణాలు ఎక్కువని వినాయకుడు. ఇహ ఇంతే. ఆ తర్వాత దుర్గని దసరాల్లో పూజ చేసి, ఈవిడే వుంది కదా అనుకుంటాం. ఆ తర్వాత దీపావళి వచ్చాక అసలు అందరూ ఎందుకు కృష్ణుడు చాల్లే అనుకుంటాం. ఏదీ పట్టుకోం. ఇలా వుంటుంది మన పరిస్థితి. కానీ ఇందరిలో అలా అనిపించేది అక్కడ నుండే. ఏదీ లోపల వుండే మంత్రదండం నుండి. మనలో రెండు తలల పాము వున్నది. చెట్టు కింద గుళ్ళల్లో అలాంటి విగ్రహం పెడ్తే, చుట్టూ తిరుగుతూంటారు కదా. బయట కాదది. లోపలుందిరా. ఒకసారి గుర్తు పెట్టుకో. నీవు ఇది కనక అనుభూతి చెందితే, ఆ లోపల గర్భాలయంలో వుండే ఆయనంటే ఏంటో తెలుస్తుందని పాపం చెప్పారండి. అప్పటికే దేవాలయం గోడలమీద, వాటి మీద చెక్కారు కూడా. 'ఇదేదో సర్పదోషం. అలా ముట్టుకోకూడదు' అలా వుంటుంది మనకి. సర్పదోషం లేకపోతే అక్కర్లేదు అనుకుంటారు. సర్పదోషమే 'కుండలినీ శక్తి' అది త్రిగుణాత్మకమైన శక్తిగా, త్రివిధములుగా అవతరిస్తూంటుంది. అది మనలో, మనము కనక realise అయితే అంటే ఈ భ్రూమధ్యం పైన మూడవ కన్ను ఉన్న చోట, అంటే ఆడవాళ్ళు బొట్టు పెట్టుకునేచోట నుండి అసలు శక్తి విజృంభిస్తుంటే, ఇడ, పింగళ అనేవి అటు పక్కగా విజృంభిస్తూంటే అది ఒక

arc వలే వుంటుంది. ఎప్పుడు ఇతడు స్మరణ చేస్తే, అవి మూడు కలిసి జిగేల్ మని light బయటకు వస్తుంది. అదే మూడవ కన్నులో నుండి బయటకు తీసుకు వచ్చి సృష్టి చేయడం. అది మహాత్ములకు వీలు పడే విషయాలు. ఇదివరకు చాక్షుస మన్వంతరంలో జీవులందరకూ ఇలా వుండేది. ఇటు పక్క విషయాల్లో క్రమేపీ వ్యామోహం పెరగడంతో, అవన్నీ మనకి మూసుకుపోయాయి. వాటిని తెరుచుకోడం కోసమే మనకి ఈ సాధనలన్నీ. ఆజ్ఞలోకి ప్రవేశించినవాడికి 3వ కన్ను తెరచుకుంటుంది. తెరచుకుంటే arch లాగ పనిచేస్తూంటుంది. 10 commandments సినిమాలో మోజెస్ చేతిలో ఓ కర్ర వుంటుంది. ఆ కర్రతో ఆయన ఏదైనా చేసేస్తూంటాడు. దానికి పైన ఓ arch వుంటుంది. దాన్ని 'Aron's rod' అంటారు. దాన్ని నేల మీద పడేస్తే పాము అవుతుంది. చేతిలో పట్టుకుని ఏమి చేయాలంటే అది చేయవచ్చు. అలాంటిదే మైత్రేయుల వద్ద  వున్నదని Theosophical society వారు కొంతమంది రాశారు. మైత్రేయుడు వద్ద వుండడం కాదు. ఓంకారం ఎవరి యందు సిద్ధిస్తుందో వారందరి వద్దా వుంటుంది. అది సిద్ధించిన వారికి అన్నీ అందుబాటులోనే ఉంటాయి. ఎందుకంటే అన్నీ ఓంకారం నుండే వచ్చినాయి. ఆ దండమే ఇక్కడ చెప్పిన దండము. దాంతోనే విశ్వాన్నంతా ధరిస్తున్నాడు. మనలో కూడా అది ఉండడం వల్ల ఈ శరీరము ఇలా నిలబడి ఉన్నది. అది ఉంటే దమించడం సులభం. 'ఎవరైనా వస్తే, రాకుండా తలుపులేసేశారా' అని అడిగారాయన.'అవును' అన్నాను.' అలా వేస్తే, దమయంతి అంటే ఆవిడే! అంటే ఆత్మ నియతి కలిగినదామె. నలుడు అగ్ని స్వరూపుడు. ఆమె వల్లనే ఈయన బాగు పడతాడు ఆత్మ నియతి కలిగినది కదా మరి. సమస్తమును అంతర్ముఖముగా జయించి, ఆత్మతత్త్వమునందు నిలబడినదని అర్థము. దమయితా మరి భక్తవత్సలుడు కదా! ఈ రోజుతో వారందరూ చచ్చినవారి కిందే లెక్క. తీసేయమంటే ఈ రోజే తీసేస్తాను అంటాడు. వీళ్ళేమో మనలాంటి వాళ్ళే. వీళ్ళంతా ఏదో ఒకటి వాగారు కదా! తొడ పగలగొడ్తాననీ, తల పగలగొడ్తాననీ మరి వాటన్నిటి కోసం ఆగాల్సి వచ్చింది.మీరీ మాట అనకుండా వుంటే ఆరోజే వాళ్ళ పని అయిపోయేదంటాడు. అంత సహనం. రాముని అవతారంలో, కృష్ణుని అవతారంలో, క్రీస్తు అవతారంలో సహనం చూడండి. బుద్ధుడి అవతారంలో సహనం చూడండి. మనం ఏ మహాత్ముల జీవితాలు చూసినా వారి యందు సహనం చూడండి. మాస్టారుగారిలో

సహనం చూడండి. మనకందులో ఒక కోటి వంతుకూడా రాలేదని అనిపిస్తుంది. శివానంద మూర్తిగారిలో సహనం చూడండి! మూర్తీభవించిన సహనం ఆయన. బొత్తిగా విసుగు లేదు. ఆయనకు విసుగు రాలేదేమాని మనకు విసుగు వస్తుంది. ఓ రోజు  భక్తమహరాజుగారు పడుకొని వుంటే ఆపక్కన నేను కూర్చొన్నాను. అక్కడి వాళ్ళు నన్నక్కడ కూర్చోబెట్టి తలుపులు వేసేశారు. ఏమంటే ఇప్పుడు rest ఆయనకు. మీరు కూర్చొని ఆయన్తో కబుర్లు చెప్తూండండి! ఇంకెవర్నీ లోపలకు పంపించమూ. ఆయన నిద్రపోతే మీరు మాట్లాడకండి. ఆయన rest తీసుకుంటారు. 'అని ఏదో సదుద్దేశమే. ఆయన ఏం చేశారంటే వీరంతా వెళ్ళేట్లుగా కళ్ళు మూసుకున్నారు. 'ఆయనిహ నిద్రపోతారు, మీరొక్కరే కూర్చోండి. పిలిస్తే మాకు చెప్పండి.' అని నన్ను కూర్చోపెట్టి తలుపులేసుకుని వెళ్ళారు. వాళ్ళలా వెళ్ళిపోగానే ఈయన నన్ను, ఇహ ఎందుకిక్కడ మనం? అని అన్నారాయన. నేను భగవంతుడి భక్తుడ్ని. నాదేవుడు ఎప్పుడూ తలుపులు తెరుచుకుని వుంటాడు. గుడి తలుపులు పూజార్లు మూసేస్తారేమో కానీ దేవుడు మూసేసుకోడు. అలాంటి వాడికి భక్తుడుగా వున్నప్పుడు ఎవరొచ్చినా, ఎలాంటప్పుడు వచ్చినా వారికి కావల్సింది చేయడానికి సిద్ధంగా వుండాలి కదా! నిద్రపోతే ఎలా! నిద్రపోకూడదు. వీళ్ళు కూర్చొంటే వూర్కే పిచ్చి వాగుడు తప్ప ఎందుకని పంపించడానికి కళ్ళు మూసుకొన్నాను' అని చెప్తూ ఎప్పుడు phone వచ్చినా లేరని చెప్పకూడదు, ఎప్పుడు ఎవరొచ్చినా లేరని చెప్పకూడదు, ఎందుకు వచ్చారో కనుక్కొని, వారికి అప్పుడు మనం చేయవలిసిందేమన్నా వుంటే చేసి పంపాలి. అది కదా మరి భగవంతుని మార్గం' అన్నారు. ఆయన ఒక పిడుగు. ఒక రకంగా బైటకు కనిపిస్తారు. అసలు విషయం లోపల వుంటుంది.అలా ఎవరొచ్చినా కాదనకుండా ఆ దండమే ఇక్కడ చెప్పిన 'దండము'. దానితోనే విశ్వాన్నంతా భరిస్తున్నాడు. మనలో కూడా అది వుండడంచేత మన శరీరం ఇలా నిలబడి వున్నది. అది వుంటే దమించడం సులభం.

## ౭౨౦ దమయితా

దేన్నయినా సరే దమింపచేస్తుంది. దమయంతి అంటే ఆత్మనియతి కలిగినామె అని అర్థం. నలుడు అగ్నిస్వరూపుడు. ఆత్మనియతి కలిగిన ఆమె వల్లనే ఈ అగ్ని స్వరూపుడైన నలుడు బాగుపడతాడు. ద్రౌపది వల్ల పాండవులు బాగుపడ్డట్లు. కొంతమంది పెళ్ళి చేసుకుంటే యోగం బావుంటుందంటాం కదా, అందుకే. అంటే ఆవిడ శక్తి కూడా తోడై వీడు బాగుపడతాడున్నమాట. ఆమె సమస్తమునూ అంతర్ముఖంగా జయించి, ఆత్మతత్త్వము నందు నిలబడినదని అర్థం.

## 891 దమః

దమః అంటే సమస్తము నందూ స్వామిత్వము పొందినవాడు. ఏదీ వాడ్ని బంధించదు, ఏదీ అతని కనుసన్నలను దాటిపోదు. అతని ఆజ్ఞ తిరస్కరించి అది మనుగడ కలిగి ఉండలేదు. దమయితా నామంలో అది ఇస్తాడు. అందరి యందూ తమ యందు తాము స్వామిత్వం పొందడానికి ప్రయత్నం జరుగుతూంటుంది. బంధం నుండి బయట పడాలని రకరకాల సాధనలు మనం చేస్తూంటాం కదా. అందులోంచి మనకొచ్చేది, సమస్యని అధిగమించే శక్తి. అదీ దమయితా! ప్రతివారూ, సమస్యలలో కుంగిపోయినవారు కూడా, తనని ప్రార్థిస్తే అది అందిస్తాడు. అదిగా తనలో వున్నాడు కాబట్టి అక్కడ నుండి అది అందివ్వబడుతుంది. అందిస్తే సమస్యను మనమే పరిష్కారం చేసుకుంటాం. అంటే సమస్య కంటే మనం పెద్దవాళ్ళం అవుతాం. అందుచేత సమస్య చిన్నదవుతుంది. చిన్నదయిన సమస్యను సులభంగా పరిష్కరించుకోగలుగుతాం. అందుకనీ ఓంకారాన్ని బాగా సాధన చేస్తే సమస్యలన్నింటికీ పరిష్కారం దొరుకుతుందనేది ఇక్కడ తెలుస్తుంది. ఓంకారం చేస్తూ, ఓంకారం పుట్టినచోటుకు వెళ్ళాలి. అక్కడ బాగా భావన చేయాలి. భావన బజార్లో పడగానే, మళ్ళీ ఓంకారం చేయాలి. ఓంకారం చేశాక, మళ్ళీ అలాగే ఆ ఓంకారం వింటూ, మళ్ళీ అదెక్కడ పుట్టిందో అక్కడకు వెళ్ళిపోవాలి. అక్కడ స్పందనాత్మక చైతన్యంగా గోచరిస్తూంటుంది. దాన్ని మనం పట్టుకోవాలి.? అక్కడ్నుండి మనస్సు మనల్ని మళ్ళీ బయటకు తోసేస్తుంది. అప్పుడు మళ్ళీ మనం ఓంకారం చేయాలి. ఇలా పట్టు విడవకుండా చేస్తూంటే దండం గట్టిపడ్తుంది. అందుకే 1992 లో ప్రత్యేకంగా పరమగురువులు ఇక ఇప్పట్నుండీ బాగా ఓంకారం చేయండీ, మిగిలినవి ఎలా వున్నా అని అన్నారు. మిగతావి మీ ఓపిక. ఓంకారం మాత్రం తప్పక చేసుకోండీ. ఆ ఓంకార ప్రభావం చేత నీలో దమించే శక్తి వస్తుంది. దేన్ని దమించాలీ? వూళ్ళో వాళ్ళని కాదు. నీభావములను, నీకోర్కెలను, నీశరీరాన్ని. దానికి మనం బానిస కదా! సర్వస్వతంత్రుడైన జీవుడు తన భావముల చేత, కోరికల చేత శరీరము చేత బంధింపబడి బానిసలవలె జీవిస్తున్నాడు. ఈ బానిసత్వం పోవాలంటే తను ఓంకారాన్ని ఆశ్రయిచాలి. ఆశ్రయించడం చేత తనలో వీటిని నియమించే, దమించే

శక్తులు వస్తాయి. మనం చెప్పినట్లు మన అన్నమయ, కామమయ, మనోమయ కోశములు వింటాయి. అవి చెప్పినట్లు మనం వినడంగా కాక, మనం చెప్పినట్లుగా అవి వినడంగా తయారు కావడానికి వీలు పడుతుంది.

## 892 అపరాజితః

ఇది లేకపోతే పరాజితులం అయిపోతాం. ఇది వుంటే అపరాజితులం. అసలు మనకి మొట్టమొదట ఇచ్చిన యోగసాధన చాలా సులభమైనది. అందులో బాగా రుచిమరిగినవాళ్ళు, ఎక్కువ ఆ భావనలోనే ఉండాలని తామరతంపరగా పూజలూ, హోమాలు అవీ, ఇవీ పెంచేశారు. మనకి తంపర మిగిలిపోయి అసలు విషయం పోయింది. ఆ రుచి మరిగినవాడు దానికి సంబంధించినదే creativity, సృజనాత్మకంగా అల్లుతాడు. వాడు అందులోకి వెళ్ళడం వల్ల, ఆటగా మారి అల్లి పారేశాడు. వ్యాసుడు విపరీతంగా అల్లేశాడు. శంకరాచార్యులువారు అలా అల్లేశారు. మనం అల్లిక పనుల్లో ఇరుక్కుపోతే లాభం లేదు. వాళ్ళల్లాగ యోగమార్గం లో ఓంకారాన్ని సిద్ధింపచేసుకుని అట్నుంచిటు వస్తే, అప్పుడు మనకి ఆనందం కలిగేటట్లుగా వుంటుంది. భాద్రపద మాసము అంటే తత్త్వం కన్యగా గోచరిస్తుంది. కన్యా స్వరూపంగా ఆరాధన చేసుకుందాం. ఆ కన్యకు పుట్టినవాడే వినాయకుడు. భర్తతో సంబంధం లేకుండా పుట్టాడు కదా మరి! మనలో కూడా అలా కన్యాత్వం చెందితే మళ్ళీ పుడతాం అని తెలియాలి. వీటన్నింటినీ చిలవలుపలువలు చేయచ్చు. వినాయకుడికి సంబంధించి 16 మంది వుంటారు. వాళ్ళ పూజలు ఏవేవో రకరకాలుంటాయి. తొండం ఇటుండే వినాయకుడూ, అటుండే వినాయకుడూ, నిలువుగా వుండే వినాయకుడూ, ఇలా మొదలుపెడ్తే బోలెడు. ఇలా ఇన్ని రకాలుగా కాకుండా ముందు ఓంకారంలోకి వెళ్తే పని సులువు అవుతుంది. యోగమార్గం సరాసరి భగవంతుని వద్దకు చేర్చేది. ఇవి అన్నీ దారిలో ఉద్యానవనాలు. ఉద్యానవనంలో కూర్చొంటే ఎప్పటికి తెములుతుంది? ముందు అటు వెళ్ళి, అటు చూసుకుంటే, అట్నుంచిటు వచ్చినపుడు ఇవన్నీ ఎందుకు, ఎలా ఏర్పడ్డాయో అర్థం అవుతుంది. అలా కాకుండా వీటిలో ఇరుక్కుపోయి అసలు వస్తువును మర్చిపోతాం. అది మనం గుర్తు చేసుకోడానికి చేసే ప్రయత్నమే ఈ విష్ణుసహస్రనామ వివరణల Classes. సూటిగా వున్న విషయం అందుకుని దాన్లో నడిచి, అట్నుంచిటు వచ్చాం అనుకోండీ, బోలెడు పెట్టుకున్నా చేయడానికి శక్తి వుంటుంది. లేకపోతే వూర్కే బరువెక్కిపోతుంది. పౌర్ణమి వచ్చిందంటే భయం. ఎందుకంటే ఓ హోమం చేయాలి, ఓ ధ్యానం చేయాలి.

మహాశివరాత్రి వస్తే అభిషేకాలు చేయాలి అని బరువుగా అనిపించడం లేదూ. ఎందుకిలా అనిపిస్తుందంటే ఈ ఓంకారంలో ఉండకపోవడం వలన. ఓంకారంలో వుంటేనే సులభం అవుతుంది. అందుకే సమస్తాన్నీ దమిస్తుంది. దమించడం చేత సులభం అయిపోతుంది. లేకపోతే శరీరం బరువెక్కి ఇలాగే ఎందుకు చేయాలి, అవెందుకూ, ఇవెందుకూ అని వికారమైన భావనలు వస్తాయి. వీటన్నింటిని జయించి అపరాజితుడుగా చేస్తుంది. అపరం అంటే అది. పరము కానిది అంటే ఇతరము కానిది అని అర్థం. పరులకు వశము అవనిది. దేనికీ ఓడిపోయే స్థితి రాదు. 'జయమ్ము నిశ్చయమ్మురా, భయమ్ము లేదురా' అని వున్నది కదా! అందుకని ఓంకారము. దానినే ఆశ్రయించి, ఎల్లవేళలా దానిలోనే జీవిస్తూంటే నెమ్మదిగా దమం పెరుగుతూంది, ఓడిపోవడం వుండదు. ఎందుకంటే నీలో బలం పెరుగుతున్నది కనక ఓడిపోవడం వుండదు. లేకపోతే మనస్సు నీవొకటి చెప్తే అదొకటి చేస్తుంది. ఎన్ని కార్యక్రమాలకు దీనికెళ్ళరా, దీనికెళ్ళరా అని జీవుడు చెప్తూంటే, కాదులే ఎప్పుడూ ఇదేనా అని ఇంకోదానికి తీసుకెళ్ళదూ? చెప్పేవాళ్ళకీ, వినేవాళ్ళకీ ఇవే కదా బాధలు. ఇవన్నీ దాటిస్తుంది. మనకి తెలిసినదానికీ, మనం ఆచరించే దానికీ బంగాళా ఖాతం అంత gap వున్నది. ఏమి చెయ్యాలో మనకి తెల్సినా అది చేయడానికి కావలిసిన సత్తువ లేక మనస్సు చెప్పినట్లు చేసుకుపోతూంటాం. శరీరం చెప్పినట్లు వింటాం. కోరికలు చెప్పినట్లు వింటాం. ఆ కాస్తా అయ్యాక అలా చేయకపోయుంటే బావుండేదనిపిస్తుంది. ఇవాళ సూర్యగ్రహణం. అదేంటో ఈ సూర్యగ్రహణం తెల్లవారి వచ్చిందీ సారి అనిపిస్తుది. అట్లా చేయం కదా! తెలుసు ఈ సూర్యగ్రహణం, చంద్రగ్రహణం మనల్ని మనం ఉద్ధరించుకోవడానికి మనకు అద్భుతమైన అవకాశంగా కాలం మనకిచ్చిందని. ఏం చేస్తాం? పరాజితులం! అందుకే ఏం చెయ్యండి, ఏం చేయకపోండి ఓంకారం మాత్రం చేయండి. సమస్త మంత్రాలకి, క్రతువులకీ అదే మొదలు. అది లేకుండా మొదలు పెడ్తే ఏమీ లాభం లేదు. ఏ పూజ అయినా దాన్తోనే మొదలు. ఉపనిషత్తులలో ఓంకారం గురించి చాలా చెప్పారు. అంతా అదే కదా! దాన్ని వదిలేస్తే ఒకటి లేకుండా బోలెడు సున్నాలు పెట్టుకుంటూ పోయినట్లే.! దానివల్ల ఏమి లాభం. 1 లేకుండా 7 సున్నాలు పెడ్తే వాటి విలువ సున్నాయే. అదే వాటి ముందు ఒకటి గీస్తే కోటి

అయిపోయింది. అలాంటిదీ ఓంకారం. ఓంకారం చేయడం వలన అపరాజితః.

## 893 సర్వసహః

సమస్తాన్నీ సహిస్తాడట. భగవంతుడు, అవతార పురుషులు, మహాత్ములు సహించడం ఎక్కువగా ఉంటుంది. సాధనపరంగా అందుకే ముందుగా చెప్పేది క్షమ. సహించు. ఏదైనా, ఎటువంటిదైనా సహించు. ఓర్పు, క్షమ. భక్తియోగంలో భగవంతుడు 'నా భక్తుడు క్షమి అయి ఉంటాడు' అంటాడు. దేన్నయినా క్షమించగలిగి వుండాలి. క్షమించడంలో ఏసుక్రీస్తే! మేకులు కొట్టినా క్షమించేశాడు. మేకులు కొడుతూంటే 'తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరికి తెలియదు. కావున వీరిని క్షమించు.' అన్నాడు. ఎంత క్షమో! మాస్టర్ EK గారు భాగవతంలో రాస్తారూ 'ఇటీవలి 20 శతాబ్దాలలో అంత క్షమాగుణం చూపినవాడు కనబడడు' అని. అందుకనే మనకు ఆరాధ్యుడు. భగవత్ గుణం మనకలా కనిపిస్తుంది. కాస్తో కూస్తో ఈ శతాబ్దిలో గాంధీ మహాత్ముడిలో చూస్తాం. బాగా శని దట్టించి వుంటే గానీ క్షమ వుండదండీ! భరిస్తారు. ఎంతయినా భరిస్తారు. Complaint వుండదు. భగవంతుడు భరించే దాని కన్నానా? ఎంత భరిస్తాడూ? ఎంత దురాత్ముడినీ, దుష్టుడ్నీ భరిస్తాడు. పాముల్నీ, జెర్రుల్ని భరించి వున్నాడు. ధరించి వున్నాడు. కనక ఆయన సర్వసహః అని చెప్పడం గొప్ప విషయం కాదు. ఇక్కడ కృష్ణుడు సర్వసహః. మహాత్ములంతా అన్నిటి యందూ సహనం కలిగి వుంటారు అని ఒక అర్థం. అన్ని విధములైన సామర్థ్యం కలిగి వుంటారనేది ఒక అర్థం. సామర్థ్యం వున్నవాడే సహించగలిగిన స్థితి కలిగివుంటాడు. ఎవరికి సహనం వుంటుందంటే, సమర్థత వున్న చోట సహనం వుంటుంది. సమర్థత వుండి సహనం లేని వాడి కన్నా, సమర్థత వుండి సహనం వున్నవాడు ఎక్కువ బలవంతుడు. ఏ సమర్థత లేనివాడు 'అసమర్థుని జీవిత చరిత్ర' అని ఓ పుస్తకం రాశాడు. అసమర్థుడికి అన్నింటియందు కోపమే, విసుగే, ఆరోపణలే! Complaints! ఎందుకంటే మనవద్ద లేనిది ఇంకోడి వద్ద చూస్తే complaint గానే చూస్తాడు. మనదగ్గర వుందనుకోండీ అలా వుండదు. అన్ని సమర్థతలలోకీ పెద్ద సమర్థత సహించడం! కృష్ణుడు అలా కంసుడు చేసేవీ, దుర్యోధనాదులు చేసేవీ, జరాసంధుడు చేసేవీ సహించాడు. ప్రతివాడు చేసే దరిద్రపు పనులు సహించి, వారు కోరి 'చంపరా, చంపరా' అని వస్తే చంపాడు. మీద పడి చంపమని

అడిగితే చంపాడు, లేకపోతే చంపేవాడు కాదు. ఈయనలో Killing instinct లేదు. ఎదుటి వ్యక్తిలో వుండడం వల్ల అది కోరుకుని చచ్చిపోతూంటారు. నీవేది కోరితే అది ఇచ్చే తత్త్వం ఆయనది. జరాసంధుడు ఒకడు చాలా ధర్మం తెలిసీ, చాలా జ్ఞానం తెలిసీ ఒకరకమైన వికారం. వాడ్ని అవుననాలా, కాదనాలా. భరించాడు. వాడి తద్దినం వాడే పెట్టుకుంటాడన్నట్లుగా జీవించాడు కృష్ణుడు. ప్రతివాడు వాడి తద్దినం వాడు పెట్టుకునే వరకు వేచి/ సహించి ఉన్న అవతారంగా కనిపిస్తుంది. పూతన నుండి చిట్టచివరివరకూ అందరూ ఎవరి తద్దినాలు వారు ఈయన్ని పిలిపించి పెట్టించుకున్నవారే. అంత సహనమా? కొట్టెయ్యాలంటే ఎప్పుడో కొట్టేయచ్చు. మధ్యలో ఎప్పుడో అంటాడు. 'కొట్టెయ్యాలంటే ఎప్పుడో కొట్టేయచ్చు, కానీ అట్లా కొట్టేయ్యకూడదు కదా!' అని. ద్రౌపదికి అవమానం జరిగినపుడు కృష్ణుడికి కోపం వస్తుంది. ఎందుకంటే భక్తవత్సలుడు కదా! ఈ రోజుతో వీళ్ళంతా చచ్చిన వాళ్ళకింద లెక్క. తీసెయ్యమంటె ఈ పూటే తీసేస్తానంటాడు. వీళ్ళేమో మనలాంటి వాళ్ళే. వాళ్ళ అంశలుగ మనం పుట్టాం. ప్రతివాడూ ఏదో ఒక శపథం చేశాడు. మరి వాటన్నిటి కోసం ఆగాడు. ఇన్ని మాటలు ఆడకుండా ఉంటే అసలు ఆ రోజే అంతా అయిపోయుండేది అంటాడు. అంత సహనం తర్వాత చేస్తాననడానికి రేపు నువ్వుంటావో, వుండవో. ఈబుద్ధి వుంటుందో, వుండదో. ఈమాట అన్న రాత్రి నుండే గుంజాటన మొదలు అవుతుంది. అంత అనకుండా వుండి వుంటే బావుండేదేమో అని ఆ తర్వాత వాడు వస్తే సమకూరలేదనో, శుక్రవారమనో ఇలా చెప్తూంటాం. వాడు వదలడూ, మనకి శక్తి తగ్గిపోతూంటుంది. అర్జునుడు చూడండీ 'రేపు చంపుతా' అన్నాడు. చంపచ్చుగా, రేపు, ఇవాళ అనడం దేనికి! రేపు చంపుతా అనగానే ఇవతలి ఈయనకి చచ్చినంత పని అయింది. నియమం వున్నవాళ్ళు అలా అనరు. కృష్ణుడు అదే అంటాడు. ఆరోజు రాత్రి 'ఎన్ని చెప్పినా మీకు నోటి దూల ఎక్కువరా, మీ ఐదుగురికీ. ఆనోటి దూలతో నేను ఛస్తున్నాను' అని నిజంగా ఇలాగే అని వుంటాడు కృష్ణుడు. వ్యాసుడు పాపం ఇలా అని రాయలేదు గానీ నువ్వు నోటిదూలకి వాడ్ని రేపు చంపలేకపోతే నేను ఛస్తాను అని అన్నావే, రేపు నువ్వు ఛస్తే మీఅన్నయ్య సంగతేమిటీ? నిన్ను నమ్ముకొని వాడు యుద్ధం చేస్తున్నాడు. అసలు వాడికేం అక్కర్లేదు, తుండుగుడ్డ దులుపుకొని వెళ్ళిపోయే Type ధర్మరాజు. ఎప్పుడైనా

శాంతికీ, సంధికీ సిద్ధమే. అందరూ చచ్చి, దుర్యోధనుడు నీళ్లల్లో వున్నప్పుడు కూడా పోనీ 'సంధి చేసుకొందాం' అంటాడు. అసలు సహనం అంటే ధర్మరాజే. ఆయనది భయంకరమైన సహనం. 'కృష్ణుడికి కూడా లేదేమో' అనిపించేంత సహనం. అందుకే ఆయనంటాడు 'ధర్మరాజుకు కోపం రాదు గనకే మీరంతా బతికిపోతున్నారూ, నాకెప్పుడో వచ్చేసింది' అని తనని తాను అంత నియమించుకున్న నియంత. 'The soul is dictator to one's own personality' అని అర్ధం. తన స్వభావం మీద తనకు సంపూర్ణమైన స్వామిత్వం వుండడం నియంత. ఈ పూట నుండి ఇది తిననూ రాత్రి పూట అంటే ఆరోజే ఆ పదార్ధం వండుతారు. పోనీ ఒక్కపూటకీ, రేపు ఆదివారం మొదలుపెడ్దాం అనిపిస్తుంది. ఇంత చిన్న విషయాలకే భయంకరంగా వున్నామే మనం, మనం ఇంక నియంతేంటండీ! దేవతలకి మనల్ని చూస్తే నవ్వులాటగా వుంటుంది.మనం ఏమన్నా అనుకోం గానీ, చూద్దాం ఆరేపు ఎప్పుడొస్తుందా అని అనుకొంటారు. ఈపూటకి ఓడిపోయాడు రేపు చూద్దామని అనుకొంటారట. మనం రేపు కూడా అంతే. ఎన్ని రేపులు పెట్టుకొన్నాం మనం! మన దుస్థితి మనం గుర్తుతెచ్చుకోండీ! అంతరాయం కలుగుతోందా? ఓంకారం చేయి. ఓంకారం చేయడానికీ అంతరాయం కలిగితే ప్రస్తుతానికి ఈ కార్యక్రమం లేదనీ హాయిగా మూడంకె వేసుకొని పడుకో అని చెప్పారు.కేవలం ఆశే తప్ప సంసిద్ధత లేదు. పతంజలి మహర్షి చెప్తారూ, 'అంతరాయము కలుగుచున్నచో ఓంకారము ఆశ్రయించమని' ఓంకారము చేసుకోడం వలన 'అగమార్ధంతు దేవానాం గమనార్ధంతు రాక్షసాః ఘంటారావం కురు' అని చూడడం మాష్టారుగారి వద్ద చూశాం. అర్ధరాత్రి phone వచ్చినా attend అయ్యేవారు. ఎప్పుడు ఏరోగికి అవసరం అవుతుందో, అని phone పక్కన పెట్టుకొని నిద్రపోయిన ఆయన ఆయన. Phone తీసి పక్కన పెట్టి మధ్యాహ్నం పడుకొనేవాళ్ళం మనం, disturbance అని. ఆయనేమో అర్ధరాత్రి కూడా ఎవరికన్నా అవసరం వస్తుందేమో అని ఓ ఎర్ర phone పెట్టుకు పడుకొనేవారు. phone వస్తే ఒక్క ringతో ఎత్తుకొనేవారు. అవసరం అయితే కదిలి వెళ్ళిపోయేవారు. అంతేకానీ చిరాకుపడి, వీళ్ళిట్లా ఈ సమయంలో phone చేయడమేమిటని విసుగుపడేవారే కాదు. అసలు ఎంత సమర్ధవంతుడైతే అలాగ వుండగలరండీ! అసలు మనకి 11 గంటలు దాటితే ప్రక్క కనిపించకపోతే

అంతే. అసమర్థులం. చిరాకు అసమర్థతకు చిహ్నం. సమర్థతకు సహనం చిహ్నం. ఎంత సమర్థుడవైతే అంత సహనం వుంటుంది. రాముడికి అరణ్యంలో ఇబ్బంది కలగలేదు. మనల్ని అసలు ఓ పల్లెటూరికి పంపనివ్వండి. Bathroom లేదూ, Toilet లేదండీ! వేణ్ణీళ్ళు లేవూ ఇలా వుంటుంది. అందుకే మహాత్ముల జీవితాలు ఇలాంటివాటిల్లో చూడాలి. సరాసరి పరబ్రహ్మతత్త్వం కాదు. ఎందుకంటే ఇది దాటని వాడికి అదేమి వస్తుంది? ఉట్టికెక్కలేనివాడు స్వర్గానికి ఎక్కినట్లుగా ప్రతివాడూ ఏదో అమృతత్త్వసిద్ధి అంటే ఎక్కడ నుండి? ఇవన్నీ లేకుండా, ఈ మెట్లు కాకుండానా. అదొక glamour. ఈజన్మకి అది దొరికిపోతే, అమృతత్త్వశరీరం, ఇహ ticket లేకుండా సినిమాకి వెళ్ళిపోవచ్చు. కనబడం కదా మిగతావాళ్ళకీ. Ticket దొరికిందీ లేదు అన్న బాధ లేదు. First day, First showకి వెళ్ళిపోతాం. అందుకే మనకది రాదు. సమర్థత పెరిగే కొలదీ సహనం పెరుగుతుందనేదీ ఈ సర్వసహః యొక్క రహస్యార్థం. సహనం పెరగట్లేదంటే సమర్థత పెరగలేదనే. సహనం, సమర్థత ఒకదానికొకటి జడలా అల్లుకొని వుంటాయి.

## 894, 895, 896 నియంత, నియమః, యమః

నియమించేవాడ్ని నియంత అంటారు. నువ్వు నియంతగా వుండాలి నీ జీవితానికి. ఎందుకంటే ఆయన మనల్ని తనంతవాడిగా చేసి వదిలేశాడండి. 'నా అంతటివాడుగా ఈ సృష్టిలో జీవించు, నీమీద అపారమైన కరుణ చేత ఈ విధంగా నిన్ను నాతో సమానంగా చేశాను. కనక నాతో సమానంగా నువ్వు కూడా వుండూ' అన్నాడు. తనంతవాడ్నిగా ఎవరైనా చేస్తారా? సద్గురువు తప్ప. ఎందుకంటే తనకన్నా వాడు పెరిగితే తనకిబ్బంది. ఏదో ఒక మెట్టు కింద వుండాలి తప్ప మనతో సమానంగా వుండకూడదా! వుంటే ఇబ్బంది కదా! కానీ భగవంతుడు అలా అనుకోలేదు, మానవుడి విషయంలో. తనంతటివాడుగా చేసి వదిలేశాడు. కనక ఆయనెంత నియంతో, మనం కూడా ఆవిధంగా నియంతలాగా వుండాలి. మనయందు మనకి నియతి వుండాలి. అదే ఆత్మనియతి! మనం ఇంకోళ్ళని నియమించాలని చూస్తూంటాం. నిన్ను నీవు నియమించుకుంటూ వుంటే, నీవద్ద ఆవిధంగా నేర్చుకోవడానికి తమ్ముతాము నియమించుకునేవారు చేరతారు. మనం ఇతరులను నియమించడం చేస్తే వాళ్ళు కూడా, ఇతరులను నియమిస్తూంటారు. మాష్టరు EK గారు 1983, జేనీవాలో World Teacher Trust పెట్టిన సందర్భంలో ఇచ్చిన చివరి ఉపన్యాసంలో 'ఏమిటీ మీ Life purpose' అని అడిగితే, ఏంలేదూ, 'నన్ను నేను నియమించుకోవడానికి సదా కృషి చేస్తూ ఉన్నాను. ఇంకా చేయాలి, చేస్తాను' అని చెప్పారు. ఎంత గొప్ప విషయమండీ? అంటే మనం కూడా అదే చేయాలి! ఎవడో మనమాట వినలేదని ఏడవ్వద్దు. నీమాటగా నీలోపల నుండి వినబడే మాటని, నువ్వు వింటేగా ఇంకోడు వినడం లేదనడానికి. చిన్నప్పట్నుండీ నీలోపల 'ప్రొద్దున్నేలే, ఆసనాలు వేయి' అంటే 'ఈనాటికి లేవలేదు. పాతికేళ్ళు అయింది. ఇంక వేస్తావని నమ్మకం లేదు. అయినా చిన్నప్పట్నుంచీ అలా లోపల్నుండీ చెప్తూంటే, ఎందుకలా చెప్తావ్ మర్చిపోకూడదా' అని మనం ఇట్నుంచి చెప్పడం జరుగుతోంది. కానీ దానికి చెప్పడానికి దానికెందుకో అస్సలు విసుగు లేదు. చెప్తూనే వుంటుందీ, మధ్య మధ్యలో 'వినకపోతివి గదా ' అంటుంది. మాష్టరు CVV గారు వేటూరి ప్రభాకరశాస్త్రి గార్ని, భార్యతో తన మంచం మీద పడుకోమన్నారు. 'నువ్వూ,

మీఆవిడా నా మంచం మీద ఈరాత్రి పడుకోండోయ్' అని సలహా ఇస్తే మనలాంటివాడే గురువుగారి మంచం, పెళ్ళాంతో పడుకోవడం ఏమిటీ? అనుకున్నాడు. అసలు చెప్పిందెవరూ? ఇంకోళ్ళెవరో గురువుగారి మంచంమీద మీ ఆవిడతో పడుకోమంటే, పోనీ పడుకోకూడదు. ఆయనే స్వయంగా చెప్పారు కదా! వినయం అనుకుని అఖర్లేదనడం అతి వినయం. పడుకోలేదట. ఆయన. ఇంతకీ ఆయనేదో మంచాయన కనక ఆయనే రాశారు. కనకే మనకి తెలిసిందది. అదే మంచితనం. మనం చేసిన తప్పులు ఇంకొకళ్ళు చేస్తారేమో అని మన తప్పులు కూడా అక్కడ రాసి వుంచడం. Pythagoras అలాగే రాశాడు. 'అయినా చేసి చూద్దామని చేసి నేను చేతులు కాల్చుకున్నాను. Life లో ఎవరికీ guarantee ఇవ్వక, నీకే guarantee లేదు కదా' అన్నాడు ఆయన. 'చేతనైతే ఆ పూటకి చేసేయ్ తప్ప, వాగ్దానాలు ఇవ్వక, చేయలేనివాటికి. నేను మూడు గ్యారంటీలు ఇచ్చాను, మూడు నేనే Pay చేసుకున్నాను'. ప్రతిసారీ Pythagoras 'నువ్వే right, నేను తప్పు' అని ఆయనే చెప్పుకునేవారట. ప్రయత్నించి చూస్తే, మహాత్ములే correct అని తెలుస్తుంది. నువ్వు ఏమన్నా చేయగలిగితే ఇప్పుడు చేయడమే తప్ప, ముందుకు చేస్తాననకూడదు. రేపు నువ్వుంటావో లేదో. ఉన్నా ఈ బుద్ధి ఉంటుందో ఉండదో. వాగ్దానం చేసిన రాత్రి నుండి మొదలవుతుంది అంత అనకుండా ఉంటే బావుండేది కదా అని. కొంచెం తక్కువ చెప్పవలసినది అనవసరంగా ఆవేశపడ్డామేమో అనిపిస్తుంది. ఆ తర్వాత వాడు వదలకుండా వస్తూనే ఉంటాడు, మనం ఏదో రేపు రా, అప్పుడు రా ఇప్పుడు రా అని చెప్పినా. మనకేమో శక్తి తగ్గిపోతుంది. అర్జునుడు చూడండి జయద్రథుడ్ని రేపు సూర్యాస్తము లోపు నిన్ను చంపుతా, లేకపోతే నేను అగ్ని ప్రవేశం చేస్తానంటాడు. రేపు చంపుతానని ఇవాళ చెప్పడం ఎందుకూ? అందుకే కృష్ణుడు చాలా చెయ్యాల్సి వస్తుంది. ఆయన అని ఉంటాడేమో ఎన్ని చెప్పినా మీకు నోటిదూల ఎక్కువ, నేను చస్తున్నాను మీతో అని. ప్రతి వాడికీ నోటి దూలే. రేపు నువ్వు వాడ్ని చంపలేక నువ్వు చస్తే మీ అన్నయ్య ఏమౌతాడు? నిన్ను నమ్ముకుని కదా యుద్ధం చేస్తున్నాడు. మీ అన్నకేమీ అక్కర్లేదు. ధర్మరాజుఅన్నీ దులిపేసుకుని వదిలేసి వెళ్ళే type. ఎప్పుడైనా సంధికి/శాంతికి సిద్ధం. అందరూ చచ్చి దుర్యోధనుడు నీటిలో ఉన్నప్పుడు కూడా ఇప్పుడైనా సంధి చేసుకుందాం, అంటాడు. అసలు భయంకరమైన

సహనం అంటే ధర్మరాజండీ! కృష్ణుడికి కూడా అంత సహనం లేదనిపిస్తుంది. అందుకే కురుసభలో ఎన్నడు కోపం రాని ధర్మరాజుకు కోపం వస్తే మీరెవ్వరూ నిలవలేరని చెప్తాడు. ధర్మరాజు అంత నియమించుకున్నాడు తనను తాను. The Soul is the dictator to ones own personality అని అర్ధం. తన స్వభావము మీద సంపూర్ణమైన స్వాతంత్ర్యం ఉండడం అనేది నియంత. అలా ఉండాలి. ఈ పూట నుండి ఈ ఫలానాది తినకూడదనుకుంటే ఆ రోజు రాత్రే అవి వండి, మన ముందు పెడతారు. పోని రేపట్నుండి తినకుండా ఉంటే సరి అనుకుంటాం. ఇంత చిన్న విషయానికే మనం లొంగిపోతాం, అలాంటి మనకి నియంతా? ప్రతీదీ రేపే. పైవాళ్ళకి అందరికీ నవ్వులాటగా ఉంటుందేమో. అలా అనుకోరుగానీ ఆ రేపు ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తారు. అలా ఎన్ని సార్లు రేపు అనుకున్నాం? ఎన్నిసార్లండీ? అందుకూ అన్నారు నీకు ఏ విషయం లో అయినా అంతరాయం కలుగుతున్నదా అయితే 'ఓంకారం చేయండి'. ఓంకారం చేయడానికే అంతరాయం కలుగుతున్నదంటే ఇక ఇప్పటికి నీకు కార్యక్రమం లేదని, హాయిగా మూడంకె వేసి పడుకోమన్నారు. ఆశే తప్ప సంసిద్ధత లేదు. అంతరాయములు కలుగుచున్నచో మళ్ళీ ఓంకారమును ఆశ్రయించమని, పతంజలి మహర్షి చెప్తారు. ఓంకారం చేసుకోవడం వలన ఆగమార్ధాంతు దేవానాం , దమనార్ధం రాక్షస , ఘంతారావం అని చెప్పి డబడబ గంట కొట్టడమే లోపల ఓంకారం. దేవతలను ఆహ్వానించి, మనలోని రాక్షసులని పంపాలంటే ఓంకారం చేయాలి. అంతరాయాలు కలుగుతున్నాయంటే లోపల అసుర శక్తులు సురశక్తులని దమించి వున్నాయని అర్ధం. కుర్చీలో ఇంద్రుడు లేడని అర్ధం. అంటే మనమే! మనలో దైవీ తత్త్వం చెపుతూంటుంది పొద్దుటే లే, ఏకాదశినాడు చక్కగా వ్రతం చేసుకో, విష్ణుసహస్రనామం చేసుకో, అసలు రోజూ చదువుకోవచ్చు కదా అని. లలితాసహస్రనామం ఆ దుర్గాపూజలు పది రోజులూ చదివాక, రోజూ చదువుకోవచ్చు కదా అనిపిస్తుంది. ఆ మర్నాటి నుండే మానేస్తాం. మళ్ళీ దుర్గాపూజలు రావల్సిందే. మనం లోపల అనుకుని మనం చేయనివి ఎన్ని ఉన్నాయీ? ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయి? స్వామిత్వం లేక! కనక మళ్ళీ ఓంకారాన్ని ఆశ్రయించు. ఈ శ్లోకానికంతా మూలసూత్రం ఓంకారం. నియంత ఎప్పుడు అవుతాడూ అంటే యమ, నియమాదులు పాటించినపుడు. యమ, నియమాదులంటే ఏమిటీ?

పతంజలి యోగసూత్రాలలో భగవంతుని చేరడానికి ఏడు మెట్లున్నాయి. ఎనిమిదవ మెట్టులో ఆయనే వుంటాడు. అందులో మొదటి మెట్టు యమము. రెండవ మెట్టు నియమము, మూడవ మెట్టు ఆసనము, నాలుగవ మెట్టు ప్రాణాయామము, ఐదవ మెట్టు ప్రత్యాహారము, ఆరవ మెట్టు ధారణ, ఏడవ మెట్టు ధ్యానము, ధ్యానము అనగానే భగవంతుని వద్దకు వంతెన కట్టేసినట్లే! ఎనిమిదవ మెట్టు సమాధి. మెట్లల్లో ప్రాథమిక మెట్లుగా కూడా నువ్వే ఉన్నావని చెప్తున్నాడు. యముడు, నియముడు. ఐదురకాల కళ్యాణగుణాలు మనలో ఉంటే యమం, మరో ఐదురకాల కళ్యాణగుణాలు మనలో వుంటే నియమత్వం లభిస్తుంది. ఈ రెండు లభిస్తే నియంతృత్వం, అంటే మనల్ని మనం పరిపాలించుకునే శక్తి లభిస్తుంది. అప్పుడే మనస్సుకు శాంతి. అదీ ఆసనం! అదీ మూడవ స్థితి. 'స్థిర సుఖమాసనం' అంటాడీ స్థితిలో. స్థిరము, సుఖము అయిన ఆసనము మనకు లభించాలంటే మనస్సుకు స్థిరత్వమూ, సుఖమూ ఈ రెండూ వుంటేనే ప్రాణాయామము చేయగలరు లేకపోతే చేయలేరు.అయినా ప్రాణాయామం జరిగేది కానీ చేసేది కాదు. ప్రాణాయామము మనం మొదలు పెడ్తాము, తర్వాతది జరుగుతూంటుందంతే. అది జరగాలంటే మనసుకు స్థిరమైన, సుఖమైన స్థితి కలగాలి. అది కలగాలంటే దానికి ముందున్న రెండు మెట్లూ ఎక్కాలి. అంటే దానికి పది కళ్యాణగుణాలు కావాలి. ఆ పది గుణాలు ఏంటని చూస్తే మనం ఇంకా LKG లో కూడా చేరలేదని తెలుస్తుంది. మన గురించి మనం చాలా అంచనాలు వేసుకోక, మనకేం తెలీదు బొత్తిగా, అనుకుంటే మంచిది. ఉన్నంతలో ఏమీ తెలియని వాళ్ళం. కానీ నీ గురించి ఏదో ఆరాటం వున్నది అని అనుకుంటే సరిపోతుంది. యమము నకు హింసా బుద్ధి లేకుండుట మొదటిది. ఒకరిని మాట వల్లగానీ, చేతవల్లగానీ హింసించడం జరక్కూడదు. అయిపోయింది కదా! ఒక్క Ballకే out. ఒక్క run కూడా ఒక్క రోజు కొట్టలేం ఈ pointతో. రోజూ ఒక్క మనిషిని, కనీసం పనిమనిషినైనా హింసించకుండా వుండలేం. ఏదో రకంగా హింసించడం, సాధించడం చేస్తూనే వుంటాం. కేవలం వాక్కే అక్కర్లేదు. మౌనంగా కూడా హింసిస్తూంటారు. వాడు వస్తుంటే ముందు చూసి పలకరించి నవ్వకుండా అటెటో మొహం పెట్టుకు కూర్చున్నాం అనుకోండీ, వచ్చినవాడికెలా వుంటుందీ? అందుకనే 'అహింసా పరమో ధర్మః'. పరహితం పరమధర్మం

లాగానే ఈ అహింస కూడా పరమధర్మం. అది ఒకటవ classలో మొదటి పాఠం. రెండవది నీకు తెల్సినంత వరకూ సత్యవంతుడవై వుండడం. సత్యము స్థితి భేదం బట్టి మారుతూంటుంది. పూర్ణపురుషుడికి 'ఋతంభర ప్రజ్ఞ' అనీ అన్ని స్థితులలో సత్యం గోచరిస్తుంది. ఒక్కో స్థితిలో ఒకొక్కటి సత్యం. నీ చైతన్యం పెరిగే కొలదీ సత్యం యొక్క స్వరూపం నీలో మారుతూంటుంది. అందుకనే ఒకే విషయం వారివారి సంస్కారాలని బట్టి వివిధంగా గోచరిస్తుంది. రాముడ్నీ, కృష్ణుడ్నీ దైవంగా చూసినవారూ వున్నారు. వ్వారితో మిత్రత్వం వహించిన వారున్నారూ, శత్రుత్వం వహించిన వారున్నారూ, ద్వేషపడిన వారూ, ఈర్ష్య పడినవారు కూడా వున్నారు. ఆకర్షింపబడినవారూ వున్నారు. ఇవన్నీ రాముడిలోనూ, కృష్ణుడిలోనూ వున్నాయా? చూసేవాడిలో వున్నాయి. రాముడొకడే, కృష్ణుడొకడే! ఎన్ని రకాలుగా గోచరించారు? ఇవన్నీ ఎవరికి వారికి సత్యం. కృష్ణుడి గురించి గోపికలకు సత్యం ఒకటైతే, కామవాంఛతో కోరినవారి సత్యం మరొకటి, కంసాది దుష్టాదుల సత్యం మరొకటి, పాండవుల సత్యం ఇంకొకటి. ఇట్లా రకరకాలుగా ఒకే సత్యం గోచరిస్తున్నదే. దాన్నే Truth Levels అనే మంత్రంగా ఇచ్చారు. నీవున్న స్థితిలో, నీకు సత్యంగా అనిపించింది కనీసం ఆచరణ చేయడం ముఖ్యం. సత్యప్రవర్తన కలిగి వుండడం అంటే నువ్వు ఏమన్నా చెప్తే అది చేయాలి. చేయకపోతే సత్యప్రవర్తన లేనట్లే. నీకు సత్యమని తోచింది ఆచరించాలి. నీకు తెలిసినంతవరకు సత్యమునే పలకాలి. దానికివీ అవీ జోడించి misrepresent చేయకూడదు. ఒకటి చెప్తే, ఇంకొంచెం మనది కలిపి చెప్తాం. దొంగ బుద్ధి లేకుండుట. దొంగ బుద్ధి అంటే ఎవరూ చూడకపోతే వున్నది తీసేసుకొందాం అనిపిస్తుంది. ఇవన్నీ కాదు దారిలో దుద్దు కనిపించింది. ఏం చేయాలి? Police stationలో ఇస్తే వాళ్ళే తినేస్తారనిపించి మన దగ్గరే వుంచుకోడం కాకుండా, ఏ దేవాలయం హుండీలోనో వేసెయ్యాలి. నీది కానిది నీవు అందుకోవడం దొంగ బుద్ధి. లంచాలు దొంగబుద్ధి. ఇతరులకు తెలియకుండా వారి నుండి లాభం పొందడం దొంగ బుద్ధి. ఎదుటి  మంచివాడు కనక వాడిది మనం వాడుకున్నా దొంగబుద్ధే. చాలా మంది officers ఇంటికి వెళ్ళి STDలు చేస్తూంటారు. నీదైతే చేయవు. ఇంకొకరిదైతే చేస్తావు. దొంగ బుద్ధి. Local call చేసినా అడిగి చేయాలి. STD అయితే తప్పకుండా అడిగి చేయాలి.

అసలు దొంగ బుద్ధి మనకు తరతరాలుగా, నరనరాల్లో వుందిట. జ్వాలాకూల్ మహర్షి 'ఈ దొంగ బుద్ధి, కామ వాంఛ, ఈ రెండు మీలో బాగా పాతుకొని వుండి పోయాయి. ఇవి తీయడం మావల్ల కావడం లేదు' అని చెప్పారు. ఇవి తీద్దామంటే నరమైనా వచ్చేస్తుంది తప్పా అవి రావడం లేదుట. 'ఎప్పటి నుండి?' అంటే 'ఒకటి త్రేతాయుగం నుండి, మరొకటి ద్వాపరయుగం నుండీను. అప్పటి నుండి మరి జీవులుగా మీరున్నారు కదా. మీలో అలా కలిసిపోయిందీ, మాకూ తోచక తీయాలని చేస్తున్నాం. కానీ ఇదల్లా ఇప్పుడయ్యేది కాదు' అని చెప్పాడాయన. 'మాకు తెమిలేసరికే చాలా కాలం పట్టింది, అయితే మాకు తెమిలింది అనే ధైర్యం ఉంది కనక మీకు కూడా తెములుతుందనే ధైర్యం వచ్చింది. ఆశ వుంది. మాలాగా మీరూ ధృఢసంకల్పులు అయితే తెముల్తాయి', అంటారాయన. త్రేతాయుగంలో major quality ఒకాయన భార్యని ఇంకొకాయన ఎత్తుకుపోయాడు. పరస్త్రీవాంఛ! ద్వాపరయుగంలో పరధన వాంఛ! ధర్మరాజు రాజ్యం ఎంతసేపూ ఎత్తుకుపోవాలనే కదా, దుర్యోధనుడి plan. అసలు రాజ్యం అతడిది. ఏదో సగం చేసి ఇచ్చావూ. దాన్నే మళ్ళీ పట్టుకు పోయారు. పోనీ ఐదు వూళ్ళు ఇస్తావా అంటే, ఎందుకివ్వాలంటాడు. ఇలా పరస్త్రీవాంఛ, పరధనవాంఛ భూతద్దం పెట్టి చూస్తే జాతి చరిత్రలో మనకి రామాయణం, భారతాల్లో కనిపిస్తాయి. హింసాబుద్ధి లేకుండుట, సత్యప్రవర్తనము, దొంగబుద్ధి లేకుండుట, స్త్రీ పురుష కామముపై దృష్టి లేకుండుట, ఇంకొకరి సొమ్మునకు ఆశింపకుండుట. వాడిది మనదైపోతే బావుండుననుకోవడం. ఎవడో మన పేర ఆస్థి రాశాడనుకోండి, వీడెప్పుడు ఛస్తాడాని చూస్తే అది ఆశించడమేను. ఇవన్నీ మనలో వున్నాయా, లేవా? లేకపోతే ఒక మెట్టు ఎక్కేసినట్లే. యమం అన్నమాట. ఎప్పుడూ శుచిగా, సంతోషంగా వుండడం. ఎప్పుడూ సంతోషంగా వుండగలుగుతున్నామా? ఎందుకుండలేం? ఈ మొదటి ఐదు ఎవరి యందు బాగా స్థాపితం కావో, వారు ఎప్పుడూ సంతోషంగా వుండడానికి వీలుండదు. దొంగతనం చేసినవాడు సంతోషంగా వుండగలడా? TVలో policeలను చూసినా వీడికి అదే గుర్తు వస్తూంటుంది. భయం వేస్తుంది. హింసపెట్టినవాడికి తిరిగి హింస వచ్చేస్తుంది కాబట్టి వాడు సంతోషంగా వుండే వీలు లేదు. పరస్త్రీని ఎత్తుకుపోయిన వాడికి నిద్రే వుండదు. పరస్త్రీని కామించిన వాడికి అసలు నిద్రే

వుండదు. విదురుడు మొట్టమొదట ధృతరాష్ట్రుడ్ని ప్రశ్న వేస్తాడు, నిద్ర రాడం లేదంటే 'నీకన్నా బలమైన శత్రువున్నా, పరస్త్రీని నువ్వు వాంఛిస్తున్నా నీకు నిద్ర కరువవుతుంది. ఈ రెంటిలో ఏది కారణంగా నీకు నిద్ర రావడం లేదు' అని అడుగుతాడు. ఆయనకు మొదటిది కారణం. తనకన్నా బలవంతుడైన ధర్మరాజు శత్రువుగా వున్నాడు. శత్రువు ఇతడికే గానీ ధర్మరాజుకి కాదుగా. కనక 'ధర్మరాజు ఎప్పుడు ఏం చేస్తాడో, భీముడు ఎప్పుడు తన వంద మంది కొడుకులను పొట్టన పెట్టుకుంటాడో ' అని ధృతరాష్ట్రుడికి నిద్ర రాదు. పరస్త్రీ వ్యామోహము, దొంగబుద్ధి, హింసాబుద్ధి ఇటువంటివి వున్న చోట ఎప్పుడూ సంతోషంగా వుండడం కుదరదు. శుచిగా వుండుట, అంటే మానసిక కక్ష్యల నుండి చెప్పిన శుచిత్వం. తపస్సు, స్వాధ్యాయం చేయుట. మనం Elementary school వదిలేసి సరాసరి High-school లో చేరాం తపస్సు, స్వాధ్యాయమూ అంటూ. అంతకు ముందువి వుంటేగా తపస్సూ? ఈశ్వరునికి శరణాగతుడై వుండుట. శుచిగా వుండుట, సంతోషంగా వుండుట, తపస్సు, స్వాధ్యాయము చేయుట, సమస్తమునందూ వుండే ఈశ్వరునికి ఆధీనంగా జీవించడం ఈ పదీ కలిపితే 'యమః, నియమః' అవుతాయి. ఇవన్నీ వున్నవాడికి ఆత్మనియతి వస్తుంది. ఇవన్నీ సిద్ధుడికి సహజంగా వుంటాయి. ప్రక్కవాడి డబ్బులు కొట్టేవాడు సిద్ధుడు, మహాత్ముడు అనుకోవడానికి వీలు లేదు కదా! పరస్త్రీవ్యామోహితుడూ, హింసించేవాడూ సిద్ధుడా? మొదలే అహింసా అన్నాడు. అస్తేయః అంటాడు. సత్యం, బ్రహ్మచర్యం ఇలా వున్నాయి. కనక ఈ గుణాలన్నీ మనం గుర్తుపెట్టుకుంటే బావుంటుంది. వీటన్నింటి రూపంలో భగవంతుడున్నాడు. 'ఒక్క అహింస ఆచరించండి, చాలు' అన్నాడు బుద్ధుడు. ఎందుకంటే అప్పటికే మనవారు basics వదిలేసి పెద్ద పాకలు వేసి, యాగాల పేర్న పశువులను చంపడం, నేతులు పారబొయ్యడం, పెరుగులు తినడం చేశారు. బుద్ధుడు, బ్రాహ్మణులు చేసే వికార చేష్టలు చూసీ, అసలు మరచి అక్కరలేనివి చేస్తున్నారనీ, ఇవేవీ పనికిరావు మళ్ళీ ఓనమాలు మొదలు పెడదామనీ వచ్చాడాయన. పూర్ణమైన స్థితిలో వ్యాసాదులు చేశారంటే అర్థం వుంది. వాళ్ళు జగత్కళ్యాణంగా నిర్వర్తించారు. వారి యందు ఓంకారం సిద్ధించింది కనక. అది ఆధారంగా తీసుకొని భూమి మీద దింపడానికి చేశారు. వాళ్ళని చూసి మనం కూడా యజ్ఞం అంటే ఎలా? వాళ్ళు అట్నుంచిటు దింపడానికి యజ్ఞం చేశారు.

ధర్మాన్ని, దైవాన్ని, ప్రజాసంక్షేమాన్ని కోరి చేశారు వారు. తత్త్వం దిగిరావడానికి. అదంతా white magic. అది పట్టుకుని మనం కూడా అలా చేస్తే వస్తుందా? రాదు. వారి యందు అది వుంది కాబట్టి వస్తుంది. మన యందు అది లేదు కాబట్టి రాదు. అందుకే ముందు ప్రాథమికమైనవి మొదలు పెట్టుకోవాలి. ఈ పదీ ఎవరిలో వున్నాయో చూసి, మీరు ఆశ్రయించండి. వారు మహాత్ములు. మహాత్ములందరిలో ఇవి గోచరిస్తాయి. ఆ రూపంలో అక్కడ వున్నది భగవంతుడు. ఇవన్నీ కృష్ణుడి యందు గోచరిస్తాయి. ఇంతమందీ చచ్చారు గానీ, ఆయన చంపలేదు. ఒకటి అహింస. దొంగ బుద్ధి ఎప్పుడూ లేదు. ఇంకొకరి సొమ్ము ఆశించిందే లేదు. పరస్త్రీలను ఆయన వాంఛించిందే లేదు. స్త్రీలు ఆయన్ని వాంఛించారు. ఎప్పుడూ సంతోషంగా వున్నాడు. ఎప్పుడూ శుచిగా వున్నాడాయన. కొన్ని కొన్ని గుణాలు తీసుకుని కనీసం పుట్టినరోజుకొకటి చొప్పున pickup చేసికుంటే బాగుంటుంది. ఒక item కి ఒక సంవత్సరం అంతా ప్రయత్నం. ఎందుకంటే సరాసరి పెద్దమెట్టు ఎక్కే ప్రయత్నం చేస్తున్నా, ఎక్కలేక తిప్పలు పడుతున్నాం కదా! క్రమమైన పద్ధతిలో వెళ్దాం అనుకుంటే 'అహింస'. ఈ పుట్టినరోజు నుండి నోటి ద్వారా గానీ, చేతల ద్వారా గానీ, మౌనం ద్వారా గానీ హింసించను ఇది నా దీక్ష. అనుకోండి. 2వ సంవత్సరం ఏదీ ఎత్తుకుపోను. ఎవరి సొమ్ము ఆశించకపోవడం. దొంగ బుద్ధి లేకుండడం. అధర్మపరమైన స్త్రీపురుష వాంఛ. ఇలా 5 సంవత్సరాలకు 5 అవుతాయి. సంవత్సరానికి ఒకటి చాలు. ఇలాగే మనకు లోపల నుండి marks పడే మార్గం. అలా చేసుకుందాం. వీటన్నింటికి మనం ఆశ్రయించాల్సింది 'ఓంకారం'లో. ప్రతి శ్లోకంలో అంతా గొలుసే. పొడిపొడి నామాలు కాదు. ఒకటే సూత్రం వుంటుందీ, దాని నుండి విచ్చుకున్న పుష్పాలు బోలెడుంటాయి. అట్లా ఈ నామాలు గోచరిస్తున్నాయి.

## 897, 898, 899 సత్యవాన్, సాత్వికః, సత్యః

సత్యమును తన యొక్క నివాసంగా సృష్టిలో ఏర్పరుచుకున్న భగవతత్త్వము. 'స్థితి' సత్త్వగుణము నందు, 'సృష్టి' రజోగుణమునందు, 'లయము' తమోగుణమునందు ఉంటాయి. భగవంతుడు సృష్టియందుండడం అంటే సత్త్వము నందుండడమే! అవసరాన్ని బట్టి రజస్తమస్సులు వినియోగ పరచడం తప్ప, ఆయన యొక్క నివాసస్థానము సత్త్వము. మనము కూడా సత్త్వమునందున్నప్పుడే చైతన్యం యొక్క అనుభూతి పొందే అవకాశం ఉంటుంది. అంటే మనలోని వెలుగును అనుభూతి చెందే అవకాశం ఉంటుంది. సత్త్వము నందే భగవద్దర్శనానికి అవకాశము. రజో తమో గుణములతో కలిగే దేవతా దర్శనములు, సత్త్వగుణంతో పొందే వానికన్నా భిన్నంగా ఉంటాయి. రజోగుణ తమోగుణ దర్శనములు మనిషిలో బాగా అహంకారాన్ని పెంచి పతనానికి దోహదం చేస్తాయి. తీవ్రదీక్షలు, సాధనలు చేసేవారు ఈ విధంగా పైకి వెళ్ళి కిందకి పడడం చాలా కథల్లో కనిపిస్తాయి. తీవ్ర కోరికలతో తపస్సు చేసినవారు పతనం చెంది, మళ్ళీ భగవంతుణ్ణి సరైన పద్ధతులలో అవగాహన చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అందుకని భగవంతుడి పరిపూర్ణ అవగాహన మనకు కావాలంటే, మనం ఎక్కువగా సత్త్వమునందే జీవించి ఉండడానికే ప్రయత్నం చేయాలి. అక్కడే ఆయన దొరుకుతాడు. సత్త్వగుణ సంపన్నుడైన భగవంతుని, నీవు సత్త్వ గుణంలో ఉండి అనుభూతి పొందవచ్చు. గుణాతీతమైన భగవంతుడ్ని కూడా సత్త్వగుణమునందుండి మాత్రమే అనుభూతి పొందవచ్చు. మరోకరకంగా అనుభూతి చెందే అవకాశంలేదు. అందుకని పరతత్త్వానికీ, దైవతత్త్వానికీ దారి సత్త్వగుణం. రజోగుణంతో ప్రార్థన చేసిన రావణ కుంభకర్ణాదులు, హిరణ్యకశిప, హిరణ్యాక్షులు ఇత్యాదులు గోచరిస్తారు. ఒక కోరిక పెట్టుకొని చాలా తీవ్రమైన తపస్సులు చేయడం వలన అది రజోగుణప్రవృత్తిగా తయారై ఆ కోరిక ఫలించినప్పుడు మనయందు భగవతత్త్వముండక అహంకారముంటుంది. రావణుడు, హిరణ్యకశిపుడు అలాగే అహంకారించారు. సత్త్వగుణంలో నిలబడి సాధన చేయని విశ్వామిత్రుడు అహంకరించి అలాగే మాటిమాటికీ పడిపోయాడు, వశిష్ఠునితో

పోటీపెట్టుకుని. సత్త్వములో ఉన్నవాడికి పోటీయే ఉండదు. పోటీపడే స్వభావం ఎవరికి ఉంటుందయ్యా అంటే రజోగుణంలో ఉండేవారికి ఉంటుంది. పోటీపడే స్వభావం ఉన్నచోట అపజయం కూడా ఉంటుంది. సత్త్వగుణంలో ఉండేవారు దేన్నీ జయించాలని అనుకోరు. జీవించాలనుకుంటారు. ఆధ్యాత్మిక మార్గంలో కూడా there is no such thing as the sense of achievement, there is only sense of being in HIM. భగవంతుని యందుండడమే తప్ప భగవంతుని సాధించడం ఏమీ ఉండదు. సాధించబడేది మన కంటే వేరే ఒకటి ఉంటేనే కదా సాధించేది? కానీ నిజంగా అవగాహన చేసుకుంటే భగవంతుని అస్తిత్వమే మన అస్తిత్వము! ఆయన అస్తిత్వము లేక మన అస్తిత్వము లేదు. మన యందు మన వలె ఉండే తత్త్వమును గోచరింపచేసుకోవాలంటే అది మనగానే ఉందని అవగాహన చేసుకోవాలి తప్ప, అనుభూతి పొందాలే తప్ప మనకన్నా వేరుగా అనుభూతి చెందడానికి వీలులేదు. మనం అద్దై పోవడమే, దానియందు ఉండడమే. అదే మనమూ, మనమే అది అనే అవినాభావ స్థితి చెంది ఉండడమే యోగము అన్నారు. యోగస్థితిలో ఉన్నవాడు భగవత్ స్పర్శతో భగవంతుని యందు తాను నిండి ఉంటాడు. తన యందు భగవంతుడు నిండి ఉంటాడు. కనుక సమస్త దేశముల నుండి, కాలముల నుండి తన నుండి దైవమే వ్యక్తమై సమస్తమునూ నియమిస్తుంటాడు. అందుకే వశిష్ఠుడు అంటే చక్కగా కూర్చున్నటువంటి వాడు, శిష్ఠుడు. వసః అంటే ఎప్పుడూ ఉండేవాడు. ఆయనకి అహంకారం, ప్రతీకారవాంఛ, రోషం ఇలాంటివి రావు. మన భూమికే కాక సూర్యమండలానికి కూడా తండ్రి వంటివాడు వశిష్ఠుడు. ఈ సూర్యమండలానికి తండ్రివంటి వారు సప్తర్షులు. తల్లివంటి వారు మాతృకలు. వారే కృత్తికలు. గురువు వంటి వారు Sirius అనే మండలంలో ఉన్నారు. దాన్నే దత్తాత్రేయ మండలంగా చెప్తాం. కనక తల్లి తండ్రి గురువుగా మనకన్నా అత్యంత వైభవోపేతము, మహోన్నతము, హిమాన్వోపేతమైన systems ఏమైతే ఉన్నాయో ఆ మండలములు సూర్యమండలాన్ని నడిపిస్తున్నాయి. అందులో భూమి మీద జీవులకి దారి వశిష్ఠుడు. అందుకనే వివాహములో అరుంధతీ వశిష్ఠులను చూపించే సాంప్రదాయము ఇచ్చారు. ఎందుకంటే ఆయన ద్వారానే మనకి దారి దొరుకుతుంది. పరతత్త్వము, వశిష్ఠుడు, శక్తి, పరాశరుడు, వ్యాసుడు,

శుకుడు ఇలాంటి పరంపర ఉన్నది. అందుకని చక్కగా మనము సత్త్వము నందుండగలిగితే సహజమైన భగవదనుభూతి లభిస్తుంది. తీవ్రమైన ఉపాసనలు చేస్తే చేసినంతకాలం అదొకరకమైన ఉన్మాదంతో ఉంటారు. ఉన్మాదమూ, ఉద్వేగము కలిగిన భక్తులను చూస్తుంటాము. కొంతమందికి భక్తి అంటే ఆవేశం, మరి కొందరికి భక్తి అంటే పూనకం, మరి కొందరు భక్తి అంటూ విపరీతమైన విభూతి రేఖలు, బొట్లు పెట్టి, వంటినిండా ఏవో మాలలు ధరించి ప్రపంచంలో ఒక భీకరమైన మనిషిగా తిరుగుతూంటారు మేము ఉపాసకులమని చెప్పకుంటూ. అసలు యోగి అలా ఉండడు. బయట ప్రపంచానికి వార్తే ఉండదు. బయటకి ఏమీ కనబడడు. అసలు ఏం చూపాలి ? ఉన్నది వాడే కదా! అవసరాన్ని బట్టి వాడే తన్ను తాను చూపించుకుంటాడు. అందుకనే రజోగుణ సంపన్నులకి సత్త్వగుణ సంపన్నులు ఆనలేరు. కానీ సన్నివేశం వచ్చినప్పుడు సత్త్వగుణము ముందు రజోగుణము నిలువలేదు. రజోగుణమునకు అంతర్ బలము తక్కువ. బహిర్బలము ఎక్కువ. అందుకే ఏమన్నా తేడావస్తే రజోగుణం కలిగిన వారు బాగా కలత చెందుతారు. సత్త్వగుణ సంపన్నులు అలా కలత చెందరు. రజోగుణసంపన్నులు అన్నీ బావుంటే మనమే మొనగాడు అన్నట్లుంటారు. కాస్త తేడా వస్తే బెంబేలు పడి, కంగారు పడిపోతూంటారు. హడావుడి చేస్తూంటారు. భోరుమని ఏడుస్తుంటారు. తీవ్రమైన రాగద్వేషములుండుటచేత వారి యొక్క చైతన్యము నందు అలజడి ఎక్కువ, ప్రశాంతత తక్కువ. అలా కాకుండా సత్త్వగుణము నందు జీవించేవాడు ప్రశాంతమైన సరస్సు వలె ఉంటాడు. అలలు లేని సరస్సుగా, ప్రశాంతచిత్తుడుగా నీవున్నప్పుడు నీయందు సమస్తమూ ప్రతిబింబిస్తుంది. ఆకాశంలో ఉండే సమస్తమూ, తరంగములు లేని కోనేటి యందు ప్రతిబింబిస్తున్నది కదా! ఉన్నది ఉన్నట్లుగ గోచరించుచున్నది. కదిలే సరస్సులో చంద్రుడూ, సూర్యుడూ, తారకలూ కూడా రకరకాల వికృత రూపములలో కనిపిస్తాయి. అందుకని సత్త్వగుణము నందున్నవాడు మాత్రమే భగవంతుని చేరగలడు. భగవంతుడు కూడా సత్త్వగుణము నందున్న జీవిని మాత్రమే చేరగలడు. ఇతరులని చేరలేడు. అందుకని వీడ్ని సత్త్వగుణము నందు నిలిపేపద్ధతిలో శిక్షణ ఇవ్వడానికి తానే గురువు రూపంలో శిక్షణ ఇచ్చుకుంటాడు. ఎందుకంటే జీవుడు దైవమును కోరినా, అతడిలో రజస్తమస్సులు కారణంగా సత్త్వగుణమునందు ఎక్కువ భాగం

నిలబడి ఉండడం చాతగాకపోవడము వలన కోరడమే ఉంటుంది తప్ప, భగవద్దర్శనమూ స్పర్శనమూ, సంభాషణమూ దొరకడానికి కావలసిన వాతావరణమును తనకై తాను కల్పించి ఉండడు. అందుకని సత్త్వగుణ సంపన్నుడైన గురువు ప్రశాంత చిత్తమును శిష్యుడికి అందించడం కోసము శిక్షణ ఇస్తారు. శరీరమునకు, ఇంద్రియములకు, మనస్సునకూ శిక్షణ. సత్త్వగుణ సంపన్నమైన శబ్దముల ఉచ్చారణ, సత్త్వగుణ సంపన్నులైన రూపములు కలిగిన దేవతల ఆరాధనలూ ఇస్తారు. ఉగ్రనరసింహ, చండి, కాళీ, రుద్రుడు, రుద్రాణి, ఇలాంటివి ఇవ్వరు. 'ప్రసన్నవదనం ధ్యాయేత్' అంటే నీ ముఖంలో ప్రసన్నత నీవు కొలిచే దేవతని బట్టి వస్తుంది. హనుమంతుడ్ని కొలిస్తే కొన్ని కోతి వ్యవహారాలు కూడా వస్తుంటాయి. ఉగ్రనరసింహుడ్ని కొలిస్తే ఉన్నట్లుండి తీవ్రమైన ఆవేశమూ, కోపము వస్తాయి. చండి, రుద్రాణి, కాళీ ఇలాంటివి భావన చేస్తే 'ఏదన్నా తెగేద్దాం' అనిపించేంత కోపం వస్తుంది. దేవతల స్వరూప స్వభావాలు నీలో ఆపాదింపబడతాయి. అందుకనే ఆహ్లాదంగా ఉండే మూర్తి అంటే శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, లక్ష్మీదేవి, సరస్వతీదేవి ఇలా సత్త్వగుణ ప్రధానంగా ఉండే దేవతల ఆరాధన ప్రత్యేకించి ఇస్తారు. హనుమంతుడు సత్త్వగుణమునకు ప్రతీక. తప్పకుండా ఆరాధన చేసుకోవచ్చు. హనుమంతుడు మరి జగద్గురువు. సత్త్వగుణమే మనలో పెంపొందుతుంది. కానీ ప్రాథమిక దశలో కొన్ని కోతివేషాలుంటాయి. కొంత ఆవేశమూ ఉంటుంది. అదీ ప్రాథమికదశలోనే! కానీ కొన్ని పైన చెప్పిన దేవతలలో ప్రాథమిక దశ నుండి చివరి వరకూ ఆవేశమే. కుమారస్వామిని ప్రార్థించాం అనుకోండి విపరీతమైన శక్తి వచ్చేస్తుంటుంది. ఏం చేయాలో తెలీకపోతే శక్తి రాకూడదు, ఏం చేయాలో తెలీని వాడికి డబ్బు వచ్చినట్లుగా. పాడైపోతారు. ఏం చేయాలో తెలీని వాడికి కొన్ని వసతులు ఇవ్వకూడదు. ఇస్తే పాడైపోతారు. అందుకని వారి యొక్క స్థితిని బట్టి ఇవ్వాలి. వాడిలో బొత్తిగా ఆత్మబలం లేక అలా చచ్చుగా పడిఉన్నాడనుకోండి, గురువు ఏం చేస్తాడంటే వీడికి కొంచెం సంకల్పబలం రావాలని 'మురుగన్' అంటే 'కుమారస్వామి' ని ఇస్తాడన్నమాట. స్థిమితం రావాలనుకోండి గణపతి ఆరాధన ఇవ్వచ్చు. లోపల చాలా దురదృష్టకరమైన తరంగములు ఎక్కువవుండి ఏదీ సరిగ్గా అందక చేయిజార్చుకునే స్థితి ఉందనుకోండి 'లక్ష్మి' ని ఆరాధనకు ఇస్తారు. అంతేకాని అందరికి ఒకే పద్ధతి కాదు పిల్లికీ, బిచ్చానికి

ఒకటే అన్నట్లుగా. ప్రతి గురువూ తన శిష్యుని స్థితి ఏమిటో ఎరిగి, తర్వాతి మెట్టు ఎరిగినవాడై ఇది చేసుకోమంటాడు. నేను చెప్పేదాకా చేసుకోమంటాడు. అది పెంచుకుంటూ వెళుతూంటే అది దొరికిన తర్వాత ఇంకొకటి, ఆ తర్వాత ఇంకొకటి, ఆ తర్వాత ఇంకొకటి ఇచ్చి, స్థిమితమైన మనస్సు ఏర్పడ్డప్పుడు, ఒకవిధమైన సత్త్వగుణం కలిగితే, అప్పుడూ యోగప్రవేశం. అంత వరకూ యోగప్రవేశము లేదు. స్థిరము, సుఖము అయిన మనస్సు ఏర్పడనివానికి భగద్దర్శనమునకు మార్గము లేదు. యమ, నియములు తెలిసిన వాడు స్థిర సుఖాసనము అనే మూడవ స్థితికి వస్తాడు. అసలు మన యందు సత్త్వగుణమున్నదో లేదో తెలియాలి కదా! అంటే మన గురించి మనం చెడుగా అంచనా వేసుకోకూడదు, అలాగని ఎక్కువ మంచిగా కూడా అంచనా వేసుకోకూడదు. మనం చాలా మంచివాళ్ళం అనుకుంటూ మిగతావాళ్ళు అంత మంచివాళ్ళు కారనుకుంటాం చాటుగా. ఇది ఉంటే అదీ ఉంటుంది. తన గురించి భావన లేకపోతే ఇతరుల గురించి భావన ఉండదు. దైవమును గూర్చి భావన పెరుగుతూంటే తనగురించి భావన తగ్గుతూంటుంది. దైవము గూర్చిన భావన పెరుగుతూంటే నీ గురించి ఆలోచించే పరిస్థితి ఏది? నీ గురించి నీవు ఆలోచిస్తున్నావంటే దైవము గూర్చి అంతసేపు ఆలోచించలేదు కదా? దైవము పేర్న నీ గురించి నీవు ఆలోచించుకుని నేను చాలా మంచివాడ్ని, నేను చాలా గొప్పవాడ్ని, నేను చాలా మంచి పనులు చేశానూ, అందరూ నన్ను పొగుడుతుంటారు, అసలింకా నా ఫొటో పెట్టుకోలేదేంటి?-- ఇలా మనం భావన చేశాం అనుకోండి! అసలు ప్రతివారు వారి గురించిన భావన అలా చెత్తబుట్టలో పారెయ్యాలి. ఆ మేరకు భగవద్భావన చేసుకోవాలి. మనం కాస్త ఆరాధన చేసినా, మంచిపనులు చేసినా వెంటనే వాటిని గూర్చి పది మందికి తెలియక పోతే ఎలా? -- అన్న ఆరాటం ఉంటుందే అదీ రజోగుణం. ఎదుట వ్యక్తికి సహాయం చేసినా నువ్వు చేసినట్లు తెలియకుండా సహాయం చేసేవాడు సత్త్వగుణ సంపన్నుడు. నీ గురువు నీకు ఏం సాయం చేస్తున్నారో నీకు తెలియదు. ఎందుకంటే నీ మెప్పుకోరి నీకు చేయడు. భగవంతుని మెప్పుకు! భక్తుడు కూడా ఏం చేసినా 'ఎందుకు చేస్తున్నావ్'? అందరూ మెచ్చుకుంటారనా? లేకపోతే పొగుడ్తారనా? అందరూ నిన్ను మహాత్ముడిగా అనుకుంటారనా? అలా అనుకుంటే అది రజోగుణం అవుతుంది.

ఎందుకుచేస్తున్నావ్ అంటే 'వాడు ఆనందిస్తాడు, వాడి అనుగ్రహం కావాలి నాకు' అని ఉండాలి. అరవింద మహర్షిని ఓ సాధకుడు అడుగుతాడూ 'నా ఆనందం కోసం పని చేస్తుంటే చాలామందికి దుఃఖం కలుగుతోంది, పోనీవాళ్ళ ఆనందం కోసం పనిచేద్దామంటే నాకు దుఃఖం కలుగుతుంది. నేనేం చేయాలి? నా ఆనందం కోసం పని చేయాలా? వాళ్ళఆనందం కోసం పనిచేయాలా?' అని అడిగితే 'రెండూ వద్దు' అంటాడు. 'అదేంటీ' అంటే 'భగవంతుని ఆనందం కోసం పని చెయ్యి. భగవంతుడు ఆనందిస్తాడని చెయ్యి' అన్నాడు. 'మరి ఏం చేస్తే భగవంతుడు ఆనందిస్తాడు' అంటే 'ధర్మాన్ని ఆచరిస్తే సంతోషిస్తాడు. సత్యాన్ని పలికితే సంతోషిస్తాడు. 'సత్యం వద ధర్మం చర' అనికదా! ఈ రెండు వాళ్ళూ వీళ్ళూ మెచ్చుకుంటారని చేయబోక. చేస్తే దుఃఖమే మిగిలుతుంది. ఇవాళ మెచ్చుకున్నవాళ్ళు రేపు తిడుతుంటారు. Standard ఏముంది? ఇవాళ నీతో పని ఉంటే పొగుడుతారు. రేపు నీతో పని లేకపోతే ఇహ నీకు మొహం కూడా చూపించరు. అలాంటి వాళ్ళతో పెట్టుకోక. అయినా నీకు దైవము అంటే అదికాదుగా. కనక దైవప్రీతి కొరకు జీవించరా, అలా జీవిస్తుంటే నీలో ఆనందం పెరుగుతుంది. అదీ నిజమైన ఆనందంగా మిగులుతుంది' ఇతరులు ఆనందిస్తున్నారని ఇంకా చేస్తే వాళ్ళు ఆనందించక పోవచ్చు. ఇంకొంచెం చెయ్యి అనవచ్చు. చెయ్యడం ఆపితే ఇన్నాళ్ళు చేశాడు కదా గాడిద కొడుక్కి ఇప్పుడేం వచ్చిందంటారు. అలాగే నీ గురించి నీవు ఆలోచించుకుంటే కూడా ఆనందంగా ఉండదు. అందుకే నలుగురి కోసం అని మనం అనుకునే అన్ని పనుల్లో ఆనందం రాదు. అది ధర్మమా, సత్యమా! ఈ రెండూ ఉంటే భగవంతుడు నీలో ఆనందం చెందడం వల్ల నీకు ఆనందం అప్రయత్నంగా ఉంటుంది. సంతోషివై ఉంటావు. నిష్కారణంగా సంతోషివై ఉండాలంటే ఈ రెండు రెక్కలు సత్యము, ధర్మమూ అనేవి మనకి ఉండాలి. అందుకే అవి నేర్చుకోవాలంటే అసలు సత్త్వము ఏమిటో చూసుకోవాలి. అందుకే భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు గుణత్రయ విభాగంలో. 3 గుణాలు గూర్చి చెప్పడం జరిగింది. మనము ఎవరికివారము మనలో సత్త్వగుణం ఎంత ఉన్నది, రజోగుణం ఎంత ఉన్నది, తమోగుణం ఎంత ఉన్నదీ చూసుకోవాలి. చూసుకుని సత్త్వగుణాన్ని పెంచుకునే ప్రయత్నం చేయాలి. గీతలో 'సత్త్వంలో నిలబడితే నేను నీకు దగ్గరగా ఉంటాను. నువ్వు దుఃఖంలో ఉంటే తమోగుణంలో ఉన్నట్లు లెఖ్ఖ. నువ్వు

ఊర్కె వీరావేశంలో ఉంటే రజోగుణంలో ఉన్నట్లు లెక్క' అని చెప్తాడు కృష్ణుడు. యుద్ధంముందురోజు అర్జునుడు కత్తులు, బాణాలు నూరుతూ వీరావేశం చూపాడు. ఏంట్రా నూరుతున్నావంటే, 'ఇంక రేపు ఒక్కొక్కళ్ళని చీల్చి చెండాడడమే కదా' అన్నాడు. 'ఆహా' అన్నాడీయన. అక్కడ నుండి భోరున వర్షం పడ్డట్టు ఏడుపు. 'అదేంట్రా మరురోజు యుద్ధభూమిలో. 'నిన్న రాత్రి అలా మాట్లాడి ఇప్పుడు ఇలా ఏడుస్తావేం?' అంటే, అంతే! ఉంటే ఆమూల, లేకపోతే ఈ మూల. అంతేకాని మధ్యస్థుడై ఉండడు. 'సమత్వం యోగముచ్యతే', balanced గాఉంటేనే యోగం. విపరీతంగా ఎందులో ఇరుక్కున్నా యోగం లేదు. రెంటికి సరైన దూరం అంటే equal distance. ఈ విధంగా ఉంటాడు. వాడు అలా చాలా కాలం ఉంటే భగవంతుడికి చేరువు అవడం ఉంటుంది. మనకి ఆ 3 గుణాలూ చాలా చక్కగా వివరించి ఇచ్చారు. 'ఉప్పు, కారము, పిండి కలిసి జంతికలుగా దిగినట్లు' జీవులన్నియూ గుణాత్మకములు. ప్రతి జీవి యందు ఒక్కొక్క కాలములో ఒక్కొక్క గుణము ఆధిక్యము వహించును. ఆయా గుణము లక్షణముల ప్రకటనమును బట్టి అప్పుడే గుణము ఆధిక్యము వహించుచున్నదో తెలిసికొనవచ్చును. సత్త్వగుణం మనం ఎక్కువగా పెంచుకోవాలి. 'సత్త్వవాన్, సాత్వికః' అని కదా ఈ శ్లోకంలో చెప్పినది. ఆయన సాత్వికుడే. సత్త్వగుణ సంపన్నుడు. ఎప్పుడూ ప్రశాంత స్థితిలో ఉండేవాడు. మనం కూడా అది పొందాలంటే ఏంచేయాలి? నేత్రాది ఇంద్రియములకు, ఇంద్రియద్వారములకు చక్కని వికాసము, సంతోషప్రవృత్తి కలిగినప్పుడు జ్ఞానము సుగమము అవుతుంది. అప్పుడు సత్త్వగుణము అధికముగా ఉన్నదని తెలియాలి. ఆశ, కార్యసంకల్పము కలగజేసుకునుట, చేయుచున్నది మానలేకుండుట, కోరుట అను లక్షణములు బలీయముగా ఉన్నప్పుడు రజోగుణము ప్రవర్తించుచున్నదని తెలియాలి. బుద్ధిమాంద్యము, దేహమునకు చురుకుదనము తగ్గుట, ప్రవర్తింపవలసిన వాటి యందు బుద్ధిపుట్టకుండుట, పొరపాటు చేయుట, మరచిపోవుట మొదలగునవి ఉంటే తమోగుణము పనిచేయుచున్నదని తెలియవలెను. మర్చిపోతూంటాం. చేద్దాం అనుకున్నవాటియందు బుద్ధికలగదు. పొరపాట్లు చేస్తుంటాం. దేహం బాగా మందగించి, చురుకుదనం తగ్గుతున్నదంటే తమోగుణము పెరుగుతున్నదని అర్థము. సత్త్వగుణము ఎక్కువగా ప్రవర్తించినప్పుడు నిద్రించుట, దేహము

విడుచుట జరిగినచో ఉత్తమ జ్ఞానులు పొందిన నిర్మలలోకములలోనికి ప్రజ్ఞ వ్యాపించును. రజోగుణము ఎక్కువగా ఉండగా నిద్రయో, మృత్యువో కలిగినచో మరల నిరంతర కర్మసంగము కలవాడిగా మేల్కొని, ఫలితముల ఆసక్తితో తీరుబడిలేని జీవితము గడుపును. తమోగుణము అధికముగా ఉన్నప్పుడు చనిపోయినచో మూఢజన్మలు పొందును. సాత్వికమైన కర్మలు ఆచరించినచో నిర్మలత్వము కలుగును. చేసిన పనులలోంచి నిర్మలత్వము కలిగితేనే అవి సత్కర్మలు. సత్కర్మలు అంటే బయట పది మందికి తెలిసేట్లుగా, మంచి అనిపించుకునేట్లు చేసేవికావు. అవి నిర్మలత్వం పెంచాలి. నీలో రజోగుణం తగ్గించాలి. నీలో ప్రశాంతత పెంచాలి. నీలో నిశ్చలత్వం కలిగించాలి. అవి సత్కర్మలు! అవిగాక ఊర్కె తెగబడి పూజలు చేస్తుంటాం అనుకోండి. తిట్టుకుంటూంటాం, కొట్టుకుంటూంటాం. తెగబడిచేసే వ్రతాలు, దీక్షలు ఇవన్నీ రజోగుణం. ఎందుకంటే చేసేదాన్లో నుండి ప్రశాంతత వస్తోందా, ఉన్నది పోతోందా? పోతోంది అంటే రజోగుణం అని అర్థం. ప్రశాంతచిత్తతను ఫలముగ పొందుట సత్త్వగుణము. రజోగుణము ఇచ్చుకర్మలను ఆచరించుటతో ఆధిక్యబుద్ధి, వాడికన్నా నేను గొప్పవాడ్ని అనిపించుకోవాలనే తపన కలుగుతాయి. మనల్ని అందరు గొప్పగా, మంచిగా గుర్తించాలని ఎదుట వ్యక్తిని తక్కువ చేసి మాట్లాడుకుంటాం. అంటే వాడికేం తెలీదు నాకే తెలుసని చెప్పడం. రజోగుణంకదామరి? మనల్ని మనం పెద్దవాళ్ళం అనిపించుకోవడానికి అవతలవాళ్ళని చిన్నవాళ్ళని చేసి మాట్లాడుతుంటాం, ఆధిక్యబుద్ధితో. అంతేకాదు నలుగురున్నచోట మనం dominate చేద్దాం అనుకుంటాం కదా అదీ రజోగుణమే. పట్టుదల. పట్టు,విడుపు లేనివానికి సత్త్వగుణంలో ప్రవేశంలేదు. ఒట్టి పట్టే ఉంటే అది వాడ్ని పట్టేస్తుంది. కనుక పట్టువిడుపులు ఉండడం సత్త్వగుణము. కేవలం పట్టే ఉండడం రజోగుణం. మూఢత్వము, సోమరితనము, రోగము, మందతా ఇవీ తమోగుణము. మందత అంటే మామూలుగా తోచేవి కూడా తోచకపోవడము. సోమరితనము ఏ పనిచేయకుండా కూర్చోవడము. అలా కూర్చుంటే బావుంటుందన్నమాట. చలిమిడి ముద్దల్లే కుర్చీలో కూర్చొని అదితే, ఇదితే అంటూ మాట్లాడుతామే అదీ! కాస్త లేచి ఆ పనులు మనమే చేస్తుంటే సోమరితనం తగ్గుతుంటుంది. కేవలం మన మాట వినేవాళ్ళున్నారని పనిచేయించుకోవడమే. Coffee తాగిన glass sofa

పక్కనే పెట్టి, అది కాస్త ఎండుతూ ఈలోగా మరెవరన్నా తన్నేస్తే అక్కడ కాఫీ పడి మరకలై ---ఇలా ఉంటుంది. అదే వెంటనే తీసి అప్పటికప్పుడు కడిగేస్తే అన్ని కాఫీ గ్లాసులు తోమాల్సిన అవసరం ఉండదు. యోగి తనపని తను చేసుకుంటాడు. ఇంకొకరి మీద ఆధారపడడు. ఇంకొకళ్ళు సహాయంచేస్తే అంగీకరిస్తాడు తప్ప, ఎప్పుడూ సహాయం కోసం ఎదురు చూడడు. ఈ సోమరితనము 40 సం;లు దాటాకా ఎక్కువవుతుంది. ఎందుకంటే అప్పుడిహ శరీరంలో ఎదుగుదలకు సంబంధించిన మార్పులు ఆగిపోతాయి. అందుకని సహజంగానే చురుకుతనం తగ్గుతుంది. కనుకనే ప్రత్యేకించి చురుకుదనం కలిగించాలని, ఆయుర్వేదం శరీర సౌఖ్యాలు కొంచెం కొంచెం తగ్గించమంటుంది. లేకపోతే మనం క్రమంగా శరీరానికి లొంగిపోతాం. 40సం;లు దాటాక ఒంటిపూట భోజనం, చన్నీళ్ళ స్నానం, కొద్దిగా నేలమీద పడుకోవడం ఇలాంటివన్నీ ఆయుర్వేదంలో ఇచ్చారు. 'ఏంటీ వాళ్ళకి మన మీద ఇంత కసీ' అనిపిస్తుంది. కొంచెం వ్యాయమము కూడా చెప్తారు. ఇవన్నీ మన మంచికోరి చెప్తారు. లేకపోతే శరీరం మందం అయిపోయి సోమరితనం పెరుగుతుంది. దీనితో జీవులలో బుద్ధి తగ్గి, రోగాలు వస్తాయి. సత్త్వగుణంలో ఉన్నవాడికే జ్ఞానం ఉద్భవిస్తుంది. అంటే అంతర్ముఖంగా అన్నీ తెలుస్తుంటాయి. మనం పుస్తకంలో చదువుకుంటూంటే  అరే ఇది మనకు లోపల నుండి తెలిసిందే పుస్తకంలో రాశారు అనిపిస్తుంది. రజోగుణమైతే చదువుకుంటాడు. వాడికీ వీడికీ చెప్పి వీడు మర్చిపోతుంటాడు. వీడికి అబ్బదూ, లోపల నుండి రాదు. రజస్సు నుండి జ్ఞానమునకై లోభము ఉద్భవిస్తుంది. పుస్తకాల్లో చదివింది అక్కడ చెప్పేసి నలుగురిలో జ్ఞానులం అనిపించుకోడం తప్ప సహజ జ్ఞానం ఉండదు. కేవలము పుస్తకజ్ఞానమే ఉంటుంది. యోగసాధకుడికి జ్ఞానము చేతికర్రలాగ పనిచేస్తుంది. యోగసాధన లేని కేవల పాండిత్యం మనిషిని భ్రష్టు పట్టిస్తుంది. తెనాలి రామకృష్ణుడు యోగి. యోగముతో పాటు పాండిత్యము ఉన్నవాడు. అప్పుడు ఆయనతో పాటు ఉన్న కవులు కేవలం పండితులు. అందుకని ఈయన ఏమిటో వారికి అర్థంకాలేదు. అలాగే పోతనామాత్యుడూ సహజముగా యోగి. ఆ పైన పాండిత్యము కలవాడు. ఇతర కవులు తిక్కన మొదలగువారు అలాంటివారు కాదు. అందుకే పోతన ఇచ్చినంత అద్భుతంగా భగవంతుని అలా చేతిలో వలిచి పెట్టే స్థితి వారిలో లేదు. కనుకనే భాగవతం వారి నుండి

రాలేదు. దానికి సత్త్వగుణం చాలా కావాలి, భగవత్తత్త్వం గురించి వ్యక్తం చేయాలంటే! కేవలం జ్ఞానాన్ని సముపార్జన చేసికుని , విన్యాసాలు చేస్తారే అప్పుడు పామర జనం 'ఆయనకు చాలా తెలుసు' అనుకుంటారు. కానీ ఏమిటి తెలిస్తే? ఆయనకి చాలా తెలియడం వలన నీకు ఏమిటి ఉపయోగం, ఆయన నీకు ఏం చేశాడు అన్నది ఉపయోగం కాని. ఆయనకి డబ్బు, జ్ఞానం ఇతరాలు ఉన్నప్పటికీ అవన్నీ లోక జనులకి ఏ విధంగా ఉపయోగపడుతుందనేది litmus test. రజస్సులో ఉన్నవాడికి జ్ఞానం గురించి ఆరాటం ఉంటుంది. ఏదో ఆ కాస్తా ముక్కున పెట్టుకుని నలుగురిలో మాట్లాడేసి ఆ తర్వాత మర్చిపోతాడు. దానియందు లోభం. అదే తమస్సులో ఉన్నవాడు ఆ మాత్రం కూడా చదవడు. వాడేదో వాడి theory తీస్తాడు, ఇదే జ్ఞానం అంటాడు. ఎద్దుమొద్దు స్వరూపాలు దీన్లోంచే తయారౌతుంటాయి. 'మనం చెప్పిందే వేదం' అన్నట్లుంటాడు, విస్సన్న చెప్పిందే వేదం అన్నట్లుగా. వీడు చెప్పే శాస్త్రానికి ప్రమాణం కాని, అనుభూతి కాని ఉండదు. వాడికిది ఒక సౌకర్యం అంతే. వాడి సౌకర్యం ప్రకారం దాన్ని మలచి, దాన్ని జ్ఞానం అని ఇస్తాడు. చాలా వికటించిన స్థితి. ముందు వాడు తన వంకర తీసుకుని, తర్వాత జ్ఞానం ఆర్జించడం అనేది చాలా పెద్ద course. తమోగుణంలోని మానవులు అధమ స్థితి లోనికి చేర్తారు. దైవాసుర సంపద్విభాగ యోగంలో సత్త్వ, రజో, తమో గుణాలు ఎలా ఉంటాయో చెప్తారు. దివ్య సంపత్తి లేక సత్త్వగుణ సంపత్తి ఉంటే ఉన్నట్లు లేకపోతే లేనట్లు. సత్త్వగుణం ఉన్నవాడికి నిర్భీతి ఉంటుంది. ఎందుకుంటుందీ? వాడొకడున్నాడు. వాడిలో మనం ఉన్నాం. సత్యంలో ఉన్నాం. ధర్మంలో ఉన్నాం. ఇంక దేనికి భయపడాలి? సత్యము లోను, ధర్మంలోను ఉన్నవాళ్ళు నశించడానికి వీలులేదు కదా! ఆటుపోట్లు వస్తుంటాయి. కాని భయం ఉండదు. ప్రహ్లాదుడికి, అంబరీషుడికి, శుకుడికి, వ్యాసుడికి భయమే లేదు. భయం లేనట్లుగా కనిపించేవాళ్ళకి భయమే. హిరణ్యాక్షుడికి భయం. హిరణ్యకశిపుడికి, రావణుడికి భయాలే. అలా కనిపించరు కానీ భయమే! రావణుడికి భయం ఉన్నది. ఎందుకంటే తప్పు చేస్తే భయం ఉంటుంది. వాలికి భయం ఉన్నది. సుగ్రీవునకు భయం ఉన్నది. తప్పుచేశాడు కదా! తప్పుచేయనివాడికి భయం ఎక్కడ నుండి వస్తుందండీ? తప్పు చేస్తే చేశాం. తెలీక, పొరపాట్న తప్పు చేశాం. ఇప్పుడు నీవే శరణు. నీతోనే ఉంటానిహ. నీవేం చేస్తే అది ఒప్పుకుంటాను. అదీ నిర్భీతి.

సామర్థ్యము. అదీ సత్త్వగుణంలో ఉండే సామర్థ్యం. వశిష్ఠుడు, విశ్వామిత్రుడూను. చాలా contrast. విశ్వామిత్రుడు జన్మల తరబడి గింజుకుంటాడు. ఎందుకనీ? పోటీ. 'ఎన్నాళ్ళు గింజుకుంటే అన్నాళ్ళు అలాగే ఉంటావ్. ఆ గింజుకునే గింజ లోపల్నుండి తీసేసెయ్యి.' అని చెప్తాడు. 'బ్రహ్మర్షి నయ్యానా' అని ' అయ్యావని' బ్రహ్మ చెప్తే సరిపోదు ఆ వశిష్ఠుడే వచ్చి చెప్పాలిట నీవు బ్రహ్మర్షి అయ్యావని. అంటే ఇంకా మిగిలిఉన్నట్లేగా. తర్వాత కూడా రాజర్షి లక్షణాలే ఎక్కువ చూపిస్తాడు. ఎక్కడకక్కడ మళ్ళీ క్షాత్రం పొడుచుకొస్తూంటుంది. దశరథుడు ముందు పిల్లల్ని పంపిస్తానని, యాగ సంరక్షణకి అంటే, అయితే నేనే వస్తాను, పిల్లలెందుకు? అన్నాడే అనుకోండి విశ్వామిత్రుడికి అంత కోపం ఎందుకు కోపంలేకుండా అదే మాట చెప్పవచ్చు కదా! వశిష్ఠుడైతే కోపం రాకుండా చెప్తాడు. ప్రతి దానికీ బుస్సుబుస్సు మనేవాడు రజోగుణంలో ఉన్నట్లే. తాటకిని చూస్తే కోపం దేనికీ? మానాన్న చెప్పాడు కదా నువ్వేం చెప్తే అది చేయమని, దీని మీద ఇంకేం discussion అక్కర్లేదంటాడు రాముడు. రాముడు మరి సత్త్వగుణంలో ఉంటాడు కదా! ఏమీ ఉండదు కానీ అవసరాన్ని బట్టి ఒక్కసారి వీర్యం ప్రకటింప చేసి, మళ్ళీ మామూలుగా ఉంటాడు గానీ అలా పట్టుక్కూర్చోడు. రావణాసురుడు రాముడి గురించి లోపల అలా పట్టుక్కూర్చుంటాడు. అసలు రాముడు రోజూ రావణాసురుని తిట్టుకోవాలి. అలా ఉండదు. సామర్థ్యమున్నచోట వారికి అన్నిటికీ time వస్తుందని తెలుసు. కృష్ణుడు అదే అంటాడు అందరికీ time వస్తుంది, ఆ రోజునే వేసేద్దాం. కాలం కలసి రావాలి అంతవరకు వేచి ఉండే సామర్థ్యం ఉండాలని. 'క్షమః' అని చెప్పాం కదా! Patience కన్నా సామర్థ్యం లేదు. To be able to wait and to stay in the law, and to do the right thing. అలా ఉన్నవాడికే అంతిమ విజయం. మధ్యలో పడిపోతే ఏం లాభం? సగంలో బాగా ఆడాడట, చివరలోకి వచ్చి ఓడిపోయాడట అంటే ఓడి పోయినట్లే కదా? కాదండి మధ్యలో బాగా ఆడాడండీ పోనీ గెలిచినట్లు చెప్దాం అని చెప్తారా? చెప్పరు కదా! అందుకని సత్యం, ధర్మం పాటించేవాడికి ability to wait and ability to act as per the dictates of time ఉంటుంది. Patience తో ఎదురు చూసే సామర్థ్యం ఉంటుంది. అపరిశుద్ధమైన విషయములందు ఆసక్తి ఉండదు. భౌతికమైన విషయములలోకాని, ఇంద్రియ పరమైన

విషయములలో గాని, మనోమయ విషయములలో గాని అన్నిచోట్లా crystal clear. అటువంటి పరిశుభ్రత ఉంటే సత్త్వగుణం. జ్ఞానమునందు ఆసక్తి సత్త్వగుణం. మామూలుగా సినిమాకి వెళ్దామా, యోగవాశిష్ఠం చదువుదామా అంటే సినిమా రేపు రాకపోవచ్చు, పుస్తకం రేపైనా చదువుకోవచ్చు అనిపిస్తుంది. రేపు టీ.వీ. లో ఇంకొకటి వస్తుంది. యోగవాశిష్ఠం అలాగే ఎన్నేళ్ళయినా ఉంటుంది. యోగవాశిష్ఠం ఏమిటి? వశిష్ఠుడు రాముడికి చెప్పింది. అదేంటో తెలుసుకోవద్దూ? రాముడే శిష్యుడై విన్నాడట్రా అంటే అది ఎటువంటి జ్ఞానం అయ్యి ఉంటుందండీ? సొల్లు కబుర్లా, రామాయణమా అంటే మనం నిస్సందేహంగా సొల్లుకబుర్లకే మొగ్గుతాం. అంటే సత్త్వ గుణం లేదు, రజస్సు తమస్సులే ఉన్నాయని అర్థం. ఎంతసేపూ ఈ పుస్తకాలేనా అలా తిరిగి వస్తే పోలేదా అనిపించేది రజోగుణం. దానము చేయు బుద్ధి సత్త్వగుణం. ఎవరికన్నా ఏమన్నా ఇద్దామన్నట్లుండాలి గానీ, ఎవరన్నా ఏమన్నా ఇస్తారా అన్నట్లుండకూడదు. మనకెంతసేపూ ఎవరైనా ఊరికే ఏమన్నా తెచ్చిస్తే బావుణ్ణనిపిస్తుంది. తమస్సులో ఉన్నవాడికి ఇది ఎక్కువ. ఈ దరిద్రం మన జాతిలో ఉన్నది. ఇది భౌతికం కన్నా మానసికంగా ఎక్కువ. యోగమార్గంలో అపరిగ్రహం అని చెప్తారు. ఇచ్చినంత మాత్రాన పుచ్చుకోకురా అంటాడు. ఎందుకిస్తున్నాడూ? నిన్ను దాంతో కొంటున్నాడా? గురువుల్ని డబ్బుతో కొనేసేవారున్నారు. అధికారుల్ని కొనేసేవారున్నారు. ఉంచండ్సార్ అంటాడు, ఈ రోజు ఇంటి వద్ద. రేపు office లోవాడు చెప్పినట్లు వీడు చేయవలసినదే. దేన్నయినా కొనేస్తారు. ఎందుకంటే వాడి దగ్గర కొనే బుద్ధి ఉన్నది. అపరిగ్రహము. వీడివద్ద నువ్వు ఎందుకు పుచ్చుకుంటున్నావ్? వాడికి నువ్వేం చేశావని నువ్వు పుచ్చుకోవాలి? ఏమీ చేయకయే నీవు పుచ్చుకుంటే నువ్వు ఋణపడి ఉన్నావ్. చేసినా పుచ్చుకోక. మరీ వాడు బాధ పడ్తాడంటే పుచ్చుకో. మళ్ళీ దాన్ని సద్వినియోగము చేయగలిగితే పుచ్చుకో. తుకారాంకి బండెడు సామాన్లు శివాజీమహరాజ్ పంపుతాడు. అసలు ఇంట్లో store room లేదు. సరే ఇంట్లోవాళ్ళు అన్నీ సర్దుకుంటుంటే ఆ పూటకి కావలసినది ఉంచి మిగతావన్నీ ఇచ్చేస్తాడు. అంత అఖ్ఖర్లేదు గాని దానబుద్ధి ఉండి తీరాలి. సత్త్వగుణంలో ఉండాలంటే ఎవరికన్నా ఏమన్నా ఇద్దామని అనిపించాలి తప్ప మా ఇంటికి వస్తే ఏం తెస్తారు, మీ ఇంటికి వస్తే ఏం ఇస్తారూ అనే తత్త్వం

లౌకికం. పుచ్చుకున్న కొద్దీ ఇబ్బందులు వస్తాయి. పుచ్చుకున్న కొద్దీ బంధమే. ఇచ్చిన కొద్దీ ముక్తే. ముక్త స్థితి రావాలంటే ఇచ్చుకుంటూ పోవాలి. పుచ్చుకుంటూ పోతే పుచ్చిపోతారు. ఇవన్నీ ఉంటేనే ఇంద్రియ నిగ్రహం ఉంటుంది. చూసింది మనల్ని బంధించదు. విన్నది బంధించదు. రుచి చూసింది బంధించదు. స్పర్శ బంధించదు. వాసన బంధించదు. అగరొత్తులు లేకపోతే లేకపోయెనే అన్న ఏడుపుండదు. లేకపోతే లేదు. దీపం లేకపోతే దేవుడ్ని ఆరాధన చేయలేం? దీపం ఎందుకసలూ? లోపలదీపం కనబడ్డం కోసమే కదా! దీపం లేదూ, అగరొత్తి లేదూ అసలు పూజ ఎందుకు చేయాలి? అంటాడు రజోగుణ సంపన్నుడు. లోపల పూజ చేసుకో. పూజ దీపం కోసం, అగరొత్తి కోసం అని వాడి ఉద్దేశం. ఇవన్నీ ఉంటేనే పూజా? కాదు ఇవన్నీ ఉంటే కొంత నీకు ఆ వాతావరణము ఏర్పడుతుందని. అవి లేవు. ఏం చేస్తావ్? మాస్టారుగారు అంటూండేవారు 'ధావళి లేదని ఓ బ్రాహ్మడు గాయత్రి మానేశాడుటా' అని. ధావళి ముఖ్యమా, గాయత్రి ముఖ్యమా? Pant వేసుకున్నా శుభ్రంగా ఉంటే చాలు, గాయత్రి చేసుకోండి, అన్నారు. చొక్కా వేసుకున్నావా లేదా అనేది గాయత్రికి అఖ్ఖర్లేదు. అభిషేకానికైనా అంతే. రుద్రాభిషేకం పుస్తకం లో మాస్టారు భౌతికంగాను, ఇంద్రియ పరంగాను, మానసికంగాను శుభ్రంగా ఉంటే చాలు, స్నానంచేసి ఉతికిన బట్టలు కట్టుకున్న వారెవరైనా సరే అభిషేకము చేయవచ్చని చెప్పారు. అలా చెప్పడానికి దమ్ముండాలండీ. ఆ సామర్థ్యం సత్త్వగుణం నుండే వస్తుంది. యజ్ఞార్ధకర్మలను ఆచరించుట. ఇది చేస్తే మనకేమి వస్తుందనే point ఉండదు సత్త్వగుణ సంపన్నుడికి. చెయ్యాలి కాబట్టి చేయడమేను. 'కార్యం కర్మ కరోతియః' అని కర్మ యోగంలో అంటే, చేయవలసిన పని చేస్తుంటే వాడికీ కర్మల యందు యోగము. కర్మల ద్వారా యోగము. కర్మ ఫలితము కోరి చేయడం కాదు. యజ్ఞార్ధం చేయడమే. అమ్మకీ నాన్నకీ చేస్తే ఏం వస్తుందనుకుంటే ఏమీరాదు. నీవు చూసే పద్ధతిలో in terms of commerce ఏమీ ఉండదు. అన్నదమ్ములకి చేస్తే ఏమి వస్తుందీ ఊళ్ళోవాళ్ళకి చేస్తే మెచ్చుకుంటారు. ఊళ్ళోవాడికి చేస్తే వాడు పది మందికి చెప్తాడు.. తమ్ముడికి చేస్తే చెప్పడు. ఎందుకు చెప్పాలి? వాడు చెప్పాలని చేశావా? చాలా మంది గొప్పకోసం ఊళ్ళో చేస్తారు ఇంట్లో చేయరు. అది రజోగుణం. సొంత మనిషి అలా పాడైపోతూంటే, అలా వదిలేసి

ఎక్కడికోపోయి సేవ చేసి వచ్చానంటాడు. అదేం సేవ? నీ proximate areasలో, నీ need ఉన్నచోట చేయక, ఎవరో సభల్లో పిలిచి దండ వేసి మంచిమాట నీ గురించి చెప్తారని చేస్తే అది సేవ అవ్వదు. రజోగుణం అవుతుంది. ప్రమాణ గ్రంథములను చదువుట కూడా సత్త్వగుణమే. ఆత్మజ్ఞానం పొందినవాడు ఇచ్చిన రచనలే చదవాలి కానీ అడ్డమైన వాడూ రాసిన పుస్తకాలూ చదవకూడదు. అంటే దైవం పేరున చాలా మంది చాలా రాస్తారు. రాసిన వాడి జీవితము ఏమిటో ముందు చూడాలి. వానికి దైవానుభూతి కలిగిందా లేదా, వాని జీవితమేమిటి, ---ఇలాంటివాటిని బట్టి ఆ రాసిన పుస్తకంలో దైవం దొరుకుతుంది. లేకపోతే దొరకదు. దొరక్కపోగా ప్రక్కదారులు పట్టే అవకాశం ఉన్నది. ఈ రోజుల్లో పుస్తకాలు చాలా వస్తున్నాయి. ప్రతీవాడూ రాయడమే. దేన్ని చదవాలి అంటె 'ప్రమాణ గ్రంథములను' అన్నాడు. అవి కాలము యొక్క ఆటుపోట్లను తట్టుకుని నిలబడ్డ గ్రంథములు. వేల సంవత్సరముల నుండి అవి అలా నిలబడి ఉన్నాయి. Novels ఉంటాయి, ఓ సారి చదివి అలాపారేస్తాం. మహా అయితే మరీ బావుంటే మరోసారి. అంతేగాని మళ్ళీ మళ్ళీ చదువుతావా? అందులో సత్యము, ధర్మము ఉంటే మళ్ళీ చదువుతావు. మరి రామాయణము, భారతము, భాగవతము, ఉపనిషత్తులు, బైబిల్, ఇలా బోలెడు ప్రపంచ గ్రంథాలు ప్రమాణగ్రంథాలుగా ఉన్నాయి. కేవలం భారతదేశ గ్రంథములే అనుకోకండి. మహాత్ముల నుండి వచ్చిన ప్రతిబోధా ప్రమాణమే. చెప్పిన వాడు వాడై ఉండాలి. రాముని గురించి, కృష్ణుని గురించి, బుద్ధుని గురించి, క్రీస్తుని గురించి, భాగవతోత్తములను గురించి చెప్పినవి ప్రమాణగ్రంథములు. రాసినవాడెవడూ అన్నది ముఖ్యం. రాసినవాడు వ్యాసుడు, వాల్మీకీ అయ్యి ఉండాలి. పోతనై ఉండాలి. లేకపోతే వీరి స్వభావం దానికి జోడించి రాశేస్తారు. ఏమీ అనుకోవద్దు. మహాభారతాన్ని తెలుగులో అనువాదం చేసినప్పుడు భ్రష్టు పట్టించారు. మాస్టారుగారు అన్నారు 'వీళ్ళు తీరని అపచారం చేశారూ వీళ్ళని దైవం ఒప్పుకోడని'. ప్రపంచం అంతా పొగుడుతుం,ది కాని బయటకి అనరాదు. చేసినవి తప్పులు. ఎటువంటి తప్పులు చేశారో చూపించారు. ఎందుకు చేశారూ అంటే ఇలా ఉంటే సంఘం లో మంచిది కాదని చేస్తారు. ఈయనకి వ్యాసుని కన్నా ఎక్కువ తెలుసా? Translator, original నుండి కొంత కత్తిరించి, కొంత add చేసి

చేయకూడదు. అందుకని భాగవతానికి వచ్చిన సహజమైన ప్రజాదరణ ఈ భారతానికి రాలేదు. ధర్మాలు సరిగ్గా ఉన్నా అక్కడక్కడ చాలా వంకరలున్నాయి, భారతంలో. ప్రమాణం గ్రంథం కాదు. భారతం తీసి పద్యాలు చదువుకుందామనుకుంటే వీలుంటే సంస్కృతం చదువుకో', అని చెప్పారు మాస్టారు. 'రామాయణం మరెలా, మరి మాకు సంస్కృతం రాదు కదా అండీ, అంటే, 'శ్రీనివాస శిరోమణి ఉన్నదున్నట్లే తెలుగులోకి అనువదించారు, అది చదువుకోండి' అని చెప్పారు. నువ్వు translatorవి, మొదట అసలు కవి ఏం చెప్పాడో అది రాయాలిగాని నీ సొంతం రాసి, అసలున్నది తీసేస్తే ఎలా ? అందుకే ప్రమాణ గ్రంథాలు చదువుకోవాలి. ఏంటో రాముడి గురించి ఒక్కో dimension తీసి రాముడి తప్పు, వాలి రైటు అని రాసేవి, రాముడికన్నా అసలు రావణుడే చాలా గొప్ప వాడని రాసేవీ చాలా ఉంటాయి. దుర్యోధనుడు బాగా నచ్చేతత్త్వం ఉన్నవాళ్ళుంటారు. రావణుడు బాగా నచ్చేతత్త్వం ఉన్నవాళ్ళుంటారు అదే రామాయణంలో. రామాయణం చదువుకుంటుంటే ఒకరికి హనుమంతుడు, మరొకరికి సీత, ఇంకొకరికి లక్ష్మణుడు ఇంకొకరికి వాలి మరొకడికి రావణుడు నచ్చుతారు. ఎందుకూ ? నీలో ఉన్న గుణముల సముదాయమును బట్టి నీకు ఆ పాత్ర నచ్చుతుంది కాబట్టి. నీకు పూర్ణమైన సత్త్వగుణ సంపన్నత పూర్తిగా ఉంటే ముందు రాముడే నచ్చుతాడు. తర్వాత భరతుడు, హనుమంతుడు అలా వస్తారు. అందరికీ పెద్దలు పుస్తకం ఇచ్చి నీకెవరు బాగా నచ్చుతారురా అని అడుగుతారు. దాన్నిబట్టి నువ్వేమిటో తెలుస్తుంది. రాముడు నచ్చనివాడు, అమ్మవారు నచ్చినవారు బోలెడుమంది ఉంటారు. హనుమంతుడు నచ్చినవారు బోలెడు మంది ఉంటారు. ప్రమాణ గ్రంథం చదువుకుంటే సత్త్వగుణం పెంపొందుతుంది. ఇతరములు చదివితే ఉన్నది కాస్తా పోతుంది. అందుకని you should read only time tested scriptures. కొన్ని కొన్ని ఇప్పుడు మనకు వచ్చినాయి. ఇప్పుడు చాలా పెద్ద పేరు ఉండొచ్చు వాటన్నిటికీ, వచ్చే శతాబ్దానికి అసలు అక్కడ నామరూపాలు లేకుండా పోయేవి ఉన్నాయి. ఇప్పుడున్న వాటిలో కూడా. అందుకని తెలిసిన వాళ్ళని అడిగి, ఇది చదవచ్చా అని తెలుసుకొని చదవాలి. ప్రతి వాళ్లు తంత్రం గురించి రాస్తారు, ప్రతి వాళ్లు యోగం గురించి రాస్తారు, ప్రతివాళ్ళు మంత్రం గురించి రాస్తారు, ప్రతివాళ్ళు లలితా సహస్రనామానికి రహస్యాలు ఇచ్చేస్తున్నారు.

నీకేమి తెలుసు అని నువ్వు ఇస్తున్నావ్ రహస్యం. నీకే ఏమీ తెలియదు కదా, నువ్వు రహస్యాలు ఇవ్వడం ఏమిటి? వీళ్లకు తెలియదు, ఏమి జరుగుతుందంటే తర్వాత శతాబ్దంలో, ఈ పుస్తకాలు చూసి ఇంత తెలియనివాడా వీడు పాపం, అని తెలుసుకుంటారు వాళ్ళు. అందుకని కాగితం మీద పెట్టకూడదు తెలివి ఉంటే. అహింస, తపస్సు- అంటే క్రమము తప్పకుండా దైవాన్ని రోజూ ఆరాధన చేసుకుని ఆయనతో కలిసి ఉండటానికి చేసే ప్రయత్నం! అది ఏ రోజూ మానకూడదు. ఎందుకంటే, శరీరంలో ఎప్పటికప్పుడు మాలిన్యములు పుడుతూనే ఉంటాయి, నువ్వు కనుక అప్రమత్తుడవై ఉండకపోతే అది నిన్ను మింగేస్తుంది. సూటిదనము ఉండాలి. వంకర టింకరగా, తెలివిగా, లౌక్యంగా, ఒక విషయాన్ని ప్రస్తావించి చెప్పాడు, చెప్పలేదు అన్నట్టుగా మాట్లాడడం నీకేమన్నా గొప్పగా అనిపించొచ్చు ఏమో తప్ప, నిన్ను లోపల వంకరటింకరగా తయారు చేస్తుంది. అంతఃకరణ శుద్ధి ఉండదు. అందుకని చెప్పవలసిన విషయాన్ని సూటిగా చెప్పగలిగి ఉండాలి. చెప్పలేనివాడు, సత్త్వగుణంలో ఉండడానికి వీలుపడదు. పిసినిగొట్టుతనము లేకుండుట- దానం ఉంటే ఎలాగూ పిసినిగొట్టుతనము ఉండదు. భూతదయ కలిగి ఉండుట- అయ్యో అనిపించి ఉండాలి, మనస్సులో, ప్రతివాడి యందు కూడా. కష్టం వస్తే 'వాడికి అట్లాగే రావాలండి, వాడికి అంతే కావాలి, వాడు ఏం చేశాడో మీకు తెలుసా!' అంటాం. బాగా తాగి, liver చెడిపోయి చచ్చిపోతున్నాడనుకోండి, సత్త్వగుణంలో ఉండేవాడు 'మరి తాగితే ఏమవుతుంది?' అనడు. 'అయ్యో!' అంటాడు. ఏమిటి ఇట్లా అయింది అంటాడు. అంటే అందరూ జీవులకి పరిమితత్వాలు ఏవో ఉన్నాయి. వీడికి ఇట్లా ఉంది. అంతే. వీడు తాగాడని, వాడు ఏదో చేశాడని, వాడు దొంగతనం చేశాడని, ఇంకోడెవడినో చంపాడని, ఇవన్నీ ఉండవు. అవి అలా ఉండగా కష్టం వచ్చినప్పుడు అయ్యో అనుకుంటాడు. ఇంత వాలిని చంపిన, రాముడు తార, అంగదుడిని చూడగానే వాళ్ళు ఏడుస్తుంటే 'అయ్యో!' అనుకుంటాడు. చదువుకోవాలి రామాయణం. 'ఎంత కరుణామయుడు' అంటామే, ఎంత కరుణ! రావణుడు చచ్చిపోతే 'అయ్యో!' అనుకుంటాడు మండోదరిని చూసి. చెప్తే వినకపోయే, ఎవరినీ చంపడం ఇష్టం లేదు. కోరి చచ్చిపోతూ ఉంటారు. లక్ష్మణుడికి చెప్తాడు 'ఆయన దగ్గరికి వెళ్లి నేర్చుకో' అని. మామూలుగా ఎవరన్నా మనకి

ద్వేషం ఉన్నవాళ్లు చచ్చిపోతే శవం కూడా చూడడానికి వెళ్లం కదా! అటువంటి వాళ్లకి దగ్గరుండి దహన సంస్కారాలు చేయించాడు రాముడు. వాలికి దహన సంస్కారాలు చాలా ఉత్కృష్టంగా చేయించాడు సుగ్రీవుడి చేత దగ్గరుండి. 'అంగదుడు యువరాజు సుమా !' అని గుర్తొచ్చేటుగా చేశాడు. 'మళ్లీ నీకు పుట్టేవాడు అనుకోబోక, వాడే యువరాజు' అని. అలాగే రావణుడికి విభీషణుడి చేత చేయిస్తాడు. మరి ఎవరున్నారు చేయడానికి. అందరూ పోయారు. అలా వదిలేసి వస్తామా. దిక్కు మొక్కూ లేకుండా వదిలేద్దామా? అతడి మీద ఏమీ కోపం లేదు, అతడి శరీరం మీద అంతకన్నా కోపం లేదు. వాడి స్వభావం అది. మరి అట్లా ఉంటుంది. పగ ఉండదు, ద్వేషం ఉండదు, పట్టుదల ఉండదు. భూతదయ బాగా ఉంటుంది. మన కన్నా తక్కువ వారి యందు వాళ్లు ఎటువంటి వాళ్ళైనా, ఆ దయ ఉండాలి. స్థితిగతులలో, మన కన్నా తక్కువగా ఉండే వాళ్ళు ఎవరన్నా ఉంటే వారి యందు ఆ బుద్ధి ఉండాలి. 'అయ్యో', అన్న భావన కలిగి ఉండాలి, దయ కలిగి ఉండాలి. తక్కువ అంటే, జంతువులు మనకన్నా తక్కువ. క్రిమి కీటకాదులు, జంతువులు, వీటన్నిటి విషయంలో ద్వేషం ఉండకూడదు, పగ ఉండకూడదు. అలాగే మనుషుల విషయంలో కూడా. పగ, ద్వేషం ఉండడానికి వీలు లేదు సత్త్వగుణంలో ఉంటే. ప్రవర్తనలో మృదుత్వము. Soft nature. బండగా ఉండదన్నమాట. Rough and crude అంటాం చూశారా. అలా ఉండదు. ఎంతో మృదువుగా ఉంటుంది స్వభావం. రుచుల యందు రమించు స్వభావము లేకుండుట- అంటే లొట్టలేసుకుంటూ, వాటిని వర్ణించుకుంటూ తింటూ ఉంటారు. రజోగుణమది. తినేముందు లొట్టలు వేయడం, తింటున్నప్పుడు లొట్టలు వేయడం, తిన్న తర్వాత దాని గురించి మాట్లాడుకోవడం, మళ్ళీ ఎప్పుడు చేసుకుంటాం అని. మళ్లీ ఆ రోజే దానికొక schedule వేసుకోవటం. ఇవన్నీ ఉంటాయి కదా. ఉంటాయా ఉండవా? ఇక దానిమీద విపరీతంగా వర్ణనలు చేసుకుంటూ జీవిస్తూ ఉంటారే, వాళ్లు సత్త్వగుణానికి ఒక వెయ్యి మైళ్ళు దూరంలో ఉన్నట్టు లెక్క. నేను చెప్పట్లేదండి, కృష్ణుడు చెప్తున్నాడు. నన్ను కోప్పడి లాభం లేదు మీరు. ఓపిక ఉంటే ఆయనని కోప్పడండి. కూడని పని జరిగినప్పుడు సిగ్గుపడుట- తన నుండి ఏమన్నా ఒక పొరపాటు జరిగితే, చాలా బాధపడతాడు. ఎందుకు నావల్ల ఇలా జరిగింది, ఎందుకు నావల్ల ఇలా జరిగింది, అని, తనని తను చాలా ప్రశ్న వేసుకుని,

నిలదీసి, పశ్చాత్తప్తుడై ఉంటాడు. ఏమి పర్వాలేదు వాడు చేయలేదా, నేనూ చేశాను. అది తత్త్వం కాదు. కేవల కుతూహలమునకై అవశ్యకము లేని పనులు చేయకుండుట- ఎట్లా చేస్తే బాగుంటుందో అని చెప్పి అవసరము లేని పని చేయకూడదు. కోతి వడ్రంగి కథ లాగా అయిపోతుంది. కాని దాంట్లోకి వెళితే, దాని కాలు ఇరుక్కుపోయింది కదా. కాని పనులు చేయరాదు అని నీతి మనకు అప్పుడే చెప్పేశారు. సత్త్వగుణంలో ఉండేవాడు తనది కాని పనికి పోడు. ఆవశ్యకము లేని చోట తగుదునమ్మా అని దూరడు.. అది రజోగుణం. ప్రతిచోట నేనే రక్షించేస్తాను అన్నట్టుగా ప్రతిదాంట్లో ముక్కు పెడితే; poking nose into other's matters. ప్రతి దాంట్లోకి ముక్కుపెట్టాలని చూస్తాడు వాడు. అది కత్తిరించేస్తారు. చురుకుదనము కలిగి ఉండుట. మెరుపల్లె తిరుగుతూ ఉంటారండి. పాపం ఈదురు వస్తే ఈదురో దేవుడా అన్నట్లుగా ఉండకుండా, చాలా చురుకుగా తిరుగుతూ ఉంటారుట, వాళ్ళ చూపులు చురుగ్గా ఉంటాయి, వాళ్ళ నడక చురుకుగా ఉంటుంది, వాళ్ల చేతలు చురుకుగా ఉంటాయి. ఓర్పు. కీడు తలపెట్టకుండుట. తన యందు తనకి తగని అభిమానము లేకుండుట. ఇవి అండి. 27 నక్షత్రాల లాగా 27 గుణాలు ఉన్నాయి. ఒకసారి మంద్రగీత తీసి చూసుకోండి. ఒక్కొక్కటి, ఒక్కొక్కటి సంవత్సరానికి ఒకటి చొప్పున పోనీ నిర్ణయం చేసుకొని మొదలుపెట్టామనుకోండి, అంటే 27 ఏళ్లు పర్వాలేదు, not a long period. మరి సాధన అంటే అదే. మనని మనం మార్చుకోవడమే కదా, ఊళ్లో వాళ్ళని మార్చడం కాదు కదా. ఇందులో మనకి ఏమి లేవు? ఏవీ లేవు సార్, అన్నామనుకోండి. అంటే ఇరవై ఏడూ మొదలు పెట్టుకుంటాం. 27 ఏళ్లలో, ఏమిటక్కడ? 27 జన్మల కన్నా నయమే కదా. నెమ్మదిగా ఒక్కొక్కటి, ఒక్కొక్కటి, ఒక్కొక్కటి. ఇవి ఉంటే, నువ్వు తయారైపోతావు. ఎందుకంటే ఇవన్నీ ఆయనకి ఉన్నాయి. మరి ఆయనతో నువ్వు చేరాలనుకుంటే? అవి ఉండాలి నీకు. ఎవరు ఎవరితో చేరుతారు? ఎవరెవరి యందు ఏవేవి ఉన్నాయో అవి కలవడం చేత కదా, చేరతారు. చీట్ల పేక ఆడేవాడు, చీట్లపేక ఆడే వాడితో కలుస్తాడు. కదా. తాగేవాడు, తాగే వాడితో కలుస్తాడు. ఆటలాడే వాడు, ఆటలాడే వాడితో కలుస్తాడు. ఉపన్యాసాలు చెప్పకునేవాడు ఉపన్యాసాలు వినే వాడితో కలిసి తిరుగుతూ ఉంటాడు. ఇంతే కదా. Tell me who your friends are, I will tell you who you are, అన్నట్టుగా,

మరి ఇక్కడ దేవుడికి ఉండే లక్షణాలు ఈ ఇరవై ఏడూను. మరి వాడికి దగ్గరగా నువ్వు వెళ్దాం అనుకుంటే, నీలో ఇవి కాస్త కూస్తో ఉండాలి ఈ 27లో. ఒక పని చేయండి ముందు. 27 నక్షత్రాలు కదా. మీ నక్షత్రం ఏదో చూసి అది ముందు pick-up చేయండి ఇందులోంచి. అక్కడ నుండి మొదలుపెట్టి మళ్ళీ మన నక్షత్రం వరకు రావచ్చు. ఏదో ఒకటి. పని మొదలు పెడితేనే, సాధన ఉంటేనేనండి, లేకపోతే ఏమీ లేదు. ఉడకాలి. పొయ్యి మీద గిన్నె ఎక్కించాలి, మంట పెట్టాలి, అది మారాలి. లేకపోతే మనం మారం. ఇట్లాగే ఉంటాము, అన్నీ మారాలి అనుకుంటాం. ఏదో ఒక రోజు దేవుడు మనస్సు మార్చుకుని మనకి కనపడడా అన్నట్టుగా ఉంటుంది మన పరిస్థితి. ఆయన మనస్సు మార్చుకుని మనకి కనబడడమే తప్ప, మనము మారదాము అనే ప్రశ్న లేదు కదా. ప్రపంచంలో ప్రతివాడూ ఇట్లా ఉండాలి చుట్టూ, అనుకుంటాడు. తన చుట్టూ ఏమనుకుంటుంది అంటే వీడిట్లా ఉంటే బావుండు కదా అని అనుకుంటుంది. మనం మారితే ఏం మారాల్సిందేమీ లేదు ఈ ప్రపంచంలో. చెప్పా కదా, ఇదే లోకంలో, అన్ని లోకాలూ ఉన్నాయి. ఆనందమయమైన లోకం దగ్గర నుంచి అధ్వాన్నమైన లోకాల వరకు అన్నీ ఉన్నాయి. నీ బట్టి నీ లోకం నీకు ఉంటుంది. కాబట్టి నువ్వు సత్త్వగుణ సంపన్నుడవైతే, ఆయనకి దగ్గరవుతావు. కాబట్టి ఏం చేయాలి? ఇవి జీవితంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నం చేయాలి. ఇవన్నీ, ఎప్పుడన్నా ఒకసారి మళ్ళీ, ఇదొక్కటి పోనీ ఒక list వేసుకుని, ఒకపక్క పెట్టుకుంటే, ఈ ఏడాదికి ఒకటి చేసే ప్రయత్నం లో ఉండాలి. అన్నీ ఒక్కసారి చేద్దామనుకుంటే ఆంధ్రుడు అయిపోతాం. మనకి ఆరంభ శూరత్వం. మొత్తం అన్నీ ఒక్కసారి పిండి కొట్టి లోపల పెట్టుకుని తినేద్దామని చూస్తే, ఏదీ చేయము చివరికి. ఒక్కొక్కటే! అలా చేస్తే నీవు సాత్వికుడవవుతావు. అంటే దైవము నీ యందు ఎక్కువ స్థితి చెందుతాడు. సత్త్వవాన్ సాత్వికః. అప్పుడు సత్యం అంటే ఏమిటో తెలుస్తుంది. అంతవరకు నువ్వు అనుకున్నదే సత్యం నీకు. ప్రతి వాడికి వాడి సత్యం ఒకటి ఉంటుంది. Truth levels! తమోగుణం వాడికి వాడి సత్యం ఒకటి ఉంటుంది. రజోగుణం వాడికి వాడిదైన సత్యం ఒకటి ఉంటుంది. ఎవడికి వాడు సత్యవంతుడనే అనుకుంటూ ఉంటాడు, కానీ వాడి స్థితి బట్టి వాడికది సత్యం. ఈ లోకం ఏముందండీ అంతా లోపభూయిష్టమే కదా, అంటాడు ఒకడు. అలా అంటే వాడు చాలా గొప్పవాడని వాడికి లెక్క. అట్లా

అన్నాడు ఒక ఆయన రామకృష్ణ పరమహంస దగ్గరికి వెళ్లి. 'లోపభూయిష్టమైనది అండి ఈ ప్రపంచం, ఇంతకంటే ఏమున్నది' అన్నాడు తను మహాజ్ఞాని అనుకుని. 'ఆహా', అన్నాడు రామకృష్ణుడు. 'తమరేమనుకుంటున్నారు సార్' అంటే, 'అంతా అమ్మవారి వైభవం! ఎంతో వైభవంగా ఉంది, ఎంతో అందంగా ఉంది, ఎంతో ఆనందంగా ఉంది, నువ్వు చెప్పింది నాకు కనపడడం లేదు' అన్నాడు. అదేమిటంటే, 'అంతేమరి, మనమేదో అదే మనకు కనిపిస్తుందేమో' అన్నాడు. ఆయన భలే వాతలు పెడతాడు, రామకృష్ణుడు. ఆయన నవ్వుతూ వాత పెట్టేస్తాడు. ఇంకొకడు వచ్చాడు. 'ఏముంది సార్ ప్రతివాడికి ధన వాంఛ, స్త్రీ వాంఛే కదా' అన్నాడట. ఇంతే కదా అన్నాడు. 'ఎవరికి? నీకా నాకా? నాకు కాదు నాకు తెలుసు, నీకా?' అన్నాడాయన. వాడికే! ప్రపంచం చూసేవాడి యొక్క చైతన్య స్థితి బట్టి కనిపిస్తుంది. చాలామందికి చాలామందిలో తప్పులు కనిపిస్తూ ఉంటాయి. ఎందుకో తెలుసా? మనలో ఎన్ని తప్పులు ఉంటే, బయట అన్ని తప్పులు కనిపిస్తాయి. అందుకనే ఋషులకు ఏం కనిపిస్తుందో తెలుసా, అందరిలో హంసస్వరూపుడై సోహమనే మంత్రం చేస్తున్న పరమాత్మయే జీవాత్మగా గోచరిస్తూ ఉంటారుట. మనకది మాత్రం గోచరించదు. వాళ్లకి అది సత్యం. మనకు ఇది సత్యం. ఏమిటి మనం గుర్తుపెట్టుకుంటాం మనుషుల గురించి? వాళ్లలో ఉండే సద్గుణాలు గుర్తుపెట్టుకోము కదా. మిగతా గుణాలతో వాళ్ళని గుర్తుపెట్టుకుంటాం. According to what you are, you see this all. అందుకనే శంకరాచార్యుల వారు ఏమన్నారంటే, 'నువ్వు చూసే జగత్తు మిథ్య' అన్నారు తప్ప, 'జగత్తు మిథ్య' అనలేదు. జగత్తు సత్యమే, నువ్వు చూసే పద్ధతి ఉందే; కొంతమందికి పెళ్లంటే భోజనాలే. బాగా భోజనం పెట్టారా లేదా అనే కదా తర్వాత discussion. కొంతమందికి పెళ్లంటే పట్టుచీరలే. మరి కొంతమందికి పెళ్లి అంటే కట్నాలు లాంఛనాలు, ఏమిచ్చారు? ఇంకొంతమందికి inquisitiveness ఎక్కువ. పోట్లాడుకుంటున్నారేమో, ఇవ్వాల్సినదంతా ఇచ్చాడా, పుచ్చుకున్నవాడు వాడు సవ్యంగానే ఉన్నాడా. ఇంకొంతమందికి పెళ్ళికొడుకులో వంకర్లు ఎంచడం, ఇంకొంతమందికి పెళ్లికూతురులో వంకర్లు ఎంచడం. మన దగ్గర ఎన్ని వంకర్లు ఉంటే బయట అన్ని వంకర్లు! 'తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరయా', అని చెప్పేశాడు కదా. అందుకని సత్త్వగుణంలో ఉండే వాడికి ఏం కనిపిస్తుందండి, వాడే

కనిపిస్తాడు అందరిలో. ఇంకేమీ కనిపించదు. ఇట్లా విపరీతంగా వాడు తప్ప ఇంకొకటి కనపడని వాళ్ళే భాగవతోత్తములు. మరీ ఘోరం, మనకు అది అయ్యే పని కాదు. ప్రహ్లాదుడుకి పాములో కూడా అదే కనిపించి, ఏనుగులో అదే కనిపించి, సముద్రంలో పారేస్తే అక్కడ కూడా అదే కనిపించి, విషంలో అదే కనిపించింది. విషంగా చూశాము కాబట్టి మనకి వెంటనే ఎక్కుతుంది. విషమని తెలియకపోతే ఎక్కదు. మనం, కాస్త అక్కడ మెట్ల మీద నుంచి కిందకి దూకాలనుకొండీ, దూకితే విరుగుతుందని మనకి అనిపిస్తుంది కాబట్టి దూకంగానే విరుగుతాయి, ఎముకలు. చిన్నపిల్లలకి విరుగవు తెలుసా. వాళ్లు అటు ఇటు పరిగెడుతూ దిగుతూ ఉంటారు, జారుతూ ఉంటారు, పడిపోతారు. వారిలాగా జారండి! వాడు జారితే, మనకి తగిలి ఎముకలు విరుగుతాయి అనే భావన లేకపోవడం వల్ల విరగదు. మనం పడితే అన్నీ విరిగిపోతాయి. ఎందుకంటే అసలు విరిగిపోతాయి కదా అని రూఢీగా మనకి ఒక జ్ఞానం ఏర్పరచుకున్నాం కాబట్టి విరిగిపోతాయి. ప్రత్యక్షంగా చూశాం, పుట్టపర్తిలో hospital లో మూడు అంతస్తుల పై నుండి పిల్లవాడు కింద పడిపోయాడు. అందరూ లబోదిబో గోల, తల్లిదండ్రులు, పిల్లలందరూను. కిందకి వెళ్తే వాడు మౌనంగా ఉన్నాడు. వాడికి ఏదో అయిపోయిందని వీళ్ళకి నమ్మకం. అందుకని ఏం కాకపోయినా ఏదో అయిపోయిందని చెప్పి అట్లా ఏడ్చుకుంటూ , అరుచుకుంటూ డాక్టర్ దగ్గరికి పరిగెత్తుకొస్తే, డాక్టర్ వాడిని చూసి, వాడికి ఏమీ కాలేదు, మీకే ఏదో అయింది అని చెప్పాడు. మేము అప్పుడు ఆ డాక్టర్ తో మాట్లాడుతున్నాం. మూడంతస్తుల నుంచి పడిపోయాడు. మీరు ఎవరన్నా పడితే కచ్చితంగా ఎముకలు నుగ్గు నుగ్గు అయిపోయేవి. వాడికా concept లేదు అని చెప్పాడు. కుక్క కరుస్తుంది అనే concept మనకి గాని, చిన్నపిల్లవాడికి ఉండదు కాబట్టి కుక్కకి లేదు. చిన్నపిల్లలు ఆడుకుంటారు కుక్కలతో. మనమే నేర్పుతాము 'కరుస్తుంది నాన్నా, వద్దు' అని చెప్పి. ఏం చేయవు. ఎందుకంటే వాటికి కరిచే program అంటూ ఏమీ ఉండదు, మన బట్టి ఉంటుంది. పాముకే కాటు వేసే program లేదండి. దాని జీవితం అది జీవిస్తూ ఉంటుంది. దాని రక్షణ కోసం దానికి అది భగవంతుడు పెట్టి ఉంచాడు. దాన్ని తీరి కూర్చుని చంపేంత వరకు మనకు తోచదు కాబట్టి అది కూడా అదే పని చేస్తుంది మన విషయంలో. మనని బట్టే ఉంటుంది. సత్త్వగుణ సంపన్నుడు ఇట్లా అన్నిటి యందు వాడినే

దర్శనం చేస్తూ ఉంటాడు కాబట్టి అదే ఉంటుంది, ఇంకొకటి ఏమీ ఉండదు. దానికి మృత్యువే లేదు అది శాశ్వతమైనది, అది పరమ ఆనందకరమైనది కాబట్టి వాడికది సత్యం. అది ఈ మూడు నామాలకీ కలిపి. వాడికి సత్యమే, ఉన్నదే సత్యం. ఇక్కడ ఒక సామెత ఉంది మనకి. 'ఉన్నది సత్యం' అని. ఏమిటి ఉన్నది? బత్తాయి పండు 'ఉన్నది'. అంటే ఏమిటి? బత్తాయి పండుగా ఆ తత్త్వం అక్కడ ఉన్నది. Glass ఉన్నది, mike ఉన్నది, కుంకుడుకాయ కొట్టే గుండ్రాయి ఉన్నది, మనిషి ఉన్నాడు, జంతువు ఉన్నది, ఈ 'ఉండడం' అనేది ఉన్నదే, అదే భగవంతుడు! దాన్నే 'సత్యము' అన్నారు. ఉన్నది సత్యం. That which IS is truth. That which is surrounding it, is there, is not there. అది ఉన్నదీ, లేనిదీ కూడా. దాని చుట్టూ ఉండేది, ఉంటూ ఉంటుంది, పోతూ ఉంటుంది. ఉందా? అంటే, లేదేమో అనిపిస్తుంది. లేదా? అంటే, ఉందేమో అనిపిస్తుంది. 'నాసత్యం'. Not untruth గా ఉంటుంది. కానీ, ఉన్నది ఎప్పుడూ ఉంటుంది. ఉన్నది పోదు. ఉన్నది పెరగదు, తరగదు. దాని చుట్టూ ఉండేది పెరిగినట్టు ఉంటుంది, తరిగినట్టు ఉంటుంది. శరీరం పెరిగితే పెరిగినట్టా? అసలువాడు అంతే ఉంటాడు. వాడి శరీరం పెరిగింది. పెరిగింది మళ్ళీ తరుగుతుంది కదా. తరగడమే కాదు కాల్చేస్తారు కూడా. ఏది ఎప్పుడూ ఉంటుందో, అదీ 'ఉన్నది'! అది ఎప్పుడూ ఉంటుంది. అట్లా శాశ్వతముగా తానుండి, తన నుండి ఇవన్నీ ఉద్భవించి, మళ్ళీ అన్నీ తనలోకి వెళ్ళిపోతూ ఉంటాయి. మనలో కూడా అంతే. బోలెడు ఆలోచనలు వచ్చేస్తూ ఉంటాయి, అయినవి ఔతాయి, కానివి కావు, మనం ఉంటాం కదా, మనం ఉండబట్టి కదా ఇవన్నీ వస్తున్నాయి. మనమే లేమనుకొండీ, ఇక గొడవే లేదు. మనం ఉండబట్టి, మనం నిద్ర లేవడం అనేది ఒకటి ఉంది. అంటే తిరిగి రావడం అనేది ఒకటి ఉంది. అంటే చైతన్యవంతులం అవడం అనేది ఒకటి ఉంది. నీవు సత్యవంతుడివి కాబట్టి, నీవు చైతన్యవంతుడివి అవుతూ ఉంటావు. నువ్వు ఉన్నావు కాబట్టి, నీవు చైతన్యవంతుడివి అవడం అనేది తప్పదు. నువ్వు లేకపోతే? చైతన్యవంతుడివి అవుతున్నావు కాబట్టి, ఆలోచనలు వస్తూ ఉంటాయి. ఆలోచనలకు ఒక పరిధి ఉన్నది, ఒక పరిమితి ఉన్నది. నీ చైతన్యానికి ఒక పరిమితి ఉన్నది, ఒక పరిధి ఉన్నది. అక్కడ నుండి కోరికలకు ఒక పరిధి ఉన్నది, పరిమితి ఉన్నది. మాటలకి, చేతలకి, పరిధులు ఉన్నాయి, పరిమితులు ఉన్నాయి. కానీ ఇవన్నీ ధరించిన నీకు, ఏ పరిమితీ లేదు.

ఉందని అనుకుంటే నువ్వు ఏర్పరుచుకున్నావు తప్ప, నిజానికి లేదు. అది సత్యం. శాశ్వతంగా ఉంటుంది. అందుకే 'నువ్వూ శాశ్వతుడవే, నేనూ శాశ్వతుడనే, నేను, నాకు నేనుగా తెలుసు, నీకు నువ్వు నువ్వుగా తెలుసు తప్ప, నేనుగా తెలియదు కదా. అందుకనే అట్లా చచ్చిపోతున్నాను అనుకుంటున్నావు', అంటాడు అర్జునుడితో కృష్ణుడు. కాబట్టి నేనుగా ఉన్నవాడు శాశ్వతుడిగా ఉంటాడు. ఆయన పేరూ నేనే, మన పేరూ నేనే. అదే వచ్చిన problem! మీ పేరేంటి సార్ అంటే నేను అన్నాడు. మరి నా పేరు అంటే, నేనే అన్నాడు. మరి ఏమని పిలుచుకోమంటారు నన్ను, అంటే నేనని పిలుచుకో అంటారు. మరి నేనని పిలుచుకుంటే నేనా, నువ్వా? అంటే నువ్వు ఏమనుకుంటే అది. 'నేను నేనైన నేను' అనుకుంటాడు తెలిసినవాడు. అంటే 'పెద్ద నేను' అయ్యాడన్నమాట. పెద్దనేనే ఉంటుంది అప్పుడు, చిన్న నేను ఉండదు. 'వాడు వేల్పు సోకిన వృత్తి తిరుగుచుండు' అని చెప్తూ ఉంటారు.

## ౨౦౦ సత్యధర్మ పరాయణః

భగవంతుడు రెండిటికే కట్టుబడి ఉంటాడండీ. మిగతావాటికి కాదు. ఇంక వేటితోనూ కట్టేయలేరు. ఒకటి సత్యము, ఒకటి ధర్మము. కొంతసేపు సత్యం చెప్పకొచ్చారు. ఈ లోపు ధర్మం మర్చిపోతామేమో అని, అంతకుముందు మనకి సత్యధర్మ పరాక్రమః అని ఒక నామం వస్తుంది, ఇక్కడ సత్యధర్మ పరాయణః. భక్త పరాయణుడు అంటూ ఉంటాం చూశారా! భక్తులు ఎవరు అంటే సత్యమునందు, ధర్మమునందు ఉండేవారు. సత్యమునందు ఉండడమంటే, సమస్తము వ్యాపించి ఉన్న చైతన్యము, తనయందు తానుగా ఉందని తెలిసి, తాను తో అనుసంధానం చెంది ఉండడం. సత్యమునందు ఉండడం, దాన్నే భక్తి అంటారు. మాటిమాటికీ అనన్య భక్తి, అనన్య భక్తి అని అనలేక, కొంచెం దాన్ని కుదించి భక్తి అన్నారు. భక్తి అంటే ఏమిటి? 'అది తప్ప ఇంకొకటి లేదని తెలిసిన స్థితి'. ఆ భావంతో తను ఎప్పడూ ఉండడం చేత, తను కూడా దానియందే ఉంటాడు. కలిసి ఉంటాడు దానితో. అట్లా ఉన్నవాడు ధర్మాన్ని మాత్రమే నిర్వర్తిస్తాడు, ఇతరములైన విషయములందు ఆసక్తి ఉండదు. ఇట్లా సత్యమునందు, ధర్మమునందు కట్టుబడి ఉన్నవాడిని కాపాడుకోవాల్సిన లక్షణము భగవంతుడిది. ప్రహ్లాదుడు అందుకనే, నిమ్మకు నీరెత్తినట్టు అంటారు చూడండి, అట్లా ఉంటాడు. మరి నువ్వు రక్షిస్తావా అన్నట్టుగా ఉండదు. రక్షించాలి. రక్షిస్తావా ఏమిటి? 'ఎక్కడన్నా పారేసుకోవయ్యా నన్ను, వాడు కదా ఉన్నాడు'. అందుకనే పరాకాష్ఠ. వీళ్ళందరూ అంతే! ఆ భాగవతుల list ఉంది కదా, మాటిమాటికీ చెప్పకుంటూ ఉంటాం, వాడే రక్షించుకోవాలి వాళ్ళని. నిన్ను నువ్వు రక్షించుకునే ప్రయత్నం కూడా లేదక్కడ. ఎందుకని? It is His duty to take care of you because you are in it. 'In It' అంటే, మనకి భక్తరాజ్ మహరాజ్ గారు గుర్తు. భక్తరాజ్ మహరాజ్ గారి దగ్గరకి మాస్టరుగారు వెళ్లినప్పడు అట్లా తేరిపార చూస్తున్నారట మాస్టరుగారు ఆయన్ని. ఎందుకంటే గురువుగారు పొద్దున్నే పది అయింది, ఒక స్నానం లేదు, పానం లేదు, సంధ్య లేదు, ఏమీ లేదు, అట్లా ఉన్నాడు హాయిగా, టిఫిన్ చేసి కూర్చున్నాడు. మాస్టారుగారికి ఎవరో చెప్పారు, ఈయన మహాత్ముడు ఇక్కడ ఒకాయన ఉన్నాడు, నర్మదా నదీ తీరంలో,

చూస్తారా అంటే ఆయనకి భావనలో లోపల నుండి, అంతశ్చేతనలో నుండి చూడాలనిపించింది. అందుకని ప్రత్యేకంగా వెళ్ళారు. వెళ్తే ఆయన హాయిగా అట్లా కూర్చున్నాడు ఓ లుంగీ కట్టుకుని. పదయింది పొద్దున, స్నానం లేదు, గడ్డం గీయలేదు, సంధ్య గింధ్య ఏమీ లేవు. అట్లా ఉన్నాడు. ఈయన ఇలా చూశారట ఆయన్ని. చూస్తే ఆయన నవ్వుతూ అన్నాడట, 'IT is in IT' అన్నారట. ఆయన తమాషాగా మాట్లాడతారు. ఆయన English కూడా అట్లాగే ఉంటుంది. అప్పుడప్పుడు మాట్లాడుతూ ఉంటారు English లో. 'It is in it' అన్నారు. అంతే. అదిరిపోయారు మాస్టరుగారు. ఇది, దాంట్లోనే ఉంది అని చెప్పాడాయన. దేంట్లో? విన్నవాడికి తెలియాలి. మనకైతే, ఏది ఎందులో ఉంది, ఈయన ఏంటి చెప్తున్నాడో తెలియక, గిన్నెలో ఇడ్లీలు ఉన్నాయా, ఇటువంటి ఆలోచనలు వస్తాయి. IT అంటే ఇడ్లీ ను, ఇంకో IT అంటే ఇంకో గిన్నె, ఇడ్లీ గిన్నెలో ఉన్నదేమో వెళ్ళి తినమంటున్నారేమో, IT is in IT అంటే ఆ గదిలో మంచం ఉంది పడుకోమని చెప్తున్నాడేమో ఇట్లా అనుకుంటాం. మనకున్న పరిస్థితిని బట్టి మనకి ఆలోచనలు వస్తాయి కదా! మాస్టారుగారికి ఉన్న పరిస్థితి బట్టి, ఆయన్ని తేరిపార చూడంగానే ఆయనకి తెలిసింది, ఏం చూస్తున్నాడని. వచ్చినవాడు ఏం చూస్తున్నాడో తెలిసి, IT is in IT అన్నాడంతే ఆయన. అని, ఎంత ఆయన చమత్కారి అంటే एक महान आ गया, हम उनको भोजन देना है ( ఏక్ మహాన్ ఆ గయా, హమ్ ఉన్కో భోజన్ దేనా హై ) అని చెప్పి ఒక అరుపు అరిచారు ఆశ్రమంలో. అరిచేసి, ఈయనకి చెప్పారు, 'మీరు నదికెళ్ళి స్నానం చేసి రండి, నేను ఈ లోపల వంట చేస్తాను మీకు' అన్నాడు. మాస్టారుగారు చాలా ఆశ్చర్యపోయారు. 'అలాగే చేసొస్తాను' అని వెళ్తుంటే, మళ్ళీ పిలిచి, 'స్నానం చేసే వండిపెడతాను' అని చెప్పారు. అంటే ఏమిటి? వచ్చినవాడిని అలా పట్టేస్తారనమాట. స్నానం చేసే వండిపెడతాను, హాయిగా స్నానం చేసి రండి అని చెప్పారు. ఎలా ఉంది? IT is in IT అంటే అట్లా ఉంటుంది. हम इसमें हैं ( హమ్ ఇస్మే హై) అంటూ ఉండేవారు ఆయన. किसमें हैं ( కిస్మే హై ) అంటే, हरि ओम तत् सत् में।ये चलता है कुमार। (హరి ఓం తత్సత్ మే యే చల్తా హై కుమార్) 'అది లోపల జరుగుతూనే ఉంటుంది కదా, మనకేంటి భయం' అనేవారు. ఆయన దగ్గరకి డాక్టర్ వస్తూ ఉండేవాడు, ఎప్పుడూ గుండె , ఈయన గుండెకాయ ఎప్పుడూ ఆగిపోతుందో అని అందరికీ భయం. ఆయన heart case ఆయనది. వాడు

రాంగానే ఈయన అంటారు, 'వీడు నేను బతికున్నంత కాలం చచ్చిపోతానేమో అని వస్తూ ఉంటాడు. చచ్చిపోయే రోజు మాత్రం వీడికి తెలియదు' అని చెప్పారు. 'ఏమంటున్నాడాయన' అంటే 'ఏదో అంటున్నాడులే' అంటాడు, చెప్పడు మళ్ళీ. 'నీ పని నువ్వు చెయ్యి' అంటాడు. వారానికి ఒకసారి వస్తాడు, ఈయన గుండెకాయ అంతా check చేస్తాడు, వెళ్ళిపోతూ ఉంటాడు. ఒకరోజు నేను ఉన్నప్పుడు వచ్చాడు ఆయన. వస్తే, వాడు, 'నేను బతికున్నంతకాలం, నా గుండె ఆగిపోయి చచ్చిపోతానేమో అని వస్తాడు, కానీ నిజంగా వెళ్ళిపోయే రోజు మాత్రం వీడు రాడు, వీడికి తెలియదు ఆ రోజు. అది నడుస్తుంది కదా, అది నడుస్తుంటే ఏం ఆగుతుంది, ఏదీ ఆగదు కదా' అన్నాడు ఆయన. ये चलता है ना। ( యే చల్తా హై నా) ఏదీ ? స్పందనాత్మక చైతన్యం లోపల, హరి ఓం తత్సత్, హరి ఓం తత్సత్, హరి ఓం తత్సత్, అంటూనే ఉంటుంది, అది వింటూనే ఉంటాడాయన, అందులోనే ఉంటాడు, అందరిలోనూ అదే చూస్తూ ఉంటాడు. శిష్యులందర్నీ డొక్క చీరేస్తాడు అది వాళ్ళ లోపల చేసుకోకపోతే బయటికి తెలియకపోయినా. చచ్చేట్టు తిడుతూ ఉంటాడు, కొడుతూ ఉంటాడు, ఎందుకు కొడతాడో, ఎందుకు తిడతాడో తెలియదు. మళ్ళీ అది వాళ్ళు మొదలు పెట్టగానే వాడిని వదిలేస్తాడు. ఎవరన్నా వచ్చి 'నాకిది నడవట్లేదు లోపల' అంటే, 'ఇప్పటి నుండి నడుస్తుందిలే పో' అంటే వాడికి అప్పటి నుండి నడిచేది. चालू होगा ( చాలూ హోగా) అనేవాడాయన టక్కున. మరి ఈయన चालू होगा అనంగానే అక్కడ ఆయనకి మొదలైపోయేది. ఎప్పుడూ అందులోనే ఉన్నాడాయన. అటువంటి వారిని రక్షించుకోవాలి. మనకి మామూలుగా ఏమిటంటే ప్రహ్లాదుడు, శుకుడు, అంబరీషుడు, ఇవన్నీ చెప్పుకుంటే ఎప్పుడో, 'ట' అన్నట్టుగా ఉంటాయి కదా. అందుకని concurrent కూడా చెప్పుకోవాలి. ఇప్పుడున్నవి చెప్పుకుంటే 'ఆహా, ఇప్పుడు కూడా జరుగుతున్నాయి' అని తెలుస్తాయి. అట్లాగే ఆయన దగ్గరకి, రోజూ దేవుడికి, అభిషేకం చేసి, బొట్లు పెట్టి పూజ చేసేవాడు వస్తే, ये भगवान को धोता है। (యే భగవాన్ కో ధోతా హై ) అనేవారు. 'వీడొచ్చి రోజూ దేవుడిని రుద్దుతాడు, कुछ नहीं मिलेगा इनको। (కుచ్ నహీ మిలేగా ఇన్ కో) ఊరికే తోమడం తెలుసు వాడికి తప్ప, దేవుడు తెలియదు వాడికి, అంతే! ఇలా వెళ్ళిపోవాల్సిందే ఈ జన్మకి, ఏం చేయలేం' ఇట్లా చెప్పేవాళ్ళు తమాషాకి. పులిలా జీవించారు. ఆయన వరండాలో

కూర్చుంటే వంటింటిలో ఏ డబ్బాలో ఏ సామాను ఎంత ఉందో కూడా ఆయనకు తెలుస్తుండేది. అద్భుతమైన విషయాలు కాదు? ఫలానాది చేయమనేవారు వంట, ఎవరైనా వస్తే. మరి అది లేదు కదా అంటే ఉంది కదా అనే వారు ఈయన! ఎక్కడ ఉంది? అంటే 'ఆ అరలో, ఆ డబ్బాలో తీస్తే ఉంటుంది, ఇంతమందికి వస్తుంది, వండేసేయ్' అనేవారు. ఇంటావిడకే తెలియదు వంటింట్లో ఏముందో కదా, ఈయనకేమిటండీ? మరి ఎంత నివురు కప్పిన నిప్పు? బయటికి ఏమీ తెలియదు. ఊరికే బజారున పెట్టుకోరు ఎవరూ. అంతా లోపల ఉంటుంది. సత్యధర్మ పరాయణులు. అటువంటి వాళ్ళని కాపాడుకోవాల్సింది భగవంతుడే! చచ్చిపోతారని జ్యోతిష్కులు చెప్తే, చచ్చిపోవని చెప్పేవాడంతే. ఏంటంటే వాడు చూసుకుంటాడట! 'మనం ఏమన్నా అంటే వాడు చూసుకోవాలి' అనేవాడాయన. हम भक्त है ना। 'నేను భక్తుడిని కదా, నేనేమన్నా అంటే వాడు చూసుకోవాలి'. మా తమ్ముడు ఒకడు, first cousin అంటాం చూశారా, English లో, వాడికి చెప్పారు, 'నువ్వు ఏం చేసినా చావవు' అని చెప్పారు, చచ్చిపోతావని అందరూ చెప్తే! వాడు ఉన్నాడు. ఇట్లా చెప్పగలరు, ఎందుకంటే, తను సత్యమునకు, తను ధర్మమునకు కట్టుబడి ఉన్నాడు కాబట్టి, ఆయన నోట్లో నుండి వచ్చిందల్లా ఆయన పైవాడు చూసుకోవాలి. అట్లా తనకి తను చేతి కర్రగా ఉంటాడట భగవంతుడు భక్తుడికి. కట్టుబడి ఉంటాడట. ధర్మరాజుకి అట్లా కట్టుబడి ఉన్నాడు కాబట్టి ఆ యుద్ధంలో పాల్గొన్నాడు, లేకపోతే, ఉండక్కర్లేదు. ఇంక మిగతా వాళ్లెవరినీ చూస్తే ఆయన అక్కడ ఉండక్కర్లేదు. కూర్చోవడం అర్జునుడి రథంలో కూర్చున్నా, కాపు అంతా ధర్మరాజుకే! ఇంతటి ధర్మరాజుని పోనీ ఒక అబద్ధం చెప్పవయ్యా, అంటే 'నేను చెప్పను, నువ్వు చూసుకో' అని చెప్పాడాయన. నేను ధర్మాన్ని నమ్ముకున్నాను, ధర్మాన్ని నమ్ముకునే వాడికి నువ్వు కూలిపని చేయాలి. నేను ధర్మం తప్పితే నువ్వు తప్పిపోతావేమో నాకు తెలియదు. అందుకని అశ్వత్థామ హతః అని నేను అనను, అశ్వత్థామ హతః కుంజరః అంటాను కావాలంటే. ఏనుగైన అశ్వత్థామ చచ్చింది అంటాను తప్ప, అశ్వత్థామ చచ్చింది అంటే ఏనుగు చచ్చినట్టే కదయ్యా, అన్నాడు ఈయన. మనిషి పేరు అప్పారావే, ఒక కుక్క పేరూ అప్పారావే పెట్టుకున్నారండీ, అప్పారావు చచ్చాడు, అంటే? మనిషి చచ్చాడు అనుకుంటామా, కుక్క చచ్చింది అనుకుంటామా? నువ్వు కుక్క నుద్దేశించే

చెప్పావ్, చచ్చింది మనిషేలే, లేకపోతే నువ్వు మనిషిని ఉద్దేశించి చెప్పావ్, చచ్చింది కుక్కేలే, ఇట్లా సర్దుకుందాం, ఇవన్నీ కుదరవయ్యా నా దగ్గర, 'Stay put', నేను ధర్మంలో ఉంటా. It's up to you. అక్కడ తెలుస్తుంది ధర్మరాజు ధర్మం ఏమిటో. తిప్పలు పడాలి, ధర్మంలో ఉండేవాడి కోసం, వాడు నశిస్తే కథే లేదు. ఎన్ని తిప్పలు పడతాడూ? అట్లాగే ధర్మరాజు దుర్యోధనుడితో 'మా ఐదుగురిలో ఎవరితో అయినా సరే, నీకు నచ్చిన ఆయుధంతో యుద్ధం చేయమన్నాడు'. కృష్ణుడికి గుభేలుమంది గుండె! మళ్ళీ పెట్టాడు నాకు అని! ఎందుకంటే గద పుచ్చుకుని నీతో పోట్లాడతానని ధర్మరాజు దగ్గరకి వస్తే? మొత్తేస్తాడు. గద పుచ్చుకుని భీముడితో తప్ప ఇంకెవరితో యుద్ధం చేసినా, లాభంలేదు మిగతావాళ్ళు. భీముడే అంతంత మాత్రం. భీముడికి బండబలం తప్ప, ప్రావీణ్యం తక్కువ. దుర్యోధనుడు skillful. పైగా, he is in daily practice. వాడికి రోజూ net practice! వీడేమో పాపం అడవుల్లో పడి, తిరిగినవాడు, పదమూడేళ్ళపాటు! Practice ఒకటి లేదు. అప్పటికప్పుడు pads కట్టుకుని దిగమన్నారు. అయినప్పటికీ, వాడినే కోరుకునేట్టుగా సంకల్పించే స్థితి కలగకపోతే అక్కడ కృష్ణుడు, ఏ విధంగా కాపాడేవాడో మనకి తెలియదు. ఎన్నో రకాలుగా అట్లా కాపాడాడు తనని నమ్ముకున్న వాళ్ళని. అందుకని నిజంగా సత్యమునందు, ధర్మమునందు, మనకి విశ్వాసముంటే, దైవమునందు ఉండనక్కరలేదు. వాళ్ళూ మగాళ్ళు! వాళ్ళు దైవాన్ని వాళ్ళ చుట్టూ తిప్పుకుంటూ ఉంటారు, మనం దైవం చుట్టూ తిరుగుతూ ఉంటాం. అది తేడా. మనం దేవుడి చుట్టూ తిరుగుతూ ఉంటే దేవుడు భక్తుల చుట్టూ తిరుగుతూ ఉంటాడటండీ. అదేమిటి సార్ అక్కడ లేరు మీరు అంటే, లేనురా వాడిదగ్గర ఉన్నాను అంటాడు. అందుకనే భగవంతుడిని పొందాలంటే సులభమైన మార్గం, భక్తుని పంచన చేరడం ఏదో అతడి ఆశ్రమంలో మనం కూడా చేరిపోతే, అతడు మూడు పూటలా ఇంత పడేస్తాడు. ఊరికే పడేయడు, ఏదో ఒకటి చెప్తాడు. చెప్పింది చేయాలి. అట్లా చేస్తూ ఉంటే, వాడి దగ్గర వీడు ఉన్నాడు కాబట్టి వీడికి కూడా వాడు అందుతాడు. అదీ భగవంతుని యొక్క సత్యధర్మ పరాయణత్వం. ఎన్నో కథలు చెప్పకోవచ్చు. ఎంత కాపు కాస్తాడో! మనం ఊహించలేనంత కాపు కాస్తాడు. మనని రక్షించుకుంటాడు, మనకి అవమానం కలగకుండా చూస్తాడు. అవసరానికి చేరినా చేస్తాడండీ. వీడు వెధవ అవసరానికి

వచ్చాడు, తరువాత పారిపోతాడు, అని అనుకోడట. పోన్లే ఈ విధంగా అన్నా వచ్చాడు కదా అనుకుంటాడట.

★★★★★★

# విష్ణు సహస్త్రనామ పారాయణ ప్రాశస్త్యము

మానవుడు తన్ను తాను పవిత్రీకరించుకుని భగవత్ అనుభూతిని పొందుటకు 'భగవంతుని యొక్క నామములను సర్వదా కొనియాడుచుండుట' అను ఒక సులభమైన మార్గమును, మనకి భగవంతుడైన శ్రీకృష్ణుడు భీష్ముని ద్వారా ఇచ్చుట జరిగినది. కలియుగములో అతి సులభమైన పద్ధతిలో భగవంతుని అనుభూతి పొందుటకు అవకాశము ఎక్కువగా వున్నదని తెలియుచున్నది. ధ్యానములు, యోగములు, తంత్రములు, మంత్రములు - ఇవన్నీ చేయగలిగిన శక్తి సామర్థ్యములు కలియుగములో మానవునికి ఉండకపోవడమే కాక, కొంత అలసత్వం, కొంత మంద బుద్ధి దానికి తోడవుట వలన, స్తోత్రాదుల తో భగవంతుని యొక్క నామములను ఎక్కువగా స్మరణము చేసుకొనుట ద్వారా, సులభముగా తన్ను తాను పవిత్రీకరించుకుని, భగవంతుని యందు నిలబడుటకు అవకాశము ఏర్పడగలదని శ్రీకృష్ణుడు ఉద్ధవునకు చెప్పుట జరిగినది.

ఆ మార్గములోనే మనకి వేదవ్యాస మహర్షి, శంకరాచార్యులవారు, ఇతర ఋషులు, రకరకములైన స్తోత్రములు యిచ్చి వున్నారు. అవి ఎంత చేసుకుంటూ ఉంటే, అంత మనయందు, మన పరిసరముల యందు వాతావరణము పరిశుద్ధి చెందుట జరుగుతుంది. ఎంత ఎక్కువగా వీలుంటే అంత ఎక్కువగా, సామూహికముగా భగవంతుని నామ పారాయణము చేసుకొనుట ఆయన మనకి ఇచ్చిన అతి ముఖ్యమైన సందేశములలో ఒకటి. దాన్ని అనుసరించి విష్ణు సహస్రనామములను కొనియాడుతూ, అవగాహన చేసుకొనుచూ, ఆ మార్గాన భగవంతుని యందు జీవించుటకు భక్తి శ్రద్ధలతో ప్రయత్నము చేయవలెను. భగవంతుని ఈ మార్గములో అనుభూతి చెందుటకు శ్రద్ధ, ఓర్పు బాగా అవసరము. ఓర్పు కలిగినకొద్దీ శ్రద్ధ పెరుగుతూ ఉండుట జరుగును. శ్రద్ధ పెరిగినకొద్ది ఓర్పు పెరుగుతూ వుండును. ఒకదానిని ఒకటి ఇలా పెంచుకొనుచూ మనము మనని పవిత్రీకరించుకొనుచూ, కాలము యొక్క ఇబ్బందులకు గురి కాకుండా భగవంతుని యొక్క రక్షణలో జీవించుటకు అవకాశము కల్పించుకోవడము అవసరము.

-కంభంపాటి పార్వతీ కుమార్